ఆధ్యాత్మిక గ్రంథ నిలయం

మోహన్ పబ్లికేషన్స్

కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,

రాజమహేంద్రవరం - 533101.



వావిళ్ళ వారి శ్రీమదాంధ్ర భాగవతం

శ్రీరస్తు.

శ్రీమదాంధ్రభాగవతము

సప్తమస్కంధము

టీకాతాత్పర్యసహితము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులుఅండ్‌సన్స్ వారిచేఁ

ప్రకటితము.

1921.

శ్రీరామాయనమః.

సప్తమస్కంధము

టీకాతాత్పర్యసహితము.

శ్రీమత్కీర్తిలతా
[illegible]
[illegible]
[illegible] రామచంద్రనృపాలా. 1

టీ. శ్రీమ...రాళ — [illegible] కీర్తి [illegible] బడిన భూమ్యాకాశముల సందులు గలవాఁడా, ఘనశ్యా...మల = అందమైన పెద్ద మబ్బులతోఁ బోల్పఁబడిన దేహమందలి నల్లని కాంతులు గల, రామచంద్రనృపాలా = శ్రీరామచంద్ర మహారాజా.

తా. కీర్తిపూగములచే దిక్కులను నింపినవాఁడా, మబ్బును బోలిన నల్లని మేనిరంగు గలవాఁడా, ఓ శ్రీరామచంద్ర మహారాజా.

చ. మహనీయగుణగరిష్ఠు లగునమ్మునిశ్రేష్ఠులను నిఖిలపురాణ
వ్యాఖ్యానవైఖరీసమేతుం డయినసూతుం డిట్లనియె నట్లు
ప్రాయోపవిష్టుం డయిన పరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రు
నవలోకించి. 2

టీ. మహా...ష్ఠులు=గొప్ప గుణములచే మిన్నలైనవారు, నిఖిల... తుండు=ఎల్లపురాణములను వివరించు ధోరణిగలవాఁడు, ప్రాయోపవిష్టుఁడు=ప్రాయోపవేశము చేసినవాఁడు, (అన్నపానములు విడిచి మరణమున కెదురు చూచుచుండుట ప్రాయోపవేశము.)

తా. ఉత్తమగుణములు గల యా శౌనకుఁడు మొన్నగు మునులకు ఎల్ల పురాణములను జక్కఁగా వివరింపనేర్చిన సూతుఁ డిట్లు చెప్పెను. అట్లు ప్రాయోపవేశము నొందిన పరీక్షిత్తు శుకమహర్షి నిట్లు జూచి. (పైపద్యములో నన్వయము.)

సీ. సర్వభూతములకు సముఁడు నెచ్చెలి ప్రియుం
డైనవైకుంఠుఁ డనంతుఁ డాద్యుఁ
డింద్రునికొఱకు దైత్యేంద్రుల నేటికి
విషమచిత్తుండై పగ వెదకి చంపె
సురలఁ జంపంగ నసురలచేఁ దన
కెయ్యదిలాభ మెంతైనఁ గలదె
నిర్వాణనాథుండు నిర్గుణుం డగుట న
కసురులవలనిభయంబుఁ బగయుఁ
ఆ. గలుగనేర దట్టిఘనుఁడు దైత్యులఁ జంపి
సురలఁ గాచు చునికి చోద్య మనుచు
సంశయంబు నాకు జనియించె మునినాథ
ప్రజ్ఞ మెఱసి తెలియఁ బలుకవయ్య. 3

టీ. నెచ్చెలి=ముఖ్యస్నేహితుఁడు, వైకుంఠుఁడు=విష్ణువు, అనంతుఁడు=తుదలేనివాఁడు, దైత్యేంద్రులు=రక్కసుల దొరలు, విషముఁడు=కుత్సితుఁడు, అసురులు=రాక్షసులు, అసురులు=దేవతలు, నిర్వాణనాథుండు=మోక్షమునకుఁ బ్రభువు, చోద్యము=అచ్చెరువు, మునినాథ=మునులకుఁ బెద్దయైనవాఁడా.

తా. మునీశ్వరా! అన్నిజంతువులకు సమానుఁడు, నెయ్యుఁడు, బంధువు నైన విష్ణు విం ద్రునికొఱకై రాక్షసుల నెల్లరను, మోసకాని విధమున నేల చంపెను? రాక్షసులను జంప దేవతలను గాపాడినఁ దనకేమి లాభము? ఎల్ల జీవులను ముక్తినిచ్చు విష్ణువునకు రాక్షసుల వలన భయము, విరోధము కలుగునా లేదే. అట్టివాఁడయ్యును ముసకారము గలవానివలె రాక్షసులఁ జంపుట దేవతల ననుప్రటయుఁ జూడఁ జిత్రముగా నున్నది. దీనివలన నాకు సందియము గలుగుచున్నది. నీయెఱిఁగినంతెనట్లు నా సంశయమును దీర్చి విష్ణుకథలఁ జెప్పుము.

వ. అనిన శుకుం డిట్లనియె. 4

శా. నీసంప్రశ్నము వర్ణనీయము గదా నిక్కంబు రాజేంద్ర ల
క్ష్మీసంభావ్యునిసచ్చరిత్రము మహాచిత్రంబు చింతింపఁ ద
ద్దాసాఖ్యానములొప్పు విష్ణుచరణధ్యానప్రధానంబులై
శ్రీసంధానములై మునీశ్వరవచోజేగీయమానంబులై. 5

టీ. సంప్రశ్నము = అడుగుట, వర్ణనీయము = మెచ్చఁదగినది. నిక్కంబు = నిజము, లక్ష్మీ...త్రము = లక్ష్మీ [illegible] మంచి కథ, తద్దాసాఖ్యానము = ఆవిష్ణునిదాసుల కథలు, విష్ణు...బులై = విష్ణువు పాదముల చింతనమే ముఖ్యధర్మముగాఁ గలవి, శ్రీసంధానములు = శుభప్రదములు, మునీశ్వర...నంబులు = మునుల వాక్యములచే పొగడఁబడునవి

తా. పరీక్షిన్మహారాజా! చాల మంచిప్రశ్న నడిగితివి. నీ వనినది నిజమే. విష్ణునికథలు ఆశ్చర్యములైనవి. విచారింపఁగా విష్ణుభక్తుల కథ లను అట్టివే వానికి విష్ణుని పాదసేవనమే ముఖ్యము. అవి వినువారికి సకల సంపదలను ఇచ్చును. మునులు ఎల్లపుడు వానినిఁ బొగడుచుందురు.

క. చిత్రంబులు త్రైలోక్యప
విత్రంబులు భవలతాలవిత్రంబులు స

సన్మిత్రంబులు మునిజనవన
చైత్రంబులు విష్ణుదేవుచారిత్రంబుల్. 6

టీ. విష్ణు..త్రంబుల్=శ్రీహరికథలు, త్రైలోక్య పవిత్రంబులు=ముల్లోకములలో పావనములైనవి, భవ...బులు = సంసారపుఁ దీఁగెలకు కొడవండ్లవంటివి, సన్మిత్రంబులు=మంచివారలఁ బ్రేమించునవి, ముని... బులు=మును లనునడవులకు చైత్రమాసములు (చైత్రము అడవిని వికసింపఁ జేసినట్లు ఇవి మునిమానసముల నలరించును.)

వ. నరేంద్రా! కృష్ణద్వైపాయనునకు నమస్కరించి హరికథనం బులు చెప్పెద వినుము. వ్యక్తుండు గాక గుణంబులు లేక ప్రకృతిం జెందక భవంబుల నొందక పరమేశ్వరుండు దనమాయవలన నయినగుణంబుల నావేశించి బాధ్యబాధకత్వంబుల నొందు నతండు గుణరహితుండు సత్త్వరజస్తమంబులు ప్రకృతిగుణంబు లాగుణంబులకు నొక్కొక్క కాలంబున హాని వృద్ధులు గల వాయీశ్వరుండు సత్త్వంబున దేవఋషులను రజోగుణంబున నసురులను దమోగుణంబున యక్షరక్షోగణంబులను విభజించె. సూర్యుండు పెక్కెండ్లం గానంబడియు నొక్కరుం డయిన తెఱంగున దగ్ధభుండును సర్వగతుం డయ్యును భిన్నుండు గాఁడు. తత్త్వవిదు లయినపెద్దలు దమలోనం బరమాత్మస్వరూపంబున నున్న యీశ్వరు నివ్విధంబున నెఱుంగుదురు. జీవాత్మకుఁ బరుం డైనసర్వమయుండు తనమాయచేత విశ్వంబు సృజియింపం గోరి రజంబును క్రీడింపం గోరి సత్త్వంబును నిద్రింపం గోరి తమంబును నుత్పాదించి చరమైనకాలంబును సృజియించు నాకాలంబున సర్వదర్శనుం డయినయీశ్వరుండును గాలాహ్వయుండును

నై హరి సత్త్వగుణం బయినదేవానీకంబునకు వృద్ధియు రజ
స్తమోగుణు లయినరాక్షసులకు హానియుం జేయు చుండు. 7

టీ. కృష్ణద్వైపాయనునకున్=వేదవ్యాసునకు, హరికథనంబులు=విష్ణునికథలు, వ్యక్తుండు, కనఁబడువాఁడు, ప్రకృతి=మాయ, భవంబులు=పుట్టువులు, ఆవేశించి=చొచ్చి, బాధ్యబాధకత్వంబులన్=బాధింపఁదగినది బాధించువాఁడు అను భావములను, గుణరహితుఁడు=గుణములు లేనివాఁడు, ప్రకృతి గుణంబులు=మాయాగుణములు, దేవ ఋషులను=దేవు అను ఋషులను, 'అసురులను=రాక్షసులను, యక్ష రక్షోగణంబులను=యక్షులయు రాక్షసులయు గుంపులను, విభజించెన్=వేఱుచేసెను. పెక్కెడలన్=పలుతావుల, ఒక్కరుండు=ఒకఁడు, సర్వగతుండు=అన్నిటియందు నున్నవాఁడు, భిన్నుండు=వేఱైనవాఁడు, తత్త్వవిదులు=నిజమెఱిఁగినవారు, సర్వదర్శనుండు=అన్నిటిఁ గాంచువాఁడు, కాలాహ్వయుండును=కాలుఁడను పేరుగలవాఁడు, దేవానీకంబునకున్=దేవతలమూఁకకు, వృద్ధి=పెంపు, హాని=నాశము.

క. జననాయక యీయర్థము
ఘనయశుఁ డగుధర్మజునకుఁ గ్రతుకాలమునన్
మును నారదుండు చెప్పెను
వినిపించెద వినుము చెవులు విమలత నొందన్. 8

టీ. జననాయక=రాజా, ఈయర్థము=ఈసంగతి, ఘనయశుఁడు=దట్టమైనకీర్తిగలవాఁడు, క్రతుకాలమునన్=యజ్ఞముసేయువేళయందు, మును=పూర్వము, విమలత=పావనత్వము.

తా. పరీక్షిన్మహారాజా! ఇప్పుడు నీ వడిగినసంగతినే ధర్మరాజు యజ్ఞము చేయునప్పుడు నారదుఁ డాయన కుపదేశించెను. దానినే నీకుఁ జెప్పెద వినుము. విని చెవులపండువు చేసికొనుము.

వ. మున్ను ధర్మరాజు చేయురాజసూయయాగంబున బాలుం డైనశిశుపాలుండు హరిని నిందించి నిశితనిర్వక్రచక్రధారా దళితమస్తకుం డయి తేజోరూపంబున వచ్చి హరిదేహంబు సొచ్చినం జూచి వెఱఁగుపడి ధర్మజుండు సభలో నున్న నారదునిం జూచి యిట్లనియె. 9

టీ. హరిని = విష్ణువును, నిశిత...కుండు = వాఁడియగు గుండ్రని చక్రముయొక్క అంచులచేఁ బ్రద్దలు చేయఁబడిన తల గలవాఁడు, వెఱఁగు పడి=ఆశ్చర్యమునంది.

ఆ. ఎట్టివారి కైన నేకాంతులకు నైన
వచ్చి చొరఁగ రానివాసుదేవు
తత్త్వమందుఁ జేదిధరణీశుఁ డహితుఁ డై
యెట్లు సొచ్చె మునివరేణ్య నేఁడు. 10

టీ. ఏకాంతులకున్=అంతరంగ భృత్యులకును, చొరఁగన్=ప్రవేశించుటకు, రాని...మందు=అలవికాని విష్ణుతత్త్వమందు, చేదిధరణీశుఁడు= చేదిదేశపురాజగు శిశుపాలుఁడు, అహితుఁడు=పగవాఁడు, మునివరేణ్య = మునులలో మిన్నయగువాఁడా.

తా. నారదా! ఏలాటివారికైనను, ఎంత యంతరంగభక్తులకును, సులభముగా ప్రవేశించుటకు వీలుగాని విష్ణుతత్త్వమునందు పగవాఁడైన ఈ శిశుపాలుఁడు ఐక్య మొందినాఁడే. ఇది యెట్లు? తెలవిండు.

ఉ. వేనుఁడు మాధవుం దెగడి విప్రులు దిట్టిన భగ్నుఁడై తమో
లీనుఁడుగాఁడె తొల్లిమదలిప్తుఁడు చైద్యుఁడు పిన్ననాఁటనుం
డేనిని మాధవుఁ౯ విన సహింపఁడు భక్తి వహింపఁ డట్టివాఁ
డేనిబిడప్రభావమున నీపరమేశ్వరునందుఁ జొచ్చెనో. 11

టీ. తొల్లి=మునుపు, వేనుఁడు = ఒకరాజు, మాధవున్ = విష్ణుని, తెగడి = దూషించి, విప్రులు = బ్రాహ్మణులు, తిట్టినన్ = శపింపఁగా, భగ్నుఁడై = కూలినవాఁడై, తమోలీనుఁడు కాఁడే = నరకమునఁబడఁడా, మదలిప్తుఁడు = పొగరుగొని యున్నవాఁడు, చైద్యుఁడు = శిశుపాలుఁడు, పిన్నవాఁటనుండేనినిన్ = చిన్నతనమునుండియు, సహింపఁడు, ఓరువఁడు, ఏనిబిడప్రభావమునన్ = ఏపూర్ణమైన మహిమవలన, చొచ్చెనో = ప్రవేశించెనో.

తా. మునీంద్రా! మును వేనుఁడనురాజు శ్రీవిష్ణు దూషణము చేసి, బ్రాహ్మణులు శపింపఁగా చచ్చి నరకమునఁ బడలేదా, ఈపొగరుబోతుమాత్రము అంతకంటెతక్కువవాఁడా, వీఁడు పుట్టినదిమొదలు విష్ణువునందు భక్తి సేయుఁడు సరిగదా పేరుకూడ విననొల్లఁడే. ఇట్టి దురాత్ముఁడు ఏమహిమచే కృష్ణునిలో నైక్యమొందెను ?

మ. హరిసాధింతు హరిన్ గ్రసింతు హరిఁ బ్రాణాంతంబు నొందింతు
దా, హరికిన్ వైరి నటంచు వీఁడు పటురోషాయత్తుఁడై యెప్పుడుం
దిరుగుం బ్రువ్వదు నోరు వ్రీలిపడ దా దేహంబు దాహంబుతో
నరకప్రాప్తి గనొందఁ డేక్రియ జగన్నాథుం బ్రవేశించెనో.

టీ. సాధింతున్ = ఓడింతును, గ్రసింతున్ = మ్రింగుదును, ప్రాణాంతంబున్ = ప్రాణనాశమును, వైరిన్ = శత్రువును, పటు...త్తుఁడై = స్ఫుటమైన రోషముగలవాఁడై, ప్రువ్వదు = ప్రుచ్చిపోవదు, వ్రీలిపడదు = విఱిగి కూలదు, దాహంబుతోన్ = యాతనతో, నరకప్రాప్తియున్ = నరకమునొందుటను, ఏక్రియన్ = ఏలాగున, జగన్నాథున్ = జగదీశ్వరుఁడగు విష్ణువును.

తా. అయ్యా! వీఁడు విష్ణువు నోడింతును. కృష్ణునిఁ బట్టుకొందును. వానిఁ జంపెదను. విష్ణువు నాకు పరమశత్రువు అనుచు చలముబూని తిరుగుచుండునే వీనినోరు పుచ్చలేదే. వీని దేహము తునకలు కాలేదే. వీఁడు మహాబాధలో పాపమునఁ బడిపోవక కృష్ణునిలో చేరినాఁడే దీని కేమి హేతువు ?

వ. అదియునుం గాక దంతవక్త్రుండును వీఁడును నిరంతరంబు గోవిందు నింద సేయుదురు నిఖిలజనులు సందర్శింప నేఁడు వీనికి విష్ణుసాయుజ్యంబు కలుగుట కేమి హేతువు వినిపింపుము. పవనచలితదీపశిఖయునుంబోలె నాహృదయంబు సంచలించుచున్న దనిన ధర్మనందనునకు నారదుం డిట్లనియె. దూషణభూషణతిరస్కారంబులు శరీరంబునకుం గాని పరమాత్మకు లేవు శరీరాభిమానంబునం జేసి దండవాక్పారుష్యంబులు హింస యై తోఁచు తెఱంగున నేను నాయది యనియెడు వైషమ్యంబును భూతంబులకు శరీరంబునంద సంభవించు నభిమానంబు బంధంబు నిరభిమానుం డై వధించినను వధంబు గాదు కర్తృత్వ మొల్లనివానికి హింసయు సిద్ధింపదు సర్వభూతాత్మకుం డైన యీశ్వరునికి వైషమ్యంబు లేదు గావున. 13

టీ. దంతవక్త్రుఁడును = శిశుపాలునితమ్ముఁడును, వీఁడును, నిరంతరంబు = ఎల్లప్పుడు, గోవిందుని = కృష్ణుని, సందర్శింపఁగ = చూచుచుండఁగా, విష్ణుసాయుజ్యంబు = విష్ణువునం దైక్యమగుట, పవనచలిత దీపశిఖయునుంబోలె = గాలికి కొట్టుకొను దీపపుకొనవలె, హృదయంబు = మనస్సు, సంచలించుచున్నది = కలఁతనొందుచున్నది, దూషణ...బులు = తెగడుట పొగడుట అవమానించుటయు, దండవాక్పారుష్యంబులు = ఒకరిని శిక్షించుట కఠినముగా మాటలాడుట, వైషమ్యంబు = వికారము, నిరభిమానుండు = అభిమానము లేనివాఁడు, వధంబు = చంపుట, కర్తృత్వము = చేయుదు ననెడి భావము, ఒల్లనివానికి = ఇష్టపడనివానికి, సిద్ధింపదు = కలుగదు, సర్వభూతాత్మకుఁడు = ఎల్లజంతువుల యాకారము దాల్చినవాఁడు, వైషమ్యంబు = భేదభావము.

తా. స్పష్టము.

ఆ. అలుక నైనఁ జెలిమి నైనఁ గామంబున
నైన బాంధవమున నైన భీతి

నైనఁ దగిలి తలఁప నఖిలాత్ముఁ డగుహరిఁ
జేర వచ్చు వేఱు సేయఁ డతఁడు. 14

టీ. అలుక=కోపము, చెలిమి = స్నేహము, కామము = కోరిక, బాంధవము=చుట్టరికము, భీతి = భయము, తగిలి=పూని, అఖిలాత్ముఁడు=సర్వభూత స్వరూపుఁడు.

తా. విరోధమునఁగాని, విహితమునఁగాని, కోరికచేతఁగాని, చుట్టరికముచేతఁగాని, భయమువలనఁగాని, విడువక హరినామస్మరణము జేసినచో సర్వరూపుఁ డగువిష్ణువు వాని దగ్గఱఁ జేరును. వేఱు సేయఁడు.

క. వైరానుబంధనంబునఁ
జేరినచందమున విష్ణుఁ జిరతరభక్తిం
జేరఁగ రా దని తోఁచును
నారాయణభక్తియుక్తి నాచిత్తమునన్. 15

టీ. వైరానుబంధనంబునన్=విరోధముయొక్క పూనికతో, చేరిన చందమునన్=పొందినట్లు, చిరతరభక్తిన్=చాలకాలము చేయఁబడిన భక్తిచేత, నారాయణభక్తియుక్తిన్=భగవంతునియందుఁ గలభక్తియోగమువలన.

తా. ధర్మరాజా! పగగొని సాధించి విష్ణువును జేరునంతత్వరగా భక్తివలన విష్ణుసాయుజ్యము దొరకదని నామతము. ఇది నేను చాలరోజులుగా విష్ణునియందు భక్తిగలిగి, అనుభవమువలన చెప్పినమాట.

క. కీటకముఁ దెచ్చి భ్రమరము
పాటవమున బంభ్రమింప భ్రాంతంబై త
త్కీటకము భ్రమరరూపముఁ
బాటించి వహించుఁ గాదె భయయోగమునన్. 16

టీ. భ్రమరము = తుమ్మెద, కీటకమున్ = పురుగును, పాటవమునన్=దిట్టతనముతో, బంభ్రమింపన్=తిరుగగా, భ్రాంతంబు = కలవరపడినది, భ్రమరరూపమున్ = తుమ్మెదయొక్క యాకారమును, పాటించి =

విడువక చూచి, భయయోగమునన్ = భయముయొక్క సంబంధముచేత, వహింపన్ = తాల్చును.

తా. తుమ్మెద యొక పురుగును బట్టికొని, ఝూంకారము సేయుచు తిరుగఁగా నాపురుగు భ్రాంతి నొంది, భయముతో నా తుమ్మెదనే విడువక చూచి తానుగూడ తుమ్మెద యగుటలేదా.

వ. ఇవ్విధంబున. 17

శా. కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులుం
బ్రేమన్ మీరలు భక్తి నేము నిదె చక్రిం గంటి మెట్లైన ను
ద్దామధ్యానగరిష్ఠుఁ డైనహరిఁ జెందన్వచ్చు ధాత్రీశ్వరా. 18

టీ. కామోత్కంఠతన్ = మన్మథవికారమువలనియుబ్బుచే, వైరక్రియా సామగ్రిన్ = విరోధపుఁజేఁతలబలమున, శిశు...పతుల్ = శిశుపాలుఁడు మున్నగు రాజులు, సంబంధులు = చుట్టములు, వృష్ణులున్ = యాదవులును, ఏము = మేము, చక్రిన్ = (చక్రమును ధరించిన) విష్ణువును, కంటిమి = పొందఁ గల్గితిమి, ఉద్దామధ్యాన గరిష్ఠుఁడు = మించిన ధ్యానముచే గొప్పవాఁడు, ధాత్రీశ్వరా = ధర్మరాజా.

తా. ధర్మరాజా! మన్మథవికారముచే గోపికలును, ప్రాణభయముచే కంసుఁడును, విరోధముచే శిశుపాలుఁడు మొదలగు రాజులును, దాయాదులై యాదవులును, బంధుప్రీతిచే మీరును, భక్తిచే మేమును, నిరంతర ధ్యానముచేసి విష్ణుసాయుజ్యమును బడయలేదా! ఎట్లైన నేమి విడువక స్మరించినచో శాంతినిం బొందవచ్చును.

వ. మఱియుం బెక్కండ్రు కామద్వేషభయస్నేహసేవాతిరేకం
బులఁ జిత్తంబు హరిపరాయత్తంబుగాఁ జేసి తద్గతిం జెందిరి.
హరి నుద్దేశించి క్రోధాదులైన యేనింటిలోపల నొక్క
టియైన వేనునికి లేనినిమిత్తంబున నతండు వ్యర్థుం డయ్యె.

మీతల్లి చెలియలికొడుకు లయిన శిశుపాలదంతవక్త్రులు
తొల్లి విష్ణుమందిరద్వారపాలకులు విప్రశాపంబునఁ బదభ్రి
ష్టులై భూతలంబునం జన్మించి రనిన విని యుధిష్ఠిరుండు
నారదున కిట్లనియె. 19

టీ. పెక్కండ్రు=అనేకులు, కామ...బులన్ = కోరిక విరోధము భయము చెలిమి కైంకర్యము వీనియతిశయములచేత, హరిపరాయత్తంబు= విష్ణువునందు లీనమైనది, తద్గతిన్ = ఆవిష్ణువు చేరికను, ఉద్దేశించి=కూర్చి, క్రోధాదులు=కోపము మొదలగు నైదును, వేనునికిన్=వేనుఁడను రాజునకు, వ్యర్థుఁడు=ప్రయోజనము లేనివాఁడు, తొల్లి=మునుపు, విష్ణు...కులు=విష్ణుని వాకిటి కావలివారు, విప్రశాపవశంబునన్=బ్రాహ్మణ శాపమువంశేని, పదభ్రష్టులు=ఆ కావలి యుద్యోగమునుండి తొలఁగినవారు.

తా. ఇంతకు ఎందఱో చెలిమివలననో విరోధముననో కోరికవలననో భయమువలననో సర్వకాలము ధ్యానించి హరిని బొందిరి. నీవు చెప్పిన వేనునకు ఈకామాదులలో నొక్కటియు లేదుగాన వాఁడు చెడిపోయెను. మీపినతల్లి కొడుకులగు ఈ శిశుపాల దంతవక్త్రులు మునుపు వైకుంఠములో విష్ణుని వాకిటఁ గాపుండువారే. బ్రాహ్మణుల తిట్టువలన వారు ఆపదవిని బోఁగొట్టుకొని భూమిలోఁ బుట్టిరి. అనఁగానే ధర్మరాజు నారదు నడుగుచున్నాఁడు.

మ. అలుగం గారణ మేమి విప్రులకు మున్నావిప్రు లెవ్వారు ని
శ్చలు లేకాంతులు నిర్జితేంద్రియులు నిస్సంసారు లీశానువ
ర్తులు వైకుంఠపురీనివాసు లన విందుర్ వారి కెబ్భంగి నీ
ఖలజన్మంబులు వచ్చె నారద వినం గౌతూహలం బయ్యెడిన్.

టీ. అలుగన్=కోపించుటకు, విప్రులు=బ్రాహ్మణులు, నిశ్చలులు = చపలతలేనివారు, ఏకాంతులు=అంతరంగభక్తులు, నిర్జితేంద్రియులు=ఇంద్రి

యములఁ నణఁచినవారు, నిస్సంసారులు=సంసారము లేనివారు, ఈశానువర్తులు=పరమేశ్వరుని ననుసరించువారు, వైకుంఠపురీనివాసులు=వైకుంఠమునం దుండువారు, ఎబ్భంగిన్=ఏలాగున, ఖలజన్మంబులు=నీచజన్మములు, కౌతూహలంబు=వేడుక.

తా. నారదా! వీరికి బ్రాహ్మణు లేల శాపమిచ్చిరి? ఆబ్రాహ్మణు లెవరు? ఈ ద్వారపాలురు స్థిరచిత్తులు. విష్ణునకు అంతరంగభక్తులు. ఇంద్రియనిగ్రహము కలవారు. సంసారవర్జితులు. విష్ణుధ్యానైకరతులు నై వైకుంఠమును విడువకుందు రని విందుము. అట్టి పుణ్యులకు ఈ నీచజన్మ మేల కలిగెనో నాకు వినవలె నని యున్నది. వినిపింపుఁడు.

వ. అనిన నారదుం డిట్లనియె నొక్కనాఁడు బ్రహ్మమానసపుత్త్రు
లైనసనకసనందనాదులు దైవయోగంబున భువనత్రయంబు
నందును సంచరించుచు నైదాఱేండ్ల ప్రాయంపుబాలకులభా
వంబున దిగంబరులయి హరిమందిరంబునకు వచ్చి చొచ్చునెడ
మొగసాల నున్నపురుషు లిరువురు వారలం జూచి. 21

టీ. బ్రహ్మమానసపుత్త్రులు=బ్రహ్మమనస్సునఁ బుట్టినకొడుకులు, సనక...దులు=సనకసనందనసనత్కుమారసనత్సుజాతులు, భువనత్రయంబు=ముల్లోకములు, ప్రాయము=ఈడు, దిగంబరులు=దిక్కులు బట్టలుగాఁగలవారు(బట్టలు లేనివారు), హరిమందిరంబునకున్=విష్ణునిలయమునకు, చొచ్చునెడన్=చొరునప్పుడు, మొగసాలన్=వాకిటి ముందట.

క. డింభకుల ననర్గళవి
స్రంభకుల రమాధినాథసల్లాపసుఖా
రంభకుల ముక్తమానస
దంభకులం జొరఁగ నీక తఱిమి రధీశా. 22

టీ. డింభకులన్=బాలురను, అన...కులన్=అడ్డులేని విష్ణుభక్తి గలవారలను, రమా...కులన్=విష్ణుని సంభాషణసుఖమునకు యత్నిం

చుచున్న, ముక్త...కులన్ = విడువఁబడిన మనస్సునందలి సంగముగల
వారలను, చొరఁగన్ = ప్రవేశించుటకు, అధీశా = ధర్మరాజా.

తా. యుధిష్ఠిరమహారాజా! వారలు విష్ణువునం దత్యంతభక్తిగలిగి,
హరితో సల్లాపము సేయ వేడుకపడినవారై, రాఁగా, శుద్ధచిత్తులైన యా
బాలరూపుల చేరనీయక తఱిమివేసిరి.

క. వారించినతమకంబున
వారించుక నిలువ లేక వడిఁ దిట్టిరి దౌ
వారికుల నసురయోని న
వారితులై పుట్టుఁ డనుచు వసుధాధీశా. 23

టీ. వారించినతమకంబునన్ = తమనడ్డగించినవారను నాత్రముతో,
వారు = సనకాదులు, ఇంచుక = కొంచెము, నిలువలేక = సహింపఁ
జాలక, వడిన్ = వేగముగా, దౌవారికులన్ = వాకిటికావలివారిని,
అసురయోనిన్ = రాక్షసిజన్మమున, అవారితులు = మానుపఁబడనివారు,
వసుధాధీశా = పుడమిఱేఁడా.

తా. రాజా! వారు లోపలఁ జేరనీయలేదని ఆసనకాదులు కోపించి
వారిని రాక్షసజన్మ మెత్తుఁ డని శపించిరి.

వ. మఱియు నాపిన్నపెద్దలు వారలం జూచి మీర లీయెడ
నుండ నర్హులు గారు నారాయణచరణమూలంబు విడిచి ర
జస్తమోగుణులై రాక్షసయోనిం బుట్టుం డని శపియించిన
వారు నాశాపవశంబునఁ బదభ్రష్టులై కూలుచు మొఱలి
డిన నమ్మహాత్ములు దయాళువులై క్రమ్మఱం గరుణించి
మూఁడుజన్మంబులకు వైరంబున భగవత్సన్నిధానంబు గలి
గెదు మని నిర్దేశించి చని రివ్విధంబున శాపహతులై హరి
పార్శ్వచరులైనపురుషు లిరువురు హిరణ్యకశిపు హిరణ్యాక్షు

లన దితికి జన్మించి రందుఁ గనిష్ఠుం డైనహిరణ్యాక్షుని
హరి వరాహరూపంబున సంహరించె నగ్రజుం డయినహిరణ్య
కశిపుండు నరసింహమూర్తి యయిన శ్రీహరిచేత విదళితుం
డయ్యె నతనికొడుకు ప్రహ్లాదుండు తండ్రిచేత హింసితుం
డయ్యును నారాయణపరాయణుం డై శాశ్వతుం డయ్యె
రెండవభవంబునఁ గైకసి యను రాక్షసికి రావణకుంభకర్ణు
లయి సంభవించిన విశ్వంభరుండు రఘుకులంబున రాఘవుం
డయి యవతరించి వారల వధియించె నమ్మహాత్ముని పరా
క్రమంబులు మార్కండేయఋషివలన నెఱింగెదవు తృతీ
యజన్మంబున మీతల్లిచెలియలికి శిశుపాలదంతవక్త్రు లన
నుద్భవించి. 24

టీ. ఆపిన్నపెద్దలు=ఈడున బాలురయ్యు జ్ఞానమున పెద్దలగు సనకాదులు, ఈరీతిన్=ఈచోటున, అర్హులు=తగినవారు, నారాయణచరణమూలంబు=విష్ణునిపాదములయండను, రజస్తమోగుణులై=రజోగుణముతమోగుణము గలవారై, రాక్షసయోనిన్=రాక్షసుల గర్భమందు, పదభ్రష్టులు = అధికారచ్యుతులు, మొఱ = విన్నపము, అమ్మహాత్ములు = మహానుభావులగు నా సనకాదులు, దయాళువులు = దయగలవారు, క్రమ్మఱన్ = మరల, కరుణించి = దయచేసి, సన్నిధానంబు=సమీపము, నిర్దేశించి = నిర్ణయించి, చనిరి = వెళ్లిరి. ఇవ్విధంబునన్ = ఈలాగున, శాపహతులు = తిట్టుచేఁగూలినవారు, హరిపార్శ్వచరులు = విష్ణునొద్ద మెలఁగువారు, కనిష్ఠుండు = చిన్నవాఁడు, వరాహరూపము = పందిమేను, సంహరించెన్ = చంపెను. అగ్రజుండు=పెద్దవాఁడు, (ముందుపుట్టినవాఁడు), విదళితుండు=చీల్చఁబడినవాఁడు, హింసితుండు=బాధింపఁబడినవాఁడు, శాశ్వతుఁడు = ఎల్లప్పుడు ఉండువాఁడు, రెండవభవంబునన్ = రెండవపుట్టుకయందు, విశ్వంభరుండు = జగత్తులను బ్రోచువాఁడు, రఘుకులంబునన్ = రఘు

రాజావంశమున, రాఘవుండు = రాముఁడు, వధియించెన్ = చంపెను, తృతీయ జన్మంబునన్ = మూఁడవపుట్టుకలో, ఉద్భవించి = పుట్టి.

తా. స్పష్టము.

శా. వక్రత్వం బెటు లేక పాయనిమహావైరంబులో నిత్యజా
తక్రోధస్మరణంబులన్ విదళితోద్యత్పాపసంఘాతులై
చక్రచ్ఛిన్నశిరస్కులై మునివచశ్శాపావధిప్రాప్తులై
చక్రిం జెందిరి వారు పార్శ్వచరులై సారూప్యభావంబునన్.

టీ. వక్రత్వంబు = వంకర, కొంకత, పాయని మహావైరంబులోన్ = వీడనగొప్పపగతో, నిత్య...బులన్ = ఎప్పుడు పుట్టుచున్న కోపములతలంపులతో, విద...తులై = పోఁగొట్టఁబడిన పుట్టుచున్న పాపములరాసులుగల వారై, చక్రచ్ఛిన్న శిరస్కులు = చక్రముచే నఱకఁబడిన తలలు గలవారు, ముని...ప్తులై = సనకాదుల శాపము చివరకు బొందినవారై, చక్రిన్ = విష్ణువును, పార్శ్వచరులు = చెంతనుండువారు, సారూప్యభావంబున్ = ఒక్కరూపు గలుగుధర్మమునందు, చెందిరి = పొందిరి.

తా. ఇట్లు విడువని విరోధములో హరిని ప్రతిఘటించి వారు సర్వపాపములును వీడి విష్ణుచక్రముచేఁ దలలు తెగఁగఁబడినవారలై సనకాదుల శాపము దీఱి విష్ణుసారూప్యమును బొందిరి.

వ. అనిన విని ధర్మనందనుం డిట్లనియె. 26

క. బాలున్ హరిపదచింతా
శీలున్ సుగుణాలవాలు శ్రీసుస్మేధా
జాలున్ సంతోషింపక
యేలా శిక్షించె రాక్షసేంద్రుం డనఘా. 27

టీ. అనఘా = పాపములేనినారదా! రాక్షసేంద్రుండు = రాక్షసులరాజు, బాలున్ = శిశువును, హరి పదచింతా శీలున్ = విష్ణుపాద

చింతనము సేయువానిని, సుగుణాలవాలుఁ = మంచిగుణములకు పాదైన వానిని, శ్రీమన్మేధాజాలుఁ = సంపద్యుక్తమైన బుద్ధులు గలవానిని.

తా. నారదా! హిరణ్యకశిపుఁడు, పసివాఁడు నారాయణ చరణ స్మరణసేయువాఁడు, మంచిగుణములుగలవాఁడు, మంచిబుద్ధి గలవాఁడు నగు కొడుకును ప్రేమింపక ఎందులకు దండించెను!

క. పరిభూతవ్యథనంబులు
నిరుపమసంసారజలధినిర్మథనంబుల్
నరకేసరికథనంబులు
పరిరక్షితదేవయక్షఫణిమిథునంబుల్. 28

టీ. నరకేసరికథనంబులు = నరసింహమూర్తికథలు, పరిభూతవ్యథనంబులు = పోఁగొట్టఁబడిన బాధలు గలవి, నిరుపమ...నంబుల్ = తులలేని సంసారసాగరమును మథించునవి, పరి...నంబుల్ = కాపాడఁబడిన దేవతలు యక్షులు నాగులు వీరిజంటలు గలవి.

తా. నరసింహమూర్తికథలు సమస్తబాధలను బోఁగొట్టును. అంతము లేనిసంసారసముద్రమును నశింపఁజేయును. తమగానము చేసినదేవతలు యక్షులు పన్నగులు వీరిని రక్షించునవి.

వ. మునీంద్రా వినిపింపు మనిన నారదుం డి ట్లనియెఁ గమలో
దరుచేతం దనసహోదరుండు హతుం డయ్యె నని విని హిర
ణ్యకశిపుండు రోషశోకదందహ్యమానమానసుండయి ఘూ
ర్ణిల్లుచు నాఖిలదావదహనజ్వాలాకరాళంబు లయిన విలోక
నజాలంబుల గగనంబునం బొగ లెగయ నిరీక్షించుచుం ద
టిల్లతాంకుర సంకాశ ధగద్ధగిత దంత సందష్ట దశనచ్ఛదుం
డును నదభ్ర భయంకర భ్రుకుటితఫాలభాగుండును నిరంత
రాక్రాంతదురంతవైరవేగుండును నై మహాప్రభాజాల జటా

లం బగుశూలంబుఁ గేల నందుకొని సభామండపంబున నిలువంబడి త్రిమస్తక త్రిలోచన శకుని శంబర శతబాహు నముచి హయగ్రీవ పులోమ విప్రచిత్తిప్రముఖు లైనదైత్యదానవుల నాలోకించి యి ట్లనియె. 29

టీ. కమలోదరుచేతన్ = విష్ణువుచేత, తనసహోదరుండు, తనతమ్ముఁడు, హతుండు = చంపఁబడినవాఁడు. రోష...నుండు = కోపము దుఃఖము వీనిచేఁ గాల్పఁబడిన చిత్తము గలవాఁడు, ఘూర్ణిల్లుచున్ = కలవరము నొందుచు, అఖిల...కరాళంబులు = క్రూరములగు కార్చిచ్చుమంటలవలె భయముఁ గొల్పునవి, విలోకనజాలంబులన్ = చూడ్కులపంక్తులచేత, గగనంబు = ఆకసము, నిరీక్షించుచున్ = చూచుచు, తటిల్లతా...దుండు = మెఱపుతీఁగెల కొనలవలె ధగధగ మనుచున్న కోఱలచేఁ బెదవులు కొఱికికొనువాఁడు, అదభ్ర...గుండును = మిక్కిలి భయముగలిగించు బొమముడిగల నొసలుం గలవాఁడు, నిరంత...వేగుండు = సంసుశోక క్రమ్మిన దుఃఖావసానమైనవిరోధము చేతనైనతొందరగలవాఁడు, మహా...టాలంబు = గొప్పమంటలతుట్టెలచేఁ జడలుగట్టినదగు, త్రిమస్తక = మూఁడుతలలుగలవాఁడు, త్రిలోచన = మూఁడుకన్నులుగలవాఁడు, శతబాహు = నూఱు చేతులవాఁడు, హయగ్రీవ = గుఱ్ఱపుతలవాఁడు, దైత్య = దితిసంతతి, దానవ = దనువుసంతతి.

శా. నాకుం దమ్ముఁడు మీకు నెచ్చెలి రణన్యాయైకదక్షుండు బా
హాకుంఠీకృతదేవయక్షుఁడు హిరణ్యాక్షుండు వానిన్ మహా
శౌకర్యాంగము దాల్చి దానవవధూసౌకర్యముల్ నీఱు గా
వైకుంఠుండు వధించిపోయెనఁట యీవార్తాస్థితిన్ వింటిరే.

టీ. నెచ్చెలి = ప్రియమిత్రుఁడు, రణ...దక్షుండు = యుద్ధపుమర్మముల నెఱిఁగినవాఁడు, బాహా...యక్షుఁడు = బాహువులచే నోడింపఁబడిన దేవతలు యక్షులు గలవాఁడు, హిరణ్యాక్షుండు = బంగారు కన్నులు గలవాఁడు, మహాశౌకర్యాంగము = మిక్కిలి చులకనగు నొడలు, దానవ వధూ సౌకర్య

సుఖముల్ = రాక్షసవనితల సుఖములు, పీలంగాన్ = బూడిదయై నశించఁగా, వైకుంఠుండు = విష్ణువు, ఈవార్తానీతిన్ = ఈవృత్తాంత స్వభావమును.

తా. రాక్షసులారా! నాకుఁ దమ్ముఁడు మీకు మిత్త్రుఁడు, యుద్ధముల మర్మ మెఱిఁగినవాఁడు, బాహుబలముచే దేవతలను యక్షులను సైతము జయించినవాఁడు నగుహిరణ్యాక్షుని విష్ణువు వరాహరూపుఁడై రాక్షసస్త్రీల సౌఖ్యములు బూడిద యగునట్లు చంపిపోయెనఁట. ఇది యెట్లున్నదో విన్నారుగదా.

చ. వనముల నుండుఁ జొచ్చు మునివర్గములోపల ఘోణిగాఁడు సం
జనన మెఱుంగ రెవ్వరును జాడ యొకింతయు లేదు తనున్ డా
సిన మఱి డాయు వెంటఁబడి చిక్కక చిక్కఁడు వీని నొక్కకీ
లున మన మెల్ల లోఁబడక లోఁబడఁ బట్టుకొనంగవచ్చునే.

టీ. వనములన్ = అడవులయందు, మునివర్గము = మునులగుంపు, ఘోణి = పంది, జననము = పుట్టుక, జాడ = ఒకమార్గము, డాసినన్ = దగ్గఱకుఁ బోఁగా, డాయున్ = సమీపించును, వెంటఁబడి చిక్కక = వెంటనంటి యాశ్రయింపక, చిక్కఁడు = దొరకఁడు, ఒక్కకీలునన్ = ఒకయుక్తిచేత, లోఁబడక = వెనుదీయక, లోఁబడన్ = చిక్కునట్లు.

తా. ఈవిష్ణువు అడవులలో ముక్కుమూసికొని జపముసేయు మునులలో దూఱును. నిజముగా వరాహము గాఁడు. వీనిపుట్టుక యెవ్వరికిఁ దెలియదు. ఒక నీతిలేదు. తన్నెవరైనఁ జేరినచో వారల నిఁక విడువఁడు. వెన్నంటి యాశ్రయించినఁగాని స్వాధీనుఁడు గాఁడు. వీనిని మనమెల్లరము గలసి యొక్కయుక్తిన వెనుదీయక పోరి పట్టుకోఁ గలమా?

సీ. భుజశక్తి నాతోడఁ బోరాడ శంకించి
మున్నీట మునిఁగిన మునుఁగుఁ గాక

యలయించి పెనఁగునాయచలసంభ్రమమున
కెఱఁగి వెన్నిచ్చిన నిచ్చుఁగాక
జగడంబు సైఁపక సౌకర్యకాంక్షి వై
యిలక్రింద నీఁగిన నీఁగుఁగాక
క్రోధించి యటుగాక కొంతపౌరుషమున
హరిభంగి నడరిన నడరుఁ గాక
ఆ. కఠినశూలధారఁ గంఠంబు విదళించి
వానిశోణితమున వాఁడి మెఱసి
మత్స్యవహోదరునకు మహిఁ దర్పణము సేసి
మెఱసి వత్తు మీకు మేలు దెత్తు. 32

టీ. భుజభుక్తిన్ = బాహుబలముచేత, పోరాడన్ = యుద్ధము చేయుటకు, శంకించి = జంకి, మున్నీటన్ = సముద్రములో, అలయించి = బడలఁజేసి, పెనఁగు...మునకున్ = పోరు నాగట్టి పూనికకు, ఎఱఁగి = తలవాంచి, వెన్నిచ్చినన్ = వీఁపుఁజూపిన, జగడంబు = పోరాటము, సైఁపక = సహింపఁజాలక, సౌకర్యకాంక్షి = సూకరమును (పందియాకారమును) గోరినవాఁడై, ఇలక్రిందన్ = భూమియడుగున, ఈఁగినన్ = దూరినను, క్రోధించి = కోపపడి, పౌరుషమునన్ = పరాక్రమముతో, హరిభంగిన్ = సింహమువలె, అడరినన్ = డీకొనినను, కఠిన శూలధారన్ = కఱకుశూలపుటలుఁగుచే, కంఠంబు = మెడ, విదళించి = తునిమి, వానిశోణితమునన్ = వానినెత్తురుతో, వాఁడి = మగంటిమి, మెఱసి = చెలఁగి, మత్స్యవహోదరునకున్ = నాతమ్మునకు, మహిన్ = భూమిమీఁద, తర్పణము = నివాపోదకమును, మెఱసి = ప్రకాశించి.

తా. వాఁడు బాహుబలమున నాతో నెదిరింపలేక సముద్రములో దుమికినఁగాని, గాసిఁజెంది పోరునాస్థైర్యమున కోడి పాఱిపోయినఁగాని,

నాతోఁ బోరుపెట్టుకోఁజాలక భూమి క్రింద దూరిపోయినఁగాని, అలాగు నగాక ఎట్లయినను నావాఁడికూలముచే వాని మెడ త్రెంచి, వానిరక్తముతో నాతమ్మునికిఁ దర్పణముచేసి జయమునందివచ్చి మీ కానందము గలిగింతును.

క. ఖండితమూలద్రుమమున
నెండినవిటపములభంగి నితఁడు పడిన నా
ఖండలముఖ్యులు పడుదురు
భండనమున నితఁడు దమకుఁ బ్రాణము లగుటన్. 33

టీ. ఖండితమూలద్రుమమునన్ = వేళ్లునఱికినచెట్టుయందు, విటపములు = కొమ్మలు, పడినన్ = త్రెళ్లఁగా, భండనమునన్ = యుద్ధమందు, ఆఖండల ముఖ్యులు = ఇంద్రుఁడు మొదలగువారు, ఇతఁడు = ఈవిష్ణువు, పడుదురు.

తా. నే నితనిఁ బరిమార్చితినేని నిఁక నింద్రుఁడు మున్నగువారు తమకు విష్ణువే ప్రాణముగాన మొదలు తెగిన చెట్టుకొమ్మలవలె నిరాధారులై నిర్జీవులై పడిపోవుదురు.

సీ. పొందు దానవులార భూసురక్షేత్రసం
గతమైనభూమికి గములు గట్టి
మహిఁ దపస్స్వాధ్యాయమౌనవ్రతస్థుల
వెదకి ఖండింపుఁడు విష్ణుఁ డనఁగ
నన్యుఁ డొక్కఁడు లేఁడు యజ్ఞంబు వేదంబు
నతఁడె భూదేవక్రియాదిమూల
మతఁడె దేవర్షిపిత్రాదిలోకములకు
ధర్మాదులకు మహాధార మతఁడె
తే. యేస్థలంబుల గోభూసురేంద్రవేద
వర్ణధర్మాశ్రమంబులు వరుసనుండు

నాస్థలంబులకెల్ల మీ రరిగి చెఱచి
దగ్ధములు చేసి రండు మీదర్ప మొప్ప. 34

టీ. దానవులార=రాక్షసులారా, భూసురక్షేత్రసంగత = బ్రాహ్మణక్షేత్రములతోఁ గూడిన, గములు=గుంపులు, మహిన్=భూమిలో, తప...ధనులన్=జపము వేదపాఠము మౌనవ్రతముగలవారిని, ఖండింపుఁడు=త్రుంచుఁడు, అన్యుఁడు=ఇతరుఁడు, భూదేవక్రియాదిమూలము = బ్రాహ్మణులుచేయు కార్యములు మొదలగువానికి, హేతువు, దేవ...లకున్=దేవఋషి పితృవులు మొదలగువారిలోకములకు, ధర్మాదులకున్ = ధర్మార్థకామములకు, మహాధారము=గొప్పటెంకి, గోభూ...మంబులు = గోవులు బ్రాహ్మణులు వేదములు కులములు ఆచారములు, వరుసన్=క్రమముగా, అస్థలంబులకు=ఆయాచోట్లకు, అరిగి=వెళ్లి, చెఱచి=పాడుసేసి, దగ్ధములు = కాల్చఁబడినవి, దర్పము=గర్వము, ఒప్పన్=వెలయఁగా.

తా. రాక్షసులారా! వాడలుఁడు. మీరు గుంపులై బ్రాహ్మణక్షేత్రములతోఁ గూడ భూమి జరికట్టి జపము వేదపాఠము మౌనవ్రతము గలవారల వెదకి వెదకి చంపుఁడు. విష్ణువనఁగా వేఱుగా లేఁడు. యజ్ఞములు వేదములు అతఁడే. బ్రాహ్మణుల యెల్లకర్మలకు నతఁడే కారణము. దేవాదిలోకములకు ధర్మము మొదలగువానికి నతఁడే ఆధారము. ఇంతయేల? ఎక్కడ గోవులు బ్రాహ్మణులు వేదములు కులములు ఆచారములు వరుసగా నుండునో అక్కడ కంతయు వెళ్లి వానియొప్పు చెఱచి కాల్చి రండు.

వ. అని యిట్లు నిర్దేశించిన దివిజమర్దననిర్దేశంబులు శిరంబుల
ధరియించి రక్కసులు పెక్కండ్రు భూతలంబునకుం జని. 35

టీ. నిర్దేశించినన్=ఆజ్ఞచేయఁగా, దివిజమర్దననిర్దేశంబులు=దేవాంతకుఁడగుహిరణ్యకశిపునిమాటలను, పెక్కండ్రు=ఎక్కువమంది, భూతలంబునకున్=భూమికి.

సీ. గ్రామ పుర క్షేత్ర ఖర్వట ఖేట ఘో
షారామ నగ రాశ్రమాదికములు
గాలిచి కొలఁకులు గలఁచి ప్రాకారగో
పుర సేతువులు ద్రవ్వి పుణ్యభూజ
చయములు ఖండించి సౌధ ప్రపా గేహ
పర్ణశాలాదులు పాడు చేసి
సాధుగోబ్రాహ్మణసంఘంబులకు హింస
గావించి వేదమార్గములు చెఱచి
ఆ. కుతల మెల్ల నిట్లు కోలాహలంబు గా
దైత్యు లాచరింపఁ దల్లడిల్లి
నష్టమూర్తు లగుచు నాకలోకము మాని
యడవులందుఁ జొచ్చి రమరవరులు. 36

టీ. గ్రామ=ఊళ్లు, పుర=పట్టణములు, క్షేత్ర=పొలములు, పుణ్యదేశములు, ఖర్వట=పాలెములు, ఖేట=చిన్నపల్లెలు, ఘోష=గొల్లపల్లెలు, ఆరామ=తోఁటలు, నగర=రాజధానులు, ఆశ్రమ=మునులుండుచోట్లు, కొలఁకులు=మడుగులు, కలఁచి=చెఱచి(రొంపిజేసి), ప్రాకార=ప్రహారీలు, గోపుర=బురుజాలు, సేతువులు=ఆనకట్టలు, పుణ్యభూజచయములు=పుణ్యవృక్షములగుబురులను, సౌధ=మేడలు, ప్రపా=చలివెంద్రలు, గేహ=ఇండ్లు, పర్ణశాల=ఆకుటిండ్లు, సాధు=సజ్జనుల, గో=గోవులయొక్క, బ్రాహ్మణ=ద్విజులయొక్క, సంఘంబులకున్=సమూహములకు, హింస=వధము, వేదమార్గములు=వేదముతోవలు, కుతలము=భూప్రదేశము, కోలాహలంబు=సంకులము, దైత్యులు=రాక్షసులు, తల్లడిల్లి=బెగడుపడి, అమరవరులు=మేటివేల్పులు, నష్టమూర్తులు=స్వరూపనాశము చెందినవారు, నాకలోకము=స్వర్గమును, మాని=విడిచి, అడవులందున్=వనములలో, చొచ్చిరి=ప్రవేశించిరి.

తా. ఇట్లు రాక్షసులందఱు పల్లెలు పట్టణములు దేవాలయములు కోటలు పేటలు గొల్లమందలు ఆశ్రమములు రాజధానులు కాల్చి, బావులు రొంపిజేసి, కోటలు గోపురములు కూలఁద్రోసి, గట్టులు త్రవ్వి, దేవతావృక్షముల నఱికి, మేడలు, చలివెందరలు, ఆకుటిండ్లు పాడుచేసి, సజ్జనులను, గోవులను, బ్రాహ్మణులను జంపి, వేదములఁ జిక్కుపఱిచి, యిట్లు భూమియంతయుఁ జీకాకుపఱుప, దేవతలు భయపడి స్వరూపనాశముఁ జెంది, స్వర్గము విడిచి పాఱిపోయి యడవులలోఁ దూఱిరి.

వ. అంత హిరణ్యకశిపుఁడు దుఃఖితుం డై మృతుం డయినసోద
రునకు నుదకప్రదానాదికార్యంబు లాచరించి యతనిబిడ్డల
శకుని శంబర కాలనాభ మదోత్కచ ప్రముఖుల నూఱడిం
చి వారలతల్లితోఁ గూడ హిరణ్యాక్షునిభార్యల నందఱ రా
వించి తమతల్లి యైన దితి నవలోకించి యిట్లనియె. 37

టీ. అంతన్ = తర్వాత, దుఃఖితుఁడు = వ్యసనపడినవాఁడు, సోదరునకున్ = తమ్మునకు, ఉదకప్రదానాది కార్యంబులు = నీళ్లు విడుచుట మొదలగు నుత్తరక్రియలు, బిడ్డలన్ = కొడుకులను, ప్రముఖులన్ = మొదలగువారిని, అవలోకించి = చూచి.

శా. నీరాగారనివిష్టపాంథులక్రియన్ నిక్కంబు సంసారసం
చారుల్ వత్తురు కూడి విత్తురు సదా సంగంబు లేదొక్కచో
శూరుల్ పోయెడిత్రోవఁ బోయెను భవత్సూనుండు తల్లీ మహా
శూరుం డాతఁడు తద్వియోగమునకున్ శోకింప నీకేటికిన్. 38

టీ. సంసారసంచారులు = సంసారమునఁ దిరుగువారు, నీరాగారనివిష్టపాంథులు = చలిపందిరిలోఁ గలియు బాటసారులవలె, నిక్కంబు = నిజము, సంగంబు = కలయిక, మహాశూరుండు = గొప్పమగఁటిమిగలవాఁడు, తద్వియోగమునకున్ = వానిపోకకు, శోకింపన్ = దుఃఖింపఁగా.

తా. అమ్మా! నీ కొడుకుకొఱ కేల యేడ్చెదవు? భ్రాంతిమాత్రమే గాని యీసంసారమునఁ గొడుకు లనఁగా నెవరు? తల్లియనఁగా నెవరు? వీరికేమి సంబంధము? వీరందఱు చలివందిరిలో జనులు గుంపుచేరి తొలఁగిపోవుచుండునట్లు ఈసంసారమునఁ బితృభ్రాత్రాదినామధారులై యొక్కచోఁ జేరుదురు. పోవునప్పు డెవరి తెన్ను వారిదే. ఒకరికొఱ కొకరు ఎదురుచూడరు. నీ కొడుకు వీరులు పోరాడుదారిని బోయెను. వాఁడు గొప్పవీరుఁడు. వానికై శోకింపకుము.

సీ. సర్వజ్ఞుఁ డీశుండు సర్వాత్ముఁ డవ్యయుం
డమలుండు సత్యుఁ డనంతుఁ డాఢ్యుఁ
డాత్మరూపంబున నశ్రాంతమును దన
మాయాప్రవర్తనమహిమనలన
గుణములఁ గల్పించి గుణసంగమంబున
లింగశరీరంబు లీలఁ దాల్చి
కంపితజలములోఁ గదలెడిక్రియఁ దోఁచు
పాదపంబులభంగి భ్రామ్యమాణ
ఆ. చక్షువుల ధరిత్రి చలితమై కానంగఁ
బడినభంగి వికలభావరహితుఁ
డాత్మమయుఁడు గంపితాంతరంగంబునఁ
గదలినట్లు తోఁచుఁ గదల కుండు. 39

టీ. సర్వజ్ఞుఁడు = అన్నియుఁ దెలిసినవాఁడు, ఈశుండు = ప్రభువు. సర్వాత్ముఁడు = సర్వరూపి, అవ్యయుఁడు = నాశ మెఱుఁగనివాఁడు, అమలుండు = నిర్మలుఁడు, సత్యుఁడు = నిత్యుఁడు, అనంతుఁడు = పారములేనివాఁడు, ఆఢ్యుఁడు = అంతటనిండినవాఁడు, ఆత్మరూపంబునన్ = తన మేనితోడ, అశ్రాంతమును = ఎప్పుడును, మాయా...హిమ = మాయతోఁగూడియుండు సామర్థ్యము, గుణసంగమంబు = గుణములచేరిక, లింగశరీరంబు = సూక్ష్మదేహమును, లీలన్ = మెలఁకువతో, తాల్చి = ధరించి,

కంపితజలములోన్ = కదలెడినీటిలో, పాదపంబులు = చెట్లు, భ్రామ్యమాణచక్షువులన్ = తిరుగుడుకన్నులవారికి, ధరిత్రి = భూమి, చలిత = కదలునది, వికలభావరహితుఁడు = అపాయము లేనివాఁడు, ఆత్మమయుఁడు = ఆత్మస్వరూపుఁడు, కంపితాంతరంగంబునన్ = కదలెడిమనస్సున.

తా. అన్నిరీతులఁగి సర్వరూపుఁడై నాశములేనివాఁడై, సత్యుఁడైనదేవుఁడు ఆత్మస్వరూపముతో జగములనిండి, తనమాయచే సత్త్వరజస్తమము లనుగుణములఁ బుట్టించి, యాగుణములతోడ లింగశరీరము నొందిి, కదలునీటిలోఁ గదలునట్లు దోఁచుచెట్లవలె చపలమైనచిత్తములోఁ దానును కదలినట్లగపడుఁగాని వానికిఁ గదలికయే లేదు.

వ. అవ్వా యివ్విధంబున లక్షణవంతుండు గానియీశ్వరుండు లక్షితుం డై కర్మసంసరణంబున యోగవియోగంబుల నొందించు సంభవవినాశశోకవివేకావివేక చింతాస్మరణంబులు వివిధంబు లీయర్థంబునకుఁ బెద్దలు ప్రేతబంధుయమసంవాదం బనునితిహాసంబును నుదాహరింతురు వినుండు చెప్పెద నుశీనరదేశంబునందు సుయజ్ఞుం డనురాజు గలం డతండు శత్రువులచేత యుద్ధంబున నిహతుం డయి యున్నయెడ. 40

టీ. అవ్వా = అమ్మా! లక్షణవంతుండు = గుఱుతుగలవాఁడు, లక్షితుఁడు = కనఁబడినవాఁడు, కర్మసంసరణంబులన్ = కర్మమువలనను దానిచే నగుసంసారమువలనను, యోగవియోగంబులన్ = కలియూట పాయూటల వలనను, సంభవ...బులు = పుట్టుట, చచ్చుట, దుఃఖము, తెలివి, తెలివిలేమి, యోచన, తలఁపులు, వివిధంబులు = పలువిధములు, ఈయర్థంబునకున్ = ఈసంగతికి, ప్రేత...దంబు = చచ్చినవాని చుట్టములకు యమునకు నైనసంభాషణము, ఇతిహాసంబు = చరిత్రము, నిహతుండు = చంపఁబడినవాఁడు.

సీ. చిరిఁగినబహురత్నచిత్రవర్మముతోడ
రాలినభూషణరాజితోడ

భీకరబాణనిర్భిన్నవక్షముతోడఁ
దఱచు గాఱెడుశోణితంబుతోడఁ
గీర్ణమై జాఱిన కేశబంధముతోడ
రయరోషదంష్ట్రాధరంబుతోడ
నిమిషహీనం బైననేత్రయుగ్మముతోడ
భూరజోయుతముఖాంబుజముతోడఁ

ఆ. దునిసి పడినదీర్ఘదోర్దండములతోడ
జీవరహితుఁ డగునుశీనరేంద్రుఁ
జుట్టి బంధుజనులు సొరిది నుండఁగ భయా
క్రాంత లగుచు నతనికాంత లెల్ల. 41

టీ. చిరిఁగిన...ర్మము = చినిఁగిన అనేకరత్నములచేఁ గూర్పఁబడిన సొగసైనకవచము, భూషణరాజి = సొమ్ములబాఱు, భీకర...వక్షము = భయముగలిగించుబాణములచేఁ జీల్పఁబడినఱొమ్ము, శోణితంబు = నెత్తురు, కీర్ణము = చిక్కువడినది, కేశబంధము = జుట్టుముడి, రయ...రంబు = కసి కొలఁది కొఱకఁబడిన పెదవి, నిమిషహీనములు = ఱెప్పపాటులు లేనివి, నేత్రయుగ్మము = కన్నుదోయి, భూర...జము = నేలదుమ్ము గమ్మిన తామరవంటిముఖము, జీవరహితుఁడు = ప్రాణములఁ బాసినవాఁడు, భయాక్రాంతలు = భయముచే నావరింపఁబడినవారు.

తా. కవచము పేలికలై పోఁగా సొమ్ములన్నియు రాలి, బాణఘాతములచే ఱొమ్మువగిలి, నెత్తురు గాఱుచుండ, కేశములముడి వదలి నేలఁ బొరలాడఁగా, కోపముచేఁ బెదవిఁ గొఱుకుచు, మిడిగ్రుడ్లుబడి, నేలదుమ్మంతయుఁ మొగమున నిండఁగా, భుజములు తెగి చచ్చిపడియున్న అసుయజ్ఞుని వాని చుట్టములందఱు చుట్టుముట్టుకొనియుండఁగా, భానిభార్యలు మూఁది భయమందినవారై.

శా. ప్రస్తారంపిత కేశబంధములతో సంఛిన్నహారాళితో
హస్తాబ్జంబులు సాఁచి మోఁదుకొనుచున్ హానాథ యంచున్న హా
ప్రస్తావోక్తులతోడ నేడ్చిరి వగం బ్రాణేశుపాదాలపై
నస్తోక స్తనకుంకుమారుణవికీర్ణాస్రంబు వర్షించుచున్. 42

టీ. ప్రస్తా...ములు = జాఱిపోరలుచున్న కొప్పులు, సంఛిన్నహారాళి = తెగినహారములు, హస్తాబ్జంబులు = కేలుఁదామరలు, మోఁదుకొనుచున్ = మోఁదుకొనుచు, హానాథ = అయ్యో ప్రియుఁడా, ప్రస్తావోక్తులు = అసమయమునకుఁ దగినదీనాలాపములు, ప్రాణేశుఁడు = మగఁడు, అస్తో...స్రంబున్ = విస్తారమై చనులయందలికుంకుమచే నెఱ్ఱనై కాఱుచున్న కన్నీళ్లను, వర్షించుచున్ = కురియుచు.

తా. కొప్పులు వీడిపడఁగా, మెడలోనిదండలు తెగి పోఁగా బాహులు సాఁచి మొత్తుకొనుచు, మగనికాళ్లమీఁదఁ బడి కన్నీరు వరదలు కాఁగా అయ్యో ప్రియుఁడా యని బహుదీనముగా నేడ్చిరి.

మ. అనఘా నిన్ను నుశీనరప్రజల కర్థానందసంధాయిఁగా
మును నిర్మించిన బ్రహ్మ నిర్దయత నున్మూలించెనే వీరికిం
దనయశ్రేణికి మాకు దిక్కు గలదే ధాత్రీశ నీబోఁటికిం
జనునే పాసి చనంగ భ్రాతృజనులన్ సన్మిత్రులం బుత్రులన్. 43

టీ. అనఘా = పాపములేనివాఁడా! అర్థానందసంధాయి = ఇష్టవస్తువులను సంతోషమును ఇచ్చువాఁడు, నిర్దయతన్ = కరుణలేక పోవుటచే, ఉన్మూలించెనే = నశింపఁజేసెనా, వీరికిన్ = ఈప్రజలకు, తనయశ్రేణికిన్ = నీకొడుకులకు, దిక్కు = ప్రాపు, ధాత్రీశ = రాజా, భ్రాతృ = తోఁబుట్టువులు, మిత్రులు = చెలిమికాండ్రు.

తా. ప్రియా! బ్రహ్మ నిన్ను ఉశీనరదేశమువారికి నిక్షేపముగాఁ బుట్టించి, ఇంతలోనే ఓరువలేక కరుణవీడి, చంపి కొనిపోయెఁగదా, అయ్యో

ఇఁక నీజనులకు మాకు మాబిడ్డలకు నెవరుదిక్కు! రాజా నీవంటివానికి ఇట్లు ఆశ్రయించినవమ్ము తోడులను బిడ్డలను విడిచిపోవుట తగునా?

మ. జనలోకేశ్వర నిన్నుఁబాసిన నిమేషంబుల్ మహాబ్దంబులై
చను లోకాంతరగామివై మరల కీచందంబునన్ నీవు పో
యిన మేమెట్లుచరింతు మొల్లము గదా యీలోకవృత్తంబు నేఁ
డనలజ్వాలలఁ జొచ్చివచ్చెదము నీయంఘ్రిద్వయిం జూడఁగన్.

టీ. జనలోకేశ్వర=మనుష్యలోకమునకుఁ బ్రభువైనవాఁడా! నిమేషంబుల్ = రెప్పపాటుకాలములు, మహాబ్దంబులు=దివ్యవర్షములు, లోకాంతరగామివి=మఱియొకలోకమునకుఁ బోయినవాఁడవు, ఈచందంబునన్ = ఈలాగున, లోకవృత్తంబు=లోకమందలినడవడిని, అనలజ్వాలలు = నిప్పుమంటలు, అంఘ్రిద్వయి=పాదములజంట.

తా. ప్రియుఁడా! నిన్నువిడచి యొక్క నిమేషమేని యొకదివ్యవత్సరముగా నుండును. నీ విట్లు పరలోకమునకుఁ బోయి మరల రాకపోయిన మేమెట్లు బ్రతుకుదుము? మాకీప్రపంచముజోలి వద్దు. ఇప్పుడే నీతోఁగూడ వహ్నిలోఁ బడి చచ్చి నిన్ను గలిసికొందుము.

వ. అని యిట్లు రాజభార్యలారాజశవంబు డగ్గఱి విలపింపఁ బ్రొ
ద్దు గ్రుంకెడుసమయంబున వారలవిలాపంబులు విని బ్రాహ్మ
ణబాలకుండై యముండు చనుదెంచి ప్రేతబంధువులం
జూచి యిట్లనియె. 45

టీ. రాజభార్యలు = రాజుపెండ్లాలు, శవంబు = పీనుఁగు, విలపింపన్ = ఏడువఁగా, బ్రాహ్మణబాలకుఁడు = బ్రాహ్మణులపిల్లకాయ, చనుదెంచి=వచ్చి, ప్రేతబంధువులు=పీనుఁగుచుట్టములు.

ఉ. మచ్చిక వీరికెల్ల బహుమాత్రముఁ జోద్యము దేహి పుట్టుచుం
జచ్చుచు నుండఁ జూచెదరు చావక మానెడువారిభంగి నీ

చచ్చినవాని కేడ్చెదరు చావున కొల్లక డాఁగ వచ్చునే
యెచ్చటఁ బుట్టె నచ్చటికి నేఁగుట నైజము ప్రాణికోటికిన్. 46

టీ. మచ్చిక = చనువు, బహుమాత్రము = మిక్కిలి, చోద్యము = చిత్రము, దేహి = జీవుఁడు, డాఁగన్ = దాఁగుకొనుటకు, ప్రాణికోటికిన్ = జంతుజాలమునకు, నైజము = స్వభావము.

తా. వీరిమోహము జూడ వింతగా నున్నది. ఎప్పుడును జీవులు పుట్టుట చచ్చుట చూచుచునేయుందురు. అందఱు చచ్చువారే ఒక్కరును బ్రదుక రు అనియు నెఱుఁగుదురు. కాని తాము చావనివారివలె చచ్చినవారికొరకు ఏడ్చుచుందురు. ఎవరైనను సరే చావకుండ దాఁగఁగలరా? ఎల్లభూతము లకు ఎచ్చటనుండి పుట్టెనో అచ్చటికి వెళ్లుట స్వభావము.

క. జననీజనకులఁ బాసియు
ఘనవృకములబాధ వడక గడుఁ బిన్నల మై
మనియెద మెవ్వఁడు గర్భం
బున మును పోషించె వాఁడె పోషకుఁ డడవిన్. 47

టీ. జననిజనకులన్ = తల్లిదండ్రులను, పాసి = వీడి, ఘనవృకములు = పెద్దతోఁడేండ్లు, క్రూరమృగములు, కడున్ = మిక్కిలి, పిన్నలము = చిన్నవాండ్లము, మనియెదము = బ్రతికెదము, గర్భంబునన్ = తల్లికడుపులో, మును = మునుపు, పోషించెన్ = కాపాడెనో.

తా. తల్లిదండ్రులు వదలివేసినను, చిన్నజంతువులు, అడవిలో క్రూర మృగముల పాలుగాక బ్రతుకుటలేదా. తల్లికడుపులో నుండఁగా నెవఁడు రక్షించెనో వాఁ డడవిలోమాత్రము ఏల రక్షింపఁడు?

క. ఎవ్వఁడు సృజించుఁ బ్రాణుల
నెవ్వఁడు రక్షించుఁ ద్రుంచు నెవ్వఁ డనంతుం
డెవ్వఁడు విభుఁ డెవ్వఁడు వాఁ
డివ్విధమున మనుచుఁ బెనుచు హేలారతుఁ డై. 48

టీ. ప్రాణులన్ = జంతువులను, సృజించున్ = పుట్టించునో, త్రుంచున్ = చంపునో, అనంతుండు = కాలములేనివాఁడు, విభుఁడు = ప్రభువు, మనుచున్ = బ్రతికించును, పెనుచున్ = వృద్ధిచేయును.

తా. ఈయెల్లజీవులను ఎవఁడు పుట్టించునో రక్షించునో సంహరించునో, ఎవని కంతములేదో, ఎవఁడు అంతట వ్యాపించి ప్రభువైయుండునో వాఁడే యిట్లు జీవులఁ బ్రదికింపను పెంపను జాలును.

ఆ. ధనము వీథిఁ బడిన దైవవశంబున
నుండుఁ బోవు మూల నున్న నైన
నడవి రక్ష లేనియబలుండు వర్ధిల్లు
రక్షితుండు మందిరమునఁ జచ్చు. 49

టీ. దైవవశంబునన్ = విధివశంబువలన, ధనము, వీథిన్ = త్రోవలో, మూలన్ = ఇంటిమూలయందు, రక్ష = పోషణము, అబలుఁడు= దుర్బలుఁడు, వర్ధిల్లున్ = వెలయును, మందిరమునన్ = ఇంటిలో, రక్షితుండు = కాపాడఁబడినవాఁడు.

తా. దైవవశమున వీథిలోఁ బాఱవేసినవస్తువులైనను దొరకును. మూల నున్న నిక్షేపమైనను పోవును. అడవిలో దిక్కులేనివాఁడు ప్రబలును. ఇంటిలో సురక్షితుఁడు చచ్చును. దీనికంతయు దైవమే కారణము.

క. కలుగును మఱి లేకుండును
గలభూతము లెల్లఁ గాలకర్మవశము లై
నిలువఁడు ప్రకృతిం దద్గుణ
కలితుఁడుగాఁ డాత్మమయుఁ డగమ్యుఁడు దలఁపన్. 50

టీ. కలభూతములెల్లన్ = ఉన్నజంతువులన్నియు, కాలకర్మవశములు = కాలమునకుఁ గర్మమునకు లోఁబడినవి, కలుగును = పుట్టును, లేకుండును=నశించును, ఆత్మమయుఁడు=ఆత్మస్వరూపుఁడు, ప్రకృతిన్=

దేహమున, నిలువఁడు, తద్గుణకలితుఁడు = ఆదేహధర్మములగు ముదిమి నెఱ పు వీనితోఁ గూడుకొనఁడు, తలఁపఁగ = విచారింపఁగా, ఆత్మమయుఁడు=ఆత్మస్వరూపుఁడు, అగమ్యుఁడు = పొందరానివాఁడు.

తా. జంతువులన్నియు కాలకర్మసంబంధమునఁ బుట్టుచు చచ్చుచునుండును. ఆత్మ దేహమందు శాశ్వతుఁడుగాఁడు. జరామరణాదిదేహధర్మములు ఆయాత్మకు లేవు. అతఁ డిట్టివాఁ డని మన మూహింపఁజాలము.

సీ. పాంచభౌతిక మైనభవనంబు దేహంబు
పురుషుండు దీనిలోఁ బూర్వకర్మ
వశమున నొకవేళ వర్తించు దీపించుఁ
దటి యైన నొకవేళఁ దలఁగి పోవుఁ
జెడనేని దేహంబు చెడుఁ గాని పురుషుండు
చెడఁ డాతనికి నింతచేటు లేదు
పురుషునికిని దేహపుంజంబునకు వేఱు
కాని యేకత్వంబు కాన రాదు
ఆ. దారువుల వెలుంగు దహనునికైవడిఁ
గాయములఁ జరించు గాలిభంగి
నాశలీన మైననభముచాడ్పున వేఱు
దెలియ వలయు దేహి దేహములకు. 51

టీ. పాంచభౌతికము = పంచభూతముల (నిప్పు నీళ్లు మన్ను గాలి ఆకసముల) వలనఁ గల్పింపఁబడిన, భవనంబు=ఇల్లు, దీపించుచు=ప్రకాశించును, చేటు = నాశము, దేహపుంజంబు=దేహములరాశి, ఏకత్వంబు = ఒక్కటియగుట, దారువులన్ = కట్టెలయందు, దహనునికైవడిన్ = నిప్పువలె, కాయములు = శరీరములు, నాశలీనము = కాఁడలోనున్న, నభము= ఆకసము, దేహి దేహములకున్=దేహమునకును, పురుషునకును.

తా. దేహమనఁగా భూమిమొద లగుపంచభూతములతోఁ జేయఁబడినయిల్లు. దీనిలో జీవుఁడు పూర్వకర్మవశమున వర్తించును. ఒకప్పుడు దీనిని విడచిపోవును. ఒకవేళ దేహము నశించునేగాని దేహి నశింపఁడు. అతనికి చావులేదు. ఎన్నిరీతులఁ జూచినను పురుషునకు దేహమునకు భేదమే కాని యైక్యము సిద్ధింపదు. అరణికిని, కట్టెలు వానిలోని నిప్పు, శరీరములు వానియందలి గాలి, కాఁడ దానిలోని సందువలెనే అని యెఱుఁగనగును.

వ. అని మఱియు నిట్లనియె. 52

సీ. భూపాలకుఁడు నిద్రపోయెడి నొం డేమి
విలపింప నేటికి వెఱ్ఱులార
యెవ్వఁడు భాషించు నెవ్వఁ డాకర్ణించు
నట్టివాఁ డెన్నఁడో యరిగినాఁడు
ప్రాణభూతుం డైన పవనుఁ డాకర్ణింప
భాషింప నేరఁడు ప్రాణిదేహ
ములకు వేఱై తాను ముఖ్యుఁ డై యింద్రియ
వంతుఁడై జీవుండు వలను మెఱయఁ

ఆ. బ్రాభవమున భూతపంచకేంద్రియమనో
లింగదేహములను లీలఁ గూడు
విడుచు నన్యుఁ డొకఁడు విభుఁడు దీనికి మీరు
పొగుల నేల వగలఁ బొరల నేల. 53

టీ. వెఱ్ఱులార, భూపాలకుఁడు = రాజు, ఒండు = ఇతరము, విలపింపఁగ = ఏడువఁగా, భాషించుట = పలుకునో, ఆకర్ణించుట = వినునో, అరిగినాఁడు = పోయినాఁడు, ప్రాణభూతుండు = ప్రాణమైన, పవనుఁడు = వాయువు, ప్రాణిదేహములకు = జీవునకు దేహమునకు, వేఱై = భిన్నుఁడై, ముఖ్యుఁడై = ప్రధానుఁడై, ఇంద్రియవంతుఁడు = ఇంద్రియములు

కలవాఁడు, వలను మెఱయఁగ = నేర్పుమీఱఁగా, ప్రాభవమునన్ = ఐశ్వర్యముతో, భూత...దేహములన్ = ఐదుభూతములు, త్వగాదీంద్రియములు, మనస్సు, లింగశరీరము వీనిని, లీలన్ = వేడుకతోన్, కూడును = కలయును, విడుచున్ = వదలును, అన్యుఁడు = ఇతరుఁడు, విభుఁడు = ప్రభువు, పొగులన్ = శోకింపఁగా, వగలన్ = దుఃఖములయందు.

తా. ఓపిచ్చివారలారా! రాజు నిద్రబోవుచున్నాఁడు. వేఱేమున్నది? మీ రెందుల కేడ్చెదరు? ఈదేహమందుండి పలుకువాఁడు వినువాఁడు ఎప్పుడో పోయినాఁడు. ఇఁక నిప్పుడిందులోనున్న గాలి మాట్లాడనేరదు. వినలేదు. ప్రాణులు దేహము వీనికంటె ప్రధానుఁడై యింద్రియములు గలిగి చైతన్యము గలిగి, సామర్థ్యముతో, పంచభూతములును ఇంద్రియములు మనస్సు సూక్ష్మదేహము వీనిలోఁ జొచ్చుచుఁ బోవుచుండువాఁడు మనకుఁ గానరాఁడు. ఈమాత్రమునకు మీ రిటు లేడ్చుట మొత్తుకొనుట యెందుకు?

క. ఎందాఁక నాత్మ దేహము
నొందెడు నందాఁక గర్మయోగము లటపైఁ
జెందవు మాయాయోగ
స్పందితులై రిత్త జాలిఁ బడ నేమిటికిన్. 54

టీ. ఆత్మ = జీవుఁడు, ఎందాఁకన్ = ఎంతసేపు, దేహమున్ = శరీరమును, కర్మయోగములు = కర్మసంబంధములు, అటపైన్ = అమీఁద, చెందవు = అంటవు, మాయాయోగస్పందితులై = మాయయొక్క కూడికచేఁ బొరపడినవారలై, రిత్త = ఊరక, జాలిన్ = దైన్యమును, పడన్ ఏమిటికిన్ = పొందుటయేల.

మ. చెలులుం దల్లులు దండ్రులాత్మజులు సంసేవ్యుల్ సతుల్ చారుని
ర్మలగేహంబులటంచుఁ గూర్తురు మహామాయాగుణభ్రాంతులై
కలలోఁ దోఁచినయర్థముల్ నిజములే కర్మానుబంధంబులం
గలుగున్ సంగము లేక మానుఁ బిదపం గర్మాంతకాలంబునన్.

టీ. చెలులన్ = మిత్రులను, ఆత్మజాలు = కొడుకులు, సునేతృల్ = ప్రభువులు, సతుల్ = భార్యలు, చారుసర్మ్యగేహంబులు = అందమై మలినములేని యిండ్లును, మహామాయాగుణ భ్రాంతులై, కూర్తురు = ప్రేమింతురు. తోఁచినయర్థముల్ = అగపడినవస్తువులు, కర్మానుబంధంబులన్ = కర్మసంబంధములచేత, సంగము = చిక్కు, కలుగు, కర్మాంతకాలంబునన్ = కర్మములుతీఱిపోవునప్పుడు, పిదపన్ = చివరను, మానున్ = నివర్తించును.

తా. మాయకు లోనైనమనుజులు తల్లి, తండ్రి, స్నేహితుఁడు కొడుకులు, రాజులు, భృత్యులు, భార్యలు, మేడలు, నని వానిని ప్రేమింతురు. అది వట్టిపిచ్చి. కలలో నగపడినవస్తువులు నిజములగునా? కర్మమువలన వీనిసంబంధము కలుగును. కర్మములు వదలిన నీచిక్కు వీడును.

వ. మఱియు మాయాగుణప్రపంచంబు నెఱింగెడుతత్త్వజ్ఞులు నిత్యానిత్యంబులం గూర్చి సుఖదుఃఖంబులం జెంద రజ్ఞులు కొందఱు యోగవియోగంబులకు సుఖదుఃఖంబుల నొందుదురు తొల్లి యొక్కసుహాగవానంబున విహంగంబులకు నంతకభూతుం డైన యొఱుకు గలఁ డతం డొక్కనాఁడు ప్రభాతంబున లేచి వాటం బైన వేఁటతమకంబున. 56

టీ. మాయాగుణప్రపంచంబు = మాయయొక్కగుణము లైనదేహగేహాదులను, తత్త్వజ్ఞులు = నిజమెఱింగినవారు, నిత్యానిత్యంబులు = శాశ్వతమును భంగురమునుగూర్చి, అజ్ఞులు = తెలియనివారు, యోగవియోగంబులు = సంయోగవియోగములు, విహంగంబులకున్ = పక్షులకు, అంతకభూతుండు = యమునివంటివాఁడు, ఎఱుక = బోయ, ప్రభాతము = వేకువ, వాటము = ఉల్లాసకరము, వేఁటతమకంబునన్ = వేఁటయందలి కోరికతో

క. వల లురులు జిగురుఁగండెలుఁ
జలిదియుఁ జిక్కంబు ధనువు శరములుఁ గొనుచుం

బులుఁగులఁ బట్టెడు వేడుక
నలుకుడు వెడలంగఁ గదలి యడవికిఁ జనియెన్. 57

టీ. వలలు, ఉరులు, జిగురుఁగండెలు=బంకపూసిన దారపుఁగండెలు, చలిది=చద్ది, ధనువు=విల్లు, శరములు=బాణములు, కొంచున్=తీసికొని, పులుఁగులన్=పక్షులను, పట్టెడు వేడుకన్, అలుకుడు=చప్పుడు.

తా. వలలు, ఉరిత్రాడులు, బందనబూసిన దారపుకండెలు, చద్దియున్న పుమూట, పక్షులచిక్కము, విల్లు, అమ్ములను తీసికొని, పక్షులఁ బట్టుటకై పెద్దరొద చేయుచు నడవికి వెళ్లెను.

వ. అట్లడవికిం జని తత్ప్రదేశంబునందు. 58

క. కట్టలుకఁ దడుకుచాటునఁ
బిట్టల నురిగోలఁ దిగిచి బిఱుసున ఱెక్కల్
పట్టి విఱిచి చిక్కములోఁ
బెట్టుచు విహరించె లోకభీకరలీలన్. 59

టీ. కట్టలుకన్=ఎక్కువచలముతో, తడుకుచాటునన్=కంచెలమాటున, ఉరికోలన్=ఉచ్చుకఱ్ఱతో, తిగిచి=లాగి, బిఱుసునన్=కఱకుఁదనముచేత, లోకభీకరలీలన్=జగద్భయంకరమైన విలాసముతో.

తా. క్రోధముమీఱ కంచెలచాటునఁ బొంచియుండి, కొసను ఉరితగిలించినకఱ్ఱతోఁ బక్షులను బట్టి లాగి, దయమాలి ఱెక్కలు విఱిచి చిక్కములో వేసికొనుచు భయమును గొల్పుచు సంచరించెను.

వ. మఱియు నానావిధంబు లగుశకుంతంబుల నంతంబు నొందించుచు సకలపక్షిసంహారసంరబ్ధకుండైన లుబ్ధకుండు దనముందటఁ గాలచోదితంబై సంచరించుచున్నకుళింగపక్షిమిథునంబుఁ గనుంగొని యందుఁ గుళింగి నురిం దిగిచి యొక్కచిక్కంబులో వైచినం జూచి దుఃఖించి కుళింగపక్షి యిట్లనియె. 60

టీ. నానావిధంబులు = పలుదెఱఁగులు, శకుంతఘ్నులు = పక్షులు, అంతము = చావు, సకల...రబ్ధకుండు = అన్నిపిట్టలను హతముసేయు పూన్కిగలవాఁడు, విలుబ్ధకుండు = అయిన యెఱుకువాఁడు, కాలచోదితంబు = కాలముచేఁద్రోయఁబడినది, కుళింగము = ఆఁడుపిచ్చుక, దుఃఖించి = వాపోయి.

చ. అడవుల మేఁత మేసి మనమన్యుల కెన్నఁడు నెగ్గు సేయ కి
క్కడ విహరింప నేఁ డకట కట్టిఁడిబ్రహ్మ కిరాతుచేతిలోఁ
బడు మని వ్రాసెనే నుదుటఁ బాపపుదైవముకంటె కింతయె
క్కుడుబరు వయ్యెనే బ్రతుకు గోమలి యేమననేర్తుఁ జెల్లరే.

టీ. అన్యులకున్ = ఒరులకు, ఎగ్గు = కీడు, విహరింపన్ = క్రీడసేయుచుండఁగా, కట్టిఁడిబ్రహ్మ = క్రూరమైనదైవము, నుదుటన్ = నొసటిమీఁద, గోమలి = ప్రియురాలా, చెల్లరే = ఔరా.

తా. ప్రియురాలా! మనము అడవులలో మేఁతమేసి మడుఁగులలో నీరుఁ ద్రావి యుందుము కాని ఎవరికి ఎన్నఁడును కీడుసేయము. క్రూరపు బ్రహ్మ యీబోయవానిచేఁ బడుదుమని నిటలలో వ్రాసెఁగాఁబోలు? అయ్యో యీపాపదైవముకంటె కింత బరువైతివిగదే, ఔరా! నేనేమందును.

క. ఒకమాటు సుతుల నందఱఁ
బ్రకటించి కిరాతువలలఁ బడఁ జేయక ని
న్నొకటిన్ వలఁ బడఁ జేసిన
వికటీకృతదక్షుఁ డైనవిధి నే మందున్. 62

టీ. ప్రకటించి = బయలుచేసిచూపి, కిరాతువలలన్ = బోయవాని యురులలో, వికటీకృతదక్షము = ఎగుడుదిగుడుపనులుసేయ నేర్పరియగు, విధిన్ = దైవమును, ఏమందున్.

తా. అయ్యోకాంతా! బిడ్డలతోఁగూడ, మనలనందఱను కిరాతుని పాలు సేయక, నిన్నొక్కదానినే యేల చంపుకపోయెనే, ఎచ్చుతగ్గుపనితనములో గట్టివాఁ డగు దైవము నేమందును?

ఉ. ఱెక్కలు రావు పిల్లలకు ఱేపటి నుండియు మేఁత గానమిం
బొక్కుచు గూఁటిలో నెగసి పోవఁగ నేరవు మున్ను తల్లి యీ
దిక్కున నుండి వచ్చునని త్రిప్పనిచూడ్కుల నిక్కి నిక్కి న
ల్దిక్కులు చూచు చున్న వతిదీనత నెట్లు భరింతు నక్కటా.

టీ. పొక్కుచున్ = ఏడ్చుచు, త్రిప్పనిచూడ్కులన్ = త్రిప్పలేని చూపులతో, నిక్కినిక్కి = ఉబికియుబికి, అతిదీనతన్ = మిగులజాలితో, అక్కటా = అయ్యో, భరింతున్ = సైఁపఁగలను.

తా. ఇంకను పిల్లలకు ఱెక్కలు రాలేదు. రేపటినుండి మేఁత లేదుగాన ఏడ్చుచు గూఁడువదలిపోలేవు. వెనుక తల్లి యీతట్టునుండి వచ్చునని గుఱుతోఁ దలయెత్తి జాలిగా నాలుగుప్రక్కలఁ జూచుచున్నవి. అయ్యో యీదుఃఖ మెట్లోర్వఁ గలను.

వ. అని యివ్విధంబున. 64

క. కుంఠితనాదముతోడను
గంఠము శోషింప వగచు ఖగమును హానన్
త్కంఠుం డైనకిరాతుఁ డ
కుంఠితగతి నేసె నొక్కకోలం గూలన్. 65

టీ. కుంఠితనాదముతోడన్ = సన్నగిలినధ్వనితో, కంఠము = గొంతు, శోషింపన్ = ఎండఁగా, వగచుఖగమును = ఏడుచుపిచ్చుకను, హానోత్కంఠుఁడు = చంపఁబూనినవాఁడు, అకుంఠితగతిన్ = అడ్డులేని పోకతో, ఒక్కకోలన్ = ఒకబాణముతో, కూలన్ = చచ్చునట్లుగా, ఏసెన్ = కొట్టెను.

తా. ఇట్లు గొంతు ఎండిపోవఁగా హీనస్వరముతో నేడుచునామగపిచ్చుకను చంపవేడుక గలబోయ ఒక్కబాణముతో నడ్డులేక నేలమీఁదఁబడఁగొట్టెను.

క. కాలము వచ్చిన శబరుని
కోలను ధరఁ గూలె ఖగము ఘోషముతోడం
గాలము డాసిన నేలం
గూలక పోవశమె యెట్టి గుణవంతులకున్. 66

టీ. కాలము = అదును, ఖగము = పిచ్చుక, శబరునికోలను = ఎఱుకువానిబాణమువలన, ఘోషముతోడన్ = అఱుపుతో, ధరన్ = భూమిమీఁద, కూలెన్, డాసినన్ = సమీపింపఁగా, ఎట్టిగుణవంతులకున్ = ఎట్టిపరాక్రమాదిగుణములు గలవారికైనను, కూలక = చావక, పోవశమె = తప్పించుకొనశక్యమా.

తా. ఇట్లు తానెంతసేపు బ్రదుకునో తెలియక, తనపెండ్లముకోస మేడుచుపక్షి కాలము సమీపింపఁగానె బోయవానిచేతిలో నప్పుడు చచ్చెఁ గదా. ఎంతవారికైనను, కాలము దాపొనినప్పుడు చావకుండ తప్పుకొన శక్యమా.

ఉ. కావున మీరు చచ్చుతఱిఁ గానరు చచ్చి ధరిత్రిఁ బడ్డధా
త్రీవిభు దేహముం గదిసి దీనత నేడువ నేల పొందు చిం
తావతులార వత్సరశతంబుల కైన నిజేశుచక్కికిం
బోవుట దుర్లభంబు మృతిఁ బొందినవారలు చేర వత్తురే. 67

టీ. చచ్చుతఱిన్ = చనిపోవువేళను, కానరు = ఎఱుఁగరు. ధరిత్రిన్ = నేలమీఁద, పడ్డధాత్రీవిభుదేహమున్ = పడినరాజుకళేబరమును, కదిసి = కౌఁగిలించుకొని, దీనతన్ = పేదరికముతో, చింతావతులార = దుఃఖవతులైనరాజుభార్యలారా, వత్సరశతంబులకున్ = ఎన్నినూఱులయేండ్లకైనను, నిజేశుచక్కికిన్ = మీమగనియొండకు, దుర్లభంబు = సంభవింపనిది, మృతిన్ = మరణమును, పొందినవారలు = చెందినమనుజులు, చేర వత్తురే = మరల దగ్గఱకు వచ్చెదరా.

తా. కనుక మీ రీ రాజు చావున కేడుతురే గాని మీ రెప్పుడు చత్తురో యెఱుఁగరు. ఈ రాజు శవముమీఁదఁ బడి యెందుల కేడ్చెదరు? లేచిపొండు? ఇట్లు ఎన్ని యేండ్లేడ్చినను, మీ రతఁడున్న చోటు జేరలేరు. పిచ్చివారలారా! చచ్చినవారు మరల బ్రతికివత్తురా.

వ. అని యిట్లు కపటబాలకుండై క్రీడించుచున్న యమునియు
పలాలనాలాపంబులు విని సుయజ్ఞునిబంధువులెల్ల వెఱఁగుపడి
సర్వప్రపంచంబు నిత్యంబు గాదని తలంచి శోకింపక సుయజ్ఞు
నికి సాంపరాయికకృత్యంబులు సేసి చని రంత నంతకుం డం
తర్హితుం డయ్యె నని చెప్పి హిరణ్యకశిపుండు దనతల్లిని ద
మ్మునిభార్యలం జూచి యిట్లనియె. 68

టీ. కపటబాలకుండు = మాయపిల్లవాఁడు, క్రీడించు = విహరించు, ఉపలాలనాలాపంబులు = ఔదార్యపుమాటలను, వెఱఁగుపడి = వెల్లఁబోయి, సత్యంబు = ఎప్పుడునుండునది, సాంపరాయిక కృత్యంబులు = యుద్ధమునఁజచ్చినవారికిఁ జేయవలయు నుత్తరక్రియలు, అంతకుండు = యముఁడు, అంతర్హితుండయ్యె = కానరాకుండఁబోయెను

క. పరు లెవ్వరు దా మెవ్వరు
పరికింపఁగ నేక మగుట భావింపరు త
త్పరమజ్ఞానము లేమిని
బరులును నే మనుచుఁ దోఁచుఁ బ్రాణుల కెల్లన్. 69

టీ. పరులు = ఇతరులు, పరికింపఁగన్ = చక్కఁగా విచారించినచో, ఏకము అగుటన్ = ఒక్కటియే అగుట, భావింపరు = గమనింపరు, ప్రాణులకున్ = జీవులన్నిటికిని, తత్పరమజ్ఞానము లేమినిన్ = దానివిషయమైన యుత్తమజ్ఞానము లేనందువలన, పరులును, ఏము, అనుచున్, తోఁచును.

తా. తామనఁగా నెవరు? అన్యు లనఁగా నెవరు? అన్నియు నొక్కటియే యని యెఱుంగరు. జంతువులకు దానివిషయమై తెలివి లేదు కావున తాము వారు ననెడి భ్రమలోఁ బడియెదరు.

వ. అని తెలియం బలికిన హిరణ్యకశిపునివచనంబులు విని దితి
కోడండ్రునుం దానును శోకంబు మాని తత్త్వవిలోకనం
బు గలిగి లోకాంతరగతుం డైనకొడుకునకు వగవక చని
యె నని చెప్పి నారదుండు ధర్మనందనున కిట్లనియె. 70

టీ. తెలియన్ = బోధపడునట్లు, తత్త్వవిలోకనంబు = న్యాయదృష్టి, లోకాంతరగతుండు = ఒండులోకమున కేఁగినవాఁడు

క. అజరామరభావంబును
త్రిజగద్రాజ్యంబు నప్రతిద్వంద్వము దో
ర్విజితాఖిలశాత్రవమును
గజరిపుబలమును హిరణ్యకశిపుఁడు గోరెన్. 71

టీ. అజరామరభావంబును = ముదిమి చావు లేకుండుటయు, త్రిజగద్రాజ్యంబు = ముల్లోకముల దొరతనము, అప్రతిద్వంద్వము = తన కెదిరించువాఁడు లేమియు, దోర్వి...త్రమును = బాహుబలముచే గెల్వఁబడిన యెల్లపగతులఁ గలుగుటను, గజరిపుబలమును = సింహమువంటిపరాక్రమమును.

తా. అంతట హిరణ్యకశిపుఁడు తనకు ముదిమి చావు లేకుండుటయు, ముల్లోకముల దొరతనము, తన కెదురాడువారు లేకపోవుటయు, శత్రువిజయమును, సింహపరాక్రమమును తన కుండవలె నని కోరెను.

వ. ఇట్లు కోరి మందరాచలద్రోణికిం జని యందుఁ గాలిపెను
వ్రేల నేల నిలువంబడి యూర్ధ్వబాహుండయి మిన్ను చూ
చుచు వాఁడిమయూఖంబులతోడి ప్రళయకాలభానుండు
నుంబోలె దీర్ఘజటారుణప్రభాజాలంబుతోడ నెవ్వరికిం జేరి

చూడ రాక పరమదారుణం బైనతపంబు సేయు చుండె ని
ర్జరులు నిజస్థానంబుల నుండి రంతె. 72

టీ. మందరాచలద్రోణికిన్ = మందరపర్వతము కొప్పునకు, పెనువ్రేలన్ = బొటనవ్రేలుతో, ఊర్ధ్వబాహుండు = చేతులు పైకెత్తినవాఁడు, మిన్ను = ఆకసము, వాఁడిమయూఖంబులు = చుఱుకైనయెండలు, ప్రళయకాలభానుండు = ప్రళయకాలమందలిసూర్యుఁడు, దీర్ఘ...జాలంబు = పొడవులైనజడలయొక్కనిరంగులసమూహము, తేజి = మొగముపైకెత్తి, పరమదారుణంబు = మిగుల వేఁడియైనది, నిర్జరులు = వేలుపులు, నిజస్థానంబులు = తమతమ నెలవులు.

మ. అదరెం గుంభిని సాద్రియై కలఁగె నేడంభోనిధుల్ తారకల్
చెదరెన్ సగ్రహసంఘులై దిశలు విచ్ఛిన్నాంతలై మండెఁ బె
ల్లదరెన్ గుండెలు జంతుసంహతికి నుగ్రాచారదైత్యేంద్రమూ
ర్ధదిశోద్ధూతసధూమహేతిపటలోదంచత్తపోవహ్నిచేన్. 73

టీ. ఉగ్రా...వహ్నిచేన్ = దారుణప్రవర్తనముగల రాక్షసరాజు యొక్కతలలోనుండిలేచిన పొగతోడిమంటలతోఁ బొంగుచున్నతపస్సనెడు నగ్నిచేత, కుంభిని = భూమి, సాద్రి = పర్వతములతోఁగూడినది, ఏడంభోనిధుల్ = ఏడుసముద్రములు, కలఁగెన్ = పంకిలములయ్యెను, తారకల్ = చుక్కలు, చెదరెన్, దిశలు, సగ్రహసంఘులు = గ్రహములగుంపులతోఁగూడినవి, విచ్ఛిన్నాంతలు = చీలినయంచులుగలవి, జంతుసంతతికిన్ = జంతువులగుంపులకు, గుండెలు, పెల్లు = మిక్కిలి, అదరెన్.

తా. అతిదారుణమైనప్రవర్తనగల తపస్సు జేయుచున్నహిరణ్యకశిపుని తలలోనుండి పుట్టినతపముయొక్క మంటలకు కొండలతోడ భూమి వణఁకెను. సముద్రములు కలఁతనొందెను. గ్రహములతోఁగూడ చుక్కలు చెదరిపోయెను. దిక్కులుబీటలువారి మండసాగెను. అన్ని జంతువులకు గుండెలు కొట్టుకొనసాగెను.

వ. ఇట్లు త్రైలోక్యసంతాపకరం బైనదైత్యరాజతపోవిజృంభణంబు సైరింపక నిలింపులు నాకంబు విడిచి బ్రహ్మలోకంబునకుం జని లోకేశ్వరుం డయినబ్రహ్మకు వినతు లయి యిట్లని విన్నవించిరి. 74

టీ. త్రైలోక్య...కరంబు = ముల్లోకములకు తాపమును గలిగించునట్టిది, దైత్య...ణంబు = రాక్షసులకు రాజగు హిరణ్యకశిపుని తపము పెంపును, సైరింపక = ఓర్వఁజాలక, నిలింపులు = దేవతలు, నాకంబు = స్వర్గము, లోకేశ్వరుఁడు = ఎల్లలోకములకు నేలిక, వినతులు = మ్రొక్కినవారు.

క. దితికొడుకుతపము వేఁడిమి
నతితప్తుల మైతి మింక నలజడి నమరా
వతి నుండ వెఱతు మెయ్యది
గతి మాకును దేవదేవ కారుణ్యనిధీ. 75

టీ. కారుణ్యనిధీ = దయకు నెలవైనవాఁడా! అతితప్తులము = మిక్కిలి క్రాఁగినవారము, అలజడిఁ = భయముచేత, అమరావతిఁ = దేవతల రాజధానియందు, దేవదేవ = దేవతలకందఱకు దేవుఁడా, మాకు, గతి = దిక్కు, ఎయ్యది.

తా. దయగలయోబ్రహ్మ! హిరణ్యకశిపుని తపస్సుయొక్క వేఁడిమివలన మాఁడిపోయినారము. ఇఁక మాకు భయ మెత్తినది. స్వర్గములో నుండుటకు మాకు గుండె తాళదు. స్వామీ మా కిఁక నేమిదిక్కు?

మ. శంకాలేశము లేదు దేవ త్రిజగత్సంహారముం దేవతా
సంకోచంబును వేదశాస్త్రపదవీసంక్షేపముఁ జేక యే
వంకన్ జేతు నటంచు దుస్సహతపోవ్యాప్తి చిత్తంబులో
సంకల్పించె నిశాచరుండు ప్రతిసంస్కారంబుఁ జింతింపవే.

టీ. దేవ = స్వామి, శంకాలేశము = కొంచెమనుమానమును, త్రిజగత్సంహారముఁ = మూఁడులోకముల రూపుమాపుటయు, దేవతాసంకోచంబు = దేవతలనణఁచుటయు, వేద...సంక్షేపముఁ = వేదశాస్త్రమార్గములు పాడుచేయుటయు, చాలఁ = మిగుల, ఏపంగఁ = ఏపైపునను, నిశాచరుండు = రాక్షసుఁడు, దుస్సహతపోవ్యాప్తి = ఇతరులకోర్వరాని తపస్సుయొక్క వ్యాపారమును, చిత్తంబులోఁ = మనమున, సంకల్పించెఁ = తలపెట్టెను, ప్రతిసంహారంబు = దానినిశమింపఁజేయునుపాయమును, చింతింపవే = యోచింపుమా.

తా. దేవా! మూఁడు లోకములను నాశనము జేతును. దేవతలను రూపుమాపుదును. ఎచ్చటను వేదశాస్త్రముల పేరు వినఁబడకుండఁజేసెదను. అనియీతపస్సునకుఁ బూనినాఁడు. వాఁడంతయుఁజేయ నున్నాఁడు. ఇందుల కేయనుమానము లేదు. దీని కేమైనఁ బదులుసేఁత యోజింపుము.

శా. నీ వేరీతిఁ దపోబలంబున జగన్నిర్మాణముం జేసి యీ
దేవాధీశులకంటె నెక్కువసిరిం దీపించి తిబ్భంగిఁ దా
నీవిశ్వంబు తపస్సమాధిమహిమన్ హింసించి వేఱొక్కవి
శ్వావిర్భావకరత్వశక్తి మదిలో నర్థించినాఁ డీశ్వరా. 77

టీ. ఈశ్వరా = దేవా! ఏరీతిఁ = ఏవిధముగా, తపోబలంబునన్ = తపముకలిమిచేత, జగన్నిర్మాణముఁ = లోకములసృష్టిని, దేవాధీశులు = దేవతల యధిపతులు, ఎక్కుడుసిరిఁ = మించినయైశ్వర్యముతో, దీపించితి = ప్రకాశించితివో, ఇబ్భంగిఁ = ఈలాగుననే, తాను = హిరణ్యకశిపుఁడు, ఈవిశ్వంబు = ఈప్రపంచము, తపస్సమాధిమహిమన్ = తపోనియమముయొక్క బలముచేత, వేఱొక్క...శక్తి = మఱియొకప్రపంచమును బుట్టించుసామర్థ్యమును, అర్థించినాఁడు = కోరియున్నాఁడు.

తా. స్వామీ! ఈహిరణ్యకశిపుఁడు నీవు తపోబలమున నెట్లు దేవతలనందఱిని మించి లోకములను సృజించితివో అలాగున ఇప్పుడున్న

ప్రపంచమును హతముచేసి తానొకక్రొత్తప్రపంచమును నిర్మింపఁగోరి, ఈ తపస్సు ప్రారంభించినాఁడు.

వ. అదియునుం గాక కాలాత్ము లగుజీవాత్ముల కనిత్యత్వంబు గలుగుటం జేసి తపోయోగసమాధిబలంబునఁ దనకు నిత్యత్వంబు సంపాదించు నని తలంచినాఁ డని మఱియు నిట్లనిరి.

టీ. కాలాత్ములు=కాలస్వరూపులు, జీవాత్ములకున్=జీవులకు నాత్మకును, అనిత్యత్వంబు=స్థిరము కాకుండుట, తపో...బలంబునన్=తపస్సు యోగము సమాధి వీనిబలమున, నిత్యత్వంబు=శాశ్వతత్వము, సంపాదింతున్=సాధించెదను.

మ. భవదీయం బగునున్నతోన్నతమహాబ్రహ్మైకపీఠంబు సం
స్తవనీయంబగుభూతియు న్విభవము న్సౌఖ్యంబు సంతోషము
న్భువనశ్రేణికి నిచ్చి దైత్యునితపస్స్ఫూర్తి న్నివారించి యో
భువనాధీశ్వర కావనే భువనముల్ పూర్ణప్రసాదంబునన్.

టీ. ఓ భువనాధీశ్వర = లోకరక్షకుఁడగునోదేవా! భవదీయంబు =నీది, ఉన్నతో...తంబు=అన్నిటికంటె గొప్పదగు సాటిలేని నీ సింహాసనమును, సంస్తవనీయంబు=కొనియాడఁదగినది, భూతి = సంపద, విభవము=ఐశ్వర్యము; సౌఖ్యము=సుఖము, భువనశ్రేణికిన్ = లోకములకొఱకుగా, ఇచ్చి = వానికిచ్చి, దైత్యునితపస్స్ఫూర్తిన్ = రాక్షసుని తపస్సు యొక్క ఉద్రేకమును, నివారించి=మానిపి, పూర్ణప్రసాదంబునన్ =నిండు కరుణచే, భువనముల్, కావవే=కాపాడుమా.

తా. లోకనాయకుఁ డగునోదేవా! లోకక్షేమము గోరితివేని, అత్యున్నతమైన నీపీఠముగాని, నీసంపదగాని, ఐశ్వర్యముగాని, సౌఖ్యము, సంతోషము, వాఁ డేది గోరిన దానినెల్ల లోకములకుగా నిచ్చి వానితపము మాన్పి లోకములను గాపాడుము.

వ. అని దేవతలు విన్నవించిన స్వయంభూతుండును భగవంతుం
డు నైన నలుమొగంబులవేల్పుప్రోడ భృగుదక్షాదులతో
డ మందరపర్వతంబునకు వచ్చి యందు నియమయుక్తుండును
పిపీలికావృతమేదోమాంసచర్మరక్తుండును వల్మీకతృణవేణు
పటలపరిచ్ఛన్నుండును మహాతపఃప్రభావసంపన్నుండును
నై నీరంధ్రనిబిడనీరదనికరనివిష్టనీరజబంధుండునుంబోలె నివ
సించియున్న నిర్జరారాతిం జూచి వెఱఁగుపడి నగుచు ని
ట్లనియె. 80

టీ. విన్నవించినన్=మనవిచేయఁగా, స్వయంభూతుండు=తనంతనే పుట్టినవాఁడు, భగవంతుఁడు=షడ్గుణైశ్వర్యములు గలవాఁడు, నలుమొగంబులవేల్పులప్రోడ=నాలుగు మోములుగల దేవతలదొర, బ్రహ్మ, నియమయుక్తుండు = తపోనియమములతోఁ గూడినవాఁడు, పిపీలికా...రక్తుండును=చీమలుపట్టిన మెదడు మాంసము తోలు నెత్తురు గలవాఁడు, వల్మీక...చ్ఛన్నుండు = పుట్టలు గడ్డి దుబ్బులు వెదురుగుమ్ములు వీనిచే నిండినవాఁడు, మహా...న్నుండు=గొప్ప తపోమహిమ గలవాఁడు, నీరంధ్ర...ధుండునుంబోలె=తెఱపిలేక మూఁగిన మబ్బులలోనున్న సూర్యునివలె, నిర్జరారాతి=దేవతలదాయ, వెఱఁగుపడి=నివ్వెఱఁగంది.

మత్తకోకిల. ఓసురారికులేంద్ర నీక్రియ నుగ్రమైనతపంబు మున్
జేసి చూపినవారు లే రిఁకఁ జేయువారును లేరు నే
నీసమాధికి మెచ్చితిన్ విను నీయభీష్టము లిత్తు నా
యాస మేటికి లెమ్ము వేగ మహాత్మ కోరుము కోరికల్. 81

టీ. ఓ సురారికులేంద్ర=ఓ రాక్షససంఘములరాజా! నీ క్రియన్=నీవలె, ఉగ్రము=భీతిగొలుపునది; మున్=ఇంతకుఁబూర్వము, ఇఁకన్=నీ వెనుక, నీసమాధికిన్=నీ నియమమునకు, అభీష్టములు=కోరికలు, ఆయాసము=శ్రమ, మహాత్మ=చెప్పశక్తిగలవాఁడా, కోరికల్, కోరుము.

తా. ఓ రాక్షసరాజా! నీవలె నిట్లింతకుమున్ను లోకభయంకర మైనతపస్సు చేసినవారు లేరు. ఇఁక ముం దుండఁబోరు. నేను నీతపో నియమమునకు నానందించితిని. నీ కోరిక లెల్లనిత్తు లేచిరమ్ము. ఓఘనుఁడా ఏల యింకను బడలెదవు. వచ్చి యిష్టములఁ గోరుకొనుము.

శా. దంశవ్రాతములు న్పిపీలికలు మేదఃక్రవ్యరక్తంబుల
నంశీర్ణంబులు చేసి పట్టి తినఁగా శల్యావశిష్టుండ వై
వంశచ్ఛన్నతృణావలీయుతమహావల్మీకమం దింద్రియ
భ్రంశం బింతయు లేక నీకు నిలువం బ్రాణంబు లెట్లుండెనో.

టీ. దంశవ్రాతములున్ = దోమలగుంపులును, పిపీలికలు = చీమలును, మేదఃక్రవ్యరక్తంబులన్ = మెదడును రక్తము కండలును, పట్టి = తివిచి, తినఁగాన్, శల్యావశిష్టుండవు = ఎముకలుమాత్రము మిగిలినవాఁడవు, వంశ... మందున్ = వెదుళ్లు గడ్డి మొలచిన పెద్దపుట్టలో, ఇంద్రియభ్రంశంబు = ఇంద్రియచలనము, ఇంతయున్ = కొంచెమును.

తా. రాక్షసా! ఇట్లు దోమలు చీమలు నెత్తురు కండలుఁ బీఁకికొని తినఁగా నెముకలు మిగిలి వెదుళ్లు గడ్డి మొలచినపుట్టనడుమ నింద్రియములను బిగఁబట్టి నీ వెట్లింతకాలము బ్రతికియుంటివో చిత్రముగా నున్నది.

ఉ. ఉత్సుకతన్ జలాన్నములఁ నొల్లక యీ క్రియ నూఱుదివ్యసం
వత్సరముల్ శరీరమున వాయువులు న్నిలుపంగ వచ్చునే
యుత్సవమయ్యె మాకు మము నుగ్రతపంబున గెల్చితీవు నే
వత్సలత న్నినుం గదియ వచ్చితిఁ గోరిక లెల్ల నిచ్చెదన్. 83

టీ. ఉత్సుకతన్ = మక్కువతో, జలాన్నములన్ = అన్నోదకము లను, ఒల్లక = కోరక, ఈ క్రియన్ = ఇట్లు, నూఱుదివ్యసంవత్సరముల్ = నూఱుదివ్యవర్షములు, మాకున్, ఉత్సవము = సంతోషము, ఉగ్రతపంబునన్ = భయంకరతపమువలన, వత్సలతన్ = ప్రేమతో, కదియన్ = చేరఁగా.

తా. నిశాచరేంద్రా! తపముమూట నటు బెట్టుము. అన్నము నీళ్లు లేక నూఱేండ్లు ఇట్లు ప్రాణవాయువులనైన నిలుప వశమా! నీచరిత్రముఁజూడ మా కత్యంత సంతోషము గలిగించెను. తపస్సుచే నీవు మమ్ము గెల్చినావు. నే నత్యంతప్రేమతో నిన్ను జూడవచ్చితిని. నీ కోరినదెల్ల నిచ్చెదను. లెమ్ము.

వ. అని పలికి వనముష్టికాపిపీలికాభక్షితంబై నరక్షోవిభునిదేహంబుమీఁదం గమండలుజలంబులు ప్రోక్షించిన నద్దానవేంద్రుఁడు కమలాసనకరకమలకమనీయకనకమయదివ్యామోఘకమండలునిర్గతనిర్మలనీరధారాబిందుసందోహాసంసిక్తసకలాంగుండై తపంబు చాలించి సాంద్రకీచకసంఘాతసంఛాదితవామలూరుమధ్యంబు వెలువడి మహాప్రభావబలసౌందర్యతారుణ్యసహితుండును వజ్రసంకాశదేహుండును దప్తసువర్ణవర్ణుండును నై నీరసేంధననికరనిర్గతవహ్నియుంబోలె వెలుంగుచుం జనుదెంచి. 84

టీ. వన...తంబు=అడవియీఁగెలచేతను గండుచీమలచేతను పీఁకితినఁబడినది, రక్షోవిభునిదేహంబుమీఁదన్=హిరణ్యకశిపునియొడలిమీఁద, కమండలు జలంబులు=కుండికలోనినీళ్లు, ప్రోక్షించినన్=చల్లఁగా, దానవేంద్రుఁడు=హిరణ్యకశిపుఁడు, కమలాసన...గుండై=బ్రహ్మచేతిలో నందమైన బంగారుకమండలువునందుండి యెత్తి చల్లఁబడిన పావనములైన నీటిధారల బొట్లచేఁ దడిసిన యొల్లశరీరముగలవాఁడై, సాంద్ర...మధ్యంబు=దట్టంపువెదురుటడవిచేఁ గప్పఁబడిన పుట్టనడుమనుండి, మహా...సహితుండు=గొప్పమహిమ బలము అందము ప్రాయము వీనితోఁగూడినవాఁడు, వజ్ర...హుండు=వజ్రమువంటిశరీరముగలవాఁడు, తప్త...ర్ణుండు=పుటము పెట్టిన బంగరువంటి మేనిరంగు గలవాఁడు, నీర...వహ్ని=ఎండినకట్టెలోనుండి వెలువడునిప్పు, వెలుంగుచున్=ప్రకాశించుచు, చనుదెంచి=వచ్చి.

మ. దివిజానీకవిరోధి మ్రొక్కెఁ గని వాగ్దేవీమనోనేతకున్
సవిశేషోత్సవసంవిధాతకు నమత్సంత్రాతకున్ సత్తపో
నివహాభీష్టవరప్రదాతకు జగన్నిర్మాతకున్ ధాతకున్
వివిధప్రాణిలలాటలేఖనమహావిద్యానుసంధాతకున్. 85

టీ. దివిజానీకవిరోధి=దేవతాసైన్యములశత్రువు, వాగ్దేవీమనోనేత=సరస్వతికి ప్రాణేశ్వరుఁడు, సవి...ధాత = అతిశయమైనయానందమునిచ్చువాఁడు, నమత్సంత్రాత = మ్రొక్కువారిం గాపాడువాఁడు, సత్తపో... దాతకున్=మంచి తపస్సులు జేసినవారికి కోరికలనిచ్చువాఁడు, జగన్నిర్మాత=లోకములఁ బుట్టించువాఁడు, వివిధ...ధాత=సమస్తజంతువుల తలవ్రాఁతల వ్రాయువిద్యలో గట్టివాఁడు, ధాతకున్=బ్రహ్మకు.

తా. సరస్వతికి భర్తయు, ఆనందము నిచ్చువాఁడును, మ్రొక్కిన వారినిఁ గాదనక రక్షించువాఁడును, మంచితపస్సుజేసినచో మెచ్చినవరము లిచ్చువాఁడును, లోకములఁ బుట్టించినవాఁడును, జంతువుల నొసలవ్రాఁతల వ్రాయుపని గలవాఁడు నగు బ్రహ్మకు నమస్కరించెను.

వ. ఇట్లు దైత్యేశ్వరుండు దివి నున్న హంసవాహనునకు ధరణీత
లంబున దండప్రణామంబు లాచరించి సంతోషబాష్పసలిల
సంవర్ధితపులకాంకురుం డై యంజలి సేసి కంజగర్భునిమీఁద
దృష్టి యిడి గద్గదస్వరంబున నిట్లని వినుతించె. 86

టీ. దైత్యేశ్వరుండు = రాక్షసులదొర, దివిన్ = ఆకాశమందు, హంసవాహనునకున్=బ్రహ్మకు, ధరణీతలంబునన్ = భూమిమీఁద, దండప్రణామంబులు=కఱ్ఱవలె సాగిమ్రొక్కుటలను, ఆచరించి=చేసి, సంతోష... కురుండు = ఆనందమువలనఁ బుట్టిన కన్నీళ్లచేఁ బెరిఁగిన గగుర్పాటులు గలవాఁడు, అంజలి=దోసిలి, కంజగర్భుఁడు=బ్రహ్మ, దృష్టి = చూపు, గద్గదస్వరంబునన్=డగ్గుత్తికతో, వినుతించెన్=స్తోత్రముచేసెను.

సీ. కల్పాంతమున నంధకారసంవృత మైన
జగము నెవ్వఁడు దనసంప్రకాశ
మున వెలిఁగించుచు మూఁడుభంగుల రజ
స్సత్త్వతమోగుణసహితుఁ డగుచుఁ
గల్పించు రక్షించుఁ గడపటఁ బ్రహరించు
నెవ్వఁ డాద్యుఁడు సర్వహేతు వగుచు
శోభితుం డై స్వయంజ్యోతిర్మయ మొక్కట
విలసిల్లు నెవ్వఁడు విభుత మెఱసి
ఆ. సమయ మయిన మానసప్రాణబుద్ధీంద్రి
యములతోడ నెవ్వఁ డలఘుమహిమ
నడరు నట్టిసచ్చిదానందమయునకు
మహితభక్తి నే నమస్కరింతు. ౩౭

టీ. కల్పాంతమునన్ = ప్రళయమునందు, అంధకారసంవృతము = చీఁకటి గ్రమ్మినది, సంప్రకాశము = వెలుతురు, మూఁడుభంగులన్ = మూఁడు ప్రకారములచేత, రజ...సహితుఁడు = రజస్సు సత్త్వము తమోగుణము వీనితోఁగూడినవాఁడు, కల్పించున్ = పుట్టించును, ప్రహరించున్ = చంపును, ఆద్యుఁడు = మొదటివాఁడు, సర్వహేతువు = అన్నిటికిఁ గారణభూతుఁడు, శోభితుండు = ప్రకాశించువాఁడు, స్వయంజ్యోతి = తనకుఁదా వెలుంగునది, ఒక్కటన్ = ఏకముగా, విలసిల్లున్ = ప్రకాశించును, విభుత = శీవి, మానస...ములు = మనస్సు ప్రాణములు బుద్ధి ఇంద్రియములు, అలఘుమహిమన్ = గొప్ప సామర్థ్యములో, అడరున్ = విజృంభించునో, సచ్చిదానందమయుఁడు = త్రికాలాబాధ్యుఁడు, జ్ఞానరూపుఁడు, ఆనందరూపుఁడునైన, మహితభక్తిన్ = పూజ్యమైనభక్తితో, ఏను, నమస్కరింతున్ = మ్రొక్కెదను.

శా. ఎవఁడు ప్రళయకాలమునఁ జీఁకటిఁ గ్రమ్మినలోకమును తన వెలుం
గున వెలింగించునో, ఎవఁడు మూఁడగు రజస్సత్త్వతమోగుణములచే లోక
ములను పుట్టించి, పెంచి, నశింపఁజేయుచుండునో, ఎవఁ డన్నిటికి మొద
లగు మూలకారణమో, ఎవఁడు తనకుఁ దా వెలుంగుచు కేవలుఁ డై యుండు
నో, ఎవఁడు కాలముచొప్పున మానస ప్రాణ బుద్ధీంద్రియములు గలవాఁ
డుగాఁ దోఁచునో, మహామహిమతోడ నెవ్వరికిని గోచరముగాక మెలఁగు
నాసచ్చిదానందరూపునకు నే మ్రొక్కెదను.

వ. దేవా నీవు ముఖ్యప్రాణం బగుటం జేసి ప్రజాపతివి మనో
బుద్ధి చిత్తేంద్రియంబులకు నధీశ్వరుండవు మహాభూతగణంబు
లకు నాధారభూతుండవు త్రయీతనువునం గ్రతువులు విస్త
రింతువు సకలవిద్యలు నీతనువు సర్వార్థసాధకులకు సాధనీ
యుండ వాత్మనిష్ఠాగరిష్ఠులకు ధ్యేయం బగునాత్మవు కాల
మయుండవై జనులకు నాయుర్నాశంబు సేయుదువు జ్ఞాన
విజ్ఞానమూర్తి వాద్యంతరహితుండ వంతరాత్మవు మూఁడు
మూర్తులకు మూలం బగుపరమాత్మవు జీవలోకంబునకు జీ
వాత్మవు సర్వంబును నీవ నీవు గానిది లేశంబును లేదు వ్య
క్తుండవు గాక పరమాత్మ వై పురాణపురుషుఁడ వై యనం
తుండ వై ననీవు ప్రాణేంద్రియమనోబుద్ధిగుణంబుల నంగీకరిం
చి పరమేష్ఠిపదవిశేషంబున నిలిచి స్థూలశరీరంబునం జేసి
యింతయుం బ్రపంచింతువు భగవంతుండ వైననీకు మ్రొక్కె
ద నని మఱియు ని ట్లనియె. 88

టీ. ముఖ్యప్రాణఁడు = సూత్రాత్మ, ప్రజాపతి = ప్రజలకు జననహే
తువు, అధీశ్వరుండవు = ప్రభువవు, మహాభూతగణంబులకున్ = గొప్పభూతరా
సులకు, ఆధారభూతుండవు = ఆధారమైనవాఁడవు, త్రయీతనువునన్ = వేద

ంద్రియ మనశ్శరీరములతో, క్రతువులు=యజ్ఞములు, విస్తరింతువు=ప్రబలఁజేయుదువు, సర్వార్థసాధకుఁ=అన్ని పనులు చక్కఁబెట్టుకొనువారికి, సాధనీయుండవు = ఆశ్రయింపఁదగినవాఁడవు, ఆత్మనిష్ఠాగరిష్ఠులకుఁ = బ్రహ్మనిష్ఠయందుఁ గుదిరిక గలవారలకు, ధ్యేయము = ధ్యానింపఁదగినది, అగునాత్మవు=ఐన యాత్మవు, కాలముగాయుండవు = కాలస్వరూపివి, ఆయుర్నాశంబు=జీవితకాలముయొక్క హారణము, జ్ఞానవిజ్ఞానమూర్తివి, ఆద్యంతరహితుండవు=మొదలు తుద లేనివాఁడవు, అంతరాత్మవు = లోపలిచైతన్యమవు, లేశంబు=కొంచెము, వ్యక్తుండవు = తెలిసికోఁదగువాఁడవు, పురాణపురుషుండవు=ఆదిమూర్తివి, అనంతుఁడవు=అంతము లేనివాఁడవు, ప్రాణేంద్రియమనోబుద్ధి గుణంబులఁ, అంగీకరించి=ఒప్పుకొని, పరమేష్ఠి పదవిశేషంబునఁ=పరాత్పరుఁడను పేరుతోడ, స్థూలశరీరము = బాహ్యదేహము, ప్రపంచింతువు=విస్తరింతువు.

క. కోరినవారలకోర్కులు
నేరుపుతో నిచ్చి మనుప నీక్రియ నన్యుల్
నేరరు కరుణాకర నేఁ
గోరెద నీ విచ్చెదేనిఁ గోరిక లభవా. 89

టీ. కోరినవారలకోర్కులు, ఇచ్చి, మనుపఁ = సంరక్షించుటకొఱకు, నీక్రియఁ = నీవలె, అన్యుల్ = ఇతరులు, కరుణాకర=దయకుఁబుట్టినచోటైనవాఁడా, అభవా=పుట్టుకలేనివాఁడా.

తా. దేవా! కోరినవారికి కోరినవెల్ల నిచ్చుటలో నీకు సరియగువారు లేరు. నీవు నే నడిగినదెల్ల నిచ్చెదవేని నేఁ గోరికొందును.

శా. గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిఁ దిక్కులఁ
రేలఁ ఘస్రములం దమఃప్రబలభూరిగ్రాహరక్షోమృగ
వ్యాళాదిత్యనరాదిజంతుకలహావ్యాప్తిఁ సమస్తాస్త్రశ
స్త్రాళిఁ మృత్యువు లేనిజీవనము లోకాధీశ యిప్పింపవే. 90

టీ. లోకాధీశ=జగత్ప్రభూ, కుంభినిన్ = భూమియందు, అంబువులన్ = నీళ్లలో, ఆకాశస్థలిన్ = ఆకాశముమీఁద, రేలన్ = రాత్రులయందును, ఘస్రములన్ = పగళ్లయందు, తమః...వ్యాప్తిన్ = చీఁకటియందును, గొప్పగొప్పజలజంతువులు, రాక్షసులును, క్రూరమృగములు, పాములు, దేవతలు, మానవులు మొదలగువారితోడి పోరాటము సంభవించినప్పుడును, సమస్తాస్త్రశస్త్రాళిన్=అన్నివిధములగుఅస్త్రశస్త్రములచేతను, మృత్యువులేనిజీవనము=చావులేనిబ్రతుకు, ఇప్పింపవే.

తా. దేవా! గాలియందు, నేలయందు, నిప్పులలోను, నీళ్లలోను, ఆకాశమందు, దిక్కులయందు, రాత్రులయందు, పగళ్లయందు, చీఁకటియందు, జలజంతువులు, రక్కసులు, క్రూరజంతువులు, పాములు, దేవతలు, మనుష్యులు, మొదలగుజంతువులతోడి యుద్ధమందును, అన్నివిధముల అస్త్రశస్త్రములవలనను గూడ చావకుండ బ్రదుకునట్లనుగ్రహింపుము.

వ. అని మఱియు రణంబులందుఁ దన కెదురు లేనిశౌర్యంబును లోకపాలుర నతిక్రమించుమహిమయును భువనత్రయజయంబును హిరణ్యకశిపుండు గోరిన నతని తపంబునకు సంతోషించి దుర్లభంబు లయినవరంబు లన్నియు నిచ్చి కరుణించి విరించి యి ట్లనియె. 91

టీ. రణంబులు=యుద్ధములు, తనకు, మహిమ=సామర్థ్యము, భువనత్రయజయంబును=ముల్లోకముల విజయమున్ను, దుర్లభంబులు=పొందశక్యముకానివి, కరుణించి=దయచేసి, విరించి=బ్రహ్మ

శా. అన్నా కశ్యపపుత్త్ర దుర్లభము లీయర్థంబు లెవ్వారికిన్
మున్నెవ్వారలుఁ గోర రీవరములన్ మోదించితిన్ నీయెడన్
నన్నుం గోరిన వెల్ల నిచ్చితిఁ బ్రవీణత్వంబుతో బుద్ధిసం
పన్నత్వంబున నుండుమీ సుమతివై భద్రైకశీలుండవై. 92

టీ. అన్నా=వత్సా! కశ్యపపుత్త్ర=కశ్యపునికొడుకగుహిరణ్యకశిపూ, ఈయర్థంబులు=నీవుకోరిన యీకోర్కులు, ఎవ్వారికిన్ = ఎవరికైనను, దుర్లభములు=పొందరానివి, మున్ను=పూర్వము, మోదించితిన్ = సంతసించితిని, ప్రవీణత్వంబుతోన్=నేరుపుతో, బుద్ధిసంపన్నత్వంబునన్ = జ్ఞానముకలిమితో, సుమతివి = మంచిబుద్ధిగలవాఁడవు, భద్రైకశీలుండవు = శుభస్వభావము గలవాఁడవు

తా. నాయనా! హిరణ్యకశిపూ, నీవు నన్నడిగినవెల్ల నెవరికిని దొరకవు. వీనినిదివఱకు ఎవరును గోరియుండరు. నీయెడఁగరుణించి యివన్నియు నిచ్చితిని. నేరుపుగలిగి, జ్ఞానవంతుఁడవై శుభమందే దృష్టిగలిగి ప్రవర్తింపుము. పొమ్ము.

వ. అని యిట్లమోఘంబు లయినవరంబు లిచ్చి దితినందనుచేతం
బూజితుండై యరవిందసంభవుండు బృందారకసందోహావం
ద్యమానుం డగుచు నిజమందిరంబునకుం జనియె నివ్విధమ్ము
న నిలింపారాతి వరపరంపరలు సంపాదించుకొని. 93

టీ. అమోఘంబులు=సఫలములైనవి, దితినందనుచేతన్ = హిరణ్యకశిపునిచేత, అరవిందసంభవుండు=తామరలోఁ బుట్టినవాఁడు, బ్రహ్మ, బృందారక...నుండు = దేవతలగుంపులచే మ్రొక్కఁబడినవాఁడు, నిజమందిరంబు=తనయిల్లు, నిలింపారాతి = దేవతలకు పగతుఁడు, వరపరంపరలు=వరముల సమూహములు.

క. సోదరుఁ జంపినపగ కై
యాదర మించుకయు లేక యసురేంద్రుఁడు కం
జోదరుపై వైరము దు
ర్మాదరతుం డగుచుఁ జేసె మనుజాధీశా. 94

టీ. మనుజాధీశా = రాజా! అసురేంద్రుఁడు = హిరణ్యకశిపుఁడు, సోదరున్=తమ్ముని, ఆదరము=భక్తి, ఇంచుకయున్ = కొంచెమున్ను, కంజోదరుపైన్=విష్ణువుమీఁద, దుర్మాదరతుండు=చెడ్డమదముగలవాఁడు.

తా. రాజా! ఇట్లు హిరణ్యకశిపుఁడు క్రొవ్వి తనతమ్ముని జంపినాఁడని సిరిమారి విష్ణునిమీఁద విసువనిపగను బూనెను.

సీ. ఒకనాఁడు గంధర్వయూథంబుఁ బరిమార్చు
దివిజుల నొకనాఁడు తెరలఁ దోలు
భుజగుల నొకనాఁడు భోగంబులకుఁ బాపు
గ్రహముల నొకనాఁడు గట్టివైచు
నొకనాఁడు యక్షుల నుగ్రత దండించు
నొకనాఁడు విహగుల నొడిసిపట్టు
నొకనాఁడు సిద్ధుల నోడించి బంధించు
మనుజుల నొకనాఁడు మద మడంచుఁ
తే. గడిమి నొకనాఁడు కిన్నర ఖచర సాధ్య
చారణ ప్రేత భూత పిశాచ వన్య
సత్త్వ విద్యాధరాదుల సంహరించు
దితితనూజుండు దుస్సహతేజుఁ డగుచు. 95

టీ. దితితనూజుండు=హిరణ్యకశిపుఁడు, దుస్సహతేజుఁడు=సైఁపరాని విక్రమముగలవాఁడు, గంధర్వయూథంబున్ = గంధర్వుల సమూహము ను, పరిమార్చున్ = చంపును, దివిజులన్ = దేవతలను, తెరలన్ తోలున్=చెదరిపోవునట్లు తఱుమును. భుజగులన్=నాగలోకవాసులను, గ్రహములన్ = సూర్యుఁడు మొదలగు గ్రహములను, ఉగ్రతన్ = క్రౌర్య ముతో, విహగులన్ = పక్షులను, కడిమిన్=ధైర్యముతో, కిన్నర = అశ్వ ముఖులు, ఖచర=గగనచరులు, సాధ్యులు, చారణులు, వన్యసత్త్వ=అడవి జంతువులు.

తా. ఇట్లు రాక్షసుఁడు తేఱిచూడరాని విక్రమముగలవాఁడై ఒకనాఁడు గంధర్వులను జావఁగొట్టును. ఇంకొకనాఁడు దేవతలఁ దఱుమును.

ఒకప్పుడు నాగుల నిడుమగుడుపును. ఒకవేళ నవగ్రహములఁ గట్టివేయును. ఒకసమయమున యక్షులను తీవ్రముగా బాధించును. ఒకప్పుడు పక్షులఁ బోనీయక పట్టుకొనును. ఒకనాఁడు సిద్ధులను గెలిచి చెఱఁబెట్టును. ఒకనాఁడు మనుజులను భయపెట్టును. ఒక్కొకనాఁడు కిన్నరులు ఖేచరులు చారణులు భూత ప్రేత పిశాచములు అడవిమృగములు విద్యాధరులు వీరినిఁ జావ మోఁదుచుండును.

క. అట్టళ్ళతోడఁ గోటలఁ
గట్టలుకం గూలఁద్రోచి క్రవ్యాదులతోఁ
జుట్టు విడిసి దిక్పాలుర
పట్టణములు గొనియె నతఁడు బలమున నధిపా. 96

టీ. అధిపా=రాజా! కోటలన్, అట్టళ్లతోడన్ = బురుజులతోఁ గూడ, కట్టలుకన్=నిండుకోపముతో, క్రవ్యాదులతోన్=రాక్షసులతోఁ గూడ, విడిసి=నిలచి, బలమునన్=లావుతో.

తా. రాజా! ఇట్లు హిరణ్యకశిపుఁడు ఎక్కువచలముతో రాక్షసుల వెంటఁదీసికొని, దిక్పాలుర పట్టణములమీఁద నెత్తివచ్చి, కోటలను బురుజులను నేలఁగలిపి, వానిని లాగికొనియెను.

క. కృశులై సంప్రాపితదు
ర్దశులై సర్వంకషోగ్రదైతేయాజ్ఞా
వశులై నిశలును దివములు
దిశలెల్లను గట్టువడియె దీనత ననఘా. 97

టీ. అనఘా=పాపములేనివాఁడా! కృశులై=కృశించినవారై, సంప్రాపితదుర్దశులై=పొందింపఁబడిన హీనదశగలవారై, సర్వం...వశులై = ఎల్లెడ నిండిన రాక్షసుల యుత్తరువులకులోనై, నిశలును దివములున్ = రాత్రింబవళ్లు, దీనతన్=బీదతనముతో, కట్టువడియెన్.

తా. రాజా! దిక్కులన్నియు కృశించి కోఁతఁబట్టి ఎక్కడఁజూచినను రాక్షసులచే నిండి రాత్రియనక పగలనక వారిచేఁతలకు లోనై చాల హీనస్థితిలో నుండెను.

వ. మఱియు నద్దానవేంద్రుండు విద్రుమసోపానంబులును మరకతమణిమయ ప్రదేశంబులును వైడూర్యరత్న స్తంభ సముదయంబులును జంద్రికాసన్నిభస్ఫటిక సంఘటిత కుడ్యంబులును బద్మరాగపీఠకనకకవాటగేహాళీవిటంక వాతాయనంబులును విలంబమానముక్తాఫలదామవితానశోభితధవళపర్యంకంబులును వివిధ విచిత్రవిమానంబులును నిరంతరసురభికుసుమ ఫలభరితపాదప మహోద్యానంబులును హేమారవిందసౌగంధికబంధురసరోవరంబులును రమణీయరత్నప్రాసాదవిశేషంబులును మనోహరపరిమళశీతలమందమారుతంబులును మృదుమధురనినదకీరకోకిలకులకోలాహలంబులును గలిగి విశ్వకర్మనిర్మితం బై త్రైలోక్యరాజ్యలక్ష్మీశోభితం బైన మహేంద్రభవనంబు సొచ్చి. 98

టీ. విద్రుమసోపానంబులు = పగడపు మెట్లు, మర...దేశంబులు = మరకతమణులతోఁ గట్టిన చోటులును, వైడూర్య...యంబులు = వైడూర్యముల కంబముల బారులు, చంద్రికా...కుడ్యంబులు = వెన్నెలవంటి స్ఫటికములచేఁగట్టిన గోడలు, పద్మరాగ...నంబులు = పద్మరాగపుఁ బీఁటలు బంగారు తలుపులు దర్వాజాలును చూరుపట్టెలును కిటికీలును, విలంబ...పర్యంకంబులును = వ్రేలాడుచున్న ముత్తెపుసరులచాందినీలచే నొప్పు తెల్లని పఱుపులును, వివిధ...నంబులు = నానావిధము లై చిత్రము లైన ఆకాశయానములును, నిరంతర...నంబులు = సందులేక గుమగుములాడు పూవులు పండ్లచే నిండిన చెట్లుగల పెద్దపెద్ద తోఁటలును, హేమా...వరంబులు = బంగారుకమలములు నిండిన కొలంకులు, రమణీయ...షంబులు = అందమైన రతనంపు మేడలు, మనోహ

ర...తంబులు = ఇంపైన సువాసనగలిగి చల్లనై మెల్లనైన గాడ్పులును, మృదు...లంబులు = తిన్ననై తీయనైన పలుకులుగల చిలుకలయొక్కయు కోకిలలయొక్కయు గుంపుల కేకలును, విశ్వకర్మ నిర్మితంబు = దేవశిల్పిచేఁ జేయఁబడినది, త్రైలోక్య...తంబు=ముల్లోకముల రాజ్యలక్ష్మిచే నొప్పియున్నది, మహేంద్రభవనంబు=దేవేంద్రుని సౌధము.

మ. దితిపుత్రుండు జగత్త్రయైకవిభుఁడై దేవేంద్రసింహాసనో
ద్ధతుఁడై యుండ హరాచ్యుతాంబుజభవుల్ దప్పంగ భీతిఁ సమా
గతులై తక్కిన యక్షకిన్నరసురుద్గంధర్వసిద్ధాదు లా
నతులై కానిక లిచ్చి కొల్తు రతనిఁ నానాప్రకారంబులన్. 99

టీ. జగత్త్రయైకవిభుఁడై = ముల్లోకములకుఁ దానొక్కఁడేరాజై, దేవేంద్ర...ద్ధతుఁడై=ఇంద్రునిపీఠమెక్కి గర్వించినవాఁడై, హరా..భవుల్ =శివకేశవ హిరణ్యగర్భులు, తక్కిన = మిగిలిన, యక్ష...సిద్ధాదులు = యక్షులు కిన్నరులు దేవతలు గంధర్వులు సిద్ధులు మొదలగువారు, ఆనతులు=నమ్రులు, కానికలు=నజరులు, నానాప్రకారంబులన్ = పలువిధములు, కొల్తురు=సేవింతురు.

తా. ఇట్లు హిరణ్యకశిపుఁడు ముల్లోకములకుఁ దానొక్కఁడే రాజై, ఇంద్రపీఠమెక్కి క్రొవ్వియుండఁగా, బ్రహ్మవిష్ణురుద్రులు దప్ప మిగిలిన దేవతలు మొదలుగా నందఱును వానికి తమ నేరుపుకొలఁది కానిక లర్పించి సేవించుచుండిరి.

శా. ఏదిక్పాలురఁ జూచి నేఁ డలుగునో యేదేవు బంధించునో
యేదిగ్భాగముమీఁద దాడి చనునో యేప్రాణులం జంపునో
యీదైత్యేశ్వరుఁ డంచు నొండొరులు దారింద్రాదు లాస్థానభూ
వేదిన్ మెల్లన నిక్కి చూతురు భయావిర్భూతరోమాంచులై.

టీ. ఇంద్రాదులు ఆస్థానభూవేదిన్ = హిరణ్యకశిపుని సభామండపము నరుఁగుమీఁదనుండి, నేఁడు, దైత్యేశ్వరుఁడు=ఈ హిరణ్యకశిపుఁడు,

ఏదిక్పాలురఁ, అలుగునో = కోపించునో, ఏదేవుఁ, బంధించునో = కట్టునో, ఏదిగ్భాగము మీఁదఁ = ఏదిక్కుమీఁదికి, దాడిచనునో = దండు వెడలునో, ఏప్రాణులఁ = ఏజంతువులను, భయా ... మాంచులై = భయముచేఁ బుట్టిన గగుర్పాటు గలవారై, మెల్లనఁ = సద్దుచేయక, నిక్కి + చూతురో = ఉలికిచూతురో.

తా. ఇంద్రాదులు వాని కొలువులో నుండి ఈరోజు వీఁడు కోపించి ఏదిక్పాలురమీఁదికి లేచునో, ఏదేవుని చెఱఁబెట్టునో, ఏవంకకు దండు వెడలునో, వీనిచేతిలో నివ్వేళ నేజంతువులకు మూడినదో, అని సందడి కాకుండ నొకరిమొగ మొకరు చూచుకొందురు.

సీ. కోలాహలము మాని కొలువుఁడీ సురలార
తలఁగి దీవింపుఁడీ తపసులార
ఫణు లెత్తకుఁడు నిక్కి పన్నగేంద్రములార
ప్రణతులై చనుఁడీ దిక్పాలురార
గానంబు చేయుఁడీ గంధర్వవరులార
సందడిఁ బడకుఁడీ సాధ్యులార
యాడుఁడీ నృత్యంబు లప్సరోజనులార
చేరిక మ్రొక్కుఁడీ సిద్ధులార
తే. శుద్ధకర్పూరవాసిత సురభిమధుర
భవ్యనూతనమైరేయపానజనిత
సుఖవిలీనత నసురారి సొక్కినాఁడు
శాంతి లే దండ్రు నిచ్చలుఁ జారు లధిప. 101

టీ. అధిప = పరీక్షిన్మహారాజా! చారులు = హిరణ్యకశిపునియాస్థానములో మెలఁగువారు, నిచ్చలుఁ = ఎప్పుడును, అసురారి = హిరణ్యకశిపుఁడు, శుద్ధ...లీనతఁ = మేలైన పచ్చకర్పూరముచేఁ బరిమళించుచున్న సువాసనగల

తీయనిదగు మంచి క్రొత్తసారాయిని త్రాగినవారై పుచేత; సాక్షి—వాఁడు—హైమఱచియున్నాఁడు, శాంతి=నెమ్మది, లేదు. సురలార, కోలాహలము=అల్లరి, తపసులార=ఋషులారా, తలఁగి=దూరముగాఁబోయి, దీవింపుఁడీ=ఆశీర్వదించుఁడు, పన్నగేంద్రములార=పాములారా, నిక్కి = లేచి, ఫణులు=పడగలు, ప్రణతులై = వంగినవారై, చనుఁడీ = పొందు, చేరికన్=వెంబడి, గుంపుగూడి, మ్రొక్కుఁడీ.

తా. రాజా! వాని యాస్థానమందలి నౌకరులు ఎప్పుడు చూచినను మూరాజు కప్పురపుతావిగల మాఁగినతీపిగలమేలైనక్రొత్తకల్లుద్రాగి యానందముచే నొడలెఱుఁగకున్నాఁడు. నెమ్మదిలేదు. దేవతలారా సందడిలేక మీమీపనులు చూచుకొనుఁడు. ఋషులారా దూరముగా నిలిచి తిన్నఁగా నాశీర్వచనమంత్రములఁ జదువుఁడు. పాములారా పడగలెత్తవలదు. దిక్పాలకులారా వంగినడువుఁడు. గంధర్వులారా మీలో నిపుణులైనవారు చక్కఁగా పాడండి. సాధ్యులారా గందరగోళము సేయవలదు. అప్సరసలారా మీరు ఆడండి. సిద్ధులారా ఇట్లు దగ్గఱకు వచ్చి మ్రొక్కుఁడు. అని పలుకు చుందురు.

శా. లీలోద్యానలతానివాసములలో లీలావతీయుక్తుఁడై
హాలాపానవివర్ధమానమదలోలావృత్తతామ్రాక్షుఁడై
కేళిం దేలఁగ నేను దుంబురుఁడు సంగీతప్రసంగంబులన్
వాలాయంబుఁ గరంగఁ జేయుదుము దేవద్వేషి నుర్వీశ్వరా.

టీ. ఉర్వీశ్వరా=రాజా! నేనున్, తుంబురుఁడున్, దేవద్వేషిన్=హిరణ్యకశిపుని, లీలో ..ములలోన్ = శృంగారపుఁదోఁటలయందలి తీఁగచప్పరములయందు, లీలావతీయుక్తుఁడై =భార్యయగులీలావతితోఁగూడినవాఁడై, హాలా...క్షుఁడై=కల్లుద్రాగుటచేమదమెక్కి గుండ్రములైయెఱ్ఱఁబాఱిన గ్రుడ్లుత్రిప్పుచు, కేళిన్ తేలఁగన్=విహరింపఁగా, సంగీతప్రసంగంబులన్=సంగీతపుఁజదురులతో, వాలాయంబున్=ఎల్లప్పుడు, కరంగన్=సంతసించునట్లు, చేయుదుము.

తా. రాజా! వాఁడు విహారవనములో ౘెండ్లముతోఁగూడి, కల్లు ద్రాగి గ్రుడ్లెఱ్ఱఁగాఁ జేసికొని త్రిప్పుచు క్రీడించుచుండఁగాఁ, దుంబురుఁడును నేనును మెల్లగా దగ్గరజేరి సంగీతమును బాడి మెప్పింతుము.

క. యాగములు బుధులు ధరణీ
భాగములం జేయుచుండఁ బఱతెంచి హవి
ర్భాగములు తాన కైకొనుఁ
జాఁగింపఁడు దైత్యుఁ డమరసంఘంబునకున్. 103

టీ. దైత్యుఁడు, బుధులు=విద్వాంసులు, ధరణీభాగములన్=భూభాగములమీఁద, యాగములు=యజ్ఞములు, పఱతెంచి=పరుగుతో వచ్చి, హవిర్భాగములు = యజ్ఞహవిస్సులను, కైకొనున్ = హరించును, అమరసంఘంబునకున్=దేవతలగుంపులకు, చాఁగింపఁడు=చెందనీయఁడు.

తా. రాజా! భూలోకమున పండితులందఱు అక్కడక్కడ యజ్ఞములు చేయుచుండఁగా పఱుగిడివచ్చి తానె కాఁజేయును. దేవతలకుఁ బోనీయఁడు.

సీ. సకలమహాద్వీపసహితవిశ్వంభరా
స్థలిని దున్నక పండు సస్యచయము
కామధేన్వాదులకరణి నర్థులు గోరు
కోర్కులు గగనంబు కురియుచుండు
వననిధు లేడును వాహినీసందోహ
ములును వీచుల రత్నములు వహించు
నుర్వీరుహంబులు నొక్కకాలంబున
నఖిల ర్తుగుణముల నతిశయిల్లు
తే. నంబుసంపూరితద్రోణు లగుచు నొప్పుఁ
బర్వతంబులు సర్వదిక్పాలవివిధ

గుణములెల్లను తానె కైకొనుచు దైత్య
విభుఁడు త్రైలోక్యరాజ్యసంవృద్ధి నుండ. 104

టీ. సర్వ...గుణములు=ఎల్లదిక్పతులఅధికారములు, తానె...కైకొనుచుఁ=గ్రహించుచు, దైత్యవిభుఁడు=రాక్షసరాజు, త్రైలో...వృద్ధిన్=ముల్లోకముల దొరతనపు పెంపుతో, ఉండఁగా, సకల...స్థలిని=ఎల్ల లంకలతోడి భూమియందు, సస్యచయము = పైరులు, గగనంబు = ఆకాశము, కామధేన్వాదులకరణిన్ = కామధేనువు చింతామణి మొదలగువానివలె, అర్థులు=యాచకులు, వననిధులు=సముద్రములు, వాహినీసందోహములును=నదులసమూహములును, వీచులన్=తరంగములతో, ఉర్వీరుహంబులు=చెట్లు, అఖిలర్తుగుణములు=ఎల్లఋతువుల గుణములచేతను, అతిశయిల్లు=మీఱును, పర్వతంబులు, అంబు ... ద్రోణులు = నీళ్లు నిండిన గుంటలు గలవై, ఒప్పన్=వెలయును.

తా. హిరణ్యకశిపుఁడు దిక్పాలురయధికారములను లాగుకొని త్రిలోకములకుఁ దాన రాజై యుండఁగా, భూమి దున్నకయే పండెను. ఆకాశము కామధేనువు మొదలగువానివలె కోరినదెల్లఁ గురియుచుండెను. ఏడు సముద్రములు ఎల్లనదులు తరంగములతో రత్నములఁ గ్రుమ్మరించుచుండెను. చెట్లు అఱు ఋతువుల ధర్మములను పొందెను. పర్వతములమీఁది గుంటలన్నియు నెక్కడఁజూచినను జలమయములై యుండెను.

వ. ఇట్లు సకలదిక్కులు నిర్జించి లోకైకనాయకుండై తనయిచ్ఛాప్రకారంబున నింద్రియసుఖంబు లనుభవించుచుం దనియక శాస్త్రమార్గంబు నతిక్రమించి విరించివరజనితదుర్వారగర్వాతిరేకంబున సుపర్వారాతి యైశ్వర్యవంతుండై పెద్దకాలంబు రాజ్యంబు చేయునెడ. 105

టీ. సుపర్వారాతి=దేవతలకు శత్రువగుహిరణ్యకశిపుఁడు, నిర్జించి=జయించి, లోకైకనాయకుండు=లోకముల కొక్కఁడైనప్రభువు, ఇచ్ఛాప్ర

కారంబునన్ = చిత్తము కోలఁది, తనియక = తృప్తిఁ బొందక, విరించి...రేకంబునన్ = బ్రహ్మవరమువలనఁ గలిగిన అపరాని మదము పెంపుచేత, ఐశ్వర్యవంతుండు = దొరతనము గలవాఁడై.

ఉ. ఎన్నఁడు మాకు దిక్కుగల దెన్నఁడు దైత్యునిబాధమాను మే
మెన్నఁడు వృద్ధిఁ బొందఁ గల మెవ్వరు రక్షకులంచు దేవతా
కిన్నరసిద్ధసాధ్యమునిఖేచరనాయకు లాశ్రయించి రా
పన్నగతల్పు భూరిభవబంధవిమోచనుఁ బద్మలోచనున్. 106

టీ. కిన్నర...నాయకులు = కిన్నరులు సిద్ధులు సాధ్యులు ఋషులు దేవతలు మొదలగువారిలో మేటులు, పన్నగతల్పున్ = పాము పానుపుగాఁగల, భూరి...చనున్ = భయంకరమైన సంసారబంధమునుండి విడిపించు, పద్మలోచనున్ = తామరలవంటి నేత్రములుగల విష్ణువును, ఆశ్రయించిరి = చేరిరి.

తా. సిద్ధ విద్యాధరాదులందఱును, మాకెవ్వఁ డెప్పుడు దిక్కుగలుగును? ఎప్పుడు రాక్షసుని బాధ నివర్తించును? ఎప్పుడు బాగుపడుదుము? ఇప్పుడు మమ్ము కాపాడువా రెవరు? ఇట్లు కళవళపడుచు శేషశాయి సంసార బంధమును విడిపించువాఁడు నగు శ్రీవిష్ణువు నాశ్రయించిరి.

వ. ఇట్లు దానవేంద్రుని యుగ్రదండంబునకు వెఱచి యనన్యశర
ణ్యులై రహస్యంబున నందఱుం గూడుకొని. 107

టీ. ఉగ్రదండము = కఠినశిక్ష, అనన్యశరణ్యులు = వేఱు దిక్కులేనివారు, రహస్యంబునన్ = ఏకాంతమందు (వెల్లడియైనచో రక్కసుఁడు చావఁ గొట్టునను భయము), కూడుకొని = చేరి.

ఉ. ఎక్కడ నున్నవాఁడు జగదీశ్వరుఁ డాత్మ మయుండు మాధవుం
డెక్కడ కేఁగి శాంతులు మునీశులు భిక్షులు రారు క్రమ్మఱన్
దిక్కుల నెల్ల నెక్కడు తుదిం జొర దిక్కగునట్టిదిక్కకై
మ్రొక్కెద మేము హస్తయుగముల్ ముకుళించి మదీయరక్షకున్.

టీ. జగదీశ్వరుఁడు = లోకనాయకుఁడు, ఆత్మమయుండు = ఆత్మస్వరూపి, మాధవుండు = లచ్చిమగఁడు, ఎక్కడఁ, ఉన్నవాఁడు, శాంతులు=శమప్రధానమైన చిత్తముగలవారు, మునీశులు=మునినాథులు, భిక్షులు=విరాగులు, క్రమ్మఱఁ=మరల, ఎక్కుడు=మించినది, తుదిఁ = అంతమున, చేరఁ=చేరుటకు, అట్టిదిక్కునకై=అలాటిప్రాపునకై, ఏము, హస్తయుగము=చేజోడులను, ముకుళించి=జోడించి, మదీయరక్షకుఁ = మాకు రక్షకుఁడైన, హరినిగూర్చి మ్రొక్కెదము.

తా. లోకనాథుఁడును ఆత్మరూపుఁడు నగు శ్రీవిష్ణు వెచట నున్నాఁడో, ఏచోటికిఁ బోయిన మహాత్ములు మరల రారో, రక్షకులలో నెల్లమేటియై చివరకు పొందఁదగిన రక్షకుఁడైన విష్ణువునకు మేము మాక్షేమమునకై చేతులు జోడించి మ్రొక్కెదము.

వ. అని మఱియు నాహారనిద్రలు మాని చిత్తంబులు పరా
యత్తంబులు గానీక సమాహితబుద్ధులై భగవంతుండును
మహాపురుషుండును మహాత్ముండును విశుద్ధజ్ఞానానందమ
యుండును నైన హృషీకేశునకు నమస్కరించుచున్న యెడ
మేఘరవసమానగంభీరనినదంబున దిశలు మ్రోయించుచు
సాధులకు నభయంబు గావించుచు దృశ్యమానుండు గాక
పరమేశ్వరుం డైనహరి యిట్లనియె. 109

టీ. ఆహారనిద్రలు=అన్నము నిద్ర, పరాయత్తంబులు = వేఱువిషయములకరిగినవి, సమాహితబుద్ధులై = చక్కఁబఱచుకొనఁబడిన చిత్తముగలవారై, భగవంతుండును = షడ్గుణైశ్వర్యయుక్తుఁడు, మహాత్ముఁడు = అనిర్వాచ్యమైన స్వరూపముగలవాఁడు, విశుద్ధ...మయుండు = నిర్మలుఁడు జ్ఞానరూపుఁడు ఆనందరూపుఁడు, హృషీకేశుఁడు=ఇంద్రియములను శాసించువాఁడు, విష్ణువు, మేఘ...నినదంబు=మేఘధ్వని కీడైనగంభీరధ్వని, సాధులు=సజ్జనులు, దృశ్యమానుఁడుకాక=చూడఁబడినవాఁడుకాక.

మ. భయముం జెందకుఁ డయ్య నిర్జరవరుల్ భద్రంబు మీ కయ్యెడున్
జయమున్ లాభము భూతసంతతికి మత్సందర్శనప్రాప్తి న
వ్యయమై చేరు నెఱుంగుఁడున్ దితిసుతవ్యాపారభాషావిప
ర్యయముల్ గాలము గూడఁ జంపెదఁ జనుం డందాఁక మీ త్రోవలన్.

టీ. నిర్జరవరుల్ = దేవతాశ్రేష్ఠులారా! భద్రంబు = శుభము, భూతసంతతికిన్ = జంతుజాలమునకు, మత్సందర్శనప్రాప్తిన్ = నాదర్శనము లభించుటచేత, అవ్యయము = నాశములేనిది, దితి...విపర్యయముల్ = హిరణ్యకశిపుని చేఁతలు మాటలు వీనియందుఁగల దుడుకుఁదనములు, కాలము కూడన్ = ఒనఁగూడఁగా, అందాఁకన్ = అంతవఱకు.

తా. దేవులారా! భయమొందకుఁడు, మీకు మేలగును. నాదర్శనము దొరికెనేని భూతములకు తెంపులేని విజయము లాభము దొరకును. హిరణ్యకశిపుఁడు మిమ్ములఁ బెట్టుకష్టములను, వాఁడు చేయుపనులు మాటలు అన్నియును నాకుఁ దెలియును. తఱి వేచి వానిం జంపెదను. అంతవఱకు మీమీత్రోవలఁ బోయి ఒదిగియుండి కాలము గడపుఁడు.

ఆ. శుద్ధసాధులందు సురలందు శ్రుతులందు
గోవులందు విప్రకోటియందు
ధర్మపదవియందుఁ దగిలి నాయందు వాఁ
డెన్నఁ డలుగు నాఁడె హింస నొందు. 111

టీ. వాఁడు = హిరణ్యకశిపుఁడు, శుద్ధసాధులందున్ = కపటములేని సజ్జనులయందు, సురలందున్ = దేవతలయందును, శ్రుతులందున్ = వేదములయందును, విప్రకోటియందున్ = బ్రాహ్మణులసమూహమునందును, ధర్మపదవియందున్ = ధర్మమార్గమందును, నాయందున్, తగిలి = పూని, ఎన్నఁడు, అలుగున్ = ద్వేషించునో, హింసన్ = మరణమును, ఒందున్ = పొందును.

తా. వాఁడు ఎప్పుడు సాధువులను దేవబ్రాహ్మణులను వేదములను గోవులను ధర్మమును నన్నును ద్వేషించునో నాఁడే యంతమొందఁగలఁడు.

క. కన్నకొడుకు శమదమసం
పన్నుఁడు నిర్వైరుఁ డనక ప్రహ్లాదుని వాఁ
డెన్నఁడు రోషంబున నా
పన్నతఁ బొందించు నాఁడె పట్టి వధింతున్. 112

టీ. శమ...న్నుఁడు = శాంతిదాంతి గలవాఁడు, నిర్వైరుఁడు = విరోధములేనివాఁడు, రోషంబునన్ = క్రోధముతో, ఆపన్నతన్ = కీడును, పట్టి, వధింతున్ = చంపుదును.

తా. వాఁడు తనకొడుకైన ప్రహ్లాదుని తాఁ గన్నకొడుకనియు శమదమాదులు గలవాఁడనియు వైరములేనివాఁడనియుఁ జూడక ఎప్పుడు బాధపెట్టునో అప్పుడే వానిని బట్టి సంహరించెదను.

శా. వేధోదత్తవరప్రభావగరిమన్ వీఁ డింతవాఁ డై మిమున్
బాధంబెట్టుచు నున్నవాఁ డని మదిన్ భావింతు భావించి నే
సాధింపం దఱి గాదు కావునఁ గడున్ సైరించితిన్ మీఁదటన్
సాధింతున్ సురలార నేఁడు చనుఁడా శంకింప నేటికిన్. 113

టీ. సురలార = వేల్పులారా! వేధో...గరిమన్ = బ్రహ్మయిచ్చినవరములబలిమిని, భావింతున్ = తలఁచెదను, సాధింపన్ = నిగ్రహించుటకు, తఱి = సమయము, కడున్ = మిక్కిలి, సైరించితిన్ = సహించితిని, మీఁదటన్ = తర్వాత, చనుఁడు ఆ = వెళ్లుఁడీ, శంకింపన్ = అనుమానింపఁగా, ఏటికిన్ = ఏల?

తా. సురలారా! వీఁడు బ్రహ్మయిచ్చినవరములచే గర్వించి యింతగా మిమ్ము బాధించుచున్నాఁ డని తలఁచెదను. అందువలననే ఇప్పుడు వాని నేమిచేయుటకుఁ దోఁచక యూరకున్నాను. సమయము చూచి వానిని క్రమముగా హతముచేయుదును. సందేహము వలదు.

వ. అని యిట్లు దనుజమర్దనుండు నిర్దేశించిన నిలింపులు గుంపులుగొని మ్రొక్కి రక్కసుండు మ్రగ్గుట నిక్కం బని తమతమ

దిక్కులకుం జనిరి హిరణ్యకశిపునకు విచిత్రచరిత్రులు నలువురు పుత్త్రు లుద్భవించి రందు. 114

టీ. దనుజమర్దనుండు=విష్ణువు, నిర్దేశించినన్=చెప్పఁగా, నిలింపులు=దేవతలు, మ్రగ్గుట=చచ్చుట, నిక్కంబు=నిజము, విచిత్రచరిత్రులు=ఆశ్చర్యమైన నడవడిగలవారు, ఉద్భవించిరి=పుట్టిరి, వారిలో.

సీ. తనయందు నఖిలభూతములందు నొకభంగి
సమహితత్వంబున జరగువాఁడు
పెద్దలఁ బొడగన్న భృత్యునికైవడిఁ
జేరి నమస్కృతుల్ చేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావము చేసి మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను
దీనులఁ గావఁ జింతించువాఁడు

తే. సఖులయెడ సోదరస్థితి జరపువాఁడు
దైవతము లంచు గురువులఁ దలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు
లలితమర్యాదుఁ డైన ప్రహ్లాదుఁ డధిప. 115

టీ. అధిప=ధర్మరాజా! లలితమర్యాదుఁడు=ఒప్పిదమైన సదాచారముగల, ప్రహ్లాదుఁడు=ప్రహ్లాదుఁడనుకొడుకు, అఖిలభూతములందున్=ఎల్లప్రాణులయందును, ఒకభంగిన్=ఒక్కవిధముగా, సమవర్తనంబునన్=భేదములేనినడవడికతో, పెద్దలన్=సాధువులను, పొడగనన్=కాంచినచో, భృత్యునికైవడిన్=బంటువలె, కన్నుదోయికిన్=నేత్రద్వయమునకు, అన్యకాంతలు=ఇతరవనితలు, అడ్డంబు=ఎదురు, ధర్మవత్సలతన్=న్యాయబుద్ధితో, దీనులన్=బీదలను, కావన్=రక్షించుటకునై, సఖులయెె

డఁగ=స్నేహితులపట్టున, సోదరస్థితి=అన్నదమ్ములమర్యాద, లీలలందును = ఆటలయందును, బొంకులు=అసత్యములు.

తా. రాజా! ఆనలుగురలో ప్రహ్లాదుఁ డనుకొడుకు, పూజ్యాపూజ్య వివేకము గలిగి తనను ఎల్లజంతువులను సమానముగాఁ జూచుకొనును సజ్జనులను జూచినంతనే సేవకునివలె దగ్గఱకేఁగి మ్రొక్కును. పరస్త్రీలు కంటఁబడినచోఁ దల్లివలె భావించి తొలఁగిపోవును. దిక్కులేనివారలఁ గాంచినేని వారితల్లిదండ్రులవలె రక్షించును. స్నేహితులను అన్నలు తమ్ములుగా భావించును. గురువులను దేవతలనియెన్నును. ఆటలలోనైనను అబద్ధమాడనట్టివాఁడు.

వ. మఱియును. 116

సీ. ఆకారజన్మవిద్యార్థవరిష్ఠుఁ డై
గర్వసంస్తంభసంగతుఁడు గాఁడు
వివిధమహానేకవిషయసంపన్నుఁ డై
పంచేంద్రియములచేఁ బట్టువడఁడు
భవ్యవయోబలప్రాభవోపేతుఁ డై
కామరోషాదులఁ గ్రందుకొనఁడు
కామినీప్రముఖభోగము లెన్ని గలిగిన
వ్యసనసంసక్తి నావంకఁ బోఁడు
ఆ. విశ్వమందుఁ గన్న విన్న యర్థములందు
వస్తుదృష్టిఁ జేసి వాంఛ యిడఁడు
ధరణినాథ దైత్యతనయుండు హరిపర
తంత్రుఁ డై హతాన్యతంత్రుఁ డగుచు. 117

టీ. ధరణినాథ=రాజా! దైత్యతనయుఁడు=ప్రహ్లాదుఁడు, హరిపరతంత్రుఁడై=విష్ణువునకు దాసుఁడై, హతాన్యతంత్రుఁడు=త్యజింపఁబడిన యితర

విషయములు గలవాఁడు, అగుణ్, ఆకార...వరిష్ఠుఁడు=రూపము కులము చదువు ధనము వీనిలోఁ గొప్పవాఁడు, గర్వ...తుఁడు=గర్వాతిశయముతోఁ గూడినవాఁడు, వివిధ...సంపన్నుఁడు = నానావిధములైన గొప్పస్రక్చందనవనితాదిభోగములుగలవాఁడు, సకలేంద్రియములు = త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణము లను నైదింద్రియములు, భవ్య...పేతుఁడు=మంచిప్రాయము బలము ధీరతనము వీనితోఁ గూడినవాఁడు, కామరోషాదులు=కామక్రోధాదులు, క్రిందుకొనఁడు=చొఱఁడు, కామిని...ములు=స్త్రీలు మొదలయిన భోగములు, వ్యసనసంసక్తిన్ = తగులముచే, అవంకన్=అవైపునకు, విశ్వమందున్=ప్రపంచమందు, అర్థములంగున్=వస్తువులయందు, వస్తుదృష్టి=స్థిరబుద్ధి, వాంఛ=కోరిక.

తా. రాజా! ఇంకను ప్రహ్లాదుఁడు ఎల్లప్పుడు తనచిత్తము విష్ణువునందు జేర్చి యితరచింత మాని సౌందర్యము కులము చదువు ధనము గలిగియు గర్వపడఁడు. విస్తారమైనపూవు గంధము స్త్రీలు మొదలగునవి గలిగియు, ఇంద్రియలోలుఁడు గాఁడు. ఎలప్రాయము శౌర్యము ఐశ్వర్యము గలవాఁడయ్యు కామక్రోధములఁ జేరనీయఁడు. స్త్రీలు మొదలగుభోగము లెన్నియున్నను వానియెడఁ దగిలి యుండఁడు. (ప్రపంచములోఁ జూచియు విన్నట్టివస్తువులకు వస్తుత్వ మొప్పుకోఁడు. (నిజమని వానిని కోరఁడు.)

ఆ. సద్గుణంబు లెల్ల సంఘంబులై వచ్చి
యసురరాజతనయునందు నిలిచి
పాసి చనవు విష్ణుఁ బాయనివిధమున
నేఁడుఁ దగిలి యుండు నిర్మలాత్మ. 118

టీ. నిర్మలాత్మ=శుద్ధచిత్తముగలరాజా! సద్గుణంబులు=మంచిగుణములు, సంఘంబులు=గుంపులు, అసుర...నందున్=ప్రహ్లాదునియందు, పాసి=వీడి, చనవు=పోవు, తగిలియుండున్=చెందియుండును.

తా. రాజా! మంచిగుణములన్నియు నొక్కఁడై ప్రహ్లాదునియందు చేరియున్నవి. అవన్నియు నేఁటికి రేపటికిఁగూడ విష్ణువును వలె నాయనను విడువకుండును.

మ. పగవారైన సురేంద్రులున్ సభలలోఁ బ్రహ్లాదసంకాశులన్
సుగుణోపేతుల నెందునేమెఱుఁగ నుంచున్ వృత్తబంధంబులం
బొగడం జొత్తురు సత్కవీంద్రులక్రియన్ భూనాథ మీబోఁటి స
ద్భగవద్భక్తులు దైత్యరాజతనయుం బాటించి కీర్తింపరే.

టీ. భూనాథ=రాజా! పగవారు=శత్రువులు, సురేంద్రులున్=దేవతలున్ను, సభలలోన్=చదురులయందు, ప్రహ్లాదసంకాశులన్=ప్రహ్లాదుని బోలువారిని, సుగుణోపేతులన్=మంచిగుణములుగలవారిని, సత్కవీంద్రులక్రియన్=గొప్పకవులవలె, వృత్తబంధంబులన్=పద్యముల పాటలు గాఁగూర్చినవానితో, పొగడంజొత్తురు=పొగడుటకారంభింతురు మీబోఁటి... క్తులు=మీవంటియోగ్యులైన భాగవతశ్రేష్ఠులు, దైత్యరాజతనయున్=ప్రహ్లాదుని, పాటించి=లక్ష్యముంచి, కీర్తింపరే=పొగడరా.

తా. రాజా! వానికి వంశపరంపరగా శత్రువులగు నింద్రాదులే ప్రహ్లాదునివంటిమహాత్ములు వేఱే లేరని వానిమీఁదఁ బద్యములు పాటలును గట్టి సభలలోఁ బాడుచుందురు. ఇఁక మీబోఁటిభాగవతశ్రేష్ఠులు ప్రహ్లాదుని బొగడనేరరా?

క. గుణనిధి యగు ప్రహ్లాదుని
గుణము లనేకములు గలవు గురుకాలమునన్
గణుతింప నశక్యంబులు
ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్. 120

టీ. గుణనిధి=మంచిగుణములకు నిక్షేపము, గురుకాలమునన్=చాలకాలమునకైనను, గణుతింపన్=వర్ణించుటకు, అశక్యంబులు=సాధ్యముకావు. ఫణిపతికిన్=శేషునకు, బృహస్పతికిని, భాషాపతికిన్=బ్రహ్మకును.

తా. ఆ మహాత్ముని గుణములు ఇన్నియని చెప్ప నలవికాదు. వానిని ఎన్నాళ్లైన సామాన్యులు వర్ణింపలేరు సరిగదా ఆదిశేషువు బృహస్పతి బ్రహ్మ మొదలగువారుకూడ వర్ణింపఁజాలరు.

వ. ఇట్లు సద్గుణగరిష్ఠుం డయినప్రహ్లాదుండు భగవంతుం డయిన
వాసుదేవునియందు సహజ సంవర్ధమాన నిరంతర ధ్యాన
రతుం డై. 121

టీ. సద్గుణగరిష్ఠుండు = మంచి గుణములచే గొప్పవాఁడు; భగవంతుండు=షడ్గుణైశ్వర్యములతోఁ గూడినవాఁడు, సహజ...రతుండై=తనంతనే పుట్టి పెరిఁగిన గాఢమైనధ్యానమందుఁ దగిలినవాఁడై.

సీ. శ్రీవల్లభుఁడు దన్నుఁ జేరినయట్లైనఁ
జెలికాండ్ర నెవ్వరిఁ జేర మఱచు
నసురారి తనమ్రోల నాడినయట్లైన
నసురబాలురతోడ నాడ మఱచు
భక్తవత్సలుఁడు సంభాషించినట్లైనఁ
బరభాషలకు మాఱు పలుక మఱచు
సురవంద్యుఁ దనలోనఁ జూచినయట్లైనఁ
జొక్కి సమస్తంబుఁ జూడ మఱచు
తే. హరిపదాంభోజయుగచింతనామృతమున
సంతరంగంబు నిండినయట్లైన నతఁడు
నిత్యపరిపూర్ణుఁ డగుచు నన్నియును మఱచి
జడత లేకయు నుండును జడునిభంగి. 122

టీ. అతఁడు=ప్రహ్లాదుఁడు, శ్రీవల్లభుఁడు = విష్ణువు, చేరినయట్లైనన్=కూడియున్నట్లు తోఁచినచో, చెలికాండ్రన్=స్నేహితులను, అను

రారి=విష్ణువు, తనమ్రోలన్=తనచెంతను, అసురబాలురతోడన్ = రాక్షసుల పిల్లకాయలతోడ, భక్తవత్సలుఁడు = భక్తులయందుఁబ్రీతి కలవాఁడు; సంభాషించినట్లైనన్=మాటలాడినట్లు దోఁచినచో, పరభాషలకున్ = ఇతరులమాటలకు, మాఱు=బదులు, సురవంద్యున్ = (దేవతలచే మ్రొక్కఁబడగిన) విష్ణువును, మ్రొక్కి=మైమఱచి, హరి...తమునన్=విష్ణువు పాదకమలముల ధ్యానమనునమృతముతో, అంతరంగంబు=హృదయము, నిత్యపరిపూర్ణుఁడు=ఎల్లప్పుడు నిండుకొనియుండువాఁడు, జడత=మోహము.

తా. రాజా! ఆప్రహ్లాదుఁడు విష్ణువు తనను జెందియున్నప్పుడు చెంతవారితోఁ జేరఁడు. శ్రీహరి తనయెదుట నాడునప్పుడు రాక్షసులబాలురతో నాడుకొనఁడు. ఆయన తనతో మాట్లాడుచున్నప్పుడు ఇతరులతో మాట్లాడఁడు. ఆయనను దనలో ధ్యానించుపట్టున మైమఱచి వేఱొద్దియుండఁజాలఁడు. హరిధ్యానముచేతఁ జిత్తము నిండియున్నప్పు డాతఁడు ఆనందపూర్ణుఁడై అన్నియును మఱచి, మోహములేకున్నను పిచ్చివానివలె నగపడును.

శా. పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు చేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణపాదపద్మయుగళీచింతామృతాస్వాదసం
ధానుండై మఱచెన్ సురారిసుతుఁ డేతద్విశ్వమున్ భూవరా.

టీ. భూవరా=రాజా! సురారిసుతుఁడు=ప్రహ్లాదుఁడు, పానీయంబులు=నీళ్లు, త్రావుచున్, కుడుచుచున్ = అన్నముందినుచు, భాషించుచున్=మాటలాడుచు, హాస...ద్రాదులు = నవ్వులు వినోదములు నిద్ర మొదలయినవి, లక్షించుచున్ = చూచుచు, సంతత...నుండై = తెంపులేకుండ శ్రీహరి చరణకమల ధ్యానమను నమృతమును గ్రోలుటయందు ప్రీతి గలవాఁడై, ఏతద్విశ్వమున్=ఈబాహ్యప్రపంచమును.

తా. రాజా! ప్రహ్లాదుఁడు, అన్నముదినుచు నీళ్లు ద్రావుచు మాటలాడుచు నవ్వుచు వినోదపడుచు నిద్రబోవుచు ఎప్పుడైననుసరే ఏమఱక

శ్రీహరిధ్యానమందు మగ్నమైనచిత్తము గలవాఁడై, యీప్రపంచమును మఱచి యుండును.

సీ. వైకుంఠచింతావివర్జితచేష్టుఁడై
యొక్కఁడు నేడుచు నొక్కచోట
నశ్రాంతహరిభావనారూఢచిత్తుఁడై
యుద్ధతుఁడై పాడు నొక్కచోట
విష్ణుఁ డింతియు గాని వేఱొండు లేదని
యొత్తిలి నగుచుండు నొక్కచోట
నళినాక్షుఁ డనుసంధానముఁ గంటి నే నని
యుబ్బి గంతులు వైచు నొక్కచోటఁ
ఆ. బలుకు నొక్కచోటఁ బరమేశుఁ గేశవుఁ
బ్రణయహర్షజనితబాష్పసలిల
మిళితపులకుఁడై నిమీలితనేత్రుఁడై
యొక్కచోట నిలిచి యూరకుండు. 124

టీ. వైకుంఠ...చేష్టుఁడై=విష్ణుధ్యానము లేని వ్యాపారము గలవాఁడై, అశ్రాంత...చిత్తుఁడై=తెంపులేని హరిధ్యానమందు నిలిపిన మనస్సుగలవాఁడై, ఉద్ధతుఁడు=ఆనందము నొందినవాఁడై, ఒత్తిలి=ఒదిగి, నళినాక్షుఁడు=విష్ణువు, అనుసంధానము=అనుసంధిని, ఉబ్బి=పొంగి, ప్రణయ...నేత్రుఁడై=భక్తిచేఁ గలిగిన సంతోషమువలనఁ బుట్టిన కన్నీటితోఁ గలిసిన గగుర్పాటు కలవాఁడై, నిమీలితనేత్రుఁడై=మూయఁబడిన కన్నులు గలవాఁడయి.

తా. రాజా! అతఁడొక్కచోట విష్ణుధ్యానము లభింపలేదని యొంటరిగా నేడ్చుచుండును. ఒక్కచోట విష్ణునియందు మనస్సు నిలిపి, యానందముతోఁ బాడుచుండును. విష్ణుఁడనఁగా నింతే వేఱొకటే లేదని యొక్కచో వగలఁబడి నవ్వుచుండును. ఒక్కయెడ నాకు విష్ణుఁ డనులబ్ధి దొరికెనని

పొంగి చిందులు ద్రొక్కును. ఒక్కచోట విష్ణునామసంకీర్తనము సేయును. ఒకప్పుడు భక్తితాత్పర్యముతో నానందపడి కన్నీరు విడుచుచు నొడలు గగుర్పొడువ కనులు మూసికొని మిన్నకుండును.

వ. ఇట్లు పూర్వజన్మ పరమభాగవత సంసర్గసమాగతం బైన ముకుందచరణారవింద సేవాతిరేకంబున నఖర్వనిర్వాణభావంబు విస్తరించుచు నప్పటప్పటికి దుర్జనసంసర్గనిమిత్తంబువం దన చిత్తం బన్యాయత్తంబు గానీక నిజాయత్తంబు సేయుచు నప్రమత్తుండును సంసారనివృత్తుండును బుధజనవిధేయుండును మహాభాగధేయుండును సుగుణమణిగణాగరిష్ఠుండును బరమభాగవతశ్రేష్ఠుండును గర్మబంధలతాలవిత్రుండును బవిత్రుండును నైన పుత్త్రునియందు విరోధించి సురవిరోధి యనుకంప లేక చంపం బంపె నని పలికిన నారదునకు ధర్మజుం డిట్లనియె. 125

టీ. పూర్వ...గతంబు = తొలిబామునందలి యుత్తమభాగవతుల చేరికవలన లభించినది, ముకుంద...కంబునన్ = విష్ణుపాదసేవాతిశయము వలన, అఖర్వనిర్వాణభావంబు = కొలఁతలేనియానందమును, విస్తరించుచున్ = పెంచుచు, దుర్జన...బునన్ = కాపురుషుల చెలిమిచేత, అన్యాయత్తంబు = పరాధీనము, నిజాయత్తంబు = తనయధీనము, అప్రమత్తుండు = ఏమఱికలేనివాఁడు, సంసారనివృత్తుఁడు = సంసారమును విడిచినవాఁడు, బుధజనవిధేయుండు = పండితులకు స్వాధీనుఁడు, మహాభాగధేయుండు = విష్ణుభక్తి యను గొప్పకలిమి గలవాఁడు, సుగుణ...ష్ఠుండు = సుగుణములనెడురత్నములచే గొప్పవాఁడు, పరమభాగవతశ్రేష్ఠుండు = యోగ్యులైన భక్తులలో నుత్తముఁడు, కర్మ...విత్రుండు = కర్మబంధములను తీఁగలకు కొడవలివంటివాఁడు, పవిత్రుండు = పావనుఁడు, సురవిరోధి = హిరణ్యకశిపుఁడు, అనుకంప = దయ.

శా. పుత్రుల్ నేర్చిన నేర కున్న జనకుల్ పోషింతు రెల్లప్పుడున్
మిత్రత్వంబున బుద్ధి చెప్పి దురితోన్మేషంబు వారింతు రే
శత్రుత్వంబుఁ దలంప రెట్టియెడ నా సౌజన్యరత్నాకరుం
బుత్రున్ లోకపవిత్రుఁ దండ్రి నెగులుం బొందింప నెట్లోర్చెనో.

టీ. జనకుల్=తల్లిదండ్రులు, మిత్రత్వంబునన్=చనవుతో, బుద్ధి=నీతి, దురితోన్మేషంబు = పాపచింతనమును, ఎట్టియెడన్ = ఎప్పుడున్ను, ఏశత్రుత్వంబున్=ఏవిరోధమున్ను, తలఁపరు, ఆసౌజన్యరత్నాకరున్=సాధుత్వమునకు నెలవగు నా ప్రహ్లాదుని, లోకపవిత్రున్=సర్వలోకపావనుని, తండ్రి, ఎగులున్ = కష్టమును, ఎట్లు, ఓర్చెనో=ఇష్టపడెనో.

తా. నారదా! లోకములోఁ దల్లిదండ్రులు కొడుకులకు తెలిసినను దెలియకున్నను రక్షింతురు. తెలియనిపట్టున బుద్ధి జెప్పి దిద్దుదురు. వారి నెప్పుడును ప్రేమతోఁ బెనుపుదురుగాని శత్రుత్వము జూపరు. ఇట్లెచటను వినమే. అట్టిసాధువును లోకపావనుఁడగు కొడుకును తండ్రి యేల బాధించెనో? వానిని హింసించుటకు వాని కెట్లు సమ్మతమో తెలియదు.

ఉ. శీలుఁ బ్రభావిశాలు హరిపాదపయోరుహచింతనక్రియా
లోలుఁ గృపాళు సాధుగురులోకపదానతఫాలు నిర్మల
శ్రీలు సమస్తసభ్యనుతశీలు విఖండితమోహవల్లికా
జాలు నదేల తండ్రి వడిఁ జంపఁగఁ బంపె మునీంద్ర చెప్పవే.

టీ. మునీంద్రా=నారదా! ప్రభావిశాలున్ = బ్రహ్మతేజమున వెలుఁగొందువానిని, హరి...లోలున్=విష్ణుపాదకమలముల ధ్యానించు పనియందుఁ దగిలియున్నవానిని, కృపాళున్=భూతదయ గలవానిని, సాధు...ఫాలున్=సజ్జనులు గురువులు వీరల పాదములయందు నొసలు మోపువానిని, నిర్మలశ్రీలున్=మంచిమనస్సుగలవానిని, సమస్త...శీలున్=ఎల్ల సాధువులచేఁ బొగడఁబడిన నడవడి గలవానిని, విఖండిత..జాలున్ = త్రెంపఁబడినయజ్ఞానపుఁదీఁగెలు గలవానిని, వడిన్=వేగముగా, చెప్పవే=చెప్పుమా.

తా. నారదా! పిన్నవాఁడును, (కుఱ్ఱవాఁడు తప్పిదము జేసిన ఎఱుఁగక చేయును గాన మన్నింపఁదగుఁగాని దండింపఁ జనదు.) తేజోవంతుఁడును, విష్ణుభక్తిగలవాఁడును, సాధుగురుసేవ జేయువాఁడును, మంగళస్వభావము గలవాఁడును, సాధువులచే సైతము కొనియాడఁబడిన ప్రవర్తన గలవాఁడును, మోహపాశములను త్రెంపినవాఁడును, ఇట్టి కొడుకును కరుణలేక తండ్రి యేల చంపుమనెను? సెలవిండు.

వ. అనిన నారదుం డిట్లనియె. 128

శా. లభ్యం బైన సురాధిరాజపదముం లక్షింపఁ డశ్రాంతముం
సభ్యత్వంబున నున్నవాఁ డబలుఁడై జాడ్యంబుతో వీఁడు వి
ద్యాభ్యాసంబునఁ గాని తీవ్రమతి గాఁ డంచుం విచారించి దై
త్యేభ్యుం డొక్కదినంబునం బ్రియసుతుం వీక్షించి సోత్కంఠుఁడై.

టీ. దైత్యేభ్యుండు=హిరణ్యకశిపుఁడు, లభ్యంబు=పొందఁదగిన, సురాధిరాజపదముం=దేవేంద్రునియధికారమునుగూడ, లక్షింపఁడు, లెక్కసేయఁడు, అశ్రాంతముం=ఎల్లప్పుడు, అబలుఁడై=మనోబలములేనివాఁడై, జాడ్యంబుతోం=అవివేకముతో, సభ్యత్వంబునం=పెద్దపెద్దపోకడలతో, వీఁడు=ఈకొడుకు, విద్యాభ్యాసంబునం గాని=విద్యనేర్చుకొనినఁగాని, తీవ్రమతి=మిక్కిలినబుద్ధిగలవాఁడు, ఒక్కదినంబునం, ప్రియసుతుం=ముద్దుకొడుకును, వీక్షించి=చూచి, సోత్కంఠుఁడై=ప్రేమతోఁగూడినవాఁడై.

తా. హిరణ్యకశిపుఁడు తనకొడుకు నుపడి చూచి వీఁడు దేవేంద్రపదవిదొరికినను లెక్కసేయఁడు. ఎప్పుడు చూచినను సోమరియై అవివేకముతోఁ దిరుగుచు వ్యవహారములు రాచకార్యములు మఱిఁగి చెడిపోవుచున్నాఁడు. వీనిని బడిలో వేసి చదివించినఁగాని బుద్ధికి తేటగలిగి నాదారికి రాఁడు. అని తలఁచి యొక్కనాఁడు కొడుకును జూచి వేడుకపడినవాఁడయి.

క. చదువనివాఁ డజ్ఞుం డగుఁ
జదివిన సదసద్వివేకచతురత గలుగుం
జదువఁగ వలయును జనులకుఁ
జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ. 130

టీ. తండ్రీ=నాయనా! చదువనివాఁడు=చదువుకొననివాఁడు, అజ్ఞుండు=మంచిచెడ్డ లెఱుఁగనివాఁడు, చదివినన్=చదువుకొన్నచో, సద...రత=మంచి చెడుగుల తారతమ్యము నిర్ణయించు తెలివి, కలుగున్, జనులకున్= ఎల్లవారికిని, చదువఁగన్ వలయున్=చదువుట ముఖ్యము, ఆర్యులొద్దన్ = తగినగురువుల చెంతను, చదివించెదన్=చదువుచెప్పించెదను, చదువుము.

తా. ఇట్లు ముద్దుగా దగ్గఱకుఁ బిలచి, నాయనా! చదువురానివాఁడు పట్టెమొద్దు వాని కేమి తెలియదు. మనము చదువుకొంటిమా మంచి చెడ్డ అన్నియును చక్కఁగాఁ దెలిసికొనవచ్చును. కనుక అందఱు చదువుకొనవలసి నదే. కావున నిన్ను మంచియుపాధ్యాయులయొద్దికిఁ బంపెదను, చక్కఁగాఁ జదువుకొనుము.

వ. అని పలికి యసురలోకపురోహితుండును భగవంతుండును నయిన శుక్రాచార్యకొడుకులఁ బ్రచండవితర్కులఁ జండా మర్కుల రావించి సత్కరించి యిట్లనియె. 131

టీ. అసురలోకపురోహితుండు=రాక్షసులకందఱకుపురోహితుఁడు, భగవంతుఁడు=షడ్గుణైశ్వర్యములు కలవాఁడు, ప్రచండవితర్కులన్=తీవ్రమైనవాదశాస్త్రము నెఱిఁగినవారలను, చండామర్కులన్ = చండుఁడు మర్కుఁడు నను వారలను, రావించి=పిలిపించి, సత్కరించి=గౌరవించి.

శా. అంధప్రక్రియ నున్నవాఁడు పలుకం డస్మత్ప్రతాపక్రియా
గంధం బించుక లేదు మీరుగురువుల్ కారుణ్యచిత్తుల్ మనో
బంధుల్ మాన్యులుమాకుఁబెద్దలు మముం బాటించియీబా
లకుఁ, గ్రంథంబుల్ చదివించినీతికుశలుం గావించిరక్షింపరే.

టీ. అంధప్రక్రియన్ = గ్రుడ్డివానితీరున, పలుకండు = మాతో మాటలాడఁడు, అస్మ...గంధంబు = నాపరాక్రమముపనులు వీనియొకకొంచెమున్ను, మీరు, మాకు, గురువుల్, కారుణ్యచిత్తుల్ = దయగలవారు, మనోబంధుల్ = అంతరంగబంధువులు, మాకు, మాన్యులు = గౌరవింపఁదగినవారు, పెద్దలు = అన్నివిధములగొప్పవారలు, మమున్, పాటించి = అనుగ్రహించి, ఈబాలకున్ = ఈచిన్నవానిని, గ్రంథంబుల్ = మంచిపుస్తకములను, చదివించి, నీతికుశలున్ = తెలివిగలవానినిగా, కావించి = చేసి, రక్షింపరే = కాపాడుఁడు.

తా. అయ్యా యీకుఱ్ఱఁడు గ్రుడ్డివానివలె నున్నాఁడు. నాగొడవయే వీనికి పట్టదు. నాపరాక్రమము ఘనకార్యములు వీనియించుకైన తెలియఁడు. మీరు మాకు అన్నివిధముల గురువులు పెద్దలు పూజ్యులు, దయామయస్వభావముగలవారు ఆత్మబంధువులు. మమ్మనుగ్రహించి యీచిన్నవానికిఁ జదువుచెప్పి పండితుని జేసి నన్ను కృతార్థుని జేయుట మీభారము.

వ. అని పలికి వారలకుఁ బ్రహ్లాదు నప్పగించి తోడ్కొని పోండనిన వారును దనుజరాజకుమారునిం గొనిపోయి యతనికి సవయస్కు లగుసహశ్రోతల నసురకుమారులం గొందఱం గూర్చి. 133

టీ. అప్పగించి = స్వాధీనముచేసి, తోడ్కొనిపొండు = తీసికొనిపోవుఁడు, వారును = చండామర్కులును, దనుజరాజకుమారునిన్ = హిరణ్యకశిపుని కొడుకును, సవయస్కులు = ఒక్కయీడువారు, సహశ్రోతలు = కూడఁ జదువుకొనువారు, అసురకుమారులన్ = రాక్షసులపిల్లకాయలను, కూర్చి = జతచేసి.

ఉ. అంచితభక్తితోడ దనుజాధిపుగేహసమీపమునం బ్రవే
శించి సురారిరాజసుతుఁ జేకొని శుక్రకుమారకుల్ పఠిం
పించిరి పారయోగ్యములు పెక్కులుశాస్త్రము లాకుమారుఁ
డా, లించి పఠించె నన్నియుఁ జలింపనివైష్ణవభక్తిపూర్ణుఁడై.

టీ. శుక్రకుమారకుల్ = శుక్రుని కొడుకులు చండమర్కులు, అంచిత భక్తితోడన్ = ఒప్పిదమైన శ్రద్ధతో, దనుజాధిపు గేహసమీపమున్ = హిరణ్యకశిపుని యింటిదాపునకు, సురారిరాజసుతున్ = ప్రహ్లాదుని, చేకొని = చేరఁదీసికొని, పాఠయోగ్యములు = చదువవలసినవి, పెక్కులు = అనేకములు, శాస్త్రములు, పఠింపించిరి = వానిచేఁ జదివించిరి, అకుమారుఁడు = ప్రహ్లాదుఁడు, అలించి = గురువుల బోధవిని, చలింపని వైష్ణవభక్తిపూర్ణుఁడై = తొలఁగని విష్ణుభక్తిచే నిండినవాఁడై, అన్నియును = వారు చెప్పిన విద్యలన్నిటిని, పఠించెన్ = చదివెను.

తా. ఇట్లు చండమర్కులు రాజు నింటికిఁ బోయి ప్రహ్లాదుని బిలిచి కొనివచ్చి, వానికి నేర్పవలయు సమస్తశాస్త్రములు నేర్పిరి. వాఁడును విష్ణుభక్తిమాత్రము వీడక వారు చెప్పిన విద్యలన్నియును నేర్చుకొనుచు వచ్చెను.

క. ఏపగిది వారు చెప్పిన
నాపగిదిం జదువుఁ గాని యట్టిట్టని యా
క్షేపింపఁడు తా నన్నియు
రూపించిన మిథ్య లని నిరూఢమనీషన్. 135

టీ. తాన్ = ప్రహ్లాదుఁడు, వారు = గురువులు, ఏపగిదిన్ = ఏతీరున, చెప్పినన్, ఆక్షేపింపఁడు = అడ్డుచెప్పఁడు, రూపించినన్ = విచారించినచో, మిథ్యలు = అసత్యములు, నిరూఢమనీషన్ = దృఢబుద్ధితో.

తా. ప్రహ్లాదుఁడు వారుచెప్పినదానికెల్ల నూఁకొట్టును గాని అది యట్లు ఇది యిట్లు అని తిరుగఁబడఁడు. చక్కఁగ విచారింప నివన్నియు నసత్యము లని యెఱిఁగినవాఁడు గావున చెప్పినట్లు నేర్చుకొనెను.

శా. అంతం గొన్నిదినంబు లేఁగిన సురేంద్రారాతి శంకాన్విత
స్వాంతుం డై నిజనందనున్ గురువు లేజాడం బఠింపించిరో
భ్రాంతుం డేమి పఠించెనో పిలిచి సంభాషించి విద్యాపరి
శ్రాంతిం జూచెదఁ గాక నేఁ డని మహాసౌధాంతరాసీనుఁ డై.

తనయులసంభాషణములు
జనకులకుం గర్ణయుగళీసద్భూషణముల్. 140

టీ. జనకులకున్=తండ్రులకు, తనయులసంభాషణములు=కొడుకుల ముద్దుపలుకులు, అనుదినసంభాషణములు = ఎల్లప్పుడు వినుగు లేక యానందము గలిగించునవి, జనిత...ముల్=పుట్టినబడలికను సంతాపమును దుఃఖమును దొలఁగించునవి, కర్ణయుగళీసద్భూషణముల్=చెవులకు నలంకారములు.

తా. కొడుకులముద్దుమాటలు తండ్రులకు ఎన్నిసారులు విన్నను విసుగులేక యానందమును గలిగించును. ఎంతయాయాసము తాపము దుఃఖము గలిగియున్నను ఒక్కసారి కొడుకులపలుకులు విన్నచో నది పాయును. అవియే వారి చెవులకు నలంకారములు.

వ. అని యుత్తియుఁ బుత్త్రా నీ కెయ్యది భద్రంబై యున్నది చెప్పు
మనినఁ గన్నతండ్రికిఁ బ్రియనందనుం డిట్లనియె. 141

టీ. భద్రంబు=శుభమైనది, ప్రియనందనుండు=ముద్దుకొడుకు.

ఉ. ఎల్లశరీరధారులకు నిల్లను చీఁకటినూతిలోపలం
ద్రెళ్లక వీఁడు నే ననుమతిభ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వము న్నతనిదివ్యకళామయ మంచు విష్ణునం
దుల్లముఁ జేర్చి తా రఃవి నుండుట మేలు నిశాచరాగ్రణీ.

టీ. నిశాచరాగ్రణీ=రాక్షసరాజా! తండ్రి, ఎల్లశరీరధారులకున్=ఎల్లదేహులకు, ఇల్లు, అను చీఁకటినూతిలోపలన్=చీఁకటిబావిలో, త్రెళ్లక=పడక, వీఁడును, ఏను, అను, మతిభ్రమణంబునన్=చిత్తవైకల్యముచే, భిన్నులు=భేదజ్ఞానముగలవారు, అతని దివ్యకళామయము=ఆవిష్ణునియమానుషమైన విలాసముల స్వరూపముగలదే, ఉల్లము=చిత్తము, చేర్చి, తారు=తాము, మేలు=శ్రేయము.

తా. తండ్రీ! ఎల్లప్రాణులు ఇల్లను నీ చీఁకటి గోతిలోఁ బడియుండక వారు మేము వానిది నాయది యని పొరపాటుఁ జెందక, అంతయు

విష్ణుఁడే కాని వేఱు లేదని తలఁచి యా దేవుని చిత్తమునందు ధ్యానించుచు నడవులలో నుండినఁ గృతార్థులగుదురు.

వ. అని కుమారుం డాడిన ప్రతిపక్షానురూపంబు లయిన సల్లాపంబులు విని దానవేంద్రుండు నగుచు నిట్లనియె. 143

టీ. ఆడిన...పంబులు=పలికిన తనవిరోధియగు విష్ణునకుఁ బ్రీతికరములైన, సల్లాపంబులు = పలుకులు, విని, దానవేంద్రుండు = హిరణ్యకశిపుఁడు.

క. ఎట్టాడిన నట్టాడుదు
రిట్టట్టని పలుక నెఱుఁగ రితరులశిశువుల్
దట్టించి యెవ్వ రేమని
పట్టించిరొ బాలకునకుఁ బరపక్షంబుల్. 144

టీ. ఇతరులశిశువుల్=ఇరుగుపొరుగువారిపిల్లకాయలు, ఎట్లు=ఏలాగున, ఆడినన్=చెప్పినను, అట్లు = ఆవిధముగా, ఆడుదురు = పలుకుదురు, ఇట్టు అట్టు అని=ఈలాగు ఆలాగునని, పలుకన్ ఎఱుఁగరు=మాటాడఁజాలరు, ఎవ్వరు, దట్టించి=అదలించి, ఏమని=ఎట్లు, బాలకునకున్=కుఱ్ఱనికి, పరపక్షంబుల్=శత్రుపక్షములు, పట్టించిరో=నేర్పిరో.

తా. ఊరిలో పిల్లకాయలందఱును ఎట్లు చెప్పిన నట్లు నేర్చుకొందురు. అది యట్లు ఇది యిట్లు అని యెఱుఁగరు చెప్పరు. వీనికి ఎవరు ఏమి బెదిరించి నేర్పిరో కాని శత్రువుల కనుకూలములైన వాదములు బాగుగాఁ బట్టినవి

శా. నాకుం జూడఁగఁ జోద్యమయ్యెడిఁ గదా నాతండ్రి యీబుద్ధి దా
నీకుఁ లోపలఁ దోఁచెనో పరులు దుర్నీతుల్ పఠింపించిరో
యేకాంతంబున భార్గవుల్ పలికిరో యీదానవశ్రేణికిన్
వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీ కేటికిన్. 145

టీ. నాతండ్రి = ఓనాయనా! ప్రహ్లాదా, చోద్యము = చిత్రము, ఈబుద్ధి=ఇట్టివిష్ణునియందలి భక్తి, తాన్ = తనంతటనే, లోపలన్ = లో

హృదయమున, పరులు=మనకు కానివారు, దుర్నీతులు=చెడుగఱపులు, పఠిం
పించిరో=చదివించినారా? ఏకాంతంబునన్=ఎవరులేనప్పుడు, భార్గవుల్
=చండామర్కులు, పలికిరో, వైకుంఠుండు=విష్ణువు, ఈదానవశ్రేణికిన్=
ఈరాక్షసకోటికి, కృతాపరాధుండు=ద్రోహమొనర్చినవాఁడు, వర్ణింపన్=
స్తుతించుటకు, నీకు, ఏటికిన్=ఎందుకు?

తా. ప్రహ్లాదా యేమిరా యీవింత! నీకిది నీయంతటనే గలిగినదా
యొవరైన మనవిరోధు లిట్లు చెప్పుమనిరా? లేక మీ గురువులు రహస్యము
గా నీవిద్య నేర్పిరా? ఎవరైన జెప్పనీ యిది సరికాదు. మనరాక్షసులకు నె
ప్పుడు విష్ణువు పరమద్రోహి. వాని పేరు దలఁపకుము.

మ. సురలం దోలుటయో సురాధిపతులన్ శిక్షించుటో సిద్ధు
లం, బరివేధించుటయో మునిప్రవరులన్ బాధించుటో యక్షకి
న్నరగంధర్వవిహంగనాగపతులన్ నాశంబు నొందించుటో
హరియంచున్ గిరియంచు నేలచెడ మోహాంధుండవై పుత్రకా.

టీ. పుత్రకా=కుమారా! సురలన్=దేవతలను, తోలుటయో=తఱుము
టయో, సురాధిపతులన్=ఇంద్రాదిదేవనాథులను, శిక్షించుటో=అల
యఁజేయుటయో, సిద్ధులన్, పరివేధించుటయో=పీడించుటయో, ముని
ప్రవరులన్=మునిశ్రేష్ఠులను, బాధించుటో=బాధపెట్టుటో, యక్ష...పతు
లన్=యక్షులు అశ్వముఖులు గంధర్వులు పక్షులు నాగలోకవాసులను,
నాశంబున్=ప్రళయమును, మోహాంధుండవై=అజ్ఞానమునఁ గన్నుగానక,
హరి గిరి యంచున్, చెడన్, ఏల?

తా. నాయనా! ఇది యొక ఘనకార్య మనుకొంటివా? మనరాక్షస
వీరుల కిది యొకపనియా? ఇదియేమి దేవతలను బాఱఁదోలుట యనుకొంటి
వా? లేక వారినిబట్టి చావబాఁదుట యని తలఁచితివా? సిద్ధులను వేధించు
టా? మునుల తాళము బట్టుటా? యక్షుల మున్నగువారిని రూపుమాపుటా?
పిచ్చివానివలె హరి గిరి యనకు. మనము చేయవలయువాని నేర్వుము.

వ. అనినం దండ్రిమాటలకుం బురోహితు నిరీక్షించి ప్రహ్ల
డిట్లనియె మోహనిర్మూలనంబు సేసి యెవ్వనియందుం
రులయి యెఱుక గలపురుషులకుం బరులు దా. మని
మాయాకృతం బయినయసద్గ్రాహ్యం బగుభేదంబు
బడ దట్టిపరమేశ్వరునకు నమస్కరించెద.

టీ. పురోహితున్=శుక్రునికొడుకయినచదువులయ్యవు, ని
=చూచి, మోహనిర్మూలనంబు=అజ్ఞాననాశనము, తత్పరులు=తవిలి
వారలు, ఎఱుకగలపురుషులు=తెలిసినవారు, మాయాకృతంబు=మా
గలిగినది, అసద్గ్రాహ్యంబు=తెలివిమాలినవారిచే నభ్యసింపఁదగినది.

శా. అజ్ఞుల్ గొందఱు నేము దామనుచు మాయంజెందిసర్వా
బ్రజ్ఞాలభ్యు దురన్వయక్రమములన్ భాషింపఁగా నేర
జిజ్ఞాసాపథమందు మూఢులు గదా చింతింప బ్రహ్మాది
దజ్ఞుల్ తత్పరమాత్ము విష్ణు నితరుల్ దర్శింపఁగా నేర్తు

టీ. అజ్ఞుల్=తెలియనివారు, సర్వాత్మకున్=సర్వరూపిని,
అభ్యున్=జ్ఞానముచేఁ బొందఁదగినవానిని, దురన్వయక్రమములన్=
సంప్రదాయములచేత, భాషింపఁగాన్=పలుకుటకు, చింతింపన్=
పఁగా, ఆజిజ్ఞాసాపథమందున్=దానిం దెలిసికొనుపట్టున, బ్ర
జ్ఞుల్=వేదము లెఱిఁగిన బ్రహ్మమున్నగువారును, మూఢులుగదా=
వారుగదా, తత్పరమాత్మున్=అట్టి పరాత్పరుని, విష్ణున్, ఇతరుల్=
ణులు, దర్శింపఁగాన్=చూచుటకు, నేర్తురే=నేరుతురా.

తా. గురువరా! కొందఱుమూర్ఖులు తామని పరులని మాయ
బుద్ధిగలిగి, సర్వాత్మకుఁడు జ్ఞానమునకు స్వాధీనుఁడు నగువిష్ణునిసంప్ర
శుద్ధిగా వర్ణింపఁజాలరు. మూర్ఖులననేల? వేదవాదు లగుబ్రహ్మాదుల
ము వాని నెఱుఁగరఁట. ఇఁక నితరులనఁగా నెంత?

తే. ఇను మయస్కాంతసన్నిధి నెట్లు భ్రాంత
మగు హృషీకేశుసన్నిధి నావిధమునఁ
గరఁగు చున్నది దైవయోగమునఁ జేసి
బ్రాహ్మణోత్తమ చిత్తంబు భ్రాంత మగుచు. 149

టీ. బ్రాహ్మణోత్తమ = మంచి బ్రాహ్మణుఁడా! దైవయోగమునన్ జేసి = దైవగతిచేత, చిత్తంబు = నామనస్సు, అయస్కాంతసన్నిధిన్ = సూదంటురాయియొద్ద, ఇనుము, ఎట్లు, భ్రాంతము = లోలము, తగులు కొనునది, అగున్ = అగునో, అవిధమునన్ = అలాగున, హృషీకేశు సన్నిధిన్ = విష్ణునిచెంత, భ్రాంతము = చలించునది, అగుచున్, కరఁగు చున్నది = ద్రవీభావమును బొందుచున్నది.

తా. ఉపాధ్యాయులుగారూ! అదియేమి దైవమహిమయో కాని నా మనస్సు సూదంటుఱాతిని యినుము తగులుకొన్నట్లు విష్ణునియందు దృఢముగాఁ బోయి చేరుచున్నది.

సీ. మందారమకరందమాధుర్యమునఁ దేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు
రాయంచ చనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాదియై చొక్కు
కోయిల చేరునే కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరక
మరుగునే సాంద్రనీహారములకు
తే. నంబుజోదరదివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త

చిత్త మేరీతి నితరంబుఁ జేరనేర్చు
వినుతగుణశీల మాటలు వేయు నేల. 150

టీ. వినుతగుణశీల = మంచిగుణములుగలవాఁడా! మందార...మునన్ = కల్పవృక్షపుఁ బూవుదేనెల తీయఁదనమున, తేలుమధుపంబు = ఓలలాడు తుమ్మెద, మదనములకున్ = ముంగ చెట్లమీఁదికి, పోవునే, నిర్మల...కలన్ = శుభ్రమైనగంగాతరంగములయందు, తూఁగురాయంచ = తూఁగాడుహంస, తరంగిణులకున్ = నదులకు, చనునే = వెళ్ళునా, లలిత...ఖాది = సుందరమైన మామిడిచిగురులను మెక్కినది, సౌఖ్య = సైమఱచు, కుటజములకున్ = కొడిసెచెట్లకు, పూర్ణేందు..రకము = నిండుజాబిల్లి వెన్నెలచే నలరిన వెన్నెలపులుఁగు, సాంద్రనీహారములకున్ = గట్టియుంచుగడ్డలమీఁదికి, అరుగునే = పోవునా, అంబు...చిత్తము = విష్ణునిదివ్యపాదకమలముల ధ్యానమనునమృతము ద్రావుటచే మిక్కిలి కైపెక్కినమనస్సు, ఏరీతిన్ = ఏలాగున, ఇతరంబున్ = మఱియొకదానిని, చేరనేర్చున్ = పొందఁగలదు.

తా. గురూత్తమా! వేయిమాట లెందుకుగాని కల్పవృక్షములలో పూవుదేనెలు ద్రాగు తుమ్మెద ముంగచెట్లను మఱచియైన చేరునా? గంగానదియొక్క అలలలోఁ దూఁగియాడు హంస మనసములలోనికి వచ్చునా? తీయనిమామిడిచిగురు దినుచున్న కోయిల కొడిసెచెట్లమీఁదికిఁ బోవఁగోరునా? పున్నమనాఁటి చంద్రుని వెన్నెలను ద్రావి ససిసినతీతువు మంచుపెళ్లలమీఁది కెప్పుడైన వెళ్లునా? అట్లే, శ్రీహరిధ్యానముచేఁ బరవశమైన మనస్సు ఎట్లు మఱియొకవంకకుఁ దిరుగునో చెప్పుఁడీ?

వ. అనిన విని రోషించి రాజసేవకుఁ డైనపురోహితుండు ప్రహ్లా
దుం జూచి తిరస్కరించి యి ట్లనియె. 151

టీ. రోషించి = కోపపడి, రాజసేవకుండు = రాజైన హిరణ్యకశిపునిచిత్తముప్రకారము సేవచేయువాఁడు, పురోహితుఁడు = శుక్రునికొడుకు, తిరస్కరించి = అదలించి.

ఉ. పంచశరద్వయస్కుఁడవు బాలుఁడ వించుక గాని లేవు భా
షించెదు తర్కవాక్యములు చెప్పినశాస్త్రములోనియర్థ మొ
క్కించుకయైనఁ జెప్ప వసురేంద్రునిముందట మాకు నౌఁదలల్
వంచుకొనంగఁ జేసితివి వైరివిభూషణ వంశదూషణా. 1[illegible]2

టీ. వైరివిభూషణ = శత్రువులకు నలంకారమైనవాఁడా! వంశదూషణా = కులనాశకుఁడా! ప్రహ్లాదా! నీవు, పంచశరద్వయస్కుఁడవు = పదేండ్లవాఁడవు, బాలుఁడవు = కుఱ్ఱవాఁడవు, ఇంచుక = కొంచెము, తర్కవాక్యములు = తర్కములోనివాదములు, భాషించెదు = చెప్పెదవు, చెప్పిన...యర్థము = మేము నేర్పిన శాస్త్రములోనిసంగతి, ఒక్కించుకయైనన్ = కొంచెమైనను, మాకున్, అసురేంద్రునిముందటన్ = హిరణ్యకశిపు మహారాజుగారి యెదుట, ఔఁదలల్ = తలలు, వంచుకొనంగన్, చేసితివి.

తా. ఓరీ కులపాంసనా! శత్రుహితుఁడా! ప్రహ్లాదా! నీవు చూడనయిదేండ్ల కుఱ్ఱవాఁడవు. ఇంతలేవు. ఏమో తర్కమూ అంతయూ మాటలాడెదవు. మేముకష్టపడి బోధించినశాస్త్రములోనిది ఒక్కటియుఁ జెప్పవు. రాజుగారి యెదుట మా కవమానము దెచ్చితివి ఇఁకఁ జాలును.

చ. తనయుఁడు గాఁడు శాత్రవుఁడు దానవభర్తకు వీఁడు దైత్యచం
దనవనమందుఁ గంటకయుతక్షితిజాతముభంగిఁ బుట్టినాఁ
డనవరతంబు రాక్షసకులాంతకుఁ బ్రస్తుతి సేయుచుండు దం
డనమునఁ గాని శిక్షలకు డాయుఁడు పట్టుఁడు కొట్టుఁ డుద్ధతిన్.

టీ. వీఁడు = ఈప్రహ్లాదుఁడు, దానవభర్తకు = హిరణ్యకశిపునకు, తనయుఁడు = కొడుకు, దైత్యచందనవనమందు = రాక్షసులను మంచిగంధపుఁజెట్లతోఁటయందు, కంటకయుతక్షితిజాతముభంగిన్ = ముండ్లచెట్టుమాదిరి, అనవరతంబు = ఎప్పుడును, రాక్షసకులాంతకున్ = విష్ణువును, ప్రస్తుతి = స్తోత్రము, దండనమునన్ గాని = దండించినగాని, శిక్షలకున్ =

మా నేర్పుచదువులపద్ధతులకు, డాయఁడు = చేరఁడు, ఉద్ధతిన్ = ఆటోప ముతో, పట్టుఁడు = పట్టుకొనుఁడు, కొట్టుఁడు.

తా. హిరణ్యకశిపునకు వీఁడు కాత్రపుఁడుగాని కొడుకుగాఁడు నిర్మలమైన రాక్షసకులమను గంధపు తోఁటయందు ఈదుర్మార్గుఁడు ముళ్లచెట్టునుబోలి పుట్టినాఁడు, ఎప్పుడు రాక్షసకులము నాశనము సేయుచున్న విష్ణుని నుతించును. వీనిని కఠినముగా దండించినఁగాని మనదారికి రాఁడు. పట్టి కొట్టుఁడు.

క. ఈపాపనిఁ జదివింతుము
నీపాదము లాన యింక నిపుణతతోడం
గోపింతుము దండింతుము
కోపింపకు మయ్య దనుజకుంజర వింటే. 154

టీ. దనుజకుంజర = రాక్షసశ్రేష్ఠా! వింటే=విన్నావా, ఈపాపనిన్ = ఈకుఱ్ఱవానిని, చదివింతుము. నీపాదములు ఆన = నీయడుగులు ప్రమాణము, నిపుణతతోడన్ = కౌశల్యముతో, కోపింతుము, దండింతుము, కోపింపకుము అయ్య=అగ్రహింపకు మయ్యా.

తా. రాజా! కోపపడవలదు. ఇఁకమీఁద వీనిని గట్టిగా తిట్టికొట్టి చదువునేరుపఁగలము. నీయడుగులతోడు. నేరుపుగా వీని జదివింతుము.

వ అని మఱియు నారాచపాపనికి వివిధోపాయంబులం బురోహితులందు వెఱపుఁ జూపుచు రాజసన్నిధిం బాపి తోడుకొనిపోయి యేకాంతంబున. 155

టీ. రాచపాపనికిన్ = రాజుకొడుకునకు, వివిధోపాయంబులన్ = నానాయుక్తులచేత, వెఱపు = భయము, చూపుచున్, రాజసన్నిధిన్ = రాజుసమక్షమును, పాసి = తొలఁగి, తోడుకొనిపోయి = తీసికొనిపోయి, ఏకాంతంబునన్ = రహస్యమునందు.

క. భార్గవనందనుఁ డతనికి
మార్గము చెడ కుండఁ బెక్కుమాఱులు నిచ్చల్
వర్గత్రితయము చెప్పె న
నర్గళ మగుమతివిశేష మమర నరేంద్రా. 156

టీ. నరేంద్రా = ధర్మరాజా! భార్గవనందనుఁడు = శుక్రనికొడుకు, అతనికిన్ = అప్రహ్లాదునకు, మార్గము = త్రోవ, చెడకుండఁగ = చెదరకుండునట్లు, నిచ్చలు = ఎల్లప్పుడు, పెక్కుమాఱులు = బహుపర్యాయములు, అనర్గళము = అడ్డులేనిది, మతివిశేషము = ధీచాతుర్యము, అమరన్ = మెఱయునట్లు, వర్గత్రితయము = ధర్మార్థకామముల మూడగు, చెప్పెన్ = నేర్పెను.

తా. రాజా! వానికి శుక్రనికొడుకు తనచాతుర్యముకొలఁది, ధర్మార్థకామములత్రోవలు పలుమాఱు తరిచి తరిచి చెప్పుచు వచ్చెను.

వ. మఱియు గురుండు శిష్యునకు సామదానభేదదండోపాయంబు లన్నియు నెఱింగించి నీతికోవిదుం డయ్యె నని నమ్మి నిశ్చయించి తల్లికి నెఱింగించి తల్లిచేత నలంకృతుం డయిన కులదీపకు నవలోకించి. 157

టీ. సామ...పాయంబులు = సామము దానము భేదము దండము ననుపాయములు, నీతికోవిదుండు = రాజనీతియందు సమస్తము నెఱిఁగినవాఁడు, కులదీపకున్ = వంశప్రకాశకుఁ డగు ప్రహ్లాదుని, అవలోకించి = చూచి.

ఉ. త్రిప్పకు మన్న మానుతము దీర్ఘము లైన త్రివర్గపాఠముల్
దప్పకు మన్న నేఁడు మనదైత్యవరేణ్యునిమ్రోల నేమునుం
జెప్పినరీతి గాని మఱి చెప్పకు మన్న విరోధినీతులం
విప్పకు మన్న దుష్ట మగువిష్ణుచరిత్రకథార్థజాలముల్. 158

టీ. అన్న = నాయనా ప్రహ్లాదా! మా మతము = మా చెప్పిన చదువుల ధోరణిని, దీర్ఘములు = పెద్దవి, త్రివర్గపాఠముల్ = ధర్మార్థకామముల త్రోవలు, దైత్యవరేణ్యుని ప్రోలన్ = హిరణ్యకశిపుని యెదుట, విరోధిశాస్త్రముల్ = పగవారి చదువులు, దుష్టము = చెడినవి, విష్ణుచరిత్రకథార్థజాలముల్ = విష్ణుగాథల సమూహములు, విప్పకుము.

తా. నాయనా ప్రహ్లాదా! నేఁడు, మా చెప్పిన చదువులు మఱువక మా పరువు దక్కించుము. మేము చెప్పిన పెద్దపెద్ద ధర్మార్థకామముల పాఠములు తప్పిపోకుము. ఈవేళ మహారాజా గారియెదుట మేము చెప్పిన యెల్లవిద్యలలో నీచాతుర్యముఁ జూపుము. మనకు శత్రువగు విష్ణుని గాథలు త్రవ్వకుము.

వ. అని బుజ్జగించి దానవేశ్వరునిసన్నిధికిం దోడితెచ్చి. 159

టీ. బుజ్జగించి = ఓదార్చి, దానవేశ్వరుసన్నిధికిన్ = హిరణ్యకశిపునిదగ్గఱకు

సీ. అడుగడుగునకు మాధవానుచింతనసుధా
మాధుర్యమున మేను మఱచువాని
నంభోజగర్భాదు లభ్యసింపఁగ లేని
హరిభక్తి పుంభావ మైనవాని
మాతృగర్భము చొచ్చి యున్నది మొదలుగాఁ
జిత్తమచ్యుతుమీఁదఁ జేర్చువాని
నంకించి తనలోన నఖిలప్రపంచంబు
శ్రీవిష్ణుమయ మని చెలఁగువాని
తే. వినయకారుణ్యబుద్ధివివేకలక్ష
ణాదిగుణముల కాటపట్టయినవాని
శిష్యు బుధలోకసంభావ్యుఁ జేరి గురుఁడు
ముందఱికి ద్రొబ్బి తండ్రికి మ్రొక్కుమనుచు. 160

టీ. గురుఁడు = ప్రహ్లాదుని చదువులయ్యవారు, మాధవా...మునన్ = విష్ణుధ్యాన మనువ్రతము తీయఁదనముచే, మేను = శరీరము, అంభోజగర్భాదులు = బ్రహ్మమొదలగువారును, అభ్యసింపఁగన్ = నేర్చుటకు, లేనిహరిభక్తి = చాలనివిష్ణుభక్తి, పుంభావము = పురుషాకారమును దాల్చుట, మాతృగర్భము = తల్లికడుపు, చొచ్చి = దూఱి, మన్నది మొదలుగాన్ = బ్రతికినదాదిగా, అచ్యుతుమీఁదన్ = విష్ణువుమీఁద, అంకించి = యోచించి, తనలోనన్ = తనమనస్సులోపల, అఖిలప్రపంచంబు = ఎల్లజగత్తు, శ్రీవిష్ణుమయము = విష్ణుస్వరూపము, చెలఁగువానిన్ = సంతసములోనుండువానిని, వినయ...గుణములకున్ = అడఁకువ భూతదయ తెలివితేటలు మొదలగు మంచిగుణముల కన్నిటికిని, ఆటపట్టు = విహారస్థానము, బుధలోకసంభావ్యున్ = జ్ఞానులచే గౌరవింపఁదగినవాఁడు, శిష్యున్ = శిష్యుఁడగు ప్రహ్లాదుని, చీరి = పిలిచి.

తా. ప్రతిక్షణమును విష్ణువునుధ్యానించి పైమఱచువాఁడును, బ్రహ్మాదులకును లభ్యముగాని విష్ణుభక్తియొక్క పురుషాకృతివలె నున్నవాఁడును, తల్లికడుపులోఁ బ్రవేశించినది మొదలు విష్ణువునందు మనస్సు నిల్పినవాఁడును, చక్కఁగా విచారించి తనమనస్సులో నీయెల్లలోకములు విష్ణురూపములే యని దృఢము చేసికొన్నవాఁడును, అడఁకువ దయ మొదలగునెల్ల గుణములకు నిలైనపండితమాన్యుఁడైనయాశిష్యుఁ డగు ప్రహ్లాదునిఁ బిలిచి, ముందుకు నెట్టి మీ నాయనకు నమస్కారముఁ జేయుమా యని చెప్పెను.

క. శిక్షించితి మన్యము లగు
పక్షంబులు మాని నీతిపారగుఁ డయ్యెన్
రక్షోవంశాధీశ్వర
వీక్షింపుము నీకుమారువిద్యాబలమున్. 161

టీ. రక్షోవంశాధీశ్వర = రాక్షసకులమునకుఁ బ్రభువైనవాఁడా! వీనిని, శిక్షించితిమి = చక్కఁగా బోధించితిమి, అన్యములు = శత్రువుల

వగు, పక్షంబులు = త్రోవలు, మాని = విడిచి, నీతిపారగుఁడు = నీతిశాస్త్రమునం దుదముట్టినవాఁడు, నీకుమారువిద్యాబలముఁ = నీకొడుకు చదువు బలమును, వీక్షింపుము = పరిశీలింపుము.

తా. రాక్షసరాజా! నీకుమారుని చక్కఁగా శిక్షించి, చదివించినారము. శత్రుపక్షముల మానినాఁడు. ఎల్లవిద్యలలో గొప్పపండితుఁడైనాఁడు. పరిశీలింపుఁడు.

వ. అని పలికిన శుక్రకుమారకువచనంబు లాకర్ణించి దానవేంద్రుండు దనకు దండప్రణామంబు చేసి నిలుచున్న కొడుకును దీవించి బాహుదండంబులు సాఁచి డిగ్గన డగ్గఱం దిగిచి గాఢాలింగనంబు సేసి తనతొడలమీఁద నిడుకొని చుంచు దువ్వి చిబుకంబుఁ బుడికి చెక్కిలి ముద్దుగొని శిరంబు మూర్కొని ప్రేమాతిరేకసంజనితబాష్పసలిలబిందుసందోహంబుల నతనివదనారవిందంబు దడుపుచు మందమధురాలాపంబుల నిట్లనియె. 162

టీ. శుక్రకుమారకువచనంబులు = శుక్రునికొడుకుమాటలు, ఆకర్ణించి = విని, సాఁచి = జాఁచి, డిగ్గన = వేగముగా, డగ్గఱన్ దిగిచి = చేరఁదీసికొని, గాఢాలింగనంబు = బిగి కౌఁగిలింతను, చుంచు = జులపాలు, చిబుకంబు = గడ్డము, పుడికి = తడివి, మూర్కొని = వాసనచూచి, ప్రేమా...సందోహంబులన్ = అతిసంతోషమువలనఁ బుట్టిన కన్నీళ్లధారలచే, వదనారవిందంబు = మోముదమ్మిని, మందమధురాలాపములన్ = మెల్లని తీయనిమాటలతో.

శా. చోద్యం బయ్యెడి నింతకాల మరిగెన్ శోధించి యేమేమి సం
వేద్యాంశంబులు చెప్పిరో గురువు లేవెంటం బఠింపించిరో
విద్యాసార మెఱుంగఁ గోరెద భవద్విజ్ఞాతశాస్త్రంబులోఁ
బద్యం బొక్కటి చెప్పి సార్థముగఁ దాత్పర్యంబు భాషింపుమా.

టీ. చోద్యంబు=చిత్రము, అరిగెన్=కడచెను, శోధించి=పరిశీలించి, సంవేద్యాంశంబులు = తెలియఁదగినసంగతులు, విద్యాసారము = విద్యల సారాంశము, భవద్విజ్ఞాతశాస్త్రంబులోన్ = నీకుఁదెలిసినశాస్త్రములోని, పద్యంబు, సార్థముగన్=అర్థముతోకూడ, తాత్పర్యంబు, భాషింపుమా = చెప్పుమా.

తా. కుఱ్ఱా! చిత్రమయ్యెడిని, ఎంతకాలమయినదోయీ నీవు చదువసాగి? చక్కఁగాఁ దలఁచి యేమేమి నేర్చితివో మీగురువులెట్లు చదివించినారో నీ చదువులసారము వినఁగోరెదను. నీవు చదివినశాస్త్రములో నొక్క మంచి పద్యమునకు అర్థము చెప్పి, తాత్పర్యముగూడ చెప్పుము.

శా. నిన్నున్ మెచ్చరు నీతిపారమహిమన్ నీతోడిదైత్యార్భకుల్
గన్నా రన్నియుఁ జెప్ప నేర్తురుగదా గ్రంథార్థముల్ దక్షులై
యన్నా యెన్నఁడునీవు నీతివిదుఁడౌదంచున్ మహావాంఛతో
నున్నాఁడన్ ననుఁ గన్నతండ్రి భవదీయోత్కర్ష ముంజూపవే

టీ. అన్నా=నాయనా ప్రహ్లాదా! నీతోడిదైత్యార్భకుల్=నీయీడు జోడగు రాక్షసుల పిల్లకాయలు, నీతిపారమహిమన్ = నీతిశాస్త్రములు చదువుకొన్న ప్రభావముచేత, నిన్నున్, మెచ్చరు=మెచ్చుకొనరు, గ్రంథార్థముల్=గ్రంథముల సారాంశములు, అన్నియున్, కన్నారు = నేర్చుకొన్నారు, దక్షులై=సమర్థులై, చెప్పనేర్తురుగదా, నీవు, ఎన్నఁడు, నీతివిదుఁడు=నీతికోవిదుఁడవు, ఔదువో, మహావాంఛతోన్ = అత్యాశతో, భవదీయోత్కర్షమున్=నీ గొప్పతనమును, చూపవే.

తా. కుమారా! నీతోఁ జదువమొదలిడిన యీడు పిల్లకాయలందఱు చదువులలో నీకన్నఁ బ్రబలులైరి. వారు నిన్ను మెచ్చుకొరుగదా. వారన్ని గ్రంథములను జక్కఁగాఁ జదువుకొనిరి. అన్నియు విప్పిచెప్పఁగలరు. నాయనా! నీవెన్నఁడు పండితుఁడ వౌదువో యని నేను మిగుల నాశతో నువ్విళ్లూరుచున్నాను. తండ్రీ నీ చాతుర్యముం జూపుము.

వ. అనినం గన్నతండ్రికిఁ బ్రియనందనుఁ డయినప్రహ్లాదుం డి ట్లనియె. 165

టీ. ప్రియనందనుండు=ముద్దులకొమారుఁడు, ఇట్లు అనియెన్.

క. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్లఁ జదివితిఁ దండ్రీ. 166

టీ. తండ్రీ=నాయనా! నను౯, గురువులు, చదివించిరి, ధర్మార్థముఖ్యశాస్త్రంబులు = ధర్మశాస్త్రము తర్కశాస్త్రము మొదలైనవి, పెక్కులు=అనేకములు, మర్మము=రహస్యము.

తా. నాయనా! నాకు గురువులు, బాగుగాఁ జెప్పిరి. అన్నిశాస్త్రములు జదివినాను. నేను జదివినవి పెక్కులు గలవు. ఇదియదియననేల? చదువులలోని సారమంతయు గ్రహించితిని.

మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్
వందనార్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీ
ర్తనల్ చింతనం, బనునీతొమ్మిది భక్తిమార్గముల సర్వా
త్మున్ హరిన్ నమ్మి స, జ్జనుఁడై యుండుట భద్ర మంచుఁ
దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా. 167

టీ. దైత్యోత్తమా=రాక్షసులకు రాజైనయోతండ్రీ! తనుహృద్భాషల౯=మనోవాక్కాయములచేత, సఖ్యము౯=ప్రేమించుటయు, శ్రవణము౯=వినికియు, దాసత్వము౯=కైంకర్యమును, వందనార్చనముల్ = మ్రొక్కుటలు పూజించుటలును, సేవయు౯=పరిచర్యయు, ఆత్మలో=తనయందు, ఎఱుకయు౯=తెలివియు, సంకీర్తనల్ = పాడుటలును, చింతనంబు=ధ్యానమును, తొమ్మిది, భక్తిమార్గముల౯ = భక్తిమార్గములచేత, సర్వా

త్మక్ = సర్వస్వరూపియగు, సజ్జనుఁడు = సాధువు, భద్రము = శ్రేయము, సత్యంబు = నిజము.

తా. రాక్షసరాజా! సర్వాంతర్యామి యగు శ్రీహరిని నమ్మి, మనోవాక్కాయములచే ప్రేమించుట, వినుట, భృత్యుఁడగుట, మ్రొక్కుట, పూజించుట, పరిచరించుట, తనలో నెయ్యము గలిగియుండుట, కీర్తనము, ధ్యానము, అనునట్టి భక్తిమార్గములు తొమ్మిదిచేతను సేవించుచుఁ గాలము ద్రోయుట శ్రేయస్కర మని నాయభిప్రాయము.

శా. అంధేందూదయముల్ మహాబధిరశంఖారావముల్ మూకస
ద్గ్రంథాఖ్యాపనముల్ నపుంసకవధూకాంక్షల్ కృతఘ్నావలీ
బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధద్రవ్యముల్ క్రోడస
ద్గంధంబుల్ హరిభక్తివర్జితులరిక్తవ్యర్థసంసారముల్. 168

టీ. హరి...సంసారముల్ = విష్ణుభక్తి లేనివారి శూన్యములై ప్రయోజనహీనములైన యాసంసారములు, అంధేందూదయముల్ = గ్రుడ్డివాని పాలి వెన్నెలలు, మహా...ముల్ = చెవిటివాని చెంత శంఖధ్వనులు, మూక...ముల్ = మూఁగవానికిఁ జెప్పిన మంచిగ్రంథములబోధలు, నపుంసకవధూకాంక్షల్ = మగతనము లేనివానికి మగువలఁ బొందుగోరుటలు, కృత...బులు = మేలెఱుఁగనివారితోడి చుట్టఱికములు, భస్మహవ్యములు = బూడిదలోని హోమములు, లుబ్ధద్రవ్యముల్ = లోభివానికలిములు, క్రోడసద్గంధంబుల్ = పందులకుఁ గలసువాసనలు.

తా. తండ్రీ! సర్వగతుఁ డగువిష్ణుని దెలియలేనివారుగనుక విష్ణుభక్తి లేనివారి యీవ్యర్థసంసారవిడంబనములు గ్రుడ్డివానికి గలవెన్నెలవంటివి. చెవిటివానిచెంత శంఖధ్వనులవంటివి. మూఁగవానికి శాస్త్రార్థములు చెప్పుటవంటివి. పేడివాఁ డువిదలఁ గోరుటవంటివి. చేసినమేలును మఱచిపోవువారి చుట్టఱికములవంటివి. బూడిదలోని హోమములవంటివి. లోభివాని సొమ్మువంటివి. పందికి దొరికిన పన్నీరువంటివి.

సీ. కమలాక్షు నర్చించుకరములు కరములు
శ్రీనాథు వర్ణించుజిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచుచూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కుశిరము శిరము
విష్ణు నాకర్ణించువీనులు వీనులు
మధువైరిఁ దవిలినమనము మనము
భగవంతు వలఁగొనుపదములు పదములు
పురుషోత్తమునిమీఁదిబుద్ధి బుద్ధి
తే. దేవదేవునిఁ జింతించుదినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించుచదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడిగురుఁడు గురుఁడు
తండ్రి హరిఁ జేరు మనియెడితండ్రి తండ్రి. 169

టీ. కమలాక్షున్ = (తామరలవంటికన్నులుగల) విష్ణుని, అర్చించు కరములు = పూజించెడుహస్తములు, కరములు = చేతులు. శ్రీనాథున్ = లక్ష్మీపతిని, వర్ణించుజిహ్వ = స్తోత్రముచేయునాలుక, సురరక్షకునిన్ = దేవతలఁ గాచువానిని, చూచుచూడ్కులు = చూచెడుకన్నులు, శేషశాయికిన్ = ఆదిశేషువు పానుపుగాఁగలవానికి, మ్రొక్కుశిరము = మ్రొక్కెడు నాఁదల, ఆకర్ణించువీనులు = వినుచెవులు, మధువైరిన్ = మధువనువానికి శత్రువగువిష్ణుని, తవిలినమనము = కూడినచిత్తము, భగవంతున్ = షడ్గుణైశ్వర్యసంపన్నుఁ డగువానిని, వలఁగొనుపదములు = ప్రదక్షిణముచేయు పాదములు, పురుషోత్తమునిమీఁదిబుద్ధి = విష్ణునిమీఁది తలఁపు, దేవ దేవునిన్, చింతించుదినము = ధ్యానించురోజు, చక్రహస్తుని = సుదర్శన ధారియగువిష్ణుని, ప్రకటించుచదువు = వెల్లడించెడి చదువు, కుంభినీధవున్ = భూపతియగు విష్ణువును, హరిన్ = విష్ణువును, చేరుమనియెడితండ్రి = చేరుమనిబోధించుతండ్రియే, తండ్రి.

తా. తండ్రీ! విష్ణుని బూజించునవియే చేతులు. వట్టిచేతులు చేతులు గావు. ఆయనను స్తోత్రము చేయునదియే నాలుక. హరిని గాంచునవియే కన్నులు. నారాయణునకు మ్రొక్కునదియే శిరస్సు. విష్ణుకథలు వినునవియే చెవులు. హరియందు లగ్నమైనదే చిత్తమనవలెను. ఆయనకు ప్రదక్షిణము చేయునవియే పాదములు. ఆయనమీఁదిబుద్ధియే బుద్ధి. ఆదేవుని ధ్యానము దొరకినదే సుదినము. ఆయనగాథలు గలదే మంచిచదువు. ఆమహానుభావుని దెలియఁ జెప్పువాఁడే గురువు. నాయనా హరిని బొందుమని బోధించువాఁడే తండ్రిగాని యితరులు తండ్రులా? కారు.

సీ. కంజాక్షునకుఁ గానికాయంబు కాయమే
పవనగుంఫితచర్మభస్త్రి గాక
వైకుంఠుఁ బొగడనివక్త్రంబు వక్త్రమే
ఢమఢమధ్వనితోడిఢక్క గాక
హరిపూజనము లేనిహస్తంబు హస్తమే
తరుశాఖనిర్మితదర్వి గాక
కమలేశుఁ జూడనికన్నులు కన్నులే
తనుకుడ్యజాలరంధ్రములు గాక
ఆ. చక్రిచింత లేనిజన్మంబు జన్మమే
తరళసలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేనివిబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడిపశువు గాక. 170

టీ. కంజాక్షునకున్ = కమలములఁ బోలుకన్నులు గల విష్ణువునకు, కానికాయంబు = ఉపయోగింపనిశరీరము, కాయమే = శరీరమా, పవనగుంఫితచర్మభస్త్రి = గాలిచేనిండిన తోలుసిద్దె, వైకుంఠున్ = విష్ణుని, పొగడనివక్త్రంబు = స్తుతింపనినోరు, ఢమఢమధ్వనితోడిఢక్క = ఢమఢమయుని

ప్రోగుదుంగా, హరిపూజనములేనిహస్తంబు = విష్ణుపూజయొనరింపనిచేయి, తరు...దర్వీ = చెట్టుకొమ్మ చేఁజేసిన తెడ్డు, కమలేశుఁడు = శ్రీనాథుని, తను...ములు = శరీరమనుగోడయందలి కిటికీలు, తరళసలిలబుద్బుదంబు = కదలుచున్ననీరుబుగ్గ, విబుధుండు = విద్వాంసుఁడు, పాదయుగముతోడిపశువు = రెండుకాళ్లు గలగొడ్డు.

తా. రాక్షసరాజా! విష్ణువునకుఁ బనికిరానిశరీరమును ఒక శరీరమేనా? కాదు. అదియొక గాలినిండినతోలుసిద్దె యనవలెను. హరినామకీర్తనలేనిది నోరా? ధమధమయనిమ్రోఁగు నొకవాద్యమే. హరిని పూజింపనిది చేయియా? అదియొక కొయ్యతెడ్డు. శ్రీనారాయణుని చూడనివి కన్నులా? ఈ శరీరమను గోడలోని కిటికీలే. విష్ణుధ్యానమెఱుఁగని జన్మము నొక జన్మమేనా? అది నీటిలోఁ గదలు బుగ్గయే. వైష్ణవభక్తిలేనివాఁడును నొకపండితుఁడా? వాఁడు రెండుకాళ్ల దున్నపోతనియే చెప్పవలెను.

సీ. సంసారజీమూతసంఘంబు విచ్చునే
చక్రిదాస్యప్రభంజనము లేక
తాపత్రయాభీలదావాగ్ను లాఱునే
విష్ణుసేవామృతవృష్టి లేక
సర్వంకషాఘౌఘజలరాసు లింకునే
హరిమనీషాబడబాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధకారంబు లడఁగునే
పద్మాక్షునుతిరవిప్రభలు లేక
తే. నిరుపమాపునరావృత్తినిష్కళంక
ముక్తినిధిఁ గాన వచ్చునే ముఖ్యమైన
శార్ఙ్గకోదండచింతనాంజనము లేక
తామరసగర్భునకు నైన దానవేంద్ర. 171

టీ. దానవేంద్ర = రాక్షసరాజా ! తామరసగర్భునకున్ ఐనన్ = బ్రహ్మకైనను, చక్రిదాస్యప్రభంజనము = విష్ణుకైంకర్యమను పెద్దగాలి, లేక, సంసారజీమూతసంఘంబు = సంసారమను మేఘములప్రోవు, విష్ణుసేవామృతవృష్టి = శ్రీహరిసేవయను నమృతపువాన, తాప...ఘ్నలు = మూఁడుతాపము లనుభయంకరములైన కాఱుచిచ్చులు, హరి...బాగ్ని = విష్ణుచింతయను సముద్రవహ్ని, సర్వం...రాసులు = ఎల్లెడలనిండియున్న సముద్రములు, పద్మా...భలు = విష్ణుస్తోత్రములను నెండలు, ఘన...రంబులు = ఆపదలను దట్టపుఁజీఁకటులు, అడఁగునే = నశించునా, ముఖ్యము = ప్రధానము, శార్ఙ్గ...జనము = విష్ణుధ్యానమను కాటుక, నిరుపమా...నిధిన్ = సాటిలేనినిర్మలమైన మోక్షపదవిని, కానన్ వచ్చునే = చూడ నలవియా ?

తా. నాయనా! బ్రహ్మకైననుసరే విష్ణుసేవలేక సంసారమేఘముల విముక్తి కలుగునా? విష్ణుసేవయనువాన లేక తాపత్రయమను కాఱుమంటలు చల్లారునా? భగవత్కైంకర్యమనుబడబాగ్ని లేక ఎచ్చటఁ జూచినను కుప్పలు తెప్పలుగా నిండిన పాపసముద్రములు ఎండిపోవునా? విష్ణుసేవయను నెండ గాయక ఆపదలను కటికిచీఁకటులు విచ్చునా? విష్ణుధ్యానమను కాటుక లేక పునరావృత్తిలేని విమలమైన కైవల్యము దొరకునా? దొరకదు.

వ. అని యివ్విధంబున వెఱపు మఱపు నెఱుంగక యులుకు చెడి పలికెడికొడుకు నుడువులు చెవులకు ములుకులక్రియ నొద వినఁ గటము లదరఁ బెదవులం గఱచుచు నదరి పడి గురుసుతునిం గనుంగొని వినుతకథనంబులు గఱపినాఁడ వని దానవేంద్రుం డిట్లనియె. 172

టీ. దానవేంద్రుండు = హిరణ్యకశిపుఁడు, వెఱపు = భయము, మఱపు = విస్మృతి, ఉలుకుసెడి = లెక్కసేయక, నుడువులు = మాటలు, ఓదవినన్ = కాఁగా, కటములు = కణఁతలు, కఱచుచు = కొఱు

కుచు, అదరిపడి = మిడిసిపడి, గురుసుతుఁడా = శుక్రునికొడుకును, విమత కథనంబులు = పగవారికథలు, కఱపినాఁడవు = నేర్పినావు.

చ. పటుతరనీతిశాస్త్రచయపారగుఁ జేసెద నంచు బాలు నీ
వటు గొనిపోయి వానికి ననర్థము లైనవిరోధిశాస్త్రముల్
కుటిలతఁ జెప్పినాఁడవు భృగుప్రవరుండ వటంచు నమ్మితిం
గటకట బ్రాహ్మణాకృతివిగాక యథార్థపు బ్రాహ్మణుండవే. 173

టీ. నీవు, బాలుఁడా, పటు...పారగుఁడా = అనింద్యమైన నీతిశాస్త్రము చివరదాఁకఁ జదివినవానిఁగా, అనర్థములు = తగనివి, విరోధిశాస్త్రముల్ = శత్రువుల చదువులు, కుటిలతఁడా = కపటునిలో, భృగుప్రవరుండవు = భృగువంశపు బ్రాహ్మణులలో మేటివి, కటకట = అయ్యో, బ్రాహ్మణాకృతివి = బ్రాహ్మణవేషములో నున్నవాఁడవు, యథార్థపు బ్రాహ్మణుండవే = నిజమైనబాపఁడవా.

తా. గురుపుత్రా! పిల్లకాయను దీసికొనిపోయి నేను జక్కఁగా శిక్షించి యన్ని చదువులు బాగుగ నేర్పి తెచ్చెదనని కొనిపోయి, వానికి మాకుఁ గానివారి చదువులను నేర్పి మోసముచేసితివి. గుర్వాగ్రఁడా! నీవు భృగువంశమునఁ బుట్టిన సద్బ్రాహ్మణుఁడవుగదా యని మోసపోయితివి. ఓరీ! నీవు బ్రాహ్మణవేషము వేసికొన్నావే కాని నిజముగా బ్రాహ్మణుఁడవా?

క. ధర్మేతరవర్తనులును
దుర్మంత్రులు నైనజనులదురితము లొందుం
మర్మములు గలఁచి కల్మష
కర్ముల రోగములు వొందుకై వడి విప్రా. 174

టీ. విప్రా = బ్రాహ్మణా! కల్మషకర్ములన్ = పాపపుఁ బనులఁ జేసినవారిని, మర్మములు = ఆయువుపట్టులు, కలఁచి = పీడించి, రోగములు, పొందుకైవడిన్, ధర్మేతరవర్తనులు = అన్యాయమార్గమున జనువారు, దుర్మంత్రులు = చెడ్డతలఁపులు గలవారు, దురితములు = పాపములు.

తా. బ్రాహ్మణా! పరదారగమనాది పాపకర్మములు జేసిన వారిని మర్మములకెక్కిన రోగములు పీడించినట్లు, అన్యాయమార్గములో మెలఁగిన కుత్సితబుద్ధిగలజనులను బాపములు చుట్టుకొనుట నిశ్చయము. నీవు నన్ను మోసముచేసి, నాకొడుకును జెడఁగఱపి పాపివైతివి.

వ. అనిన రాజునకుఁ బురోహితుం డిట్లనియె. 175

ఉ. తప్పులు లేవు మావలన దానవనాథ విరోధిశాస్త్రముల్
చెప్పము క్రూరులై పరులు చెప్పరు మీచరణంబులాన సు
మ్మెప్పుడు మీకుమారునకు నింతయు నైజమనీష యొవ్వరుం
జెప్పెడిపాటి గాదు ప్రతిచింతఁ దలంపుము నేర్పుకైడిన్.

టీ. దానవనాథ = రాక్షసులరేఁడా! మావలన, తప్పులు = దోషములు, విరోధిశాస్త్రములు = శత్రువులవిద్యలు, క్రూరులు = దుర్మార్గులు, పరులు = కానివారు, మీచరణంబులానసుమ్ము = మీపాదాలానసుమీ, ఇంతయున్ = ఇదియంతయును, నైజమనీష = తనంతగలిగిన బుద్ధియే, చెప్పెడిపాటి = నేర్పవీలైనది, కాదు, నేర్పుకైడిన్ = నీప్రజ్ఞకొలఁది, ప్రతిచింత = ప్రతిక్రియ తలంపుము = యోజింపుము.

తా. రాక్షసరాజా మేమొక్క తప్పిదము నెఱుఁగము నీపాదములాన సుమా. నీకొడుకునకు మేము దుర్బోధములు చేయలేదు. ఏవిరోధులు వానికిబోధింపలేదు. ఇది వాని కొకరు నేర్పినఁ బట్టినవి గావు. వానికిఁ బుట్టుకతోఁగలిగినవే. ఇఁక నీశక్తికొలఁది వానికాబుద్ధి తిరుగునట్లు చేయవలసినదే కాని మమ్ము నిందించి లాభములేదు. మాశక్తికొలఁది పోరాడితిమి.

క. మిత్రులము పురోహితులము
పాత్రుల మే మదియుఁ గాక భార్గవులము నీ
పుత్రుని నిటువలెఁ జేయఁగ
శత్రులమే దైత్యజలధిచంద్రమ వింటే. 177

టీ. దైత్యజలధిచంద్రమ=రాక్షసకులమను పాలవెల్లికిఁ జంద్రునివంటివాఁడా! వింటే = వింటివా, ఏము, మిత్రులము=నీకుఁ గూర్చినవారము, పాత్రులము = బోధించుపనికిఁ దగినవారము, భార్గవులము = భృగుకులమునఁ బుట్టినవారము, శత్రులమే=నీకు విరోధులమా ?

తా. రాక్షసరాజా! విన్నావా? మేము నీకు నెయ్యులము. పురోహితులము. యోగ్యులము. ఇన్నిటికి పైన భృగువంశజాతులము. అట్టి మేము నాకన్నివిధముల ప్రేమింపఁదగిన దొరవగు నీకొడుకును జెడఁగఱపుటకు నీకేమి మేము విరోధులమా ? అట్లు తలఁపకుము.

వ. అనిన గురునందనుం గోపింపక దైత్యవల్లభుండు గొడుకునవలోకించి యిట్లనియె. 178

టీ. గురునందనుక=శుక్రునికొడుకును, కోపింపక, దైత్యవల్లభుండు=హిరణ్యకశిపుఁడు, అవలోకించి=చూచి

క. ఒజ్జలు సెప్పనియీమతి
మజ్జాతుఁడ వైననీకు మఱి యెవ్వరిచే
నుజ్జాత మయ్యె బాలక
తజ్జనులం బేర్కొనుము తగ నామ్రోలన్. 179

టీ. బాలక = కుఱ్ఱా! మజ్జాతుఁడవు = సురవిరోధినైననాకుఁ బుట్టినవాఁడవు,(ఇట్టివానికి విరోధులనీతులు పట్టుబడుట దుర్లభము) ఐన నీకు, ఒజ్జలు=గురువులు, సెప్పనియీమతి=బోధింపని యీబుద్ధి, మఱియెవ్వరిచేక = ఇంక నెవరిచేత, ఉజ్జాతమా=పుట్టినది, తజ్జనులక = వారిని, నామ్రోలక=నాయెదుట, పేరుకొనుమా=చెప్పుము.

తా. కుఱ్ఱా! నాకుఁ బుట్టిననీకు ఈబుద్ధి గురువులు చెప్పక మఱియెవ్వరు నేర్పిరి. వారిని నాయెదుట జెప్పుము.

వ. అనినఁ దండ్రికిఁ బ్రహ్లాదుం డిట్లనియె. 180

ఉ. అచ్చపుఁజీఁకటిం బడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ జర్వితచర్వణు లైనవారికిం
జెచ్చెరఁ బుట్టునే పరులు చెప్పిన నైన నిజేచ్ఛ నైన నే
మిచ్చిన నైనఁ గాననకు నేఁగిన నైన హరిప్రబోధముల్. 181

టీ. అచ్చపుఁ జీఁకటిన్ = గాఢాంధకారములో, పడి, గృహవ్రతులై = కాఁపురదనముగలవారై, విషయప్రవిష్టులై = విషయములలోదిగి, చర్వితచర్వణులు = తిన్నదే మరలతినువారు, హరిప్రబోధముల్ = విష్ణుని జ్ఞానమును, పరులు = ఇతరులు, నిజేచ్ఛనైనన్ = తమంతటనైనను, ఏమి ఇచ్చిననైన = ఏదియిచ్చినను గాని, కాననకున్ = అడవులకు, ఏఁగిననైనన్ = వెళ్లినను, చెచ్చెరన్ = శీఘ్రముగా, పుట్టునే = పుట్టునా?

తా. తండ్రీ! అజ్ఞానపుఁ జీఁకటిలోఁ బడి, కాఁపురము చేయుచు, విషయలోలురై, తెపతెపనుఁ జచ్చిపుట్టుచు, అనుభవించినదానినే మరల ననుభవించు నిమ్మజంతువులకు ఒకరు చెప్పిగాని తమకుఁ దోఁచిగాని ఎంతో వ్యయము చేసినఁగాని అడవులలోఁ బడి తిరిగినఁగాని విష్ణుభక్తిసంబంధమైన జ్ఞానములు అట్టె ఒక్కనాఁడే కలుగునా? ఎంతవెట్టి? దానికి బహుజన్మసంసిద్ధియుండవలెను.

ఉ. కాననివాని నూఁతఁగొని కాననివాఁడు విశిష్టవస్తువుల్
గాననిభంగిఁ గర్మములు గైకొని కొందఱు కర్మబద్ధులై
కానరు విష్ణుఁ గొంద ఱటఁ గందు రకించనవైష్ణవాంఘ్రిసం
స్థానరజోభిషిక్తు లగుసంహృతకర్ములు దానవేశ్వరా. 182

టీ. దానవేశ్వరా = రాక్షసరాజా! కొందఱు, కాననివాఁడు = గ్రుడ్డివాఁడు, కాననివానిన్ = గ్రుడ్డిని, ఊఁతఁగొని = ఆధారము చేసికొని, విశిష్టవస్తువుల్ = కావలసినపదార్థములను, కానని భంగిన్ = చూడలేనివిధమున, కర్మములు, కైకొని = తెచ్చుకొని, కర్మబద్ధులై = తాముచేసినవానికిఁ గట్టుపడి, విష్ణున్ = శ్రీహరిని, కానరు = చూడఁజాలరు, కొందఱు, అకించ

న...షిక్తులు=కేవలమైన విష్ణుపాదధూళిచే నిండిన, అగు, సంన్యాసకర్ములు= విడువఁబడినకర్మలు గలవారు, అటఁ = తర్వాత, కొందురు = విష్ణుని బొందెదరు.

తా. రాక్షసరాజా! కొందఱుమానవులు ఒకగ్రుడ్డివాఁడు గ్రుడ్డివానిఁ దోడుగొని కోరినదానిని దెచ్చుకొనలేనట్లు కర్మములఁజేయుచు, ఆకర్మముల చేతనే బద్ధులయి విష్ణువును గాంచఁజాలరు. కొందఱు విష్ణుపాదధూళిచేఁ బరిపూతచిత్తులయి కర్మలను త్యజించి, యామీఁద విష్ణుసాలోక్యమును బొందెదరు.

మ. శోధింపంబడె సర్వశాస్త్రములు రక్షోనాథ వే యేటికిన్
గాథల్ మాధవశేముషీతరణిసాంగత్యంబునం గాక దు
ర్మేధం దాఁటఁగ వచ్చునే సుతవధూమీనోగ్రవాంఛాగద
క్రోధోల్లోలవిశాలసంసృతిమహాఘోరామితాంభోనిధిన్.

టీ. రక్షోనాథ=రాక్షసరాజా! వేయి, గాథల్=కథలు, ఏటికిన్, సర్వశాస్త్రములు, శోధింపంబడెన్ = పరిశీలించినాను, సుత...నిధిన్=బిడ్డలు పెండ్లము అను జలజంతువులు తీవ్రమైన కోరికలు గర్వము కోపము అనుతరంగములు గలపెద్దఘోరమైన యీ కడలేనిసంసారసముద్రమును, మాధవ...బునన్ = విష్ణుచింతయను నోడచిక్కినఁగాని, దుర్మేధన్ = దుష్టబుద్ధితో, దాఁటఁగ వచ్చునే = తరింపనలవియగునా? కాదు.

తా. తండ్రీ! లోకములోఁ గలయన్నిశాస్త్రములు చదివినాను. ఏవి కొఱవడవు. పీఁకి తినివేయుబిడ్డలు పెండ్లము అను జలచరములుఁగలిగి, కోరిక గర్వము కోపము అను పెద్దపెద్ద యలలు నిండియున్న యీమహాఘోరమై హద్దు లేనిసంసారసముద్రమును, విష్ణుభక్తి యనునోడ యుండిననే దాఁట నగును గాని ఈలాటిదుర్మేధవలన నలవియగునా? కాదు.

వ. అని పలికిన కొడుకును ధిక్కరించి మక్కువ సేయక రక్క
సులఱేఁడు తనతొడలపై నుండనీక గొబ్బున దిగద్రొబ్బి

నిబ్బరం బగుకోపంబు దీపింప వేఁడిచూపుల మింట మంట
లెగయ మంత్రులం జూచి యి ట్లనియె. 184

టీ. మక్కువ = ప్రేమడి, గొబ్బునన్ = వేగముగా, దిగద్రొబ్బి = పడఁద్రోసి, నిబ్బరంబు = మిక్కుటము, దీపింపన్ = జ్వలింపఁగా, మింటన్ = ఆకసమున.

శా. క్రోడంబై పినతండ్రిఁ జంపెనని తాఁ గ్రోధించి చిత్తంబులో
వీడం జేయఁడు బంటుభంగి హరికిన్ విద్వేషికిన్ భక్తుఁడై
యోడం డక్కట ప్రాణవాయువులు వీఁ డొప్పించుచున్నాఁడు
నా, తోడన్ వైరమునట్టి యిట్టిజనకద్రోహిన్ మహిం గంటిరే.

టీ. క్రోడంబై = పందియై, క్రోధించి = పగపట్టి, విద్వేషికిన్ = శత్రువునకు, ఓడండు = సిగ్గుపడఁడు, అక్కట = అయ్యో, వీఁడు, ప్రాణవాయువులు, వైరము = పగ, మహిన్ = భూమిలో, ఇట్టి జనకద్రోహిన్ = ఈలాటి తండ్రితోఁ బగబెట్టుకొనువానిని, కంటిరే = చూచితిరా.

తా. మంత్రులారా! విష్ణువు మాయపందియై తనచిన్నయ్యను జంపినాఁడనియైనను వానినివిడక నాకు నిత్యశత్రువగు విష్ణువునకు భక్తుఁడై వానిబంటువలె వానితలఁపు వీడఁడు. వీనికి సిగ్గులేదు. ఇట్లు వినాశమునకు సిద్ధమైనాఁడు. నాతోఁ బగఁబూనినాఁడు. ఇట్టిపాపాత్మునిఁ దండ్రికి ద్రోహముఁ జేయు వానిని భూమిమీఁద మీ రెచ్చటనైనఁ జూచినారా ?

వ. అని రాక్షసవీరుల నీక్షించి యి ట్లనియె. 186

శా. పంచాబ్దంబులవాఁడు తండ్రి నగునాపక్షంబు నిందించి యు
త్కించిద్భీతియు లేక విష్ణు నహితుం గీర్తించుచున్నాఁడు వ
ల్దంచుం జెప్పిన మానఁ డంగమునఁ బుత్త్రాకారతన్ వ్యాధిజ
న్మించెన్ వీని వధించి రండు దనుజుల్ మీమీపటుత్వంబులన్

టీ. దనుజులార = రాక్షసులారా! పంచాబ్దంబులవాఁడు = ఐదేండ్లయీడుగలవాఁడు, నాపక్షంబు = నామతము, యత్కించిద్భీతి = ఏకొంచెమైనభయమును, అహితుఁడు = శత్రువగు, అంగమునన్ = శరీరమందు, పుత్త్రాకారతన్ = కొడుకను రూపముతో, వ్యాధి = రోగము, జన్మించెన్ = పుట్టెను. వీనిన్, మీమీపటుత్వంబులన్ = మీబలముకొలఁది, వధించి = చంపి, రండు.

తా. రాక్షసులారా! వీఁడు చూడ నయిదేండ్లకూన. తండ్రి నగు నన్ను ధిక్కరించి, నాశత్రువగు విష్ణుని నాయెదుర నదరు బెదరు లేక పొగడుచున్నాఁడు. వలదనిన నూరకుండఁడు. ఇఁకఁ జింతించి లాభములేదు. నాశరీరమందు కొడుకను పేరుతో వీఁడొకరోగముగాఁ బుట్టినాఁడు. వీనిని మీపరాక్రమము కొలఁది కొనిపోయి హతముగావించి రండు. పొండు.

శా. అంగవ్రాతములోఁ జికిత్సకుఁడు దుష్టాంగంబు ఖండించి శే
షాంగశ్రేణికి రక్ష సేయుక్రియ నీయజ్ఞుం గులద్రోహి దు
స్సంగుం గేశవపక్షపాతి నధముం జంపించి వీరవ్రతో
త్తుంగఖ్యాతిఁ జరించెదం గులము నిర్దోషంబు గావించెదన్.

టీ. చికిత్సకుఁడు = శస్త్రవైద్యుఁడు, అంగవ్రాతములోన్ = అవయవములగుంపులో, దుష్టాంగంబు = చెడిన యవయవమును, ఖండించి = కోసివైచి, శేషాంగశ్రేణికిన్ = మిగిలిన యన్నియవయవములకును, రక్ష = కాపుదల, సేయుక్రియన్, కులద్రోహిన్ = వంశమునకు హానిగావించువానిని, దుస్సంగున్ = చెడ్డచెలిమిగలవానిని, కేశవపక్షపాతిన్ = విష్ణుపక్షమును బొందినవానిని, అధమున్ = నీచుని, ఈయజ్ఞున్ = ఈజ్ఞానశూన్యుని, వీర...ఖ్యాతిన్ = శూరకర్మముగలవాఁడను పెద్ద కీర్తితో, చరించెదన్ = తిరిగెదను, కులము = వంశము, నిర్దోషంబు = కళంకములేనిదానినిగా, కావించెదన్ = చేసెదను.

తా. మంత్రులారా! వైద్యుఁడు శరీరములోఁ జెడిపోయినదానిని గోసి వైచి, మిగిలిన యవయవములకు క్షేమము గలుగఁ జేసినట్లు, కులనాశకుఁడు, దుస్సంగతి గలవాఁడు, కేశవపక్షపాతముగలవాఁడు, నీచుఁడు నైన ఈకుమారుని జంపించి, మహావీరుఁ డనుకీర్తితోఁ దిరిగెదను. నావంశము పవిత్రము జేసికొందును.

క. హంతవ్యుఁడు రక్షింపను
మంతవ్యుఁడు గాఁడు యమునిమందిరమునకుఁ
గంతవ్యుఁడు వధమున కుప
రంతవ్యుం డనక చంపి రం డీపడుచున్. 189

టీ. హంతవ్యుఁడు = చంపఁదగినవాఁడు, మంతవ్యుఁడు=యోచింపఁదగినవాఁడు, కాఁడు, గంతవ్యుఁడు = పొందఁదగినవాఁడు, వధమునకుఁ = హింసకు, ఉపరంతవ్యుఁడు = మానఁదగువాఁడు, అనక, ఈపడుచున్ = ఈకుఱ్ఱవానిని, చంపి రండు.

తా. వీఁడు చంపఁదగినవాఁడే. ఇఁక నాలోచనలేదు. యమునియింటికంపఁదగినవాఁడే. విడువఁదగఁడు. శీఘ్రమే చంపిరండు.

వ. అని దానవేంద్రుం డానతిచ్చిన వాఁడికోఱలు గలరక్కసులు పెక్కండ్రు శూలహస్తులై వక్త్రంబులు దెఱచికొని యుబ్బి బొబ్బ లిడుచు ధూమసహితదావదహనంబునుంబోలెఁ దామ్రసంకాశంబు లయినకేశంబులు మెఱయ భేదనవాదనచ్ఛేదనంబులు సేయుచు. 190

టీ. దానవేంద్రుండు = హిరణ్యకశిపుఁడు, ఆనతి = ఆజ్ఞ, వాఁడికోఱలు = పదునుగలదంతములు, పెక్కండ్రు = అనేకులు, శూలహస్తులు = శూలమును ధరించినవారు, వక్త్రంబులు=నోరులు, ఉబ్బి = పొంగి, బొబ్బలు = కేకలు, ధూమ...బోలెన్ = పొగతోడి కారుచిచ్చు

వలె, తామ్రసంకాశంబులు=రాగివలె నెఱ్ఱనైనవి, కేశంబులు = వెండ్రుకలు, మెఱయఁగ = ప్రకాశింపఁగా, ఛేద...నంబులు=పగులఁగొట్టుటలు, వాద్యపుమ్రోఁతలు, నఱుకులు, చేయుచుఁ.

ఉ. బాలుఁడు రాచబిడ్డఁడు కృపాళుఁడు సాధుఁడు లోకమాన్యసం
శీలుఁడు వీఁ డవధ్యుఁ డని చిక్కక స్రుక్కక క్రూరచిత్తులై
శూలములం దదంగముల సుస్థిరులై ప్రహరించి రుగ్రవా
చాలత నందఱుం దివిజశత్రుఁడు వల్దనఁడయ్యె భూవరా. 191

టీ. భూవరా=ధర్మరాజా! బాలుఁడు=కుఱ్ఱవాఁడు, రాచబిడ్డఁడు = రాజుకొడుకు, కృపాళుఁడు = దయగలవాఁడు, సాధుఁడు = సజ్జనుఁడు, లోకమాన్యసంశీలుఁడు = లోకులచే నెన్నఁదగిన నైజముగలవాఁడు, అవధ్యుఁడు = చంపఁదగనివాఁడు, చిక్కక=వెఱవక, స్రుక్కక = బడలక, క్రూరచిత్తులై = కఠినపు మనస్సు గలవారై, సుస్థిరులై = చక్కఁగా నిలచినవారై, తదంగములన్ =వాని యవయవములను, అందఱున్, ఉగ్రవాచాలతన్ = తీవ్రమైనవాఁగుబోతుతనముతో, ప్రహరించిరి = కొట్టిరి, దివిజశత్రుఁడు = హిరణ్యకశిపుఁడు, వలదు, అనఁడు, అయ్యెన్ = వలదని చెప్పలేదు.

తా. రాజా! అంతట రాక్షసులందఱు ఒకటై శూలములు దీసికొని, వానిని పిల్లకాయయనియు, రాజుకొడుకనియు, దయగలవాఁడనియు, సాధువనియు, లోకులచే మన్నింపఁబడినవాఁడనియు, చంపఁదగఁడనియు నను మానింపక, నిర్దయులై క్రూరముగాఁ గొట్టిరి. హిరణ్యకశిపుఁ డాఘోరకృత్యమును జూచుచు వేడుకపడుచున్నాఁడే కాని వలదని చెప్పలేదు.

చ. పలువురు దానవుల్ పొడువ బాలుని దేహము లేశమాత్రముం
బలియదు లోపలం రుధిరముబ్బదు కందదు శల్యసంఘముం
నలియదు దృష్టిపై భయము నష్టముగాదు ముఖేందుకాంతియుం
బొలియదు నూతనశ్రమము పుట్టదు పట్టదు దీనభావమున్.

టీ. బాలునిదేహము = ప్రహ్లాదుని శరీరము, పలువురు = అనేకులు, దానవుల్ = రాక్షసులు, పొడువన్ = శూలములతోఁ గ్రుచ్చినను, లేశమాత్రముగన్ = కొంచెమైనను, ఒలియదు = తరుగదు, లోపలన్, రుధిరము = రక్తము, శల్యసంఘమున్ = ఎముకలమోపును, నలియదు = తునుగదు, దృష్టివిభవము = చూపులసొంపు, నష్టము = నాశమొందినది, కాదు, ముఖేందుకాంతియున్ = మోముచందురుని వన్నెయు, పొలియదు = నశింపదు, నూతనశ్రమము = క్రొత్తయలఁత, దీనభావమున్ = దిక్కులేమివలననైన భీరుత్వమున్ను, పట్టదు = చెందదు.

తా. ఈలాగున అనేకులు రాక్షసులొక్కటై వానిశరీరము గ్రుచ్చుచున్నను అది కొంచెమును నలుగదు. నెత్తురు గ్రమ్మదు. కందదు ఎముకలు నుగ్గుగావు. చూపులపస చెడదు. మొగమువన్నెయు మాయదు. క్రొత్తయలఁత జనింపదు. దైన్యము గలుగదు.

ఉ. తన్ను నిశాచరుల్ పొడువ దైత్యకుమారుఁడు మాటిమాటికో
పన్నగశాయి యోదనుజభంజన యోజగదీశ యోమహా
పన్నశరణ్య యోనిఖిలపావన యంచు నుతించుఁగాని తాఁ
గన్నులనీరు దేఁడు భయకంపసమేతుఁడు గాఁడు భూవరా.

టీ. భూవరా = ధర్మరాజా! దైత్యకుమారుఁడు = ప్రహ్లాదుఁడు, తన్ను, నిశాచరుల్ = రాక్షసులు, పొడువన్ = క్రుమ్మఁగా, ఓపన్నగశాయి = ఓశేషశాయీ, దనుజభంజనా = రాక్షససంహారా, జగదీశ = లోకనాయకా, మహాపన్నశరణ్య = అతిదీనులకు రక్షకుఁడా, నిఖిలపావన = అన్నిటినిఁ బవిత్రము సేయువాఁడా, నుతించున్ = స్తోత్రముచేయునుగాని, భయకంపసమేతుఁడు = జడుపువణఁకులతోఁ గూడినవాఁడును, కాఁడు.

తా. ధర్మరాజా! ఇట్లు రాక్షసులు తన్నెంత క్రుమ్మినను తేపకు నోశేషశయనా! ఓరాక్షసధ్వంసకా! ఓలోకనాయకా! ఓదీనరక్షకా! ఓ

సర్వపవిత్రుఁడా! అని దెబ్బకొకవన్నెగా హరిస్తుతి చేయును గాని కండ్లను నీళ్లు బెట్టుకొనఁడు. భయమందఁడు. వణఁకఁడు.

ఉ. పాఱఁడు లేచిదిక్కులకు బాహువు లొడ్డఁడు బంధురాజిలోఁ
దూఱఁడు ఘోరకృత్యమని దూఱఁడు తండ్రిని మిత్రవర్గముం
జీరఁడు మాతృసంఘము వసించుసువర్ణగృహంబులోనికిం
దాఱఁడు కావ రేయనఁడు తాపమునొందఁడు కంటగింపఁడున్.

టీ. లేచి, దిక్కులకున్ = నలుకెలంకులకు, పాఱఁడు = పరుగెత్తఁడు, బాహువులు = చేతులు, ఒడ్డఁడు = అడ్డము పెట్టఁడు, బంధురాజిలోన్ = చుట్టములమఱుఁగున, దూఱఁడు, ఘోరకృత్యము = పాపపుఁబని, అని, తండ్రిని, దూఱఁడు = తిట్టఁడు, మిత్రవర్గమున్ = స్నేహితుల సమూహమును, చీరఁడు = పిలువఁడు, మాతృసంఘము = తల్లులసమూహము, వసించు...లోనికిన్ = ఉండుబంగారుమేడలోనికి, దాఱఁడు = దాఁగఁడు, కావరే = రక్షింపుఁడా, అనఁడు, తాపము నొందఁడు = సంతాపము చెందఁడు, కంటగింపఁడున్ = ఎవరిని విరోధింపఁడు.

తా. రాక్షసు లెంతైన హింసపెట్టిన వీథులవెంటఁ బరుగెత్తఁడు. కొట్టరాఁగాఁ జేతు లడ్డమిడఁడు. చుట్టములచాటునకుఁ బోఁడు. ఇదిపాపమని తండ్రిని నిందింపఁడు. సావాసకాండ్రను బిలువఁడు. తల్లి మేడలోనికిఁ బోయి దాఁగఁడు. నన్ను రక్షింపుఁడీ యని ఎవరిని అడుగఁడు. వేదన నొందఁడు. ఎవరితోను విరోధము పెట్టుకొనఁడు.

వ. ఇట్లు సర్వాత్మకం బై యిట్టి దట్టి దని నిర్దేశింపరానిపరబ్రహ్మంబు దాన యైన యమ్మహావిష్ణునియందుఁ జిత్తంబుఁ జేర్చి తన్మయుం డయి పరమానందంబును బొందియున్న ప్రహ్లాదునియందు రాక్షసేంద్రుండు దనకింకరులచేతం జేయించుచున్న మారణకర్మంబులు పాపకర్మునియందుఁ బ్రయుక్తంబు లైన సత్కారంబులుం బోలె విఫలంబు లగుటం జూచి.

టీ. సర్వాత్మకంబు = సర్వరూపము, నిర్దేశింపరాని = చెప్పనలవి కాని, రాక్షసేంద్రుండు = హిరణ్యకశిపుఁడు, తనకింకరులచేతన్ = తన భటులచేత, మారణ కర్మంబులు = చంపించుటలు, పాపకర్మునియందున్ = పాపాత్మునియందు, ప్రయుక్తంబులు = చేయఁబడినవి, సత్కారంబులు = ఉపకారములు, విఫలంబులు = వ్యర్థములు.

ఉ. శూలములన్ నిశాచరులు సుక్కక దేహముని గ్రహింపఁగా
బాలుఁడు నేలపైఁ బడఁడు పాఱఁడు చావఁడు తండ్రి నైన నా
పాలికి వచ్చి చక్రధరుపక్షము మానితి నంచుఁ బాదముల్
ఫాలముసోఁక మ్రొక్కఁడనపాయతనొందుట కేమిహేతువో.

టీ. నిశాచరులు = రాక్షసులు, శూలములన్ = మూఁడుకొనల బరిసెలచేత, సుక్కక = వెనుదీయక, నిగ్రహింపఁగాన్ = దండింపఁగా, ప్రహరింపఁగా, బాలుఁడు = ప్రహ్లాదుఁడు, నేలపైన్ = భూమిమీఁద, పాఱఁడు = పఱుగిడఁడు, నాపాలికిన్ = నాయొద్దకు, చక్రధరుపక్షము = విష్ణునిపక్షమును, మానితిన్ = విడిచిపెట్టితిని, ఫాలము = నొసలు, సోఁకన్ = తగులునట్లు, మ్రొక్కఁడు = నమస్కరింపఁడు, అనపాయతన్ = ఉపద్రవము లేమిని, ఒందుటకున్ = పొందుటకు, ఏమిహేతువో = ఏమికారణమో?

తా. వీఁడు ఇంతమంది శూలములతోఁ బొడుచుచున్నను క్రిందఁబడఁడు. పఱుగెత్తఁడు. ప్రాణముల విడువఁడు. తండ్రినైన నాదగ్గఱకైనను వచ్చి నాయనా యిఁక విష్ణుని దలఁపను రక్షించుమని కాళ్లమీఁదఁబడఁడు. ఇంత ధైర్యముతో నేయాపద లేకుండ నుండుట కేమికారణమో తెలియదు.

వ. అని శంకించుచు. 197

సీ. ఒకమాటు దిక్కుంభియూథంబుఁ దెప్పించి
కెరలి డింభకునిఁ ద్రొక్కింపఁ బంపు

నొకమాటు విషభీకరోరగశ్రేణులఁ
గడువడి నర్భకుఁ గఱవఁ బంపు
నొకమాటు హేతిసంఘోగ్రానలములోన
విసరి కుమారుని వ్రేయఁ బంపు
నొకమాటు కూలంకషోల్లోలజలధిలో
మొత్తించి శాబకు ముంపఁ బంపు
తే. విషముఁ బెట్టఁ బంపు విదళింపఁగాఁ బంపు
దొడ్డకొండచఱులఁ ద్రోయఁ బంపు
బట్టి కట్టఁ బంపు బాధింపఁగాఁ బంపు
బాలుఁ గినిసి దనుజపాలుఁ డధిప. 198

టీ. అధిప = ధర్మరాజా! దనుజపాలుఁడు = హిరణ్యకశిపుఁడు, కినిసి = కోపించి, ఒకమాటు, దిక్కుంభియూథంబుల్ = దిగ్గజముల గుంపును, తరలి = చెలరేఁగి, డింభకునిన్ = ప్రహ్లాదకుమారుని, త్రొక్కింపన్, పంపున్, విష...శ్రేణులన్ = విషముచే భయప్రదములైన త్రాఁచు పాములను, అర్భకునిన్ = బాలుని, కడువడిన్ = మిగుల వేగముతో, కుమారునిన్ = ప్రహ్లాదుని, హేతి...లోనన్ = మంటలచే బెడిదమైన నిప్పులో, కూలంకషోల్లోలజలధిలో = దరులమీఁదికి పొరలు గొప్పయలలు గల సముద్రములో, శాబకున్ = కుఱ్ఱని, మొత్తించి = కొట్టించి, ముంపన్ = ముంచుటకు, పంపును, విదళింపఁగాన్ = చీల్చివేయుటకై, దొడ్డకొండచఱులన్ = పెద్దపెద్ద కొండలసురంగములలో, బాధింపఁగాన్ = పీడించుటకై, బాలున్ = ప్రహ్లాదుని, పంపును.

తా. అంత హిరణ్యకశిపుఁడు మఱింత కోపించి, వానిని ఒక్కసారి దిగ్గజముల క్రింద వేసి త్రొక్కించును. ఒకసారి పాములచేఁ గఱపించును. ఒకమాటు మంటలెగయు నిప్పులో విసరి వేయించును. ఒకతేప పొంగిపొరలు సముద్రములోఁ ద్రోయించును. ఒకసారి విషము బెట్టించును. ఒకసారి చీల్చి

పాఱవేయుమనును. ఒకసారి కొండచఱియలో ద్రోపించును. ఒకప్పుడు బంధింపఁజేయును.

సీ. ఒకవేళ నభిచారహోమంబు చేయించు
నొకవేళ నెండల నుండఁ బంచు
నొకవేళ వానల నుపహతి నొందించు
నొకవేళ రంధ్రంబు లుక్కఁ బట్టు
నొకవేళఁ దనమాయ నొదవించి బెగడించు
నొకవేళ మంచున నొంటి నిలుపు
నొకవేళఁ బెనుగాలి కున్ముఖుఁ గావించు
నొకవేళఁ బాఁతించు నుర్వియందు
తే. నీరు నన్నంబు నిడనీక నిగ్రహించు
గశల నడిపించు నువ్వించు గండశిలల
గదల వ్రేయించు నేయించు ఘనశరములఁ
గొడుకు నొకవేళ నసురారి క్రోధి యగుచు. 199

టీ. అసురారి = హిరణ్యకశిపుఁడు, క్రోధి = అతికోపము గలవాఁడు, అభిచారహోమంబు = మారణహోమమును, రంధ్రంబులన్ = తొమ్మిది రంధ్రములను, ఉక్కఁబట్టున్ = ఊఁపిరిసలుపకుండ బిగఁబట్టును, తనమాయన్ = తనతంత్రకారణవిద్యను, ఒదవించి = కలిగించి, బెగడించున్ = భయపెట్టును, ఉన్ముఖున్ = ఎదురైనవానినిగా, ఉర్వియందున్ = భూమిలో, పాఁతించున్ = పూడిపించును, ఇడనీకన్ = పెట్టనీయక, నిగ్రహించున్ = దండించును, కశలన్ = కొరడాలతో, చబుకులతో, అడిపించున్ = కొట్టించును, గండశిలలన్ = పెద్దపెద్దఱాళ్లచేత, ఉవ్వించున్ = విసరివేయించును, కదలన్ = దొర్లునట్లు, ఘనశరములన్ = వాఁడిబాణములచేత.

తా. హిరణ్యకశిపుఁడు మేరమీఱినకోపము గలవాఁడై, కుమారునికి ఒకప్పుడు చచ్చుటకై మారణహోమము సేయించును. ఒకప్పుడు ఎండలో నిలువఁబెట్టును. ఒకవేళ వానలో నిలుపును. ఒకవేళ ఊపిరి సలుపుటకు వీలుగాకుండ నవరంధ్రములు బిగించును. ఒకసమయమున తనమాయచేత జడిపించును. ఒకతేప మంచులో నుంచును. ఒక్కసారి పోడుగాలికి నెదురుగా నిలుపును. ఒకసమయమున నేలలోఁ బాఁతిపెట్టించును. నీళ్లు పోయనీయఁడు. అన్నము బెట్టనీయఁడు. చబుకులతోఁ గొట్టించును. రాళ్లు రువ్వించును. ఎత్తి క్రిందఁ బడవేయించును. వాఁడిబాణములతోఁ గొట్టించును.

వ. మఱియు ననేకమారణోపాయంబులఁ బాపరహితుం డైన
పాపని రూపు మాపలేక యేకాంతంబున దురంతచింతాపరి
శ్రాంతుం డయి రాక్షసేంద్రుండు దన మనంబున. 200

టీ. రాక్షసేంద్రుఁడు = హిరణ్యకశిపుఁడు, అనేకమారణోపాయంబులన్ = అనేకములైన చంపెడు నుపాయములచేత, పాపరహితుండు = పాపమెఱుఁగనివాఁడు, పాపనిరూపుమాపలేక = బాలుని జంపించలేక, ఏకాంతంబునన్ = రహస్యమందు, దురంత...శ్రాంతుండు = కష్టకారణమైనదుఃఖముతోఁ గూడినవాఁడు, తనమనంబునన్ = తనచిత్తములో.

ఉ. ముంచితి వార్ధులన్ గదల మొత్తితి శైలతటంబులందు ద్రొ
బ్బించితి శస్త్రరాజిఁ బొడిపించితి మీఁద నిభేంద్రపంక్తి ఱొ
ప్పించితి ధిక్కరించితి శపించితి ఘోరదవాగ్నులందుఁ ద్రో
యించితి బెక్కుపాట్ల నలయించితిఁ జావఁ డిదేమిచిత్రమో!

టీ. వార్ధులన్ = సముద్రములలో, మొత్తితి = కొట్టినాను. శైలతటంబులందున్ = పర్వతపుఁ జఱియలలో, ద్రొబ్బించితిన్ = త్రోయించితిని, శస్త్రరాజిన్ = కత్తులచేత, ఇభేంద్రపంక్తి = ఏనుఁగులబంతి, ఱొప్పించితిన్ = పఱుఁగెత్తించితిని, ధిక్కరించితిన్ = బెదిరించినాను, శపించితిన్ = తిట్టినాను, ఘోరదవాగ్నులందున్ = భయంకరమైన

కాలుచిచ్చులలో, పెక్కుపాట్లన్ = అనేకవిధములుగా, అలయించితిన్ = కష్టపెట్టినాను.

తా. వీనిని సముద్రములలో ముంచితిని. చావమోదించితిని. పర్వతకందరములలో నెట్టించితిని.కత్తులతోఁ బొడిపించినాను. క్రిందఁబడఁద్రోసి పైన యేనుఁగుల నడిపించితిని. బెదరించితిని. నిప్పులలోఁ ద్రోయించితిని. ఎన్నివిధములనో హింసించినాను. వీనిని చావఁడు. ఇదేమి వింతయో తెలియదు.

చ. ఎఱుఁగఁడు జీవనౌషధము లెవ్వరు భర్తలు లేరు బాధలం
దరలఁడు నైజతేజమునఁ దథ్యము జాడ్యము లేదు మిక్కిలిన్
మెఱయుచు నున్నవాఁ డొకనిమేషము దైన్యమునొందఁడింక
నే,తెఱఁగున ద్రుంతు వేసరితి దివ్యము వీనిప్రభావమెట్టిదో.

టీ. జీవనౌషధములు = చావకుండ బ్రతుకుటకైనమందులు, భర్తలు = రక్షించువారు, బాధలన్ = కష్టములలో, నైజతేజమునన్ = తన ప్రకాశమునుండి, తరలఁడు=చావఁడు, తథ్యము = నిజము, జాడ్యము = మోహము, మెఱయుచున్ = ప్రకాశించుచు, ఉన్నవాఁడు, ఒకనిమేషము = ఒకనిముషమైనను, దైన్యమున్ = కృపణత్వమును, ఏతెఱఁగున్ =ఏలాగున, ద్రుంతున్=చంపుదును. వేసరితిన్=విసిగిపోతిని, ప్రభావము = సామర్థ్యము, దివ్యము = అమానుషము.

తా. ప్రాణములం బోకుండఁజేయుమందు లెఱుఁగఁడు. ఎవ్వరును రక్షించువారా లేరు. ఎన్నియిడుమలఁ బెట్టినను తనప్రకాశము విడువఁడు. ఏమోహమును జెందఁడు.అంతకంతకు మఱింత యుల్లాసముతో నున్నవాఁడు. ఒకక్షణమైనను భయమునొందఁడు. ఇఁక వీని నెట్లు జంపుదును? వీనిమహిమ అసాధారణముగా నున్నది. ఇదియేమో యెఱుఁగరాదుగదా.

వ. అదియునుం గాక తొల్లి శునశ్శేఫుం డనుమునికుమారుండు దండ్రిచేత యాగపశుత్వంబునకు దత్తుం డయి తండ్రి తనకు నపకారి యని తలంపక బ్రదికినచందంబున. 203

టీ. తొల్లి = మునుపు, యాగపశుత్వంబునకున్ = యజ్ఞమందు విశసింపఁదగినపశువునకుఁగా, దత్తుండు = ఇయ్యఁబడినవాఁడు, అపకారి = ద్రోహకారి

క. ఆగ్రహమున నేఁ జేసిన
నిగ్రహములు పరులతోడ నెఱిఁ గొనకాఁడుఁ
విగ్రహము లనుచుఁ బలుకఁ డ
నుగ్రహములు గా స్మరించు నొవ్వఁడు మదిలోన్. 204

టీ. ఆగ్రహమునన్ = కోపముతో, నిగ్రహములు=దండనములు, పరులతోడన్ = ఇతరులతో, నెఱిన్ = వరుసగా, విగ్రహములు=విరోధములు, అనుగ్రహములు = సత్కారములుగా, నొవ్వఁడు = దుఃఖపడఁడు.

తా. ఇదిగాక నేను మహాకోపముతో నెన్నివిధముల హింసించినను దానిని ఇతరులతోఁ గొండెముగాఁ జెప్పఁడు. అవన్నియు తనకు హితములుగానే తలఁచెను. తనలో నైనను కష్టమని యెన్నఁడు.

వ. కావున వీఁడు మహాప్రభావసంపన్నుండు వీని కెందును భయంబు లేదు వీనితోడివిరోధంబునం దనకు మృత్యువు సిద్ధించు నని నిర్ణయించి చిన్నఁబోయి ఖిన్నుండై ప్రసన్నుండుగాక క్రిందు సూచుచు విషణ్ణుండై చింతనంబు సేయుచున్న రాజునకు మంతనంబునఁ జండామర్కు లిట్లనిరి. 205

టీ. మహాప్రభావసంపన్నుండు=గొప్పమహిమ గలవాఁడు, మృత్యువు = చావు, చిన్నఁబోయి = సిగ్గుపడి, ఖిన్నుండు=దుఃఖించినవాఁడు, ప్రసన్నుండు=సంతోషము గలవాఁడు, విషణ్ణుండు=దుఃఖము చెందినవాఁడు, చింతనంబు = యోచన, మంతనంబునన్ = ఏకాంతమందు.

శా. శుభ్రఖ్యాతివి నీప్రతాపము మహాచోద్యంబు దైత్యేంద్ర రో
షభ్రూయుగ్మవిజృంభణంబున దిగీశవ్రాతముం బోరులన్
విభ్రాంతంబుగఁ జేసి యేలితి గదా విశ్వంబు వీఁడెంత యీ
దభ్రోక్తుల్ గుణదోషహేతువులు చింతం బొంద నీ కేటికిన్.

టీ. దైత్యేంద్ర=రాక్షసోత్తమా! నీవు, శుభ్రఖ్యాతివి=నిర్మలమైన కీర్తిగలవాఁడవు, నీప్రతాపము=నీపరాక్రమము, మహాచోద్యంబు=మిగులఁ జిత్రము, రోష...బునన్=క్రోధముచే ముడిపడిన కనుబొమల యాటోపముచేత, పోరులన్=యుద్ధములలో, దిగీశవ్రాతమున్=దిక్పాలురసమూహమును, విభ్రాంతము=కలఁగుపడినది, విశ్వంబు=ప్రపంచము, వీఁడెంత=ఈప్రహ్లాదుఁడనఁగా నీ కేపాటివాఁడు, ఈదభ్రోక్తులన్=ఈయల్పపుఁ గూఁతలు, గుణదోషహేతువులు=మంచిచెడ్డతనములకు మూలముగాఁ గలవి.

తా. రాక్షసేంద్రా! నీవు నిర్మలమైన వెండిగోలుపు కీర్తిగలవాఁడవు. నీవు యుద్ధములో నొక్కమాఱు కనుబొమలు చిట్లించుకొన్నచో దిక్పాలురెల్లరు ఓడిపోవుదురు. ఇట్టి ప్రపంచమునంతయు నిరంకుశముగా నేలిన నీబోఁటివీరునకు నీపిల్లకాయ యనఁగా నెంత? ఈమాత్రమునకే రోషమయిట్లు విచారపడెదవు? ఇంతకు వానికి జ్ఞానములేనికారణమున నట్లు పలుకుచున్నాఁడు. మంచిగుణములున్న మంచిమాటలు చెడ్డగుణములున్న చెడ్డమాటలు నని యెఱుఁగవా. మంచిబుద్ధి గలిగినవాఁడే బాగుపడును. లేకున్నఁ జెడిపోవును. నీకేల వృథాయాసము.

శా. వక్రుం డైన జనుండు వృద్ధగురుసేవం జేసి మేధానయో
పక్రాంతిన్ విలసిల్లు మీఁదట వయఃపాకంబునన్ బాలకున్
శక్రద్వేష గుణాబద్ధుఁ జేయుము తుదిం జాలింపుమీ రోషమున్
శుక్రాచార్యులు వచ్చునంతకితఁడున్ సుశ్రీయుతుండయ్యెడున్.

టీ. వక్రుఁడు=దుర్నీతిగలవాఁడు, వృద్ధగురుసేవంజేసి=పెద్దలను గురువులను సేవించుటవలన, మేధానయోపక్రాంతిన్=బుద్ధి నీతి గలుగుటచే,

విలసిల్లఁగ = ప్రకాశించును, మీఁదట = తర్వాత, పయఃపాకంబుతోఁగ = పయస్సుయొక్క పాకమునుబట్టి, బాలకుఁగ = ప్రహ్లాదుని, శక్రద్వేషణబద్ధుఁగ = ఇంద్రునియందలిపగతోఁగూడినవానినిగా, మదిఁగ = చిత్తమున, శుక్రాచార్యులు, వచ్చునంతకుఁగ = వచ్చులోపల, ఇతఁడుఁగ = ప్రహ్లాదుఁడు, సుశ్రీయుతుండు = మంచిజ్ఞానసంపదగలవాఁడు.

తా. రాక్షసరాజా! ఎట్టివాఁడైనను పుట్టుకలోఁ గొంచెము వక్రబుద్ధిగానున్నను పెద్దలు గురువులు వీరలసేవచే జ్ఞానవంతుఁడగును. మన ప్రహ్లాదునికి క్రమముగా వయసు వచ్చినకొలఁది సమయము చూచి, యింద్రునిమీఁద విరోధము గలుగునటుబోధింతము. ఇప్పుడు వానిమీఁద వృథా కోపము మానుము. మాయయ్య శుక్రాచార్యులు వచ్చులోపల వాఁడు మిగులఁ దెలివిగలవాఁడగును. పైపై చ్చాపునయుఁ జక్కఁగా శిక్షించి జ్ఞానవంతునిగాఁ జేయును.

వ. అని గురుపుత్త్రులు పలికిన రాక్షసేశ్వరుండు గృహస్థులైన రాజులకు నుపదేశింపఁదగినధర్మార్థకామంబులు ప్రహ్లాదునకు నుపదేశింపుం డని యనుజ్ఞ సేసిన వారు నతనికిఁ ద్రివర్గంబు నుపదేశించిన నతండు రాగద్వేషంబులచేత విషయాసక్తులైన వారలకు గ్రాహ్యంబులైనధర్మార్థకామంబులు దనకు నగ్రాహ్యంబు లనియును వ్యవహారప్రసిద్ధికొఱకైనభేదంబు గాని యాత్మభేదంబు లేదనియును ననర్థంబులయం దర్థకల్పన సేయుట దిగ్భ్రమం బనియును నిశ్చయించి గురూపదిష్టశాస్త్రంబులు మంచి వని తలంపక గురువులు దమగృహస్థకర్మానుష్ఠానంబులకుం బోయినసమయంబున. 208

టీ. ఉపదేశింపఁదగిన = నేర్పఁదగిన, అనుజ్ఞ = ఉత్తర్వు, త్రివర్గంబు = ధర్మార్థకామములను, రాగద్వేషంబులచేతఁగ = అనురాగముచేత, విరోధముచేత, విషయాసక్తులు = ఇంద్రియములకు లోనైనవారు, గ్రాహ్యంబులు = అభ్యసింపఁదగినవి, అగ్రాహ్యములు = నేర్చుకోఁదగనివి, వ్యవహారప్రసిద్ధి =

వ్యవహారశాస్త్రము, ఆత్మభేదంబు,అనర్థములు=అశాశ్వతవస్తువులు, అర్థకల్పన=వస్తుభ్రాంతి, దిగ్భ్రమంబు = దిక్కు తెలియకపోవుట, గురూపదిష్టశాస్త్రంబులు=గురువులు నేర్పినశాస్త్రములు, గృహస్థకర్మానుష్ఠానంబులకున్=గృహస్థులుచేయఁదగిన సంధ్యావందనాదికర్మలు చేయుటకయి, పోయిన సమయంబునన్.

క. ఆటలకుఁ దన్ను రమ్మని
పాటించి నిశాటసుతులు భాషించిన దో
షాటకులేంద్రకుమారుఁడు
పాటవమున వారిఁ జీరి ప్రజ్ఞాన్వితుఁడై. 209

టీ. దోషా...రుఁడు=ప్రహ్లాదుఁడు, నిశాటసుతులు=తోడిరాక్షసబాలురు, పాటించి=పట్టుపట్టి, భాషించినన్=పిలువఁగా, ప్రజ్ఞాన్వితుఁడై=తెలివికలవాఁడై, పాటవమునన్ = నేరుపుతో, వారిన్, చీరి=పిలచి.

తా. తనతోఁగూడ చదువుకొను రాక్షసులపిల్లకాయలు తనను ఆడుకొందము రమ్మని పిలువఁగా జాగరూకుఁడై వారలను జేరఁదీసికొన్నవాఁడై.

క. చెప్పఁ డొకచదువు మంచిది
చెప్పెడిఁ దగులములు చెవులు చిందఱ గొనఁగాఁ
జెప్పెడు మనయెడ నొజ్జలు
చెప్పెద నొకచదువు వినుఁడు చిత్తము లలరన్. 210

టీ. ఒజ్జలు=మనగురువుగారు, మనయెడన్ = మనకు, ఎప్పుడున్, ఒకచదువు=ఒకచదువున్ను, మంచిది, చెప్పఁడు, చెవులు, చిందఱగొనఁగాన్ = గింగురుమనునట్లు, తగులములు = కర్మబంధములు, చెప్పెడున్= చెప్పును, నేను, ఒకచదువు, చిత్తములు=మీమనస్సులు, అలరన్ =సంతసించులాగున, చెప్పెదన్, వినుఁడు.

తా. ఓస్నేహితులారా! మనయయ్యవారు మనకెప్పుడును ఒక్కటియు మంచిచదువు చెప్పఁడుగదా! ఎప్పుడు చూచినను చెవులు చిల్లులుపోవఁ

గర్మబంధములను గూర్చి చెప్పును. ఈలాగున రండు. నే నొకమంచిచదువు చెప్పెదను. దాన మీకందఱకు పరమానందము కలుగును.

వ. అని రాజకుమారుండు గావునఁ గరుణించి సంగడికాండ్ర
తోడ నగియెడిచందంబునఁ గ్రీడలాడుచు సమానవయస్కు
లైనదైత్యకుమారుల కెల్ల నేకాంతంబున కిట్లనియె. 211

టీ. కరుణించి=దయచూచి, సంగడికాండ్రతోడన్ = స్నేహితులతో, సమానవయస్కులు=ఒకయీడువారు, దైత్యకుమారులకున్=రాక్షసకుమారులకందఱకును, ఏకాంతంబునన్=రహస్యముగా.

ఉ. బాలకులార రండు మనప్రాయపుబాలురు కొంద ఱుర్విపైఁ
గూలుట గంటిరే గురుఁడు క్రూరుఁ డనర్థచయంబునందు దు
శ్శీలత నర్థకల్పనముఁ జేసెడి గ్రాహ్యముగాదు శాస్త్రమే
మే లెఱిఁగించెదన్ వినిన మీకు నిరంతరభద్ర మయ్యెడిన్.

టీ. బాలకులార=ఓపిల్లకాయలారా! ఉర్విపైన్=భూమిమీఁద, కొందఱు, మనప్రాయపుబాలురు = మనయీడుబోడుకుఱ్ఱవాండ్రు, కూలుట=చచ్చుట, కంటిరే=చూచినారుగదా, క్రూరుఁడు=దయలేనివాఁడు, దుశ్శీలతన్=దుర్బుద్ధితో, అనర్థచయంబునందున్=స్థిరములు కానిదారాపుత్రపశుధనకనకవస్తువాహనరాజ్యాదులందు, అర్థకల్పనము=స్థిరములనుబుద్ధిని, చేసెడిన్=చేయును, గ్రాహ్యము=నేర్చుకోఁదగినది. మేలు = క్షేమమైనదానిని, నిరంతరభద్రము=శాశ్వతమైనక్షేమము, అయ్యెడున్.

తా. ఓబాలురారా! యిటురండు. మనతోడిపిల్లకాయలు కొందఱు మనకనులయెదుటఁ జచ్చుటం జూచుచున్నారముకదా. మనగురువు, దయలేనివాఁడై మన కనర్థములైన శాస్త్రములనుబోధించి, నిత్యములు కానివానియందు నిత్యము అనుభ్రాంతిని గలిగించుచున్నాఁడు. మన మాచదువులు చదివినచో నన్యాయముగాఁ జెడిపోవుదుము. మీకు నేను శాశ్వతసుఖము నిచ్చు నొకవిద్యను జెప్పెదను. నేర్చుకొనుఁడు.

వ. వినుండు సకలజన్మంబులందును ధర్మార్థాచరణకారణం బయి
నమానుషజన్మంబు దుర్లభం బందుఁ బురుషత్వంబు దుర్ల
భం బదియు శతవర్ష పరిమితం బైనజీవితకాలంబున నియతం
బై యుండు నందు సగము నంధకారబంధురం బయి రాత్రిరూ
పంబున నిద్రాదివ్యవహారంబుల నిరర్థకం బయి చను చిక్కిన
పంచాశద్వత్సరంబులందును బాల్యకౌమారకైశోరయౌవన
వయోవిశేషంబుల వింశతిహాయనంబులు గడచు గడమ
ముప్పదియబ్దంబులు నింద్రియంబులచేఁ బట్టువడి దురవగా
హంబు లయినకామక్రోధలోభమోహమదమాత్సర్యంబు లను
పాశంబులం గట్టువడి విషమ సమర్థుండుగాక ప్రాణంబులకం
టె మధురాయమాణ యైనతృష్ణకులోనై భృత్యత్వస్వ రవణి
క్కర్మంబులఁ బ్రాణహాని యైన నంగీకరించి పరార్థంబుల న
ర్థించుచు రహస్యసంభోగ చాతుర్యసౌందర్యవిశేషంబుల
ధైర్యవల్లికాలవిత్రంబు లయిన కళత్రంబులను మహాసీయమం
జులమధురాలాపంబులు గలిగి వశులయినశిశువులను శీ
లవయోరూపసన్న లగుకన్యలను వినయవివేకవిద్యాలంకా
రులయిన కుమారులను గామితఫలప్రదాత లగుభ్రాతలను
మమత్వప్రేమదైన్యజనకు లయినజననీజనకులను సకలసౌజ
న్యసింధువు లయినబంధువులను ధనకనకవస్తువాహనసుంద
రంబు లయినమందిరంబులను సుకరంబు లైనపశుభృత్యనిక
రంబులను వంశపరంపరాయత్తంబు లయినవిత్తంబులను వ
ర్జింపలేక సంసారంబు నిర్జించునుపాయంబుఁ గానక తంతువ
ర్గంబున నిర్గమద్వారశూన్యం బయినమందిరంబుఁ జేరి చిక్కు
వడి వెడలెడిపాటవంబు చాలక తగులువడుకీటకంబుచందంబున

గృహస్థుండు స్వయంకృతకర్మబద్ధుండై శిశ్నోదరాదిసుఖంబులం బ్రమత్తుండయి నిజకుటుంబపోషణపారవశ్యంబున విరక్తిమార్గంబుఁ దెలియ నేరక స్వకీయపరకీయభిన్నభావంబున నంధకారంబునం బ్రవేశించుం గావునఁ గౌమారసమయంబున మనీషాగరిష్ఠుండై పరమభాగవతధర్మంబు ననుష్ఠింపవలయు దుఃఖంబులు వాంఛితంబులు గాక చేకుఱుభంగి సుఖంబులును గాలానుసారంబులై లబ్ధంబు లగుం గావున వృథాప్రయాసంబున నాయుర్వ్యయంబు సేయం జనదు హరిభజనంబున మోక్షంబు సిద్ధించు విష్ణుండు సర్వభూతంబులకు నాత్మేశ్వరుండు ప్రియుండు ముముక్షుండైన దేహికి దేహావసానపర్యంతంబు నారాయణచరణారవిందసేవనంబు కర్తవ్యంబు. 213

టీ. సకలజన్మంబులందును = అన్నిపుట్టుకలయందును, ధర్మార్థాచరణకారణంబు=ధర్మార్థములఁ జేయుటకు హేతువైనది, దుర్లభంబు = పొందరానిది, పురుషత్వంబు=మగవాఁడౌట, దుర్గమంబు= పొందనలవికానిది, శతవర్షపరిమితంబు=నూఱేండ్లపరిమాణముకలది, నియతంబు=నిర్ణయింపఁబడినది, అంధకారబంధురంబు = చీఁకటిచేనిండినది, నిరర్థకంబు=పనికిమాలినది, పంచాశద్వత్సరంబులందును = ఏఁబదియేఁడులయందును, బాల్య=చిన్నతనము, కౌమార = కౌమారము, కైశోర = కిశోరవయస్సు, యౌవన=నడిమివయసు, వయోవిశేషంబులన్ = వయస్సుయొక్క భేదములచేత, వింశతిహాయనంబులు = ఇరువదియేండ్లు, అబ్దంబులు=ఏండ్లు, దురవగాహంబులు = తెలిసి గట్టునఁబడనియని, పాశములన్=త్రాళ్లచేత, మధురాయమాణ=తీయనిదానివలెనుండునది, తృష్ణ=ఆశ, భృత్య=భటులు, తస్కర=దొంగలు, వణిక్ = వర్తకులు, ప్రాణహాని = చావు, పదార్థంబులన్=ఒరులసొమ్ములను, అర్థించుచు=కోరుచు, చాతుర్య=నేర్పు, సౌందర్యము, విశేష=అతిశయము, ధైర్యవల్లికాలవిత్రంబులు=ధైర్యమనుతీఁగలకుఁ గొడవండ్లు, కళత్రములను =

భార్యలను, మహనీయ...లాపంబులు=గొప్పలైసొగసైనతీయనైనమాటలు, వశులు=స్వాధీనులు, శిశువులు=బిడ్డలు, శీల...ధన్యులు=నైజము వయస్సు రూపము వీనిచేఁ గృతార్థులు, వినయ...కారులు=అడఁకువ తెలివి చదువు ఇవియలంకారముగాఁగలవారు, కామితఫలప్రదాతలు=కోరినకోర్కెలిచ్చువారు, భ్రాతలు=సోదరులు, మమత్వ=మమకారము, ప్రేమ=ప్రీతి, దైన్య=కరుణ, జననీజనకులు=తల్లిదండ్రులు, సకలసౌజన్యసింధువులు = ఎల్లసాధుత్వమునకు నెలవైనవారు,మందిరంబులు=ఇండ్లు, సుకరంబులు=సుఖముగానార్జింపఁదగినవి,పశుభృత్యనికరంబులును=పశువులు సేవకులు వీరలసమూహములును, వంశపరంపరాయత్తంబులు=వంశక్రమముగావశమైన, విత్తంబులు=ధనములను, వర్జింపలేక=విడువఁజాలక, నిర్జించు=జయించునుపాయము, తంతువర్గంబునన్=దారములచిక్కులో, నిర్గమద్వారశూన్యంబు = వెడలివచ్చుటకు వాకిలిలేనిది, వెడలెడిపాటవంబు = వెలువడుబలము, తగులువడుకీటకంబుచందంబునన్=చిక్కుకొనినపురుగువలె, గృహస్థుండు=ఇంటనుండికాఁపురముచేయువాఁడు, స్వయంకృతకర్మబద్ధుండు = తాఁజేసినకర్మలఁజిక్కినవాఁడై, శిశ్నోదరాదిసుఖంబులన్ = మైథునము భోజనము మొదలగుగ్రామ్యసుఖములచేత, ప్రమత్తుండు=ఒడలెఱుఁగనివాఁడు, నిజ...మార్గంబునన్ = తనకుటుంబమును రక్షించుకొను దానిని, స్వకీయ...బునన్ = తనది ఇతరునిది అనుభేదబుద్ధితో, అంధకారంబునన్=చీఁకటిలో, కౌమారసమయంబునన్=కుమారత్వదశలో, మనీషాగరిష్ఠుండై=బుద్ధిబలముగలవాఁడై, పరమభాగవతధర్మంబుల్=మేలైనభక్తులధర్మమును, అనుష్ఠింపవలయున్ = చేయవలెను. వాంఛితంబులు=కోరఁబడినవి,చేకుఱుభంగిన్=దొరకునట్లు, సుఖంబులున్=సుఖములును, కాలానుసారంబులు=కాలమునకుఁ దగినవి, లబ్ధంబులు = పొందఁబడినవి,వృథాప్రయాసంబునన్ = వ్యర్థమైనశ్రమతో, ఆయుర్వ్యయంబు = ఆయువుయొక్కపోకను, హరిభజనంబునన్ = విష్ణునిసేవవలన, సర్వభూతంబులకున్=ఎల్లభూతములకు, ఆత్మేశ్వరుండు = ఆత్మ

ధిష్ఠాత, ప్రియుండు=ఇష్టుఁడు, ముముక్షువు = మోక్షేచ్ఛగలవాఁడు, దేహావసానపర్యంతంబు = దేహముతోనుండినంతవఱకు, నారాయణచరణారవిందసేవనంబు=విష్ణుపాదకమలముల కైంకర్యము, కర్తవ్యంబు=చేయఁదగినది.

సీ. కంటిరే మనవారు ఘనులు గృహస్థులై
విఫలులై కైకొన్న వెఱ్ఱితనము
భద్రార్థులై యుండి పాయరు సంసార
పద్ధతి నూరక పట్టువడిరి
కలయోనులం దెల్ల గర్భాద్యవస్థలఁ
బురుషుండు దేహియై పుట్టుచుండుఁ
దన్నెఱుంగఁడు కర్మతంత్రుఁడై కడపట
ముట్టఁడు భవశతములకు నయిన
ఆ. దీన శుభములేదు దివ్యకీర్తియు లేదు
జగతిఁ బుట్టి పుట్టి చచ్చి చచ్చి
పొరల నేల మనకుఁ బుట్టని చావని
త్రోవ వెదకికొనుట దొడ్డబుద్ధి. 214

టీ. కంటిరే=చూచితిరా, ఘనులు = దొడ్డవారు, గృహస్థులు = కాఁపులు, విఫలులు=పనికిమాలినవారు, కైకొన్న వెఱ్ఱితనము=పూనినమూఢత్వము, భద్రార్థులై = క్షేమముగోరినవారై, సంసారపద్ధతిన్ = సంసారమార్గమున, పట్టువడిరి=చిక్కుకొనిరి, కలయోనులందు = లోకమున నున్న యన్ని యోనులయందును, గర్భాద్యవస్థలన్=గర్భవాసము మొదలైన పాట్లచే, దేహి=శరీరి, కర్మతంత్రుఁడై=కర్మములకు వశమైనవాఁడై, భవశతములకునైనన్ = వందలసంవత్సరములకైనను, శుభము = క్షేమము, దివ్యకీర్తి=చావుపుట్టుకలు లేని యశస్సు, పొరల నేల = ఏలపొర్లవలెను, దొడ్డబుద్ధి=శ్రేయమైన బుద్ధి.

తా. బాలకులారా! చూచినారుగదా! మనవారందఱు బలదర్పసంపన్నులును గొప్పవారు నయ్యును వెఱ్ఱిలారలై జన్మమును వ్యర్థము చేసికొను

చున్నవారలు. తమకు మేలే కావలెనని కోరియు దానికిఁ దగినట్లు సంసారబంధవిముక్తిని జేసికొనక, దీనిలో నింకను జిక్కుకొనుచున్నారు. ఈజీవుఁడు లోకములో నెన్నిరకములజంతువులు గలవో అన్నిటి యోనులయందును బుట్టి చచ్చుచుండును. కర్మవశుఁడై తన్నుఁ దాఁ దెలిసికొనలేకున్నాఁడు. ఇఁక వేయి జన్మములెత్తినను సంసారమునుండి గట్టునఁబడు నుపాయ మెఱుఁగఁడు. కాన దీనివలన మనకు శ్రేయస్సు లేదు. మంచికీర్తియా ఆదియును లేదు. వ్యర్థముగాఁ బుట్టుచుఁ జచ్చుచు నేల బాధచెందవలెను. మనము పుట్టుక చావును లేని యొకమార్గము వెదకికొనవలయును.

శా. హాలాపానవిజృంభమాణమదగర్వాతీత దేహోల్లస
ద్బాలాలోకనశృంఖలానిచయసంబద్ధాత్ముఁడై లేశమున్
వేలానిస్సరణంబు గానక మహావిద్వాంసుఁడుం గామినీ
హేలాకృష్టకురంగశాబక మగున్ హీనస్థితిన్ వింటిరే. 215

టీ. మహావిద్వాంసుఁడున్ = గొప్పపండితుఁడైనను, హాలా...త్ముఁడై = కల్లుద్రాగుటచే మేరమీఱిన గర్వముచేఁ బ్రకాశించు జవ్వని చూపు అనుగొలుసులచేఁ గట్టుపడినవాఁడై, లేశమున్ = కొంచెమును, వేలానిస్సరణంబు = గట్టునకుఁ జేరుటను, కామిని...శాబకము = స్త్రీయొక్క విలాసములచే లాగఁబడిన లేడిపిల్ల, హీనస్థితిన్ = అధోగతని, వింటిరే = విన్నారా.

తా. బాలురారా! ఎంతగొప్పపండితుఁడైనను కల్లుద్రాగి ఒడలెఱుంగక హెచ్చుపెరుఁగునందము గర్వము వీనిచే వెలయు స్త్రీల వాలుఁజూపు అనుగొలుసులచేఁ గట్టఁబడి కొంచెమైన దరిజేరుమార్గ మెఱుఁగక, అఁడువార లాడుకొను లేడిపిల్లమాదిరి నుండును. ఇది యెంతదుర్గతియో యోచించుకొనుఁడు.

ఆ. విషయసక్తులైనవిబుధాహితులతోడి
మనికి వలదు ముక్తిమార్గవాంఛ

నాదిదేవు విష్ణు నాశ్రయింపుఁడు ముక్త
సంగజనులఁ గూడి శైశవమున. 216

టీ. విషయసక్తులు = ఇంద్రియార్థములయందుఁ దవిలినవారు, విబుధాహితులతోడిమనికి = రాక్షసులతోడిపొత్తు, ముక్తిమార్గవాంఛన్ = మోక్షమార్గమందలి కోరికతో, శైశవమునన్ = బాల్యమందు, ముక్తసంగజనులన్ = వదలఁబడినసంగముగలమహాత్ములను, ఆదిదేవున్ = దేవతలకు మొదటిదేవుఁడైన, విష్ణున్, ఆశ్రయింపుఁడు.

తా. బాలకులారా! వ్యర్థముగాఁ జెడవలదు, నామాట విని యీచిన్నఁదనమునందే రాక్షసులతోఁగూడి చెడక సంగవర్జితులైనమహాత్ములను సేవించి వారిద్వారమున విష్ణుసాయుజ్యమును బొందుఁడు.

వ. కావున విషయంబులఁ జిక్కువడినరక్కసులకు హరిభజనంబు శక్యంబుగాదు రమ్య మయ్యును బహుతరప్రయాసగమ్య మని తలంచితి రేనిఁ జెప్పెద సర్వభూతాత్మకుం డై సర్వదిక్కాలసిద్ధుం డై బ్రహ్మ కడపలగాఁ గలచరాచరస్థూలసూక్ష్మజీవసంఘంబులందును నభోవాయుకుంభినీసలిలతేజంబు లనియెడు మహాభూతంబులయందును భూతవికారంబు లయినఘటపటాదులయందును గుణసామ్యం బయిన ప్రధానమందును గుణవ్యతికరం బైనమహత్తత్త్వాదియందును రజస్సత్త్వతమోగుణంబులయందును భగవంతుఁ డవ్యయుం డీశ్వరుండు పరమాత్మ పరబ్రహ్మ మనియెడువాచకశబ్దంబులు గల్గి కేవలానుభవానందస్వరూపకుండు నవికల్పితుండు ననిర్దేశ్యుండు నయినపరమేశ్వరుండు త్రిగుణాత్మకం బైనతనదివ్యమాయచేత నంతర్హితైశ్వర్యుం డై వ్యాప్యవ్యాపకరూపంబులం జేసి దృశ్యుండును ద్రష్టయు భోగ్యుం

డును భోక్తయు నయి నిర్దేశింపం దగి వికల్పితుం డై యుం డుఁ దత్కారణంబున నాసురభావంబు విడిచి సర్వభూతంబులందును దయానుహృద్భావంబులు కర్తవ్యంబులు దయానుహృద్భావంబులు గల్గిన నధోక్షజుండు సంతసించు ననంతుం డాద్యుండు హరి సంతసించిన నలభ్యం బెయ్యదియు లేదు జనార్దనచరణసరసీరుహయుగళస్మరణసుధారసపానపరవశుల మైతిమేని మనకు దైవవశంబున నకాంక్షితంబులై సిద్ధించు ధర్మార్థకామంబులుఁ గాంక్షితం బై సిద్ధించు మోక్షం బన నేల త్రివర్గంబును నాత్మవిద్యయుం దర్కదండ నీతి జీవికాదు లన్నియును త్రైగుణ్యవిషయంబు లైన వేదంబులవలనం బ్రతిపాద్యంబులు నిస్త్రైగుణ్యలక్షణంబునం బరమపురుషుం డైనవారికి నాత్మసమర్పణంబు సేయుటయు మేలు పరమాత్మతత్త్వజ్ఞానోదయంబునం జేసి స్వపరభ్రాంతి చేయక పురుషుండు యోగావధూతత్త్వంబున నాత్మవికల్పభేదంబునం గలలోఁ గన్నవిశేషంబులభంగిం దథ్యం బనక మిథ్య యని తలంచు నని మఱియుఁ బ్రహ్లాదుం డిట్లనియె. 217

టీ. విషయంబులన్ = ఇంద్రియములలో, శక్యము=అలవియైనది, రమ్యము=సొంపైనది, బహు...గమ్యము=చాలకష్టపడినఁగాని దొరకనిది, సర్వభూతాత్మకుండు=సర్వభూతస్వరూపము గలవాఁడు, సర్వదిక్కాలసిద్ధుండు=ఎల్లదేశములయందు కాలములయందు నుండువాఁడు, చరా...సంఘంబులందును = స్థిరములు చరములు చిన్నవి పెద్దవియగు ప్రాణికోటులయందు, నభః=ఆకాశము, వాయు = గాలి, కుంభిని=పృథివి, సలిల=ఉదకము, తేజః = అగ్ని, మహాభూతములు = భూమి మొదలగు మహాభూత

ములు, భూతవికారములు = భూతములవలనఁ బుట్టినవి. ఘటపటాదులు = కుండ గుడ్డ మొదలయినవి, గుణసామ్యంబు = గుణములకు తుల్యముగా నుండునది, ప్రధానము = ప్రకృతి, గుణవ్యతికరంబు = గుణముల హెచ్చుతగ్గులు గలది, మహత్తత్త్వాదియందును = మహతత్త్వమందును, రజస్సత్త్వతమోగుణంబులయందును, భగవంతుండు = షడ్గుణైశ్వర్యములు కలవాఁడు, అవ్యయుండు = నాశములేనివాఁడు, ఈశ్వరుండు = సర్వశక్తుఁడు, కేవలా...రూపకుండు = కేవలమై యనుభవగోచరమైనయానందరూపము గలవాఁడు, అవికల్పితుఁడు = మాఱుపడనివాఁడు,* అనిర్దేశ్యుండు = చెప్పనలవికానివాఁడు, త్రిగుణాత్మకంబు = సత్త్వరజస్తమోగుణస్వరూపము, అంతర్హితైశ్వర్యుండై = మఱుఁగుపడిన వైభవము గలవాఁడై, వ్యాప్యవ్యాపక రూపంబులం జేసి, దృశ్యుండు = చూడఁదగినవాఁడు, ద్రష్ట = చూచువాఁడు, భోగ్యుండు = అనుభవింపఁదగినవాఁడు, భోక్త = అనుభవించువాఁడు, నిర్దేశింపఁగా = నిర్ణయించుటకు, వికల్పితుండు = రూపకల్పన చేయఁబడినవాఁడు, ఆసురభావంబు = రాక్షసత్వమును, సర్వభూతంబులందును = ఎల్లజంతువులయందును, దయ = కరుణ, సుహృద్భావము = చెలిమి, కర్తవ్యంబులు = చేయఁదగినవి, అధోక్షజుండు = (ఇంద్రియజన్యజ్ఞానమును క్రిందుపఱచువాఁడు) ఇంద్రియాగోచరుఁడగు విష్ణువు, అనంతుండు = తుదలేనివాఁడు, ఆద్యుండు = మొదటివాఁడు, అలభ్యుండు = పొందరానివాఁడు, జనా...పశులము = శ్రీహరి పాదకమలముల జంటయొక్క స్మరణమను నమృతద్రవమును ద్రాగి మై మఱచిన వారమేని, ఆకాంక్షితంబులు = కోరఁబడినవి, సిద్ధించుఁగా = దొరకును. ఆత్మవిద్య = బ్రహ్మవిద్య, తర్క = న్యాయశాస్త్రము, దండనీతి = కామందకాది శిక్షాస్మృతి, జీవికాదులు = బ్రతుకుదెరువులైనవార్తాదులు, త్రైగుణ్యవిషయంబులు = త్రిగుణస్వరూపములను జెప్పునట్టి, ప్రతిపాద్యంబులు = చెప్పఁదగినవి, నిస్త్రైగుణ్యలక్షణంబునకు = త్రిగుణాతీతుఁడను గుర్తుచేత, ఆత్మసమర్పణంబు = బ్రహ్మార్పణము, పరమాత్మతత్త్వజ్ఞానోదయంబు = ఆత్మతత్త్వముయొక్క పుట్టుకను, స్వపర

భ్రాంతి = నేను అన్యుఁడు అను పొరపాటు, ఆత్మవికల్పభేదంబునన్ = ఆత్మయందలి యుపాధిభేదముచేత, కన్నవిశేషములు = చూచిన సంగతులు, తథ్యంబు = నిజము, మిథ్య = బూటకము, తలంచుక్ = తలపోయును.

మ. నరుఁడుం దానును మైత్రితోఁ మెలఁగుచున్ నారాయణుం
డింతయున్, వరుసన్ నారదసంయమీశ్వరునకున్ వ్యాఖ్యా
నముం జేసె మున్, హరిభక్తాంఘ్రిపరాగశుద్ధతను లేకాం
తుల్ మహాకించనుల్, వరతత్త్వజ్ఞులు గాని నేరరు మదిన్
భావింప నీజ్ఞానమున్. -18

టీ. నరుఁడు = ఒకఋషి, మైత్రి = చెలిమి, మెలఁగుచున్ = సంచరించుచు, నారాయణుండు = అనుఋషి, ఇంతయున్ = దీనినంతయును, వరుసన్ = క్రమముగా, మున్ = పూర్వము, నారదసంయమీశ్వరునకున్ = నారదమహామునికి, వ్యాఖ్యానమున్ చేసెన్ = విప్పిచెప్పెను. ఈజ్ఞానమున్ = ఈబ్రహ్మజ్ఞానమును, హరి...తనులు = విష్ణుభక్తుల కాళ్ల దుమ్ములచేఁ బావనములైన శరీరముగల, ఏకాంతుల్ = అంతరంగభక్తులు, మహాకించనుల్ = సర్వసంగవర్జితులు, పరతత్త్వజ్ఞులు = ఉత్తమతత్త్వమును దెలిసినవారు, మదిన్ = చిత్తములో, భావింపన్ = మననముచేయుటకు, నేరరు = సమర్థులుకారు.

తా. బాలకులారా! ఇప్పుడు నేఁ జెప్పిన యీపరతత్త్వమును నరనారాయణులు నారదమహామునికుపదేశమిచ్చినారు. దీనిని ఎంతయో అనుభవము గలవైష్ణవసేవాపరులగుతత్త్వవేత్తలుగాని సామాన్యులు తెలిసికోఁజాలరు.

వ. తొల్లి నేను దివ్యదృష్టి గలనారదమహామునివలన సవిశేషం
బయినయీజ్ఞానంబును బరమభాగవతధర్మంబులు వింటి నని
న వెఱఁగుపడి దైత్యబాలకు లద్దనుజరాజకుమారున కిట్లనిరి.

టీ. తొల్లి = మనుపు, దివ్యదృష్టి = అతీంద్రియవిషయములను తెలిసికొనుజ్ఞానము, సవిశేషంబు = ఎల్లరహస్యములతోఁగూడిన, పరమ భాగవతధర్మంబుఁ = మేలైనభాగవతమును, వెలుఁగుపడి=విన్నఁబోయి.

ఉ. మంటిమి కూడి భార్గవకుమారకులొద్ద ననేకశాస్త్రముల్
వింటిమి లేఁడు సద్గురుఁడు వేఱొకఁ డెన్నఁడు రాజశాల ము
క్కంటికి నైన రాదు చొరఁగా వెలికిం జనరాదు నీకు ని
ష్కంటకవృత్తి నెవ్వఁడు ప్రగల్భుఁడు చెప్పె గుణాఢ్య చెప్పుమా.

టీ. గుణాఢ్య = మంచిగుణములచే నిండియున్నయో ప్రహ్లాదా! కూడి = కలిసి, మంటిమి = పెరిఁగితిమి, కూడి, భార్గవకుమారకులొద్దన్ = శుక్రునికొడుకులకడ, అనేకశాస్త్రముల్ = చాలచదువులు, సద్గురుఁడు = మంచియుపాధ్యాయుఁడు, రాజశాల = మనరాజానిల్లు, ముక్కంటికిన్ = మూఁడుకన్నులుగల యీశ్వరునకును, చొరన్ = చొచ్చుటకు, వెలికిన్ = వెలుపలికి, చనన్ = పోవుటకు, రాదు = వీలుకాదు, నిష్కంటకవృత్తిన్ = టొంకులేని నడవడితో, ప్రగల్భుఁడు = నేర్పరి, చెప్పుమా.

తా. ప్రహ్లాదా! మనమందఱము నొక్కచోఁ బుట్టిపెరిఁగితిమి. అందఱము శుక్రునికొడుకులవలననే చదివినంతవఱకుఁ గూడి చదివితిమి. మనపట్టణములోనికా చండశాసనుఁ డగునీతండ్రికిఁ దెలియకుండఁ బ్రొత్తమానిసి వచ్చువీలు లేదు. నీవా వెలుపలి కెన్నఁడు మమ్ము విడిచిపోయినవాఁడవు కావు. నీ కేపుణ్యాత్ముఁ డయ్యా యాజ్ఞానోపదేశము చేసినవాఁడు ఆయన యెంతటి యుపాయశాలియోకదా!

క. సేవింతుము ని న్నెప్పుడు
భావింతుము రాజ వనుచు బహుమానములం
గావింతుము తెలియము నీ
కీవింతమతిప్రకాశ మేక్రియఁ గలిగెన్. 221

టీ. సేవింతుము = సేవించుచునే యుంటిమి, భావింతుము = ధ్యానింతుము, తెలియము=ఎఱుఁగము, వింతమతిప్రకాశము = ఆశ్చర్యమైన జ్ఞానోదయము, ఏక్రియన్ = ఎట్లు, కలిగెన్ ?

తా. ప్రహ్లాదా ! మేము నిన్నెప్పుడు పరివేష్టించియే యున్నాము. నీవు మాకు రాజవని బహువిధముల గౌరవించుచునే యున్నాము. కాని నీవింతటి మహానీయుఁడవై యింతజ్ఞానము సార్జించియున్న సంగతి మే మెఱుఁగము. నీకీజ్ఞాన మెట్లు లభించెను?

వ. అని యిట్లు దైత్యనందనులు తన్నడిగినఁ బరమభాగవతకులా
లంకారుండైన ప్రహ్లాదుండు నగి తనకుఁ బూర్వంబునందు
వినంబడిననారదుమాటలు దలంచి యిట్లనియె. 222

టీ. దైత్యనందనులు=రాక్షసుల పిల్లకాయలు, పరమ...రుండు = సౌభాగ్యులగుహరిదాసులగుంపునకు వన్నెవెట్టువాఁడగు, నగి=నవ్వి.

శా. అక్షీణోగ్రతపంబు మందరముపై నర్థించి మాతండ్రి శు
ద్ధక్షాంతిం జని యుండఁ జీమగమిచేతన్ భోగిచందంబునన్
భక్షింపఁబడెఁ బూర్వపాపములచేఁ బాపాత్మకుండంచు మున్
రక్షస్సంఘముమీఁద నిర్జరులు సంరంభించి యుద్ధార్థులై.

టీ. మాతండ్రి = మాయయ్య, అక్షీణోగ్రతపంబు = కొఱఁతలేని భయంకర తపస్సును, అర్థించి = కోరి, శుద్ధక్షాంతిన్ = పరమశాంతితో, మందరము పైన్ = మందరగిరిమీఁద, చని యుండన్ = వెళ్లియుండఁగా, చీమగమిచేతన్ = చీమలబారులచేత, భోగిచందంబునన్ = పాము వలె, పూర్వపాపములచేన్ = పూర్వజన్మమందు సంపాదించుకొన్న పాపములచేత, పాపాత్మకుఁడు = పాపస్వరూపి, భక్షింపఁబడెన్ = తినఁబడెను (నశించెను), అంచున్, నిర్జరులు = వేల్పులు, రక్షస్సంఘముమీఁదన్ = రాక్షసుల సమూహముమీఁద, సంరంభించి = ఆటోపముజేసి, యుద్ధార్థులై=యుద్ధముఁ జేయువారై.

తా. బాలకులారా! పూర్వము మానాయన గొప్పతపముఁ జేయఁ గోరి మందరపర్వతము మీఁదికిఁ బోయి, చాలకాలము రాక అచ్చటనే యుండఁగా, దేవతలందఱు ఇఁక హిరణ్యకశిపుఁడు చీమలబారిని బడినపాము వలె తనపాపములచేఁ దానే దగ్ధుఁడైనాఁడు. ఇఁక రాక్షసులరూపుమాపుద మని మహోత్సాహముతో నందఱుఁ గలిసి యుద్ధము చేయఁదలఁచి (పైపద్యముతో నన్వయము.)

శా. ప్రస్థానోచితభేరిభాంకృతులతోఁ బాకారియుం దారు శౌ
ర్యస్థైర్యంబుల నేఁగుదెంచినఁ దదీయాటోపవిభ్రాంతులై
స్వస్థేమల్ దిగనాడి పుత్ర ధన యోషా మిత్ర సంపద్గృహ
ప్రస్థానంబులు డించి పాఱి రసురల్ ప్రాణావనోద్యుక్తులై.

టీ. ప్రస్థానో...లతోన్ = యుద్ధనిర్యాణమునకుఁ దగిన భేరుల భంభం అను మ్రోఁతలతో, పాకారియున్ = ఇంద్రుఁడును, దారున్ = దేవతలు, శౌర్యస్థైర్యంబులన్ = విక్రమముతోడను ధైర్యముతోడను, ఏఁగుదెంచినన్ = రాఁగా, అసురల్, తదీయాటోపవిభ్రాంతులై = వారి సంరంభమునకు వెఱచినవారై, స్వస్థేమల్ = తమ ధైర్యములను, దిగనాడి = వీడి, పుత్ర...బులు = బిడ్డలు ధనము భార్యలు నెచ్చెలులు ఐశ్వర్యములు తేజములు తావులును, డించి = దిగవిడిచి, ప్రాణావనోద్యుక్తులై = ప్రాణములఁ గాపాడుకొనఁగోరినవారై, పాఱిరి = పలాయనమైరి.

తా. యుద్ధయాత్రకుఁ దగినసన్నాహముతో భేరులు మ్రోయించుకొనుచు నింద్రుఁడును దామును తగుపాటి యుత్సాహస్థైర్యములతో దండువెడలి రాఁగా నది రాక్షసులు గని వారియాడంబరమునకు వెఱచి, ధైర్యము వదలి తమయాలుబిడ్డలు ధనసంపదలు నైజతేజము గృహములు విడిచి, ప్రాణములు దక్కించుకొనఁ జూచి యెచ్చటివా రచ్చటనుండియే పాఱి పోయిరి.

మత్తకోకిల. ప్రల్లదంబున వేల్పు లుద్ధతిఁ బాఱి రాజనివాసముం
గొల్లవెట్టి సమస్తవిత్తముఁ గ్రూరతం గొని పోవఁగా
నిల్లుసొచ్చి విశంకుఁడై యమరేశ్వరుం డదలించి మా
తల్లి దాఁ జెఱవట్టె సిగ్గునఁ దప్తయై విలపింపఁగాన్. 225

టీ. వేల్పులు = దేవతలు, ప్రల్లదంబునన్ = కఱకుఁదనముతో, ఉద్ధతిన్ = గర్వముతో, పాఱి = దుమికి, రాజనివాసమున్ = రాజునగరమును, కొల్లవెట్టి = చూఱఁగొని, క్రూరతన్ = కౌఠిన్యముతో, సమస్తవిత్తమున్ = కలధనమంతయు, కొనిపోవఁగాన్ = తీసుకొనిపోవుచుండఁగా, అమరేశ్వరుఁడు = ఇంద్రుఁడు, విశంకుఁడై = జంకులేనివాఁడై, ఇల్లు, చొచ్చి, అదలించి = భయపెట్టి, తాన్, సిగ్గునన్, తప్తయై = కాఁగినదై, విలపింపఁగాన్ = ఏడువఁగా, మాతల్లిన్ = మాయమ్మయగు లీలావతిని, చెఱపట్టెన్ = చెఱఁగొనిపోయెను.

తా. ఇట్లు దేవతలందఱు దౌష్ట్యము మీఱఁ బట్టణము పైకుఱికి దయమాలి పట్టణమును గొల్లగొనుచుండఁగా, నింద్రుఁడు సాహసముతో నంతఃపురముఁ జొచ్చి సిగ్గున మ్రగ్గి కుములుచున్న మాయమ్మను జంకు విడిచి చెఱఁగొని పోయెను.

వ. ఇట్లు సురేంద్రుండు మాతల్లిం జెఱఁ గొని పోవుచుండ న
మ్మగువ కురరి యను పులుఁగుక్రియ మొఱలిడినఁ దెరువున
దైవయోగంబున నారదుండు పొడగని యిట్లనియె. 226

టీ. కురరి = ఆఁడులకుముకి [?], పులుఁగు = పిట్ట, మొఱలిడినన్ = పరిదేవనము చేయుచుండఁగా, తెరువునన్ = త్రోవలో, దైవయోగంబునన్ = దైవవశముచేత, నారదుండు = నారదమహాముని, పొడగని = చూచి.

ఉ. స్వర్భువనాధినాథ సురసత్తమ వేల్పులలోన *మిక్కిలిన్
నిర్భరపుణ్యమూర్తివి సునీతివి మానినిఁ బట్ట నేల యీ

---

* 'నెంతయున్' అని కొన్ని ప్రతులు.

గర్భిణి నాతురన్ విడువు కల్మషమానసురాలు గాదు నీ
దుర్భరరోషమున్ నిలుపు దుర్జయుఁ డైననిలింపవైరిపై.

టీ. స్వర్భువనాధినాథ=స్వర్గలోకమునకు ప్రభువగునోయింద్రా! సురసత్తమ=దేవతలలో శ్రేష్ఠుఁడా! వేల్పులలోనన్ = దేవతలలోపల, మిక్కిలి, నిర్భరపుణ్యమూర్తివి=కొదువలేని పుణ్యము గలవాఁడవు, సునీతివి=మంచినీతి గలవాఁడవు, మానినిన్=కులశీలాదులు గాపాడుకొనునీయిల్లాలిని, పట్టన్, ఏల ఆతురన్=శోకము జెందిన, ఈగర్భిణిన్ = గర్భవతి యగునీమెను, విడువు, కల్మ...రాలు=పాపచిత్తముగలది కాదు, దుర్జయుఁడు=నీకు గెలువశక్యము కాని, నిలింపవైరిపైన్ = హిరణ్యకశిపునిమీఁద, నీదుర్భరరోషమున్ = నీపట్టరానికోపమును, నిలుపుము.

తా. ఓయింద్రా! నీవల్ల దేవతలలో మేటివి. గొప్పపుణ్యము గలవాఁడవు. మంచిధర్మము గలవాఁడవు. మంచిమనస్సు గలయీకులాంగనను ఎందులకుఁ బట్టుకొనెదవు? ఈమెయెడఁ బాపములేదు. ఇదిగాక గర్భవతి దీనయునై యున్నది. విడువుము. రాక్షసరాజుపై నపట్టరానివ్యర్థపుఁగోపము నిడుము. దాని కెవఁడైన నవతారమూర్తి కావలెఁ గాని నీకు హిరణ్యకశిపుని జయింప సామర్థ్యము చాలదు. ఊరకుండుము.

వ. అనిన వేల్పుఁదపసికి వేయిగన్నులప్రోడ యిట్లనియె. 228

టీ. వేల్పుఁదపసికిన్ = దివ్యర్షి యగు నారదునకు, వేయికన్నుల ప్రోడ = వేయికన్నులు గల పెద్ద.

ఉ. అంతనిధాన మైనదివిజాహితువీర్యము దీనికుక్షి న
త్యంతసమృద్ధి నొందెడి మహాత్మక కావునఁ దత్ప్రసూతిప
ర్యంతము బద్ధఁజేసి జనితార్భకు వజ్రముధారఁ ద్రుంచి ని
శ్చింతుఁడ నై తుదిన్ విడుతు, సిద్ధము దానవరాజవల్లభన్.

టీ. మహాత్మక = ఓనారదమహామునీ! దీనికుక్షిన్ = ఈమె గర్భమున, అంతనిధానము = లోకములకు నాశకరమైన, దివిజాహితువీర్యము=

హిరణ్యకశిపుని రేతస్సు, అత్యంతసమృద్ధిన్ = మిగులవృద్ధిని, ఒందెడిన్, కావునన్, తత్ప్రసూతిపర్యంతము = ఆబిడ్డను గనునంతదాఁక, బద్ధఁజేసి = చెఱఁబెట్టి, జనితార్భకున్ = పుట్టినపట్టిని, వజ్రముధారన్ = వజ్రాయుధమునంచుతో, త్రుంచి = నఱికి, నిశ్చింతుఁడన్ = దిగులుబాసినవాఁడను, ఐ, తుదిన్ = చివరను, దానవరాజవల్లభన్ = హిరణ్యకశిపునిభార్యను, విడుతున్, సిద్ధము = నిజము.

తా. నారదా! లోకములకు దుస్సహమైనరాక్షసునివీర్య మీమె కడుపులో నున్నదని నేనుపట్టితిని. ఈమె బిడ్డనుగనుదాఁకఁ జెఱఁబెట్టి యాబిడ్డను వజ్రముచేఁ జంపి పిమ్మట నీమెను విడిచెదఁగాక యని నానిశ్చయము.

వ. అని పలికిన వేల్పులఱేనికిం దపసి యిట్లనియె. 230

టీ. వేల్పులఱేనికిన్ = ఇంద్రునకు, తపసి = నారదుఁడు.

శా. నిర్భీతుండు ప్రశస్తభాగవతుఁడున్ నిర్వైరి జన్మాంతరా
విర్భూతాచ్యుతపాదభక్తిమహిమావిష్టుండు దైత్యాంగనా
గర్భస్థుం డగు బాలకుండు బహుసంగ్రామాద్యుపాయంబులన్
దుర్భావంబునఁ బొంది చావఁడు భవద్దోర్దర్పవిభ్రాంతుఁడై.

టీ. దైత్యా...స్థుండు = ఈలీలావతి కడుపులోనున్నవాఁడు, అగు బాలకుండు, నిర్భీకుండు = ఎవరివలనను భయములేనివాఁడు, ప్రశస్తభాగవతుఁడున్ = శ్రేష్ఠుఁడైన హరిదాసుఁడు, నిర్వైరి = శత్రుత్వములేనివాఁడు, జన్మా...విష్టుండు = పూర్వజన్మమునఁ బుట్టినహరిపాదభక్తిప్రభావముతోఁ గూడినవాఁడు, భవ...తుఁడై = నీచేతిలావునకు లోఁగి తికమకనొందినవాఁడై, బహు...బులన్ = నానావిధములైన యుద్ధము మొదలగునుపాయంబులచే, దుర్భావంబునన్ = నికృష్టత్వమును, పొంది, చావఁడు.

తా. ఇంద్రా! ఈమెకడుపులోనిబాలుఁడు అకుతోభయుఁడు, పరమభాగవతోత్తముఁడు, ఎవరియెడలను విరోధము లేనివాఁడు, బహుజన్మా

భ్యస్తమైనవిష్ణుభక్తిచే రూఢమైన చిత్తముగలవాఁడు. నీవెంత విక్రమించి యేమి చేసినను నీకు లోఁగి చచ్చువాఁడు గాఁడు.

వ. అని దేవముని నిర్దేశించిన నతనివచనంబులు మన్నించి తాను హరిభక్తుండు గావున దేవేంద్రుండు భక్తిబాంధవంబున మాయవ్వను విడిచి వలగొని సురలోకంబునకుం జనియె మునీంద్రుండును మజ్జననియందుఁ బుత్రికాభావంబు సేసి యూఱడించి నిజాశ్రమంబునకుం గొనిపోయి నీవు పతివ్రతవు నీ యుదరంబునఁ బరమభాగవతుం డయిన ప్రాణి యున్నవాఁడు తపోమహత్త్వంబునం గృతార్థుం డై నీపెనిమిటి రాఁగలం డందాఁక నీ విక్కడ నుండు మనిన సమ్మతించి. 232

టీ. దేవముని, నిర్దేశించినన్ = వాస్తవము చెప్పఁగా, భక్తిబాంధవంబునన్ = నాకును ఆయనకుం గలహరిభక్తి మూలకమైన చుట్టఱికమువలన, మాయవ్వను = మాయమ్మను, వలగొని = ప్రదక్షిణము చేసి, సురలోకంబునకున్ = స్వర్గమునకు, మజ్జననియందు = మాయమ్మయందు, పుత్రికాభావంబు = బిడ్డయనుతలఁపు నా, ఊఱడించి = బుజ్జగించి, నిజాశ్రమంబునకున్ = తనయాశ్రమమునకు, నీయుదరంబునన్ = నీకడుపులో, పరమభాగవతుఁడు = యోగ్యుండైన హరిదాసుఁడు, అయినప్రాణి = అయిన జీవుఁడు, తపోమహత్త్వంబునన్ = తపస్సుయొక్క గొప్పతనముచే, కృతార్థుండై = నెఱవేర్చుకోఁబడినయిష్టము గలవాఁడై, ఇక్కడ = నాదగ్గఱ, సమ్మతించి.

శా. యోషారత్నము నాథుడైవత విశాలోద్యోగ మాతల్లి ని
ర్దోషత్వంబున నాథురాక మదిలో వాంఛించి నిర్దోషయై
యీషద్భీతియు లేక గర్భపరిరక్షేచ్ఛన్ విచారించి శు
శ్రూషల్ చేయుచు నుండె నారదునకున్ సువ్యక్తశీలంబునన్.

టీ. యోషారత్నము = అన్నులమిన్నయు, సాధ్వైవత = మగఁడే దేవుఁడు గాఁగలదియు, విశాలోద్యోగ = గొప్పయత్నముగల, మాతల్లి, నిర్వ్యపమ్యంబునన్ = సాధుభావముతో, సాధురాకన్ = మాయయ్య రాకను, వాంఛించి = కోరి, నిర్దోషయై = ఏలాటిపాపము నెఱుఁగనిదై, ఈశద్భీతియు = కొంచెపుభయమును, లేని, గర్భపరిరక్షేచ్ఛన్ = గర్భమును గాపాడుకొను తలఁపుచేత, విచారించి = యోజించుకొని, నారదునకున్, సువ్యక్తశీలంబునన్ = నిష్కపటమై భక్తివిశదమైన చిత్తముతో, శుశ్రూషల్ = సేవలు, చేయుచున్, ఉండెన్.

తా. పతివ్రతలగు కులాంగనలలో శిరోరత్నము వంటిదగు మాయమ్మయు భర్తరాకఁ గోరుచు భయమువీడి నిర్మలచిత్తముతో నారదునకుఁ బరిచర్యసేయుచు నాయనచేఁ బోషింపఁబడుచుండెను.

వ. ఇట్లు దనకుఁ బరిచర్య చేయుచున్న దైత్యరాజకుటుంబినికి నాశ్రితరక్షావిశారదుం డైననారదుండు నిజసామర్థ్యంబున నభయంబిచ్చి గర్భస్థుండ నైననన్ను నుద్దేశించి ధర్మతత్త్వంబును నిర్మలజ్ఞానంబును నుపదేశించిన నమ్ముద్దియ తద్దయుం బెద్దకాలంబునాఁటివినికిగావున నాఁటది యగుటం జేసి పరిపాటి దప్పి నేఁటికిలేక మఱచె నారదుండును నాయెడఁ గృప గలనిమిత్తంబున. 234

టీ. పరిచర్య = సేవ, దైత్యరాజకుటుంబినికిన్ = హిరణ్యకశిపుని భార్యలీలావతికి, ఆశ్రితరక్షావిశారదుఁడు = తన్నాశ్రయించినవారిని రక్షించు పూనికగల, నిజసామర్థ్యంబునన్ = తనశక్తిచేత, అభయంబు = అభయదానము, ఇచ్చి, గర్భస్థుండు = ఆమెకడుపులోనున్న, నన్నున్, ఉద్దేశించి = గుఱించి, ఆమెతో, ధర్మతత్త్వంబును = న్యాయస్వరూపమును, నిర్మలజ్ఞానంబును = రాగాదికలుషముకాని జ్ఞానమును, ఉపదేశించినన్ = బోధింపఁగా, అమ్ముద్దియ = అమాయమ్మ, తద్దయున్ = మిగుల, పెద్దకా

లంబు నాఁటి వినికి గావునన్ = చాలకాలము నాఁడు విన్నసంగతిగనుక, ఆఁటది = స్త్రీ, ఆగుటం జేసి, పరిపాటి = అభ్యాసము, తప్పి, సూటి = గుఱి, జ్ఞప్తి, లేక, మఱచెను.

తా. నారదుఁడు ఇట్లు తనకు సేవసేయుచున్న మాయమ్మను వనిత త్రికాలంది కడుపులోఁ బెట్టికొని కాపాడుటయేగాక నాయందును మిగుల దయగలవాఁడుగనుక నాకుఁ జెప్పవలె ననుతలఁపుతో నన్నుద్దేశించి మా యమ్మకు అనేకతత్త్వరహస్యములఁ జెప్పెను. మాయమ్మ స్త్రీగనుకను చాలరోజులక్రింద విన్నసంగతి యగుటచేతను దాని యభ్యాస మంత గా లేక తప్పి నాయుపదేశములన్నియు మఱచిపోయినది.

క. వెల్లిగొని నాఁటనుండియు
నుల్లసితం బైనదైవయోగంబున శో
భిల్లెడు మునిమత మంతయు
నుల్లంబున మఱపు పుట్ట దొకనాఁడైనన్. 235

టీ. నాఁటన్ ఉండియు = నారదుఁడు ఉపదేశించినది మొదలుగా, ఉల్లసితము = ప్రకాశింపఁ జేయఁబడినది, వినదైవయోగంబునన్ = వినయాదృష్టసంయోగముచే, మునిమతము అంతయున్ = నారదుని శిష్టమైన తత్త్వార్థమంతయు, వెల్లిగొని = అతిశయించి, శోభిల్లెడున్ = ప్రకాశించుచున్నది, ఒకనాఁడైనన్ ఉల్లంబునన్ = చిత్తములో, మఱపు, పుట్టదు.

తా. బాలులారా! నాకుమాత్రము నారదుఁ డుపదేశించినది మొదలుగా నాయుపదేశములు చక్కఁగా మనస్సున నాఁటి దినదినప్రవర్ధమానమగుచున్నదే కాని ఒక్కనాఁడును మఱపునకు రాదు.

ఆ. వినుఁడు నాదుపలుకు విశ్వసించితిరేని
సతుల కయిన బాలజనుల కయినఁ
దెలియ వచ్చు మేలు దేహాద్యహంకార
దళననిపుణ మైన తపసిమతము. 236

టీ. నాదుపలుకు విశ్వసించితిరేనిన్ = నమ్మితిరేని, వినుఁడు, దేహా...నిపుణము = దేహాదులయందలి మమత్వమును బోఁగొట్టునట్టిది, ఐన, తపసిమతము = నారదుని మతము, మేలు = మంచిది, సతులకైనన్ = స్త్రీలకైనను, బాలజనులకైనన్ = బాలురకైనను, తెలియవచ్చున్ = తెలియనగును.

తా. మిత్రులారా! నామాటలయందు మీకు నమ్మకమున్నచో వినుఁడు చెప్పెదను. దేహాదులయందలి మమకారముఁ బోఁదోలి తత్త్వజ్ఞానమును విశుద్ధభక్తిని గలిగించు నారదునిమతము వారు వీరనక స్త్రీలకు బాలుకుఁగూడ విశదముగాఁ దెలియును.

వ. అని నారదోక్తప్రకారంబున బాలకులకుఁ బ్రహ్లాదుం డిట్లనియె నీశ్వరమూర్తి యైనకాలంబునం జేసి వృక్షంబు గలుగుచుండ ఫలంబునకు జన్మనంతానవర్ధనాపక్షీణత్వ పరిపాకనాశంబులు ప్రాప్తంబు లయినతెఱంగున దేహంబునకుం గాని షడ్భావవికారంబు లాత్మకు లే వాత్మ నిత్యుండు క్షయరహితుండు శుద్ధుఁడు క్షేత్రజ్ఞుండు గగనాదులకు నాశ్రయుండు క్రియాశూన్యుండు స్వప్రకాశుండు సృష్టిహేతువు వ్యాపకుండు నిస్సంగుండుఁ బరిపూర్ణుండు నొక్కరుండు నని వివేకసమర్థంబు లగునాత్మలక్షణంబులు పండ్రెండు నెఱుంగుచు దేహాదులందు మోహజనకంబు లగునహంకారమమకారంబులు విడిచి పసిండిగనులు గలనెలవున విభ్రాజమానకనకలేశంబు లైనపాషాణాదులందుఁ బుటంబువెట్టి వహ్నియోగంబునఁ గరంగ నూఁది హేమకారకుండు పాటవంబున హాటకంబు వడయుభంగి నాత్మకృత కార్యకారణంబుల నెఱింగెడి నేర్పరి దేహంబునం దాత్మసిద్ధికొఱకు నయిన యుపాయ ప్రకృతియు మహదహంకారంబులును బంచతన్మాత్రంబులు

నివి యెనిమిదియుం బ్రకృతు లనియును రజస్సత్త్వతమంబు
లు మూఁడును బ్రకృతిగుణంబు లనియును గర్మేంద్రియంబు
లయిన వాక్పాణిపాదపాయూపస్థంబులును జ్ఞానేంద్రియం
బు లైన శ్రవణనయనరసనాత్వగ్ఘ్రాణంబులును మనంబును మ
హీసలిలతేజోవాయుగగనంబులును నివి పదాఱును వికా
రంబు లనియును గపిలాదిపూర్వాచార్యులచేతఁ జెప్పంబ
డియె సాక్షిత్వంబున నీయిరువదేడింటిని నాత్మ గూడియుం
డుఁ బెక్కింటికూటువ దేహ మదియు జంగమస్థావరరూపం
బుల రెండువిధంబులయ్యె మూలప్రకృతి మొదలయినవర్గం
బునకు వేత్త మణిగణంబులం జొచ్చియున్న సూత్రంబుచం
దంబున నాత్మ యిన్నింటియందును జొచ్చి దీపించు నాత్మకు
జన్మస్థితిలయంబులు గల వంచు మిథ్యాతత్పరులుగాక వివే
కశుద్ధ మైన మనంబునం జేసి విచారించి దేహంబునం దాత్మ
వెదక వలయు నాత్మకు నవస్థలు గలయట్లుండుఁ గాని య
వస్థలు లేవు జాగరణస్వప్నసుషుప్తు లనువృత్తు లెవ్వనిచేత
నెఱుంగంబడు నతం డాత్మ యండ్రు కుసుమధర్మంబు లయిన
గంధంబులచేత గంధాశ్రయుం డయినవాయువు నెఱింగెడు
భంగిం ద్రిగుణాత్మకంబులయి కర్మజన్యంబు లయిన బుద్ధిభే
దంబుల నాత్మ నెఱుంగం దగు నని చెప్పి. 237

టీ. నారదోక్త ప్రకారంబునన్ = నారదుఁడు చెప్పినచొప్పున, ఈశ్వరమూర్తి = ఈశ్వరాత్మకము, వినకాలంబునం జేసి = వినకాలము వలన, వృక్షము = చెట్టు, కలుగుచుండఁగ, ఫలంబునకున్ = దానిపండు నకు, జన్మసంతాన...ములు = పుట్టుట కాయయగుట పెరుగుట ముదురుట పండుట నశించుటలు, ప్రాప్తంబులు వినతెలంగునన్ = కలిగినట్లు,

షడ్భావవికారంబులు = జన్మ సంస్థాన వర్ధన అపక్షయ పరిపాక నాశ ము లనునాఱుమార్పులు, దేహంబునకుఁ గాని = దేహమునకేగాని, ఆత్మకు = పరమాత్మకు, లేవు, ఆత్మ, నిత్యుండు = ఎల్లప్పుడు నుండు వాఁడు, క్షయరహితుండు = నాశములేనివాఁడు, శుద్ధుఁడు = నిర్మలుఁ డు, క్షేత్రజ్ఞుండు = మాయనెఱిఁగినవాఁడు, గగనాదులకుఁ = ఆకాశాది భూతపంచకమునకు, ఆశ్రయుండు = నెలవైనవాఁడు, క్రియాశూన్యుం డు = ఏపనులును లేనివాఁడు, స్వప్రకాశుండు = తనకుఁ దాఁ బ్రకాశించు వాఁడు, సృష్టిహేతువు = ఉత్పత్తికిఁ గారణమైనవాఁడు, వ్యాపకుండు = అంతట వ్యాపించువాఁడు, నిస్సంగుండు = దేనితోడను సంబంధములేనివాఁ డు, పరిపూర్ణుండు = అంతట నిండియున్నవాఁడు, ఒక్కండు = కేవలుఁడు, అని, వివేకసమర్థంబులు = జ్ఞానమునియఁగలవైన, ఆత్మలక్షణంబులు = పరమాత్మకుఁ గలయీ నిత్యత్వాదిలక్షణములను, పండ్రెండును, ఎఱుంగు చుఁ, దేహాదులయందుఁ = దేహ గేహ పుత్ర మిత్ర కళత్రాదులయం దు, మోహజనకంబులు = తగులమును గలిగించునవి, అగునహంకారమమ కారంబులు = నేను నాది యనుభావములను, విడచి, పసిండిగనులు = బంగరుగనులు, కల నెలవున = ఉండుచోట, విభ్రాం...బులు = మెఱ యుచున్న బంగరు తునుకలు గలవి, ఐనపాషాణాదులందుఁ = ఐనఱాళ్లు ఇసుక మొదలగువానియందు, పుటంబువెట్టి = పుటమువేసి, కరంగఁ = ద్రవమగునట్లుగా, ఊఁది, హేమకారకుండు = అగసాలెవాఁడు, పాటవం బునఁ = నేరుపుతో, హాటకంబుఁ = బంగారమును, పడయుభం గిఁ = పొందులాగున, ఆత్మ...బులఁ = పరమాత్మచేఁ గలిగిన కార్య కారణములను; ఎఱింగెడినేర్పరి = తెలియఁగలయుపాయశాలి, దేహంబు నందున, ఆత్మసిద్ధికొఱకుఁ = పరమాత్మ తాదాత్మ్యముకొఱకు, ఐనయుపా యంబునంజేసి, బ్రహ్మభావంబుఁ = బ్రహ్మత్వమును, పడయుఁ = పొందును, మూలప్రకృతియుఁ = మాయయును, మహదహంకారములు ను = బుద్ధ్యహంకారములును, పంచతన్మాత్రంబులుఁ = శబ్దస్పర్శరూప

రసగంధములైనను, కర్మేంద్రియంబులు = పనులు చేయు నవయవములు, ఐనవాక్పాణిపాద పాయూపస్థంబులును = మాట (నోరు) చేతులు కాళ్లు గుదము భగమును, జ్ఞానేంద్రియంబులు = తెలిసికొను సాధనములైన యవయవములు, శ్రవణ...లును = చెవులు కన్నులు నాలుక తోలు ముక్కును, మనంబును, మహీ...బులును = నేల నీళ్లు నిప్పు గాలి బయలును, ఇవి పదారును, వికారంబులు, అనియును, కపిలా...చేతన్ = కపిలుండు మొదలగు వెనుకటి గురువుల చేత, చెప్పంబడియెన్, ఆత్మ, సాక్షిత్వంబునన్ = తటస్థలక్షణము చేత, ఈయిరువదేడింటిని, కూడియుండున్, పెక్కింటికూటువ = ఇట్టివి అనేకములు గలసినది, దేహము = శరీరము, అదియున్, జంగమస్థావరరూపంబులన్ = కదలునది కదలనిది యను నాకారముల చేత, రెండువిధంబులు, అయ్యెన్, ఆత్మ, మూలప్రకృతి = అవిద్య (మాయ) మొదలయిన, వర్గంబునకున్ = సమూహమునకు, వేఱై = విలక్షణమై, మణిగణంబులన్ = రత్నములయందు, చొచ్చియున్న సూత్రంబు చందంబునన్ = దూఱినదారమువలె, ఇన్నింటియందును, చొచ్చి = చేరి, దీపించున్ = వెలుగును, ఆత్మకున్, జన్మ...బులు = పుట్టుట వెలయుట చచ్చుటలు, కలవు, అంచున్ = అనితలంచుచు, మిథ్యాతత్పరులు = అసత్యమును నమ్మినవారు, కాక, వివేకశుద్ధము = జ్ఞానముచే నిర్మలమైన, మనంబునంజేసి = చిత్తమువలన, విచారించి, ఆత్మను; వెదకవలయున్, ఆత్మకున్, అవస్థలు = మేలుకొనుట నిద్రించుట కలఁగాంచుట యనుమార్పులు, కలయట్లు = ఉండునట్లు, ఉండుఁగాని, అవస్థలు, లేవు, జాగరణ స్వప్నసుషుప్తులు = మేలుకొనుట కలఁగాంచుట నిద్రించుట, అనువృత్తులు = వ్యాపారములు, ఎవ్వనిచేతన్, ఎఱుంగఁబడున్ = తెలియఁబడునో, కుసుమధర్మంబులు = పూవులకు సహజగుణములు, అయినగంధంబులచేతన్ = అయినవాసనలవలన, గంధాశ్రయుండు = పరిమళము వహించువాఁడు, అయినవాయువున్ = అయినగాలిని, ఎఱింగెడు భంగిన్ = తెలిసికొనునట్లు, త్రిగుణాత్మకంబులు = సత్త్వరజస్తమోగుణ

రూపములు, అయి, కర్మజన్యంబులు = కర్మవలనఁ బుట్టునవి, అయినబుద్ధిభేదంబులన్ = చిత్తవృత్తులచేత, ఆత్మను, ఎఱుఁగన్, తగును, అని = ఇట్లని, చెప్పి.

సీ. సంసార మిది బుద్ధిసాధ్యము గుణకర్మ
 గణబద్ధ మజ్ఞానకారణంబు
కలవంటి దింతియ కాని నిక్కము గాదు
 సర్వార్థములు మనస్సంభవములు
స్వప్నజాగరములు సమములు గుణశూన్యుఁ
 డగుపరమునికి గుణాశ్రయమున
భవవినాశంబులు వాటిల్లినట్లుండుఁ
 బట్టిచూచిన లేవు బాలురార
తే. కడఁగి త్రిగుణాత్మకము లైనకర్మములకు
జనక మై వచ్చు నజ్ఞానసముదయమును
ఘనతరజ్ఞానవహ్నిచేఁ గాల్చి పుచ్చి
కర్మవిరహితు లై హరిఁ గనుట మేలు. 238

టీ. ఓబాలురారా! ఇది = ఈ, సంసారము, బుద్ధి సాధ్యము = బుద్ధిచే సాధింపఁదగినది, గుణ..బద్ధము = సత్త్వరజస్తమోగుణమూలము లైన (నానావిధ) కర్మలచేఁ గల్పింపఁబడినది, అజ్ఞానకారణంబు = తెలివిలేమికి హేతువైనది, కలవంటిది, ఇంతియ కాని, నిక్కము = నిజము, కాదు, సర్వార్థములు = ఎల్లవిషయములు, మనస్సంభవములు = మనస్సులోఁ బుట్టినవి, స్వప్నజాగరములు = స్వప్నము మేలుకువయు, సమములు, గుణశూన్యుఁడు = గుణములచే రహితుఁడైన, పరమునికిన్ = పరమాత్మకు, గుణాశ్రయంబునన్ = సత్త్వాదిగుణముల సంగముచేత, భవవినాశంబులు = జన్మమరణములు, వాటిల్లినట్లు = కలిగినట్లు, ఉండున్, పట్టిచూచినన్ = విచారించి చూడఁగా, లేవు, కడఁగి = ప్రయత్నపడి, త్రిగుణాత్మ

కములు = సత్త్వరజస్తమోగుణరూపములు, వినకర్మములకు, జనకము = జన్మకారణము, ఐ, ఐమ్ము, అజ్ఞానసముదయమును=అజ్ఞానముయొక్క సమూహమును, ఘనతరజ్ఞానవహ్నిచేఁ = గొప్పజ్ఞాన మనునిప్పుచేత, కాల్చిపుచ్చి, కర్మవిరహితులు = కర్మబంధములు లేనివారు, ఐ, హరిఁ = విష్ణువును, కనుట=చూచుట, మేలు.

తా. బాలురారా! ఈసంసారము తెలివితోఁ బరిశీలింపఁదగినది. గుణకర్మల ననుసరించి యున్నది. అవివేకమునకు మూలమైనది. కలవంటిది. ఇంతియేగాని నిజముకాదు. ఎల్లవిషయములును మనమనస్సులోనే పుట్టినవి. స్వప్నము మేలుకొనుటయు నొక్కటే. గుణవర్జితుఁ డైనయాత్మకు గుణములకూటమింజేసి జన్మలయములు గలిగిన ట్లుండును గాని చక్కఁగా విచారించితిమా లేవు. ఇటు త్రిగుణరూపమైనకర్మబంధములను గలిగించు నీయజ్ఞానపుఁ బొదను గొప్పదైన జ్ఞానాగ్నిచేఁ గాల్చివేసి ఎల్లకర్మములను బాపికొని విష్ణుని జేరినయెడల మే లగును.

వ. అది గావున గురుశుశ్రూషయు సర్వలాభసమర్పణంబును
సాధుజనసంగమంబును నీశ్వరప్రతిమాసమారాధనంబును
హరికథాతత్పరత్వంబును వాసుదేవునియందలి ప్రేమయు
నారాయణగుణకర్మకథానామకీర్తనంబును వైకుంఠచరణక
మలధ్యానంబును విశ్వంభరమూర్తివిలోకనపూజనంబులును
మొదలయిన విజ్ఞానవైరాగ్యలాభసాధనంబులైనభాగవత
ధర్మంబులపై రతి గలిగి సర్వభూతంబులయందు నీశ్వరుం
డు భగవంతుం డాత్మ గలం డని సమ్మానంబు సేయుచుఁ
గామక్రోధలోభమోహమదమత్సరంబులం గెలిచి యిం
ద్రియవర్గంబును బంధించి భక్తి చేయుచుండ నీశ్వరుం డ
యినవిష్ణుదేవునియందలిగతి సిద్ధించును. 239

టీ. అదిగావునన్ = అట్లగుటవలన, గురుశుశ్రూషయు = గురువును సేవించుటయు, సర్వలాభసమర్పణంబును = కర్మములను ఈశ్వరార్పణము సేయుటయు, సాధుజనసంగమంబును = ఉత్తముల చెలిమియు, ఈశ్వరప్రతిమాసపర్యారాధనంబును = దేవునివిగ్రహముం బూజించుటయు, హరికథాతత్పరత్వంబును = భగవంతునికథలయందుఁ దదేకనిష్ఠ గలిగియుండుటయు, వాసుదేవునియందలిప్రేమయును, నారాయణ...బును = శ్రీహరిగుణములు కర్మములు కథలు నామములు కీర్తించు (పాడు) టయు, వైకుంఠ...బును = విష్ణుపాదకమలములను ధ్యానించుటయు, విశ్వంభర...బులును = సర్వప్రపంచమును భరించువాఁడైన శ్రీహరియాకారమును గాంచుట పూజించుటయు మొదలయిన, విజ్ఞాన...బులు = ఉత్తమజ్ఞానము విషయవైముఖ్యము వీనికి సాధనములు, ఐన, భాగవత ధర్మంబుల పైన్ = భాగవతధర్మములమీఁద, రతి = మక్కువ, కలిగి, సర్వభూతంబులయందున్ = చరాచరములైనయెల్లజంతువులయందును, ఈశ్వరుండు = సర్వలోకనియామకుఁడును, భగవంతుండు = షడ్గుణైశ్వర్యసంపన్నుఁడైన, ఆత్మ = పరమాత్మ, కలండు, అని, సమ్మానంబు = (ఎల్లజంతువులయెడల) గౌరవమును, చేయుచు, కామక్రోధలోభమోహమదమాత్సర్యములను, గెలిచి, ఇంద్రియవర్గమును = అంతరింద్రియబాహ్యేంద్రియములను, బంధించి = వానియిచ్చచొప్పునఁ బోనీయకుండునట్లు చేసి, భక్తి = పూజ్యులయందుఁ గావింపఁదగుభావమును, సేయుచుండున్, ఈశ్వరుండు = సర్వనియామకుఁడు, అయిన విష్ణుదేవునియందలి, గతి = చేరిక, సిద్ధించును.

సీ. దనుజారిలీలావతారంబులందలి
శౌర్యకర్మంబులు సద్గుణములు
విని భక్తుఁ డగువాఁడు వేడ్కతోఁ బులకించి
కన్నుల హర్షాశ్రుకణము లొలుక
గద్గదస్వరముతోఁ గమలాక్ష వైకుంఠ
వరద నారాయణ వాసుదేవ

యనుచు నొత్తిలి పాడు నాడు నాక్రోశించు
నగుఁ జింతనము సేయు నతి యొనర్చు
తే. మరులు కొనియుండుఁ దనలోన మాటలాడు
వేల్పు సోఁకినపురుషునివృత్తిఁ దిరుగు
బంధములఁ బాసి యజ్ఞానపటలిఁ గాల్చి
విష్ణుఁ బ్రాపించుఁ దుదిఁ భక్తివివశుఁ డగుచు. 240

టీ. భక్తుఁడు = ప్రపన్నుఁడు, అగువాఁడు = అయినపురుషుఁడు, దనుజారి = విష్ణునియొక్క, లీలా = వేడుకతోఁ గూడిన, అవతారంబులందలి, శౌర్యకర్మంబులు = పరాక్రమపుఁజేఁతలు, సద్గుణములు = మంచిగుణములును, విని, వేడ్కతోన్ = కౌతుకముతోడ, పులకించి = గగురుపాటుజెంది, కన్నులయందు, హర్షాశ్రుకణములు = ఆనందబాష్పముల బిందువులు, జాలుకన్ = జాలువాఱఁగా, గద్గదస్వరముతోడన్ = డగ్గుత్తికపడినయెలుఁగుతోడ, కమలాక్ష = కమలములవంటి కన్నులుగలవాఁడా! వైకుంఠా! వరద = కోరినదానినెల్ల నిచ్చువాఁడా! నారాయణా = ఉదకమందు వసించువాఁడా! వాసుదేవ = వసుదేవునికొడుకా! అనుచున్, ఒత్తిలి = బిగ్గరగా, పాడున్ = గానముచేయును, ఆడున్, ఆక్రోశించున్ = పెద్దగా నఱచును, నగున్, నవ్వును, చింతనము = ధ్యానము, చేయును, నతి = మ్రొక్కు, ఒనర్చున్ = చేయును, మరులు = మోహము, కొనియుండున్ = పొందియుండును, తనలోనన్, మాటలాడును, వేల్పు = దయ్యము, సోఁకినపురుషునివృత్తిన్ = పట్టినవానిలాగున, తిరుగున్, బంధములన్ = కర్మసంసారబంధములను, పాసి = తొలఁగించికొని, అజ్ఞానపటలిన్ = అవివేకపుఁ జిక్కును, కాల్చి = మసిచేసి, తుదిన్ = అంతమున, భక్తివివశుఁడు = అనురాగబంధురుఁడు, అగుచున్, విష్ణుని, ప్రాపించున్ = పొందును.

తా. విష్ణుభక్తుఁడు అనవరతము శ్రీహరియొక్క అవతారములయందలి పరాక్రమకర్మములను విని మేనుగగుర్పొడువ నానందబాష్పములవిడుచుచు డగ్గుత్తికతో కమలాక్షా! వైకుంఠా! వరదా! నారాయణా! వాసుదేవా!

అని పేరులుంగుతోఁ గొంతదడవు పాడును. కొంతసే పాడును. కొంతసే పఠిచును. కొంతకాలము నవ్వును. కొంతసేపు తదేకనిష్ఠతో ధ్యానించును. మ్రొక్కును. ఎప్పుడు నాదేవునిమీఁద మోహము కలిగియుండును. తనతోఁ దానే మాటలాడుకొనును. కొంతసేపు దయ్యము పట్టినట్లు తిరుగును. ఇట్లు తత్పరుఁడై యుండి చివరకు కర్మబంధములను విడిచి యజ్ఞానముఁ దొలఁగఁ ద్రోసికొని భక్తిపరవశుఁడై విష్ణువునం దైక్యమొందును.

వ. కావున రాగాదియుక్తమనస్కుం డయినశరీరికి సంసారచక్రనివర్తకం బయిన హరిచింతనంబు బ్రహ్మానందలి నిర్వాణసుఖం బెట్టి దట్టి దని బుధులు తెలియుదురు హరిభజనంబు దుర్గమంబు గాదు హరి సకలప్రాణిహృదయంబులయందు నంతర్యామి యై యాకాశంబుభంగి నుండు విషయార్జనంబుల నయ్యెడిది లేదు నిమిషభంగురప్రాణు లయినమర్త్యులకు మనుతాస్పదంబులును జంచలంబులును నైన పుత్త్ర మిత్త్ర కళత్ర పశుభృత్యబలబంధురాజ్యకోశమణిమందిరమంత్రిమాతంగమహీప్రముఖవిభవంబులు నిరర్థకంబులు యాగప్రముఖపుణ్యలబ్ధంబు లైనస్వర్గాదిలోకభోగంబులు పుణ్యానుభవక్షీణంబులుగాని నిత్యంబులు గావు నరుండు విద్వాంసుండ నని యభిమానించి కర్మంబు లాచరించి యమోఘంబు లయినవివరీతఫలంబుల నొందుఁ గర్మంబులు గోరక చేయవలయు గోరి చేసిన దుఃఖంబులు ప్రాపించుఁ బురుషుండు దేహంబుకొఱకు భోగంబుల నపేక్షించు దేహంబు నిత్యంబు గాదు తోడ రాదు మృతం బయినదేహమును శునకాదులు భక్షించు దేహి కర్మంబు లాచరించి కర్మబద్ధుం డయి క్రమ్మఱం గర్మానుకూలం బయినదేహంబుఁ దాల్చు నజ్ఞానంబునం జేసి

పురుషుండు గర్మదేహంబుల విస్తరించు నజ్ఞానతంత్రంబులు ధర్మార్థకామంబులు జ్ఞానలభ్యంబు మోక్షంబు మోక్షప్రదాత యగుహరి సకలభూతంబులకు నాత్మేశ్వరుండు ప్రియుండు దనచేత నయినమహాభూతంబులతోడ జీవసంజ్ఞితుం డయి యుండు నిష్కాము లై హృదయగతుం డయినహరిని నిజభక్తిని భజింపవలయు. 241

టీ. శౌనక, రాగాది యుక్త మనస్కుండు = రాగద్వేషాదులతోఁ గూడినచిత్తము గలవాఁడు, అయిన, శరీరికిన్ = దేహధారికి, సంసార...కంబు = సంసారజాలమును బాపునది, అయిన, హరి చింతనంబు = విష్ణుధ్యానము, బ్రహ్మమందలి, నిర్వాణ = మోక్షముయొక్క, సుఖంబు, ఎట్టిదో, అట్టిది, అని, బుధులు = పండితులు, హరిభజనంబు = విష్ణుసేవ, దుర్గమంబు = పొందరానిది, కాదు, హరి, సకల...యందున్ = ఎల్లజీవుల మనస్సులయందు, అంతర్యామి = లోన నున్నవాఁడు, ఐ, ఆకాశంబుభంగిన్, ఉండున్, విషయార్జనంబులన్ = ఇంద్రియార్థములను సాధించుట వలన, అయ్యెడిది = కలుగులాభము, లేదు, నిమిష...ప్రాణులు = రెప్పపాటులోఁ జెడిపోవు ప్రాణముగల, మర్త్యులకున్ = (చచ్చునైజముగల) మానవులకు, మమతాస్పదంబులును = నాది యనుభావమునకుఁ జోటైనవియు, చంచలంబులును, ఐన, పుత్త్ర...బులు = బిడ్డలు నెచ్చెలులు భార్యలు గొడ్లు నౌకరులు సేనలు చుట్టములు ఏనుఁగులు భూములు (రాజ్యము) మొదలగు సంపదలు, నిరర్థకంబులు = ప్రయోజనము లేనివి, యాగ...బులు = యజ్ఞములు మొదలగు పుణ్యకార్యములచేత దొరకిన స్వర్గాది భోగంబులుఁ గాని, పుణ్యానుభవక్షీణంబులు = పుణ్యముల ననుభవించుటవలనఁ గాని, నిత్యంబులు = కలకాలముండునవి, కావు, నరుండు, విద్వాంసుఁడన్ = తెలిసినవాఁడను, అని, అభిమానించి = అహంకారపడి, కర్మంబులు, ఆచరించి, అమోఘంబులు = రిత్తలుగానివి, ఐన, విపరీతఫలంబులన్ = కోరుకొన్నదానికి ప్రతికూలమైన ఫలములను, ఒందున్, కర్మంబులు, కోరిక = ఫలాపేక్ష లేక, చేయవలయును,

కోరి = ఫలమపేక్షించి, చేసినన్, దుఃఖంబులు, ప్రాపించున్ = పొందును, పురుషుండు, దేహంబుకొఱకు, భోగంబులన్ = స్రక్చందన వనితాదులను, అపేక్షించున్ = కోరును, దేహంబు, నిత్యంబు=నిజము, కాదు, తోడన్ = లోకాంతరమునకుఁబోవు జీవునివెంబడిని, రాదు, మృతంబు=ప్రాణములఁ బాసినది, అయిన దేహమును, శునకాదులు=కుక్కలు మొన్నగునవి, భక్షించున్=తినును. దేహి, కర్మంబులు, ఆచరించి=చేసి, కర్మబద్ధుండు=కర్మలచేఁ గట్టఁబడినవాఁడు, అయి, క్రమ్మఱన్=మరల, కర్మానుకూలంబు=తనకర్మకుఁ దగినది, అయిన దేహంబును, తాల్చును=పూనును, పురుషుండు, అజ్ఞానంబునంజేసి=అజ్ఞానమువలన, కర్మదేహంబులన్ విస్తరించున్=కర్మ అను వానిని బట్టి దేహములను పెంచుకొనును. ధర్మార్థకామంబులు=ధర్మ కామార్థములు, అజ్ఞానతంత్రంబులు=అజ్ఞానము కార్యములు (అవఁగా నజ్ఞానముతోడ నిత్యసంబంధము గలవి), మోక్షము, జ్ఞానలభ్యము=జ్ఞానముచే సాధింపఁదగినది, మోక్షప్రదాత = మోక్షమిచ్చువాఁడు, అగుహరి, సకలభూతంబులకున్ = ఎల్లజంతువులకును, ఆత్మేశ్వరుండు = ఆత్మరూపుఁడైన ప్రభువు, ప్రియుండు=అన్నిటికంటె నిష్టమయినవాఁడు, తనచేతన్=తనవలన, ఆయినమహాభూతంబులతోడన్ = కల్పితమైన పంచమహాభూతముల కలయికతోడ్పాటున, జీవసంజ్ఞితుండు=జీవుఁడని పేరు గలవాఁడు, అయి, ఉండున్, నిష్కాములు=కోరికలేనివారు, ఐ, హృదయంగతుండు=హృదయమును బొందినవాఁడు. అయిన హరిని, నిజభక్తిని=రాగద్వేషకలితముగాని అచ్చపు భక్తిచేత, భజింపవలయున్ = సేవింపవలయును.

క. దానవ దైత్య భుజంగమ
మానవ గంధర్వ సుర సమాజములో ల
క్ష్మీనాథుచరణకమల
ధ్యానంబున నెవ్వఁ డయిన ధన్యత నొందున్. 152

టీ. దానవ...సమాజములో౯=దనుజులు దితిజులు (రాక్షసులు) నాగులు మనుజులు గంధర్వులు దేవతలు మొదలగు సంఘములో౯, ఎవ్వఁడు=ఏలాటిజీవుఁడు, అయిన౯, లక్ష్మీనాథుచరణకమలధ్యానంబున౯=శ్రీహరి పాదకమలముల చింతనముచేత, ధన్యత౯=కృతార్థత్వమును, ఒందును.

తా. దానవ రాక్షస గంధర్వ సర్పాదియోనులయందుఁ బుట్టిన యే జీవుఁడైనను శ్రీహరిపదధ్యానముచే ధన్యత్వముఁ జెందును.

క. చిక్కఁడు వ్రతములఁ గ్రతువులఁ
జిక్కఁడు దానముల శౌచశీలతపములం
జిక్కఁడు యుక్తిని భక్తిని
జిక్కినక్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ. 243

టీ అచ్యుతుండు=శ్రీవిష్ణుమూర్తి, భక్తిని=భక్తిచేత, చిక్కినక్రియ౯=దొరకినట్లు, వ్రతములచేతను, క్రతువుల౯=యజ్ఞములచేతను, దానముల౯=దానములచేతను, శౌచశీలతపముల౯ = సదాచారము మంచినైజముచేతను తపస్సుచేతను, యుక్తిని = శాస్త్రతర్కముచేతను, చిక్కఁడు సుఁడీ.

తా. బాలురారా! శ్రీహరి భక్తికి వశమైనట్లు ఇఁక నేనోములకు యాగములకు దానములకు శుచిత్వమునకు మంచినడవడికి తపస్సునకు యుక్తికిని స్వాధీనము గాఁడుసుమా.

క. చాలదు భూదేవత్వము
చాలదు దేవత్వ మధికశాంతత్వంబుం
జాలదు హరి మెప్పింప వి
శాలోద్యములార భక్తి చాలినభంగిన్. 244

టీ. విశాలోద్యములార=గొప్పయత్నము గలరాక్షస బాలురారా! హరి౯=శ్రీవిష్ణువును, మెప్పింప౯=మెచ్చఁజేయుటకు, భక్తి, చాలినభంగి౯=చాలినట్లు, భూదేవత్వము = బ్రాహ్మణులౌట, చాలదు, దేవత్వము=

దేవతలౌట, చాలదు, అధిక కాంతత్వంబుగా = మిగుల సౌమ్యదియు, చాలదు.

తా. గొప్పయత్నము గలయోరాక్షసబాలురారా! శ్రీవిష్ణువును మెప్పించుటకు భక్తియనువస్తువు చాలినట్లు ఇంకొకటియేదియుఁ జాలదు. ఉత్తమమైనబ్రాహ్మణకులమందుఁ బుట్టిననే ప్రయోజనము లేదు. స్వర్గస్థదేవతయైనంతనే కార్యములేదు. చాల సౌమ్యది గలిగినను ఫలములేదు. ఒక్కభక్తియే కావలెను. అయన దానికే వశమై యుండును.

ఆ. దనుజభుజగయక్షదైత్యమృగాభీర
సుందరీవిహంగశూద్రశబరు
లైనఁ బాపజీవులైన ముక్తికిఁ బోదు
రఖిలజగము విష్ణుఁ డనుచుఁ దలఁచి. 245

టీ. అఖిలజగము = ప్రపంచమంతయు, విష్ణుఁడు = శ్రీహరియే, అనుచును, తలఁచి, దనుజ...లు = రాక్షసులు పన్నగులు యక్షులు దితిజులు మృగములు గొల్లలు స్త్రీలు పక్షులు శూద్రులు ఎఱుకువారును, ఐనను, పాపజీవులు = పాపాత్ములు, ఐనను, ముక్తికి = మోక్షమునకు, పోవుదురు.

తా. బాలకులారా! ప్రపంచమంతయు విష్ణుమయ మని తెలిసికొనిరేని రాక్షసులు, యక్షులు, మృగములు, గొల్లలు, స్త్రీలు, పక్షులు, శూద్రులు, బోయలు మొదలుగా నెంతటి పాపాత్ములైనను మోక్షమందుటకు సందేహము లేదు.

క. గురువులు దమకును లోఁబడు
తెరువులు చెప్పెదరు విష్ణుదివ్యపదవికిం
దెరువులు చెప్పరు చీఁకటిఁ
బరువులు వెట్టంగ నేల బాలకులారా. 246

టీ. బాలకులారా! గురువులు = ఒజ్జలు, తమకును, లోఁబడు తెరువులు = తెలిసిన (చదువుల) జాడలను, చెప్పెదరు, గాని, విష్ణుదివ్యపదవికి =

శ్రీహరియొక్క దివ్యమైన స్థానమునకు, తెరువులు=త్రోవలు, చెప్పరు, చీఁకటిఁగా=చీఁకటిలోఁ, పరువులు పెట్టంగన్=పరుగులుదీయుట, ఏల=ఎందుకు?

తా. బాలురారా! మనయయ్యవారలు వారికిఁ దెలిసినచదువులే చెప్పఁగలరుగాని వాటిఁబోఁగొట్టుటఁ జాలని విష్ణుపదప్రాప్తి మార్గమైన చదువు చెప్పలేరు. ఇట్లు మనము ఈ గ్రుడ్డిచదువు ఎన్నాళ్లు చదివినను ఏమి ప్రయోజనమున్నది?

క. తెం డెల్లపుస్తకంబులు
నిం డాచార్యునకు మరల నేకతమునకున్
రండు విశేషము చెప్పెదఁ
బొం డొల్లనివారు కర్మపుంజముపాలై. 247

టీ. ఎల్లపుస్తకంబులున్=మీ బడిలోఁ జదువుకొనవలసిన పుస్తకములన్నియు, తెండు, తీసుకొనిరండు, ఆచార్యునకున్=మనగురువుగారికి, ఇండు, మరలన్=తిరిగి, ఏకతమునకున్=ఈలాటి రహస్యదేశమునకు, రండు, విశేషమున్=ఒకమేలైనవార్త, చెప్పెదను, ఒల్లనివారు=ఇందులకిష్టపడనివారు, కర్మపుంజముపాలై=కర్మముల సమూహమునకు లోఁబడి, పొండు.

తా. బాలకులారా! ఇటు వచ్చి నేఁ జెప్పెదుమాట లాలింపుఁడు. మీమీపుస్తకాలన్ని తెచ్చి గురువుగారివాతఁ బడవేసి వచ్చి మరల నన్నుఁ గలసికొనుఁడు, మీకు మంచిమార్గము జెప్పెదను. ఇందుల కిష్టపడనివారు కర్మలపాలై పొండు. మీగతి మీది.

క. ఆడుదము మనము హరిరతిఁ
బాడుద మెప్పుడు విష్ణుభద్రయశంబుల్
వీడుదము దనుజసంగతిఁ
గూడుదము ముకుందభక్తకోటిన్ సూటిన్. 248

టీ. మనము, హరిరతిన్ = విష్ణువునందలి మక్కువచేత, ఆడుదము, ఎప్పుడున్ = ఎల్లప్పుడును, విష్ణుభద్రయశంబుల్ = విష్ణునిమంగళకరములైన కీర్తులు, పాడుదము, దనుజసంగతిన్=రాక్షసుల చెలిమిని, వీడు

దము, కూటికిన్=గుత్తికోఁడ, ముకుందభక్తకోటికిన్ = విష్ణుభక్తుల సమూహమును, కూడుదము=చేరుదము.

తా. కుఱ్ఱలారా! మనము శ్రీహరిమీఁది చిత్తములో నుండుదము రండు. ఎప్పుడును విష్ణునికీర్తనములను బాడుకొందము. ఈమాయరాక్షసుల సంబంధము మానుకొందము. శ్రీహరిదాసుల చెంతఁ జేరుదము రండు.

క. విత్తము సంసృతిపటలము
ప్రత్తము కామాదివైరివర్గంబుల నేఁ
డిత్తము చిత్తము హరికిని
జొత్తము నిర్వాణపదము శుభ మగు మనకున్. 249

టీ. సంసృతిపటలము=సంసారసమూహమును, విత్తము=విడఁగొట్టుదము, కామాదివైరివర్గంబులన్=కామక్రోధాది శత్రువులను, ప్రత్తము=చీల్చుదము, నేఁడు=ఈదినము, చిత్తము=మనమనస్సు, హరికిని, ఇత్తము, నిర్వాణపదము=మోక్షపుఁజక్కిని, చొత్తము=చేరుదము, మనకును, శుభము=క్షేమము, అగున్.

తా. మనము సంసారమును దొలఁగఁ ద్రోయుదము. కామక్రోధాదులను జీల్చి చెండాడుదము. నేఁడు శ్రీహరికి మనచిత్తమర్పించి మోక్షమార్గమున కేఁగుదము. మనకు మేలగును.

వ. అని యిట్లు ప్రహ్లాదుండు రహస్యంబున నయ్యవేళల రాక్షసకుమారులకు నపవర్గమార్గం బెఱింగించినవా రును గురుశిక్షితంబు లైనచదువులు చాలించి నారాయణభక్తిచిత్తంబులం గీలించి యుండుటం జూచి వారల యేకాంతభావంబు దెలిసి వెఱచి వచ్చి శుక్రనందనుండు శక్రవైరి కిట్లనియె. 250

టీ. అని, ఇట్లు, ప్రహ్లాదుండు, అయ్యవేళలన్=ఆయాసమయములయందు, సమయము చిక్కినప్పుడెల్లను అనుట. రహస్యంబునన్ = ఒంటరిపాటున, రాక్షసకుమారులకున్, అపవర్గమార్గంబు=మోక్షపుఁదెరువు, ఎఱిం

గించినన్ = ఉపదేశింపఁగా, వారును = రాక్షసకుమారులును, గురుశిక్షితంబు లు = ఉపాధ్యాయులచే నేర్పఁబడిన, చదువులు, చాలించి, చిత్తంబులన్ = తమమనస్సులలో, నారాయణభక్తి = విష్ణుభక్తి, కీలించి = నాటుకొనఁజేసి, ఉండుటను చూచి, శుక్రనందనుండు = శుక్రునికొడుకగు రాక్షసబాలురవిద్యా గురువు, వారల యేకాంతభావంబు = ఆరక్షోబాలురయాంతర్యమును, తెలిసి కొని, వచ్చి, శక్రవైరికిన్ = ఇంద్రవిరోధి యగుహిరణ్యకశిపునకు, ఇట్లనియెను.

శా. రక్షోబాలురనెల్ల నీకొడుకు చేరం జీరి లోలోన నా
 శిక్షామార్గము లెల్లఁ గల్ల లని యాక్షేపించి తా నందఱన్
 మోక్షాయత్తులఁ జేసినాఁడు మనకున్ మోసంబు వాటిల్లె నీ
 దక్షత్వంబునఁ జక్కఁజేయవలయున్ దైతేయవంశాగ్రణీ.

టీ. దైతేయవంశాగ్రణీ = ఓరాక్షసరాజా ! నీకొడుకు = ప్రహ్లాదుఁడు, రక్షోబాలురనెల్లన్ = రాక్షసులబిడ్డలనందఱను, చేరన్ జీరి = రాఁబిలచి, లోలోనన్ = రహస్యముగా, నాశిక్షామార్గములు ఎల్లన్ = నాయుపదేశపద్ధతులన్నిటిని, ఆక్షేపించి, తాన్ = ప్రహ్లాదుఁడు, అందఱన్ = రాక్షసకుమారులందఱను, మోక్షాయత్తులన్ = మోక్షమార్గాసక్తులనుగా, చేసినాఁడు. మనకున్, మోసంబు = కీడు, వాటిల్లెన్ = కల్గెను. నీదక్షత్వంబునన్ = నీసామర్థ్యమువలన, చక్కఁజేయవలయున్ = ఈదోసఁగు మానుపవలెను.

తా. రాజా ! నీకొడుకు ప్రహ్లాదుఁడు రాక్షసబాలకుల నందఱను జేరఁబిలిచి నే జెప్పిన చదువులు కల్లలని బోధించి తాను వారి కందఱకు మోక్షమార్గము నుపదేశించెను. మనకుఁ జాల ప్రమాదము సంభవించినది. దీనిని నీవు విచారించి చక్కఁబెట్టవలయును.

క. ఉల్లసితవిష్ణుకథనము
 లెల్లప్పుడు మాకుఁ జెప్పఁ డీగురుఁ డని న
 న్నుల్లంఘించి కుమారకు
 లొల్లరు చదువంగ దానవోత్తమ వింటే. 252

టీ. దానవోత్తమ=రాక్షసశ్రేష్ఠా! వింటే=వింటివా, కుమారకులు=విద్యార్థులు, ఈగురుఁడు=ఈయుపాధ్యాయుఁడు, మాకుఁ, ఎల్లప్పుడుఁ, ఉల్లసిత విష్ణుకథనములు=ప్రకాశించు విష్ణునిగాథలను, చెప్పఁడు, అని, నన్నుఁ, ఉల్లంఘించి=తిరస్కరించి, చదువంగ = నేఁజెప్పినచదువులఁ జదువుటకు, ఒల్లరు=ఇష్టపడరు.

తా. రాక్షసరాజా! విన్నావా! బాలురెల్లరు ఈగురు వెప్పుడు చూచినను ఏవోలేనిపోనిగాథలు చెప్పునుగాని మోక్షైకసాధనములైన విష్ణుచరిత్రములను జెప్పఁడు అని నన్నధిక్షేపించుచు నేఁ జెప్పెడుచదువులను గుత్తియుంచి చదువుకొనరు.

క. ఉడుగఁడు మధురిపుకథనము
విడివడి జడుపగిదిఁ దిరుగు వికసనమున నే
నొడివినచదువులు నొడువఁడు
దుడుకనిఁ జదివింప మాకు దుర్లభ మధిపా. 253

టీ. అధిపా=రాజా! మధురిపుకథనము=విష్ణునికీర్తనము, ఉడుగఁడు=మానఁడు, జడుపగిదిన్=మందునివలె, విడివడి=అడ్డువదలి, వికసనమునన్=ఆనందముతో, తిరుగును, నేనొడివినచదువులు=నేఁజెప్పినచదువులు, నొడువఁడు=చదువఁడు, దుడుకనిన్=ఇట్టినిక్కొడుకును, చదివింపన్ = విద్యగఱపుటకు, మాకుఁ, దుర్లభము=శక్యముకాదు.

తా. రాజా! మీబాలుఁడు ఎప్పుడు విష్ణుకథలను బాడుచు అడ్డమావులులేక పిచ్చివానివలె నానందముతోఁ దిరుగుచుండును. తనపట్టువిడువఁడు. నాచదువులు వానికి రుచింపవు. ఇఁక వీని జదివించునేర్పు నాకు లేదు.

క. చొక్కపురక్కసికులమున
వెక్కురు జన్మించినాఁడు విష్ణునియందుఁ
నిక్కపుమక్కువ విడువం
డెక్కడిసుతుఁ గంటి రాక్షసేశ్వర వెఱ్ఱిన్. 254

టీ. చొక్కపురక్కసికులమునన్ = మంచి రాక్షసవంశమందు, వెక్కురు = వెఱ్ఱివాఁడు, జన్మించినాఁడు, విష్ణునియందున్, నిక్కపుమక్కువ = అచ్చపు భక్తిని, విడువఁడు, రాక్షసేశ్వరా, వెఱ్ఱిన్, ఎక్కడిసుతున్ = ఎట్టువంటికొడుకును, కంటివి.

తా. రాజా! పాలవంటి మీకులమున నీ వెఱ్ఱి జన్మించినాఁడు. ఎంత చెప్పినను విష్ణునియందు మమత వీడఁడు. ఎంత చక్కనికొడుకును గన్నావయ్యా!

వ. అని యిట్లు గురుసుతుండు చెప్పినఁ గొడుకువలని విరోధవ్యవహారంబులు గర్ణరంధ్రంబుల ఖడ్గప్రహారంబు లయి సోఁకిన బిట్టు మిట్టిపడి పాదాహతం బైన భుజంగంబు భంగిఁ బవనప్రేరితం బైన దవానలంబు చందంబున దండతాడితం బయిన కంఠీరవంబు కై వడి భీషణ రోష రసావేశ జాజ్వల్యమాన చిత్తుండును బుత్త్ర సంహారోద్యోగాయత్తుండును గంపమాన గాత్రుండును నరుణీకృత నేత్రుండును నై కొడుకును రప్పించి సమ్మానకృత్యంబులు దప్పించి నిర్దయుం డై యశనిసంకాశ భాషణంబుల నదల్చుచు. 252

టీ. గురుసుతుండు = గురువగు శుక్రుని కొడుకు, విరోధవ్యవహారంబులు = అయిష్టప్రవర్తనములు, కర్ణరంధ్రంబులన్ = చెవిసందులలో, ఖడ్గప్రహారంబులు = కత్తివేట్లు, బిట్టు = మిగుల, మిట్టిపడి = అదరిపడి, పాదాహతంబు = కాలఁదన్నఁబడినది, భుజంగంబుభంగిన్ = పామువలె, పవనప్రేరితంబు = గాలిచేరగుల్కొలుపఁబడిన, దవానలంబు = కార్చిచ్చు, దండతాడితంబు = కఱ్ఱతో మోఁదఁబడిన, కంఠీరవంబు = సింగము, భీషణ...త్తుండు = భయంకరమైన కోపముచే మండుచున్న మనము గలవాఁడు, పుత్త్రి...చిత్తుండు = కొడుకును జంపుటయందుఁ దవిలిన మనస్సుగలవాఁడు, కంపమానగాత్రుండు = వడఁకుచున్న మేను గలవాఁడు, అరుణీకృతనేత్రుం

డు = ఎఱ్ఱఁగాఁ జేసికొనఁబడినకన్నులు గలవాఁడు, సమ్మానకృత్యంబులు = గౌరవంపుఁజెయిదములు, నిర్దయుండై = కరుణమాలినవాఁడై, అశని...బులన్ = పిడుగులంబోనిమాటలతో, అదల్చుచున్ = బెదరించుచు, (పైపద్యముతో నన్వయము.)

శా. సూనున్ శాంతగుణప్రధాను నతిసంశుద్ధాంచితజ్ఞాను న
జ్ఞానారణ్యకృశాను నంజలిపుటీసంభ్రాజమానున్ సదా
శ్రీనారాయణపాదపద్మయుగళీచింతామృతాస్వాదనా
ధీనున్ ధిక్కరణంబు చేసి పలికెన్ దేవాహితుం డుగ్రతన్.

టీ. దేవాహితుండు = రాక్షసుఁడు, ఉగ్రతన్ = క్రౌర్యముతో, శాంతగుణప్రధానున్ = తిన్ననిగుణములె ముఖ్యముగాఁ గలవాఁడును, అతిశుద్ధాంచితజ్ఞానున్ = మిగులదోషరహితమై యొప్పు తెలివిగలవాఁడును, అజ్ఞానారణ్యకృశానున్ = తెలివిలేమి యనునడవికిఁ జిచ్చువంటివాఁడును, అంజలిపుటీసంభ్రాజమానున్ = ప్రణామాంజలి (దోసిలి) చేఁ బ్రకాశించువాఁడును, సదా...ధీనున్ = ఎప్పుడును శ్రీహరిపాదకమలములజంటను జింతించుట యనునమృతమురుచికి లోనైనవాఁడునగు, సూనున్ = కొడుకును, ధిక్కరణంబు = తిరస్కారము, చేసి, పలికెను.

తా. హిరణ్యకశిపుఁడు బలుక్రౌర్యముతో, నతిశాంతుఁడు, నిర్మలమైన జ్ఞానము గలవాఁడు, అవివేకము లేనివాఁడు, విధేయత యొకపడులాగున నంజలి పట్టికొనియున్నవాఁడును, సర్వకాల సర్వావస్థలయందును శ్రీమన్నారాయణచరణసరసిజముల ధ్యానమనునమృతమును ద్రావుటయందుఁ దవిలియున్నవాఁడును నగుకొడుకును ధిక్కరించి మాటలాడఁ దొడఁగెను.

సీ. అస్మదీయం బగు నాదేశమునఁ గాని
మిక్కిలి రవి మింట మెఱయ వెఱచు
నన్నికాలములందు ననుకూలుఁడై కాని
విద్వేషి యై గాలి వీవ వెఱచు

మత్ప్రతాపానలమందీకృతార్చి వై
        విచ్చలవిడి నగ్ని వెలుఁగ వెఱచు
నతితీక్ష్ణ మైననాయాజ్ఞ నుల్లంఘించి
        శమనుండు ప్రాణులఁ జంప వెఱచు
తే. నింద్రుఁ డౌఁదల నామ్రోల నెత్త వెఱచు
నమర కిన్నర గంధర్వ యక్ష విహగ
నాగ విద్యాధరావళి నాకు వెఱచు
నేల వెఱవవు పలువ నీ కేది దిక్కు.

టీ. ఓపలువ=తులువ వగునోబాలకా! రవి = సూర్యుఁడు, అస్మదీయంబు = నాసంబంధము, అగునాదేశమునఁగాని = ఆజ్ఞవలనఁగాక, మింటన్=గగనమందు, మిక్కిలి=మిగుల, మెఱయ వెఱచున్=ప్రకాశింపనోడును, గాలి, అన్నికాలములందున్=ఎల్లవేళలయందును, అనుకూలుఁడు వికానిఁ=నాయిచ్చచొప్పున మెలఁగువాఁడు కాక, విద్వేషియై=అహితుఁడై, వీవన్=వీచుటకు, వెఱచున్, అగ్ని, మత్ప్రతాపానల మందీకృతార్చియై=నాపరాక్రమముమంటలచేత జబ్బుపడినవేఁడిమి గలవాఁడై, విచ్చలవిడిన్=తనయిచ్చకొలఁది, వెలుఁగన్=మండుటకు, వెఱచున్, శమనుండు=యముఁడు, అతితీక్ష్ణ = మిగులతీవ్రమయిన, నాయాజ్ఞన్=నాయానతిని, ఉల్లంఘించి=దాఁటి, ప్రాణులన్=జంతువులను, చంపన్, వెఱచును, ఇంద్రుఁడు, నామ్రోలన్=నాసమ్ముఖమున, ఔఁదల = తలను, ఎత్త వెఱచున్, అమర...రావళి=దేవతలు, కిన్నరులు, గంధర్వులు, యక్షులు, పక్షులు, నాగులు, విద్యాధరులు వీరలపంక్తి, నాకు, వెఱచున్, నీవు, ఏల, వెఱవవు? నీకు, దిక్కు=నాయనుగ్రహమునకుఁ బాసినవెనుక రక్షింపఁగలప్రాపు, ఏది=ఎవరు?

తా. ఓరా తులువా! నాకు వెఱచి సూర్యుఁడు మిక్కిలి రయిండఁగాయ జంకును. గాలి గట్టిగాఁ గొట్టనోడును. నాప్రతాపమునకు వెఱచి అగ్నియు భగ్గని మండ నోడును. నాతీక్ష్ణ మైనయాజ్ఞకు భయపడి యముఁడును

ప్రాణులఁ జంపనోడుదును. ఇంద్రుఁడో నాయెదుట తలయెత్తనేలేఁడు. ఇఁక తక్కినదేవతలు కిన్నరులు యక్షులు పక్షులు నాగులు విద్యాధరులు మొదలగువారిమాట చెప్పనేల. ఓరీ యిట్లు మానవుల కుపాసింపఁదగిన దేవులే నాకు వెఱచుచుండఁగా నీవేల భయపడవు, నాయాగ్రహమునకు లోనైన నీ వెవ్వనియండఁ జేరి బ్రతుకఁగలవురా చెప్పుము?

శా. ప్రజ్ఞావంతులు లోకపాలకులు శుంభద్ద్వేషు లయ్యున్ మదీ
యాజ్ఞాభంగము చేయ నోడుదురు రోషాపాంగదృష్టిన్ వివే
కజ్ఞానచ్యుతమై జగత్త్రితయముం గంపించు నీ విట్టిచో
నాజ్ఞోల్లంఘన మెట్లు చేసితివి సాహంకారతన్ దుర్మతీ. 258

టీ. దుర్మతీ = ఓ చెడుబుద్ధి గలవాఁడా! ప్రజ్ఞావంతులు = శక్తియుక్తులు గలిగిన, లోకపాలకులు = ఇంద్రుఁడు మొదలగువారు, శుంభద్ద్వేషులు = వృద్ధినొందుపగ గలవారు, అయ్యున్, మదీయాజ్ఞాభంగమున్ చేయన్ ఓడుదురు = నాయాజ్ఞను దాఁటవెఱతురు, జగత్త్రితయమున్ = ముల్లోకములును, వివేకజ్ఞానచ్యుతము = ముందు వెనుక లరయు తెలివితోడి జ్ఞానమునువీడి, కంపించున్ = వణఁకును, నీవు, ఇట్టిచోన్ = ఇప్పట్టున, సాహంకారతన్ = పొగరుఁబోతుఁదనముతో, ఆజ్ఞోల్లంఘనము = నాయాజ్ఞమీఱుట, ఎట్లు, చేసితివి.

తా. ఓరీ చెడ్డబాలుఁడా! గొప్పసామర్థ్యము గలిగి నీకంటె ఎన్నిరెట్లో బలవంతులైన యింద్రాదులు నాయం దెప్పుడు ఈర్ష్యగలవారై యుండియు, నాకువెఱచి నా కయిష్టము చేయలేరు. నేనొక్కతేప గ్రుడ్లెఱ్ఱఁగా జేసి చూడఁగానే ముల్లోకములును తెలివిమాలి గడగడ వణఁకును. ఇట్టినాయాజ్ఞ నెట్లుమీఱఁ గలిగితివి చెప్పుము?

శా. కంఠక్షోభము గాఁగ నొత్తిలి మహాగాఢంబుగా డింభ వై
కుంఠుం జెప్పెదు దుర్జయుం డనుచు వైకుంఠుండు వీరవ్రతో
త్కంఠాబంధురుఁ డేని నే నమరులన్ ఖండింప దండింపఁగాఁ
గుంఠీభూతుఁడు గాక రావలదె మద్ఘోరాహవక్షోణికిన్. 259

టీ. డింభ = ఓయిబుడ్డా! వైకుంఠుఁడు = విష్ణుని, దుర్జయుండు అనుచున్ = ఇతరులకు ఓడింప శక్యముకానివాఁడని, కంఠశోషముగాఁ గన్ = గొంతు నొప్పియెత్తునట్లు, ఒత్తిలి = బిగ్గరగా, మహాగాఢంబు గాన్ = మిగుల పూనికతో, చెప్పెదు, వైకుంఠుండు, వీరవ్రతోత్కంఠుఁడు ఏనిన్ = శూరత్వము వెల్లడించుటయందు కోరికగలవాఁడైనచో, నేను, అమరులన్ = దేవతలను, ఖండింపన్ = నఱుకఁగా, దండింపన్ = శిక్షింపఁగా, కుంఠీభూతుఁడు = మూలముకుంగువాఁడు, కాక, మద్ఘోరాహవక్షోణికిన్ = నాభయంకరమైన యుద్ధరంగమునకు, రావలదె = రావలయునేకదా?

తా. బుడ్డా! ప్రహ్లాదా! విష్ణువు చాల దొడ్డవాఁడు, మహాశూరుఁడు, అని నీవు గొంతుపగల నఱచెదవుగదా! అతఁడు నీవనుకొనినట్లు, అంత మేలిమిగల దుర్జయమైన పరాక్రమము గలవాఁడైనచో నేను దేవతల నందఱను ముక్కలుగాఁ గోసి చీకాకు చేయునప్పుడు యుద్ధరంగమున నా యెదుటికి రావలసినదే నే ఏలరాలేదు చెప్పుము?

శా. ఆచార్యోక్తము గాక బాలురకు మోక్షాసక్తిఁ బుట్టించి నీ
వాచాలత్వముఁ జూపి విష్ణు నహితున్ వర్ణించి మద్దైత్యవం
శాచారంబులు నీఱు చేసితివి మూఢాత్మా కులద్రోహినిన్
నీచుం జంపుట మేలు చంపి కులమున్ నిర్దోషముం జేసెదన్.

టీ. బాలురకున్ = రాక్షసుల పిల్లకాయలకు, ఆచార్యోక్తము = గురువుచెప్పినది, కాక, మోక్షాసక్తిన్ = ముక్తియందలి ప్రేమను, పుట్టించి = కలిగించి, నీవాచాలత్వము = నీవదరుబోతుఁదనమును, చూపి = అగపఱచి, అహితున్ = పగవాఁడగు, విష్ణున్, వర్ణించి = పొగడి, మద్దైత్యవంశాచారంబులు = నారక్కసి కులపు మర్యాదలు, నీఱు చేసితివి = బూడిదగా నొనర్చితివి. మూఢాత్మక = మూర్ఖుఁడును, కుల ద్రోహినిన్ = వంశమునకు చెడుగొనర్చినవానిని, నీచున్ = నీచుఁడవైన

నిన్ను, చంపుట, మేలు = క్షేమము, నిన్ను, చంపి, కులము = నావంశమును, నిర్దోషముగాన్ = దోషములేనిదానిగా, చేసెదను.

తా. నీవు గురువు చెప్పినదే పిల్లకాయలకందఱకు మోక్షమందాశను బుట్టించి నీనోరికొలంది నాశత్రువగు విష్ణునిఁ బొగడి నాకులాచారములు బూడిదపాలుచేసినావు. ఇట్టిమూర్ఖుని వంశమునకు చెఱుపుచేసినవాని నికృష్టుని నిన్ను జంపి నావంశము పావనము చేసికొందును.

క. దిక్కులు గెలిచితి నన్నియు
దిక్కెవ్వఁడు రోరి నీకు దేవేంద్రాదుల్
దిక్కులరాజులు వే ఱొక
దిక్కెఱుఁగక కొలుతు రితఁడె దిక్కని నన్నున్. 261

టీ. దిక్కులు అన్నియు, గెలిచితిని, ఓరీ, నీకు, దిక్కు = శరణు, ఎవ్వఁడురా, దిక్కులరాజులు = దిక్కులకుఁ బ్రభువులైన, దేవేంద్రాదులు = దేవేంద్రుఁడు మొదలగువారు, వేఱొకదిక్కు = మఱియొకదిక్కు, ఎఱుఁగక = లేక, ఇతఁడు అని = వీఁడే మనకు దిక్కు అని, నన్నున్, కొలుతురు.

తా. బాలకా! ఎల్లదిక్కులకు ప్రభువులగు ఇంద్రాదులు గూడ వేఱు దిక్కుగానక నేనే దిక్కని నన్ను సేవించుచుందురు. ఇట్లందఱు నన్ను గొలుచుచుండఁగా నీవు తిరస్కరించుచున్నావే నీ కెవఁడురా దిక్కు ?

క. బలవంతుఁడ నే జగముల
బలములతోఁ జనక వీరభావమున మహా
బలుల జయించితి నెవ్వని
బలమున నాడెదవు నాకుఁ బ్రతివీరుఁడ వై. 262

టీ. నేను, జగములన్ = లోకములయందు, బలవంతుఁడన్ = సామర్థ్యము గలవాఁడను, బలములతోన్ = సేనలతోడ, చనక = కూడి వెళ్ళక, వీరభావమునన్ = శూరత్వమున, మహాబలులన్ = గొప్పబలము గలవీరు

లను, జయించితిని, నీవు, నాకు, ప్రతివీరుఁడవై = శత్రువవై, ఎవ్వని బలమునన్ = ఎవనియండచేత, ఆడెదవు.

తా. బాలకా! ఎల్లలోకములలో నేను బలవంతుఁడను. నన్ను మించినవారెందును లేరు. సేన లేకయే ఒంటరిగా నేఁగి యుద్ధములో శూరులను జంపితిని. నీ విఁక నెవరి ప్రాపు చూచుకొని నాకుఁ బ్రతిఘటించెదవో యెఱుఁగఁ జెప్పుము.

వ. అనినఁ దండ్రికి మెల్లన వినయంబునఁ గొడు కిట్లనియె. 263

టీ. మెల్లనన్ = తిన్నగా, వినయంబునన్ = అడఁకువతో.

క. బలయుతులకు దుర్బలులకు
బల మెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బల మెవ్వఁడు ప్రాణులకును
బల మెవ్వం డట్టివిభుఁడు బల మసురేంద్రా. 264

టీ. అసురేంద్రా = రాక్షసులరాజా! బలయుతులకున్ = బలముగలవారికి, దుర్బలులకున్ = బలము లేనివారికి, నీకు, నాకు, బ్రహ్మాదులకున్ = బ్రహ్మ మొదలగువారికిని, ఎవ్వఁడు = ఏదేవుఁడు, బలము = ప్రాపో, ప్రాణులకును = ఎల్లజంతువులకును, బలము = అండ, ఎవఁడో, అట్టివిభుఁడు = అలాటిదేవుఁడు, బలము = నాకు దిక్కు.

తా. రాజా! బలము గలవారికి, లేనివారికి, నీకు, నాకు, బ్రహ్మ మొదలగువారికిని, ఇంతయేల యెల్లజీవులకు, ఎవఁడు జీవనాధారుఁడో వాఁడే నాకు రక్షకుఁడు.

క. దిక్కులు గాలముతో నే
దిక్కున లే కుండుఁ గలుగు దిక్కుల మొదలై
దిక్కు గల లేనివారికి
దిక్కయ్యెడువాఁడు నాకు దిక్కు మహాత్మా. 265

టీ. మహాత్మా=గొప్పవాఁడగునోతండ్రీ! కాలముతో, దిక్కులు = ఎల్లదిక్కులు, ఏదిక్కునన్ = ఎవనియందు, లేకుండున్ = లేకపోవునో, కలుగున్ = ఎవనియందు పుట్టునో, దిక్కులమొదలుఐ=అన్నిదిక్కు(గతు)లకు మూలమై, దిక్కు=శరణము, కలలేనివారికిన్ = కలిగినవారికిని లేనివారికిని, దిక్కు=శరణము, అయ్యెడువాఁడు, నాకు, దిక్కు = రక్షకుఁడు.

తా. తండ్రీ! ఎవనియందు ఈదిగ్దేశకాలములులేవో, అనఁగా నెవని యందు లీనమగునో, ఎవనియం దివి పుట్టునో, అన్నిగతులకు మొదటిగతియై దిక్కుగలవారికిని, లేనివారికిని ఏస్వామి దిక్కో, వాఁడే నాకు దిక్కు.

సీ. కాలరూపంబులఁ గ్రమవిశేషంబుల
నలఘుగుణాశ్రయుం డయినవిభుఁడు
సత్త్వబలేంద్రియసహజప్రభావాత్ముఁ
డై వినోదంబున నఖిలజగము
గల్పించు రక్షించు ఖండించు నవ్యయుం
డన్నిరూపములందు నతఁడు గలఁడు
చిత్తంబు సమముగాఁ జేయుము మార్గంబుఁ
దప్పి వర్తించు చిత్తంబుకంటె
తే. వైరు లెవ్వరు చిత్తంబు వైరి గాక
చిత్తమును నీకు వశముగాఁ జేయ వయ్య
మదయుతాసురభావంబు మానవయ్య
యయ్య నీమ్రోల మే లాడరయ్య జనులు. 263

టీ. అయ్య=తండ్రీ! కాలరూపంబులన్ = కాలప్రకృతులయందు, అలఘుగుణాశ్రయుండు = గొప్పగుణములకు కారణము, అయినవిభుఁడు = అయినట్టిదేవుఁడు, సత్త్వ..త్ముఁడై = సద్భావము బలము నైజమైనమహిమ గలవాఁడై, వినోదంబునన్ = వేడుకచేత, అఖిలజగము = ఎల్లప్రపంచమును, కల్పించున్ = నిర్మించును, రక్షించున్ = కాపాడును, ఖండించున్ =

సంహరించును, అవ్యయుండు = నాశములేని, ఆతండు, అన్నిరూపములం
దున్ = ఎల్లబింబములయందు, కలఁడు, చిత్తంబు = నీమనసు, సమముకాన్ =
రాగద్వేషసుఖదుఃఖాదిద్వంద్వగతముకాకుండ నన్నిటియందుఁదుల్యరూపమ
గునట్లు, చేయుము, మార్గంబు = మంచిత్రోవ, తప్పి = తొలఁగి, వర్తించుచిత్తం
బుకంటెన్ = తిరుగుమనముకంటె, వైరులు = శత్రువులు, ఎవ్వరు, చిత్తంబు,
వైరి = నీకు విరోధముగానుండునది, కాక, చిత్తము, నీకు, వశముకాన్ =
స్వాధీనమగునట్లు, చేయుమయ్య, మద...ఎంబు = పొగరుబోతురాక్షసధర్మ
మును, మానుమయ్య, జనులు = నీప్రజలందఱు, నీమేలుకన్ = నీయొక్కటి
మేలు = మంచి, ఆచరమ్మ = చెప్పఁజాలరు.

తా. తండ్రీ! అయాకాలములు నానారూపములయందుఁ గ్రమము
గా వర్తించుచు సర్వగుణాధారుఁడైనయాపరమేశ్వరుఁడు సాత్త్వికత్వము
బలము ఇంద్రియము పుట్టుకతోఁ బుట్టినగొప్పమహిమ గలవాఁడై లీలార్థము
ఈప్రపంచమును బుట్టించి పెంచి నశింపఁజేయును తానాశములేక యెల్లబిం
బములలోఁ బ్రతిబింబితుఁడై యుండును. నాయనా! నీచిత్తమున రాగద్వే
షములఁ జొరనీయక సమబుద్ధితోఁ జూడుము. ఇప్పుడు నీచిత్తము తప్పుదా
రిని బడిపోవుచున్నది. త్రోవదప్పినడచు మనమనస్సుకంటె మనకుశత్రువుగ
లదే? చిత్తమును ప్రతికూలము గాకుండ స్వాధీనపఱుచుకొమ్ము. ఈ పొగరు
బోతురాక్షసధర్మము నదలుము నీమాత్రులందఱు నీకువెఱచి మోమోట
పడుదురుగాని నీయోగ్యబాగులను విచారించి నీశ్రేయస్కరుల గమనించి నీకు
కొంచె మప్రియమైనను హితమైనమాటఁ జెప్పఁజాలరు.

ఉ. లోకములన్నియున్ గడియలోన జయించినవాఁడ వింద్రియా
నీకముఁ జిత్తముల్ గెలువ నేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకరశత్రు లార్వురఁ బ్రభిన్నులఁ జేసినఁ బ్రాణికోటిలో
నీకు విరోధి లేఁ డొకఁడు నేర్పునఁ జూడుము దానవేశ్వరా.

టీ. దానవేశ్వరా = రాక్షసరాజా! లోకములన్నియున్ = ఎల్లలో
కములు, గడియలోనన్ = అర్ధముహూర్తమాత్రమున, జయించినవాఁడవు,

ఇంద్రియానీకముల్ = ఇంద్రియములసమూహమును, చిత్తమున్, గెలువ నేరవు, నిన్ను, నిబద్ధున్ = సంసారమునఁ జిక్కుకొనువానినిగా, చేయు, ఈ, అర్వురు, భీకరశత్రులు = భయంకరమైన విరోధులను, ప్రభిన్నులన్ = ఓడినవారిగా, చేసితిన్ = చేసితివేని, ప్రాణికోటిలోన్ = జీవసమూహములో, నీకు, ఒకఁడును, విరోధి = శత్రువు, లేఁడు, నేర్పునన్ = తెలివితో, చూడుము = యోజింపుము.

తా. నాయనా! నీవు లోకములన్నియు ఒకగడియలో జయించిన గొప్పశూరుఁడవు. ఈనీచములైనయింద్రియములను మనస్సును జయింపఁజాలకున్నావు. ఇవియే ఇంతటి బలవంతుఁడైననిన్ను గట్టివేయును. నీవు ఈ క్రూరశత్రువుల నార్వురను జయింపఁగలిగెదవేని ఇఁక వేఱుగా నీకుఁ గానివా రుండరు. తెలివితో గమనించి చూడుము.

క. పాలింపుము శేముషి ను
న్మూలింపుము కర్మబంధముల సమదృష్టిం
జాలింపుము సంసారముఁ
గీలింపుము హృదయమందుఁ గేశవభక్తిన్. 268

టీ. శేముషిన్ = బుద్ధిని, పాలింపుము = కలుషము గాకుండ రక్షింపుము, సమదృష్టిన్ = సమానభావముతో, కర్మబంధములన్ = కర్మములకట్టులను, ఉన్మూలింపుము = త్రెంచివైచికొమ్ము, సంసారము, చాలింపుము, హృదయమందు = చిత్తమున, కేశవభక్తిన్ = నారాయణునియందలి భక్తిని, కీలింపుము = నాఁటుకొనఁజేయుము.

తా. తండ్రీ తెలివిదెచ్చుకొనుము. అన్నిటియందు సమభావముగలిగి కర్మబంధములఁ దొలఁగించుకొనుము. సంసారసంబంధముఁ బాపుకొనుము. మనస్సునందు శ్రీమన్నారాయణభక్తిని దృఢముగాఁ బాదుకొల్పుము.

వ. అనినఁ బరమభాగవతశేఖరునకు దోషాచరశేఖరుం డిట్లనియె. 269

టీ. దోషాచరశేఖరుండు = రాక్షస (రాత్రులందిరుగువారు) రాజు, పరమభాగవతశేఖరుండు = ఉత్తములైనహరిభక్తులలో మేలైనవాఁడు.

క. చంపినఁ జచ్చెద ననుచును
గంపింపక యోరి పలువ కఠినోక్తుల నన్
గుంపించెదు చావునకుం
దెంపరి వై వదరువాని తెఱఁగునఁ గుమతీ. 270

టీ. ఓరి, పలువ = తులువా! కుమతీ = ఓరిదుర్బుద్ధి గలవాఁడా! చంపినన్ = చంపితేని, చచ్చెదను, అనుచును = అనితలఁచుకొనుచు, కంపింపక = బెదరక, చావునకున్, తెంపరివై = తెగించినవాఁడవై, వదరువాని తెఱఁగున్ = నోరికొలఁది ప్రేలువానివలె, కఠినోక్తులన్ = గడుసుమాటలచేత, నను, కుంపించెదు = మీఱెదవు.

తా. ఓరీ దురాత్మా! ఒకవేళ చంపినను జత్తును. ఇంతకంటె వీఁడేమి చేయును లెమ్మని తెగఁబడి రాజదండాదులచేఁ జావనున్నవాఁడు ఎవరిని లెక్కచేయక నోరికొలఁది ప్రేలినట్లు, వగురు బెదురు లేక ఈవిధముగా కారులఱచి నన్ను దిరస్కరించుచున్నావురా మూర్ఖా!

శా. నాతోడం బ్రతిభాష లాడెదు జగన్నాథుండ నాకంటె నీ
భూతశ్రేణికి రాజు లేఁ డొకఁడు సంపూర్ణప్రభావుండ మ
ద్భ్రాతం జంపిన మున్న నే వెదకితిం బల్మాఱు నారాయణుం
డేతద్విశ్వములోన లేఁడు మఱి వాఁ డెం దుండురా దుర్మతీ.

టీ. దుర్మతీ = చెడ్డబుద్ధిగలవాఁడా! నీవు, నాతోడ, ప్రతిభాషలు = ఎదురువాదములు, ఆడెదవు, నేను, జగన్నాథుండను = లోకములకుఁ బ్రభుఁడను, ఈభూతశ్రేణికి, నాకంటెన్, సంపూర్ణప్రభావుండు = నిండిన (ఎక్కువ) మహిమగల, ఒకఁడు, వేఱొక, రాజు = దొర, లేఁడు, నారాయణుఁడు, మున్న, మద్భ్రాతన్ = నాతమ్ముని, చంపినన్ = చంపఁగా, నేను

పల్గాలు, వెదకితిని, వాఁడు, ఆవిష్ణువు, ఏతద్విశ్వములోనన్ = ఈప్రపంచములో, లేఁడు, మఱి=ఇఁకను, ఎందుండురా=ఎక్కడనున్నాఁడురా.

తా. ఓరీదుర్బుద్ధీ! నీవు నాకేమో రొుదురు చెప్పెదవు. నేన యీరొల్ల ప్రపంచమునకు దొరను. నాకుమించినరాజు లేఁడు. నీవు లేపకు నారాయణుఁ డొక్కఁడున్నాఁడని పేర్కొనెదవు. వాఁడు నాతమ్ముని జంపినాఁ డని వాని జంపుదునని నేను ఎల్లతావులు వెదకి విసికితిని ఎక్కడ లేఁడు. ఇఁక వాఁ డెక్కడ నున్నాఁడురా మూఢా!

క. ఎక్కడఁ గలఁ డేక్రియ నే
చక్కటి వర్తించు నెట్టిజాడను వచ్చుం
జక్కడఁతు నిన్ను విష్ణునిఁ
బెక్కులు ప్రేలెదవు వానిభృత్యునిపగిదిన్. 272

టీ. విష్ణుఁడు, ఎక్కడన్, కలఁడు, ఏక్రియన్=ఏవిధముగా, ఏచక్కటిన్ = ఏస్థలమందు, వర్తించును, ఎట్టిజాడను = ఏలాటితోవను, వచ్చును, నిన్ను, నీవిష్ణుని, చక్కడఁతున్=సంహరింతును, వానిభృత్యునిపగిదిన్=వానిబంటువలె, పెక్కులు=పలుమాటలు, ప్రేలెదవు=కూసెదవు.

తా ఓరీ విష్ణు వెక్కడ నున్నాఁడు. అతఁ డెచ్చోట నేవిధముగా నుండును. ఏమార్గమునవచ్చును. చూపుము. నిన్ను వానినిగూడ రూపుమాపెదను. వానిబంటువలె చాలఁ బేలుచున్నావు.

వ. అనిన హరికింకరుండు శంకింపక హర్షపులకాంకురసంకలిత విగ్రహుండై యాగ్రహంబు లేక హృదయంబున హరిం దలంచి నమస్కరించి బాలవర్తనంబున నర్తనంబు సేయుచు నిట్లనియె. 273

టీ. హరికింకరుండు=నారాయణునిదాసుఁడు, శంకింపక=జంకక, హర్ష...గ్రహుండై=సంతోషమువలన నయినగగుర్పాటు గలిగిన మేనుగలవాఁడై, బాలవర్తనంబునన్=పిల్లతనముతో, నర్తనంబు=నాట్యము.

మ. కలఁ డంభోధిఁ గలండు గాలిఁ గలఁ డాకాశంబునం గుంభినిం
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ల నిశలన్ ఖద్యోతచంద్రాత్మలం
గలఁ డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటం
గలఁ డీశుండు కలండు తండ్రి వెదకంగా నేల నీయాయెడన్.

టీ. తండ్రి = నాయనా! ఈశుండు = దేవుఁడు, అంభోధిన్ = సముద్రమందు, కలఁడు, గాలిన్ = వాయువునందు, కలఁడు, ఆకాశమునందు, కలఁడు, కుంభినిన్ = భూమియందు, కలఁడు, దిశలన్ = దిక్కులయందు, పగళ్లన్ = దినములలో, నిశలన్ = రాత్రులలో, ఖద్యోతచంద్రాత్మలన్ = సూర్యచంద్ర ఆత్మలయందున, ఓంకారమున, త్రిమూర్తులన్ = బ్రహ్మ విష్ణు శివస్వరూపములలో, త్రిలింగవ్యక్తులన్ = ఆఁడుది మగవాఁడు నపుంసకములందును, అంతటను, కలఁడు, ఈయాయెడన్ = ఇక్కడ అక్కడ, వెదకంగాన్ ఏలను? దగుట యొందులకు ?

తా. నాయనా! యీశ్వరుఁ డెల్ల ప్రపంచమందు నిబిడముగా వ్యాపించియున్నాఁడు. నీళ్లు, గాలి, ఆకాశము, భూమి, అగ్ని, పగలు, రాత్రి, సూర్యుఁడు, చంద్రుఁడు, ఆత్మ, ఓంకారము, బ్రహ్మ విష్ణు రుద్రులు, స్త్రీపున్నపుంసకవ్యక్తులు, ఇవి బ్రహ్మ మొదలు పరమాణువులుగాఁగ ఎల్ల పదార్థములలో గలఁడు. అట్టిసర్వవ్యాపకుని ఇక్కడ నక్కడ నేల వెదవలెను ?

క. ఇందుఁ గలఁ డందు లేఁ డని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలఁడు దానవాగ్రణి వింటే. 275

టీ. దానవాగ్రణి = రాక్షసరాజా చక్రి = విష్ణువు, ఇందున్ = ఇక్కడ, కలఁడు = ఉన్నాఁడు, ఇందు, లేఁడు, అని, సందేహము =

అనుమానము, వలదు, అతఁడు, సర్వోపగతుండు = అన్నిటియందుండు వాఁడే, ఎందెందుఁ, వెదకి, చూచినను, అందందే, కలఁడు, వింటివా.

తా. రాక్షసరాజా! శ్రీహరి యిందుండును. అందుండఁడు. అని వ్యవస్థ లేదు. ఆయన సర్వోపగతుఁడు. కావున మన మెందుఁజూచిన నందె కనఁబడును. ఇందుల కేసంశయమును లేదు.

వ. అని యివ్విధంబున. 276

మ. హరి సర్వాకృతులం గలం డనుచుఁ బ్రహ్లాదుండు భాషింప స
త్వరుఁడై యెందును లేఁడు లేఁడనిసుతుఁ దైత్యుండు తర్జింప శ్రీ
నరసింహాకృతి నుండె నచ్యుతుఁడు నానాజంగమస్థావరో
త్కరగర్భంబుల నన్ని దేశముల నుద్దండప్రభావంబునన్. 277

టీ. హరి = విష్ణువు, సర్వాకృతులన్ = ఎల్లరూపములందును, కలఁడు, అనుచున్, ప్రహ్లాదుండు, భాషింపన్ = పలుకఁగా, సత్వరుఁడై = తొందరగలవాఁడై, ఎందును, లేఁడు లేఁడు, అని, దైత్యుఁడు = రాక్షసుఁడగు హిరణ్యకశిపుఁడు, తర్జింపన్ = బెదరింపఁగా, అచ్యుతుఁడు = నాశములేని శ్రీమన్నారాయణుఁడు, శ్రీనరసింహాకృతిన్ = సంపదగలనరసింహరూపముతోడ, నానా...బులన్ = పలుదెఱఁగులగు చరాచరజంతువుల గర్భములందును, అన్నిదేశంబులన్ = ఎల్లచోటులయందును, ఉద్దండప్రభావంబునన్ = గొప్పమహిమతో, ఉండెను.

తా. ఇట్లు ప్రహ్లాదుఁడు దేవుఁ డంతట నున్నాఁ డనియు, హిరణ్యకశిపుఁడు లేఁడనియు, వాదించుచుండఁగా నప్పుడు శ్రీహరి నరసింహరూపముతో సర్వత్ర నిండియుండెను.

వ. అయ్యవసరంబున నద్దానవేంద్రుండు. 278

టీ. దానవేంద్రుఁడు = రాక్షసరాజు.

క. డింభక సర్వస్థలముల
నంభోరుహనేత్రుఁ డుండు ననుచు మిగుల సం
రంభంబునఁ బలికెద వీ
స్తంభంబునఁ జూపఁ గలవె చక్రిన్ గిక్రిన్. 279

టీ. డింభక = ఓరికుఱ్ఱా! అంభోరుహనేత్రుఁడు = విష్ణువు, సర్వస్థలములన్ = అన్నిచోటులను, ఉండును, అనుచును, మిగుల, సంరంభమునన్ = ఆటోపముతోడ, పలికెదవు. ఈ స్తంభంబునన్ = ఈయగపడుస్తంభమున, చక్రిన్, గిక్రిన్, చూపఁగలవె = చూపఁజాలుదువా?

తా. ఓరీ విష్ణుఁ డెల్లెడలఁ గలఁడని మహాహంకారముతోఁ జెప్పుచున్నావు. ఈ స్తంభములోఁ జూపించఁ గలవా?

క. స్తంభమునఁ జూప వేనిం
గుంభిని నీశిరముఁ ద్రుంచి కూల్పఁగ రక్షా
రంభమున వచ్చి హరి వి
స్రంభంబున నడ్డపడఁగ శక్తుం డగునే. 280

టీ. స్తంభమునన్ = ఈ స్తంభమందు, చూపవేనిన్ = చూపించఁజాలవేని, నీశిరము = నీతల, త్రుంచి = నఱికి, కుంభినిన్ = నేలయందు, కూల్పఁగన్ = కూలఁజేయఁగా, హరి = విష్ణువు, రక్షారంభమునన్ = కాపాడు పూనికతో, వచ్చి, విస్రంభంబునన్ = నమ్మకముతో, అడ్డపడఁగన్ = అడ్డపడుటకు, శక్తుఁడు = చాలినవాఁడు, అగునా.

తా. ఈ స్తంభములోఁ జూపించకపోయిన నీతల నఱికి నేలఁ గూల్చెదను. అప్పుడు విష్ణువు సమయమున వచ్చి యడ్డపడి నిన్ను గాపాడఁగలఁడా? అట్లు నీకు నమ్మకముగలదా చెప్పుము.

వ. అనిన భక్తవత్సలునిభటుం డిట్లనియె. 281

టీ. భక్తవత్సలునిభటుండు = తనను నమ్మినభక్తులయందు ప్రీతిగల శ్రీహరియొక్క దాసుఁడు.

శా. అంభోజాసనుఁ డాదిగాఁగఁ దృణపర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబున నుండుప్రోడ విపుల స్తంభంబునం దుండఁడే
స్తంభాంతర్గతుఁ డయ్యు నుండుటకు నేసందేహము౯ లేదు ని
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁ బ్రత్యక్షస్వరూపంబునన్.

టీ. అంభోజాసనుఁడు=విష్ణువు, ఆదిగాఁగ౯ = మొదలుగా, తృణపర్యంతంబు=గడ్డిపోఁచలదాఁక, విశ్వాత్ముఁడై = సర్వప్రపంచరూపము గలవాఁడై, సంభావంబున౯ = ఆదరముతో, ఉండుప్రోడ = ఉండునట్టి నేరుపరికాఁడు, విపుల స్తంభంబునందు = పెద్ద స్తంభమున, ఉండఁడే, స్తంభాంతర్గతుఁడు అయ్యు౯ = స్తంభములో నున్నవాఁడుగాఁగూడ, ఉండుటకు౯, ఏసందేహము౯ = ఏయనుమానమును, లేదు, నేఁడు = ఈదినమున, నిర్దంభత్వంబున౯=టక్కులేక, ప్రత్యక్షస్వరూపంబున౯ = కనులకగబడునిజరూపముతో, కానఁబడును.

తా. తండ్రీ! బ్రహ్మమొదలు తృణము (లేక పరమాణువు) దాఁక వ్యాపించియుండుస్వామి ఇంతపెద్దస్తంభములో నుండుట ఒక ఆశ్చర్యమా! ఈ స్తంభములోను తప్పక ఉండియే తీరును. ఇందు కనుమానపడవలదు. ఆదేవుఁడు నేఁడు మోసములేక మనకు నిజరూపముతోఁ బ్రత్యక్షము కాఁగలఁడు.

వ. అనిన విని కరాళించి గ్రద్దన లేచి గద్దియ డిగ్గ నుఱికి యొఱఁ బెట్టినఖడ్గంబు వెఱికి కేల నమర్చి జళిపించుచు మహాభాగవత శిఖామణి యైన ప్రహ్లాదుని ధిక్కరించుచు. 283

టీ. కరాళించి = బొబ్బరిల్లి (గద్దించి), గ్రద్దన౯ = తటుక్కున, లేచి, గద్దియ = సింహాసనము, డిగ్గ౯ ఉఱికి = దిగ దుమికి, ఒఱ౯ = గవుసెనలో, పెట్టిన ఖడ్గంబు, వెఱికి = దూసి, కేల౯ = చేతియందు, అమర్చి = పట్టుకొని, జళిపించుచు౯ = త్రిప్పుచు, మహాభాగవత శిఖామణి=గొప్పహరిదాసులలో శ్రేష్ఠుండైన, ప్రహ్లాదుని, ధిక్కరించుచు౯ = తిరస్కరించుచు, (పైపద్యముతోఁ గలియును).

మ. వినరా డింభక మూఢచిత్త గరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెద వైన నిందు గలఁడే యంచున్ మదోద్రేకియై
దనుజేంద్రుం డఱచేత వ్రేసెను మహోదగ్ర ప్రభాశుంభమున్
జనదృగ్భీషణదంభమున్ హరిజనుస్సంరంభమున్ స్తంభమున్.

టీ. దనుజేంద్రుండు = రాక్షసశ్రేష్ఠుఁడు, డింభక = ఓరిశుట్టా ! మూఢచిత్త = తెలివిమాలినవాఁడా! గరిమన్ = గొప్పతనముతో, విష్ణుండు = హరి, విశ్వాత్మకుఁడు = సర్వప్రపంచరూపుఁడు, అని, భాషించెదవు = పలికెదవు, ఐనన్ = అలాగైనచో, ఇందు = ఈ స్తంభమున, కలఁడే, అంచున్, మదోద్రేకియై = గర్వాతిశయముగలవాఁడై, మహో...భమున్ = గొప్పకాంతులచేఁ ప్రకాశించుచున్న, జనదృగ్భీషణదంభమున్ = ప్రజలచూపులకు భయము బుట్టించునట్టి, హరి జనుస్సంరంభమున్ = (నృసింహరూపుఁడగు) విష్ణువుయొక్క ఆవిర్భావముయొక్క ఆటోపముగల, స్తంభమున్, అఱచేతన్, వ్రేసెన్ = గుద్దెను.

తా. ఆహిరణ్యకశిపుఁడు ఓరీ వెఱ్ఱిబాలుఁడా! విష్ణు వంతటఁ గలఁడని మిగుల దొడ్డగాఁ జెప్పుచున్నావు. కాని యీ స్తంభమునఁ గలఁడా అని మదాంధుఁడై దివ్యము లైన ప్రకాశములతో వెలుఁగుచు, చూచువారలకు భయమును గలిగించుచున్నదియు నృసింహమూర్తి ఆవిర్భవింపఁబోవుచున్న ఆసభయందలి స్తంభమును అఱచేత గుద్దెను.

వ. ఇట్లు దానవేంద్రుండు పరిగృహ్యమాణవైరుండును వైరా
నుబంధజాజ్వల్యమాన రోషానలుండును, రోషానలజంఘన్య
మాన విజ్ఞానవినయుండును వినయగాంభీర్య ధైర్య జేగీయ
మానహృదయుండును హృదయచాంచల్యమానతామసుం
డును దామసగుణచంక్రమ్యమాణస్థైర్యుండును నై విస్రం
భంబున హుంకరించి బాలుని ధిక్కరించి హరి నిందుఁ

జూపు మని కనత్కనకమణిమయకంకణక్రేంకారశబ్దపూర్వ
కంబుగా దిగ్దంతిదంతభేదనపాటవప్రశస్తం బగుహస్తంబున
సభామండపస్తంభంబు వ్రేసిన వ్రేటుతోడన దనదశదిశలను
మిడుంగుఱులు చెదరం జిటిలి పెటిలిపడి బంభజ్యమానంబగు
నమ్మహాస్తంభంబువలనఁ బ్రళయవేళాసంభూతసప్తస్కంధబం
ధురసమీరాకీర్ణ సంఘటిత ఘోరఘోఘుష్యమాణమహావలాహ
కవర్గనిర్గతనిబిడనిష్ఠురదుస్సహ నిర్ఘాతసంఘనిర్ఘోషనికాశంబు
లైన ఛటచ్ఛటస్ఫుటస్ఫుటధ్వనిప్రముఖ భయంకరారావపుం
జంబులు జంజన్యమానంబు లయి మొగసి యాకాశకుహ
రాంతరాళంబు నిరవకాశంబు చేసి నిండినం బట్టు చాలక
దోధూయమానహృదయంబు లయి పరవశంబు లైనపితా
మహ మహేంద్ర వరుణ వాయు శిఖి ప్రముఖ చరాచరజం
తుజాలంబులతోడ బ్రహ్మాండకటాహంబు పగిలి పరిస్ఫోటి
తంబుగాఁ బ్రఫుల్లపద్మయుగళ సంకాశ భాస్వర చక్రచాప
హల కులిశ జలచరరేఖాంకితచారుచరణతలుండును జరణచం
క్రమణఘనవినమిత విశ్వంభరాభార ధౌరేయ దిక్కుంభి
కుంభీనస కుంభినీధర కూర్మకులశేఖరుండును దుగ్ధజలధిజా
త శుండాల శుండాదండ మండిత ప్రకాండ ప్రచండ మహో
రుస్తంభయుగళుండును ఘణఘణాయమాన మణికింకిణీగణ
ముఖరిత మేఖలావలయ వలయిత పీతాంబరశోభితకటిప్రదే
శుండును నిర్జరనిమ్నగావర్తవర్తుల కమలాకర గంభీరనాభి
వివరుండును ముష్టిపరిమేయ వినుత తనుతరస్నిగ్ధమధ్యుండు
ను గులాచల సానుభాగ సదృశ కర్కశ విశాలవక్షుండును
దుర్జనదనుజభటధైర్యలతికాలవిత్రాయమాణ రక్షోరాజ

వక్షోభాగ విశంకట క్షేత్రవిలేఖన చుంచులాంగలాయమాన ప్రతాపజ్వలన జ్వాలాయమాన శరణాగతనయన చకోరచంద్రరేఖాయమాణ వజ్రాయుధ ప్రతిమానభాసమాననిశాత నఖరతరముఖనఖరుండును శంఖ చక్ర గదాఖడ్గకుంతతోమర ప్రముఖ నానాయుధ మహిత మహోత్తుంగ మహీధర శృంగసన్నిభవీరసాగర వేలాయమానమాలికావిరాజమాన నిరర్గళానేకశతభుజార్గళుండును మంజుమంజీర మణిపుంజరంజితమంజులహార కేయూరకంకణ కిరీటమకరకుండలాది భూషణభూషితుండును త్రివళీయుతశిఖరాభ పరిణద్ధబంధురకంధరుండును ప్రకంపనకంపిత పారిజాతపాదపపల్లవప్రతీకాశకోపావేశసంచలితాధరుండును శరత్కాలమేఘజాలమధ్యధగద్ధగాయమానతటిల్లతాసమాన దేదీప్యమానదంష్ట్రాంకురుండును కల్పాంతకాలసకల భువనగ్రసనవిలసన విజృంభమాణ సప్తజిహ్వజిహ్వాతులిత తరళ తరాయమాణ విభ్రాజమాన జిహ్వుండును మేరుమందరమహాగుహాంతరాళ విస్తారవిపులవక్త్రనాసికావివరుండును నాసికావివరనిస్సరన్నిబిడ నిశ్వాసనికరసంఘట్టనసంక్షోభితసంతప్యమానసప్తసాగరుండును పూర్వపర్వతవిద్యోతమాన ఖద్యోతమండలసదృశసముంచితలోచనుండును లోచనాంచలసముత్కీర్యమాణ విలోలకీలాభీలవిస్ఫులింగవితానరోరుధ్యమాన తారకాగ్రహమండలుండును శక్రచాపసురుచిరోదగ్రమహాభ్రూలతాబంధబంధుర భయంకరవదనుండును ఘనతరగండశైలతుల్యకమనీయగండభాగుండును సంధ్యారాగరక్తధారాధరమాలికాప్రతిమమహాభ్రంకషతంతన్యమానపటుతరసటాజాలుండును సటాజాలసంచా

లనసంజాతవాత డోలాయమాన వైమానికవిమానుండును నిష్కంపిత శంఖవర్ణ మహోర్ధ్వకర్ణుండును మంథదండాయమాన మందరవసుంధరాధరపరిభ్రమణ వేగసముత్పద్యమాన విద్యున్మండలమండితసుధారాశికల్లోల శీకరాకారభాసుర కేసరుండును బర్వాఖర్వ శిశిరకిరణమయూఖగౌరతనూరుహుండును నిజగర్వానిగద నిర్దళిత కుముద సుప్రతీక వామనైరావణ సార్వభౌమప్రముఖదిగిభరాజకర్ణకోటరుండును ధవళధరాధరదీర్ఘ దురవలోకనీయదేహుండును దేహప్రభాపటలనిర్మథ్యమాన పరిపంథియాతుధాననికురుంబ గర్వాంధకారుండును బ్రహ్లాదహిరణ్యకశిపురంజనభంజననిమిత్తాంతరంగ బహిరంగ జేగీయమాన కరుణావీరరససంయుతుండును మహాప్రభావుండును నయిన శ్రీనృసింహదేవుం డావిర్భవించినం గనుంగొని. 285

టీ. దానవేంద్రుండు = రాక్షసరాజు, పరిగృహ్యమాణవైరుండును = చలపట్టినవాఁడును, వైరా...లుండును = విరోధముయొక్క సంబంధముచేత నుండుచున్న కోపాగ్ని గలవాఁడును, కోపా...వినయుండును = కోపాగ్నిచేఁ గొట్టఁబడిన వివేకము అడఁకువ గలవాఁడును, వినయ...హృదయుండును = అడఁకువ గంభీరత ధైర్యము వీనిచేఁ బొగడఁబడిన మనస్సు గలవాఁడును, హృదయ...నుండును = మనస్సున రేఁగుచున్న తమోవృత్తి గలవాఁడును, తామస...ధైర్యుండును = తమోగుణముచేతఁ గ్రమ్మఁబడిన దిట్టతనము గలవాఁడును, ఐ, విస్రంభంబునన్ = దేవుఁడు తాన రాఁ డనునమ్మకముతో, హుంకరించి = హుం అని కేకవెట్టి, బాలుని = బ్రహ్లాదుని, ధిక్కరించి = తిరస్కరించి, హరిన్ = విష్ణుని, ఇందు = ఈ స్తంభమున, చూపింపుము, అని, కన...పూర్వకంబుగాన్ = మెఱయుచున్న రత్నఖచితములైన మురుఁగుల క్రేంకారము పుట్టునట్లుగా, దిగ్దంతి...

ప్రశస్తంబు=దిగ్గజములను బగులమోఁదు బలిమిచేఁ జేరువడసిన, అగు,హాస్తం బునన్ = చేతిలో, సభామంటప స్తంభంబు = కొలువుకూటమున నున్న ఆ స్తంభమును, వ్రేసినన్ = కొట్టఁగా, వ్రేటుతోడన = దెబ్బవెంబడినే, దశదిశలను = పదిదిక్కులయందును, మిడుంగుఱులు = నిప్పుకణుకులు, చెదరన్, పెటిలిపడి = చిట్లిపడి, బంభజ్యమానంబు = బ్రద్దలుకొట్టఁబడి నది, అగునమ్మహాస్తంభంబునన్ = అయిన యాగొప్పస్తంభమందు, ప్రళ య...నికాశంబులు = ప్రళయకాలమందుఁబుట్టిన రోదు మొత్తములనిబిడ వాయువులచేఁ గూర్చఁబడిన భయంకరముగా గర్జిల్లుచున్న గొప్ప మేఘ ముల సమూహములనుండి వెడలిన దట్టములై కఠినములై సహింపరాని పిడు గుల మొత్తముల మ్రోఁతతో సమానములు, ఐన, ఛట...పుంజంబులు=ఛట ఛట ఫటఫటధ్వనులు మొదలగు భయంకరములైన మ్రోఁతలసమూహములు, జంజన్యమానంబులు=ఎడతెక పుట్టుచున్నవి, అయి, ఎగసి, ఆకాశకుహరాంత రాళంబు=మిన్నురంధ్రముయొక్క మధ్యభాగమును, నిరవకాశంబు=సందు లేనిదానిగాచేసి, నిండినన్, పట్టు=ఊఁత, చాలక, దోధూయమానహృదయం బులు=బెదరుగుండెకలవి,అయి, పరవశంబులు=తమస్వాధీనమందులేని, ఐన, పితామహ...తోడన్ = బ్రహ్మ ఇంద్రుఁడు వరుణుఁడు వాయువు అగ్ని మొదలుగా జంగమ స్థావరములైన జంతుసమూహములతోఁగూడ, బ్రహ్మాం డకటాహంబు= బ్రహ్మాండ మనుగంగాళము, పగిలి, పరిస్ఫోటితంబు కాన్ = చెక్కలగునట్లుగా, ప్రఫుల్ల...తలుండును = విరియఁబూచిన తామర దోయివంటి మెఱయుచున్న చక్రము ధనుస్సు నాఁగలి వజ్రము చేప వీని రేఖలతోఁ గూడిన యఱకాళ్లుగలవాఁడును, చరణ...శేఖరుండును = అడుగునూఁదుటచేత మిగుల క్రుంగిన సమస్తభూమండలమును మోయుదిగ్గ జములు ఆదిశేషుఁడు కులపర్వతములు ఆదికూర్మము గలవాఁడును, దుగ్ధ... యుగళుండును = పాలసముద్రమునఁ బుట్టిన ఐరావతముయొక్క తుండ మువలె మెఱయు మధ్యభాగముగల ఉగ్రములైన పెద్దస్తంభములవంటి తొ డలజంటగల వాఁడును, ఘణ...శుండును=ఘణఘణమ్రోఁగుచున్న రత్నపు

గజ్జెలసమూహముచేత ధ్వనించుచున్న మొలత్రాటిచుట్లచేఁ జుట్టఁబడిన పట్టుధోవతిచేఁ బ్రకాశించుమొలగలవాఁడును, నిర్జర... వివరుండును = ఆకాశగంగానది సుడివలె గుండ్రనై సరస్సువలె లోఁతైన నాభిరంధ్రము గలవాఁడును, ముష్టి...మధ్యుండును = పిడికిట నిముడ్చఁదగి పొగడఁబడిన మిగుల సన్నని నున్నని నడుము గలవాఁడును, కులా...వక్షుండును = కులగిరులచరులతో సమానమైన వెడఁదపుఱొమ్ము గలవాఁడును, దుర్జన...నఖరుండును = దుష్టులైన రాక్షసభటుల ధైర్యము లనుతీఁగలకు కొడవండ్లవంటివియు హిరణ్యకశిపునిఱొమ్మను విశాలమైనభూమిని బగులదున్నుటయందు మిన్నలైన నాఁగేళ్లవంటివియు శౌర్యాగ్నిమంటలవలె నున్ననివియు శరణము గోరివచ్చినవారి చూపులను చకోరములకు వెన్నెలలవంటివియు వజ్రాయుధమువంటివియు నైన మెఱయుచున్న చీల్చుటయందు మిగులవాఁడిగల కొనలుగల గోళ్లు గలవాఁడును, శంఖ...భుజార్గళుండును = శంఖము చక్రము గద ఖడ్గము కుంతము తోమరము మొదలగు పలువిధము లైనశస్త్రములచే నొప్పు గొప్పకొండకొమ్ములవంటి వీరరససముద్రము చెలియలికట్టలవంటి బాణాలు తితి మెఱయుచున్న (పూలగండలుగల) అడ్డులేని పలునూఱుల గడియమ్రానులవంటి బాహువులు గలవాఁడును, మంజా...భూషితుండును = సొగసైనయందెలు రత్నసమూహములచే నలంకరింపఁబడి హారములు భుజకీర్తులు కిరీటము మకరకుండలములు (మొసలినోరువలెఁ జేయఁబడిన పోఁగులు) మొదలగుసొమ్ములచే నలంకరింపఁబడినవాఁడును, త్రివళీ...కంధరుండును = మూఁడురేఖలతోఁ గూడి కొండపొత్తమువలె విశాలమైన చిక్కని మెడ గలవాఁడును, ప్రకంపన...ధరుండును = గాలికిఁ గదలు పారిజాతపుఁజిగురుటాకువంటి కోపవేగముచే నణఁకుచున్న క్రిందిపెదవి గలవాఁడును, శరత్కాల...రుండును = శరదృతువునందలి మేఘములనడుమనున్న ధగధగలాడు మెఱపుఁదీఁగెలతో సమానములయిన ప్రకాశించుచున్న మొలకదంతములు గలవాఁడును, కల్పాంత...జిహ్వుండును = ప్రళయకాలమం దెల్లలోకములను మ్రింగువేడుకతో రేఁగుచున్న కాలాగ్ని నాలుకలతోఁ బోల్పఁబడిన

కోరాడుచుఁ బ్రకాశించుచున్న మెఱయుజూలుఁ గలవాఁడును, మేరు...వివరుండును = మేరుపర్వతము మందరపర్వతము వీని పెద్దగుహల నడిమిభాగముల వలె విశాలములయిననోరు ముక్కురంధ్రములు గలవాఁడును, నాసికా...సాగరుండును = ముక్కురంధ్రములనుండి వెడలు దట్టమయిన నిశ్వాసవాయువులగుంపులతాఁకుడుచేఁ గలఁచఁబడి కాఁచఁబడుచున్న యేడుసముద్రములు గలవాఁడును, పూర్వ...లోచనుండును = తూరుపుకొండమీఁద వెలుఁగు సూర్యమండలమువలెనున్న యందములైన కన్నులుగలవాఁడును, లోచనాంచల...మండలుండును = కనుఁగొనలనుండి రాల్చఁబడుచున్న చలించుచున్న మంటలచే భయంకరములయిన మిణుఁగురులపొత్తములచే నడ్డపెట్టఁబడిన నక్షత్రములు గ్రహములుఁ గలవాఁడును, శక్ర...వదనుండును = ఇంద్రధనుస్సులవలె నందములై యుగ్రములైన పెద్దకనుబొమలముడిచే దిటవై భీతిని గలిగించు మొగముగలవాఁడును, ఘనతర...భాగుండును = పెద్దకొండగుండులవంటి సుందరములయిన చెక్కిలిపట్టులు గలవాఁడును, సంధ్యా...జాలుండును = సంధ్యాకాలమందలి యొత్తఁదనముచే నెఱ్ఱనైన మేఘపంక్తులవంటి పుబ్బుకొరయుచున్న వెల్లివిరియుచున్న మిక్కిలిస్ఫుటములయిన జడల పొత్తములు గలవాఁడును, సటా...విమానుండును = జడలపొత్తమును జాడించుటవలనఁ బుట్టిన గాడ్పులచే నుయ్యెల లూఁగుచున్న దేవతలవిమానములు గలవాఁడును, నిష్కం...కర్ణుండును = త్రిప్పఁబడిన పెద్దశంఖముల వంటి చెవులుఁ గలవాఁడును, మంథ...కేసరుండును = కవ్వముగానైన మందర పర్వతముయొక్క తిరుగుటయందైన తొందరచేఁ బుట్టుచున్న ఆకాశమున నిండి ప్రకాశించుచున్న పాలసముద్రపుతరంగముల తుంపురులవలె ప్రకాశించు నందములైన వెండ్రుకలు గలవాఁడును, పర్వా...డును = పున్నమనాఁటిచంద్రునికిరణములవలె తెల్లనైన జూలుగలవాఁడును, నిజ...కోటరుండును = తనగర్జితధ్వనులచేఁ జీల్చఁబడిన కుముదసుప్రతీకవామనాది అష్టదిగ్గజముల కర్ణరంధ్రములు గలవాఁడును, ధవళ...దేహుండును = తెల్లనైన కొండవలె (కైలాసమువలె) పొడవై చూడనలవికాని దేహముగలవాఁడును,

దేహ...కాయుండును = శరీరమందలికాంతులచేఁ గలఁచఁబడిన శత్రురాక్షసుల సమూహములగర్వ మనుచీఁకటి గలవాఁడును, ప్రహ్లాద...సంయుతుండును = ప్రహ్లాదుని సుఖింపఁజేయుటకు, హిరణ్యకశిపునిఁ జంపుటకుఁ గారణములయిన లోపల వెలుపల నున్న పొంగఁబడిన కరుణారసము వీరరసము గలవాఁడును, మహాప్రభావుండును = గొప్పమహిమ గలవాఁడును, అయిన, శ్రీనృసింహదేవుండు = దివ్యప్రకాశముగల నృసింహస్వామి, ఆవిర్భవించినన్ = పుట్టఁగా, కనుఁగొని = చూచి.

క. నరమూర్తి గాదు కేవల
హరిమూర్తియుఁ గాదు మానవాకారముఁ గే
సరియాకారము నున్నది
హరిమాయారచిత మగు యథార్థము చూడన్. 286

టీ. నరమూర్తి = మనుష్యరూపము, కాదు, కేవలహరిమూర్తియు = పట్టి సింగపురూపును, కాదు, మానవాకారము = మనుజరూపమును, కేసరి = సింహముయొక్క, ఆకారమును, ఉన్నది, చూడన్ = విచారించఁగా, ఇది, హరిమాయారచితము = విష్ణుమూర్తిమాయచే నిర్మింపఁబడిన యొక అపూర్వభూతము, అగును, యథార్థము = నిజము.

తా. ఈపొడకట్టినరూప మచ్చ మనుష్యరూపము గాదు. పట్టి సింహరూపము గాదు. నరసింహరూపములు గలిసియున్నది. ఇది తప్పక విష్ణుమాయచే వారి కేర్పడిన యొకవింతజంతువు గానోపును.

ఉ. తెంపున బాలుఁ డాడినసుధీరత సర్వగతత్వముం బ్రతి
ష్ఠింపఁ దలంచి యుందు నరసింహశరీరముఁ దాల్చి చక్రి శి
క్షింపఁగ వచ్చినాఁడు హరిచే మృతి యంచుఁ దలంతు నైననా
సొంపును దెంపు నందఱునుజూడఁ జరింతు హరింతు శత్రువున్.

టీ. తెంపునన్ = సాహసముతో (నిశ్చయముతో), బాలుఁడు = ప్రహ్లాదకుమారుఁడు, ఆడినసుధీరతన్ = పలికిన సత్యవాక్యబలమున, సర్వ

గతత్వముఁ = సర్వభూతాంతర్యామియగుటను, ప్రతిష్ఠింపన్ దలంచి = స్థాపించఁగోరి, చక్రి = విష్ణువు, ఇందు = ఈ స్తంభమున, నరసింహశరీరమున్ = నరసింహరూపమును, తాల్చి = ధరించి, శిక్షింపఁగన్ = దండించుటకు, వచ్చినాఁడు, హరిచేన్ = విష్ణువుచేత, నాకు, మృతి = చావు, కలుగును, అంచున్ తలఁతున్ = అని తలఁచెదను, వినను, అందఱును = ఈ చూపరులందఱు, నా సొంపును = నాయందమును, పెంపున్ = బలమును, చూడన్ = చూచునట్లుగా, చరింతున్ = తిరుగుదును, శత్రున్ = విరోధియైన యావిష్ణువును, హరింతున్ = సంహరింతును.

తా. తనభక్తుఁడైన ప్రహ్లాదుఁడు ధైర్యముతో విష్ణువు సర్వగతుఁడని చెప్పినమాటను, నిజముసేయఁదలఁచి, యావిష్ణువే యిట్లు నరసింహరూపమును బూని వచ్చినాఁడు. నాకిఁక వీనిచేఁ జావక తప్పదు. అయినను ఎల్లరును నాశౌర్యధైర్యములఁ జూచి మెచ్చుకొనునట్లు పోరి యీమృగమును జంపఁజూచెదను.

వ. అని మెత్తంబడనిచిత్తంబున గదయెత్తికొని తత్తఱంబున నార్చుచు నకుంఠితకంఠీరవంబు డగ్గఱుగంధసింధురంబుచందంబున నక్తంచరకుంజరుండు నరసింహదేవున కెదురు నడచి తదీయదివ్యతేజోజాలసన్నికర్షంబునం జేసి దవానలంబు డగ్గఱిన ఖద్యోతంబునుం బోలెఁ గర్తవ్యాకర్తవ్యంబులు దెలియక నిర్గతప్రభుండయి యుండె నప్పుడు. 288

టీ. అని పలుకుచు, మెత్తంబడనిచిత్తంబునన్ = సడలనిమనసుతో, తత్తఱంబునన్ = తొందరపాటుతో, అర్చుచున్ = కేకలిడుచు, అకుంఠితకంఠీరవంబున్ = వెనుబడనిపరాక్రమము గలసింహమును, దగ్గఱుగంధసింధురంబుచందంబునన్ = సమీపించు మదపుటేనుఁగువలె, నక్తంచరకుంజరుండు = రాక్షసశ్రేష్ఠుఁడు, నరసింహదేవునకున్ = నరసింహమూర్తికి, ఎదురు నడిచి, తదీయ దివ్యతేజోజాలసన్నికర్షంబునం జేసి = ఆనరసింహమూర్తియొక్క అమానుషమైన ప్రకాశసమూహము దాపువలన,

దవానలంబు = కార్చిచ్చును, దగ్ధమైన ఖద్యోతంబునుంబోలెన్ = మిణుఁగుఱుఁబుర్వులాగున, కర్తవ్యాకర్తవ్యంబులు = చేయఁదగినదియు చేయఁదగనిదియు, తెలియక = తెలిసికోనేరక, నిర్గతత్రపుండు = పోయిన తేజస్సు గలవాఁడు.

మ. ప్రకటంబై ప్రళయావసానమున మున్ బ్రహ్మాండభాండావరో
ధకమై యున్నతమిస్రమున్ జగము నుత్పాదించుచోఁ ద్రావి సా
త్త్వికతేజోనిధి యైనవిష్ణునెడ నుద్దీపించునే నష్టమై
విగలంబై చెడుఁగాక తామసులప్రాభవ్యంబు రాజోత్తమా.

టీ. రాజోత్తమా = ధర్మరాజా! తామసుల ప్రాభవ్యంబు = తమోగుణప్రధానుల నేర్పు, మున్ = మునుపు, ప్రళయావసానమునన్ = ప్రళయాంతమునందు, జగమున్ = లోకమును, ఉత్పాదించుచోన్ = పుట్టించునప్పుడు, ప్రకటంబై = బయలుపడినదై, బ్రహ్మాండభాండావరోధకమై = బ్రహ్మాండ మనుకటాహమును గ్రమ్ముకొన్నదై, ఉన్నతమిస్రమున్ = ఉన్న చీఁకటిని, త్రావి = మ్రింగి, సాత్త్వికతేజోనిధి = సత్త్వగుణ సంబంధమైన తేజస్సుతోఁ గూడినవాఁడు, ఐన విష్ణునెడన్ = అయిన శ్రీహరివిషయమై, నష్టము = నశించినది, వి, విగలము = చెదిరినది, వి, చెడును గాక = చెడిపోవునే గాని, ఉద్దీపించునే = తలచూపునా, చూపదు.

తా. ధర్మరాజా! పూర్వము ప్రళయావసానమున మరల ప్రపంచసృష్టి చేయునప్పుడు బ్రహ్మాండమంతటను గ్రమ్ముకొన్న కటికచీఁకటిని మ్రింగివైచి తనసత్త్వమును వెల్లడించిన ఆవిష్ణువునందు ఈలాటి తమోగుణప్రధానుల నేర్పు లేమి లెక్క? ఎందుకును గొఱగావు.

వ. అంత నద్దానవేంద్రుండు మహోద్దండం బగుగదాదండంబు గిరగిరం ద్రిప్పి నరమృగేంద్రుని వ్రేసిన నతండు దర్పంబున సర్పం బు నొడిసిపట్టుసర్పపరిపంథినేర్పున దితిపట్టిం బట్టికొనిన మిట్టి

పడి దట్టించి బిట్టుకట్టలుక నయ్యసురవరుండు దృఢబలంబున నిట్టట్టు మిడిసి పట్టుఁదప్పించుకొని విడివడి దిటవు దప్పక కుప్పించి యుప్పరం బెగసి విహంగకులరాజచరణనిర్గళితభుజంగంబు తెఱంగునం దలంగ నుఱికి తనభుజాటోపంబున నరకంఠీరవుండు గుంఠితుం డయ్యెడి నని తలంచి కలంగక చెలంగుచుం దన్ను నిబిడనీరదనికరంబులమాటున నిలింపులు గుంపులు గొని డాఁగి నూఁగి క్రమ్మఱ నాత్మీయజీవనశంకాకళంకితులై మంతనంబులఁ జింతనంబులు సేయుచు నిరీక్షింప నక్షీణసమరదక్షతావిశేషం బుపలక్షించి ఖడ్గచర్మంబులు ధరియించి ఘననభోభాగంబుల వివిధవిచిత్రలంఘనాలాఘవంబులం బరిభ్రమణభేదంబులం గాళపదనుం డయి యంతరాళంబునఁ దిరుగు జాలుపడు డేగచందంబున సంచరించిన సహింపక. 290

టీ. దానవేంద్రుండు = ఆహిరణ్యకశిపుఁడు, మహోద్దండంబు = మిక్కిలి భీషణమగు, గదాదండంబు, గిరగిరన్, త్రిప్పి, నరమృగేంద్రునిన్ = నరసింహమూర్తిని, వ్రేసినన్ = కొట్టఁగా, దర్పంబునన్ = గర్వముతోడ, సర్పంబున్ = పామును, ఒడిసి, పట్టు, సర్పపరిపంథిచందంబునన్ = గరుత్మంతునివలె, దితిపట్టిన్ = దితికొడుకును (హిరణ్యకశిపుని), మిట్టిపడి = ఎగిరిపడి, ఆయ్యాసురవరుండు = ఆరాక్షసశ్రేష్ఠుఁడు, దట్టించి = అదలించి, బిట్టుకట్టలుకన్ = మించినరోషాతిశయముచేత, దృఢబలంబునన్ = మిక్కిలి యుక్కుతో, ఇట్టట్టు మిడిసి = ఎగిరి, పట్టు, తప్పించుకొని, విడివడి = తెగబడి, దిటవు = ధైర్యము, తప్పక = వీడక, కుప్పించి = దుమికి, ఉప్పరంబు ఎగసి = పైకెగిరి, విహంగ... తెఱంగునన్ = గరుత్మంతుని కాళ్ల సందుననుండి తప్పించుకొన్న పామువలె, దలంగన్ ఉఱికి = తొలఁగఁబాఱి, తనభుజాటోపంబునన్ = తనబాహుబలముచేత, నరకంఠీరవుండు = నరసింహమూర్తి, కుంఠి

ఖండుఁ=ఓడిపోయినవాఁడు, అయ్యెడిన్=అగును, అని, తలంచి, కలఁగక= బెదరక, వెలుఁగుచున్=ప్రకాశించుచు, తన్ను, నిబిడ...మాటునన్=దట్టములైన మబ్బుతుక్కలచాటున, నిలింపులు=దేవతలు, గుంపులుగొని=గుట్టలువడి, డాఁగి=దాఁగుకొని, మూఁగి=ముసురుకొని, క్రమ్మఱన్ = మరల, అత్రియ...తులై=తమబ్రతుకుబడియందు అనుమానపడినవారై,. మంతనంబులన్=తమహృదయములయందు, చింతనంబు సేయుచు = యోచించుచు, నిరీక్షింపన్=చూడఁగా, అక్షీణ...విశేషంబు=తగ్గిపోని యుద్ధకౌశలము యొక్క అతిశయమును, ఉపలక్షించి=చూచి, ఖడ్గపర్వంబులు=కత్తిని జోడును, ధరియించి, భూనభోభాగంబులన్=నేలను ఆకసమునను, వివిధ...లాఘవంబులన్=పలుతెఱఁగులైన ఆశ్చర్యములైనదూఁకుటయందలి నేర్పులతోడను, పరిభ్రమణభేదంబులన్=మండలగతి విశేషంబులచేతను, కరాళవదనుండు=భయంకరమైనముఖము గలవాఁడు అయి, అంతరాళంబునన్=ఆకాశమున, తిరుగు, సాలువపుడేగచందంబునన్=అలుఁజావలె, చరించినన్=తిరుగాడఁగా, సహించక=ఓర్వక.

సీ. పంచాననోద్ధూతపావకజ్వాలలు
భూనభోంతర మెల్లఁ బూరితముగ
దంష్ట్రాంకురాభీలధగధగాయితదీప్తి
ననురేంద్రునేత్రము లందములుగఁ
గంటకసన్నిభోత్కటకేసరావాతి
నభ్రసంఘము భిన్నమై చలింపఁ
బ్రళయాభ్రచంచలాప్రతిమభాస్వరము లై
ఖరనఖరోచులు గ్రమ్ముదేర
తే. సటలు జళిపించి గర్జించి సంభ్రమించి
దృష్టి సారించి బొమలు బంధించి కెరలి

జిహ్వ యాడించి లంఘించి చేత నొడిసి
పట్టె నరసింహుఁ డాదితిపట్టి నధిప. 201

టీ. అధిప=రాజా! నరసింహుఁడు, అదితిపట్టిన్=దితికొడుకగు హిరణ్యకశిపుని, పంచా...జ్వాలలు=ఐదు ముఖములనుండి పుట్టిననిప్పుమంటలు, భూనభోంతరము ఎల్లన్=భూమి ఆకాశములసందున, పూరితములు కాన్=నిండుకొనఁగా, దంష్ట్రా...దీప్తిన్=కోఱలకాంతులయొక్క ధగధగమను కాంతిచేత, అసురేంద్ర నేత్రములు=హిరణ్యకశిపునికన్నులు, అంధములు కాన్, కంటక...హతిన్=ముండ్లవంటివాఁడిరోమముల తాఁకున, అభ్రసంఘములు=మబ్బుగములు, భిన్నములై=పగిలినవై, చలింపన్=తిరుగఁగా, ప్రళయాభ్ర...భాస్వరములు=ప్రళయకాలమందలి మేఘములయందలి మెఱుపులవలె సాటిలేక ప్రకాశించుచున్నవి, ఐ, ఖరనఖరోచులు=వాఁడిగోళ్ళకాంతులు, క్రమ్ముదేరన్=వ్యాపింపఁగా, సటలు=జూలు, జళిపించి=జాడించి, గర్జించి, సంభ్రమించి=రేఁగి, దృష్టి=చూపు, సారించి=నిగిడించి, బొమలు, బంధించి=ముడివైచి, కరలి=కోపించి, జిహ్వ=నాలుక, ఆడించి, లంఘించి=పైకుఱికి, చేతన్=చేతితో, ఒడిసిపట్టెను.

తా. ధర్మరాజా! అంతట నృసింహమూర్తి తనయైదు ముఖములనుండి బయలువెడలిన మంటలు భూమి ఆకాశము క్రమ్ముకొనఁగా, భయంకరమైన కోఱలకాంతులచే హిరణ్యకశిపుని కనులు మిఱుమిట్లు గొనఁగా, ముండ్లవంటి రోమముల తాఁకుడుచే మేఘములన్నియు పటాపంచలు కాఁగా, ప్రళయకాలమేఘములయందలి మెఱుపులవలె గోళ్ళకాంతులు మెఱయఁగా, జూలు విదిర్చి గర్జించి ఆటోపమొంది దృష్టి నిగుడించి కనుబొమలు ముడివైచి నాలుక అల్లలనాడించి ఆహిరణ్యకశిపునిమీఁది కుఱికి, ఒడిసి పట్టుకొనెను.

క. సరకుగొనక లీలాగతి
ఉరగేంద్రుఁడు మూషికంబు నొడిసినపగిదిన్

నరకేసరి దను నొడిసిన
సురవిమతుండు ప్రాణభీతి సుడివడియె నృపా. 292

టీ. నృపా = రాజా! సురవిమతుఁడు = దేవతల శత్రువైన హిరణ్యకశిపుఁడు, నరకేసరి = నరసింహమూర్తి, సరకుగొనక = లెక్కసేయక, లీలాగతిన్ = విలాసముగా, ఉరగేంద్రుఁడు = సర్పరాజము, మూషికంబున్ = ఎలుకను, ఒడిసినపగిదిన్ = పట్టుకొనినట్లు, తనున్, ఒడిసినన్ = పట్టుకొనఁగా, ప్రాణభీతిన్ = ప్రాణభయముచేత, సుడివడియెన్ = కలఁగెను.

తా. హిరణ్యకశిపుఁడు ఇట్లు పాము ఎలుకను బట్టుకొన్నట్లు తనను ఒక లెక్కసేయక చమత్కారముగా ఒడిసిపట్టఁగాఁ బ్రాణభయముచే మిగుల కొట్టుకొనెను.

క. సురరాజవైరి లోఁబడెఁ
బరిభావితసాధుభక్తపటలాంహునకున్
నరసింహునకు నుదంచ
త్ఖరనఖరజిహ్వునకు నుగ్రతరరంహునకున్. 293

టీ. పరిభావిత...హునకున్ = త్రుంచఁజేయఁబడిన సజ్జనులైన భక్తసంఘముల పాపములు గలవాఁడును, ఉదంచత్...జిహ్వునకున్ = మెఱయుచున్న గోళ్ళు నాలుకగలవాఁడును, ఉగ్రతరరంహునకున్ = భయంకరమైన వేగముగల, నరసింహునకున్ = నరసింహమూర్తికి, సురరాజవైరి = దేవేంద్రుని విరోధి యగుహిరణ్యకశిపుఁడు, లోఁబడెను = లొంగెను.

తా. పోఁగొట్టఁబడిన భక్తుల పాపములుగలవాఁడును, మెఱయుచున్న గోళ్ళునాలుక గలవాఁడును, భీకరబలసంపన్నుఁడైన ఆనరసింహమూర్తికి హిరణ్యకశిపుఁడు లోఁబడెను

వ. అంత. 294

మ. విహగేంద్రుం డహి వ్రచ్చుకైవడి మహోద్వృత్తిన్ నృసిం
హుండు సాగ్రహుఁడై యూరువులందుఁ జేర్చి నఖసంఘా

తంబులఁ వ్రచ్చె దు, స్సహ దంభోళికఠోరదేహు నచలో
త్సాహున్ మహాబాహు నిం, ద్రహుతాశాంతకభీకరున్
ఘనకరున్ దైత్యాన్వయశ్రీకరున్. 295

టీ. నృసింహుండు = నృసింహమూర్తి, దుస్సహ...దేహుఁ = ఓర్వరాని వజ్రాయుధమువలె కఠినమైనశరీరము గలవాఁడును, అచలోత్సాహుఁ = కదలనియుత్సాహముగలవాఁడును, మహాబాహుఁ = గొప్పభుజములు గలవాఁడును, ఇంద్ర...భీకరుఁ = ఇంద్రుఁడు అగ్ని యముఁడు వీరికి భయముబుట్టించువాఁడును, ఘనకరుఁ = బల్లిదమైనచేతిలావుగలవాఁడును, దైత్యాన్వయశ్రీకరుఁ = రాక్షసవంశమునకు వన్నెవెట్టువాఁడును అగుహిరణ్యకశిపుని, సాగ్రహుఁడై = రోషముతోఁ గూడినవాఁడై, విహగేంద్రుండు = గరుత్మంతుఁడు, అహిన్ = పామును, వ్రచ్చుక్రియన్ = చీల్చులాగున, మహోద్వృత్తిన్ = గొప్పగర్వముతో, ఊరువులందున్ = తొడలమీఁద, చేర్చి, నఖసంఘాతంబులన్ = గోటిపోటులచేత, వ్రచ్చెన్ = చీల్చెను.

తా. నరసింహమూర్తి గరుత్మంతుఁడు పామును జీల్చినట్లు ఓర్వరాని పరాక్రమము గలవాఁడును, చలించనియుత్సాహము గలవాఁడును, గొప్పభుజములు గలవాఁడును, ఇంద్రుఁడు అగ్ని యముఁడు వీరికి భయము గలిగించువాఁడును, బలశాలియు నగుహిరణ్యకశిపుని మిక్కుటమైనకోపముతోఁ బట్టి తొడలమీఁదఁ బెట్టికొని క్రోధముతోఁ దనవాఁడిగోళ్లకొలఁదిని జీల్చివైచెను.

శా. చించున్ హృత్కమలంబు శోణితము వర్షించున్ ధరామం
డలిం, ద్రెంచుం గర్కశనాడికావళులు భేదించున్ మహావక్ష
ముం, ద్రుంచున్ మాంసము సూక్ష్మఖండములుగా దుష్టాసు
రుఁ బ్రచ్చి ద, ర్పించుం బ్రేవులు కంఠమాలికలు గల్పిం
చున్ నఖోద్భాసియై. 296

టీ. నరసింహమూర్తి, హృత్కమలంబు = హిరణ్యకశిపుని కమలము వంటిహృదయమును, చించున్ = పగులఁ జీల్చును, ధరామండలిన్ = భూ

వలయముమీఁద, శోణితము = నెత్తురు, వర్షించున్ = కురియును, కర్క
శనాడికావళులన్ = కఠినములైన నరములను, త్రెంచును, మహావక్షమున్ = పెద్దదగు ఱొమ్మును, భేదించున్ = బ్రద్దలుచేయును, మాంసము, సూక్ష్మఖండములుగాన్ = సన్ననిముక్కలుగా, ద్రుంచున్ = తునుకలుచేయును, నఖోద్భాసియై = గోళ్ళచే మెఱయువాఁడై, దుష్టాసురున్ = పాపిరక్కసుని, వ్రచ్చి = చీల్చి, దర్పించున్ = గర్వపడును, ప్రేవులు, కంఠమాలికలు = మెడలో హారములుగా, కల్పించున్ = నిర్మించును.

తా. నరసింహమూర్తి గోళ్ళచే మెఱయుచు ఇట్లు హిరణ్యకశిపుని చీల్చి కొంతసేపు హృదయము చించును, నేలనిండ నెత్తురు చల్లును, కఠినములైన నరములను త్రెంపును, పెద్దదైన ఱొమ్మును బగులఁగొట్టును, మాంసము చిన్నచిన్నముక్కలుగాఁ జేయును, పేగులు హారములుగా మెడలో వేసికొనును, ఇట్లు నానావిధములుగా హింసించెను.

సీ. వక్షఃకవాటంబు వ్రక్కలు చేయుచోఁ
ఘనకుఠారంబులకరణి నొప్పు
గంభీరహృదయపంకజము భేదించుచోఁ
గుద్దాలములభంగిఁ గొమరుమిగులు
ధమనీవితానంబు దవిలి ఖండించుచోఁ
బటులవిత్రంబులపగిది మెఱయు
జఠరవిశాలాంత్రజాలంబుఁ ద్రెంచుచోఁ
గ్రకచసంఘంబులగరిమఁ జూపు
తే. నంకగతుఁడైన దైత్యుని నాగ్రహమున
శస్త్రచయముల నొంపక సంహరించి
యమరునరసింహునఖరంబు లతివిచిత్ర
సమరముఖరంబులై యుండె జనవరేణ్య. 297

టీ. జనవరేణ్య = నరోత్తమా! అంకగతుఁడు = తొడయందున్నవాఁడు, ఐన, దైత్యునిన్ = హిరణ్యకశిపుని, ఆగ్రహమునన్ = కోప

ముతో, శస్త్రిచయములన్ = బాణపరంపరలచే, ఒంపక = మ్రొక్కఁజేయక, సంహరించి = చంపి, అమర...బులు = ఒప్పుచున్న నరసింహమూర్తిగోళ్లు, వక్షఃకవాటంబు = వానితలుపువంటి ఱొమ్మును, వ్రక్కలుచేయుచోన్ = ముక్కలుగాఁ జేయునప్పుడు, ఘనకుఠారంబులకరణిన్ = పెద్దగొడ్డండ్లవలె, ఒప్పెన్ = ప్రకాశించును, గంభీరహృదయపంకజమునన్ = లోఁతైనకమలమువంటిహృదయమును, భేదించుచోన్ = బ్రద్దలుచేయునప్పుడు, కుద్దాలములభంగిన్ = గుద్దళ్ళవలె, కోమలముగులున్ = అందములగును, ధమనీవితానంబున్ = నరములను, తవిలి = పూని, ఖండించుచోన్ = కోయునప్పుడు, పటులవిత్రంబులపగిదిన్ = గట్టికొడవండ్లవలె, మెఱయున్ = ప్రకాశించును; జఠర...జాలంబున్ = కడుపులోనివాడనైన పేగులపోగులను, త్రెంచుచోన్ = తునుముమ, క్రకచసంఘంబులగరిమన్ = రంపములపోలికను, చూపును, ఇట్లు, అతివిచిత్రసమరముఖరంబులు = మిగులనబ్బురమైన యుద్ధమున నాశ్చర్యకరములైనయుద్ధసాధనములుగా నుండెను.

తా. రాజా! ఇట్లు ఒక్క ఆయుధమును లేకయే తొడమీఁదఁ బెట్టుకొని హిరణ్యకశిపుని చీల్చుచున్న ఆనరసింహమూర్తిగోళ్లు, వానిఱొమ్మును చెక్కలుసేయునప్పుడు గొడ్డండ్రవలెనుండెను. లోఁతైనహృదయమును బ్రద్దలు చేయునప్పుడు గుద్దళ్ళవలెనుండెను. నరములను త్రెంచునప్పుడు గట్టికొడవండ్లవలెనుండెను. కడుపునందలిపేగులను త్రెంచునప్పుడు రంపములవలె నుండెను. ఇట్లు ఆయాపనులకుఁ దగిన విచిత్రములైనఆయుధములుగా నొప్పుచుండెను.

క. స్ఫురితవిబుధజనముఖములు
పరివిదళితదనుజనివహపతిసనుముఖముల్
గురురుచిజితశిఖిశిఖములు
నరహరిఖరనఖము లమరు నతజనసఖముల్. 298

టీ. స్ఫురిత...ముఖములు = ఆనందముచేఁ బ్రకాశింపఁ జేయఁబడిన దేవతలముఖములు గలవియు, పరి...ముఖముల్ = చీల్చఁబడిన రాక్షస

సమూహమునకు రాజైన హిరణ్యకశిపుని శరీరమును ముఖమును గలవియు, గురు...ములు = గొప్పకాంతిచే నోడించఁబడిన యగ్నిజ్వాలలు గలవియు, నతజనసఖముల్ = మ్రొక్కెడువారలకు హితములైన, నరహరిఖరనఖము లు = నరసింహునివాఁడిగోళ్లు, అమరున్ = ప్రకాశించును.

తా. దేవతా (పండిత) ముఖములను వికసింపఁజేయునవియు, రాక్ష సరాజుయొక్క ముఖమును దేహమును జీల్చునవియు, గొప్పకాంతిచేత జ యించఁబడిన అగ్నిజ్వాలలు గలవియు, నమస్కరించినవారికి పరమహితము లైన నరసింహునిగోళ్లు మిగులఁ బ్రకాశించుచుండెను.

వ. ఇట్లు కేవలపురుషరూపంబును మృగరూపంబునుం గాని నర సింహరూపంబున రేయునుం బవలునుం గానిసంధ్యాసమ యంబున నంతరంగంబును బహిరంగంబునుం గానిసభాద్వా రంబున గగనంబును భూమియునుం గానియూరుమధ్యంబునఁ బ్రాణసహితంబులును బ్రాణరహితంబులునుం గాని నఖం బులం ద్రైలోక్యజనహృదయశల్యుం డయినదైత్యునిఁ వ ధియించి, మహోదహనకీలాభీలనర్మునుండును గరాళవదనుండు ను లేలిహానభీషణజిహ్వుండును శోధితపంకాంకితకేసరుండు ను నై ప్రేవులు కంఠమాలికలుగ ధరించి కుంభికుంభవిదళనం బు చేసి చను దెంచుపంచాననంబునుంబోలె దనుజకుంజరహృ దయకమలవిదళనంబు నేసి తదీయరక్తసిక్తంబు లయిననఖంబు లు సంధ్యారాగరక్తచంద్రరేఖలచెలువు వహింప సహింపక లేచి తనకట్టెదుర నాయుధంబు లెత్తుకొని తత్క్షణంబున ర ణంబునకు నురవడించు రక్కసులం బెక్కుసహస్రంబులం జ క్రాదికనిర్వక్రసాధనంబుల నొక్కనిఁ జిక్కకుండం జక్కడి చె నివ్విధంబున.

టీ. కేవలపురుషరూపము = వట్టిమానవాకారము, మృగరూపంబు = మెకముపోలుపు, కాని, నరసింహరూపంబునన్ = నరసింహరూపముతో,

రేయుం = రాత్రియును, పగలును, అంతరంగంబున = ఇంటినడుమను, బహిరంగంబున = వెలుపలను, కాని, సభాద్వారంబునన్ = కొలువుకూటము వాటికిలో, గగనంబున = ఆకాశమును, భూమియును, కాని, ఊరుమధ్యంబునన్ = తొడలనడుమను, ప్రాణసహితములు = ప్రాణముతోఁ గూడినవి, ప్రాణరహితములు = ప్రాణములులేనివి, నఖంబులన్ = గోళ్లచేత, త్రైలోక్య...భల్లుండు = ముల్లోకములయందలిజనుల హృదయములకు బల్లెమువంటివాఁడు, అయినదైత్యపుల్లునిన్ = అయినరాక్షసశ్రేష్ఠుని, వధియించి = చంపి, మహా...దగ్ధుండును = పెద్దఅగ్నియొక్కమంటలవలె భయంకరమైనచూపులు గలవాఁడును, కరాళవదనుండును = భయంకరమైన ముఖముగలవాఁడును, లేలిహానభీషణజిహ్వుండు = నాఁకుచున్నఘోరమైన నాలుకగలవాఁడును, శోణిత...కేసరుండును = నెత్తురుబురదచే బూయఁబడినజూలుగలవాఁడును, అయి, ప్రేవులు, కంఠమాలికలుగన్ = మెడలోని హారములుగా, ధరించి, కుంభి...నంబు = ఏనుఁగు కుంభస్థలపాటనమును, చేసి, చనుదెంచు పంచాననంబునుం బోలెన్ = వచ్చుసింగమువలె, దనుజ...నంబు = రాక్షసరాజుయొక్క ఱొమ్ము చీల్చుటను, చేసి, తదీయరక్తసిక్తంబులు = వానినెత్తురుచేఁ దడిసినవి, ఐన నఖంబులు = గోళ్లు, సంధ్యా...రేఖలచెలువునన్ = సంధ్యాకాలమందలి యెఱ్ఱఁదనముచే నొప్పినచంద్రకళలయందమును, వహింపన్ = తాల్పఁగా, సహింపక = ఓర్వక, కట్టెదురన్ = కన్నులముందట, తత్తఱంబునన్ = సంరంభముతో, రణంబునకున్ = యుద్ధమునకు, ఉరవడించు = దుముకుచున్న, రక్కసులన్ = రాక్షసులను, పెక్కుసహస్రంబులన్ = అనేకములైనవేలను, చక్రాది ..బులన్ = చక్రము మొదలగు అకుంఠితములైన ఆయుధములతో, ఒక్కనినైనను, చిక్కకుండన్ = మిగులనట్లు, చక్కడిచెన్ = చంపెను.

శా. రక్షోవీరుల నెల్లఁ ద్రుంచి రణసంరంభంబు చాలించి దృ
ష్టిక్షేపంబు భయంకరంబుగ సభాసింహాసనారూఢుఁ డై

యక్షీణాగ్రహుఁడై నృసింహుఁడు కరాళాస్యంబుతో నొప్పెఁ దన్
వీక్షింపం బలికింప నోడి యితరుల్ విభ్రాంతులై డాఁగఁగన్.

టీ. నృసింహుండు=నరసింహమూర్తి, రక్షోవీరులన్ = రాక్షసుల యందలిశూరులను, ఎల్లన్, త్రుంచి=చంపి, రణసంరంభంబు=యుద్ధమందలి యాటోపమును, చాలించి, దృష్టిక్షేపంబు= చూపుల నిగుడ్చుట, భయంకరంబుగన్=బెదురుగలుగునట్లుగా, సభా...ఘుఁడై=సభయందున్న సింహాసనమందుఁ గూర్చున్నవాఁడై, అక్షీణాగ్రహుఁడై=తగ్గనికోపముగలవాఁడై, తనను, ఇతరులు, వీక్షింపన్=చూచుటకును, పలికింపన్=మాటలాడించుటకును, ఓడి=భయమంది, విభ్రాంతులై=భ్రమచెందినవారై, డాఁగఁగన్ =దాఁగుకొనఁగా, కరాళాస్యంబుతోన్ = భయంకరమైన మొగముతోడ, ఒప్పెన్=ప్రకాశించెను.

తా. ఇట్లు నరసింహమూర్తి రాక్షసులలో నెన్నికగలవా రందఱను మందునకైన లేకుండఁ జంపి యుద్ధసంరంభము చాలించి భయంకరముగాఁ జూచుచు నాసభయందలి సింహాసనమందు గూర్చుండి కోపము విడువక ఇతరులు తన్ను చూచుటకు పలుకరించుటకుఁగూడ శక్తులుకాక దాఁగుకొనఁగా భయంకరముఖముతో నుండెను.

క. సురచారణవిద్యాధర
గరుడోరగయక్షసిద్ధగణములలో నొ
క్కరుఁ డైన డాయ వెఱచును
నరహరి నయ్యవసరమున నరలోకేశా. 301

టీ. నరలోకేశా = మనుష్యలోకమునకు నాథుఁడవైన యోధర్మరాజా! అయ్యవసరమునన్ = ఆసమయమున, సుర...గణములలోన్ = దేవతలు, చారణులు, విద్యాధరులు, గరుడులు, నాగులు, యక్షులు, సిద్ధులు వీరిసమూహములలో, ఒక్కరుఁడైనను, నరహరిన్ = నరసింహమూర్తిని, డాయన్ = సమీపించుటకు, వెఱచును = భయమందును.

తా. ఓధర్మరాజా! అట్లు కోపాదేశముతో నున్న ఆనరసింహామూర్తిని సుర చారణ విద్యాధరాది దేవతలలో నొక్కఁడైన సమీపమునకుఁ బోవఁజాలఁడాయెను.

క. తర్షంబుల నరసింహుని
హర్షంబులఁ జూచి నిర్జరాంగనలు మహో
త్కర్షంబులఁ గుసుమంబుల
వర్షంబులు గురిసి రుత్సవంబుల నధిపా. 302

టీ. అధిపా = రాజా! నిర్జరాంగనలు = దేవవనితలు, తర్షంబులన్ = ఆదరములతో, హర్షంబులన్ = ఆనందములతో, నరసింహుని, చూచి, మహోత్కర్షంబులన్ = మిక్కిలి గొప్పతనములతో, ఉత్సవంబులన్ = సంతోషములతో, కుసుమంబుల వర్షంబులు = పూలవానలు, కురిసిరి.

తా. రాజా! దేవతా స్త్రీలు, ఆనరసింహమూర్తిని ప్రేమమీఱఁ జూచి ఆనందముతో నతిశయముగా వేడుకపడి పూలవానలు గురిసిరి.

వ. మఱియు నయ్యవసరంబున మింట ననేక దేవతావిమానంబులును గంధర్వగానంబులును నప్సరోగణనర్తనసంవిధానంబులును దివ్యకాహళభేరీపటహమురజాదిధ్వానంబులును బ్రకాశమానంబు లయ్యె సునందకుముదాదు లయినహరిపార్శ్వచరులును మహేశ్వర విరించి మహేంద్ర పురస్సరు లగు త్రిదశకిన్నరకింపురుష పన్నగ సిద్ధసాధ్య గరుడ గంధర్వ చారణ విద్యాధరాదులును బ్రజాపతులును నరకంఠీరవదర్శనోత్కంఠు లయి చనుదెంచి. 303

టీ. అయ్యవసరంబునన్ = ఆసమయమునందు, మింటన్ = ఆకాశమున, అనేక దేవతావిమానంబులును = లెక్కలేనిదేవతల ఆకాశయాన

ములును, గంధర్వ గానంబులును = గంధర్వుల పాటలును, అప్సరో...బులును = అచ్చరలగుంపుల ఆటలతీరులను, దివ్య...ములును = దేవసంబంధములైన కాహళులు భేరులు తప్పెటలు మద్దెలలు మొదలగువాని చప్పుడులును, ప్రకాశమానంబులు = వెలుఁగుచున్నవి, అయ్యెను, సునందకుముదాదులు = సునందుఁడు కుముదుఁడు మొదలైనవారు, అగు, వారి పార్శ్వచరులును = విష్ణుని పరిచారకులును, మహేశ్వర...రులు = శివుఁడు బ్రహ్మ ఇంద్రుఁడు మొదలగువారు, అగు, త్రిదశ...లును = దేవతలు అశ్వముఖులు అశ్వదేహులు నాగులు సిద్ధులు సాధ్యులు గరుడులు గంధర్వులు చారణులు విద్యాధరులు మొదలగువారును, ప్రజాపతులును = బ్రహ్మలును, నర...తులు = నరసింహమూర్తిని చూచు వేడుకగలవారై, చనుదెంచి = వచ్చి.

క. కరకమలయుగళకీలిత
శిరులై డగ్గఱక భక్తిఁ జేసిరి బహుసం
సరణాబ్ధితరికి నఖరికి
నరభోజనహస్తిహరికి నరకేసరికిన్. 304

టీ. కర...శిరులై = కేలుఁదామరలజంటలచే ధరింపఁబడిన ఔఁదలలుగలవారై, డగ్గఱక = దగ్గఱఁజేరక, బహు...తరికిన్ = విస్తారమైన సంసారసముద్రమునకు నావయగువాఁడును, నఖరికిన్ = గోళ్లుగలవాఁడును, నర...రికిన్ = మనుష్యులను జంపి తిను క్రూరరాక్షసుఁడను నేనుఁగునకు సింహమువంటివాఁడగు, నరకేసరికిన్ = నరసింహస్వామికి, భక్తిన్ = ప్రపత్తిని, చేసిరి = చూపిరి.

తా. అయింద్రాదులు అంజలులు ఫాలమున జేర్చుకొని దగ్గఱకు రావెఱచి దూరమునుండి అపారమైనసంసారసముద్రమునకు ఓడవంటివాఁడును, గోళ్లు గలవాఁడును, మనుష్యభక్షకుఁ డగునాహిరణ్యకశిపుఁడను నేనుఁగునకు సింహమువంటివాఁడగు నరసింహస్వామికి ప్రపన్నులై మ్రొక్కులిడిరి.

వ. ఆసమయంబున దేవతలందఱు వేఱువేఱ వినుతించి రందుఁ
గమలాసనుం డిట్లనియె. 305

టీ. వినుతించిరి = పొగడిరి, కమలాసనుఁడు = బ్రహ్మ.

మ. ఘనలీలాగుణచాతురిన్ భువనముల్ గల్పించి రక్షించి భే
దనముం జేయుదురంతశక్తికి ననంతజ్యోతికిం జిత్రవీ
ర్యునికిన్ నిత్యపవిత్రకర్మునికి నే నుత్కంఠతో నవ్యయా
త్మునికిన్ వందన మాచరించెదఁ గృపాముఖ్యప్రసాదార్థినై.

టీ. నేను, ఘన లీలాగుణచాతురిన్ = గొప్పదై వేడుకగాఁ దాల్చఁబడి సత్త్వాదిగుణముల నేర్పుచేత, భువనముల్ = లోకములను, కల్పించి = సృజించి, రక్షించి = కాపాడి, భేదనమున్ = నాశమును, చేయు, దురంతశక్తికిన్ = గొప్పసామర్థ్యముగలవాఁడును, అనంతజ్యోతికిన్ = పరిమితిలేని దివ్యతేజముగలవాఁడును, చిత్రవీర్యునికిన్ = ఆశ్చర్యమైన పరాక్రమము గలవాఁడును, నిత్యపవిత్రకర్మునికిన్ = ఎప్పుడు పావనములైన కర్మలు గలవాఁడును నగు, అవ్యయాత్మునికిన్ = నాశములేని యీయాత్మస్వరూపునికి, కృపాముఖ్యప్రసాదార్థినై = దయచేత ప్రధానమైన అనుగ్రహమును గోరినవాఁడనై, ఉత్కంఠతోన్ = వేడుకతోడ, వందనమాచరించెదన్ = నమస్కారముం జేయుచున్నాను.

తా. గొప్పవిలాసగుణముల మహిమచేత లోకములు బుట్టించి పెంచి శమయించుమహాసామర్థ్యము గలవాఁడును వర్ణింపశక్యముగాని దివ్యతేజము గలవాఁడును, విచిత్రమైన పరాక్రమముగలవాఁడును, శాశ్వతమై పావనమైన కర్మలుగలవాఁడును నాశరహితుఁడునగు పరమాత్మరూపునకు నే నాయన యనుగ్రహమును గోరి మ్రొక్కుచున్నాను.

వ. రుద్రుం డిట్లనియె. 307

చ. అమరవరేణ్య మీఁదట సహస్రయుగాంతమునాఁడుగాని కో
పమునకు వేళ గాదు సురబాధకుఁ డైనతమస్వినీచరున్

సమరమునఁ వధించితివి చాలుఁ దదాత్మజుఁ డైనవీఁడు స
ద్విమలుఁడు నీకు భక్తుఁడు పవిత్రుఁడు కావుము భక్తవత్సలా.

టీ. అమరవరేణ్య=దేవతలలో మేలైన యోస్వామీ! మీఁదటన్=ఉత్తరకాలమున, సహస్ర...వాఁడుగాని=సహస్రయుగములు గడచినవెనుకగాని, (నేఁడే) కోపమునకు, వేళ=సమయము, కాదు, సురబాధకుఁడు=దేవతలను గారించువాఁడగు, ఐన, తమస్వినీచరున్=రాక్షసుని, సమరమునన్=యుద్ధమందు, వధించితివి=చంపితివి, చాలును, తదాత్మజుఁడు=వానికొడుకు, ఐన, వీఁడు=ప్రహ్లాదుఁడు, సద్విమలుఁడు=మంచినిర్మలుఁడు, నీకు, భక్తుఁడు=దాసుఁడు, పవిత్రుఁడు=పావనుఁడు, కావున, భక్తవత్సలా=భక్తులయందు దయగలవాఁడా, వీనిని, కావుము, రక్షించుము.

తా. దేవతలకెల్ల మేలైన యోదేవుఁడా! సహస్ర మహాయుగములు గడచినమీఁదటఁగాని ఇప్పుడు కోపించి జగత్సంహారము, సేయుటకు సమయముకాదు. నీవెవనికొఱకు ఆవిర్భవించినావో ఆదేవతలశత్రువును జంపితివి కదా. ఇఁక నీకుఁ జంపఁదగినవా రెవ్వరును లేరు. వాని కొడుకైన ఈ ప్రహ్లాదుఁడు అత్యుత్తముఁడు నీకుభక్తుఁడునుగాన భక్తులయందుపుత్రప్రేమ గల యోస్వామీ వీని రక్షింపుము.

వ. ఇంద్రుం డిట్లనియె. 309

సీ. ప్రాణిసంఘములహృత్పద్మమధ్యంబుల
నివసించి భాసిల్లు నీవ యెఱుఁగు
దింత కాలము దానవేశ్వరుచే బాధ
పడి చిక్కి యున్న యాపన్న జనుల
రక్షించితివి మఱి రాక్షసేశ్వరుఁ జంపి
క్రతుహవ్యములు మాకుఁ గలిగె మరల

మంటిమి నీసేవ మఱగినవారలు
కైవల్యవిభవంబు కాంక్ష సేయ
ఆ. రితరసుఖము లెల్ల నిచ్ఛగింపఁగ నేల
యస్థిరంబు లివి యనంతభక్తిఁ
గొలువ నిమ్ము నిన్ను ఘోరదైత్యానీక
చిత్తభయదరంహ శ్రీనృసింహ. 310

టీ. ఘోర...రంహ = భయంకరులైన రాక్షసుల మందలకు భయమును బుట్టించుసంరంభముగల, శ్రీనృసింహ = నృసింహస్వామీ! ప్రాణి...బులఁ = జీవకోటుల హృదయాకాశములయందు, నివసించి, భాసిల్లునీవు = ప్రకాశించు నీవే, ఎఱుఁగుదువు, ఇంతకాలము, దానవేశ్వరుచేఁ = హిరణ్యకశిపుని చేత, బాధపడి, చిక్కి = తగులుకొని, ఉన్న, ఆపన్నజనులఁ = అపాయపడిన వారలను, మమ్మును, రాక్షసేశ్వరుఁ = హిరణ్యకశిపుని, చంపి, రక్షించితి, మాకుఁ, మరలఁ, క్రతుహవ్యములు = యజ్ఞములయందలి హవిర్భాగములు, కలిగెను, మంటిమి = (నీదయచేత) బ్రతికినాము, నీసేవ, మఱగినవారలు = అలవడినవారు, కైవల్యవిభవంబు = మోక్షసామ్రాజ్యము, కాంక్ష సేయరు = కోరరు, ఇతరసుఖములు ఎల్ల = తదితరసుఖములన్నియు, ఇచ్ఛగింపఁగ = కోరఁగా, ఏల = ఎందులకు, ఇవి = ఈ తక్కిన అల్పసౌఖ్యములు, అస్థిరంబులు = చపలములు, నిన్ను, అనంతభక్తిఁ = తెంపులేని భక్తితో, కొలువనిమ్ము = సేవించునట్లు చేయుము.

తా. దుష్టరాక్షసులకు భయంకరమైన విక్రమము గలఓ నరసింహస్వామీ! ఇన్నాళ్లనుండి, మేము ఈహిరణ్యకశిపునివలనఁ బడిన బాధలు సర్వుల చిత్తములలో నివసించియుండు మీకుమాత్రము తెలియదా. వానికి వశమై బాధపడుచున్నమమ్మందఱను ఆదుర్మార్గుని జంపి రక్షించితివి. మరల మాకు యజ్ఞములలో హవిర్భాగములు దొరకఁగలవు. నీ దయవలన బ్రతికినారము. నీకైంకర్య మలవడినవారు కైవల్యమునుసయితము కోరరు.

ఇఁక నితరములైన తుచ్ఛములైన పార్థివాదిసౌఖ్యములఁ జెప్ప నేల? ఇవన్ని యు స్థిరములు కావు. కావున మాకివి యెవ్వియు వలగు. నీ పాదములయందలి దృఢమైన భక్తిని ప్రసాదించినఁ జాలును.

వ. ఋషు లిట్లనిరి. 311

మ. భవదీయాదరలీల లోకముల నుత్పాదించి రక్షింప నేఁ
డవి దైత్యేశునిచేత భేదితములై హ్రస్వంబులై యుండ నీ
యఘనీతుఁ నరసింహరూపమున సంహారంబు నొందించి వే
దవిధిం గ్రన్ముఱ నుద్ధరించితిగదా ధర్మానుసంధాయివై. 312

టీ. భవదీయాదరలీలన్ = నీసంబంధమైన ఆదరముతోడి విలాసము చేత, లోకములను, ఉత్పాదించి = పుట్టించి, రక్షింపన్ = కాపాడఁగా, నేఁడు, అవి = ఆలోకములు, దైత్యేశునిచేతన్ = హిరణ్యకశిపునిచేత, భేదితములు = చెఱుపఁబడినవి, ఐ, హ్రస్వంబులు = క్షీణమైనవి, ఐ, ఉండన్ = ఉండఁగా, ఈయఘనీతున్ = ఈదుర్మార్గుని (హిరణ్యకశిపుని), నరసింహరూపమునన్, సంహారంబునొందించి = చంపి, ధర్మానుసంధాయివి ఐ = ధర్మమును అనుసరించువాఁడవై, వేదవిధిన్ = వేదములలోనున్న ధర్మమును, క్రమ్మఱన్ = మరల, ఉద్ధరించితిగదా = నిలువఁబెట్టినావుగదా.

వ. పితృదేవత లిట్లనిరి 313

టీ. పితృదేవతలు = అగ్నిష్వాత్తాదులు.

శా. చండక్రోధముతోడ దైత్యుఁడు వడిన్ శ్రాద్ధంబులన్ మాసుతుల్, పిండంబుల్ సతిలోదకంబులుగ నర్పింపంగ మాకీకయు
ద్దండత్వంబునఁ దాన కైకొనుమహోదగ్రుండు పేఁ డిక్కడన్
ఖండింపంబడె నీనఖంబుల నుతుల్ గావింతు మాత్మేశ్వరా.

టీ. ఆత్మేశ్వరా = పరమాత్మరూపుఁడవైన ఓదేవా! దైత్యుఁడు = హిరణ్యకశిపుఁడు, చండక్రోధముతోడన్ = దారుణమైనకోపముతోడ,

వడిన్ = వేగముగా, మత్సుతుల్ = మాసంతతులు, శ్రాద్ధంబులన్ = అబ్దికము మొదలైనపితృకర్మములలో, సతిలోదకంబులు గన్ = నువ్వులనీళ్లతోఁగూడ, సమర్పింపన్ = మమ్ముఁగూర్చి విడువఁగా, మాకు, ఈయక, ఉద్దండత్వంబు నన్ = ధార్ష్ట్యముతోడ, తానే, కైకొనును, మహోదగ్రుండు = మిక్కిలి క్రూరుఁడు, వీఁడు = హిరణ్యకశిపుఁడు, ఇక్కడన్ = ఇచ్చోట, నీ నఖంబులన్ = నీగోళ్లచేత, ఖండింపంబడెన్ = చీల్చఁబడెను, నుతుల్ = స్తోత్రములను, కావింతుము = చేయుదుము.

తా. ఓనృసింహపరమాత్మా! ఈదుష్టరాక్షసుఁడు మాకొడుకులు మాకు తిలోదకములతోఁగూడ పిండప్రదానము చేయఁగా నవి మాకు చెందనీయక గడుసుఁదనముతో నవి తానే అపహరించి మమ్ము పెట్టినబాధలు ఇన్నియని చెప్ప వీలుగాదు. ఇట్టి పరమదుర్మార్గుఁడు నేఁడు నీగోళ్ల వాతఁబడి ప్రాణములు విడిచినాఁడు. ఓస్వామీ నీకు వేనవేల నమస్కారములు.

వ. సిద్ధులిట్లనిరి. 315

క. క్రుద్ధుండై యణిమాదిక
సిద్ధులు గైకొనినదైత్యుఁ జీఱితివి మహా
యోద్ధవు నీకృప మాకును
సిద్ధులు మరలంగఁ గలిగె శ్రీనరసింహా. 316

టీ. శ్రీనరసింహా = సంపద గల ఓనరసింహస్వామీ! క్రుద్ధుండు = కోపగించుకొనినవాఁడు, ఐ, అణిమాదికసిద్ధులు = అణిమ మొదలగు సిద్ధులను, కైకొనినదైత్యున్ = తీసికొన్న హిరణ్యకశిపుని, చీఱితివి = చీల్చి చంపితివి, మహాయోద్ధవు = నివుగొప్పయోధుఁడవు, నీకృపన్ = నీదయ వలన, మాకున్, మరలన్, సిద్ధులు = అణిమాదిసిద్ధులు, మరలంగన్ = మళ్లి వచ్చుటకు, కలిగెను.

తా. ఓనరసింహస్వామీ! ఈదుర్మార్గుఁడు అకారణముగా కోపపడి మా అణిమాదిసిద్ధులను అపహరించెను. ఇట్టివానిని జంపితివి. నివు మిగుల గట్టివాఁడవు. నీదయావలన మాసిద్ధులు మాకు దక్కినవి.

వ. విద్యాధరు లి ట్లనిరి 317

క. దానవునిఁ జంపి యంత
ర్ధానాదికవిద్య లెల్ల దయతో మరలం
గా నిచ్చితివి విచిత్రము
నీనిరుపమ మైన భవంబు నిజము నృసింహా. 318

టీ. నృసింహా = నరసింహస్వామీ! దానవునిన్ = హిరణ్యకశి పుని, చంపి, అంత...విద్యలు ఎల్లన్ = మాటుపడుట మొదలగు మావిద్య లన్నియు, దయతోన్ = కరుణతోడ, మరలంగాన్ = తిరుగ, ఇచ్చి తివి. నీ నిరుపమ మైన భవంబు = సాటిలేని నీ ప్రభావము, విచిత్రము = ఆశ్చ ర్యకర మైనది.

తా. ఓనృసింహస్వామీ! ఈ హిరణ్యకశిపుఁడు రాక్షసుని జంపి వీని చే నింతకుపూర్వ మపహరింపఁబడిన మాయంతర్ధానము మొదలైనవిద్యల నన్ని యు మరల మాకు స్వాధీనముగాఁ జేసితివి. నీ ప్రభావము అప్రమేయము.

వ. భుజంగు లి ట్లనిరి. 319

టీ. భుజంగులు = సర్పములు (నాగులు).

క. రత్నములను మత్కాంతా
రత్నంబులఁ బుచ్చికొన్నరక్కసునురమున్
యత్నమున వ్రచ్చి వైచితి
పత్నులు రత్నములుఁ గలిగి బ్రదికితి మీశా. 320

టీ. ఈశా = ఓజగన్నాయకా! రత్నములను = మణులను, మ త్కాంతారత్నంబులన్ = మాభార్యలను, పుచ్చికొన్నరక్కసునురమున్ = అంచికొన్న రాక్షసుని ఱొమ్మును, యత్నమునన్ = ప్రయత్నముతోడ, వ్రచ్చివైచితి = చీల్చివేసితివి. పత్నులు = భార్యలును, రత్నములు = మణు లును, కలిగి = మరలఁ జిక్కి, బ్రదికితిమి.

తా. దేవా! ఈపాపాత్ముఁడు మారత్నములను పెండ్లాలను దోఁచుకొని ఏడిపించుచుండెను. అతిప్రయత్నముతో నెట్లో పట్టుబట్టి వీనిజంపితివి. నీదయవలన మాపెండ్లాలు మామణులు మాకు తిరుగలభించినవి అంతియ చాలును.

వ. మనువు లిట్లనిరి. 321

క. దుర్ణయుని దైత్యుఁ బొరిగొని
వర్ణాశ్రమధర్మసేతువర్గము మరలం
బూర్ణము సేసితి వే మని
వర్ణింతుము కొలిచి బ్రదుకువారము దేవా. 322

టీ. దుర్ణయునిన్ = దుర్నీతిగలవాఁడగు, దైత్యున్ = హిరణ్యకశిపుని, పొరిగొని = చంపి, వర్ణా...వర్గము = వర్ణములయు ఆశ్రమములయు ధర్మము లను వంతెనల సమూహమును, మరలన్, పూర్ణము చేసితివి = లోపించిన భాగములను బాగుచేసినావు, నిన్ను, ఏమని, వర్ణింతుము = పొగడుదుము, నిన్ను కొలిచి బ్రతుకువారము.

వ. ప్రజాపతు లిట్లనిరి 323

మ. ప్రజలం జేయుటకై సృజించితి మముం బాటించి దైత్యాజ్ఞచేఁ
బ్రజలం జేయక యింతకాలము మహాభారంబుతో నుంటి మీ
కుజను వక్షముఁ జీఱి చంపితివి సంకోచంబు లేకెల్లచోఁ
బ్రజలం జేయుచునుండువారము జగద్భద్రాయమాణోదయా.

టీ. జగద్భద్రాయమాణోదయా = లోకక్షేమకరమైన యవతారముగల యోస్వామీ! మముల్ = మమ్మును, ప్రజలన్ = లోకములను, చేయుటకున్ ఐ, పాటించి = పూని, సృజించితివి, దైత్యాజ్ఞచేన్ = హిరణ్యకశిపునుత్తరువు చేత, ఇంతకాలము, ప్రజలను, చేయక = పుట్టింపక, మహాభారంబుతోన్ = గొప్పదుఃఖభారముతోడ, ఉంటిమి = కాలముద్రోయుచుంటిమి, ఈకుజ

నన్ = ఈదుర్మార్గుని, వక్షము = ఱొమ్ము, చీఱి = చీల్చి, చంపితివి, ఇఁక, సంకోచంబు = అనుమానము, లేక, ఎల్లచోన్ = అంతటను, ప్రజలను, చేయుచు, ఉండువారము = ఉందుము.

తా. స్వామీ! మమ్ము లోకములు నిర్మింపుఁడని మక్కువతో సృజించితివి. మేమును అట్లె నీయాజ్ఞచొప్పునఁ బ్రవర్తించుచుంటిమి. ఇంతలో ఈ మిడిమేలపురక్కసుఁ డొకఁ డడ్డపడి మాయత్నముల సాగనియ్యఁ డయ్యెను. ఇద్దురాత్ముని జంపి మాయడ్డుదీర్చితివి. ఇఁక నన్నిశంకలు బాసి నీదయవలన మాసృష్టి మేము చేసికొనుచుందుము.

వ. గంధర్వు లి ట్లనిరి. 325

క. ఆడుదుము రేయుఁ బగలం
బాడుదుము నిశాటునొద్ద బాధించు దయం
జూడఁడు నీచే జమునిం
గూడె మహాపాతకునకుఁ గుశలముగలదే. 326

టీ. రేయుఁబగలున్ = రాత్రిపగలును, నిశాటునొద్దన్ = హిరణ్యకశిపునికొలువున, ఆడుదుము, పాడుదుము, అయినను ఎప్పుడు బాధించును. దయఁజూడఁడు. వీఁడు నీచేత, జమునిన్ = యముని, కూడెను = చేరెను, మహాపాతకునకున్ = అతిపాపాత్మునకు, కుశలము = క్షేమము, కలదే = లేదు.

తా. అయ్యా! మేమందఱము ఆహిరణ్యకశిపునొద్ద రేయుంబవలు విరామములేక నిర్బంధముతో నాడుచుఁబాడుచు నుందుము, అట్లైనను వాఁడు మాయుసురలు తీయుచుండును. నీదయచే ఆదుర్మార్గుఁడు యమునిదగ్గఱ జేరినాఁడు. అట్లే లేకున్న అంతటిదురాత్ముఁడు క్షేమపడునా? పడఁడు.

వ. చారణు లి ట్లనిరి. 327

క. భువనజనహృదయభల్లుఁడు
దివిజేంద్రవిరోధి నేఁడు దెగె నీచేతన్
భవరోగనివర్తక మగు
భవదంఘ్రియుగంబుఁ జేరి బ్రదికెద మీశా. 328

టీ. ఈశా! భువనజనహృదయభల్లుఁడు = లోకమందలి ప్రజల హృదయములకు బల్లెమువంటివాఁడగు, దివిజేంద్ర విరోధి = ఇంద్రశత్రువగు హిరణ్యకశిపుఁడు, నేఁడు, నీచేతన్, తెగెను = చచ్చెను. ఇఁకను, భవ...నర్తకము = సంసారతాపనివారకము, అగు, భవదంఘ్రియుగంబున్ = నీపాదయుగమును, చేరి, బ్రతికెదము.

తా. స్వామీ! త్రిలోకములయందలి జనులకు హృదయశూలమైన యారాక్షసుఁడు నీచేతఁ జచ్చెను. ఇఁక మేమందఱము సంసారనాశకమగు నీపాదద్వంద్వముఁ జేరి బ్రతుకుదుము.

వ. యక్షు లి ట్లనిరి. 329

ఉ. భ్రంశము లేనినీభటుల భంగవిముక్తుల మమ్ము నెక్కి ని
స్సంశయవృత్తి దిక్కులఁ బ్రచారము చేయుచునుండువీఁడు ని
స్త్రింశముతోడ వీనిఁ గడ తేర్చితి వాపద మానె నోచతు
ర్వింశతితత్త్వశాసక త్రివిష్టపముఖ్యజగన్నివాసకా. 330

టీ. ఓచతు...శాసక = ఇరువదినాలుగు తత్త్వములను పాలించునో స్వామీ! త్రివి...వాసకా = స్వర్గము మొదలుగా నెల్లలోకములయందు వసించువాఁడా! వీఁడు = హిరణ్యకశిపుఁడు, భ్రంశము = కలఁత, లేని, నీభటులన్ = నీకింకరులమైన, భంగవిముక్తులన్ = పరాభవమెఱుఁగని, మమ్మున్ ఎక్కి, నిస్సంశయవృత్తిన్ = అనుమానములేని గతితో, దిక్కులయందు, ప్రచారము చేయుచునుండున్ = సంచరించుచుండును, నిస్త్రింశముతోడన్ = కత్తితో (కత్తివిబోలుగోళ్లతో), వీనిని, కడతేర్చితివి = చంపితివి, ఆపదమానెన్ = మాకష్ట మీడేఱినది.

తా. స్వామీ! చతుర్వింశతి తత్త్వస్వరూపా! స్వర్గాదిలోకములలో నంతట నివసించువాఁడా! ఎన్నఁడు నపదయనునది యెట్టిదో యెఱుఁగని నీదాసులమైన మాపై నెక్కి నిర్భయముగా నెల్లచోటుల స్వారిచేయు చుండును. నీక త్తిగోరులచే వీనిఁ జంపి మానూడు దీర్చితివి. స్వామీ మా కష్టములు కడముట్టినవి.

వ. కింపురుషు లి ట్లనిరి. 331

క. పురుషోత్తమ నేరము కిం
పురుషుల మల్పులము నిన్ను భూషింపఁగ దు
ష్పురుషుఁ సకలసుజనహృ
త్పరుషుం జంపితివి జగము బ్రదికె నధీశా. 332

టీ. పురుషోత్తమ = ఓవిష్ణూ! కింపురుషులము = కింపురుషజాతి వారము (హీనమానవులము), అల్పులము = అధములము, నిన్ను, భూషింపఁగ = పొగడుటకు, నేరము = ఎఱుఁగము, అధీశా = సర్వజగన్నాయకా! సకల...పరుషుఁ = ఎల్లజనులహృదయములకు కఠినుఁడైన, దుష్పురుషుఁ = దురాత్ముని, చంపితివి, జగము, బ్రతికెను.

తా. స్వామీ! అధములైన కింపురుషులము మేము ని న్నేమిపొగడఁ గలము. మాకు యోగ్యతలేదు. సమస్తజనులను బాధించుచున్న యీ క్రూరుని జంపితివి. లోకములు నిలచెను.

వ. వైతాళికు లి ట్లనిరి. 333

టీ. వైతాళికులు = మేలుకొలుపులు పాడువారు.

క. త్రిభువనశత్రుఁడు వడియెను
సభలందును ముఖములందు జగదీశ్వర నీ
శుభగీతములు పఠించుచు
నభయుల మై సంచరింతు మార్తశరణ్యా. 334

టీ. జగదీశ్వర = లోకనాయకా! త్రిభువనశత్రుఁడు = మూఁడులోకములకు భయంకరమైన శత్రువు, పడియెను = చచ్చెను. ఆర్తశరణ్యా = ఓదీనరక్షకా! సభలయందును, మఖములందును = యజ్ఞములయందును, శుభగీతములు = నీమంగళగానములను, పఠించుచుఁ = పాడుచు, అభయులము = భయములేనివారము, ఐ, సంచరింతుము = తిరిగెదము.

తా. దేవా! ముల్లోకములకు శత్రువైన యీదుర్మార్గుఁడు నీచేతఁ జంపఁబడెను. ఇఁక మేము ఎల్లచోటులను జంకులేక నీపావనగీతములను బాడుకొనుచు తిరిగెదము.

వ. కిన్నరులి ట్లనిరి. 335

క. ధర్మము దలఁపఁడు లఘుతర
కర్మము చేయించు మమ్ముఁ గలుషాత్మకు దు
ష్కర్మునిఁ జంపితి వున్నత
శర్ములమై నీదుభక్తి సలిపెదము హరీ. 336

టీ. హరీ! ధర్మము = న్యాయము, తలఁపఁడు = విచారించఁడు, మమ్మును, లఘుతరకర్మము = నీచపుఁబనిని, చేయించును, కలుషాత్మకుని = పాపాత్ముఁడైన, దుష్కర్మునిన్ = క్రూరకర్ముఁడైన రాక్షసుని, చంపితివి, ఉన్నతశర్ములమై = గొప్పసుఖముగలవారమై, నీదుభక్తి, సలిపెదము = చేసెదము.

తా. శ్రీహరీ! న్యాయము విచారించక మమ్ము బహుబాధలఁ బెట్టిన దుష్టరాక్షసుని జంపి మేలొనర్చితివి. ఇందువలన నిఁక నిశ్చింతముగా బ్రతికి నీభక్తి గలిగియుండెదము.

వ. విష్ణుసేవకు లి ట్లనిరి. 337

ఉ. సంచితవిప్రశాపమునఁ జండనిశాచరుఁడైనవీని శి
క్షించుట కీడు గాదు కృప చేసితి వీశ్వర భక్తితోడ నే

వించుటకంటె వైరమున వేగమ చేరఁగ వచ్చు నిన్ను నీ
యంచితనారసింహతను వద్భుత మాపదఁ బాసి రందఱున్.

టీ. సంచితవిప్రశాపమునన్ = పూర్వజన్మమందు ఆర్జింపఁబడిన బ్రాహ్మణశాపముచేత, చండనిశాచరుఁడు = క్రూరరాక్షసుఁడు, ఐనవీనిన్, శిక్షించుట = దండించుట, కీడు = అపకారము, కాదు, కృపచేసితివి = దయఁజూచితివి, ఈశ్వర = ఓ ప్రభూ నిన్ను, భక్తితోడ, సేవించుటకంటెన్, వైరమునన్ = శత్రుత్వముచేత, వేగమే, చేరఁగన్ వచ్చున్ = పొందవచ్చును, నీ అంచితనారసింహతనువు = ఒప్పుచున్న నరసింహరూపము, అద్భుతము = ఆశ్చర్యము, అందఱును, ఆపద = అపాయమును, పాసిరి = తొలంగిరి.

తా. నారాయణా! సనకాదులశాపముచేత రాక్షసుఁడై పుట్టిన వీని నీవు దండించుట వానికి క్షేమమే కాని ఎగ్గుగాదు. నిన్ను భక్తిగలిగి సేవించిన వారికంటె విరోధమును సాధించినవారే త్వరగా కడతేఱుదురు. ఈ నీ నరసింహరూపము ఎందును కని విని యెఱుఁగని ఆశ్చర్యకరమైనది. నీకృపచేత అందఱికష్టములును తీఱినవి.

వ. ఇట్లు బ్రహ్మరుద్రేంద్రసిద్ధసాధ్యపురస్సరులైన దేవముఖ్యు లందఱు నెడ గలిగి యనేకప్రకారంబుల వినుతించి రందు రోషవిజృంభమాణుం డయిననరసింహదేవునిడగ్గఱఁ జేర వెఱచి లక్ష్మీదేవిం బిలచి యిట్లనిరి. 339

టీ. బ్రహ్మ...పురస్సరులు = బ్రహ్మ ఈశ్వరుఁడు మొదలగువారు, ఐన, దేవముఖ్యులు = దేవశ్రేష్ఠులు, అందఱును, ఎడకలిగి = దూరముగా నుండి, అనేకప్రకారంబులన్ = నానావిధములుగా, వినుతించిరి = పొగడిరి. అందు = వారలలో, ఒక్కఁడైనను, రోషవిజృంభమాణుండు = కోపముచేఁ జెలరేఁగియున్నవాఁడు, అయిన, నరసింహదేవుని, డగ్గఱన్ చేరన్ వెఱచి = దగ్గఱకుఁ బోవ భయపడి, లక్ష్మీదేవిని, పిలచి, ఇట్లనిరి.

క. హరికిం బట్టపుదేవివి
హరిసేవానిపుణమతివి హరిగతివి సదా
హరిరతివి నీవు చని నర
హరిరోషము డింపవమ్మ హరివరమధ్యా. 340

టీ. హరివరమధ్యా = సింహమునడుమువంటి నడుముగల ఓలక్ష్మీ! హరికిన్ = విష్ణువునకు, పట్టపుదేవివి, హరి...మతివి = విష్ణుకైంకర్యమున నేర్పరివైనదానవు, హరిగతివి = శ్రీహరియే దిక్కుగాఁ గలదానవు, నీవు, చని, హరిరోషము = విష్ణునికోపమును, డింపవమ్మ = తగ్గించవమ్మా.

తా. ఓలక్ష్మీ! నీవు శ్రీహరికి ప్రియభార్యవును, ఆయనను సేవించి మెప్పువడసినదానవును, ఆహరియే దిక్కైనదానవును, హరియందే చిత్తముంచినదానవు గనుక ఇప్పుడు కోపముచేత అత్యుగ్రరూపుఁడైన ఈనరసింహాకృతిని దాల్చిన విష్ణునికోపమును మెల్లగా తగ్గించుము అని వేఁడిరి.

వ. అనిన నియ్యకొని మహోత్కంఠతోడ నాకలకంఠకంఠి నర
కంఠీరవునియుపకంఠంబునకుం జని. 341

టీ. ఇయ్యకొని = ఒప్పుకొని, మహోత్కంఠతోడన్ = గొప్ప కౌతుకముతో, కలకంఠకంఠి = కోకిలపలుకులవంటి పలుకులుగల ఆలక్ష్మీదేవి, నర...కంఠంబునకున్ = నరసింహస్వామిసమీపమునకు, చని = పోయి. (కోకిలపలుకు అనుటచే దుఃఖక్రోధాదిసమయములందును మనోహరము అని భావము.)

సీ. ప్రళయార్కబింబంబుపగిది నున్నది గాని
నెమ్మోము పూర్ణేందునిభము గాదు
శిఖిశిఖాసంఘంబుచెలువు చూపెడుఁగాని
చూడ్కి ప్రసాదభాసురము గాదు
వీరరౌద్రాద్భుతావేశ మొప్పెడుఁ గాని
భూరికృపారసస్ఫూర్తి గాదు

భయదదంష్ట్రాంకురప్రభలు గప్పెడుఁ గాని
దరహాసితాంబుజాతంబు గాదు
తే. కఠినఖరనారసింహావిగ్రహము గాని
కామినీజనసులభవిగ్రహము గాదు
విన్నదియుఁ గాదు తొల్లి నే విష్ణువలనఁ
గన్నదియుఁ గాదు భీషణాకార మనుచు. 242

టీ. వక్త్రము = నిండు మొగము, ప్రళయార్కబింబముపగిదిన్ = ప్రళయకాలమందలి సూర్యునివలె, ఉన్నది కాని, పూర్ణేందునిభము = పూర్ణచంద్రునివలె ప్రసన్నముగా లేదు. చూడ్కి = చూపు, శిఖి...చెలువు = నిప్పుమంటల ప్రోవులపోలికను, చూపెడున్ = చూపించును, కాని, ప్రసాదభాసురము = చల్లదనముచేఁ బ్రకాశించునది, కాదు, వీర...వేశము = వీరరసముచేత భయజనకమై ఆశ్చర్యమైన సంరంభము, ఒప్పెడున్ = కనుపట్టును, కాని, భూరికృపారసస్ఫూర్తి = మెండైన దయయొక్క పొందు, కాదు = లేదు, భయద...ప్రభలు = భయము బుట్టించు మొలకకోఱల కాంతులు, కప్పెడున్ = ముట్టుకొనును, కాని, దరహాసితాంబుజాతంబు = కొంచెముగాఁ బూచియున్న కమలమువంటిది, కాదు, కఠిన...హము = క్రూరము ఘోరమునైన నరసింహరూపము, కామినీ...గ్రహము = స్త్రీలకు వశమైన విలాసరూపము, తొల్లి = ఇంతకుముందు, నేను, విష్ణువలనన్ = విష్ణుమూర్తివలన, విన్నది, కన్నది = చూచినదియు, కాదు, భీషణాకారము = ఇదియొకభయంకరమైన క్రొత్తరూపము, అనుచు = అని చెప్పుచు.

తా. ముఖము ప్రళయకాలమందలిసూర్యునివలె నున్నది కాని పూర్ణచంద్రునివలె లేదు. చూపు మంటలు గ్రక్కుచున్నదేకాని చల్లఁగా నుండదు. భయంకరమైన శౌర్యరసమున్నది గాని ఎచ్చటను దయారసము గనఁబడదు. క్రూరములైన కోఱలు గన్పట్టును గాని నగుమోము గానరాదు. క్రూరమైన నరసింహరూపముగాని అందువారు దగ్గఱకుఁ బోఁదగిన స్థితి

టీ. మహాభాగవతశేఖరుండు = గొప్ప విష్ణుభక్తులలో మేలైనవాఁడు, బాలకుండు = ప్రహ్లాదకుమారుఁడు, కరకమలంబులు = తామరలవంటి చేతులను, మందగమనంబునన్ = తిన్నని నడకతో, అమందవినయవివేకంబులన్ = తక్కువపడని అడఁకువచేతను తెలివిచేతను, నరసింహదేవుని సన్నిధికిన్ = నరసింహమూర్తిదగ్గఱకు, చని, సాష్టాంగదండప్రణామంబు = కాలుచేతులు రొమ్ము నొసలు భుజములు నేల దాఁకునట్లు కఱ్ఱవలె సాగిలఁబడి మ్రొక్కుటను, చేసినన్, భక్తపరాధీనుఁడు = సేవకులకు వశమైనవాఁడు, అగు, ఆయీశ్వరుండు = ఆనరసింహమూర్తి, అలోకించి = చూచి.

ఉ. ప్రాభవ మొప్ప నుత్కటకృపామతి యై కదియంగఁ జీరి సం
శోభితదృష్టిసంఘములఁ జూచుచు బాలునిమౌళియందు లో
కాభినుతుండు పెట్టె నసురాంతకుఁ డుద్భటకాలసర్పభీ
తాభయదానశస్తము ననర్గళమంగళహేతుహస్తమున్. 347

టీ. ప్రాభవము = ఠీవి, ఒప్పన్ = మెఱయఁగా, ఉత్కటకృపామతి = అతిశయమైన దయగలవాఁడు, ఐ, కదియంగన్ = దగ్గఱగా, చీరి = పిలచి, సంశోభితదృష్టిసంఘములన్ = ఇంపుగాఁ బ్రకాశించు కన్నులతో, చూచుచు, లోకాభినుతుండు = లోకములచేఁ బొగడఁబడిన, అసురాంతకుఁడు = రాక్షసుల సంహరించు శ్రీనరసింహమూర్తి, బాలునిమౌళియందు = ప్రహ్లాదుని తలమీఁద, ఉద్భట...శస్తము = కౄరమైనకాలమనుపామునకు భయపడినవారికి అభయమిచ్చుటయందు శ్రేష్ఠమైన, అనర్గళ...హస్తమున్ = అడ్డులేని శుభములకు కారణమైన హస్తమును, పెట్టెను.

తా. రాజసముమీఱ చేరఁబిలిచి అతిశయమైన కరుణగలవాఁడై చల్లనిచూపులఁ జూచుచు, సర్వలోకములచేతను పొగడఁబడిన ఆనరసింహ

మూర్తి సంసారభయభ్రాంతులకు అభయదానము చేయునట్టి తనపావన హస్తమును ప్రహ్లాదునిశిరమందుంచెను.

వ. ఇట్లు హరికరస్పర్శనంబున భయవిరహితుండును బ్రహ్మజ్ఞాన సహితుండును బులకితదేహుండును సముత్పన్నసంతోష బాష్పసలిల ధారాసమూహుండును బ్రేమాతిశయగద్గద భాషణుండును వినయవివేకభూషణుండును నేకాగ్రచిత్తుం డును భక్తిపరాయత్తుండును నయి యద్దేవునిచరణకమలం బులు దనహృదయంబున నిలిపికొని కరకమలంబులు ముకు ళించి యిట్లని వినుతించె. 348

టీ. హరికరస్పర్శనంబునన్=నరసింహునిచేతి తాఁకుడువలన, భయ విరహితుండును=భయము లేనివాఁడును, బ్రహ్మజ్ఞానసహితుండును = బ్రహ్మ స్వరూపమును దెలిసినవాఁడును, పులకితదేహుండును=గగుర్పాటు చెందిన శరీరముగలవాఁడును, సముత్పన్న...హుండును=పుట్టిన ఆనందబాష్ప జ్వాల ములధారలగుంపు కలవాఁడును, ప్రేమాతి...షణుండును = భక్తివిశేషము చేత డగ్గుత్తికపడిన మాటలు గలవాఁడును, వినయ వివేకభూషణుండును = అడఁకువ జ్ఞానము అలంకారములుగాఁ గలవాఁడును, ఏకాగ్రచిత్తుండును= విష్ణువునందే తొలఁగనిమనస్సు గలవాఁడును, భక్తిపరాయత్తుండును=భక్తికి వశమైనవాఁడును, అయి, అద్దేవునిచరణకమలంబులు = ఆస్వామియడుగుఁ దామరలు, తనహృదయంబునన్=తనమనస్సులో, నిలిపికొని=ఉంచుకొని, కరకమలంబులు=కేలుఁదామరలు, ముకుళించి=దోయిలించి, వినుతించెన్= పొగడెను.

మ. అమరుల్ సిద్ధులు సంయమీశ్వరులు బ్రహ్మాదుల్ సతాత్పర్యచి
త్తములన్ నిన్నుబహుప్రకారముల నిత్యంబున్ విచారించిపా
రము ముట్టన్ నుతిసేయ నోపరఁట నే రక్షస్తనూజుండ న
ర్వమదోద్రిక్తుఁడ బాలుఁడన్ జడమతిన్ వర్ణింప శక్తుండనే.

టీ. మహాభాగవతశేఖరుండు = గొప్ప విష్ణుభక్తులలో మేలైనవాఁడు, బాలకుండు = ప్రహ్లాదకుమారుఁడు, కరకమలంబులు = తామరలవంటి చేతులను, మందగమనంబునన్ = తిన్నని నడకతో, అమందవినయవివేకంబులన్ = తక్కువపడని అడఁకువచేతను తెలివిచేతను, నరసింహదేవుని సన్నిధికిన్ = నరసింహమూర్తిదగ్గఱకు, చని, సాష్టాంగదండప్రణామంబు = కాలుచేతులు ఱొమ్ము నొసలు భుజములు నేల దాఁకునట్లు కఱ్ఱవలె సాగిలఁబడి మ్రొక్కుటను, చేసినన్, భక్తపరాధీనుఁడు = సేవకులకు వశమైనవాఁడు, అగు, అయ్యీశ్వరుండు = ఆనరసింహమూర్తి, అవలోకించి = చూచి.

ఉ. ప్రాభవ మొప్ప నుత్కటకృపామతి యై కదియంగఁ జీరి సం
క్షోభితదృష్టిసంఘములఁ జూచుచు బాలునిమౌళియందు లో
కాభినుతుండు పెట్టె నసురాంతకుఁ డుద్భటకాలసర్పభీ
తాభయదానశస్తము ననర్గళమంగళహేతుహస్తమున్. 347

టీ. ప్రాభవము = శివి, ఒప్పన్ = మెఱయఁగా, ఉత్కటకృపామతి = అతిశయమైన దయగలవాఁడు, ఐ, కదియంగన్ = దగ్గఱగా, చీరి = పిలచి, సంక్షోభితదృష్టిసంఘములన్ = ఇంపుగాఁ బ్రకాశించు కన్నులతో, చూచుచు, లోకాభినుతుండు = లోకములచేఁ బొగడఁబడిన, అసురాంతకుఁడు = రాక్షసుల సంహరించు శ్రీనరసింహమూర్తి, బాలునిమౌళియందు = ప్రహ్లాదుని తలమీఁద, ఉద్భట...శస్తము = క్రూరమైనకాలమనుపామునకు భయపడినవారికి అభయమిచ్చుటయందు శ్రేష్ఠమైన, అనర్గళ...హస్తమున్ = అడ్డులేని శుభములకు కారణమైన హస్తమును, పెట్టెను.

తా. రాజసముమీఱ చేరఁబిలిచి అతిశయమైన కరుణగలవాఁడై చల్లనిచూపులఁ జూచుచు, సర్వలోకములచేతను పొగడఁబడిన ఆనరసింహ

మూర్తి సంసారభయభ్రాంతులకు అభయదానము చేయునట్టి తనపావన హస్తమును ప్రహ్లాదునిశిరమందుంచెను.

వ. ఇట్లు హరికరస్పర్శనంబున భయవిరహితుండును బ్రహ్మజ్ఞాన సహితుండును బులకితదేహుండును సముత్పన్నసంతోష బాష్పసలిలధారాసమూహుండును బ్రేమాతిశయగద్గద భాషణుండును వినయవివేకభూషణుండును నేకాగ్రచిత్తుం డును భక్తిపరాయత్తుండును నయి యద్దేవునిచరణకమలం బులు దనహృదయంబున నిలిపికొని కరకమలంబులు ముకు ళించి యిట్లని వినుతించె. 348

టీ. హరికరస్పర్శనంబునన్=నరసింహునిచేతి తాఁకుడువలన, భయవిరహితుండును=భయము లేనివాఁడును, బ్రహ్మజ్ఞానసహితుండును = బ్రహ్మ స్వరూపమును దెలిసినవాఁడును, పులకితదేహుండును=గగుర్పాటు చెందిన శరీరముగలవాఁడును, సముత్పన్న...హుండును=పుట్టిన ఆనందబాష్ప జలముల ధారలగుంపు కలవాఁడును, ప్రేమాతి...ణుండును = భక్తివిశేషము చేత డగ్గుత్తికపడిన మాటలు గలవాఁడును, వినయవివేకభూషణుండును = అడఁకువ జ్ఞానము అలంకారములుగాఁ గలవాఁడును, ఏకాగ్రచిత్తుండును= విష్ణువునందే తొలఁగనిమనస్సు గలవాఁడును, భక్తిపరాయత్తుండును=భక్తికి వశమైనవాఁడును, అయి, ఆద్దేవునిచరణకమలంబులు = ఆస్వామియడుగుఁ దామరలు, తనహృదయంబునన్=తనమనస్సులో, నిలిపికొని=ఉంచుకొని, కరకమలంబులు=కేలుఁదామరలు, ముకుళించి=దోయిలించి, వినుతించెన్= పొగడెను.

మ. అమరుల్ సిద్ధులు సంయమీశ్వరులు బ్రహ్మాదుల్ సతాత్పర్యచి
త్తములన్ నిన్ను బహుప్రకారముల నిత్యంబున్ విచారించిపా
రము ముట్టన్ నుతిసేయ నోపరఁట నే రక్షస్తనూజుండ గ
ర్వమదోద్రిక్తుఁడ బాలుఁడన్ జడమతిన్ వర్ణింప శక్తుండనే.

టీ. అమరుల్ = దేవతలు, సిద్ధులు, సంయమీశ్వరులు = మునిశ్రేష్ఠులు, బ్రహ్మాదుల్ = బ్రహ్మ మొదలగువారు, సతాత్పర్యచిత్తములన్ = ఏకాగ్రత గల మనస్సులతో, బహుప్రకారములన్ = పలువిధములచే, నిన్ను, విచారించి, పారముముట్టన్ = తుదిదాఁక, నుతి = స్తోత్రము, సేయ నోపరఁట, నేను, (ప్రహ్లాదుఁడు) రక్షస్తనూజుండన్ = తమోగుణప్రధానుఁడైనరాక్షసునికొడుకును, గర్వమదోద్రిక్తుఁడన్ = అభిమానము పొగరు మెండుకొని యుండవాఁడను, బాలుఁడన్ = కుఱ్ఱవాఁడను, జడమతిన్ = మూర్ఖుఁడను, వర్ణింపన్ = పొగడుటకు, శక్తుండనే = సమర్థుఁడనా? (కాను)

తా. స్వామీ! నిన్ను ఎల్లదేవతలు సిద్ధులు మునులు బ్రహ్మాదులుగూడ చక్కఁగా తెలిసి తుదముట్ట వర్ణింపఁ జాలకుండఁగా రాక్షసబాలుఁడను పొగరుబోతుఁదనమునం గలవాఁడను శిశువును మూర్ఖుఁడను నేను నిన్ను చక్కఁగాఁ బొగడ నేరుతునా దేవా కరుణింపుము.

మ. తపముం వంశముఁ దేజముం శ్రుతము సౌందర్యంబు నుద్యో
గముం, నిపుణత్వంబు ప్రతాపపౌరుషములుం నిష్ఠాబలప్రజ్ఞలుం
జపహోమంబులుఁ జాల వీశ్వర భవత్సంతుష్టికై దంతియూ
థపుచందంబున భక్తిచేయ వలయుం దాత్పర్యసంయుక్తుఁడై.

టీ. ఈశ్వర = ఓ ప్రభూ! భవత్సంతుష్టికై = నిన్ను మెప్పించుటకొఱకు, తపమును, వంశము = కులమును, తేజముం = కాంతియు, శ్రుతము = వేదశాస్త్రాధ్యయనమును, సౌందర్యంబు = అందమును, ఉద్యోగముం = ప్రయత్నమును, నిపుణత్వంబు = నేర్పరితనమున్ను, ప్రతాపపౌరుషములుం = పరాక్రమము పురుషకారమును, నిష్ఠాబలప్రజ్ఞలుం = మరణావధి పూనిక గలిగి వ్రతచర్యనుండుట, బలము సామర్థ్యమును, జపహోమంబులును, చాలవు = ప్రయోజకములుగావు, తాత్పర్యసంయుక్తుఁడై = ఏకదేశధ్యానము గలవాఁడై, దంతియూథపుచందంబునన్ = గజేంద్రునివలె, భక్తి = పూజాధ్యానరాగము, చేయవలయును.

తా. దేవా! నిన్ను మెప్పించి నీదయ సంపాదించుటకు తపస్సు వంశము తేజస్సు శాస్త్రాధ్యయనము అందము ప్రయత్నము చేయు పరాక్రమము పౌరుషము వ్రతచర్యలు బలము సామర్థ్యము జపము హోమము ఇట్టి వెన్నియైనను ఉపయోగములు గావు. గజేంద్రునివలె గాఢభక్తి గలిగినచోఁ దప్పక ఫలియించును గాని ఇఁక నేవియు కొఱగావు.

మ. అమలజ్ఞానసుదానధర్మరతిసత్యక్షాంతినిర్మత్సర
త్వములన్ యజ్ఞతపోనసూయలఁ గడున్ దర్పించుధాత్రీసురో
త్తముకంటెన్ శ్వపచుండు ముఖ్యుఁడు మనోర్థప్రాణవాక్కర్మ
ముల్, సమతన్ నిన్ను నయించెనేని నిజవంశశ్రీకరుండౌఁ దుదిన్.

టీ. అమల...త్వములన్=నిర్మలమైన జ్ఞానము మంచిదానము నీతి నిజము ఓర్పు ఒకరి పెంపున కసూయపడకుండుట అనుగుణములచేతను, యజ్ఞతపోనసూయలన్ = యాగములు తపస్సు అసూయలేకుండుట వీనిచేతను, కడున్ = మిగుల, దర్పించుధాత్రీసురోత్తముకంటెన్ = గర్వపడు బ్రాహ్మణశ్రేష్ఠునికంటె, మనోర్థ ప్రాణ వాక్కర్మముల్ = మనము ధనము ప్రాణము వాక్కును, నిన్ను, నయించెన్ ఏనిన్ = పొందించెనేని, శ్వపచుండు=(కుక్కలఁ జంపి తిను) మాలవాఁడు, ముఖ్యుండు = శ్రేష్ఠుఁడు, తుదిన్=అంతమున, నిజవంశశ్రీకరుండు=తనకులమునకు వన్నె దెచ్చువాఁడు, ఔను.

తా. దేవా! పరిశుద్ధమైనజ్ఞానము, దానము, ధర్మము, సత్యము, శమము, ఒకరిమేలునకు వగవకునికి, యాగములు, తపస్సు, అసూయ లేకుండుట అను సద్గుణములు గలవాఁడఁగదా యని గర్వపడు బ్రాహ్మణునికంటె మనస్సు ప్రాణము ధనము వాక్కు నీయధీనము లని నమ్మి భక్తిపరుఁడైన మాలవాఁడు మేలు. అట్టి యెడతెగని భక్తిగలవాఁడు తాను తరించి తన వంశమునకు కీర్తి తెచ్చును.

సీ. అజ్ఞుండు చేసినయపరాధములను జే
పట్టఁ డీశ్వరుఁడు కృపాళుఁ డగుటఁ

జేపట్టు నొకచోట సిద్ధ మీశ్వరునకు
నర్థంబు లే కుండు నతఁడు పూర్ణుఁ
డైన నర్థము లీశ్వరార్పణంబులు గాఁగఁ
జేయుట ధర్మంబు చేసెనేని
నద్దంబుఁ జూచిననళికలలామంబు
ప్రతిబింబితం బగుపగిది మరల
తే. నర్థములు దోఁచుఁ గావున నధికబుద్ధి
భక్తి సేయంగ నలయును భక్తి గాని
మెచ్చఁ డర్థంబు లొసఁగెడు మేరలందుఁ
బరమకరుణుండు హరి భక్తిబాంధవుండు. 352

టీ. ఈశ్వరుఁడు=దేవుఁడు, అజ్ఞుండు = తెలియనివాఁడు, చేసిన, అపరాధములన్=తప్పిదములను, చేపట్టఁడు=గ్రహింపఁడు, కృపాళుఁడు=దయగలవాఁడు, అగుటచేత, ఒకచోటన్ = ఒకసమయమందు, అపరాధుని, చేపట్టును=చేరఁదీయును (దయసేయును). సిద్ధము=నిజము, ఈశ్వరునకున్=విష్ణునకు, అర్థంబు=ఒకయర్థమును, లేకుండును, అతఁడు=ఆదేవుఁడు, పూర్ణుఁడు = అంతట నిండియుండువాఁడు, ఐనను, అర్థములు = మనయెల్ల విషయములు, ఈశ్వరార్పణంబులుగాఁగఁజేయుట=ఈశ్వరునకు సమర్పించుట, ధర్మంబు=న్యాయము, చేసినన్=ఇట్లు సమస్తమును ఈశ్వరార్పితము సేయఁగా, అద్దము, చూడఁగా, అళికలలామంబు = నొసటిమీఁది చుక్క, ప్రతిబింబితము=మాఱురూపముగలది, అగుపగిదిన్=అయినతీరున, మరల, అర్థములు=అభగవదర్పితములైన వస్తువులు, తోఁచును=లభించును, కావున, అధికబుద్ధిన్=మిక్కుటమైన ఆదరభావముతో, భక్తి, చేయంగ వలయును, హరి, అర్థంబులు=పదార్థములు, ఒసఁగెడి మేరలంగున్=సమర్పించుపట్టుల, భక్తిగాని, మెచ్చఁడు=మెచ్చుకొనఁడు, అతఁడు, పరమకరుణుండు = మిక్కిలి దయగలవాఁడు, భక్తబాంధవుండు = భక్తిచుట్టమైన వాఁడు.

తా. తెలియనివాఁడు చేసినతప్పులను దేవుఁడు లెక్కఁగొనఁడు. ఒకప్పుడు ఆయన ఆర్తివానియందు ప్రేమకలవాఁడే యగును. నిజముగా దేవునకు ఒకపదార్థము కావలసినదిలేదు. అతఁడు అన్నిట నిండియుండు వాఁడు. మనముమాత్రము మనయొల్ల యర్థములు ఈశ్వరార్పణము చేయవల సినదే. అటు చేసితిమేని అవియే మరల మనకు అద్దములోని ప్రతిబింబము వలె లభించును. అనఁగా ఈశ్వరుఁడు సర్వజంతురూపి గనుక మన చేయు కార్యములు మనలోనే మనకు మరల నగపడు నని భావము. కనుక కర్మలు చేయుట అవి యీశ్వరున కర్పించుట ఒక పెద్ద కాదు. ఎప్పుడును ఆదేవుని యెడ భక్తియే చేయవలయును. అతఁడు భక్తికి సంతసించినట్లు మనము ఏది సమర్పించినను సంతసింపఁడు. ఆయన చాలదయగలవాఁడు. భక్తి చుట్టమైనవాఁడు.

క. కావున నల్పుఁడ సంస్తుతిఁ
గావించెద వెఱపు లేక కలనేరుపునన్
నీవర్ణనమున ముక్తికిఁ
బోవు నవిద్యను జయించి పురుషుఁ డనంతా. 353

టీ. కావునన్ = అట్లగుటంజేసి, అల్పుఁడన్ = అధముఁడను, నేను, కలనేరుపునన్ = ఉన్నంత చమత్కారమునో, వెఱపు = భయము (సిగ్గు), లేక, సంస్తుతి గావించెదన్ = స్తోత్రము చేయుదును, అనంతా = అవ్యయుఁడగు నోదేవా, పురుషుఁడు, నీవర్ణనమునన్ = నిన్ను స్తోత్రము చేయుటచేత, అవిద్యను = అజ్ఞానమును, జయించి, ముక్తికిన్ = మోక్షము నకు, పోవును.

తా. కనుక ఓయీశ్వరా! మూఢబుద్ధినైన నేను నేర్పుకొలఁది నిన్ను స్తోత్రము చేసెదను. ఏపురుషుఁడైనను నిన్ను త్రికరణశుద్ధిగా స్తోత్రముచేసెనేని ఉత్తమగతి పొందును.

సీ. సత్త్వాకరుఁడ వైన సర్వేశ నీయాజ్ఞ
శిరముల నిడుకొని చేయువారు
బ్రహ్మాదు లమరులు భయ మందు చున్నారు
నీభీషణాకృతి నేఁడు చూచి
రోషంబు మాను నీరుచిరవిగ్రహములు
కల్యాణకరములు గాని భీతి
కరములు గావు లోకములకు వృశ్చిక
పన్నగంబులభంగి భయముఁ జేయు
తే. నసుర మర్దించితివి సాధుహర్ష మయ్యె
నవతరించినపని దీఱె నలుక యేల
కలుషహారివి సంతోషకారి వనుచు
నిన్నుఁ దలఁతురు లోకులు నిర్మలాత్మ. 354

టీ. సత్త్వాకరుఁడవు = సత్త్వగుణప్రధానుఁడవు, అయిన, సర్వేశ = సమస్తమునకు ఈశ్వరుఁడవైన యోనరసింహా! నీయాజ్ఞ, శిరములన్ = తలలయందు, ఇడుకొని = ఉంచుకొని, చేయువారు, అయిన, బ్రహ్మాదులు = బ్రహ్మమొదలైన, అమరులు = దేవతలు, నేఁడు = ఇప్పుడు, నీభీషణాకృతి = నీభయంకరమైన ఆకారము, చూచి, భయమందుచున్నారు = భయపడుచున్నారు, రోషంబు = కోపము, మానుము = విడుము, నీరుచిరవిగ్రహములు = అందములైన నీ యవతారవిశేషములు, కల్యాణకరములు = మంగళప్రదములైనవి, కాని, భీకరములు = భయమును గలిగించునవి, కావు, లోకములకు, వృశ్చి...భంగిన్ = తేళ్లపాములవలె, భయము = బాధ, చేయు, అసురన్ = రాక్షసుని, మర్దించితివి = చంపినాఁడవు, సాధుహర్షము = సజ్జనులకు సంతోషము, అయ్యెను, అవతరించినపని, తీఱెన్ = ముగిసెను. అలుక = కోపము, ఏల = ఎందులకు, నిర్మలాత్మ = పరిశుద్ధ స్వరూపముగలయోస్వామీ! కలుషహారివి = పాపముల

నడఁచువాఁడవు, సంతోషకారివి = ఆనందమునిచ్చువాఁడవు, అనుచును, లోకులు, నిన్ను, దలఁతురు.

తా. దేవా! నీవు రజోగుణము తమోగుణము నెఱుఁగక కేవలసత్త్వగుణమే ముఖ్యముగాఁ గలవాఁడవు. ఎల్లప్పుడు నీయాజ్ఞ యనిన తలతోఁ జేయు నీ బ్రహ్మాదిదేవతలందఱును నేఁడు నీభయంకరరూపము జూచి గడగడ వడఁకుచున్నారు. కావున కోప ముడుగుము. నీవెప్పుడును శుభకరమై ఆనందమైనరూపము గలవాఁడవుగాని భయంకరుఁడవుగావు. తేళ్లుపాములవలె లోకమునకు కంటకుఁడైన మాయయ్యను జంపితివి. సజ్జనులందఱు సంతసించినారు. నీవు ఎందులకవతరించినావో ఆపని ముగిసినది. ఇంకను క్రోధమెందులకు? లోకులందఱు నిన్ను క్రోధాదికలుషముల నడఁచువాఁడవనియు, సంతసమును గలుగఁజేయువాఁడవనియు తలఁతురు.

మ. ఖరదంష్ట్రాభ్రుకుటీసటానఖయు నుగ్రధ్వానయుక్ రక్తకే
సరయుక్ దీర్ఘతరాంత్రమాలికయు భాస్వన్నేత్రయు నైననీ
నరసింహాకృతిఁ జూచి నే వెఱవఁ బూర్ణక్రూరదుర్వారదు
ర్భరసంసారదవాగ్నికిన్ వెఱతు నీపాదాశ్రయుం జేయవే. 355

టీ. ఖర...నఖయుక్ = క్రూరములైన కోఱలు బొమముడి జడలు గోరులు గలదియు, ఉగ్రధ్వానయుక్ = భయంకరమైన గర్జితములు గలదియు, రక్తకేసరయుక్ = ఎఱ్ఱని జూలు గలదియు, దీర్ఘతరాంత్రమాలికయుక్ = పొడవైన ప్రేవుల పేరులు గలదియు, భాస్వన్నేత్రయుక్ = నిప్పులొలుకు కన్నులు గలదియు, ఐన, నీ నరసింహాకృతిన్ = నరసింహరూపమును, చూచి, నేను, వెఱవన్ = భయమందను, పూర్ణ...గ్నికిన్ = తరుగని ఘోరమై ఆపరానిదియు సైఁపరానిదైన సంసారమను కార్చిచ్చునకు, వెఱతును, నన్ను, నీపాదాశ్రయున్ = నీపాదములే నివాసముగాఁగల వానిఁగా, చేయవే.

తా. ఓనరసింహమూర్తీ! భయంకరమైన కోఱలు బొమముడి జడలు గోళ్లు నిప్పులురాలు కన్నులుగల నీ నరసింహరూపముజూచి నే భయమొం

దుటలేదు. నా కిప్పుడు ఈ చెడ్డసంసారమువలననే భయము, కనుక నన్ను నీ పాదములయందుఁ జేరిచి రక్షింపుము.

వ. దేవా సకలయోనులందును సుఖవియోగదుఃఖసంయోగ సంజనితం బైనశోకానలంబున దందహ్యమానుండ నై దుఃఖనివారకంబు గాని దేహాద్యభిమానంబున మోహి తుండనై పరిభ్రమించుచున్నయేను నాకుం బ్రియుండవు సఖుండవుఁ బరదేవతవు నైన నీ వగుబ్రహ్మగీతంబు లయినలీ లావతారకథావిశేషంబులఁ బఠియించుచు రాగాదినిర్ముక్తుం డనై దుఃఖపుంజంబులఁ దరియించి భవదీయచరణకమల స్మరణసేవానిపుణులైనభక్తులం జేరి యుండెద బాలునిఁ దల్లిదండ్రులును రోగిని వైద్యదత్తం బయినయౌషధంబును సముద్రంబున మునింగెడివాని నావయును దక్కొరులు రక్షింప నేరని తెఱంగున సంసారతాపసంతప్యమానుం డై నీచేత నుపేక్షితుం డయినవాని నుద్ధరింప నీవు దక్క నన్యుం డు సమర్థుండు గాఁడు జగంబుల నెవ్వం డేమికృత్యంబు నె వ్వనిచేతం బ్రేరితుండై యేయింద్రియంబులం జేసి యేమిటి కొఱకు నెవ్వనికి సంబంధి యై యేస్థలంబున నేసమయంబు నం దేమిరూపంబున నేగుణంబున నపరంబైన జనకాదిభా వంబు నుత్పాదించి పరం బయినబ్రహ్మాదిభావంబున రూ పాంతరంబు నొందించు నట్టివివిధప్రకారంబు లన్నియు నిత్య ముక్తుండవు రక్షకుండవు నైననీవ నీయంశం బైనపురుషునికి నీయనుగ్రహంబునఁ గాలంబుచేతం బ్రేరితమై కర్మమయం బును బలయుతంబును బ్రధానలింగంబును నైనమనంబును నీమాయ సృజియించు నవిద్యార్పితవికారంబును వేదోక్త

కర్మప్రధానంబును సంసారచక్రాత్మకం బైనయీమనమున నిన్ను సేవింపక నియమించి తరియింప నొక్కండును సమర్థుండు లేఁడు విజ్ఞాననిర్జితబుద్ధిగుణుండవు నీవు నీవలన వశీకృతకార్యసాధనశక్తి యైనకాలంబు మాయతోఁడం గూడ షోడశవికారయుక్తం బయినసంసారచక్రంబుఁ జేయుచుండు సంసారదావదహనతంతప్యమానుండ నగునన్ను రక్షింపుము. 356

టీ. సకలయోనులయందును = ఎల్లజంతుదేహములయందును, సుఖ...జనితంబు=సుఖముతొలఁగుట కష్టమువచ్చుటచేత పుట్టించఁబడినది,వన, శోకానలంబునన్ = దుఃఖాగ్నిచేత, దందహ్యమానుండును = మిక్కిలి కాల్పఁబడినవాఁడును, దుఃఖనివారణంబు=దుఃఖములను మాన్పునది, కాని, దేహాద్యభిమానంబునన్=దేహము మొదలగువానియందలి మమకారముచేత, మోహితుఁడను = మోసపుచ్చఁ బడినవాఁడను, పరిభ్రమించు = తిరుగు, ప్రియుండవు=ఇష్టుఁడవు, సఖుండవు = స్నేహితుఁడవు, పరదేవతవు=ఉత్తముదైవతమవు, బ్రహ్మగీతంబులు = బ్రహ్మదేవునిచేఁ బాడఁబడినవి, లీలావతార కథావిశేషంబులన్=విలాసముకొఱకైన పుట్టుకలయొక్క వృత్తాంతములు, చరియించుచు=తిరుగుచు, రాగాది నిర్ముక్తుండను=రాగద్వేషములు మొదలైనవి లేనివాఁడను, దుఃఖపుంజంబులు = కష్టములసమూహములను, తరియించి=దాఁటి, భవదీయ...నిపుణులు = నీపాదపద్మములను తలఁచుట కొలుచుట వీనియందు నేర్పరులైనవారు, వైద్యదత్తంబు = వెజ్జుచే నియ్యఁబడినది, తక్కొరులు=ఇతరులు, సంసార...నుండు=సంసారపు వేఁడిమిచే నుడికినవాఁడు, ఉపేక్షితుఁడు = విచారించఁబడనివాఁడు, ఉద్ధరింపన్ = కడతేర్చుటకు, సమర్థుఁడు=చాలినవాఁడు, కృత్యంబు=కార్యము, ప్రేరితుఁడు=పురికొలుపఁబడినవాఁడు, సంబంధి=సంబంధముగలవాఁడు, అపరంబు=మఱియొకటి, జనకాదిభావంబు = తండ్రి మొదలగువాని ధర్మము, ఉత్సా

దించి=పుట్టించి, బ్రహ్మాదిభావంబునన్=బ్రహ్మత్వము పొందఁగుదానిచేత, రూపాంతరంబు=మఱియొక్క ఆకారము, వివిధప్రకారంబులు=పలుదెఱఁగులు, నిత్యముక్తుఁడవు=ఎప్పుడేని విషయములఁ దగులువడనివాఁడవు, రక్షకుండవు=కాచువాఁడవు, నీయంశము=నీభాగము, నీయనుగ్రహంబునన్ = నీదయచేత, ప్రేరిత=ఉత్సహింపఁబడినది, కర్మమయంబు = కర్మరూపము, బలయుతము=బలముతోఁగూడినది, ప్రధానలింగంబు = ముఖ్యమైనగుఱుతు గలది, సృజించున్=పుట్టించును, అవిద్యార్పితవికారంబును = మాయ చేత కల్పించి పెట్టఁబడిన మార్పుగలదియు, వేదోక్తకర్మప్రధానంబు = వేదములలోఁ జెప్పఁబడిన కర్మలే ముఖ్యముగాఁగల, సంసారచక్రాత్మకంబు = సంసారసమూహరూపమైనది, నియమించి=కట్టుచేసికొని, సమర్థుఁడు = నేర్చినవాఁడు, విజ్ఞాన...గుణుండవు=విశేషమైనజ్ఞానముచే జయింపఁబడిన బుద్ధికి స్వభావమైన జడత్వముగలవాఁడు, వశీ...శక్తి = స్వాధీనముచేసికోఁబడిన పనులఁ జక్కఁజేయునదియైన సామర్థ్యము గలది, షోడశవికారయుక్తంబు = పదునాఱుమార్పులతోఁ గూడినది, సంసార...నుండఁగ్ = సంసారమను కార్చిచ్చుచే మిక్కిలి కాల్చఁబడుచున్న నన్ను రక్షింపుము.

సీ. జనులు దిక్పాలురసంపదాయుర్విభ
　　　　వములు గోరుదురు భవ్యంబు లనుచు
　నవి యంతయును రోషహాసజృంభిత మైన
　　　　మాతండ్రి బొమముడిమహిమఁ జేసి
　విహతంబు లగు నట్టివీరుండు నీచేత
　　　　నిమిషమాత్రంబున నేఁడు మడిసెఁ
　గావున ధ్రువములు గావు బ్రహ్మాదుల
　　　　శ్రీవిభవంబులు జీవితములుఁ
తే. గాలరూపకుఁ డగునురుక్రమునిచేత
　విదళితము లగు నిలువవు వేయు నేల

యితర మే నొల్ల నీమీఁదియెఱుక కొంత
గలిగియున్నది కొలుతుఁ గింకరుఁడ నగుచు. 357

టీ. జనులు = ఈలోకములోనివారందఱు, దిక్పాలుర సంపదాయుః శ్రీవిభవంబులు = ఇంద్రుఁడు మొదలగు దిక్పతుల కలుములు ఆయుఃపరిమాణములు దొరతనములు, భవ్యంబులు = మంచివి, అనుచు, (తాము వానిని) కోరుదురు, అవి అంతయును, కోపవేగసజృంభితము = కోపముచేత చేయఁబడిన నవ్వుచేత రేఁపఁబడినది, ఐన, మాతండ్రి బొమముడి మహిమన్ = మాయయ్య హిరణ్యకశిపుని మొగము చిట్లించుకొనుపాటి భ్రూభావములో, విహతంబులు = నష్టములు, అగును, అట్టివీరుండు = అంతటిశూరుఁడు గూడ, నీచేత, నిమిషమాత్రంబునన్ = ఱెప్పపాటుకాలములో, నేఁడు, మడసెన్ = చచ్చెను, గనుక, బ్రహ్మాదుల శ్రీవిభవంబులు = బ్రహ్మ మొదలగువారి సంపదలు, దొరతనములు, జీవితములు = బ్రతుకుదెరువులు, ధ్రువములు = నిత్యములు, కావు, కాలరూపకుఁడు = కాలస్వరూపకుఁడు, అగు, ఉరుక్రమునిచేతన్ = గొప్పవ్యాప్తిగల విష్ణువుచేత, విదళితములు = కొట్టఁబడినవి, ఇతరము = నీభక్తికంటె ఇతరమైనదానిని, ఏను, ఒల్లను = ఒప్పుకొనను, నీమీఁదియెఱుక = నీయందలి వివేకము, కొంత, కలిగియున్నది, కాన, కింకరుఁడన్ = నీకు దాసుఁడను, అగుచును, కొలుతును = సేవింతును.

తా. స్వామీ! లోకులందఱును ఇంద్రాది దిక్పాలురసంపదలు వారి ఆయుఃకాలములు దొరతనములు చాలమేలైనవనియు అవి తమకు లభించిన చాలుననియు తలఁతురు. అది వట్టిపిచ్చి. ఇవన్నియును కన్నులముందఱనే మాతండ్రి కోపముతో ఒక్కవికారపునవ్వు నవ్వి మొగము చిట్లించినతోడనే నాశనమై ఎక్కడ వక్కడపోఁగా మనము చూచియేయున్నాముగదా. ఇఁక అంతటిబలశాలి మాతండ్రియు చూచుచుండఁగనే గుడిచి కూర్చుండి భవిష్యమును ఎఱుఁగక ఱెప్పపాటుకాలములో నీచేతులోఁ జచ్చెను. కనుక బ్రహ్మాదులయు సంపదలు దొరతనములు మొదలగునవి శాశ్వతములు

కావు. అవన్నియు కాలాత్ముఁడైన సర్వవ్యాపకశక్తియుక్తుఁడైన విష్ణుని చేతఁ జెఱుపఁబడుచుండును గాని ఉండవు వేయి యేంటికు స్వామీ నాకు నీపాదభక్తికంటె మఱియొకటి వలదు. నీదయవలన నీమీఁది తెలివి కొంత సంపాదించుకొనియున్నాను. నీకు దాసుఁడనై కైంకర్యము చేయుచు ఉందును. నన్ను కరుణింపుము.

మత్తకోకిలము. ఎండమావులవంటిభద్రము లెల్లసార్థములంచు మ
ర్త్యుండు రోగనిధానదేహముతో విరక్తుఁడు గాక యు
ద్దండమన్మథవహ్ని నెప్పుడుఁ దప్తుఁడై యొకనాఁడుఁ జే
రండు పారము దుష్టసౌఖ్యపరంపరాక్రమణంబునన్. 358

టీ. మర్త్యుండు = మరణమే ధర్మముగాఁ గలమానవుఁడు, ఎండమావులవంటి, భద్రములు ఎల్లన్ = ఐహికశుభములన్నియు, సార్థములు = ప్రయోజన సహితములు, అనుచును, రోగనిధానదేహముతోన్ = వ్యాధులకు నెలవైన శరీరముతోడ, విరక్తుండు = విరాగము గలవాఁడు, కాక, ఎప్పుడును, ఉద్దండమన్మథవహ్నిన్ = తీవ్రమైన కామాగ్నిచేత, తప్తుఁడు = కాఁగినవాఁడు, ఐ, ఒకనాఁడు = ఒకప్పుడును, దుష్ట...ణంబునన్ = నీచములైన స్రక్చందన వనితాది సుఖముల సమూహముల గడపుటలో, పారము = తుద, చేరఁడు = పొందఁజాలఁడు.

తా. మరణమే ప్రకృతిగాఁ గలయీదేహి ఎండమావులః లె క్షణభంగురమైన యీ తుచ్ఛశుభములన్నియు నిజములని భ్రమసి రోగములపుట్టయైన తనదేహస్థితికి వగవక ఎప్పుడు తీఱనికామాగ్నికిఁ గ్రాఁగి నీచములైన వనితాదివిషయముల ననుభవించుచు ఒకప్పుడైనను దరి గాంచఁజాలఁడు.

ఉ. శ్రీమహిళామహేశ సరసీరుహగర్భులకైన నీమహా
ద్దామకరంబుచే నభయదానము చేయవు నేను బాలుఁడం
దామసవంశసంభవుఁడ దైత్యుఁడ నుగ్రరజోగుణుండ ని
న్నీమదయం గరాంబుజము శీర్షముఁ జేర్చుటచోద్యమీశ్వరా.

టీ. ఈశ్వరా = సర్వజగములకు ప్రభువైన ఓనారాయణా! శ్రీమ హి...గర్భులకు ఐనన్ = శక్తిరూపిణియగు పార్వతికి భర్తయగుశివునకును బ్రహ్మకును ఐనను, ఏ...కరంబుచేన్ = ఏమహామహిమగల హస్తముచేత, అభయదానము=అభయమునిచ్చుటను, చేయవు, నేను, బాలుఁడను, తామసవంశసంభవుఁడన్=మోటురక్కసికులమునఁబుట్టినవాఁడను, దైత్యుఁడన్=దితిజులవంశమువాఁడను, ఉగ్రరజోగుణుండన్ = క్రూరమైన రజోగుణము కలవాఁడను, నిస్సీమదయన్=హద్దులేని కరుణచేత, కరాంబుజము=కేలుఁదామర, శీర్షమునన్=నెత్తిని, చేర్చుట=ఉంచుట, చోద్యము=వింత.

వ. మహాత్మా సుజను లయినబ్రహ్మాదులందును దుర్జను లైన మాయందును సేవానురూపంబుగం బక్షపాతంబులు లేక కల్పవృక్షంబుచందంబున ఫలప్రదానంబు సేయుదువు కందర్పసమేతం బగుసంసారకూపంబునం గూలు చున్నమూఢజనులం గూడి కూలెడినేను భవదీయభృత్యుం డగునారదుని యనుగ్రహంబునం జేసి నీకృపకుఁ బాత్రుండ నైతి నన్ను రక్షించి మజ్జనకుని వధియించుట నాయందులఁ బక్షపాతంబు గాదు దుష్టదనుజసంహారంబును శిష్టభృత్యమునిజనరక్షాప్రకారంబును నీకు నైజగుణంబులు విశ్వంబు నీవ గుణాత్మకం బయినవిశ్వంబు సృజియించి యందుం బ్రవేశించి హేతుభూతగుణయుక్తుండ వై రక్షకసంహారకాదినానారూపంబుల నుండుదువు సదసత్కారణకార్యాత్మకం బయిన విశ్వంబునకుం బరమకారణంబు నీవ నీమాయచేత వీఁడు దాననియెడిబుద్ధివికల్పంబు దోఁచుఁ గాని నీకంటె నొం డెద్దియు లేదు బీజంబునందు వస్తుమాత్రభూతసాత్మ్యంబును వృక్షంబునందు నీలత్వాది వర్ణంబునుం గలుగుతెఱంగున విశ్వంబునకు నీయందు జన్మస్థితిప్రకాశనాశంబులుం గలుగు

నీచేతనయినవిశ్వంబు నీయంద నిలువుకొని తొల్లి ప్రళ
యకాలపారావారంబునఁ బన్నగేంద్రపర్యంకంబునఁ గ్రియా
రహితుండ వై నిజసుఖానుభవంబు సేయుచు నిద్రితుని
భంగి యోగనిమీలితలోచనుండవై మెలంగుచుఁ గొంత
కాలంబునకు నిజకాలశక్తిచేతం బ్రేరితంబులై ప్రకృతిధర్మం
బు లయినసత్త్వాదిగుణంబున నంగీకరించి సమాధి చాలించి
మెలంగు చున్ననీనాభియందు వటబీజంబువలన నుద్భవిం
చువటంబు తెఱంగున నొక్క కమలంబు సంభవించె నట్టిక
మలంబువలన నాల్గుమోముల బ్రహ్మ జన్మించి దిశలు వీక్షిం
చి కమలంబునకు నొం డయినరూపంబు లేకుండుటఁ జింతిం
చి జలాంతరాళంబుఁ బ్రవేశించి జలంబులందు నూఱు ది
వ్యవత్సరంబులు వెదకి తనజన్మంబునకు నుపాదానకారణం
బైననిన్ను దర్శింప సమర్థుండు గాక మగిడి కమలంబుకడ
కుం జని విస్మయంబు నొంది చిరకాలంబు నిర్భరతపంబు సేసి
పృథివియందు గంధంబు గనుచందంబునఁ దనయందు నానా
సహస్రవదన శిరోనయన నాసాకర్ణవక్త్రభుజకరచరణుండును
బహువిధాభరణుండును మాయాకలితుండును మహాలక్షణ
లక్షితుండును నిజప్రకాశదూరీకృతతముండును బురుషోత్త
ముండును నయిననిన్ను దర్శించె నయ్యవసరంబున. 360

టీ. సుజనులు = సాధువులు, దుర్జనులు = దుష్టులు, సేవానురూపంబు గాన్ = కైంకర్యమునకుఁ దగినట్టులు, పక్షాపక్షంబులు = స్వీయ పరకీయభావములు, లేక, కల్పవృక్షంబుచందంబునన్ = కల్పవృక్షమువలె, ఫలప్రదానము = ఐహికాముష్మికములు (పండ్లను) ఇచ్చుటను, కందర్పసమేతంబు = మన్మథునితోఁ గూడియున్నది, అగు, సంసారకూపంబునన్ = సంసారమను నూతియందు, భవదీయభృత్యుండు = నీదాసుఁడు, నీకృపకున్ = నీదయకు

పాత్రుండఁగ = తగినవాఁడను, మజ్జనకుని = మాయయ్యను, వధియించుట = చంపుట, పక్షపాతిము = మమత్వము, దుష్టదనుజసంహారంబును = క్రూరులగు రాక్షసులఁ జంపుటయు, శిష్ట...కారంబును = సాధువులైనదాసులు మునులు వీరిని రక్షించువిధమును, నైజగుణంబులు = స్వభావసిద్ధములైన గుణములు, విశ్వంబు = ప్రపంచము, గుణాత్మకము = సత్త్వరజస్తమోగుణరూపమైనది, విశ్వంబు = ప్రపంచము, సృజియించి = పుట్టించి, ప్రవేశించి = చొచ్చి, హేతుభూతగుణయుక్తుండవు = కారణమైన గుణములతోఁ గూడినవాఁడవు, రక్షక...రూపంబులన్ = కాపాడువాఁడు చంపువాఁడు మొదలయిన బహుస్వరూపములచేత, ఉండుదువు. సద...త్మకంబు = ఉండునది లేనిది కారణము కార్యము అనురూపముగల, విశ్వంబునకున్ = ప్రపంచమునకు, పరమకారణంబు = ముఖ్యహేతువు, వీఁడు = ఇతరుఁడు, తాను, బుద్ధివికల్పంబు = జ్ఞానభేదము, ఒండు = వేఱు, బీజంబునందు = విత్తునందు, వస్తుమాత్రసౌక్ష్మ్యంబులు = అణువుగానైన పదార్థముయొక్క సూక్ష్మత్వమును, నీలత్వాదివర్ణంబును = నలుపుమొదలగు రంగును, కలుగుతెఱంగునన్ = కలుగునట్లుగా, జన్మస్థితిప్రకాశనాశంబులు = పుట్టుట బ్రతుకుట విజృంభించుట నశించుట, తొల్లి = పూర్వము, ప్రళయకాలపారావారంబునన్ = ప్రళయకాలమందలిసముద్రమందు, పన్నగేంద్రపర్యంకంబునన్ = శేషశయ్యయందు, క్రియారహితుండవు = పనులు మానినవాఁడవు, నిజసుఖానుభవంబు = ఆత్మసుఖము ననుభవించుట, నిద్రితునిభంగిన్ = నిద్రపోయినవాని యట్టులు, యోగనిమీలితలోచనుండవు = ధ్యానముచేత మూయఁబడిన కన్నులు గలవాఁడవు, కొంతకాలంబునకున్ = కొంతసేపటికి, నిజకాలశక్తిచేతన్ = నీసంబంధమైన కాలముయొక్క ప్రభావముచేత, ప్రేరితంబులు = పురికొలుపఁబడినవి, ప్రకృతిధర్మంబులు = అవిద్యాగుణములు, సత్త్వాదిగుణంబులన్ = సత్త్వముమొదలగు గుణములను, అంగీకరించి = ఒప్పుకొని, సమాధి = ఏకాగ్రత, నాభి = బొడ్డు, వటబీజంబు = మఱ్ఱివిత్తు, వటంబు = మఱ్ఱిచెట్టు, ఒక్కకమలంబు = ఒక్కతామర, నాల్గుమోములబ్రహ్మ = నాలుగుమొగములు గలసృష్ట్యధిష్ఠానదైవము,

జన్మించి=పుట్టి, వీక్షించి=చూచి, కమలంబునకున్ = ఒకనాభియందలి తామరకంటె, ఒండు, ఇతరము, చింతించి=యోచించి, జలాంతరాళంబు=నీటినడుమ, ప్రవేశించి=చొచ్చి, దివ్యవత్సరంబులు=దేవతాసంవత్సరములు, వెదకి, తనజన్మంబునకున్ =తనపుట్టుకకు, ఉపాదానకారణంబు=ముఖ్యహేతువును, నిన్ను (విష్ణుని), దర్శింపన్ =చూచుటకు, సమర్థుండు = చాలినవాఁడు, కాక, నుగిడి=మరలి, చని=పోయి, విస్మయంబు=ఆశ్చర్యము, చిరకాలంబు=చాలకాలము, నిర్భరతపంబు=పూర్ణమైన తపస్సు, చేసి, పృథివియందు=భూమిమీఁద, గంధంబు=వాసనను, కనుచందంబునన్ = చూచునట్లు, తనయందున్=తనలో, నానా...చరణుండు = పెక్కువేల ముఖములు తలలు కన్నులు ముక్కులు చెవులు నోరులు బాహువులు చేతులు కాళ్లుగలవాఁడు, బహువిధాభరణుండు = పలువన్నెలసొమ్ములు గలవాఁడు, మాయాకలితుఁడు=మాయతోఁ గూడినవాఁడు, మహాలక్షణ లక్షితుండు=గొప్ప దివ్యలక్షణములచేఁ బ్రకాశించువాఁడు, నిజ...తముండు=తనకాంతిచే పోఁగొట్టఁబడిన అజ్ఞానమను అంధకారముగలవాఁడు, పురుషోత్తముండు=పురుషశ్రేష్ఠుఁడును, ఐన, నిన్ను, దర్శించెన్ = చూచెను. ఆయ్యవసరంబునన్ = ఆసమయమందు.

క. ఘోటకవదనుఁడ వై మధు
కైటభులం ద్రుంచి నిగమగణముల నెల్లం
బాటించి యజున కిచ్చిన
కూటస్థుఁడ వీశ్వరుఁడవు కోవిదవంద్యా. 361

టీ. కోవిదవంద్యా = పండితులచేత నమస్కరించఁదగిన ఓస్వామీ! నీవు, ఘోటకవదనుఁడవు = గుఱ్ఱపుమోముగలవాఁడవు, అయి, మధుకైటభులన్=మధువు కైటభుఁడు అనురాక్షసులను, త్రుంచి =చంపి, నిగమగణములను=వేదసమూహములను, ఎల్లన్, పాటించి=ఉద్ధరించి, అజునకున్=బ్రహ్మకు, ఇచ్చిన, కూటస్థుఁడవు=సర్వకాల సర్వావస్థలయందు వికారము

నొందక ఒక్కతీరున శాశ్వతుఁడుగా నుండువాఁడవు, ఈశ్వరుఁడవు= ప్రభుఁడవు.

తా. విద్వాంసులచే స్తోత్రము చేయఁదగిన ఓనారాయణా! నీవుగుఱ్ఱపు మొగమువాఁడవై (హయగ్రీవావతారమెత్తి) మధుకైటభులను రాక్షసులను జంపి, వేదములన్నియు బ్రహ్మకుఁ దెచ్చియిచ్చి అవికారరూపుఁడై సనాతనుఁడైన ఈశ్వరుఁడవు నీవేకదా!

వ. ఇవ్విధంబునఁ గృతత్రేతాద్వాపరంబు లనుమూఁడుయుగంబులందును దిర్యఙ్మనుజమునిజలచరాకారంబుల నవతరించి లోకంబుల నుద్ధరించుచు ధరించుచు హరించుచు యుగానుకూలధర్మంబులం బ్రతిష్ఠించుచు నుండుదువు దేవా యవధరింపుము. 362

టీ. తిర్య...కారంబులన్=మృగపక్ష్యాదులు మనుజులు మునులు జలజంతువులు వీనిరూపములచేత, అవతరించి=పుట్టి, ఉద్ధరించుచున్=కాపాడుచు, ధరించున్=తాల్చుచు, హరించుచున్=నశింపఁజేయుచు, యుగానుకూలధర్మంబులన్=యజ్ఞములకు అనురూపములైన న్యాయములను, ప్రతిష్ఠించుచున్=పాదుకొలుపుచు, ఉండుదువు, దేవా=క్రీడయే ముఖ్యోద్దేశముగాఁ గల యోస్వామీ! అవధరింపుము=చిత్తగించుము.

సీ. కామహార్షాదిసంకలితమై చిత్తంబు
భవదీయచింతనపదవి చేరదు
మధురాదిరసముల మరగి చొక్కుచు జిహ్వ
నీవర్ణనమునకు నిగుడనీదు
సుందరీముఖములఁ జూడఁ గోరుచుఁ జూడ్కి
తావకాకృతులపైఁ దగులువడదు

వివిధదుర్భాషలు వినఁ గోరుఁ వీనులు
  వినవు యుష్మత్కథావిరచనములు
తే. ఘ్రాణ ముఱవడిఁ దిరుగు దుర్గంధములకుఁ
దవులు గొలుపదు వైష్ణవధర్మములకు
నడఁగి యుండవు కర్మేంద్రియములు పురుషుఁ
గలఁచు సవతులు గృహమేధిఁ గలఁచునట్లు. 363

టీ. చిత్తంబు=మనస్సు, కామహర్షాది సంకలితము=కోరికలు వేడుకలు మొదలగువానిచేఁ గలఁతపడినది, ఐ, భవదీయచింతనపదవి=నిన్నుచింతించుత్రోవకు, సొరదు=చనదు, జిహ్వ=నాలుక, మధురాదిరసములు=తీపి మొదలగురుచులను, మరగి, చొక్కుచు=మిథ్యానందము నొందుచు, నిపర్గ్నమునకున్=నిన్నుస్తుతించుటకు, నిగుడనిదు=తలయెత్తనియదు, చూడ్కి=చూపు, సుందరీముఖములన్=సొగసుకత్తెలముద్దుమొగములను, చూడన్, కోరుచు, తావకాకృతులపైన్=నిరూపములమీఁద, తగులువడదు=చిక్కదు, వీనులు=చెవులు, వివిధదుర్భాషలన్=పలుతెఱఁగులచెడ్డమాటలను, వినన్, కోరును, యుష్మత్కథావిరచనములు=నీగాథలవర్ణనలు, వినవు, ఘ్రాణము=ముక్కు, ఉఱవడిన్=వేగముగా, దుర్గంధములకున్=చెడువాసనలకు, తిరుగును, వైష్ణవధర్మములకున్=విష్ణుప్రీతికరములైన ప్రాణాయామాదికృత్యములకు,తగులుకొలుపదు=ఒప్పనియదు, కర్మేంద్రియములు=వాక్కు చేతులు కాళ్లు గుదము ఉపస్థము అనునింద్రియములు, అడఁగి=వశములై, ఉండవు, సవతులు, గృహమేధిన్=గృహస్థుని, కలఁచునట్లు=కలఁతనొందించునట్లు, పురుషున్=దేహిని, కలఁచున్=కలియఁబెట్టును.

తా. మనస్సు కోరికలు మొదలగువానిచే కలఁతపడి నిన్ను ధ్యానించుత్రోవ దొరకదు. నాలుక తీపి మొదలగువానిరుచి మరగి నిస్తుతి కియ్యకొనదు. చూపు సొగసుకత్తెలఁ జూడ పరువులిడుఁగాని నిదివ్యమంగళవిగ్రహములఁ జూడనొప్పదు. చెవులు పాడుసోదలు వినునుగాని నీకథావర్ణనము లను విననొల్లవు. ముక్కు దుర్వాసనలకుఁ బోవునుగాని మంచి (ప్రాణా

యామాదికార్యముల) పనులకుఁబోదు. కర్మేంద్రియములా సవతులందఱు గృహస్థుని జిక్కులఁబెట్టినట్లు పురుషుని బాధింతురు.

వ. ఇవ్విధంబున నింద్రియంబులచేతఁ జిక్కుపడి స్వకీయపరకీయ శరీరంబులందు మిత్రామిత్రభావంబులు సేయుచు జన్మమ రణంబుల నొందుచు సంసారవైతరణీనిమగ్నం బయినలో కంబు నుద్ధరించుట లోకసంభవస్థితిలయకారణుండ వైననీ కుం గర్తవ్యంబు భవదీయసేవకుల మయినమాయందుఁ బ్రి యభక్తు లయినవారల నుద్ధరింపుము. 364

టీ. స్వకీయ...బులందుఁ=తమవి ఇతరులవి యగు దేహములయందు, మిత్రామిత్రభావంబులు=చెలిమి పగయును, చేయుచు, జన్మమరణంబులన్=పుట్టుచావులను, పొందుచు, సంసారవైతరణీనిమగ్నంబు=సంసారమనునిప్పులయేఱులోబడి మునిఁగినది, లోకంబున్=జనమును, ఉద్ధరించుట=కడతేర్చుట, లోక...కారణుండవు=లోకములపుట్టుక పెంపు చావులకు హేతువవు, ఐన, నీకున్, కర్తవ్యంబు=చేయఁదగినది, భవదీయసేవకులము=నీకింకరులము, అయినమాయందున్, ప్రియభక్తులు=ఇష్టభృత్యులు, ఉద్ధరింపుము=గట్టునకుఁ జేర్పుము.

మ. భగవద్దివ్యగుణానువర్తనసుధాప్రాప్తైకచిత్తుండ నై
బెగడన్ సంసరణోగ్రవైతరణికిన్ భిన్నాత్ముఁడై తావకీ
యగుణస్తోత్రపరాఙ్ముఖత్వమున మాయాసౌఖ్యభావంబులన్
మగతిం గాననిమూఢులం గని మదిన్ శోకింతు సర్వేశ్వరా.

టీ. సర్వేశ్వరా=ఎల్లలోకములకుఁ బ్రభువైనయోదేవా! నేను, భగవ...చిత్తుండన్=షడ్గుణైశ్వర్యవంతుఁడవైన నీయమానుషగుణములఅనుసంధానముచేనైన అమృతమును మరగినమనము గలవాఁడనై, సంసరణోగ్రవైతరణి

కిన్=సంసారమనుభయంకరమైన నిప్పులయేఱునకు, బెగడన్=భయమం దను, భిన్నాత్ములై=భేదబుద్ధిగలవారై, తావకీయ...మునన్ = నీకళ ల్యాణగుణములు మంగళస్తోత్రమును వీనికి పెడమోము పెట్టి, మాయాసౌఖ్య భావంబులన్=మిథ్యాసుఖమును సుఖముగాఁ దలఁచుటచేత, సుగతిన్=ఉ త్తమగతిని, కానని మూఢులన్ = పొందని అజ్ఞానులను, కని=చూచి, మ దిన్=నామనస్సున, శోకింతున్=దుఃఖపడెదను.

తా. స్వామీ! నీకల్యాణగుణముల చింతనామృతముచేఁ దృప్తచిత్తుండ నైనందున నేనంతగా సంసారమను నిప్పులయేఱునకు భీతిల్లను. పాపము ఈ మూఢమానవులందఱు భేదబుద్ధితో నీగుణవర్ణనమునకు ద్వేషపడి మిథ్యాసౌ ఖ్యములను సౌఖ్యములని నమ్మి ఉత్తమగతిని పొంద నేరకపోయిరిగదా యని అనిశము చింతనొందువాఁడను.

వ. దేవా మునీంద్రులు నిజవిముక్తికాములు లయి విజనస్థలంబు లం దపంబు లాచరింతురు కాముకత్వంబు నొల్లక యుండు వారికి నీకంటె నొండు శరణంబు లేదు గావున నిన్ను సేవిం చెద. కొందఱు కాముకులు గరద్వయకండూతిచేతం దని యనిచందంబునఁ దుచ్ఛం బయి పశుపక్షిక్రిమికీటసామా న్యం బయిన మైథునాదిగృహమేధిసుఖంబులం దనియక కడ పట నతిదుఃఖవంతు లగుదురు. నీప్రసాదంబు గలనుగుణుండు నిష్కాముం డయి యుండు మౌనవ్రతజపతపశ్శ్రుతాధ్యయ నంబులును నిజధర్మవ్యాఖ్యానవిజనస్థలనివాససమాధులును మోక్షహేతువు లగు నయిన నివి పదియు నింద్రియజ యంబు లేనివారికి భోగార్థంబు లయి విక్రయించువారికి జీవ నోపాయంబు లయి డాంబికులకు వార్తాకరంబు లయియుం డు సఫలంబులు గావు. భక్తి లేక భవదీయజ్ఞానంబు లేదు. రూపరహితుండ వైన నీకు బీజాంకురంబులకై వడిఁ గారణ

కార్యంబులయినసదసద్రూపంబులు రెండును బ్రకాశమానంబులగు నారెంటియందును భక్తియోగంబున బుద్ధిమంతులు మథనంబున దారువులందు వహ్నిం గనియెడు తెఱంగున నిన్నుఁ బొడగందురు. పంచభూతతన్మాత్రంబులును ప్రాణేంద్రియంబులును మనోబుద్ధ్యహంకారచిత్తంబులును నీవ సగుణంబును నిర్గుణంబును నీవ గుణాభిమాను లయిన జన్మమరణంబుల నొందువిబుధు లాద్యంతంబులు గానక నిరుపాధికుండ వైనని న్నెఱుంగరు తత్త్వజ్ఞు లయినవిద్వాంసులు వేదాధ్యయనాదివ్యాపారంబులు మాని వేదాంతప్రతిపాద్యుండ వగునిన్ను సమాధివిశేషంబుల నెఱింగి సేవింతు రదిగావున.

టీ. నిజవిముక్తకాములు=స్వభావముచేతనే విడువఁబడిన కోరికగలవారు, విజనస్థలంబులఁ=గుంపుచేరనిరహస్యదేశములందు, ఆచరింతురు = చేయుదురు, కాముకత్వంబు=కోరికలుగోరువానిధర్మము, కాముకులు=కోరికలుగోరువారు, కరద్వయకండూతిచేతఁ=రెండుచేతులదురదచేత, తనియని చందంబునఁ=గోఁకికొని తృప్తిచెందనిలాగున, తుచ్ఛంబు=నీచము, పశు... సామాన్యంబు=గొడ్లు పిట్టలు పురుఁగులు వీనికితుల్యము ఐన, మైథునాదిగృహమేధిసుఖంబులఁ=సురతము మొదలగు కాఁపుసౌఖ్యములచేత, తనియక = తృప్తిచెందక, కడపటఁ=తుదను, అతిదుఃఖవంతులు= మిగులదుఃఖముగలవారు, అగుదురు. తీఁటపట్టినవాఁడు తర్వాతనొప్పిమంటయెత్తునని విచారింపక నెత్తురుగాఱబరికి చివరకు అతిబాధచెందునట్లు ముందువచ్చుకష్టముగానక తుచ్ఛములైనమైథునాదిసుఖములఁజెందువారు తుదకుఁగష్టపడుదురనిభావము. నీప్రసాదంబుఁ=నీయనుగ్రహము, కలసుగుణుండు=కలిగినసజ్జనుఁడు, నిష్కాముండు=కోరికలేనివాఁడు, మౌన...నంబులును=మాటలాడకుండుట వ్రతములు జపము తపము వేదశాస్త్రములు చదువుకొనుట, నిజ...సమాధులు=స్వ(ని)ధర్మములను వివరించుకొనుచు రహస్యమైనతావున గూర్చుండుట

చిత్తైకాగ్ర్యమును, మోక్షహేతువులు=ముక్తిసాధనములు, అగును. ఇంద్రి
యజయంబు=అంతరింద్రియ బహిరింద్రియనిగ్రహము, లేనివారికి, భోగార్థం
బులు=అనుభవైకప్రయోజనములు, విక్రయించువారికిన్=అమ్మువారికి, జీవ
నోపాయంబులు=బ్రతుకుదెరువులు, డాంభికులకున్=దంభమును బూను
వారికి, వార్తాకరంబులు = జీవనహేతువులు, సఫలంబులు=మోక్షఫలము
తోఁగూడినవి, కావు, భవదీయజ్ఞానంబు=నీసంబంధమైనయెఱుక, రూపరహి
తుండవు=ఏరూపము లేనివాఁడవు, బీజాంకురంబులకైవడిన్ = విత్తుమొలకల
వలె, కారణకార్యంబులు= హేతుహేతుమత్తులు, సదసద్రూపంబులు=శా
శ్వతము భంగురము నైనరూపములు, ప్రకాశమానంబులు=వెలుఁగుచున్నవి,
అగును, ఆరెంటియందును, భక్తియోగంబునన్=నిరంతరము భక్తిని అనుసం
ధించుటచేత, మథనంబునన్=తరుచుటచేత, దారువులందున్=కట్టెలలో,
వహ్నిన్=అగ్నిని, కనియెడు తెఱంగునన్=అగపడునట్లు, నిన్ను, పొడగం
దురు=చూతురు, పంచభూతతన్మాత్రంబులును = పృథివ్యాదుల లేశములైన
శబ్దస్పర్శరూపరసగంధములు, ప్రాణేంద్రియంబులును= ప్రాణములు ఇంద్రి
యములును, మనోబుద్ధిచిత్తాహంకారములును, నీవే, సగుణంబును=గుణ
ములతోఁగూడినది, నిర్గుణంబు=గుణరహితమైనది, నీవే, గుణాభిమానులు =
గుణములయందు తగులుగలిగి, జన్మమరణంబులను= పుట్టుచావులను, పొందు
విబుధులు=పొందువిద్వాంసులు, ఆద్యంతంబులు=మొదలుతుదయు, కాన
క=చూడక, నిరుపాధికుండు=ఉపాధి (విషయసంగము) లేని, తత్త్వజ్ఞు
లు=నిజమెఱిఁగినవారు, విద్వాంసులు = పండితులు, వేదాధ్యయనాదివ్యా
పారంబులు=వేదములుచదువుట మొదలైనపనులు, వేదాంతప్రతిపాద్యుండ
వు=వేదాంతములచే వర్ణింపఁదగినవాఁడవు, సమాధివిశేషంబులన్=ధ్యానభే
దములచేత, ఎఱింగి=తెలిసికొని, సేవింతురు = పరిచర్యచేయుదురు.

సీ. నీగృహాంగణభూమి నిటలంబు మోవంగ
మోదించి నిత్యంబు మ్రొక్కఁడేని

నీమంగళ స్తవనికరవర్ణంబులు
పలుమాఱు నాలుకఁ బలుకఁడేని
నీయధీనములుగా నిఖిలకృత్యంబులు
ప్రియభావమున సమర్పింపఁడేని
నీపదాంబుజముల నిర్మలహృదయుఁడై
చింతించి మక్కువఁ జిక్కఁడేని
తే. నిన్నుఁ జెవులార వినఁడేని నీకు సేవ
సేయ రాఁడేని బ్రహ్మంబుఁ జెందఁగలఁడె
యోగి యైనఁ దపోవ్రతయోగి యైన
వేది యైన మహాతత్త్వవేది యైన. 367

టీ. యోగి = యోగము తెలిసినవాఁడు, ఐనను, తపోవ్రతయోగి = తపము వ్రతములు గలవాఁడైనను, వేది = వేదములు చదివినవాఁడు, ఐనను, మహాతత్త్వవేది = గొప్పపరతత్త్వవేత్త, ఐనను, నీగృహాంగణభూమి = నీగుడి ముందటివాకిట, నిటలంబు = నొసలు, మోపంగన్ = తాఁకునట్లు, నిత్యంబు = ఎల్లప్పుడు, మోదించి = తాఁకించి, మ్రొక్కఁడేనిన్ = నమస్కరింపఁడేని, నీమంగళ...బులు = నీ శుభములైన స్తోత్రముల సమూహములయందలి అక్షరముల సమూహములు, నాలుకన్ = నాలుకచేత, పలుమాఱు, అనేకపర్యాయములు, పలుకఁడు ఏనిన్, నిఖిలకృత్యంబులు = తాఁజేయు నెల్లపనులు, నీయధీనములు గాన్ = నీస్వాధీనములగునట్లు, ప్రియభావమునన్ = ప్రేమతో, సమర్పింపఁడు ఏనిన్, నిర్మలహృదయుఁడు ఐ = రాగాదికళంకములు లేనివాఁడై, నీపదాంబుజములన్ = నీపాదకమలములను, చింతించి = ధ్యానించి, మక్కువన్ = ప్రేమయందు, చిక్కఁడేనిన్ = తగులువడఁడేని, నిన్ను, చెవులారన్ = చెవులపండువుగా, వినఁడేనిన్, నీకు సేవసేయరాఁడేని, బ్రహ్మంబున్ = బ్రహ్మస్వరూపుఁడైన నిన్ను, చెందఁగలఁడే = పొందఁగలఁడా? పొందలేఁడు.

తా. స్వామీ! ఎంత యోగియైనను తపము నోములు మొదలగునవి జరపువాఁడైనను, వేదములు చదివినవాఁడైనను, గొప్పతత్త్వవేత్తయైనను, నీ గుడివాకిట నొసలు దాఁకునట్లు పడి దండము పెట్టనివాఁడును, పలుమారు నీస్తోత్రపాఠములు చదువనివాఁడును, తాఁజేయు నెల్లపనులు నీకే యని సమర్పించ నేరనివాఁడును, శుద్ధభావముతో నీ పాదకమలముల ధ్యానించనివాఁడును, నిన్ను విననివాఁడును, ఆదరముతో నీసేవ చేయనివాఁడును, బ్రహ్మరూపుఁడ వైననిన్ను బొందఁగలఁడా? పొందఁజాలఁడనుట.

వ. కావున భవదీయదాస్యయోగంబు గృప సేయు మని ప్రణ
తుం డైన ప్రహ్లాదుని వర్ణనంబులకు మెచ్చి నిర్గుణుం డైన
హరి రోషంబు విడిచి యిట్లనియె. 368

టీ. భవదీయదాస్యయోగంబు=నీకైంకర్యము లభించు తెరవు, కృప సేయుము=కరుణించుము, ప్రణతుండు = మ్రొక్కినవాఁడు, వర్ణనంబులకుఁ=స్తుతులకు, నిర్గుణుండు=రాగరోషాదిగుణములు లేనివాఁడు, రోషంబు=కోపము.

శా. సంతోషించితి నీచరిత్రమునకున్ సద్భద్రమౌఁ గాక నీ
యంతర్వాంఛితలాభ మెల్లఁ గరుణాయత్తుండనై యిచ్చెదం
జింతం జెందకు భక్తకాముఁడ నే సిద్ధంబు దుర్లోక్యుఁడన్
జంతుశ్రేణికి నన్నుఁ జూచినఁ బునర్జన్మంబు లే దర్భకా. 369

టీ. అర్భకా=కుఱ్ఱా! నీచరిత్రమునకున్=నీనడవడికి, సంతోషించితిని, నీకు, సద్భద్రము=మంచి శుభము, ఔఁగాక=కాక, కరుణాయత్తుండనై=దయకులోఁగినవాఁడనై, నీయంతర్వాంఛితమున్ = నీమనస్సులో నీవు గోరుకొన్న కోర్కెలన్నియు, ఇచ్చెదను, చింతన్ = విచారమును, చెందకుము, నేను, భక్తకాముఁడన్ = భాగవతులకోర్కె లొసఁగువాఁడను, సిద్ధంబు = నిజము, జంతుశ్రేణికిన్ = శరీరులకు, దుర్లోక్యుఁడన్ =

చూడశక్యముకానివాఁడను, నన్ను, చూచినన్ = కనఁగొనినచో, పునర్జన్మంబు = మఱుపుట్టువు, లేదు.

తా. వత్సా, ప్రహ్లాదా! నీనడవడికి చాలఁగ సంతసించితిని. నీకు శుభము గలుగుఁగాక. నీవు కోరినదెల్ల నిచ్చుటకు సంసిద్ధుఁడనై యున్నాను విచారపడకుము. నేను భక్తులకోరికలను దీర్చువాఁడను. నీయందు నాకు అత్యంతప్రీతి గలదుగాన నీకు దర్శన మిచ్చితిని గాని నేను ఎల్ల జంతువులకు చూడ నలవికానివాఁడను. నన్ను జూచినవారు మఱుపుట్టుకను జెందరు.

ఆ. సకలభావములను సాధులు విద్వాంసు
లఖిలభద్రవిభుఁడ నైన నన్నుఁ
గోర్కు లి మ్మటంచుఁ గోరుదు రిచ్చెదఁ
గోరు మెద్దియైనఁ గుఱ్ఱ నీవు. 370

టీ. కుఱ్ఱా! సాధులు = సజ్జనులైన, విద్వాంసులు = పండితులు, సకలభావములన్ = అన్నివిధములచేతను, అఖిలభద్రవిభుఁడన్ = సమస్తమంగళదాయకుఁడను, ఐననన్నున్, కోర్కులు, ఇమ్ము = ఈయుము, అటంచును, కోరుదురు, నీవును, కోరుము, ఎద్దియైనను, ఇచ్చెదను.

తా. కుఱ్ఱా! ఎంతటివారును మంగళకారణుఁడైననన్ను తమయొల్లయర్థములచేతను కోరికలిమ్మని కోరుచుందురు. నేనును వారి కోరికల నిచ్చుచుందును. నీవును దేనినైన నీయిష్టమైనదానిం గోరికొనుము. ఇచ్చెదను.

వ. అని పరమేశ్వరుండు ప్రహ్లాదునియందుఁ గలసకామత్వంబుఁ దెలియుకొఱకు వంచించి యిట్లానతిచ్చిన నతండు నిష్కాముండై నయేకాంతి గావునఁ గామంబు భక్తియోగంబునకు నంతరాయం బని తలంచి యిట్లనియె నుత్పత్తిమొదలు కామాద్యనుభవాసక్తి గలనాకు వరంబు లిచ్చెదనని వంచింపనేల సంసారబీజంబులును హృదయబంధకంబులయినకామంబులకు వెఱచి ముముక్షుండనై నేమంబుకొఱకు

నేమంబున నిన్నుం జేరితి కామంబులును నింద్రియంబులును మనశ్శరీరధైర్యంబులును మనీషాప్రాణధర్మంబులును లజ్జా స్మరణలక్ష్మీసత్యతేజోవిశేషంబులును నశించు లోకంబులందు భృత్యు లర్థకాములయి రాజుల సేవింతురు రాజులుం బ్రయోజనంబు లర్థించి భృత్యులకు నర్థంబు లొసంగుదు రవ్విధంబునం గాదు నాకుం గామంబు లేదు నీకుం బ్రయోజనంబు లే దయినను దేవా వరదుండ వయ్యెద వేనిం గామంబులు వృద్ధిం బొందనివరంబు గృపసేయుము కామంబులు విడిచినపురుషుండు నీతోడ సమానవిభవుం డగు నరసింహ పరమాత్మ పురుషోత్తమ యని ప్రణవపూర్వకంబుగా నమస్కరించిన హరి యిట్లనియె. 371

టీ. పరమేశ్వరుండు=నరసింహమూర్తి, సకామత్వంబు=కోరికలుగలిగియుండుట, వంచించి=మోసముచేసి, ఇట్లు, అనతిచ్చినన్=సెలవీయఁగా (చెప్పఁగా), నిష్కాముఁడు=కోరికలులేనివాఁడు, ఐన, ఏకాంతి=అంతరంగభక్తుఁడు, కామంబు=కోర్కె, భక్తియోగంబునకున్=భక్తినిబట్టుటకు, అంతరాయంబు=విఘ్నము, ఉత్పత్తి=పుట్టుక, కామాద్యనుభవాసక్తి=కామాదుల ననుభవించుతలఁపు, వరంబులు=ఇష్టములు, వంచింపనేల=మోసపుచ్చుటయెందుకు, సంసారబీజంబు=సంసారమునకుకారణములైనవి, హృదయబంధకములు=మనస్సునుజ్ఞానమువంకఁబోకుండఁగట్టివేయునవి, ముముక్షుఁడను=ముక్తిఁబొందఁగోరువాఁడను, నేమంబు=మేలు, నేమంబునన్=నియమముతో, కామంబులు=కోరికలు, మనశ్శరీరధైర్యంబులు=చిత్తము దేహము బలము; మనీషాప్రాణధర్మంబులును=బుద్ధి ప్రాణము న్యాయము, లజ్జా...విశేషంబులు=సిగ్గు జ్ఞప్తి సంపద సత్యము వర్చస్సు, నశించు=క్షయమగు, భృత్యులు=సేవకులు, అర్థకాములు=డబ్బునుగోరినవారు, ప్రయోజనంబు=వారవలనఁ గాఁదగినకార్యములు, అర్థించి=కోరి, ఒసంగుదురు=ఇత్తురు. అవ్వి

ధంబునకా=అతిరున, కామంబు=కోరిక, ప్రయోజనము=నావలనఁ గావల
సినకార్యము, వరగుండవు=కోరినవాని నిచ్చువాఁడవు, కృపసేయుము = ఇ
మ్ము, సమానవిభవుండు = తుల్యమైనయైశ్వర్యముగలవాఁడు, ప్రణవపూర్వ
కంబుగాన్=ఓంకారము ముందుఁ బలుకునట్లు.

సీ. నీయట్టిసుజ్ఞాననిపుణు లేకాంతులు
గోర్కులు నాయందుఁ గోరనొల్ల
రట్లైనఁ బ్రహ్లాద యసురేంద్రభర్త వై
సాగి మన్వంతరసమయ మెల్ల
నిఖిలభోగంబులు నీవు భోగింపుము
కల్యాణబుద్ధి నాకథలు వినుము
సకలభూతములందు సంపూర్ణుఁ డగునన్ను
యజ్ఞేశు నీశ్వరు నాత్మ నిలిపి
ఆ. కర్మచయము లెల్ల ఖండించి పూజన
మాచరింపు మీశ్వరార్పణముగ
భోగముల నశించుఁ బుణ్యంబు వ్రతములఁ
బాపసంచయములు పాయునిన్ను. 372

టీ. ప్రహ్లాద! నీయట్టిసుజ్ఞాననిపుణులు=మంచిబ్రహ్మజ్ఞానమందు నేర్పుగలవారు, ఏకాంతులు=అంతరంగభక్తులు, నాయందు, కోర్కులు, కోరనొల్లరు, అట్లయినను, అసురేంద్రభర్తవు=రాక్షసశ్రేష్ఠులకు ప్రభువు, ఐ, సాగి=నెగడి, మన్వంతరసమయము ఎల్లన్=ఈమన్వంతరకాలమంతయు, నిఖిల=సమస్తములైన, భోగంబులు=సుఖములు, భోగింపుము = అనుభవించుము, నాకథలు, కల్యాణబుద్ధిన్=క్షేమబుద్ధితో, వినుము, సకలభూతములందున్=ఎల్లజంతువులయందు, సంపూర్ణుఁడు = నిండియున్నవాఁడు, అగునన్ను, యజ్ఞేశున్=యజ్ఞేశ్వరుని, ఈశ్వరుని, ఆత్మన్=చిత్తములో, నిలిపి=ఉంచి, కర్మచయములు=కర్మసమూహములు, ఎల్లను, ఖండించి=త్రుంచి,

ఈశ్వరార్పణముగన్ = ఈశ్వరసమర్పితముగా, పూజనము, ఆచరింపుము = పూజచేయుము, పుణ్యంబు = వెనుకటిపుణ్యకర్మము, భోగములన్ = అనుభవించుటలచేత, వ్రతములన్ = పావనములైన వ్రతములచే, పాపసంచయము = పాపసమూహములు, పాయును = తొలఁగును.

తా. ప్రహ్లాదా! నిత్యానిత్యవివేకము గలిగిన నీవంటి యంతరంగభక్తులు నన్ను గోరికలడుగరు. అయినను నీవు రాక్షసులకెల్ల రాజవై నెగడి యీమన్వంతరమంతయు నిచ్చట నెల్లభోగము అనుభవించుచునుండి ప్రీతితో నాకథలు వినుచు సర్వభూతములయందు నిండిననన్ను నీచిత్తముతో నిలుపుకొని ఎల్లకర్మములు ఛేదించి ఈశ్వరప్రీతిగాఁ బూజలుచేసి భోగములచేఁ బుణ్యశేషమును పుణ్యవ్రతములచేఁ బాపములును నివర్తింపఁగా నుండుము.

వ. మఱియు నటమీఁదఁ గాలవేగంబునం గళేబరంబు విడిచి
త్రైలోక్యవిరాజమానంబును దివిజరాజజేగీయమానంబును
బరిపూరితదశదిశంబును నయినయశంబుతోడ ముక్తబం
ధుండ వై నన్ను డగ్గఱెదవు వినుము. 373

టీ. కాలవేగంబునన్ = కాలగతిచేత, కళేబరంబు = శరీరము, విడిచి = వదలి, త్రైలోక్యవిరాజమానంబు = ముల్లోకములయందుఁ బ్రకాశించునది, దివిజరాజజేగీయమానంబు = దేవేంద్రునిచేఁ బొగడఁబడినది, పరిపూరితదశదిశంబును = పదిదిక్కులనిండినదియు, యశంబు = కీర్తి, ముక్తబంధుండవై = వీడిన సంసారబంధము గలవాఁడవై, డగ్గఱెదవు = సమీపింతువు.

ఆ. నరుఁడు ప్రియముతోడ నాయవతారంబు
నీయుదారగీతనికరములను
మానసించునేని మఱి సంభవింపఁడు
కర్మబంధచయముఁ గడచి పోవు. 374

టీ. నరుఁడు=మానవుఁడు, ప్రియముతోడన్=ఆదరముతోడ, నాయవతారంబు=నానరసింహావతారమును, నీ ఉదారగీతనికరములను = నీగొప్పగానసమూహములను, మానసించును=మననముచేయును, ఏని, కర్మబంధచయమున్=కర్మపుముడులచిక్కును, కడచిపోవున్=తప్పించుకొనును.

తా. ప్రహ్లాదా! ఏమానవుఁడైనను భక్తితో నీ నానరసింహావతారమును నీపుణ్యగుణకీర్తనమును జేసెనేని పాపములు నశించును.

వ. అనినఁ బ్రహ్లాదుం డిట్లనియె. 375

సీ. దంష్ట్రివై తొల్లి సోదరుని హిరణ్యాక్షు
నీవు చంపుటఁ జేసి నిగ్రహమున
మాతండ్రి రోషనిర్మగ్నుఁ డై సర్వలో
కేశ్వరుఁ బరము ని న్నెఱుఁగలేక
పరిపంథిపగిది నీభక్తుండ నగునాకు
నపకారములు చేసె నతఁడు నేఁడు
నీశాంతదృష్టిచే నిర్మలత్వము నొందెఁ
గావునఁ బాపసంఘంబునలనఁ
తే. బాసి శుద్ధాత్మకుఁడు గాఁగ భవ్యగాత్ర
వరము వేఁడెద నా కిమ్ము వనజనేత్ర
భక్తసంఘాతముఖపద్మపద్మమిత్ర
భక్తకల్మషవల్లికాపటులవిత్ర. 376

టీ. భక్త...మిత్ర=భక్తులసమూహము లనుకమలములకు సూర్యునివంటివాఁడా! భక్త...లవిత్ర=భక్తులపాపపుఁదీఁగెలకు కొడవలియగువాఁడా! వనజనేత్ర=కమలములవంటికన్నులుగలవాఁడా! భవ్యగాత్ర=దివ్యమంగళవిగ్రహము గలయోస్వామీ! మాతండ్రి=హిరణ్యకశిపుఁడు, నీవు, దంష్ట్రివై=వరాహావతారముఁ దాల్చినవాఁడవై, తొల్లి = మునుపు, హిరణ్యాక్షున్ = మాపిన్నతండ్రిని, చంపుటంజేసి, నిగ్రహమునన్ = తిరస్కార

ముతో, రోషనిర్మగ్నుఁడై=కోపములో మునిఁగినవాఁడై, సర్వలోకేశ్వరుఁడన్=
ఎల్లలోకములకుఁ బ్రభువును, పరముఁడన్=పరాత్పరుఁడైన, నిన్ను, ఎఱుఁగలేక,
పరిపంథిపగిదిన్=శత్రువువలె, నీభక్తుండన్=నీసేవకుఁడను, అగు నాకు,
అపకారములు=ద్రోహములు, చేసెను. అతఁడు=మాతండ్రి, నేఁడు, నీకాం
తదృష్టిచే=పావనమైన నీ చూపుచేత, నిర్మలత్వమును=పవిత్రతను, ఒందెను.
కావున, పాపసంఘంబువలనన్=పాపసమూహమునుండి, పాసి=తొలఁగి,
శుద్ధాత్మకుఁడు=పావనుఁడు, కాఁగన్=అగునట్లు, వరము=ఇష్టమును,
వేఁడెదను, నాకు, ఇమ్ము=ఈయుము.

తా. ఓనరసింహమూర్తీ! నీవు పూర్వము వరాహావతారమెత్తి మాపిన తండ్రిని జంపినందున మాయయ్య యలిగి తిరస్కారభావముతో సర్వలోకేశ్వరుఁడవు పరాత్పరుఁడవు అగునిన్ను తెలియఁజాలక నీభక్తుఁడ నైననన్ను శత్రువువలె కష్టపెట్టెను. అట్టివాఁడు ఇప్పుడు పావనావలోకముచేత పవిత్రుఁడై యుత్తమగతిఁ గాంచెను గనుక అట్టిమాయయ్యకు సమస్తపాపములు తొలఁగి పవిత్రుఁడగునట్లు వరము నొసంగుము.

వ. అనిన భక్తవత్సలుం డిట్లనియె. 377

టీ. భక్తవత్సలుండు=భక్తులయందు పుత్త్రప్రీతి గలవాఁడు.

మ. నిజభక్తుండవు నాకు నిన్నుఁ గనుటన్ నీతండ్రి త్రిస్సప్తపూ
ర్వజులం గూడి పవిత్రుఁడై శుభగతిన్ వర్తించు విజ్ఞానదీ
పజితానేకభవాంధకారు లగుమద్భక్తుల్ వినోదించు దే
శజనుల్ దుర్జనులైన శుద్ధులు సుమీ సత్యంబు దైత్యోత్తమా.

టీ. దైత్యోత్తమా=రాక్షసశ్రేష్ఠుఁడవైన యో ప్రహ్లాదా! నీవు నాకు, నిజభక్తుండవు=దగ్గఱిసేవకుఁడవు, నీతండ్రి=హిరణ్యకశిపుఁడు, నిన్ను, కనుటన్=పడయుటచేత, త్రిస్సప్తపూర్వజాలన్=తమపితరులు ఇరువదియొక్క తరమువారిని, కూడి=కలసి, పవిత్రుఁడై=పావనుఁడై, శుభగతిన్=క్షేమము మీఱ, వర్తించును, విజ్ఞాన...కారులు=జ్ఞానమనుదీపముచేఁ బోఁగొట్టు

కోఁబడిన బహుజన్మంబులయందలి పాపపుంజీఁకటికలవారు, అగు, మద్భక్తుల్ = నాకింకరులు, వినోదించు దేశజనుల్ = క్రీడించు దేశమున వసించువారలు, దుర్జనులు = పాపాత్ములు, ఐనను, శుద్ధులు = పవిత్రులగుదురు, సత్యంబు = నిజము.

తా. ప్రహ్లాదా! నాకుమిక్కిలి అంతరంగభక్తుఁడ వైననిన్ను కొడుకుగాఁ గనుటచేతనే తనకుముందు ఇరువదియొక్కతరములవారితోఁ గూడఁ దాఁ గృతార్థుఁడయ్యెను. జ్ఞానదీపమున బహుజన్మార్జితము లైనపాపపుంజీఁకటులను బోఁగొట్టుకొన్న నాభక్తవరు లేదేశమం దుందురో అచ్చటిజను లెంతపాపులైనను పవిత్రు లగుదురుసుమా నిజము.

సీ. ఘనసూక్ష్మభూతసంఘాతంబులోపల
నెల్లవాంఛలు మాని యెవ్వరయిన
నీచందమున నన్ను నెఱయ సేవించిన
మద్భక్తు లగుదురు మత్పరులకు
గుఱి సేయ నీవ యోగ్యుఁడ వైతి విటమీఁద
వేదచోదిత మైనవిధముతోడఁ
జిత్తంబు నామీఁదఁ జేర్చి మీతండ్రికిఁ
బ్రేతకార్యములు సంప్రీతిఁ జేయు
తే. మతఁడు రణమున నేఁడు నాయంగమర్శ
నమున నిర్మలదేహుఁడై నవ్యమహిమ
నవగతాఖిలకల్మషుఁడై తనర్చి
పుణ్యలోకంబులకు నేఁగుఁ బుణ్యచరిత. 379

టీ. పుణ్యచరిత = పావన మైననడువడిగల ఓప్రహ్లాదా! ఘన... లోపలన్ = సూక్ష్మములు స్థూలములు నైనజీవకోటులలో, ఎవ్వరయినను, ఈచందముననే, ఎల్లవాంఛలు = ఎల్లకోర్కులును, మాని = వదలి, నన్ను, నెఱయన్ = పూర్తిగా, సేవించినన్, మద్భక్తులు = నా సేవకులు, అగుదురు, ఇటమీఁదన్ = ఇఁకపైన, మద్భక్తులకున్ = నా సేవకులకు, గుఱిసేయన్ = సాటి

చెప్పుటకు, నీవే, యోగ్యుఁడవు = తగినవాఁడవు, ఐతివి, చిత్తంబు, నామీఁదఁజేర్చి, వేదచోదితము = వేదములలోఁ జెప్పఁబడినది, ఐన, విధముతోడన్ = పద్ధతితోడ, మీతండ్రికి, ప్రేతకార్యములు = అపరకర్మములు, సంప్రీతిన్ = వేడుకతో, చేయుము, అతఁడు = మీతండ్రి, నేఁడు, రణమునన్ = యుద్ధమందు, నాయంగస్పర్శనమునన్ = నాశరీరమును దాఁకుటచేత, నిర్మలదేహుఁడు = పాపములేనిశరీరముగలవాఁడు, ఐ, నవ్యమహిమన్ = నూతనమైనవైభవముతోడ, అపగతాఖిలకల్మషుఁడు = పోఁగొట్టఁబడినయెల్లపాపములు గలవాఁడు, ఐ, తనర్చి = ఒప్పి, పుణ్యలోకంబులకున్, ఏఁగున్ = పోవును.

తా. ప్రహ్లాదా! స్థూలసూక్ష్మజంతువులలో నెవ్వరైనను కోర్కెలన్నియుఁ బరిత్యజించి నీవలెనన్ను సేవింతురో వారుగొప్పభాగవతు లగుదురు. నీవు సాధుభక్తులకందఱకు సాటిచెప్పఁదగినవాఁడవైతివి. ఇఁకఁ దడవుచేయక మీతండ్రికి వేదచోదితమైనవిధి ననుసరించి ఉత్తరక్రియలు చేయుము. నీతండ్రి నేఁడు యుద్ధమందు నాశరీరసంపర్కము నొంది పవిత్రుఁడై అపూర్వమహిమతోడ ఎల్లపాపములను బోఁగొట్టుకొని ఉత్తమలోకములకుఁ బోనున్నాఁడు.

వ. అని యిట్లు నరసింహదేవుం డానతిచ్చిన హిరణ్యకశిపునకుం
బ్రహ్లాదుండు పరలోకక్రియలు సేసి భూసురోత్తములచేత నభి
షిక్తుం డయ్యె నయ్యెడం బ్రసాదసంపూర్ణముఖుం డైన శ్రీనృ
సింహదేవునిం జూచి దేవతాప్రముఖసహితుం డైన బ్రహ్మదే
వుం డిట్లనియె. 380

టీ. ఆనతిచ్చినన్ = ఆజ్ఞ సేయఁగా, పరలోకక్రియలు = అపరకర్మలు, భూసురోత్తములచేతన్ = బ్రాహ్మణులచేత, అభిషిక్తుండు = పట్టాభిషేకము చేయఁబడినవాఁడు, అయ్యెను, అయ్యెడన్ = అసమయమున, ప్రసాదసంపూర్ణముఖుండు = అనుగ్రహముచే సుముఖుఁడు, దేవతాప్రముఖసహితుండు = దేవతలు మొదలగువారితోఁ గూడినవాఁడు.

సీ. దేవదే వాఖిల దేవేశ భూతభా
వన వీఁడు నాచేత వరము వడసి
మత్సృష్టజనులచే మరణంబు నొందక
మత్తుఁడై సకలధర్మములఁ జెఱచి
నేఁడు భాగ్యంబున నీచేత హతుఁ డయ్యెఁ
గల్యాణ మమరె లోకములకెల్ల
బాలు నీతని మహాభాగవతశ్రేష్ఠు
బ్రదికించితివి మృత్యుభయముఁ బాపి
తే. వరము గృప చేసితివి మేలు వారిజాక్ష
నీనృసింహావతారంబు నిష్ఠతోడఁ
దగిలి చింతించువారలు దండధరుని
బాధ నొందరు మృత్యువుబారిఁ బడరు. 381

టీ. దేవదేవ = ఉపాసించఁదగిన దేవతలకెల్ల దేవుఁడైనవాఁడా! అఖిలదేవేశ = ఎల్లయింద్రాదులగు దేవతలకు ప్రభువైనవాఁడా! భూతభావన = సర్వజంతువులను గాపాడుసంకల్పము గలవాఁడా! వీఁడు = ఈహిరణ్యకశిపుఁడు, నాచేత, వరము = ఇష్టము, వడసి = పొంది, మత్సృష్టజనులచేన్ = నాచేఁబుట్టించఁబడినజీవులచేత, మరణంబు నొందక = చావక, మత్తుఁడు = గర్వించినవాఁడు, ఐ, సకలధర్మములన్ = ఎల్లయాచారములను, చెఱచి, భాగ్యంబునన్ = మాయుందతియదృష్టబలమున, నేఁడు, నీచేత, హతుఁడు = చరిపఁబడినవాఁడు, అయ్యెను, లోకములకు ఎల్లన్ = సమస్తలోకములకును, కల్యాణము = క్షేమము, అమరెను. బాలున్ = కుఱ్ఱఁడును, మహాభాగవతశ్రేష్ఠున్ = గొప్పవిష్ణుభక్తాగ్రేసరుఁడగు, ఈతనిని = ఈప్రహ్లాదుని, మృత్యుభయమును, పాపి, బ్రతికించితివి, వరము = ఇష్టమైన అర్థమును, కృపచేసితివి = ఇచ్చినావు, మేలు = లెస్స, వారిజాక్ష = కమలములవంటి కన్నులుగలయోస్వామీ! నీనృసింహావతారంబున్ = నీనరసింహరూపమును, నిష్ఠ

తోడన్ = స్థిరమైన పూనికతో, తగిలి = తదేకరతులై, చింతించువారలు, దండధరునిబాధలన్ = యమయాతనను, ఒందరు, మృత్యువుబారిన్ = చావువాతను, పడరు.

తా. ఓనరసింహమూర్తీ! ఈరాక్షసుఁడు ముందుయోచింపక నే నిచ్చిన వరములవలన గర్వించి నాసృష్టిలోని యెల్లజంతువులవలనను ప్రాణభయము లేనివాఁడై వేదవిహితము లైన ఆచారవ్యవహారములన్నియు పాడుచేసి, మాయందఱపుణ్యబలమున నీచేతిలోఁ జచ్చెను. లోకములన్నియు నిఁక సుఖించును. ఈపుణ్యాత్ముఁడైన ప్రహ్లాదుని మృత్యువునోటఁబడకుండఁ దప్పించినావు. ఇంకను కోరినదాని నిచ్చినావు. బళీ! నీనరసింహావతారమును మంచి నిష్ఠతోఁ బనివడిస్మరించువారు యమబాధలఁ బొందరు మృత్యువుపాలుగారు.

వ. అనిన నరసింహదేవుం డిట్లనియె. 382

క. మన్నించి దేవశత్రుల
కెన్నఁడు నిటువంటివరము లీకుము పాపో
త్పన్నులకు వరము లిచ్చుట
పన్నగముల కమృత మిడుట పంకజగర్భా. 383

టీ. పంకజగర్భా = విష్ణునాభివలనఁ బుట్టిన ఓబ్రహ్మా! దేవశత్రులకున్ = రాక్షసులకు, మన్నించి = గౌరవించి, ఎన్నఁడును, ఇటువంటి వరములు = ఇట్టి ఈయరానివరములను, ఈయకుము, పాపోత్పన్నులకున్ = నీచజన్మము గలవారలకు, వరములు = ఇష్టములు, ఇచ్చుట, పన్నగములకున్ = పాములకు, అమృతమును, ఇడుట = ఇచ్చుటవంటిది.

తా. ఓచతురాననా! ఇఁకమీఁద నిట్లెన్నఁడును క్రూరరాక్షసుల లోకపెద్దగాఁ జేసి ఇట్టి యీయఁగూడనివరము లీయకుము. దుర్మార్గులకు అడిగినదాని నిచ్చుట పాములకు అమృతముఁ బోయుటతో సమానము.

వ. అని యి ట్లానతిచ్చి బ్రహ్మాది దేవతాసమూహంబుచేఁ బూజితుండై భగవంతుం డైన శ్రీనృసింహదేవుండు తిరోహితుం డయ్యెఁ బ్రహ్లాదుండును శూలికిఁ బ్రణమిల్లి తమ్మిచూలికి వందనంబులు చేసి ప్రజాపతులకు మ్రొక్కి భగవత్కళలైన దేవతలకు నమస్కరించినం జూచి బ్రహ్మదేవుండు శుక్రాది మునీంద్రసహితుం డై దైత్యదానవరాజ్యంబునకుం బ్రహ్లాదుం బట్టంబు గట్టి యతనిచేతఁ బూజితుం డై దీవించె నంత నీశానాదినిఖిలదేవతలు వివిధంబు లగునాశీర్వాదంబులచేత నా ప్రహ్లాదునిఁ గృతార్థుం జేసి తమ్మిచూలిని ముందఱ నిడుకొని నిజస్థానంబులకుఁ జని రిట్లు విష్ణుదేవుండు నిజపార్శ్వచరు లగువారు బ్రాహ్మణశాపంబునం జేసి ప్రథమజన్మంబున దితిపుత్రు లైనహిరణ్యాక్ష హిరణ్యకశిపులను వరాహనారసింహరూపంబుల నవతరించి వధియించె ద్వితీయభవంబున రాక్షసజన్మంబు దాల్చినరావణకుంభకర్ణులను శ్రీరామరూపంబున సంహరించెఁ దృతీయజన్మంబున శిశుపాలదంతవక్త్రు లను పేళ్లం బ్రసిద్ధి నొందినవారలను శ్రీకృష్ణరూపంబున ఖండించె నివ్విధంబున మూఁడుజన్మంబుల గాఢవైరానుబంధంబున నిరంతరసంభావితధ్యాను లై వారలు నిఖిలకల్మషవిముక్తు లై హరిం గదిసి రని చెప్పి నారదుం డిట్లనియె. 384

టీ. బ్రహ్మాది దేవతాసమూహంబుచేఁ = బ్రహ్మ మొదలైన దేవతలయొక్క సమూహముచేత, పూజితుండు = పూజింపఁబడినవాఁడు, ఐ, భగవంతుండు = షడ్గుణైశ్వర్యసంపన్నుఁడు, ఐన, నృసింహదేవుండు = నరసింహస్వామి, తిరోహితుండయ్యెఁ = అంతర్ధానమును బొందెను, ప్రహ్లాదుం

డును, శూలికిన్ = శివునకు, ప్రణమిల్లి = మ్రొక్కి, తమ్మిచూలికిన్ = తామరయందు బుట్టిన బ్రహ్మకు, వందనంబులు చేసి = నమస్కారములు చేసి, ప్రజాపతులకున్ = నవబ్రహ్మలకు, మ్రొక్కి, భగవత్కళలు = విరాట్టుని అంశలైన, దేవతలకు, నమస్కరించినన్ = మ్రొక్కఁగా, చూచి, బ్రహ్మదేవుండు, శుక్రాది మునీంద్రసహితుండై = శుక్రుఁడు మొదలగు మునిశ్రేష్ఠులతోఁ గూడినవాఁడై, దైత్యదానవరాజ్యంబునకున్ = దితిజులు దనుజులు ననునిరువెఱంగులరక్కసుల రాజ్యమునకు, ప్రహ్లాదుని, పట్టంబుగట్టి, అతనిచేతన్ = ప్రహ్లాదునిచేత, పూజితుండు = పూజింపఁబడినవాఁడు, ఐ, దీవించెను. అంతన్ = తర్వాత, ఈశానాదినిఖిలదేవతలు = ఈశ్వరుఁడు మొదలగు సమస్తదేవతలును, వివిధంబులు = నానావిధములు, ఆశీర్వాదంబులచేతన్ = దీవనలచేత, ఆ ప్రహ్లాదుని, కృతార్థునిన్ = ధన్యునిగా, చేసి, తమ్మిచూలిని = తామరకొడుకగు బ్రహ్మను, ముందట నిడికొని, నిజస్థానంబులకున్ = తమచోటులకు, చనిరి = పోయిరి. నిజపార్శ్వచరులు = తనప్రక్కల మెలఁగు సేవకులు, బ్రాహ్మణశాపంబునం జేసి = బ్రాహ్మణులైన సనకాదుల శాపమువలన, ప్రథమజన్మంబునన్ = మొదటిపుట్టుకయందు, దితిపుత్త్రులు = దితికొడుకులు, ద్వితీయభవంబునన్ = రెండవజన్మమందు, రాక్షసజన్మంబు = రక్కసిపుట్టువును, సంహరించెన్ = చంపెను. తృతీయజన్మంబునన్ = మూఁడవ పుట్టుకలో, గాఢవైరానుబంధంబునన్ = ఎడలేని వైరసంబంధమువలన, నిరంతరసంభావితధ్యానులు = ఎల్లప్పుడును అలవడిన ధ్యానముగలవారు, నిఖిలకల్మషవిముక్తులు = సమస్తపాపములనుండి విడువఁబడినవారు, హరిన్ = శ్రీవిష్ణువును, కదిసిరి = చేరిరి.

ఉ. శ్రీరమణీయమైననరసింహవిహారము నింద్రశత్రుసం
హారముఁ బుణ్యభాగవతుఁడైననిశాచరనాథపుత్త్రిసం
చారము నెవ్వఁడైన సువిచారతఁ విన్నఁ బఠించినన్ శుభా
కారముతోడ నేభయముఁ గల్గనిలోకముఁ జెందు భూవరా.

టీ. భూవరా = ధర్మరాజా! శ్రీరమణీయము = సంపదచే మనోజ్ఞమైనది; ఐన, నరసింహవిహారమున్ = నరసింహస్వామి క్రీడయును, ఇంద్రశత్రు సంహారము = దేవేంద్రుని శత్రువైన హిరణ్యకశిపుని జంపుటయు, పుణ్యభాగవతుఁడు = పావనుఁడైన భగవద్భక్తుఁడు, ఐన, నిశాచరనాథపుత్త్రసంచారముగా = ప్రహ్లాదుని నడవడియు, ఎవ్వఁడైనను, సువిచారతన్ = చక్కనివిమర్శతో, విన్నను, పఠించినన్ = చదివినను, శుభాకారములోడన్ = మంగళవిగ్రహముతోడ, ఏభయమును, కల్గని, లోకమును, చెందును.

తా. ధర్మరాజా! ఈపావనమైననరసింహావతార కీర్తనమును, పవిత్రుఁడైన ప్రహ్లాదకుమారుని నడవడియు ఎవఁడు భక్తితో ననుసంధానము చేయునో వాఁడు దివ్యమంగళవిగ్రహము గలవాఁడై భయరహితమైనలోకమును బొందఁగలఁడు.

మ. జలజాతప్రభవాదులున్ మనములోఁ జర్చించి భాషావళిం
బలుకన్ లేనిజనార్దనాహ్వయపరబ్రహ్మంబు నీయింటిలోఁ
జెలియై మేనమఱందియై సచివుఁడై చిత్తప్రియుండై మహా
ఫలసంధాయకుఁడై చరించుటలు నీభాగ్యంబు రాజోత్తమా.

టీ. రాజోత్తమా = ధర్మరాజా! జలజాతప్రభవాదులున్ = బ్రహ్మ మొదలగు దేవతలును, మనములోన్ = చిత్తమందు, చర్చించి = తలఁచి, భాషావళిన్ = వాక్కులచేత, బలుకన్, లేని, జనార్దనాహ్వయపరబ్రహ్మంబు = విష్ణురూపమైన పరమాత్మ, నీయింటిలోన్, చెలియై = మిత్త్రుఁడై, మేనమఱందియై = మేనత్తకొడుకై, సచివుఁడై = ఎల్లపనులలో మంత్రియై, చిత్తప్రియుండై = హృదయమున నిష్టమైనవాఁడై, మహాఫల సంధాయకుఁడు = గొప్ప ఐహికాముష్మికము లైనఫలములను గూర్చువాఁడై, చరించుటలు = మెలఁగుటలు, నీభాగ్యంబు = నీయదృష్టము.

తా. రాజా! బ్రహ్మాదులును మనమున నిష్కృష్టముగా ధ్యానింపలేక వాక్కులతో చెప్పఁజాలకున్న అనిర్వాచ్యమై అచింత్యమైన శ్రీకృష్ణపరమాత్మ నీకు మిత్త్రుఁడై గాదిలిమఱందియై అన్నిట మంత్రియై మనమున్న కిష్టుఁడై గొప్పఫలమును గూర్చువాఁడై మెలఁగుట నీయదృష్టముకదా.

త్రిపురాసురసంహారము.

క. బహుమాయుఁ డైనమయుచే
విహతం బగుహరునియశము విఖ్యాతజయా
వహముగ నీభగవంతుఁడు
మహితాత్ముఁడు మున్నొనర్చె మనుజవరేణ్యా. 387

టీ. మనుజవరేణ్యా = మానవులలో శ్రేష్ఠుఁడ వైన ఓధర్మరాజా! మున్ను = పూర్వము, మహితాత్ముఁడు = పూజ్యమైన స్వరూపముగల, ఈభగవంతుఁడు = విష్ణువు, బహుమాయుఁడు = పలుమాయలుగలవాఁడు, ఐన, మయుచేన్ = మయునిచేత, విహతంబు = భంగపఱచఁబడినది, అగు, హరునియశము = శివునికీర్తి, విఖ్యాతజయావహముగన్ = ప్రసిద్ధమైన గెలుపునకు నెలవైనదానిఁగా, ఒనర్చెన్ = చేసెను.

తా. రాజా! పూర్వము మాయావి యైనమయాసురునిచేతఁ జిక్కులు పెట్టఁబడిన శివుని ఈ విష్ణువు వాని మాయలఁ దొలఁగించి సుఖము గలవానిఁగాఁ జేసెను.

వ. అనిన ధర్మనందనుం డిట్లనియె. 388

టీ. ధర్మనందనుండు = యమధర్మరాజుకొడుకగు ధర్మరాజు

క. ఏకర్మంబున విభుఁ డగు
శ్రీకంఠునియశము మయునిచే నుడివడియెన్
వైకుంఠుఁ డెవ్విధంబునఁ
గైకొని తత్కీర్తి చక్కఁగా నొనరించెన్. 389

టీ. ఏకర్మంబునన్ = ఎట్టిపనిచేత, విభుఁడు = ప్రభువు, అగు శ్రీకంఠునియశము = అయిన శివునికీర్తి, మయునిచేన్ = మయాసురుని చేత, సుడివడియెన్ = నశించెను, వైకుంఠుఁడు = విష్ణువు, ఎవ్విధంబునన్ = ఏలాగున, కైకొని = పూని, తత్కీర్తి = వానియశము, చక్కఁగాన్ = ప్రసిద్ధముగా, ఒనరించెన్ = చేసెను.

తా. నారదా! ఏకార్యమువలన మయుఁడు శివునికీర్తికి భంగముగలిగించెను. దాని నెట్లు విష్ణువు చక్కఁబఱిచెనో తెలియ నానతిమ్ము.

వ. అనిన నారదుం డి ట్లనియె. 390

క. చక్రాయుధబలయుతు లగు
శక్రాదుల కోహటించి క్రమమున నసురుల్
సక్రోధంబుగ నరిగిరి
విక్రమములు మాని మయుని వెనుకకు నధిపా. 391

టీ. అధిపా = రాజా! అసురుల్ = రాక్షసులు, చక్రాయుధబలయుతులు = విష్ణునిప్రాపు గలవారు, అగు, శక్రాదులకున్ = ఇంద్రుఁడు మొదలగు దేవతలకు, ఓహటించి = వెనుకతగ్గి (ఓడి), సక్రోధంబుగన్ = కోపముతోఁ గూడునట్లు, విక్రమములు = పరాక్రమములు, మాని = వదలి, మయుని వెనుకకున్ = మయాసురుని చాటునకు, అరిగిరి = పోయిరి.

తా. రాజా! రాక్షసులందఱు దేవతలపై బాడి వెడలి విష్ణునిబలము వలన విజృంభితులైనవారిధాటి కోర్వఁజాలక యుద్ధముమాని క్రోధముతోఁ బోయి మయునిచాటునకుఁ జేరిరి.

వ. ఇట్లు రక్కసులు దనవెనుకఁ జొచ్చిన మాయామానిలయుండును దుర్జయుండును నైనమయుండు దనయోగంబున నయోరజతసువర్ణమయంబులై యెవ్వరికిని లక్షింప రానిగమనాగమనంబులును వితర్కింప రానికర్కశపరిచ్ఛదంబులును

గలిగినత్రిపురంబుల నిర్మించి యిచ్చిన నక్తంచరు లందఱు
నందుఁ బ్రవేశించి కామసంచారులై పూర్వవైరంబుఁ దలం
చి సనాయకంబు లయినలోకంబుల నస్తోకం బయిన
నిజబలాతిరేకంబున శోకంబు నొందించిన. 392

టీ. మాయానిలయుండు = మోసమునకుఁ జోటైనవాఁడు, దుర్ణయుండు = చెడ్డనీతి గలవాఁడు, తనయోగబలంబునన్ = తనమాయా ప్రభావముచేత, అయో...మయంబులు = ఉక్కు వెండి బంగారువికారములు, వి, ఎవ్వరికిని, లక్షింపన్ = గుఱుతించుటకు, రానిగమనాగమనంబులును = వీలుకాని రాకపోకలును, వితర్కింపన్ = ఊహించుటకు, రాని, కర్కశపరిచ్ఛదంబులును = కఠినములైన కోటలును, కలిగిన, త్రిపురంబులన్ = మూఁడుపట్టణములను, నిర్మించి = ఏర్పఱచి, నక్తంచరులు = (రాత్రులయందు దిరుగు) రాక్షసులు, అందున్ = ఆత్రిపురములలో, ప్రవేశించి = చొచ్చి, కామసంచారులు ఐ = యథేష్టముగాఁ దిరుగువారై, పూర్వవైరంబు = వెనుకటిపగ, సనాయకంబులు = లోకపాలురతోఁ గూడిన, లోకంబులను = జగములను, అస్తోకంబు = అధికము, ఐన, నిజబలాతిరేకంబునన్ = తనబలముయొక్క అతిశయముచేత, శోకంబున్ ఒందించినన్ = బాధపెట్టఁగా.

క. లోకాధినాథు లెల్లను
శోకాతురు లగుచు శరణు చొచ్చిరి దుష్టా
నీకవిదళనాకుంఠున్
శ్రీకంఠున్ భువనభరణచిత్తోత్కంఠున్. 393

టీ. లోకాధినాథులు ఎల్లను = లోకపాలకులందఱును, శోకాతురులు = దుఃఖముచేఁ బీడింపఁబడినవారలు, అగుచున్, దుష్టానీకవిదళనాకుంఠున్ = దుష్టుల సమూహములను మర్దించుటయందు అనర్గళుఁడైనవాఁడును, భువనభరణ చిత్తోత్కంఠున్ = లోకములను గాపాడుటయందు ప్రీతిగల హృదయముగల, శ్రీకంఠున్ = శివుని, శరణు చొచ్చిరి.

తా. అంతట లోకపాలకులందఱును దుఃఖాక్రాంతులై దుర్జనదనుజ మర్దనుఁడును లోకభరణదీక్షయుం దాసక్తి గలవాఁడు నగుసాంబమూర్తిని శరణు జొచ్చిరి.

వ. ఇట్లు సకలలోకేశ్వరుం డగుమహేశ్వరుం జేరి లోకపాలకు
లు ప్రణతులై పూజించి కరకమలంబులు ముకుళించి. 394

టీ. సకలలోకేశ్వరుండు = ఎల్లలోకములకుఁ బ్రభుఁడైనవాఁడు, ప్రణతులు = నమ్రులు, ఐ, పూజించి = పూజలుచేసి, కరకమలంబులు = కేలుఁదామరలు, ముకుళించి = అంజలిచేసి యనుట.

క. త్రిపురాలయు లగుదానవు
లపరాజితు లగుచు మాకు నశ్రాంతంబుఁ
వపురాదిపీడఁ జేసెద
రపరాధికులను వధింపు మగజాధీశా. 395

టీ. అగజాధీశా = పార్వతికి ప్రియుఁడవగు నోసదాశివా! త్రిపురాలయులు = త్రిపురములు కాఁపురముగాఁగలవారు, అగు, దానవులు = రాక్షసులు, అపరాజితులు = ఓడనివారు, అగుచు, మాకుఁ, అశ్రాంతంబుఁ = ఎల్లప్పుడును, వపురాదిపీడఁ = శరీరము మొదలైనవానికి అపాయమును, చేసెదరు, అపరాధికులను = అట్టిజగద్ద్రోహులను, వధింపుము = చంపుము.

తా. ఓపార్వతీశ్వరా! త్రిపురములలోఁ గాఁపురమున్న రాక్షసులు బలవంతులై మమ్ము పలువిధముల బాధించుచున్నారు. ఆక్రూరులను సంహరించి మమ్ము గాపాడుము.

క. దీనులము గాక యుష్మద
ధీనుల మై యుండుమేము దేవాహితదో
ర్లీనుల మైనారము బల
హీనుల మగునమ్ముఁ గావు మీశాన శివా. 396

టీ. ఈశాన = ఈశ్వరా! శివా! దీనులము = అల్పులము, కావ, యుష్మదధీనులము = నీకు స్వాధీనులము, ఐ, ఉండు మేము, దేవాహిత దోర్లీనులము = రాక్షసుల చేతులలో నణఁగి పోయినవారము, ఐవారము, బలహీనులము = శక్తిలేనివారము, మమ్మున్, కావుము = రక్షించుము.

తా. ఎప్పుడు ఏయాపదలను నెఱుఁగక నీప్రాపుచేత నిరంకుశులమై యున్న మాకు నేఁ డీరాక్షసులచేతులలో నిట్టిపాట్లు గల్గినవి. ఇట్టియశక్తుల మైనమమ్ము రక్షింపుము.

వ. అనిన భక్తవత్సలుం డగుపరమేశ్వరుండు శరణాగతు లైన గీర్వాణుల వెఱవకుం డని దుర్వారబలంబున బాణాసనంబుఁ గేల నందుకొని యొక్కదివ్యబాణంబు సంధించి త్రిపురంబులపయి నేసిన మార్తాండమండలంబున వెలువడు మయూఖజాలంబులచందంబునఁ దద్బాణంబువలన దేదీప్యమానంబు లై యనేకబాణసహస్రంబులు సంభవించి భూనభోంతరాళంబులు నిండి మండి తెప్పలుగాఁ గుప్పలుగొని త్రిపురంబులపయిఁ గప్పె నప్పుడు తద్బాణపావక హేతిసందోహ దందహ్యమానులై గతాసు లైనత్రిపురపురనివాసులం దెచ్చి మహాయోగియైనమయుండు సిద్ధరసకూపంబున వైచిన. 397

టీ. భక్తవత్సలుండు = భక్తులయందు ప్రేమగలవాఁడు, అగు, పరమేశ్వరుండు = శివుఁడు, శరణాగతులు = రక్షణముగోరి వచ్చినవారు, ఐన, గీర్వాణులన్ = దేవతలను, వెఱవకుండుఁడు = భయమందకుఁడు, అని, దుర్వారబలంబునన్ = అపరానిసామర్థ్యముతోడ, బాణాసనంబున్ = ధనుస్సును, కేలన్ = చేతితో, అందికొని, ఒక్కదివ్యబాణంబు = దేవతాసంబంధమైనబాణమును, సంధించి = పూన్చి, త్రిపురంబులపయిన్, ఏసినన్ = ప్రయోగింపఁగా, మార్తాండ మండలంబునన్ = సూర్యమండలమందు, మయూఖజాలంబుచందంబునన్ = కిరణములగుంపువలె, తద్బాణానలంబు

లన్ = ఆబాణాగ్నిచేత, దేదీప్యమానంబులై=మిగులమండుచున్నవై, అనేకబాణసహస్రంబులు = వేనవేలు బాణములు, సంభవించి=పుట్టి, భూనభోంతరాళంబులు = భూమి ఆకాశములు, నిండి, మండి, తెప్పలుగాన్=తుట్టెలుగా, కుప్పలుగొని=గుంపులై, తద్బాణ...మానులు=ఆయీశ్వరుని బాణములయందలి అగ్నిబాణముల గుంపులచే మిగులఁ గాల్పఁబడినవారు, గతాసులు=పోయినయూపిరిగలవారు, త్రిపురపురనివాసులన్=త్రిపురములఁ గాఁపురమున్న రాక్షసులను, మహాయోగి = గొప్పమణిమంత్రౌషధసిద్ధుఁడు, ఐన, మయుండు=మయాసురుఁడు, సిద్ధరసకూపంబునన్=అమృతరసము గలబావిలో, వైచినన్=పడవేయుఁగా.

క. సిద్ధామృతరసమహిమను
శుద్ధమహావజ్రతుల్యశోభితతను లై
వృద్ధిం బొందిరి దానవు
లుద్ధతనిర్ఘాతపావకోపము లగుచున్. 398

టీ. సిద్ధామృతరసమహిమన్ = యోగసిద్ధమైన అమృతద్రవముయొక్కబలముచేత, శుద్ధ...తనులు=మృత్యుబాధలేక వజ్రములవంటివై ప్రకాశించుశరీరములుగలవారు, ఐ, దానవులు=రాక్షసులు, ఉద్ధత...పములు=ఉగ్రములైనపిడుగులు నిప్పులను పోలికగలవారు, అగుచు, వృద్ధిన్ పొందిరి=పెంపొందిరి.

తా. ఇట్లు మయుని ప్రభావముచేత రాక్షసులందఱు యోగలబ్ధమయిన అమృతద్రవసంపర్కముచేత బాధనుండి తొలఁగి వజ్రతుల్యములై ప్రకాశించుశరీరములు గలవారై పిడుగులవంటివారును నిప్పుకణములవంటివారు నై చెలరేఁగిరి.

క. కూపామృతరససంగతి
దీపితు లై నిలిచి యున్న దేవాహితులన్

రూపించి చింత నొందెడు
గోపధ్వజుఁ జూచి చక్రి కుహనాన్వితుఁ డై. 399

టీ. కూపా...దీపితులు = నూతియందలి అమృతద్రవము సంబంధమునఁ దెలివినందినవారు, ఐ, నిలిచి, ఉన్న, దేవాహితులన్ = రాక్షసులను, రూపించి = కనిపట్టి, చింతనొందెడు గోపధ్వజున్ = వ్యసనపడు (గోపమే టెక్కెముగాఁగల) సాంబమూర్తిని, చూచి, చక్రి = విష్ణువు, కుహనాన్వితుఁడు = మోసముతోఁ గూడినవాఁడు.

తా. ఇట్లు మయాసురనియోగముచే నేర్పడిన బావిలోని అమృతద్రవముఁ ద్రావి బ్రతికి ప్రబలులైన రాక్షసులం గాంచి యీశ్వరుండు దుఃఖించుచున్న శివునిం జూచి విష్ణుమూర్తి తనమాయావిలాసముతోఁ గూడినవాఁడై.

శా. ఉత్సాహంబున నొక్కపాఁడిమొదవై యూధంబు ఘ్రాణించుచున్, వత్సంబై తనవెంట బ్రహ్మ నడువన్ వైకుంఠుఁ డేతెంచి యు,ద్యత్సత్త్వంబునఁ గూపమధ్యరసముం ద్రావెన్ విలోకించుచుం, దత్సౌభాగ్యనిమగ్ను లై మఱచి రా దైత్యుల్ నివారింపఁగన్. 400

టీ. ఉత్సాహంబునన్ = వేడుకతో, ఒక్క, పాఁడిమొదవు = పాలుపితుకు ఆవు, ఐ, బ్రహ్మ, వత్సంబు = దూడ, ఐ, ఊధంబు = పొదుగును, ఘ్రాణించుచున్ = మూర్కొనుచు, తనవెంటన్, నడువన్, వైకుంఠుండు = విష్ణువు, ఏతెంచి = పోయి, ఉద్యత్సత్త్వంబునన్ = పొడముచున్న బలముచేత, కూపమధ్యరసమున్ = అమృతపుబావిలోని యమృతమును, త్రావెను, ఆ దైత్యుల్ = అచ్చటి రాక్షసులు, విలోకించుచున్ = ఆయావును చూచుచు, దత్సౌభాగ్యనిమగ్నులు = దానిచక్కఁదనమునఁ దగులుపడినవారై, నివారింపఁగన్ = అడ్డగించుటకు, మఱచిరి.

తా. ఇట్లు వేడుకమీఱ విష్ణువు పాఁడియావై బ్రహ్మ దూడయై తన పొదుగు మూర్కొనుచు వెంటరాగా వచ్చి గొప్పగడుసుదనముతో నచ్చోఁ గాచియున్న రాక్షసులు చూచుచుండఁగనే వారి యమృతపుబావిలోని నీరంతయు ద్రాగెను. వారును ఆ యావునందమునకు లోనై దాని నావలఁ దోలక మోసముపాలయిరి.

వ. ఇట్లు విష్ణుండు మోహనాకారంబున ధేను వయి వచ్చి త్రిపురమధ్యకూపామృతరసంబు ద్రావిన నెఱింగి శోకాకులచిత్తులై నరసకూపపాలకులం జూచి మహాయోగి యైనమయుండు వెఱఁగుపడి దైవగతిం జింతించి శోకింపక యిట్లనియె. 401

టీ. మోహనాకారంబునన్ = మోసపువేషముతో, ధేనువు = మొదవు, త్రిపురమధ్యకూపామృతరసంబు = త్రిపురముల నడుమనున్న బావిలోని యమృతద్రవమును, శోకాకులచిత్తులు = దుఃఖముచేఁ గలఁతపాటిన మనసు గలవారు, రసకూపపాలకుల్ = అమృతబావికాపరులను, చూచి, మహాయోగి = గొప్పయోగము గలవాఁడు, వెఱఁగుపడి = ఆశ్చర్యమంది, దైవగతిన్ = విధివిలసితమును, చింతించి = విచారించి, శోకింపక = దుఃఖింపక.

ఆ. అమరు లైన దనుజు లైనను నరు లైన
నెంతనిపుణు లైన నెవ్వ రైన
దైవికార్థచయముఁ దప్పింపఁ గా లేరు
వలదు దనుజులార వగవ మనకు. 402

టీ. దనుజులార = రాక్షసులారా! అమరులు = దేవతలు, దనుజులు = రాక్షసులు, నరులు = మానవులు, నిపుణులు = నేర్పరులు, దైవికార్థచయము = దైవమువలనఁ గలుగు ఇష్టానిష్టసముదాయమును, తప్పింపఁగాన్ లేరు = తొలఁగించుటకుఁ జాలరు, వగవన్ = దుఃఖపడుటకు, వలదు.

తా. రాక్షసులారా! సురాసురులును మానవులును ఎంతటియుపాయవంతులును ప్రజ్ఞావంతులును, దైవమువలన ప్రాప్తించిన మంచిచెడ్డలఁ దప్పింపఁజాలరు. గనుక మనము శోకింపఁ బ్రయోజనము లేదుగాన మానుఁడు.

వ. అని పలికె నంత విష్ణుండు నైజంబులైన ధర్మజ్ఞానవిద్యాతపోవిరక్తిసమృద్ధిక్రియాశక్తివిశేషంబుల శంభునికిఁ బ్రాధాన్యంబు సమర్పించి రథసూతకేతువర్మబాణాసనప్రముఖసంగ్రామసాధనంబులు చేసినం గైకొని. 403

టీ. నైజంబులు=తనవి, ధర్మ...విశేషంబులన్ = న్యాయము తెలివి చదువు తపము విషయవిరతి పూర్ణత కర్మ సామర్థ్యము వీనియతిశయము చేత, ప్రాధాన్యంబు=ముఖ్యత్వము, సమర్పించి = ఇచ్చి, రథ...సాధనంబులు=తేరు సారథి టెక్కెము జోడు విల్లు మొదలుగాఁగలయుద్ధపరికరములు, చేసినన్=కల్పించి యీయఁగా, కైకొని=పుచ్చుకొని.

మ. శరియై కార్ముకియై మహాకవచియై సన్నాహియై వాహియై
సరథుండై సనియంతయై సబలుఁడై సత్కేతనచ్ఛత్రుఁడై
పరమేశుం డొకబాణముం విడిచెఁ దద్బాణానలజ్వాలలం
బురముల్ గాలె ఛటచ్ఛటధ్వనినభోభూమధ్యముల్ నిండఁగన్.

టీ. పరమేశుండు=శివుఁడు, శరి=బాణముగలవాఁడు, కార్ముకి = విల్లుగలవాఁడు, మహాకవచి =అభేద్యమైనజోడుగలవాఁడు, సన్నాహి = పూన్కిగలవాఁడు, వాహి=గుఱ్ఱములుగలవాఁడు, సరథుఁడు =రథముతోఁ గూడినవాఁడు, సనియంత=సారథితోఁ గూడినవాఁడు, సబలుఁడు=సైన్యముతోఁ గూడినవాఁడు, సత్కేతనచ్ఛత్రుఁడు=మంచిటెక్కెము గొడుగు గలవాఁడు, ఐ, ఒకబాణముం, విడిచెను, తద్బాణానలజ్వాలలన్ = ఆ బాణముల మంటలచేత, ఛటచ్ఛటధ్వని, నభోభూమధ్యముల్ = ఆకాశము భూమి వీనినడుము, నిండఁగన్=నిండుకొనఁగా.

తా. సులభము.

వ. ఇట్లు హరుండు దురవగాహంబు లైనత్రిపురంబుల నభిజిన్మ
హూర్తంబున భస్మంబు చేసి కూల్చిన నమరగరుడగంధర్వ
సిద్ధసాధ్య యక్షవల్లభులు వీక్షించి జయజయశబ్దంబులు చే
యుచుం గుసుమవర్షంబులు వర్షించిరి ప్రజలు హర్షించిరి బ్ర
హ్మాదులు గీర్తించి రప్సరసలు నర్తించిరి దివ్యకాహళదుం
దుభిరవంబులును మునిజనోత్సవంబులును బ్రచురంబు లయ్యె
నిట్లు విశ్వజనీనం బగుత్రిపురాసురసంహారంబున నఖిలలో
కులును సంతసిల్లియుండ నయ్యవసరంబున. 405

టీ. దురవగాహంబులు=చొరరానివి, అభిజిన్మహూర్తంబునన్ = (పగలు పదునాలుగు గడియలమీఁద) మిట్టమధ్యాహ్నమందు, కూల్చినన్= సంహరింపఁగా, అమర...వల్లభులు = దేవతలు, గరుడులు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు, యక్షులును, వీక్షించి=చూచి, జయజయశబ్దంబులు = జయజయ అను కేకలను, కుసుమవర్షంబులు=పూవులవానలు, వర్షించిరి=కురిపించిరి, హర్షించిరి=సంతసించిరి, బ్రహ్మాదులు = బ్రహ్మ మొదలగువారలు, కీర్తించిరి=నుతించిరి, నర్తించిరి=ఆడిరి, దివ్య...బులు=దేవతల వగు కాహళలయొక్క భేరీలయొక్క మ్రోఁతలు, మునిజనోత్సవంబులు = మునుల వేడుకపనులును, ప్రచురంబులయ్యెన్=వెల్లడియాయెను, విశ్వజనీనము = ఎల్లజనుల మేలుకొఱకైనది, త్రిపురాసురసంహారంబునన్=త్రిపురదానవుల నాశమువలన, అఖిల=సమస్తమైన, అయ్యవసరంబునన్ = ఆసమయమందు.

ఆ. తృణకణములభంగిఁ ద్రిపురంబుల దహించి
పరముఁ డవ్యయుండు భద్రయశుఁడు
శివుఁడు పద్మజాదిజేగీయమానుఁ డై
నిజనివాసమునకు నెమ్మిఁ జనియె. 406

టీ. పరముఁడు=శ్రేష్ఠుఁడును, అవ్యయుండు=నాశము లేనివాఁడును, భద్రయశుఁడు=శుభమైనకీర్తిగలవాఁడు, త్రిపురంబులను, తృణకణముల

భంగిన్ = గడ్డిపోఁచలవలె, దహించి = కాల్చి, పద్మజాది దేగీయమానుఁడు = బ్రహ్మమొదలగువారిచే నుతింపఁబడినవాఁడై, ప్రేమన్ = ప్రియముతో, నిజ నివాసమునకున్ = తన తావునకు (కైలాసమునకు), చనియెన్ = పోయెను.

తా. పరాత్పరుఁడును వాలిమెఱుఁగగు యుత్తమశ్లోకుఁడైన యోగీశ్వరుఁడు ఇట్లు త్రిపురములను గడ్డిపోఁచలవలెఁ గాల్చివైచి బ్రహ్మాదులచేఁ గీర్తింపఁబడినవాఁడై కైలాసమునకు వెంచేసెను.

వ. ఇట్లు నిజమాయావిశేషంబున మర్త్యలోకంబున విడంబిం
చు చున్నవిష్ణునిపరాక్రమవిధానంబులు మునిజనవంద్య
మానంబులై సకలలోకకల్యాణప్రదానంబులై యుండు
ననిన విని నారదునకు ధర్మనందనుం డిట్లనియె. 407

టీ. నిజమాయావిశేషంబునన్ = తనమాయయొక్క యతిశయము చేత; మర్త్యలోకంబునన్ = మనుష్యలోకమందు, విడంబించుచున్న = మానుషచర్యలను అనుసరించుచున్న, విష్ణుని, పరాక్రమవిధానంబులు = శౌర్యగతులు, మునిజనవంద్యమానంబులు = మునీశ్వరులచే మ్రొక్కఁబడినవి, సకలలోకకల్యాణప్రదానంబులు = ఎల్లలోకములకు మంగళముల నిచ్చునవి.

నారదుండు ధర్మరాజునకు వర్ణాశ్రమ ధర్మంబులు దెలుపుట.

సీ. అనఘాత్మ సకలవర్ణాశ్రమాచారస
మ్మతధర్మ మెయ్యది మానవులకు
నేధర్మమున నరుం డిద్ధవిజ్ఞానము
భక్తియుఁ బ్రాపించుఁ బద్మజునకు
సాక్షాత్సుతుండవు సర్వజ్ఞుఁడవు నీకు
నెఱుఁగరానిది ధర్మ మింత లేదు

నారాయణపరాయణస్వాంతు లనఘులు
శాంతులు సదయులు సాధువృత్తి
ఆ. మెఱయు చున్నఘనులు మీవంటివా రెద్ది
పరమధర్మ మనుచు భక్తిఁ దలఁతు
రట్టిధర్మరూప మఖిలంబు నెఱిఁగింపు
వినఁగ నిచ్చ గలదు విమలచరిత. 408

టీ. అనఘాత్మ = పాపమెఱుఁగనివాఁడా ! మానవులకు, సకల... ధర్మము = ఎల్లవర్ణములకు ఆశ్రమములకు విరోధముకాని యాచారము, ఎయ్యది = ఏది, నరుండు, ఏధర్మమునన్ = ఏయాచరణముచేత, ఇద్ధవిజ్ఞానము = మేలైనతెలివిని, భక్తియున్ = పూజ్యులయెడ ననురాగమును, ప్రాపించున్ = పొందును. నీవు, పద్మజునకున్ = బ్రహ్మదేవునకు, సాక్షాత్పుత్రుండవు = ఔరసపుత్త్రుఁడవు, సర్వజ్ఞుఁడవు = ఎల్లధర్మములు నెఱిఁగినవాఁడవు, నీకున్, ఎఱుఁగరాని = తెలియ నలవికాని, ధర్మము = సదాచారము, ఇంత = కొంచెమును, లేదు, నారాయణ...స్వాంతులు = విష్ణునియందు ఆసక్తమైన మనసుగలవారు, అనఘులు = పాపములంటనివారు, శాంతులు = నిత్యశమసంపన్నులు, సదయులు = కరుణతోఁగూడినవారు, సాధువృత్తిన్ = సద్వర్తనముచేత, మెఱయుచున్నఘనులు = ప్రకాశించుచున్న గొప్పవారు, మీవంటివారు, పరమధర్మము = మేలిస్వభావము, అనుచున్, భక్తిన్ = ఆదరముతో, తలఁతురు = ఒప్పుకొందురో, విమలచరిత = పావనమైన నడవడిగల యోనారదమునీంద్రా! అట్టి, ధర్మరూపము = ధర్మముయొక్కరీతి, అఖిలంబు = అంతయును, ఎఱిఁగింపుము = తెలియఁజేయుము, వినఁగన్ = వినుటకు, ఇచ్చ = కోరిక, కలదు.

తా. ఓనారదమునీంద్రా ! మనుజులకు ఎల్లబ్రాహ్మణాదివర్ణములకు, అన్ని బ్రహ్మచర్యము మొదలుగాఁగలయాశ్రమములకు, అవిరోధమైన యుత్తమధర్మ మేది ? మనుజుఁ డేధర్మమనుష్ఠించి చక్కని తెలివితేటలను భక్తిని

కొందఁగలఁడు? నీవు సర్వభూతములకు నాదియు నుత్పత్తికారణుండైన బ్రహ్మకు బ్రత్యక్షసుతుండవు. విజ్ఞాననిధి వగు నీకుఁ దెలియని దుండదు. విష్ణురతులును, పాపరహితులును, నిత్యశాంతులును, దయగలవారును, మంచినడవడి గలమీబోంట్లివారు ఏది పరమధర్మ మని యనుష్ఠింతురో అట్టిదాని స్వరూపమంతయు మీవలన వినఁ గుతూహలినైయున్నాను. దయచేసి యానతీఁగింపఁగోరెదను.

వ. అనిన నారదుండు ధర్మరాజుం జూచి దాక్షాయణీసుతుండు నిజాంశంబున నవతరించి భువనశోభనంబుకొఱకు బదరికాశ్రమంబునఁ దపోనిరతుం డయి యున్న నారాయణమునివలన సనాతనం బగుధర్మంబు వింటి నది సెప్పెద సకలవర్ణంబుల జనులకు సత్యంబును దయయును నుపవాసాదితపంబును శౌచంబును సైరణయు సదసద్వివేకంబును మనోనియమంబును బహిరింద్రియజయంబును హింస లేమియు బ్రహ్మచర్యంబును దానంబును యథోచితజపంబును సంతోషంబును మార్దవంబును సమదర్శనంబును మహాజనసేవయు గ్రామ్యంబు లయినకోరికలు మానుటయు నిష్ఫలక్రియలు విడుచుటయు మితభాషిత్వంబును దేహంబు గానితన్ను వెదకికొనుటయు నన్నోదకంబులు ప్రాణులకుం బంచియిచ్చుటయుఁ బ్రాణులందు దేవతాబుద్ధియు నాత్మబుద్ధిం జేయుటయు శ్రీనారాయణచరణ స్మరణ కీర్తన శ్రవణ సేవార్చన నమస్కార దాస్యాత్మసమర్పణ సఖ్యంబు లనియెడి త్రింశల్లక్షణంబులు గలుగవలయు నందు సత్కులాచారుం డయి మంత్రవంతంబులైన గర్భాధానాదిసంస్కారంబు లవిచ్ఛిన్నంబులుగాఁ గలవాఁడు ద్విజుండు ద్విజునకు యజనయాజనాధ్యయనాధ్యాపనదాన ప్రతిగ్రహంబు లనుషట్కర్మంబులు విహితం

బులు. రాజునకుఁ బ్రతిగ్రహావ్యతిరిక్తంబు లయిన యజనాది కర్మంబు లయిదును బ్రజాపాలనంబును బ్రాహ్మణులు గాని వారివలన దండశుల్కాదులు గొనుటయు విహితకర్మంబులు వైశ్యునికిఁ గృషివాణిజ్యగోరక్షణాదికర్మంబులును బ్రాహ్మణకులానుసరణంబును విహితంబులు శూద్రునకు ద్విజ శుశ్రూష చేయవలయు. 409

టీ. దాక్షాయణీనందనుఁడు = దక్షునికూఁతురైన మూర్తిదేవియందు, (ధర్మునకు) నిజాంశంబునన్ = తనకళతోడ, నవతరించి = పుట్టి, భువనశోభనంబుకొఱకు = లోకముల క్షేమముకొఱకు, బదరికాశ్రమంబునన్ = బదరిక అనునొక ఆశ్రమమునందు, తపోనిరతుఁడు = తపస్సునందు లగ్నమైనచిత్తము గలవాఁడు, నారాయణుఁడనుఋషివలన, సనాతనము = శాశ్వతము, అగుధర్మంబు, నేను, వింటిని, అది, నీకు, చెప్పెదను. సకలవర్ణంబులకున్ = అన్నికులములవారలకును, సత్యంబు = అసత్యమాడమి, దయ = కరుణ, ఉపవాసాదితపంబు = నిరశనవ్రతము మొదలైనదియు, శౌచము = సదాచారము, సైరణ = ఓరుపు, సదసద్వివేకంబు = మంచిచెడ్డలరయుటయు, మనోనియమంబు = మనస్సును వశపఱచుకొనుట, బహిరింద్రియజయంబు = వాక్పాణిపాదపాయూపస్థలను లోఁబఱచుకొనుట; హింస = జీవహత్య, లేమియు, బ్రహ్మచర్యంబు = బ్రహ్మత్వమందలి తలఁపును (బ్రహ్మచారి ధర్మమును), దానంబును = కలిగినదాని నిచ్చుటయు, యథోచితజపంబును = దేశకాలములకుఁ దగినట్లు జపముచేయుట, సంతోషంబును = తృప్తియు, మార్దవంబును = కలఁకుఁదనము లేకుండుట, సమదర్శనంబును = సర్వభూతసమస్తవస్తువులయందు ఆత్మీయ పరకీయ భ్రాంతిలేకుండుట, మహాజనసేవయు = ఉత్తముల కైంకర్యము, గ్రామ్యంబులు = తుచ్ఛములు, నిష్ఫలక్రియలు = ప్రయోజనములేని పనులు, (అనఁగా పుల్లలు త్రుంచుట, మట్టినలుపుట, గీఁతలుగీయుట, రాళ్లురువ్వుట మొదలగునవి) విడుచుటయు, మితభాషిత్వంబు = పొల్లులు రానియట్ల

తగినంతగా మాటలాడుట, దేహంబుకాని తన్ను వెదకికొనుట = దేహము
కంటె వేఱైన తనస్వరూపమును వెదకి కనుఁగొనుట, అన్నోదకములు =
కూడు నీళ్లను, ప్రాణులకుఁ = జంతువులకు, పంచియిచ్చుట = పంచిపె
ట్టుట, ప్రాణులయందుఁ = జంతువులయందు, దేవతాబుద్ధియుఁ =
దేవతస్వభావనయు, ఆత్మబుద్ధిఁ = ఆత్మభావనయు, చేయుటయు, శ్రీనా
రాయణ...సఖ్యంబులు = శ్రీహరి పాదస్మరణము, సంకీర్తనము, తత్క
థాశ్రవణము, కైంకర్యము, పూజనము, మ్రొక్కుట, కొలుచుట, తనను
సమర్పించుట, చెలిమిసేయుట, అనియెడి త్రింశల్లక్షణంబులు = అని
చెప్పఁబడుముప్పది భాగవత శ్రీచిహ్నములు, కలుగవలయును, అందు =
వానిలో, సత్కులాచారుండు = మేలైనకులము మంచియాచారము గల
వాఁడు, అయి, మంత్రపంతంబులు = మంత్రపూతములు, ఐన, గర్భాధానాది
సంస్కారంబులు = కర్మలు, అవిచ్ఛిన్నంబుగాఁ = తెంపుకలుగకుండ,
కలవాఁడు = చేయఁబడియున్నవాఁడు, ద్విజుండు = బ్రాహ్మణుఁడు
(రెండుమాఱులు పుట్టినవాఁడు, బ్రాహ్మణాదిత్రివర్ణజుఁడు), ద్విజునకుఁ =
బ్రాహ్మణునకు, యజన...గ్రహంబులు = యజ్ఞముచేయుట, చేయించుట,
వేదశాస్త్రములు చదువుకొనుట, చదివించుట, ఇచ్చుట, పుచ్చుకొనుట,
అను, షట్కర్మంబులు = ఆఱుకర్మలు, విహితంబులు = శాస్త్రముచే విధిం
పఁబడినవి, రాజునకుఁ = క్షత్రియునకు, ప్రతిగ్రహవ్యతిరిక్తంబులు =
పుచ్చుకొనుటలేని, యజనాదికర్మంబులు, అయిదును, ప్రజాపాలనంబు =
జనులఁబాలించుట, బ్రాహ్మణులు, కానివారివలనఁ, దండశుల్కాదులు =
దండుగలు సుంకములు, కొనుటయును, విహితకర్మంబులు = యోగ్యము
లైనపనులు, వైశ్యునికిఁ = కోమటివానికి (తృతీయవర్ణునకు), కృషి =
వ్యవసాయము, వాణిజ్య = వ్యాపారము, గోరక్షణ = ఆవులఁ బెంచుట
యు, ఆది = మొదలగు, కర్మంబులు = పనులు, బ్రాహ్మణకులానువర
ణంబును = బ్రాహ్మణజాతిని అనుసరించియుండుటయు, విహితములు,
శూద్రునకుఁ, ద్విజశుశ్రూష = బ్రాహ్మణసేవ, చేయుట వలయును =
చేయఁదగును.

సీ. విను కర్షణాదికవృత్తికంటెను మేలు
యాచింప నొల్లనియట్టివృత్తి
ప్రాప్తంబుఁ గైకొని బ్రదుకుకంటెను లెస్స
యనుదినంబును ధాన్య మడిగికొనుట
యాయవారముకంటె నధికకళ్యాణంబు
పఱిగయెన్నులధాన్యభక్షణంబు
శిలవృత్తికంటెను శ్రేయ మాపణములఁ
బడ్డగింజలు దిని బ్రదుకుఁ గనుట
ఆ. యెడరుచోట నృపతి కీనాల్గువృత్తులుఁ
దగుఁ బ్రతిగ్రహంబు దగదు తలఁప
నాపదవసరముల నధముఁ డెక్కువజాతి
వృత్తి నున్న దోషవిధము గాదు. 410

టీ. వినుము, యాచింపనొల్లనియట్టివృత్తి= ఒకరినడుగని జీవనము, కర్షణాదికవృత్తికంటెన్ =దున్నుకొనుట అడిగికొనుట మొదలగువృత్తు లన్నింటికంటెను, మేలు=మంచిది, ప్రాప్తంబు=తనకుఁ దాలభించినదానిని, కైకొని=తీసికొని, బ్రదుకుకంటెను = జీవించుటకంటెను, అనుదినంబు = ప్రతిదినము, ధాన్యము, అడిగికొనుట= అడిగి తెచ్చుకొనుట, లెస్స= మంచిది, యాయవారముకంటెన్=ధాన్యపుముష్టి యెత్తుటకంటెను, పఱిగయె న్నుల ధాన్యభక్షణంబు=చేలు కోసిన వెనుక చేలలోరాలిన ఎన్నులగింజలేఱి తెచ్చుకొని తినుట, అధికకల్యాణంబు=మిగులశ్రేయము, ఆపణములన్ = అంగడులచెంతను, పడిన గింజలు, తిని, బ్రతుకుఁ గనుట=జీవించుట, శిల వృత్తికంటెను=పఱిగ లేఱుకొనుదానికంటె, శ్రేయము=మేలైనది, నృపతి కిన్=రాజునకు, ఎడరుచోటన్=ఆపద సంభవించినప్పుడు, ఈనాల్గువృత్తు లును, తగును=ఒప్పును, తలఁపన్ =విచారింపఁగా, ప్రతిగ్రహంబు=సమంత్రకముగాఁ బ్రతిగ్రహముపట్టుట, తగదు, ఆపదవసరములన్=విపత్సమయ

ములలో, అధముఁడు=తక్కువజాతివాఁడు, ఎక్కువజాతివృత్తిన్=పైనజాతి కంటె మేలిజాతివారిజీవికయందు, ఉన్నను, దోషవిధము = దోషముగాద, కాదు.

తా. రాజా! దున్నుకొనుట మొదలగు వృత్తులకంటె అయాచితవృత్తి మంచిది. దానికంటె ధాన్యమడిగికొనునది మంచిది. అంతకంటెను పఱిగ లెన్నులు ఏఱి తెచ్చుకొనుట మఱియు మంచిది. దానికంటెను అంగడులలోఁ బడ్డగింజ లేఱికొనునది మంచిది. ఆపత్కాలములో ఈ నాలుగువిధముల జీవనములను రాజునకుఁగూడ తగినవే. ఒకమంత్రసహితమైన ప్రతిగ్రహము మాత్రము ఎన్నఁటికిని కూడదు. ఇక్కట్టువచ్చిన నొకవేళ నీచజాతి వాఁడు ఉత్తమజాతిజీవనము నవలంబించినను దోషముకాదు.

వ. వినుము శిలవృత్తియు నుంఛవృత్తియు ఋతమనియు నయాచితవృత్తి యమృతమనియు నిత్యయాచ్ఞావృత్తిమృతమనియుఁ గర్షకవృత్తి ప్రమృతమనియు నెన్నుదు రట్టివృత్తుల జీవించుట మేలు వాణిజ్యంబు సత్యానృతమనియు శ్వవృత్తి నీచసేవయనియుఁ బలుకుదురు సర్వవేదమయుండు బ్రాహ్మణుండు సర్వదేవమయుండు క్షత్రియుండు బ్రాహ్మణక్షత్రియులకు నీచసేవనంబు గర్హ్యంబు గాదు 411

టీ. శిలవృత్తి = చేళ్లకడ రాలినగింజ లేఱికొనుట, ఉంఛవృత్తి= పఱిగ లేఱికొనుట, ఋతము(=సత్యము), అయాచితవృత్తి=ఒకరి నడుగకుండ బ్రతుకుట, అమృతము(=చావులేనిది), నిత్యయాచ్ఞావృత్తి=ఎల్లప్పుడు అడిగి కొని బ్రతుకుట, మృతము (=చావుతోఁ దుల్యమైనది), కర్షకవృత్తి = దున్నుకొని బ్రతుకుట, ప్రమృతము(=నాతినింద్యము), వాణిజ్యము = వర్తకము, సత్యానృతము(=నిజము అబద్ధముగలసినది), నీచసేవ=హీనునిగొల్చుట, శ్వవృత్తి (=కుక్కబ్రతుకు), బ్రాహ్మణుండు, సర్వవేదమయుండు = ఎల్లవేదముల స్వరూపముగలవాఁడు, క్షత్రియుండు = రాజు, సర్వదేవ

మయుఁడు = అఖిలదేవతల స్వరూపముగలవాఁడు, బ్రాహ్మణక్షత్రియుల కున్ = బ్రాఁపలకు రాజులకును, నీచసేవనంబు = తక్కువవానిఁ గొల్చుట, కర్తవ్యంబు = చేయఁదగినది, కాదు.

క. దమమును శౌచముఁ దపమును
శమమును మార్దవముఁ గృపయు సత్యజ్ఞాన
క్షమలును హరిభక్తియు హ
ర్షము నిజలక్షణము లగ్రజాతికి నధిపా. 412

టీ. అధిపా = రాజా! అగ్రజాతికిన్ = బ్రాహ్మణునకు, దమము = బాహ్యేంద్రియనిగ్రహము, శౌచము = శుచిత్వము, తపము = కాయక్లేశపడి జపించుట, శమము = అంతరింద్రియనిగ్రహము, మార్దవము = సౌమ్యత, కృప = దయ, సత్య = నిజము, జ్ఞాన = తెలివి, క్షమ = ఓరుపు, హరిభక్తి = విష్ణుభక్తి, హర్షము = నిత్యసంతోషము, నిజలక్షణములు = స్వాభావికమైన గుణములు.

తా. ధర్మరాజా! బ్రాహ్మణజాతి అంతర్బహిరింద్రియనిగ్రహము, సదాచారము, తపస్సు, నెమ్మది, అక్రూరత, దయ, సత్యము, జ్ఞానము, ఓర్పు, విష్ణుభక్తి, నిత్యసంతోషము, ఇవి సహజగుణములుగా నుండవలయును.

ఉ. శౌర్యము దానశీలముఁ బ్రసాదము నాత్మజయంబుఁ దేజముం
ధైర్యము దేవభక్తియును ధర్మము నర్థముఁ గామముం బుధా
చార్యముకుంద సేవలును సత్కృతియుం బరితోషణంబు స
ద్వీర్యము రక్షణంబుఁ బృథివీవర శేఖర రాజచిహ్నముల్. 413

టీ. పృథివీవరశేఖర = రాజోత్తమా! శౌర్యము = మగఁటిమి, దానశీలము = ఇచ్చుకోరిక, ప్రసాదము = కోపాదులులేక సౌమ్యతతో నుండుట, ఆత్మజయము = మనస్సును వశముజేసికొనుట, తేజము = ప్రతాపము, ధైర్యము = దిట్టతనము, దేవభక్తి = దేవతలయందుగుఱి, ధర్మము = మంచి నడవడి, అర్థము = లాభము, కామము = కోరిక, బుధా...సేవలు = పండితులు గురు

వులు విష్ణువు వీరికైంకర్యము, సత్కృతి=ఒరులను గౌరవించుట, పతితో షణంబు=సంతసిల్లఁజేయుట, సద్వీర్యము=న్యాయమైనవిక్రమము, రక్షణము =శిష్టపాలనము, రాజచిహ్నముల్=రాచవాని కుండఁదగు గుణములు.

తా. సుబోధమే.

క. ధర్మార్థకామవాంఛయు
నిర్మలగురుదేవవిప్రనివహార్చనముల్
నిర్మదభావముఁ బ్రమదము
శర్మకరత్వమును వైశ్యజనలక్షణముల్. 414

టీ. ధర్మార్థకామవాంఛ=ధర్మ అర్థ కామములఁ గోరుట, నిర్మల... ముల్ = శుద్ధమైన గురువులయు, దేవతలయు, బ్రాహ్మణులయు సంఘములను బూజించుట, నిర్మదభావము=గర్వములేకుండుట, ప్రమదము = సంతోషము, శర్మకరత్వము=కూడినంతవట్టొకరికి మేలు చేయుట, వైశ్యజనలక్షణముల్=కోమటివానిగుణములు.

తా. రాజా! ధర్మార్థకామముల నాసక్తితోఁ గూర్చుకొనుట, రాగాదిదోషరహితమైన దేవబ్రాహ్మణగురువులసేవ, అడఁకువ, సంతోషము, ఒకరి కుపకారము చేయు బుద్ధి ఇవి కోమటి కుండవలసిన ధర్మములు.

ఉ. స్తేయములేనివృత్తియు శుచిత్వము సన్నుతియుఁ నిజేశులఁ
మాయలులేకడాయుటయు మంత్రముచెప్పకపంచయజ్ఞముల్
చేయుటయుఁధరామరుల సేవయు గోవులరక్షణంబు న, న్యా
యము లేమియుఁ మనుజనాథ యెఱుంగుముశూద్రధర్మముల్.

టీ. మనుజనాథ = ధర్మరాజా! స్తేయము = దొంగతనము, లేని, వృత్తి = జీవనము, శుచిత్వము = మంచియాచారము, సన్నుతి = స్తుతి, నిజేశులఁ = తమదొరలను, మాయలు = టక్కులు, లేక, డాయుట = దగ్గఱుట, మంత్రము, చెప్పక=చదువక, పంచయజ్ఞముల్=బ్రహ్మ, పితృ,

దేవ, భూత, మనుష్యయజ్ఞములు, చేయుటయును, ధరామరులసేవయుఁగా = బ్రాహ్మణులసేవ, గోవులరక్షణంబు = ఆలఁ గాఁచుట, అన్యాయము = అధర్మము, లేమి = లేకపోవుట, శూద్రధర్మములు, అని, ఎఱుంగుము.

తా. సుగమము.

సీ. నిలయమ్ము వాటించి నిర్మలదేహి యై
  శృంగార మేప్రొద్దుఁ జేయవలయు
సత్యప్రియాలాపచతుర యై ప్రాణేశు
  చిత్తంబు ప్రేమ రంజింపవలయు
దాక్షిణ్యసంతోషధర్మమేధాదుల
  దైవత మని ప్రియుఁ దలఁపవలయు
నాథుఁ డేపద్ధతి నడచు నాపద్ధతి
  నడచి సద్బంధుల నడపవలయు

ఆ. మార్దవమునఁ బతికి మజ్జనభోజన
శయనపానరతులు జరపవలయు
విభుఁడు పతితుఁ డైన వెలఁది పాతివ్రత్య
మహిమఁ బుణ్యుఁ జేసి మనుపవలయు. 416

టీ. నిలయమ్ము = ఇల్లు, వాటించి = అనుసరించి, నిర్మలదేహి = శుద్ధాత్మురాలు, శృంగారము = ప్రసాధనము, ఏప్రొద్దుఁగా = ఎల్లప్పుడును, చేయవలయును, ప్రేమఁగా = భక్తితో, సత్య...చతురయై = బొంకులేని ప్రియపుమాటలనేరుపు గలదై, ప్రాణేశు చిత్తంబు = భర్త మనస్సును, రంజింపవలయుఁగా = సంతసింపఁ జేయవలయును, దాక్షిణ్య...దులఁగా = ఓపిక తృప్తి న్యాయము తెలివి మున్నగువానిచే, ప్రియుఁగా = మగని, దైవతము = దేవుఁడు, అని, తలఁపవలయుఁగా = ఉద్దేశింపవలె ను, సద్బంధులఁగా = ప్రియులైన చుట్టములను, నాథుఁడు = మగఁడు, ఏపద్ధతిఁగా = ఏలాగున, నడచుఁగా = మెలఁగునో, ఆపద్ధతిని, నడచి = చరించి,

నడపవలయును = విచారింపఁదగును. పతికిన్ = మగనికి, మార్దవమునన్ = తిన్నదనముతో, మజ్జన...రతులు = స్నానము కుడుపు పడకరతి వీనిని, జరపవలయును, విభుఁడు = మగఁడు, పతితుఁడు = కులమునుండి భ్రష్టుఁడు, ఐనచో, వెలఁది = ఇల్లాలు, పాతివ్రత్యమహిమన్ = తనపతివ్రతాధర్మమహిమచేత, పుణ్యున్ = పావనుని, చేసి, మనుపవలయున్ = రక్షింపవలెను.

తా. పతివ్రతయైనయిల్లాలు, ఎప్పుడును, ఇల్లువిడువక కాచుకొని యుండి తాను పరిశుభ్రముగానుండి యింటిని చక్కఁగా నలంకారముజేసి పెట్టుకొనవలెను. అబద్ధముచెప్పక ప్రియముగాఁ బలుకుచు మగనిమనసు సంతోషపెట్టవలెను. ఓపిక తృప్తి నీతి తెలివిగలిగి మగని దేవునిగాఁ దలఁచవలెను. మగఁ డెట్లున్న తాను నమ్రయైయుండి యింటికివచ్చినచుట్టములకు మర్యాదచేయవలెను. అడఁకువతో మగనికి స్నానభోజనాదులు జరపి పరిచర్య సేయవలెను. మగఁడు కులము చెఱుచుకున్న తాను తనపాతివ్రత్యబలముచేత వానిని పవిత్రునిగాఁ జేసి కాపాడవలెను.

క. తరుణి దనప్రాణవల్లభు
హరిభావముగా భజించి యతఁడును దానున్
సిరికైవడి వర్తించును
హరిలోకమునందు సంతతానందమునన్. 417

టీ. తరుణి = ఆఁడుగూఁతురు, తనప్రాణవల్లభున్ = తనమగనిని, హరిభావముగాన్ = విష్ణుబుద్ధితో, భజించి = సేవించి, హరిలోకమునందున్ = విష్ణులోకమునందు, సంతతానందమునన్ = ఎడతెగని యానందముతోడ, సిరికైవడిన్ = లక్ష్మివలె, వర్తించును = నివసించును.

తా. ఏస్త్రీయైనను తనభర్తను విష్ణుస్వరూపుఁడని నిష్కల్మషమైన భక్తితో సేవించునో ఆమె తనభర్తతోఁగూడి వైకుంఠమందు రెండవ లక్ష్మివలె నిత్యానందము గలిగియుండును.

బునఁ గామోన్ముఖం బైనచిత్తంబు కామంబులం దనిసి
నిష్కామం బై విరక్తి నొందుం గావున సత్త్వస్వభావంబు
తోడ నెప్పుడుఁ దప్పక నిజవంశానుగతవిహితధర్మంబున
వర్తించునరుండు మెల్లన స్వాభావికకర్మపరత్వంబు విడిచి
ముక్తి నొందు జాతిమాత్రంబునఁ బురుషుని వర్ణంబు నిర్దే
శింపం బని లేదు శమదమాదివర్ణలక్షణవ్యవహారంబులఁ గన
వలయు నని మఱియు నారదుం డిట్లనియె. 419

టీ. సంకరజాతులు=ఒకవర్ణముతో నసమానమైన మఱియొకవర్ణము కలియుటవలనఁ బుట్టిన నీచజాతులు, అయిన, రజక=చాకలి, చర్మకారక=మాదిగవాఁడు, నట=నట్టువవాఁడు, బురుడ = మేదరవాఁడు, కైవర్తక = చేఁపలబట్టువాఁడు (జాలరి), మ్లేచ్ఛ = యవనపుళిందాదులు, భిల్ల=బోయవాఁడు, అంత్యజాతులు=నీచజాతులు, చండాల=మాలవాఁడు, పుల్కస=బోయలలో నొకతెగ, మాతంగ=మాలలలో నొకతెగ, కులాగతంబులు=వంశక్రమమునవచ్చినవి, చౌర్య=దొంగతనము, హింస=చంపుట, నైసర్గికము=స్వభావమునఁ గలిగినది, ధర్మంబులు=నడవడులు, సుఖకరంబులు = మేలు గూర్చునవి, వేదవిదులు=వేదముల నెఱిఁగినవారు, కాలకాలునక=ప్రతికాలమందును, క్షేత్రంబు=నేల, లావు, చెడును = నిస్సారమగును, చల్లిన బీజంబులు=విత్తినవిత్తులు, నిస్తేజంబులు=మొలకెత్తుశక్తి లేనివి, అంకురింపవు = మొలువవు, నిరం...బునక = ఎడలేని నేయిధారలఁ గ్రుమ్మరించుటచేత, దహనంబునకుక=నిప్పునకు, దాహకత్వంబు=కాల్చుశక్తి, శాంతింజెందును=చల్లారును, వేల్చినహవ్యంబులు=హోమముచేసినవస్తువులు, ఫలింపవు = పండవు, తద్విధంబునక =అలాగుననే, అనవరత...బునక = విడుమర లేని యిష్టానుభవమువలన, కామోన్ముఖము = ఇంకను కామంబులఁ గోరునది, తనిసి = తృప్తిచెంది, నిష్కామంబు = కోరికలేనిది, విరక్తిక = అపరాగమును, ఎప్పుడు, సత్త్వస్వభావంబుతోడక = సాత్త్వికధర్మముతో,

తప్పక = తొలఁగక, నిజ...బునన్ = తనకులమునకుఁ దగిన ఆచారము తోడ, వర్తించునరుండు = ప్రవర్తించుమనుజుఁడు, మెల్లన్ = నెమ్మదిగా, స్వాభావిక కర్మపరత్వంబు = పుట్టుకతోఁ బుట్టిన కర్మప్రవణత్వమును, ముక్తిఁబొందున్ = కర్మబంధములనుండి విడచి మరలఁగాంచును, పురుషునికి, జాతిమాత్రంబునన్ = పుట్టుకచేతనే, వర్ణంబు = కులము, నిర్దేశింపన్ = నిర్ణయించుటకు, శమ...బులన్ = అంతరింద్రియనిగ్రహము బహిరింద్రియనిగ్రహము మొదలగుజాతుల కుండఁదగు గుర్తులవాడుకలను, కనవలయును = పొందవలయును, మఱియు = ఇంకను.

క. క్రమమున వర్ణంబులచి
హ్నము లెల్లను జెప్పఁబడియె నాశ్రమములధ
ర్మము లెఱిఁగించెద నన్నియు
సమదాహితహృదయశూల సదమలశీలా. 420

టీ. సమదా...శూల = పొగరుపట్టిన శత్రువుల గుండెలకు శూలమైన వాఁడా! సదమలశీలా = నిర్మల స్వభావముగల యోధర్మరాజా! నాచేత, క్రమమునన్ = వరుసతో, వర్ణంబులచిహ్నములెల్లను = జాతులగుర్తులన్నియు, చెప్పఁబడెను, ఆశ్రమముల ధర్మములు అన్నియును, ఎఱిఁగించెదను = తెలియఁబఱతును.

తా. ధర్మరాజా! నీకు వరుసగా బ్రాహ్మణాది జాతిధర్మముల నన్నిటిని పూర్తిగాఁ జెప్పినాను. ఇఁక బ్రహ్మచర్యాద్యాశ్రమముల లక్షణములఁ జెప్పెదను. శ్రద్ధగలిగి వినుము.

వ. వినుము బ్రహ్మచారి మౌంజీకౌపీనయజ్ఞోపవీతకృష్ణాజిన
పలాశదండకమండలుధరుండును సంస్కారహీనశిరోరుహుం
డును దర్భహస్తుండును శీలవ్రతస్థుండును మౌనియు నై త్రి
సంధ్యంబును బ్రహ్మగాయత్రి జపియించుచు సాయంప్రాత

రవసరంబుల నర్కపావకగురుదేవతోపాసనంబులు చేయుచు
గురుమందిరంబునకుం జని దాసునిచందంబున భక్తివినయ
సౌమనస్యంబులు గలిగి వేదంబులు చదువుచు నధ్యయనో
పక్రమావసానంబుల గురుచరణంబులకు నమస్కరించుచు
రేపును మాపును విహితగృహంబుల భిక్షించి భైక్షంబు గురు
వునకు నివేదించి యనుజ్ఞగొని మితభోజనంబు గావించుచు
విహితకాలంబుల నుపవసించుచు నంగనలందు నంగనాసక్తు
లందుం బ్రయోజనమాత్రభాషణంబు లొనర్చుచు గురువ
రాంగనలవలన నభ్యంగకేశప్రసాధనశరీరమర్దన మజ్జనరహ
స్యయోగంబులు వర్జించుచు గృహంబున నుండక జితేంద్రి
యత్వంబున సత్యభాషణుం డయి సంచరింపవలయు. 421

టీ. బ్రహ్మచారి = బ్రహ్మచర్యాశ్రమస్థుఁడు, మౌంజీ...ధరుండు = మూఁడుపేటల ముంజగడ్డిత్రాడును, గోఁచి, జందెము, జింకతోలు, మోదుగుబెత్తము, కమండలువు వీనిని ధరించినవాఁడు, సంస్కార...హీనుండు = దువ్వుట పూలుజుట్టుట మెఱుఁగురాచుట మొదలగునవిలేని తలవెండ్రుకలుగలవాఁడు, దర్భహస్తుఁడు = దర్భపవిత్రమును చేతఁబెట్టుకొన్నవాఁడు, శీలప్రశస్తుఁడు = నడవడిలోఁ బొగడ్తనందినవాఁడు, మౌని = హెచ్చుగా మాటలాడనివాఁడు, త్రిసంధ్యంబును = మూఁడు సంధ్యలయందును, బ్రహ్మగాయత్రిన్ = బ్రహ్మరూపమైనగాయత్రిని, సాయం...బులన్ = సాయంకాలమున ప్రొద్దునను, అర్క...బులు = సూర్యుఁడు అగ్ని గురువు దైవము వీరిని ఉపాసించుట, గురుమందిరంబు = ఉపాధ్యాయునియిల్లు, దాసునిచందంబునన్ = నౌకరివలె, భక్తి...బులు = అనురాగము అడఁకువ చిత్తనైర్మల్యములు, అధ్యయనో...బులన్ = చదువు మొదలిడునప్పుడు చాలించునప్పుడుగూడ, గురుచరణంబులకున్ = ఉపాధ్యాయునిపాదములకు, రేపును మాపును = పగలు రాత్రియు, విహితగృహంబులన్ = శాస్త్రమందుఁ జెప్పినట్టి

శ్రోత్రియగృహములయందు, భిక్షించి=యాయావారమెత్తి, భైక్షము=మధుకరాన్నమును, గురువునకున్=ఉపాధ్యాయునకు, నివేదించి=చూపి, అనుజ్ఞగొని=ఈపదార్థములు భుజించవచ్చునని యాజ్ఞతీసికొని, మితభోజనంబుగా వించుచు=పరిమితమైనవండిని దినుచు, విహితకాలంబులన్=శాస్త్రోక్తసమయములయందు, ఉపవసించుచున్=ఉపవాసముచేయుచు, అంగనలందున్=జవ్వనులయందును, అంగనాసక్తులయందును=కామినులయెడ ననురాగము గలవారియందును, ప్రయోజనమాత్రభాషణంబులు=పనికితగినట్లు మాటలాడుట, ఒనర్చుచు=చేయుచు, గురుపరాంగనలవలనన్=గురువుభార్య పరస్త్రీలు వీరివలన, అభ్యంగ...యోగంబులు=అభ్యంగము చేయించుకొనుట, తల దువ్వించుకొనుట, ఒడలు నలుగుపెట్టించుకొనుట, స్నానము చేయించుకొనుట, ఒంటరిగా మాటలాడుట వీనిని, వర్జించుచు=విడుచుచు, గృహంబునన్=ఇంటియందు, ఉండక, జితేంద్రియత్వంబునన్=ఇంద్రియజయము గలుగుటతోడ, సత్యభాషణుండు=అసత్యము గానిమాటలుగలవాఁడు, సంచరింపవలయున్=నడుచుకోవలెను.

ఆ. పొలఁతి దావవహ్ని పురుషుఁ డాజ్యఘటంబు
కరఁగ కుండ రాదు కదిసెనేని
బ్రహ్మ యైనఁ గూఁతుఁ బట్టక మానఁడు
వడుగు కింతిపొత్తు వలదు వలదు. 422

టీ. పొలఁతి=ఆఁడుది, దావవహ్ని=కార్చిచ్చు, పురుషుఁడు=మగవాఁడు, ఆజ్యఘటంబు=నేతికుండ, కదిసెనేనిన్=ఒకరికొకరుదగ్గఱఁజేరిరా, కరఁగకుండరాదు=మెత్తబడకుండఁ దప్పించుకోరాదు. కరఁగిపోకుండ మానదు, కదిసెనేనిన్=సమీపించినచో, బ్రహ్మ=చతురాననుఁడు, ఐనను, కూఁతున్=తనకన్నబిడ్డయైనను, పట్టకమానఁడు=తగులకుండఁడు, కావున, వడుగునకు=బ్రహ్మచారికి, ఇంతిపొత్తు=ఆఁడుగూఁతురి సాంగత్యము, వలదు వలదు.

తా. రాజా! మగవాఁడు నేతి దుత్తవంటివాఁడు, ఆఁడుదో నిప్పువంటిది. దానిపొత్తు గలిగెనా యెంతటివానికిని లోఁబడకుండ వశముగాదు. బ్రహ్మయైనను ఒంటరిపాటునఁ జిక్కెనేని తనకూఁతునైనను విడువఁడు. కనుక బ్రహ్మచర్యవ్రతస్థుఁడు కన్నఁడును స్త్రీసాంగత్యము కూడదు.

వ. వినుము స్వరూపసాక్షాత్కారంబున దేహి బహిరింద్రియా దికం బయినయింతయు నాభాసమాత్రంబుగా నిశ్చయించి యుండాఁక జీవుండు స్వతంత్రుం డయిన యీశ్వరుండు గాకుండు నంతదడవు నంగన యిది పురుషుండ నే ననియెడి బుద్ధి మానుట కర్తవ్యంబు గాదు బ్రహ్మచారియతిగృహస్థులం దెవ్వఁడైన జిత్తంబు పరిపక్వంబు గాక యద్వైతానుసంధానంబు చేసిన మూఢుం డగుం గావున రహస్యంబునఁ బుత్రికనైనం డాయకుండ వలయు. 423

టీ. దేహి=జీవుఁడు, స్వరూపసాక్షాత్కారంబునన్ = ఆత్మస్వరూపముయొక్క ఎఱుకచేత, బహిరింద్రియాదికము=బాహ్యేంద్రియములు మొదలయినది, ఇంతయును, ఆభాసంబు=అవిచారిత రమణీయము, స్వతంత్రుఁడు=దేనికి లొంగనివాఁడు, అంతతడవు=అందాఁక, ఇది, అంగన = ఆఁడుది, నేను, పురుషుఁడను=మగవాఁడను, అనియెడిబుద్ధి=అనుతలఁపు, మానుట=వీడుట, కర్తవ్యము=చేయఁదగినది, కాదు. బ్రహ్మచారి యతి గృహస్థుల యందు, పరిపక్వము=పరిణతము, అద్వైతానుసంధానంబు = స్త్రీపురుషాది భేదాభావభావనము, మూఢుఁడు = మందుఁడు, కావున తా నిశ్వరుఁడగు దాఁక, రహస్యంబునన్=ఒంటిగా, పుత్రికనైనన్ = కూఁతునైనను, డాయక=సమీపింపక.

చ. శిరమున మేన సంస్కృతులు చేయక చందనభూషణాద్యలం
కరణములెల్ల మాని ఋతుకాలములన్ నిజభార్యఁబొందుచుం

దరుణులఁజూడఁ బోఁడక ధృతవ్రతుఁడై మధుమాంసవర్జియై
గురుతరవృత్తితో మెలఁగుకోవిదుఁ డొక్కగృహస్థు భూవరా.

టీ. భూవరా=రాజా! శిరమునన్=తలయందును, మేనన్=ఒడలియందును, సంస్కృతులు=అభ్యంగ ఉపమర్దనాది సంస్కారములు, చేయక, చందన... ములు=గంధము సొమ్ములు మొదలగు మండనములన్ని విడచి, ఋతుకాలమునన్=ఋతుగాత్రులయందు, నిజభార్యన్=తన పెండ్లమును, తరుణులన్=అన్యకాంతలను, చూడన్ పోఁక=చూచుటకై పరుగులిడక, ధృతవ్రతుఁడై=నిష్ఠగలవాఁడై, మధుమాంసవర్జియై=కల్లుమాంసములను విడిచినవాఁడై, గురుతరవృత్తితోన్=పెద్దతీరముతోడ, మెలఁగుకోవిదుఁడు=ప్రవర్తించు పండితుఁడు, ఒక్కగృహస్థు=ఒకగొప్పకాఁపు.

తా. రాజా! అభ్యంగాది సంస్కారము చేసికొనక, గంధము పూలు సొమ్ములు తాల్పఁగోరక, ఋతుకాలము దప్పకుండ తనభార్యను గలియుచు అన్యకాంతల తెరువునకుఁబోక నిష్ఠగలవాఁడై మధుమాంసముల విడిచి గొప్ప ప్రవర్తనము గలిగియుండు నొక పండితుఁడే గృహస్థుఁ డని చెప్పనొప్పును.

వ. మఱియు ద్విజుండు గృహస్థుం డై గురువులవలన నుపనిషదంగసహితం బైనవేదత్రయంబును బఠియించి నిజాధికారానుసారంబుగ నర్థవిచారంబు చేసి తనబలంబుకొలంది గురువులకు నభీష్టంబు లొసంగి గృహంబున నొండె వనంబున నొండె నైష్ఠికత్వంబు నాశ్రయించి ప్రాణులతోడ జీవించుచు గురువునందు నగ్నియందు నాత్మయందు సర్వభూతంబులందు నచ్యుతదర్శనంబు చేయుచు నింద్రియవ్యసనాదిమగ్నుఁడు గాక యెఱుక గలిగి వర్తించుచు పరబ్రహ్మంబు నొందు. 425

టీ. ఉపనిషదంగసహితంబు=ఉపనిషత్తులు, శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము నను షడంగములు వీనితోఁగూడినది,

పఠియించి=చదివి, నిజాధికారానుసారంబుగన్=తనయోగ్యతకుఁ దగినట్లు, అర్థవిచారంబు=తాత్పర్యనిర్ణయము, తనబలంబుకొలఁదిన్=తనసామర్థ్యమునకుఁ దగినట్టులు, గురువులకున్=ఉపాధ్యాయులకు, అభీష్టంబులు=కోరినవానిని, ఒసంగి=ఇచ్చి, గృహంబుననొండెన్=ఇంటియందుఁగాని, వనంబుననొండెన్=అడవియందుఁగాని, నైష్ఠికత్వంబున్=నియమముధరించుటను, ఆశ్రయించి=పూని, ప్రాణులతోడన్=జీవులతోడ, జీవించుచు=బ్రతుకుచు, ఆత్మయందున్=తనయందును, సర్వభూతంబులయందున్ = ఎల్లజంతువులయందును, అచ్యుత దర్శనంబు చేయుచున్=విష్ణుస్వరూపమును జూచుచు, ఇంద్రియవ్యసనాది మగ్నుండుకాక = విషయాసక్తి మొదలగుదానియందు మునిఁగిపోక, ఎఱుక=తెలివి, వర్తించుచున్=మెలఁగుచు.

క. వినుము వనప్రస్థునకున్
మునికథితము లైననియమములు గల వాచొ
ప్పున వనగతుఁ డై మెలఁగెడి
ఘనుఁడు మహర్లోకమునకు గమనించు నృపా. 426

టీ. నృపా=రాజా! వనప్రస్థునకున్ = వానప్రస్థవృత్తియందుండు వానికి, మునికథితములు = మునులచేఁ జెప్పఁబడినవి, నియమములు=వ్రతములు, అచ్చొప్పున = అలాగున, వనగతుఁడు = అడవిఁ జేరినవాఁడు, మెలఁగెడి ఘనుఁడు=సంచరించు ధన్యుఁడు, మహర్లోకమునకున్, గమనించున్=పోవును.

తా. రాజా! వానప్రస్థాశ్రమమున నుండువానికి ప్రాచీనులగు ఋషులచేఁ గొన్నిధర్మములు చెప్పఁబడినవి. అటు ఋషికథితము లైన ధర్మముల ప్రకారము వానప్రస్థుఁడు నడచుకొనినచో వానికి మహర్లోకము సిద్ధించును.

వ. అటమీఁద గృహస్థాశ్రమంబు విడిచి వనంబునకుం జని దున్న
కపండెడినీవారాదికంబు లగ్నిపక్వంబు సేసి యొండె నామం

బులుచేసి యొండిన నర్కపక్వంబు లైనఫలాదులొండె భక్షించుచు వన్యాహారంబుల నిత్యకృత్యంబు లయినచరుపురోడాశంబు లొనర్చుచుఁ బ్రతిదినంబును బూర్వసంచితంబులు పరిత్యజించి నూతనద్రవ్యంబులు సంగ్రహించుచు నగ్నికొఱకుఁ బర్ణశాల యైనఁ బర్వతకందరం బయిన నాశ్రయించుచు హిమ వాయు వహ్ని వర్షాతపంబులకు సహించుచు నఖశ్మశ్రుకేశతనూరుహంబులు ప్రసాధితంబులు చేయక జటిలుండై వసియించుచు దండాజినకమండలువల్కలపరిచ్ఛదంబు ధరియించి పండ్రెండైన నెనిమిదైన నాలుగైన రెండైన నొకవత్సరంబయినఁ దపఃప్రయాసంబున బుద్ధినాశంబు గాకుండ మునియై చరించుచు దైవవశంబున జరారోగంబులచేతఁజిక్కి నిజధర్మానుష్ఠానసమర్థుండు గానిసమయంబున నిరశనవ్రతుండయి యగ్నుల నాత్మారోపణంబులు చేసి సన్న్యసించి యాకాశంబునందు శరీరరంధ్రంబులును గాలియందు నిశ్శ్వాసంబును దేజంబులోపల నూష్మంబును జలంబుల రసంబును ధరణియందు శల్యమాంసప్రముఖంబులును వహ్నియందు వక్తవ్యంబుతోడ వాక్కును నింద్రునియందు శిల్పంబుతోడఁ గరంబులును విష్ణునియందు గతితోడఁ బదంబులును బ్రజాపతియందు గతితోడ నుపస్థంబును మృత్యువందు విసర్గంబుతోడ బాయువును దిక్కులందు శబ్దంబుతోడ శ్రోత్రంబును వాయువందు స్పర్శంబుతోడఁ ద్వక్కును సూర్యునియందు రూపంబుతోడఁ జక్షువులును సలిలంబులందు బ్రచేతస్సహిత యయినజిహ్వయు క్షితియందు గంధసహితం బయిన ఘ్రాణంబును జంద్రునియందు మనోరథంబుల

తోడ మనంబును గవి యైనబ్రహ్మయందు బోధంబుతోడ బుద్ధియు రుద్రునియం దహంకారంబుతోడ మమత్వంబును క్షేత్రజ్ఞునియందు సత్త్వంబుతోడఁ జిత్తంబును బరం బునందు గుణంబులతోడ వైకారికంబులను డిందించి యట మీఁదఁ బృథివియందుఁ బృథివిని జలంబునందు జలంబును దేజంబునందును దేజంబును వాయువునందును వాయువును గగనంబునందును గగనంబును నహంకారతత్త్వంబునందును నహంకారంబును మహత్తత్త్వంబునందును మహత్తత్త్వం బును బ్రకృతియందును బ్రకృతిని నక్షరుండైన పరమాత్మయం దును లయంబునొందించి చిన్మాత్రావశేషితుం డయిన క్షేత్రజ్ఞుని నక్షరత్వంబున నెఱింగి ద్వయరహితుం డై దగ్ధకాష్ఠుం డైనవహ్నిచందంబునఁ బరమాత్మ యైననిర్వికార పరబ్ర హ్మంబునందు లీనుండు గావలయును. 427

టీ. వనంబునకున్ = అడవికి, చని, నీవారాదికంబు = తృణధా న్యము మొదలయినది, అగ్నిపక్వంబు చేసియుండేన్ = నిప్పులో వండిగాని, అమంబులు చేసియుండేన్ = పచ్చివిగాఁ జేసిగాని, అర్కపక్వంబు = సూర్యునియెండకుడికినవి, ఐన, ఫలాదులౌండేన్ = పండ్లుమున్నగువానిని గాని, భక్షించుచున్ = తినుచు, వన్యాహారంబులన్ = అడవిని సంభ వించు భోజనములచేత, నిత్యకృత్యంబులు = ప్రతిదినము చేయఁదగిన, చరు పురోడాశంబులు = అన్నముపిండిని, ఒనర్చుచున్ = చేయుచు, ప్రతిది నంబును, పూర్వసంచితంబులు = తొలునాఁడు సంపాదించఁబడినవి, పరి త్యజించి = విడిచి, నూతనద్రవ్యంబులు = క్రొత్తపదార్థములు, సంగ్రహిం చుచు = సంపాదించుచు, అగ్నికొఱకున్ = అగ్నికార్యము కొఱకు, పర్ణశాల = ఆకుటిల్లు, పర్వతకందరంబు = కొండగుహ, ఆశ్రయించుచు = చేరుచు, హిమ...కులన్ = మంచు గాలి నిప్పువాన ఎండలకు, సహించు

చుఁ = ఓర్చుకొనుచు, నఖ...బులు = గోళ్లు మీసములు తలవెండ్రు కలు ఒడలివెండ్రుకలు, ప్రసాధతంబులు = అభ్యంగాది సంస్కారంబులు, కత్తిరించుట చిమటవేయుట మొదలైనవి, చేయక, జటిలుఁడు = జడలు దాల్చినవాఁడు, వసియించుచు = నివసించుచు, దండా...బులు = కఱ్ఱ చర్మము కమండలువు నారచీర, ఉత్తరీయము, ధరియించి = తాల్చి, పం డ్రెండైనను, ఎనిమిదైనన్, నాలుగైనన్, రెండైనన్, ఒకవత్సరంబైనన్ = ఒక్కరేఁడైనను, తపః ప్రయాసంబునన్ = తపస్సుయొక్క క్లేశము తోడ, బుద్ధినాశంబు = చిత్తభ్రంశము, మునియై = మననముగలవాఁడై, చరించుచున్ = తిరుగుచు, దైవవశంబునన్ = దైవయోగముచేత, జరా రోగంబులచేతన్ = ముసలితనము రోగము వీనిచేత, చిక్కి, నిజధర్మాను ష్ఠానసమర్థుండు = తనకుఁబధర్మములను గడుపుకొనఁదగినశక్తి లేనివాఁడు, కాని సమయంబునన్ = కానివేళయందు, నిరశన వ్రతుండు = అన్నము లేకుండనుండు వ్రతముగలవాఁడు, ఆప్నలన్, ఆత్మారోపణంబు చేసి = తనయందు నిలుపుకొని, సన్న్యసించి = ఎల్లకర్మలను విడనాడి, ఆకాశం బునందు, శరీరరంధ్రంబులు = ఒడలిసందులు, నిశ్వాసంబు = ఊపిరి; తేజము = వెలుఁగు, ఊష్మము = శరీరమందలి యావిరి, జలంబులన్ = నీళ్లయందు, రసంబును = శరీరమునందలి ద్రవపదార్థమును, ధరణియందు = భూమిలో,శల్య...లును = ఎముకలు మాంసము మొదలైనవి, వహ్నియందు = నిప్పులో, వక్తవ్యము = పలుకఁదగినది, ఇంద్రునియందున్ = దేవేంద్రుని యందు, శిల్పము = చేతిపని, కరంబులు = చేతులు, విష్ణునియందు = వ్యాపన శీలుఁడగు నారాయణునందు, గతి = నడక, పదంబులు = కాళ్లు, ప్ర జాపతి = బ్రహ్మ, రతి = గ్రామ్యధర్మము, ఉపస్థము = గుహ్యావయవము, మృత్యువు = యముఁడు, విసర్గము = ఉత్క్రమణము, వాయువు = ప్రా ణము, శబ్దము = ధ్వని, శ్రోత్రము = చెవి, స్పర్శము = తగులుట, త్వక్కు = చర్మము, రూపము = తేజస్సు, చక్షువులు = చూపులు, సలిలం బులు = నీళ్లు, ప్రచేతస్సహిత = వరుణాంశముతోఁ గూడిన, జిహ్వ = నాలుక,

క్షితి = భూమి, గంధసహితంబు = వాసనతోఁ గూడినది, ఘ్రాణంబు = ముక్కు, మనోరథములు = తలఁపులు, మనంబు = చిత్తము, కవి = వర్ణనచతురుఁడు, బోధము = తెలివి, రుద్రునియందున్ = శివునందు, అహంకారంబుతోడన్ = నేను నాయది యనుభావముతో, మమత్వంబును = మమకారమును, క్షేత్రజ్ఞునియందున్ = జీవునియందు, సత్త్వంబుతోడన్ = సత్త్వగుణముతోడ, చిత్తంబును, చెందించి, అటమీఁదన్ = అతర్వాత, పృథివియందు = భూమిలో, పృథివిని = భూమిని, జలంబునందున్ = నీళ్లయందు, తేజంబునందున్ = అగ్నియందు, వాయువునందున్ = గాలిలో, గగనంబునందున్ = ఆకాశమున, అహంకారతత్త్వంబునందున్ = అహంకారమున, మహత్తత్త్వంబునందున్ = బుద్ధియందు, ప్రకృతియందున్ = మూలప్రకృతిలో, ప్రకృతిని, ఇట్లు వీనినన్నిటిని, అక్షయుండు = నాశము లేనివాఁడు, లయంబు = నాశము, చిన్మాత్రావశేషితుండు = జ్ఞానమొక్కటియే మిగిలినవాఁడు, క్షేత్రజ్ఞుఁడు = జీవుఁడు, అక్షరత్వంబునన్ = అవికారభావమందు, ద్వయరహితుండై = తనకంటె వేఱులేనివాఁడై, దగ్ధకాష్ఠుండు = కాల్పఁబడిన కట్టెలుగల, వహ్నిచందంబునన్ = అగ్నివలె, పరమాత్మ = పరాత్పరుఁడు, నిర్వికారబ్రహ్మంబునందున్ = మార్పులేని పరమాత్మయందు, లీనుఁడు = చేరినవాఁడు, కావలయును.

క. అనఘ వనప్రస్థుండై
చని తద్ధర్మంబు లిట్లు సలుపుచు మఱియున్
మనెనేని సన్న్యసింపం
జను నటమీఁదటను ముక్తసంగత్వమునన్. 428

టీ. అనఘ = పాపములేనివాఁడా! వనప్రస్థుండు = అడవిని గాఁపురమున్నవాఁడు, ఐ, చని = పోయి, ఇట్లు = వెనుక చెప్పినట్లు, తద్ధర్మంబులు = ఆవానప్రస్థధర్మములు, సలుపుచున్ = చేయుచు, మఱియున్ = ఇంకను కొంతకాలము, మనెనేనిన్ = బ్రతికినా, అటమీఁదటను = అంతకుఁబైన,

ముక్తసంగత్వమునన్ = తగులములఁ దగులమిచేత, సన్న్యసింపన్ చనును = సర్వకర్మములను వదలుకొనవలెను.

తా. ధర్మరాజా! ఇట్లు వానప్రస్థాశ్రమమందుండి శాస్త్రములందుఁ జెప్పినట్లు అయాశ్రమము ధర్మములు చక్కఁగా నడుపుకొనుచు నుండి యింకను గొన్నాళ్లు చావక బ్రతికెనేని సర్వసంగములు వదలుకొని సన్న్యసించవలెను.

వ. ఇట్లు వానప్రస్థాశ్రమంబు జగపి సన్న్యసించి దేహమాత్రావశిష్టుండును సర్వభూత నిరపేక్షుండును భిక్షుండును నిరాశ్రయుండును నాత్మారాముండును సర్వభూతసముండును శాంతుండును సమచిత్తుండును నారాయణపరాయణుండును నై కౌపీనం బనునాచ్ఛాదనమాత్రం బైనవస్త్రంబు ధరియించి దండాదివ్యతిరిక్తంబులు విసర్జించి యాత్మపరంబులు గానిశాస్త్రంబులు వర్జించి గ్రహనక్షత్రాదివిద్యల జీవింపక భేదవాదంబు లైనతర్కంబులు దర్కింపక యెందును బక్షీకరింపక శిష్యులకు గ్రంథంబులు వంచించి యుపన్యసింపక బహువిద్యల జీవింపక మఠాదివ్యాపారంబుల నుల్లసిల్లక పెక్కుదినంబు లొక్కయెడ వసియింపక యూరూర నొక్కొక్కరాత్రినిలుచుచుఁ గార్యకారణవ్యతిరిక్తం బైనపరమాత్మయందు విశ్వంబు దర్శించుచు సదసన్మయం బైనవిశ్వంబునందుఁ బరబ్రహ్మం బయిన యాత్మ నవలోకించుచు జాగరణస్వప్నసంధిసమయంబుల నాత్మనిరీక్షణంబు చేయుచు నాత్మకు బంధమోక్షణంబులు మాయామాత్రంబులు గాని వస్తుప్రకారంబున లే వనియును దేహంబునకు జీవితంబు ధ్రువంబు గా దనియును మృత్యువు ధ్రువం బనియును నెఱుంగుచు భూత

దేహంబుల సంభవనాశంబులకు మూలం బయినకాలంబుఁ
బ్రతీక్షించుచు నిర్విధంబున జ్ఞానోత్పత్తిపర్యంతంబుఁ జరి
యించి యటమీఁద విజ్ఞానవిశేషంబు సంభవించినఁ బరమ
హంసుం డై దండాదిచిహ్నంబులు ధరియించి యైన ధరి
యింపక యైన బహిరంగవ్యక్తచిహ్నుండు గాక యంత
రంగవ్యక్తుం డై నయాత్మానుసంధానంబు గలిగి మనీషి యై బా
హ్యానుసంధానాభావంబున మనుష్యులకుఁ దనవలన నున్మ
త్తబాలమూకుల తెఱంగుఁ జూపుచుండవలయును. 429

టీ. దేహమాత్రావశిష్టుండు=శరీర మొక్కటి మిగిలినవాఁడు, నిరపేక్షుండు=కోరికలేనివాఁడు, భిక్షుండు=ఉపాదాన మెత్తువాఁడు, నిరాశ్రయుండు=ఇల్లులేనివాఁడు, ఆత్మారాముఁడు=తనలోఁ దాఁ గ్రీడించువాఁడు, సర్వభూతసముండు=ఎల్ల జంతువుల నొక్కరీతిఁ జూచువాఁడు, శాంతుండు=నిత్యనమ్రుఁడు, సమచిత్తుఁడు=సుఖదుఃఖములయం దొక్కతీరున నుండు మనసుగలవాఁడు, నారా...ము=శ్రీహరియందుతలఁపుగలవాఁడు, కౌపీనంబు=గోఁచి, ఆచ్ఛాదనమాత్రంబు=మొలకడ్డమైనది, వస్త్రము=గుడ్డ, ధరియించి=కట్టుకొని, దండా...బులు=కఱ్ఱ కమండలువు మొదలైనదేహముకంటె వేఱైనవస్తువులను, విసర్జించి=వీడి, ఆత్మపరములు=పరమాత్మయందులగించునవి, వర్జించి=విడచి, గ్రహనక్షత్రాదివిద్యలన్=జ్యోతిషము ప్రశ్నచెప్పుట సాముద్రికము భూతచికిత్స మొదలగు డాంబికవిద్యలచేత, జీవింపక=పొట్టపోషికొనక, భేదవాదంబులు=జీవాత్మపరమాత్మలకు భేదముగలిగించు, తర్కంబులు=యుక్తిప్రయుక్తిగలవాదములు, తర్కింపక=వాదించక, ఎందును=ఏమతమందును, పక్షీకరింపక=పక్షము గ్రహింపక, వంచించి=మోసగించి, ఉపన్యసింపక=బోధించక, బహువిద్యలన్=అనేకవిద్యలలో, మత్తాదివ్యాపారంబులన్=కల్లుద్రావుట గంజాయి బంగీ హుక్కా మొదలయిన కైపువస్తువులను సేవించుట మొదలగుపనులచేత, ఉల్లసిల్లక=సంతోషింపక,

పెక్కుదినంబులన్ = అనేకదినములు, ఒక్కయెడన్ = ఒకతావుననే, వసి
యింపక = నిలుపక, ఊరూరన్ = ప్రతియూరను, ఒక్కొక్కరాత్రి, వసియిం
చుచున్ = నిలుచుచు, కార్య...విశ్వంబు = కార్యమైన ఘటపటాదులకంటెను
కారణమైన మృదాదులకంటెను వేఱైనది, విశ్వంబు = ప్రపంచమును, దర్శిం
చుచున్ = చూచుచు, సదసన్మయంబు = నిత్యము అనిత్యమునైనది, అవలోకిం
చుచున్ = చూచుచు, జాగరణ...బులన్ = మేలుకొన్నపుడు నిద్రపోవున
పుడు కలఁతనిద్దురయందును, ఆత్మనిరీక్షణంబు = పరమాత్మను చూచుట, బంధ
మోక్షంబులు = పట్టువిడుపులు, మాయామాత్రంబులుగాని = మాయాకల్పితము
లేకాని, వస్తుప్రకారంబునన్ = పదార్థరీతినిబట్టి, జీవితము = బ్రతికియుండుట,
ధ్రువంబు = నిత్యము, మృత్యువు = చావు, భూత...లకున్ = పంచ
భూతములు వానికూడికచేనైన జీవశరీరములు వీని రాకపోకలకు, మూ
లంబు = కారణము, అయిన కాలంబున్ = అయిన సమయమును, ప్రతీ
క్షించుచున్ = ఎప్పుడు వచ్చునా యని యెదురుచూచుచు, ఇవ్విధం
బునన్ = ఈలాగున, జ్ఞానోత్పత్తి పర్యంతంబున్ = బ్రహ్మజ్ఞానము
కలుగుదాఁక, చరియించి = మెలఁగి, అటమీఁదన్ = అపైని, విజ్ఞాన
విశేషంబు = శ్రేష్ఠమైన తెలివి, సంభవించినన్ = కలుగఁగా, పరమ
హంసుండు = పరమహంసత్వమును బొందినవాఁడు, దండాదిచిహ్నం
బులు = దండము మొదలగు గుర్తులు, ధరియించియుండక = పూని
గాని, బహిరంగవ్యక్తచిహ్నుండు = బాహ్యప్రపంచమున కెఱుఁగరాని
లక్షణములుగలవాఁడు, అంతరంగవ్యక్తంబు = మనోమాత్రగోచరము, ఆత్మా
నుసంధానంబు = జీవబ్రహ్మైక్యభావన, మనీషి = తెలిసినవాఁడు, బాహ్యాను
సంధానాదిభావంబునన్ = వెలుపలికి తెలియుధర్మములు మొదలయినదాని
చేత, మనుష్యులకున్ = జనులకు, తనవలనన్ = తనయెడల, ఉన్మత్త...తెలం
గు = పిచ్చివారు చిఱుతవారు మూఁగవారు మొదలగువారివలె నుండుటను.

ప్రహ్లాదాజగర సంవాదము.

క. మునివల్లభుఁ డజగరుఁ డను
సునయుండు హిరణ్యకశిపుసూనుండును మ
న్నొనరించినసంవాదము
విను నీయర్థంబునందు వెలయు నరేంద్రా. 430

టీ. నరేంద్రా = ధర్మరాజా! మున్ను=పూర్వము, మునివల్లభుఁడు= మునిశ్రేష్ఠుఁడు, అజగరుఁడు, అను సునయుండు = అను నీతిపరుఁడును, హిరణ్యకశిపు సూనుండును = ప్రహ్లాదుఁడును, ఒనరించిన సంవాదము = చేసిన సంభాషణము, ఈయర్థంబునన్ = ఈచెప్పిన సందర్భములో, వెల యున్ = ప్రకాశించును, వినుము.

తా. రాజా! పూర్వము మునిరాజైన అజగరుఁడును ప్రహ్లాదుఁడును చేసినసంవాదము ఇప్పుడు మనము మాటలాడు విషయమునకు సరిపడును. దానిం జెప్పెద వినుము.

వ. తొల్లి భగవత్ప్రియుం డయినప్రహ్లాదుండు కతిపయామాత్య సమేతుం డయి లౌకికతత్త్వంబు నెఱింగెడికొఱకు లోకంబు ల సంచరించుచు నొక్కనాఁడు కావేరీతీరంబున సహ్యపర్వ తతటంబున ధూళిధూసరితంబు లయినకరచరణాద్యవయవం బులతోడ గూఢం బైననిర్మలతేజంబుతోఁ గర్మాకారవచో లింగవర్ణాశ్రమాదుల నెవ్వరికి నెఱుంగఁ బడక నేల నిద్రిం చుచు నజగరవ్రతధరుం డైనమునిం గని డాయం జని విధివ త్ప్రకారంబున నర్చించి మునిచరణంబులకు శిరంబు మోపి మ్రొక్కి యతనిచరిత్రంబు దెలియ నిశ్చయించి యిట్లనియె.

టీ. తొల్లి = పూర్వము, భగవత్ప్రియుండు=విష్ణునకు అంతరంగిక భక్తుఁడు, కతి...తుండు=కొందఱుమంత్రులతోఁ గూడినవాఁడు, లౌకిక

తత్త్వంబు=లోకధర్మము, లోకంబులన్ = దేశములయందు, సంచరించుచున్ = తిరుగుచు, కావేరీతీరంబునన్ = కావేరిగట్టున, సహ్యపర్వతతటంబునన్ = సహ్యపర్వతము వెంబడిని, ధూళిధూసరితంబులు = దుమ్ముగప్పినవి, కర...బులు=కాళ్లుచేతులు మొదలగు నవయవములు, గూఢంబు=లోపల దాఁగినది, నిర్మలతేజంబుతోన్ = శుద్ధప్రకాశముతో, కర్మా...దులన్ = పనులు రూపము మాటలు గుర్తులు జాతి ఆశ్రమము మొదలగువానితోడ, ఎఱుంగఁబడక = తెలిసికొనరాక, నేలన్ = భూమిమీఁద, నిద్రించుచున్, అజగరవ్రతధరుండు = కొండచిలువయొక్క నడవడిని దాల్చినవాఁడు,ముని=మననము చేయువాఁడు, డాయన్ చని = దగ్గఱకుఁబోయి, విధివత్ప్రకారంబునన్ = శాస్త్రరీతిచేత, అర్చించి = పూజించి, ముని చరణంబులకున్ = ఆమునిపాదములకు, శిరంబు = తల, సోఁకి = తాఁకించి, మ్రొక్కి, అతనిచరిత్రంబు = ఆయన నడవడి, తెలియన్ = తెలిసికొనుటకు.

సీ. భూమి నుద్యోగివై భోగివై యుండెడి
    నరునికై వడి మునినాథ నీవు
ఘనశరీరము దాల్చి కదలవు చిత్రము
    ద్యమయుక్తునకుఁ గాని ధనము లేదు
ధనవంతునకుఁ గాని తగుభోగములు లేవు
    భోగికిఁ గాని సంపూర్ణమైన
తనువు లే దుద్యోగధనభోగములు లేక
    నేల నూరక పడి నిద్ర వోవు
ఆ. నీకు నెట్లు గలిగె నిరువమదేహంబు
సముఁడ వార్యుఁడవు విశారదుఁడవు
బుద్ధినిధివి జనులఁ బొగడవు దెగడవు
నిద్ర ప్రతిదినంబు నిలుపనేల. 432

టీ. మునినాథ = మునిశ్రేష్ఠుఁడా! నీవు, భూమిన్ = ప్రపంచమున, ఉద్యోగి = ప్రయత్నముగలవాఁడు, భోగి = సుఖానుభవము గలవాఁడు, వి, ఉండెడి, నరునికైవడిన్ = మనుజునివలె, ఘనశరీరము = గొప్పదేహమును, తాల్చి = ధరించి, కదలవు, చిత్రము = ఆశ్చర్యము, ఉద్యమయుక్తునకున్ కాని = పాటుపడువానికిఁ గాని, ధనవంతునకుఁ గాని = ద్రవ్యముగలవానికిఁగాని, తగుభోగములు = తగిన సుఖానుభవములు, భోగికిన్ కాని = సుఖానుభవముగలవానికిఁగాని, సంపూర్ణము = పుష్కలమైనది, తనువు = ఒడలు, ఉద్యోగ...ములు = ప్రయత్నము ద్రవ్యమును సుఖానుభవమును, నేలన్ = భూమియందు, ఊరక = నిష్క్రియుఁడవై, పడి = దొర్లి, నిద్రవోవుటకున్ = నిద్రించుటకు, ఈనిరుపమదేహంబు = సాటిలేని తనువు, ఎట్లు, కలిగెను, సముఁడవు = సర్వభూతములయందును సుఖదుఃఖాదులయందును సమానుఁడవు, ఆర్యుఁడవు = పూజ్యుఁడవు, విశారదుఁడవు = విద్వాంసుఁడవు, బుద్ధినిధివి = జ్ఞానాశ్రయుఁడవు, జనులను, పొగడవు, తెగడవు = నిందింపవు, ఇట్లు, ప్రతిదినమును, నిద్రన్ = నిద్రావస్థలో, నిలుపన్ ఏల = శరీరము నేల యుంచితివి.

తా. ఓమునీంద్రా! ప్రపంచమున పాటుపడి ద్రవ్య మార్జించి సుఖపడువానికిఁగాని శరీరము అందముగాఁ బెరుఁగదు. నీవు పెద్దశరీరము గలిగియున్నావు. అటు నిటు మెదలవు. అతిచిత్రము. పాటుపడువానికిఁ గాని డబ్బు దొరకదు. డబున్నఁగాని తగినసౌఖ్యము లేదు. సౌఖ్య మున్న నేకాని శరీరము బలువదు. నీవు ఉద్యోగము ద్రవ్యము సుఖము లేకయే మంచిదేహపుష్టి గలిగియున్నావు. వట్టినేలమీఁదఁ బడి నిద్రబోవుచుందువు. నీకీయందమైన దేహ మెట్లుకలిగెను. సర్వసముఁడవు. పూజ్యుఁడవు. పండితుఁడవు. మహాజ్ఞానివి. ఒకరిని బొగడవు. తిట్టవు. ఎప్పుడు ఇట్లు ఏల నిద్రపోయెదవో దయచేసి చెప్పుము.

వ. అని యిట్లు ప్రహ్లాదుం డడిగిన వికసితముఖుం డయి మునీంద్రుండు దదీయమధురాలాపసుధారసప్రవాహంబులు గర్ణంబులఁ బరిపూర్ణంబు లైన నతని నవలోకించి యిట్లనియె.

టీ. వికసితముఖుండు = ప్రకాశించుచున్నముఖము గలవాఁడు, తదీయ...బులు = ఆప్రహ్లాదుని వైనతీయునిపలుకు అను సమ్మతిప్రసంగలు, కర్ణంబులన్ = చెవులయందు, పరిపూర్ణంబులై = నిండినవై, అవలోకించి = చూచి.

సీ. అంతరంగికదృష్టి నంతయు నెఱుఁగుదు
    వార్యసమ్మతుఁడ వీ వసురవర్య
విశ్వజంతువులప్రవృత్తినివృత్తిల
    క్షణములు నీయెఱుంగనివి లేవు
భగవంతుఁ డగుహరి పాయక నీమనో
    వీథి రాజిల్లుచు వెలుఁగుచేని
క్రమమున బహుళాంధకారంబుఁ బరిమార్చుఁ
    బరమసాత్త్వికుఁడవు భద్రబుద్ధి
ఆ. వైననీవు నన్ను నడిగెదు గావున
    విన్నధర్మ మెల్ల విస్తరింతు
నిన్నుఁ జూడఁ గలిగె నీతోడిమాటల
    నాత్మశుద్ధి గలిగె ననఘచరిత. 434

టీ. అసురవర్య = రాక్షసులలో మేటియైన యోప్రహ్లాదా! ఆర్యసమ్మతుఁడవు = పెద్దలకుఁ బ్రియమైనవాఁడవు, ఈవు = నీవు, అంతరంగికదృష్టిన్ = సూక్ష్మదృష్టిచేత, విశ్వ...ములు = సమస్తభూతములయొక్క రాకపోకలరీతులు, నీ యెఱుంగనివి = నీకుఁ దెలియనివి, లేవు, భగవంతుఁడు = షడ్గుణైశ్వర్యయుక్తుఁడు, అగు, హరి = విష్ణువు, పాయక = విడువక, నీమనోవీథిన్ = నీచిత్తమున, రాజిల్లుచున్ = ప్రకాశించుచు, వెలుఁగుచేనిక్రమమునన్ = చంద్రునివలె, బహుళాంధకారంబున్ = దట్టపుఁజీఁకటిని, పరిమార్చున్ = అడఁచును, పరమసాత్త్వికుఁడవు = గొప్పసత్త్వగుణప్రధానుఁడవు, భద్రబుద్ధివి = మేలైన బుద్ధిగలవాఁడవు, ఐన నీవు, నన్ను, అడిగెదవు కావున, విన్నధర్మము ఎల్లన్ =

నేను పెద్దవారివలన వినినసంగతియంతయు, విస్తరింతుఁగా = వివరింతును, అనఘచరిత = పాపములేనినడవడిగలవాఁడా! నిన్ను, చూడఁగా గలిగెను = చూచుట సంభవించెను, నీతోడిమాటలఁగా = నీతో సంభవించినమాటలవలన, ఆత్మశుద్ధి = చిత్తస్థైర్యము, కలిగెను.

తా. ప్రహ్లాదా! సాధువులకు మోదము గూర్చువాఁడవైన నీవు జ్ఞానదృష్టిచే సమస్తము నెఱుఁగుదువు. ఎల్లజంతువుల పుట్టుచావుల వార్తలలో నీకుఁ దెలియనియంశ మొక్కటియు లేదు. శ్రీమన్నారాయణమూర్తి యెల్లప్పుడు నీమనసులో నిల్లుగట్టుకొని కాఁపురము సేయుచు చంద్రుఁడు చీఁకటిని బోఁగొట్టినట్లు నీయజ్ఞానమునంతయు బోఁగొట్టుచున్నాఁడు. శుద్ధసత్త్వమయుఁడవు, మంగళాకారుఁడవు నైన నీవు సర్వము దెలిసియు నన్నడుగుచున్నావుగావున నే విన్నంతలో నెల్లధర్మములు నీకుఁ దెలిపెదను. నా పుణ్యము మంచిదయియున్నందునఁ బరమభాగవతోత్తముఁడవైన నీయట్టివాని గన్నులారఁ గాంచుట తటస్థమయ్యెను. నీతోడ కొంచెముసేపు మాటలాడినంతలోనే చిత్తశుద్ధి గలిగెను.

వ. వినుము ప్రవాహకారిణి యై విషయంబులచేతం బూరింపరానితృష్ణచేతం బడి కర్మంబులఁ బరిభ్రామ్యమాణుండ నైన నేను నానావిధయోనులందుఁ బ్రవేశించుచు వెడలుచు నెట్టకేలకు మనుష్యదేహంబు ధరియించి యుందు ధర్మంబున స్వర్గద్వారంబును నధర్మంబున శునకసూకరాదితిర్యగ్జంతుయోనిద్వారంబుల నొంది క్రమ్మఱ మనుష్యుం డై పుట్టవలయు నని వివేకించి సుఖరక్షణదుఃఖమోక్షణంబులకొఱకు ధర్మంబు చేయుదంపతులవ్యవహారంబు గని సర్వక్రియానివృత్తి గలిగినజీవుండు స్వతంత్రుం డై ప్రకాశించు నని నిర్ణయించి భోగంబులు మనోరథజాతమాత్రంబులు గాని శాశ్వతంబులు గా వని పరీక్షించి నివృత్తుండనై యుద్యోగంబు

లేక నిద్రించుచుఁ బ్రారబ్ధభోగంబుల ననుభవించుచు నుండుదు నివ్విధంబునఁ దనకు సుఖరూపం బైనపురుషార్థంబు దనయందుఁ గలుగుట యెఱుఁగక పురుషుండు శైవాలజాల నిరుద్ధంబు లైనశుద్ధజలంబుల విడిచి యెండమావులు జలంబు లని పాఱెడుమూఢునివడువున సత్యంబు గాని ద్వైతంబుఁ జొచ్చి ఘోరసంసారచక్రపరిభ్రాంతుం డై ద్వైతంత్రంబు లైన దేహాదులచేత నాత్మకు సుఖంబును దుఃఖనాశంబునుం గోరుచు నిరీశుం డైన వానిప్రారంభంబులు నిష్ఫలంబు లగు నదియునుం గాక మర్త్యునకు ధనంబు ప్రాప్తం బయిన నది దుఃఖకరంబు గాని సుఖకరంబు గాదు లోభవంతు లయిన ధనవంతులు నిద్రాహారంబులు లేక రాజ చోర యాచక శత్రుమిత్రాది సర్వస్థలంబులందును శంకించుచు దానభోగంబులు మఱచి యుండుదురు. ప్రాణార్థవంతులకు భయంబు నిత్యంబు శోకమోహభయక్రోధరాగశ్రమాదులు వాంఛామూలంబులు వాంఛ లేకుండవలయును. 435

టీ. ప్రవాహకారిణి=వేగగమనముగలది, విషయంబులచేతన్=స్పర్శరూపాది వస్తువులచేత, పూరింపరానితృష్ణచేతన్=నిండింప నలవిగాని యాశచేత, కర్మములన్, పడి, పరిభ్రామ్యమాణుండను=తిరుగుచున్నవాఁడను, ఐన నేను, నానావిధ=పలుదెఱఁగు లైన, యోనులయందున్=క్షేత్రములయందు, ప్రవేశించుచున్=చొచ్చుచు, వెడలుచు, ఎట్టకేలకు=ఏదోఒకవిధమున, అతిప్రయాసచేత, మనుష్యదేహంబు=మానిసిపుట్టువు, ధరియించి=తాల్చి, అందున్=దానిలో, ధర్మంబునన్=న్యాయముచేత, స్వర్గద్వారంబును=స్వర్గపువాకిలిని, అధర్మంబునన్=అన్యాయమార్గమున, శునక...బులన్=కుక్కలు పందులు మొదలయిన జ్ఞానహీనజంతువుల యోనిరంధ్రములను, పొంది, క్రమ్మఱన్=మరల, మనుష్యుండను=మను

వాఁడు, వి, పుట్టువలయును, అని, వివేకించి=విచారించుకొని, సుఖ...కాముకుఁడై=ఎప్పుడు సుఖమును బొందుచుండఁ గాపాడుకొనుట దుఃఖమును దొలఁగించుటవీనికొఱకు, ధర్మంబు=సద్వర్తనము, చేయు, దంపతుల వ్యవహారంబు=భార్యాభర్తలనడవడిని, కని=చూచి, అనఁగా, తమంతనేవచ్చు సుఖదుఃఖములను దెలియఁజాలక సుఖమువచ్చుటకు దుఃఖముపోవుటకును వారువారు చేయు వ్యర్థప్రయత్నములనెఱిఁగి విచారించి యనుట. సర్వక్రియానిష్ఠ=ఎల్లపనులుమానుట, స్వతంత్రుండై=ఒకదానికి లోఁబడనివాఁడై, ప్రకాశించుచు=వెలుఁగుచు, నిర్ణయించి=నిశ్చయించుకొని, భోగంబులు=సుఖదుఃఖానుభవములు, మనోరథజాతిమాత్రంబులు=తలఁపులలోఁ గల్గినవి, శాశ్వతములు=స్థిరములు, నివృత్తుండను=కోరికలనుండి మరలినవాఁడను, ఉద్యోగంబు=యత్నము, నిద్రించుచు, ప్రారబ్ధభోగంబులఁ=పూర్వసంచితకర్మానుభవములను, ఇవ్విధంబునఁ=ఈలాగున, తనకు, సుఖరూపంబు=సుఖమను, పురుషార్థంబు=వస్తువు, తనయందుఁ, గలుగుట, ఎఱుంగక=తెలియనేరక, శైవాల...బులు=పాఁచితుటలచేఁ గప్పఁబడినవగు, శుద్ధజలంబులఁ=మంచినీళ్లను, ఎండమావులు=మృగతృష్ణలు, పాఱెడు మూఢునివడువునఁ=పరుగెత్తునవివేకివలె, సత్యంబు=నిజము, ద్వైతంబు=భేదభావన, చొచ్చి=ప్రవేశించి, ఘోర...భ్రాంతుండు=దారుణమైన సంసారచక్రమునఁబడి తిరుగువాఁడు, దైవతంత్రంబులు=ఈశ్వరునిచేఁ గల్పింపఁబడినవి, దేహాదులచేతఁ=దేహము గేహము మొదలగువానిచేత, ఆత్మకుఁ=జీవునకు, సుఖంబును, దుఃఖనాశంబును=ఆపన్నివృత్తియు, నిరీశుఁడు=ఈశ్వరుని దెలియనివాఁడు, ప్రారంభంబులు=కార్యారంభములు, నిష్ఫలంబులు=ప్రయోజనములేనివి, మర్త్యునకుఁ, ప్రాప్తంబు=దొరికినది, దుఃఖకరంబు = కష్టముగూర్చునది, సుఖకరంబు=మేలుసేయునది, లోభవంతులు=ఆశాబద్ధులు, అయిన, ధనవంతులు=సంపన్నులు, నిద్రాహారంబులు=కంటికికూర్కు కడుపునకన్నమును, లేక=కాక, రాజ...లందును=రాజు దొంగలు బిచ్చగాండ్రు విరోధులు ఆశ్రితులు మొదలుగా నెల్లరియొడలను, శంకించుచుఁ=వారివలనను ధనహాని కలుగునేమో

యని భయపడుచు, దానభోగంబులు=ఒకరికిపెట్టుట తాఁదినుట, మఱచి యుండుదురు, ప్రాణార్థసంతులకున్ = ప్రాణముగలజంతువులకును ధనికులకును, భయంబు, నిత్యంబు=శాశ్వతము, పుట్టినజంతువులన్నిచచ్చుటన్యాయము గావున జీవుల బ్రదుకు నిత్యముగాదు. క్షణక్షణమునను భయమే. అట్లే ధనవంతుల ధనము ఎన్ని రక్షణోపాయములు వెదకినను పోవుటకే దారివెదకుచుండును. శోక...దులు=వ్యసనము మోహము భీతి ప్రీతి కోపము అలఁత మొదలగునవియన్నియు, వాంఛామూలంబులు=తృష్ణవెంటఁబుట్టునవి, కావున, వాంఛ=విషయతృష్ణ, లేకుండవలయును.

మ. సరఘల్ గూర్చిన తేనె మానవులకున్ సంప్రాప్తమైనట్లు లో
 భరతుల్ గూర్చినవిత్తముల్ పరులకుం బ్రాపించుఁ బ్రాప్తాశియై
 తిరుగంబోని మహోరగంబు బ్రదుకన్ దీర్ఘాంగమై యుండియుం
 జిరకాలంబును వానివర్తనములం జింతించి యేకాంతినై. 436

టీ. సరఘల్ = తేనెటీఁగలు, కూర్చినతేనె = కూడఁబెట్టినపుష్పరసము, మకరందము, మానవులకున్ = జనులకు, సంప్రాప్తము = లభించినది, ఐనట్లు, లోభరతుల్ = ఆశాబద్ధులు, కూర్చిన విత్తముల్ = చేర్చినద్రవ్యములు, పరులకున్ = అన్యులకు, ప్రాపించున్ = చేరును, దీర్ఘాంగము = పెద్దయొడలు గలది, ఐ, ఉండియును, తిరుగన్ పోని మహోరగంబు = అటునిటు కదలక మెదలక యుండునట్టి కొండచిలువ, బ్రదుకున్ = ఎట్లో జీవించును, నేను, చిరకాలంబును = చాలకాలము, వానివర్తనములన్ = అజగరముల నడవడులను, చింతించి=తలపోసి, ఏకాంతిన్ ఐ=ఒంటరివాఁడనై.

తా. ప్రహ్లాదా! లోభులైన మానవులు కూడఁబుట్టినవిత్తము తేనెటీఁగలు కూడఁబెట్టినతేనె మనుజులపాలయినట్లు, అన్యులపాలై పోవును. కావున వారు ధనార్జనమునకయి చేసినయత్నము లన్నియు వ్యర్థము లేగదా! ఏప్రయత్నములేకయే తా నున్నచోటు కదలక పెద్దశరీరముతో నుండి

కొండచిలువలు బ్రదుకుటలేదా అవి యెట్లుజీవించును? అని వానివృత్తి యెఱింగి తెలిసికొని నేనును సర్వసంగములు వదలి ఒంటిగా నున్నవాఁడనై.

క. అజగరమును జుంటీఁగయు
నిజగురువులుగాఁ దలంచి నిశ్చింతుఁడనై
విజనస్థలిఁ గర్మంబుల
గజిబిజి లేకున్నవాఁడ గౌరవవృత్తిన్. 437

టీ. అజగరమును=కొండచిలువయు, జుంటీఁగయున్ = తేనెటీఁగయును, నిజగురువులుగాన్ = తనకు తత్త్వముఁజెప్పిన గురువులుగా, తలంచి = నిశ్చయించి, నిశ్చింతుఁడనై = విచారముఁ బాసినవాఁడనై, విజనస్థలిన్=ఎవ్వరు లేనిచోట, కర్మంబులగజిబిజి=కర్మముల సంకులత, లేక, గౌరవవృత్తిన్=మంచినడవడితో, ఉన్నవాఁడను.

తా. ప్రహ్లాదా! ఇట్లు అజగరమును, తేనెటీఁగను తత్త్వోపదేశకులైన గురువులనుగాఁ జేసికొని విచారము దక్కి ఒంటరిపాటున నిచ్చోఁ జేరి కర్మములసందడిఁ బాసి సుఖముగా నున్నాను.

సీ. అజినవల్కలదుకూలాంబరంబులు గట్టి
యొండెఁ గట్టకయును నొండె నుండు
నాందోళికారథహయనాగముల నెక్కి
యైన నెక్కక యైన నరుగుచుండుఁ
గర్పూరచందనకస్తూరికాలేప
మైన భూరజ మైన నలఁదుచుండు
భర్మశయ్యల నైనఁ బర్ణశిలాతృణ
భస్మంబులం దైనఁ బండుచుండు
ఆ. మానయుక్త మైన మానహీనం బైనఁ
దీయ నైన మిగులఁ దిక్త మైనఁ

గుడుతు సగుణ మైన గుణవర్జితం బైన
నల్ప మైనఁ జాల నధిక మైన. 438

టీ. అజిన...బులు = తోళ్లు నారబట్టలు వెలిపట్టుదోవతులు నూలుగుడ్డలు, కట్టియుండక = ధరించుకొని కాని, కట్టకయునుండక = కట్టుకొనకుండఁగాని, ఉందును, అందోళికా...ములక = పల్లకి బండి గుఱ్ఱము ఏనుఁగు వీనిని నెక్కిగాని, యెక్కకగాని, అరుగుచుందుక = వెళ్లుచుందును, కర్పూర...లేపమైనక = కర్పూరము గంధము కస్తూరి వీని పూఁతను గాని, ధూరజమైనక = నేలదుమ్మును గాని, అలఁదికొందుక = పూసికొనుచుందును, భర్మశయ్యలక = బంగారు పఱుపులయందు, పర్ణ...బులందు = ఆకులు రాళ్లు గడ్డి బూడిదలలో, పండుకొందును, మానయుక్తము = మన్ననతోఁ గూడినది, మానహీనంబు = మన్ననలేనిది, తీయన = తీయనిది, తిక్తము = చేఁదు, సగుణము = మంచిగుణముగలది, గుణవర్జితము = గుణము (ప్రయోజనము) లేనిది, అల్పము = కొంచెము, అధికము = ఎక్కువ, కుడుతును = తిందును.

తా. ప్రహ్లాదా! నేను చర్మముగాని నారచీరెగాని పట్టుకోకగాని నూలుగుడ్డలుగాని దొరకినగాని దొరకకపోయినఁగాని చింతనొందకుందును. ఇవి దొరకినప్పుడు కట్టుకొందును. లేకున్న నూరకుందును. పల్లకి బండి గుఱ్ఱము ఏనుఁగు చిక్కిన నెక్కెదను. చిక్కకున్న నూనెదను. కప్పురము గంధము కస్తూరి దొరకినఁ బూసికొందును. ఇంతదుమ్మైనను బూసికొందును. బంగారు పఱుపుగాని వట్టినేలగాని భేదమెంచక పండుకొందును. ఆదర ముండనీ లేకపోనీ తీయనగా నుండినను చేఁదైనను మంచిగాని చెడ్డగాని కొంచెముగాని గొప్పగాని చాలినను జాలకపోయినను ఏదైనను దిందును.

క. లేదని యెవ్వరి నడుగను
రా దని చింతింపఁ బరులు రప్పించినచోఁ

గా దని యెద్దియు మానను
ఖేదము మోదమును లేక క్రీడింతు మదిన్. 439

టీ. లేదు = నాకీవస్తువులేదు, అని, ఎవ్వరిని, అడుగను, రాదు = ఇదినాకు దొరకదు, చింతింపను, పరులు = ఇతరులు, రప్పించినచోన్ = పిలుపించఁగా, రాదు = రానుపీలులేదు, అని, ఎద్దియున్ = కర్తాను రూపమయిన యేపనిని, మానను, మదిన్ = చిత్తములో, ఖేదము = దుఃఖము, మోదము=సంతోషము, లేక, క్రీడింతును=విహరింతును.

తా. నాకీవస్తువు లే దని యొకరి నడుగను ఇది దొరకకపోయెఁ గదా యని యేడువను. ఒకరు పిలచినఁ దప్పించుకొనను. కర్తార్హమైన దేనిని వలదనను. మనస్సున నేవేళను దుఃఖముగాని సుఖముగాని లేక యానందించుచుందును.

క. నిందింపఁ బరుల నెన్నఁడు
వందింప ననేకపీడ వచ్చిన మది నా
క్రందింప విభవముల కా
నందింపఁ బ్రకామ వర్తనంబున నధిపా. 440

టీ. పరులన్=ఇతరులను, ఎన్నఁడును, నిందింపన్ = దూషింపను, అనేకపీడ = ఎంతటి యిక్కట్టు, వచ్చినను, వందింపన్ = ఒకరికి మ్రొక్కను, మదిన్ = చిత్తములో, విభవములకున్ = సంపదలకయి, ఆక్రందింపన్ = ఏడువను, ప్రకామ వర్తనంబునన్ = ఇచ్ఛ వచ్చినట్లు మెలఁగుటచేత, ఆనందింపన్ = ఆనందపడను.

తా. నేను ఒకరి నెన్నఁడును నిందించను. ఎంత దుఃఖము వచ్చినను, ఒకరిని వేఁడను. కలుములు లేకపోయెఁ గదా యని యేడువను. తోఁచినట్లెల్ల కోరిక లనుభవించి సుఖమని యానందపడను.

వ. ఇట్లు కోరిక లేక యొక్కసమయంబున దిగంబరుండ నై పిశాచంబుచందంబున వర్తించుచుఁ బెక్కుదినంబులంగోలెఁ బెనుఁబాపవర్తనంబుఁ గైకొని నిమీలితలోచనత్వంబున నేకాంతభావంబున విష్ణునియందు వికల్పంబును భేదగ్రాహకచిత్తవృత్తులఁ జిత్తంబు నర్థరూపపరిభ్రమంబు గలమనంబునందు మనంబును నహంకారంబునందు నహంకారంబును మాయయందు మాయను నాత్మానుభూతియందు లయంబు నొందించి సత్యంబు దర్శించుచు విరక్తి నొంది స్వానుభవంబున నాత్మస్థితుండ నై యుండుదు నీవు భగవత్పరుండవు గావున రహస్యం బైనపరమహంసధర్మంబు స్వానుభవగోచరం బైన తెఱంగున నీకు హృద్గోచరం బగునట్లు సెప్పితి ననిన విని.

టీ. దిగంబరుండను = దిసమొలవాఁడను, పిశాచంబుచందంబునన్ = దయ్యమువలె, వర్తించుచున్ = మెలఁగుచు, పెక్కుదినంబులంగోలెన్ = చాలదినములనుండి, పెనుఁబాపవర్తనంబున్ = కొండచిలువనడవడిని, కైకొని, నిమీలితలోచనత్వంబునన్ = కనులు మూసికొని యుండుటచే, ఏకాంతభావంబునన్ = నిశ్చలత్వముతో, విష్ణునియందున్ = శ్రీహరియందు, చిత్తంబు = మనము, చేర్చి, భేదగ్రాహకచిత్తవృత్తులన్ = భేదబుద్ధిని గలిగించుమనోధర్మములచేత, అర్థరూపపరిభ్రమంబు = వస్తురూపములయందలి తిరుగుడు, కలమనంబునందు, అహంకారంబునందున్ = నేను నాది యనుదానియందు, మాయయందు, మాయను, వీనిని, ఆత్మానుభూతియందున్ = ఆత్మసాక్షాత్కారమందు, లయంబునొందించి = ఐక్యముచేసి, సత్యంబు = నిజమైనదానిని, దర్శించుచున్ = చూచుచు, విరక్తిన్ = విరాగమును, పొంది, స్వానుభవంబునన్ = ఆత్మానుభవముచేత, ఆత్మస్థితుండను = నాలోఁజేరినవాఁడను, భగవత్పరుండవు = భాగవతోత్తముఁడవు, పరమధర్మంబు = ఉత్తమ

తత్త్వము, స్వానుభవ గోచరం బైన తెఱంగునన్ = నాకుఁ దెలిసినట్లు, హృద్గోచరము = మనస్సునకెక్కునది, అగునట్లు, చెప్పితిని.

క. ఘను నజగరమునివల్లభు
దనుజేంద్రుఁడు పూజచేసి తగ వీడ్కొని నె
మ్మనమున సంతోషించుచుఁ
జనియెన్ నిజగేహమునకు శశికులతిలకా. 442

టీ. శశికులతిలకా = చంద్రవంశమున కాభరణమైనధర్మరాజా! ఘనున్ = మహానీయుఁడైన, అజగరమునివల్లభున్ = అజగరమహామునిని, దనుజేంద్రుఁడు = రాక్షసులరాజయిన ప్రహ్లాదుఁడు, పూజచేసి = సత్కరించి, తగన్ = యథోచితముగా, వీడ్కొని = సెలవుగొని, నెమ్మనమునన్ = అంతరంగములో, సంతోషించుచున్ = ఆనందపడుచు, నిజగేహమునకున్ = తన యింటికి, చనియెన్ = పోయెను.

తా. ఓధర్మరాజా! ఇట్లు రాక్షసరాజైన ప్రహ్లాదుఁడు ఆ మహాత్ముఁడగు అజగరమహామునిని పూజించి సెలవుపుచ్చుకొని ఆయన బోధించిన సద్బోధకు మనస్సున చాలఁగ సంతోషించుచుఁ దనయింటికిఁ జేరెను.

వ. అనిన యుధిష్ఠిరుం డిట్లనియె. 443

క. ననుబోఁటిజడగృహస్థుఁడు
మునివల్లభ యిట్టి పదవి మోదంబున నే
యనువునఁ జెందును వేగమ
వినిపింపుము నేఁడు నాకు విజ్ఞాననిధీ. 444

టీ. యుధిష్ఠిరుఁడు = ధర్మరాజు, మునివల్లభ = మునులలో మేటివైన నారదా! నను...స్థుఁడు = నావంటి యజ్ఞానియైనవాఁడు, ఇట్టిపదవి = ఈ ప్రహ్లాదాజగరులు పొందినట్టిదగు మంచిపదవిని, మోదంబునన్ = సంతసముతోడ, ఏయనువునన్ = ఏరీతిగా, చెందును = పొందఁగలఁడో, విజ్ఞాననిధీ =

జ్ఞానమునకు నెలవైనయో మహామునీ! వేగముల = శీఘ్రముగా, నేఁడు= ఈవేళ, సాకు, వినిపింపుము.

తా. జ్ఞానసాగరుఁడ వైనయో నారదమునీంద్రా! ఇప్పుడు మీరు చెప్పినవిధమున సర్వసంగవియోగరూపముక్తిని నాబోఁటిమూఢాత్ముఁ డైన గృహస్థుఁడు బొంద వీలున్నదా? ఏదియైన నొకతెరువు గలదేని దయతో శీఘ్రముగా సెలవిండు.

వ. అనిన నారదుం డిట్లనియె గృహస్థుం డయినవాఁడు వాసుదేవార్పణంబుగా గృహోచితక్రియ లనుసంధించుచు మహామునుల సేవించి వారలవలన నారాయణదివ్యావతారకథాశ్రవణంబు సేయుచు నయ్యైవిహితకాలంబుల శాంతజనులం గూడి మెలంగుచుఁ బుత్త్రమిత్త్రకళత్త్రాదిసంగంబులు గలలవంటి వని యెఱుంగుచు లోపల నాసక్తి లేక సక్తునికైవడి వెలుపలఁ బురుషకారంబు లొనర్చుచుఁ దగులంబు లేక విత్తంబు లిచ్చి జనక సుత సోదర సఖ జ్ఞాతిజనులచిత్తంబులు సమ్మదాయత్తంబులు గావించుచు ధనధాన్యనిధానదైవలబ్ధంబులవలన నభిమానంబు మాని యనుభవించుచు గృహక్షేత్రంబులఁ జొచ్చి యుదరపూరణమాత్రంబు దొంగిలినవాని దండింపక భుజగమృగమూషకమర్కటమక్షికాఖరోష్ట్రంబుల హింసింపక పుత్త్రులభంగి వీక్షించుచు దేశకాలదైవంబులకొలందిని ధర్మార్థకామంబులఁ బ్రవర్తించుచు శునకపతితచండాలాదులకైన భోజ్యపదార్థంబులు దగినభంగి నిచ్చుచు నిజవృత్తిలబ్ధంబు లగునశనాదులచేత దేవర్షిపితృభూతమానవుల సంతర్పించుచు పంచమహాయజ్ఞావశేషంబుల నంతర్యామిపురుషయజనంబును నాత్మజీవనోపాయంబును సమర్థించుచు నుండవలయు.

టీ. వాసుదేవార్పణంబుగాన్ = శ్రీకృష్ణపరమాత్మకుఁ జెందునట్లుగా, గృహోచితక్రియలు = ఇంటఁ గావలసినయెల్లపనులును, అనుసంధించుచున్ = చేయుచు, నారాయ...ణంబు = శ్రీవిష్ణుని యవతారానుసరణములైన పుట్టుకయందలి యద్భుతకృత్యములవినికిని, అర్హ్యవిహితకాలంబులన్ = తగినవేళలలో, శాంతజనులన్ = నెమ్మదిగానుండువారలను, కొలఁగుచు = తిరుగుచును, పుత్త్రి...ములు = కొడుకులు చెలులు భార్యలు మొదలగువాని తగులములు, అసక్తిన్ = మక్కువ, సక్తునికైవడిన్ = ప్రేమగలవానివలె, పురుషకారంబులు = పురుషుఁడు చేయఁదగుపనులు, ఒనర్చుచున్ = చేయుచు, తగులంబు = సంగము, విత్తంబులు = ద్రవ్యములు, జనక...ములు = తండ్రి కొడుకులు కూఁతుండ్రు అన్నదమ్ములు మిత్త్రులు దాయాదులు వీరి మనములను, సమ్మదాయత్తంబులు = సంతోషపూర్ణములైనవి, కావించుచున్ = చేయుచు, ధన...వలనన్ = ద్రవ్యము ధాన్యము గనులు దైవవశమున దొరకినపదార్థములు వీనివలన, అభిమానంబు = గర్వమును, గృహక్షేత్రంబులన్ = తనయింటనిగాని పంటచేనినిగాని, చొచ్చి = దూరి, ఉదరపూరణమాత్రంబు = కడుపునిండుపాటి అన్నాదిద్రవ్యమును, దొంగిలినవానిన్ = ముచ్చిలించినవానిని, దండింపక = శిక్షింపక, భుజగ...ములన్ = పాములు క్రూరజంతువులు ఎలుకలు కోఁతులు ఈఁగలు గాడిదలు ఒంటెలు వీనిని, హింసింపక = చంపక, పుత్త్రులభంగిన్ = తనబిడ్డల మాదిరిని, ఈక్షించుచున్ = ఆదరముతో గనిపట్టుచు, దేశ...దిని = దైవము అనుకూలించినంతలో దేశమునకుఁ గాలమునకుఁ దగినట్లుగా, ధర్మార్థకామంబులయందు, ప్రవర్తించుచున్ = మెలఁగుచు, శునక...కుపచన్ = కుక్కలు కులభ్రష్టులు మాలమాదిగలు వీరికైనను, భోజ్యపదార్థంబులన్ = తినఁదగిన అన్నము అంబలి మొదలగుదానిని, తగినభంగిన్ = ఉచితముగా, నిజవృత్తిలబ్ధంబులు = తనకులవృత్తిచేత దొరకినవి, అగునశనాదులచేతన్ = ఐన అన్నము పిండి శాకము మొదలైనవానిచేత, దేవ...వులన్ = దేవతలు ఋషులు పితరులు ఎల్లజంతువులు మనుజులు వీరిని, సంతర్పించుచున్ = తనియఁబెట్టుచు, పంచ...ములన్ = దేవయజ్ఞమాదిగాఁ బంచయజ్ఞములు చేయఁగా మిగిలినవాని

యందు, అంతర్యామిపురుషయజనంబును = లోపలిజీవాత్మకు ఆహుతిచేసి తృప్తిపఱచుటయును, ఆత్మజీవనోపాయంబును = జీవాత్మ నిరపాయముగా బ్రదుకు సదుపాయమును, సమర్థించుచుఁ = చక్కఁజేసికొంచును, ఉండ వలయును

ఆ. జనకగురుల నైనఁ జంపు నర్థమునకై
ప్రాణ మైన విడుచు భార్యకొఱకు
నట్టిభార్యఁ బురుషుఁ డతిథిశుశ్రూష చే
యించి గెలుచు నజితు నీశు నైన. 446

టీ. పురుషుఁడు=మనుజుఁడు, అర్థమునకై=ప్రాణములకొఱకై, జనక గురులనైనఁ = తండ్రినిగాని గురువునుగాని, చంపును, భార్యకొఱకుఁ= అలికై, ప్రాణమైనఁ = అత్యంతప్రియమైన ప్రాణమునైనను, విడుచును, అట్టిభార్య = అలాగున ప్రాణములనైన నిచ్చి పోషించుకొను భార్యను, అతిథిశుశ్రూష = వేళకు ఇంటికివచ్చిన అతిథులసేవను, చేయించి, అజి తుఁ = ఒకరిచే గెలువఁబడని, ఈశుఁ నైనఁ = ఈశ్వరునిగూడ, గెలుచును.

తా. లోకములో మానవుఁడు ద్రవ్యమున కాశపడి తండ్రినైనను గురువునైనను విచారింపక చంపి పెండ్లముకొరకు ప్రాణాలైన విడుచును. ఇది నైజగుణము. ఇట్టి ప్రియమైన పెండ్లాముచేత నెట్టైన లాలించి వేళకు నిల్లుద్రొక్కుకొని వచ్చిన దైవస్వరూపులగు నతిథులకు పూజ జేయించెనా ఆపుణ్యాత్ముఁడు దేవునిఁగూడ గెలుచును. మంచిగతిని పొందు ననుట.

ఆ. పరముఁ డీశ్వరుండు బ్రాహ్మణముఖమున
నాహరించి తుష్టుఁ డయినభంగి
నగ్నిముఖమునందు హవ్యరాసులు గొని
యైనఁ దుష్టి నొందఁ డనఘచరిత. 447

టీ. అనఘచరిత = పావనమైన నడవడిగల యోధర్మరాజా! పరముఁడు = పరాత్పరుఁడు, ఈశ్వరుండు = సర్వనియామకుఁడగు శ్రీమన్నారాయణుఁడు, బ్రాహ్మణముఖమునన్ = బ్రాహ్మణుని ద్వారా, అహరించి = భుజించి, తృప్తుఁడు = తనివి నందినవాఁడు, ఐనభంగిన్ = ఐనట్లు, అగ్నిముఖంబునన్ = అగ్నిద్వారమున, హవ్యరాసులు = అజ్యాది హవిస్సుల గుట్టలను, కొని = గ్రహించినయైనను, తుష్టిన్ పొందఁడు = సంతోషపడఁడు.

తా. ధర్మరాజా! శ్రీవిష్ణురూప పరమాత్మ బ్రాహ్మణద్వారమున నిచ్చిన యింత అన్నోదకములచేఁ దృప్తిపడినట్లు అగ్నిద్వారమునఁ గొండ అంతంత అజ్యాన్నాది హవిస్సుల రాసులను వేల్చినను దృప్తుఁడు కాఁడు. కావున అతిథిపూజనము గృహస్థున కన్నివిధముల శ్రేయస్కరము.

వ. కావున గృహస్థుండు బ్రాహ్మణులందును దేవతలందును మర్త్యపశుప్రముఖజాతులందును నంతర్యామియు బ్రాహ్మణానుండును నైన క్షేత్రజ్ఞునందు నయ్యైకోరికలు సమర్పించి సంతర్పణంబు సేయవలయు భాద్రపదంబునఁ గృష్ణపక్షంబునందును దక్షిణోత్తరాయణంబులందును రేయింబగలు సమమైనకాలంబులందును వ్యతీపాతంబులందును దినక్షయంబులందును సూర్యచంద్రగ్రహణంబులందును శ్రవణద్వాదశియందును వైశాఖశుక్లతృతీయయందును గార్తికశుక్లనవమియందును హేమంతశిశిరంబులోన నాలు గష్టకలందును మాఘశుక్లసప్తమియందును మాసనక్షత్రంబులతోడంగూడిన పున్నమలందును ద్వాదశితోడంగూడిన యుత్తరాత్రయశ్రవణానూరాధలందును నుత్తరాత్రయసహితంబులైనయేకాదశులయందును జన్మనక్షత్రయుక్తదివసంబులందును మఱి

యుఁ బ్రశస్తకాలంబులందును జననీజనక బంధుజనులకు శ్రాద్ధంబులును జపహోమస్నానవ్రతంబులును దేవబ్రాహ్మణసమారాధనంబులును నాచరింపవలయు భార్యకుఁ బుంసవనాదికంబును నపత్యంబునకు జాతకర్మాదికంబును దనకు యజ్ఞదీక్షాదికంబును బ్రేతజనులకు దహనాదికంబును మృతదివసంబున సాంవత్సరికంబును జరపవలయు. 448

టీ. మర్త్య...దును=మానవసామాన్యమగు నుగోడ్డుగోదలు మొదలుగా సమస్తప్రాణులయందును, అంతర్యామి = లోననిమిడియుండువాఁడు, బ్రాహ్మణానందు=బ్రాహ్మణులే నోరుగాఁగలవాఁడు, క్షేత్రజ్ఞునందుఁ = జీవరూపుఁడైన యీశ్వరునియందు, సంతర్పణంబు=మెప్పు, వ్యతీపాతంబు=ఒకయోగము, దినక్షయంబులు=అవమ మొదలగునవి, శ్రవణద్వాదశి=శ్రవణనక్షత్రముతోఁ గూడినయేకాదశి, తృతీయ=తదియ, అష్టకలు = శ్రాద్ధభేదములు, ప్రశస్తకాలము=పుణ్యపర్వకాలము, జననీ...లకుఁ = తల్లిదండ్రులు దాయాదులు మొదలగుగా సర్వవర్గముల బంధువులకును, శ్రాద్ధంబులు=(శ్రద్ధచే నీయఁబడునవి) హిరణ్యాదిశ్రాద్ధములును, జప...లును=తపస్సుహోమము పుణ్యతీర్థస్నానములు నోములును, దేవ...లును = దేవతాపూజలు బ్రాహ్మణసంతర్పణములును, ఆచరింపవలయుఁ=చేయఁదగును, భార్యకుఁ=పెండ్లమునకు, పుంసవనాదికంబును = పుంసవనము (మగబిడ్డయే కలుగవలెనని చేయుకర్మము) సీమంతము మొదలయిన శుభకర్మను, అపత్యంబునకుఁ=బిడ్డకు, జాతకర్మాదికంబును=పుట్టినబిడ్డకుఁ జేయఁదగిన నామకరణము, కటిసూత్రధారణము, చౌలము కర్ణవేధము మొదలయిన శుభకర్మమును, తనకుఁ, యజ్ఞదీక్షాదికంబును=క్రతువులో దీక్షఁబూనుట మొదలయినది, ప్రేతజనులకుఁ = చనిపోయిన సంబంధులకు, దహనాదికంబును=దహన సంచయన ప్రభృతి పావనసంస్కారంబులును, మృతదివసంబునఁ = చనిపోయిన తిథియందు, సాంవత్సరికంబును = యేఁటేఁట జరపఁబడు శ్రాద్ధమును, జరపవలయును.

మ. విను మే దేశములఁ దయాగుణతపోవిద్యాన్వితం బైనవి
ప్రనికాయంబు వసించు నేస్థలములన్ భాగీరథీముఖ్యవా
హినులుండున్ హరిపూజలెయ్యెడలభూయిష్ఠప్రకారంబులం
దనరున్ భూవర యట్టిచోటులఁదగున్ ధర్మంబులం జేయఁగన్.

టీ. భూవర = రాజా! వినుము, ఏదేశములన్ = ఏపుణ్యక్షేత్రములలో, దయా...న్వితంబు = కరుణ తపస్సు పాండిత్యము వీనితోఁగూడిన, విప్రనికాయంబు = బ్రాహ్మణసంఘము, వసించున్ = కాఁపురముండునో, భాగీరథీముఖ్యవాహినులు = గంగ మొదలగు పుణ్యనదులు, ఉండునో, ఎయ్యెడలన్ = ఏతావులలో, హరిపూజలు = విష్ణుపూజనము, భూయిష్ఠప్రకారంబునన్ = ఎక్కువ శ్రద్ధాభక్తుల కలయికతో, తనరున్ = పెంపొందునో, అట్టిచోటులన్ = అలాటిపుణ్యదేశములలో, ధర్మంబు = పేరును పెంపును గలిగించు ధర్మకార్యములు, చేయఁగన్ తగున్ = చేయువలయును

తా. ధర్మరాజా! ఏక్షేత్రమున దయా తపస్సత్య శౌచాది సద్గుణవంతులైన బ్రహ్మవేత్తలగు బ్రాహ్మణు లుందురో, యెచ్చట గంగాది పుణ్యనదులు ప్రవహించుచుండునో, ఎచ్చట శ్రీహరి కైంకర్యము విశేషభక్తిభావముతో జరుగుచుండునో అట్టిపావనస్థలములలోఁ జేయఁబడినధర్మము కొంచమైనను వటబీజమువడువున బహుళఫలమై వృద్ధినందును.

క. హరియందు జగము లుండును
హరిరూపము సాధుపాత్రమం దుండు శివం
కర మగుపాత్రము గలిగిన
నరయఁగ నది పుణ్యదేశ మనఘచరిత్రా. 450

టీ. అనఘచరిత్రా = పావనమైన నడవడిగల యోధర్మరాజా! హరియందున్ = విష్ణువునందు, జగములు = లోకములు, ఉండును, సాధుపాత్రమందున్ = యోగ్యమైన బ్రాహ్మణరూపక్షేత్రమందు, హరిరూపము =

విష్ణునిస్వరూపము, ఉండును, అరయఁగన్=విచారించఁగా, శివంకరము=శుభము గలిగించునది, అగుపాత్రము=అయినపుణ్యబ్రాహ్మణుఁడు, కలిగినన్=ఉన్నయెడల, అది=అమంచిపాత్రముగలది, పుణ్యదేశము=ఉత్తమమైనతీర్థభూమి.

తా. రాజా! ఎల్లజగములు, శ్రీవిష్ణువునందు లీనమైయుండును. ఆవిష్ణువో పావనమైనబ్రాహ్మణునియందు నివసించును. అట్టి యోగ్యుఁడై భగవద్భక్తుఁడైనబ్రాహ్మణుఁ డున్నచోటు ఎల్ల తీర్థములకు మేలుబంతి యగును.

వ. మఱియుఁ గురుక్షేత్రంబును గయాశీర్షంబును బ్రయాగంబును బులహాశ్రమంబును నైమిశంబును ఫాల్గునంబును సేతువును బ్రభాసంబును గుశస్థలియును వారణాసియు మధురాపురియును బంపాబిందుసరోవరంబులును నారాయణాశ్రమంబును సీతారామాశ్రమంబును మహేంద్రమలయాదులైనకులాచలంబులును హరిప్రతిమార్చనప్రదేశంబులును హరిసేవాపరులైనపరమభాగవతులు వసించెడుపుణ్యక్షేత్రంబులును శుభకాముండైనవాఁడు సేవింపవలయు. 451

టీ. కురుక్షేత్రము=కురుపాండవులు యుద్ధముచేసిన తావు, గయాశీర్షము = గయాసురుని శిరస్సు గలపుణ్యదేశము, ప్రయాగము=త్రివేణీసంగమము గలచోటు, పులహాశ్రమము = పులహామహాముని యున్నచోటు, నైమిశంబు = ఒకయడవి, నారాయణాశ్రమము = నరనారాయణులు తపమొనర్చినతావు, సీతారామాశ్రమంబును=సీతయును రాముఁడును గొన్నాళ్లు కాఁపురముచేసిన పంచవటిలోనొకదేశము, హరిప్రతి..లును = విష్ణువిగ్రహపూజలు జరగెడు దివ్యదేవాలయస్థలములును, హరిసేవాపరులు=విష్ణుసేవచేయువారు, పరమభాగవతులు=ఉత్తములైనవిష్ణు

భక్తులు, వసించెడు పుణ్యక్షేత్రంబులును = ఉండెడు పావనస్థలములును, శుభకాముఁడు=మంగళమును గోరువాఁడు, సేవింపవలయున్ = వెళ్లిచూచి కొల్చుచుండి యానందపడవలెను.

ఆ. భూవరేంద్ర యిట్టిపుణ్యప్రదేశంబు
లందు నరుఁడు చేయునట్టిధర్మ
మల్పమైన నది సహస్రగుణాధిక
ఫలము నిచ్చు హరికృపావశమున. 452

టీ. భూవరేంద్ర = రాజులకెల్ల రాజయినయోధర్మరాజా! ఇట్టి, పుణ్యప్రదేశంబులందున్ = పావనస్థలములలో, చేయునట్టిధర్మము = పుణ్యకార్యము, అల్పము = కొంచెము, ఐనను, అది=ఆచేయఁబడిన ధర్మము, హరికృపావశమునన్ = విష్ణునిదయాబలముచేత, సహస్ర...ఫలమున్ = వేయిరెట్లు అతిశయమైన లాభమును, ఇచ్చును.

తా. ధర్మరాజా! ఇట్టి పుణ్యక్షేత్రములలో నేమానవుఁడైనను ధర్మమేపాటిచేసినను వానియెడ శ్రీహరికత్యంతకరుణ గలుగునుగాన నాకారణముచేత వాఁడుచేసిన పుణ్యకార్య మెంతయల్పమైనను అది మహాఫలమిచ్చునది యగును.

వ. వినుము చరాచరం బయినవిశ్వమంతయు విష్ణుమయం బగుటం జేసి పాత్రనిర్ణయనిపుణు లైనవిద్వాంసులు నారాయణుండు ముఖ్యపాత్రం బని పలుకుదురు దేవఋషులును బ్రహ్మపుత్త్రు లైనసనకాదులును నుండ భవదీయరాజసూయంబున నగ్రపూజకు హరి సమ్మతుం డయ్యె ననేకజంతుసంఘాతసంకీర్ణం బైనబ్రహ్మాండపాదపంబునకు నారాయణుండు మూలంబు దన్నిమిత్తంబున నారాయణసంతర్పణంబు సకలజంతుసంతర్పణం బని యెఱుంగుము ఋషినర

తిర్యగ్మనుశరీరంబులు పురంబులు వానియందుఁ దారతమ్యం బులతోడ జీవరూపంబున భగవంతుం డయినహరి వర్తించు టం జేసి పురుషుం డనఁ బ్రసిద్ధుం డయ్యె నందుఁ దిర్యగ్జాతు లకంటె నధికత్వంబు పురుషునియందు విలసిల్లుటం జేసి పురు షుండు పాత్రంబు పురుషులలోన హరితను వైనవేదంబును ధరించుచు సంతోషవిద్యాతపోగరిష్ఠుం డైనబ్రాహ్మణుండు పాత్రంబు బ్రాహ్మణులలోన నాత్మజ్ఞానపరిపూర్ణుం డయిన యోగి ముఖ్యపాత్రం బని పలుకుదురు పరస్పరపాత్రంబులకు సహింపనిమనుష్యులకుఁ బూజనార్థంబుగాఁ ద్రేతాయుగం బునందు హరిప్రతిమలు గల్పింపంబడియె కొందఱు ప్రతిమా ర్చనంబు సేయుదురు పాత్రపురుషద్వేషు లైనవారలకు నట్టిప్రతిమార్చనంబు ముఖ్యార్థప్రదంబు గాదు మందా ధికారులకుఁ బ్రతిమార్చనంబు పురుషార్థప్రదం బగును. 453

టీ. చరాచరము=కదలునది కదలనిది, అయిన, విశ్వమంతయుఁ=ప్రపంచమంతయును, విష్ణుమయంబు=శ్రీమన్నారాయణస్వరూపము, పాత్రనిర్ణయనిపుణులు=ఉత్తమానుత్తముల నేఱికొను వెరవరులు, విద్వాంసులు=పండితులు, నారాయణుండు=శ్రీమహావిష్ణువు, ముఖ్యపాత్రంబు=అనుత్తమమైనధర్మనిక్షేపణస్థానము, దేవఋషులును, అమానుషలక్షణములుగల భృగ్వాదిమునులు, బ్రహ్మపుత్త్రులు=బ్రహ్మకొడుకులు, సనకాదులు=సనక సనందన సనత్కుమార సనత్సుజాతులు, భవదీయ=నీసంబంధమైన, అగ్రపూజకున్=మొదటిగౌరవమునకు, హరి=కృష్ణుఁడు, సమ్మతుఁడు = ఒప్పుకొన్నవాఁడు, అనేక...కీర్ణంబు=లెక్కలేని జంతువులసమూహములచేఁ గ్రిక్కిఱిసి యున్నది, ఐన, బ్రహ్మాండపాదపంబునకున్=బ్రహ్మాండ మనుచెట్టునకు, నారాయణుండు=శ్రీమహావిష్ణువు, మూలంబు=ఉత్పత్తికారణము, తన్నిమిత్తంబునన్=ఆకారణమువలన, నారాయణసంతర్పణంబు = విష్ణునిసమా

రాధనము, సకలజంతుతర్పణంబు=ఎల్లజంతువులను దృప్తిపఱచుట, ఋషి ...బులు=మునులు మనుజులు తిర్యగ్జంతువులు దేవతలు వీరిశరీరములు, పురంబులు=నగళ్లు, తారతమ్యంబుతోడన్ = అంశలన్యూనాధికత్వములచేత, జీవరూపంబునన్ = జీవాత్మస్వరూపముతోడ, భగవంతుండు=షడ్గుణైశ్వర్యయుతుఁడు, వర్తించుటంజేసి=ఉండుటవలన, పురుషుండు=పురములనుండువాఁడు, ప్రసిద్ధుఁడు=పేరుగాంచినవాఁడు, పురుషునియందున్=మానవునియందు, తిర్యగ్జాతికంటెన్ = పశుపక్షిమృగాదులకంటెను, అధికత్వము=గొప్పతనము, విలసిల్లుటంజేసి = ప్రకాశించుచున్నందున, పురుషుండు = మానవుఁడు, పాత్రంబు = యోగ్యవస్తువు లుంచఁదగినచోటు, హరితనువు = విష్ణునకు దేహతుల్యమైనది, ధరించుచున్ = తాల్చుచు, సంతోష...ష్టుండు=నిత్యతృప్తి చదువు తపము వీనిచే గొప్పవాఁడు, బ్రాహ్మణుండు = బ్రహ్మకులోత్పన్నుఁడు, పాత్రంబు = యోగ్యుఁడు, ఆత్మజ్ఞానపరిపూర్ణుండు = బ్రహ్మజ్ఞానసంపన్నుఁడు, యోగి = చిత్తనిరోధముగలవాఁడు, ముఖ్యపాత్రంబు=ఉత్తమోత్తమమైనపాత్రము, పరస్పరపాత్రంబులకున్=అన్యోన్యపాత్రములకు, సహింపని=ప్రియమందని, పూజనార్థంబుగాన్=పూజచేసికొనుటకుఁగా, త్రేతాయుగంబునందు, హరిప్రతిమలు=మృచ్ఛిలాదారురూపములగు విష్ణుమూర్తులు, కల్పింపంబడియెన్=నిర్మాణముచేయఁబడెను, ప్రతిమార్చనంబు=విగ్రహారాధనము, పాత్రపురుషద్వేషులు=యోగ్యులగు విష్ణురూపులైన పూజార్హులను, విరోధించువారలకు, అట్టి, ప్రతిమార్చనంబు=ప్రతిమరూపమునుబూజించుట, ముఖ్యార్థప్రదంబు=ప్రధానఫలమునిచ్చునది, కాదు, మందాధికారులకున్=కొంచెము తెలివిగలిగి యింకను బరిపక్వముగాని యంతరంగము గలవారలకు, ప్రతిమార్చనంబు = ప్రతిమలనుబూజించుట, పురుషార్థప్రదంబు = ధర్మార్థకామముల నొసఁగునది.

ఆ. అఖిలలోకములకు హరి దైవతము చూడ
హరికి దైవతము ధరాధినాథ

పదపరాగలేశపంక్తిచేఁ ద్రైలోక్య
పావనంబు చేయు బ్రాహ్మణుండు. 454

టీ. ధరాధినాథ=భూపతీ! చూడఁగ=విచారింపఁగా, అఖిలలోకములకున్=ఎల్లలోకములకును, హరి=శ్రీవిష్ణువు, దైవతము=దేవుఁడు, హరికిన్=విష్ణునకు, బ్రాహ్మణుఁడు, దైవతము, కాన, వాఁడు, పద...చేన్=కాళ్లదుమ్మునందలి యణువులసమూహముచేత, త్రైలోక్యపావనంబు చేయున్=మూఁడులోకములను బవిత్రము చేయును.

తా. రాజా! సమస్తభువనములకు విష్ణువే దైవము. ఆవిష్ణువునకు బ్రాహ్మణుఁడు దైవము. కనుక ఆబ్రాహ్మణుఁడు యోగ్యుఁడాయెనా తనపాదధూళియందలి అణువులచేతనే సమస్తలోకములను బావనము చేయును.

వ. అట్టి బ్రాహ్మణజనులందుఁ గర్మనిష్ఠులుఁ దపోనిష్ఠులు వేదశాస్త్రనిష్ఠులు జ్ఞానయోగనిష్ఠులు నై కొందఱు వర్తింతు రందు జ్ఞాననిష్ఠునికి ననంతఫలకామి యైనగృహస్థుండు పితృజనుల నుద్దేశించి కవ్యంబులును దేవతల నుద్దేశించి హవ్యంబులును బెట్టుట ముఖ్యంబు దైవకార్యంబునకు నిరువురనైన నొకరినైనఁ బితృకార్యంబునకు మువ్వురనైన నొకరినైన భోజనంబు చేయింపవలయు ధనవంతునకైనను శ్రాద్ధవిస్తారంబు గర్తవ్యంబు గాదు దేశకాలప్రాప్త కందమూలఫలాదికం బయినహరినైవేద్యంబున విధిచోదితప్రకారంబుగా శ్రద్ధతోడఁ శాస్త్రంబునందుఁ బెట్టినయన్నంబు గామదంబయి యక్షయఫలకారి యగుధర్మతత్త్వవేది యైనవాఁడు శ్రాద్ధంబులందు మాంసప్రదానంబు సేయక భక్షింపక చరింపవలయుఁ గందమూలాదిదానంబున నయ్యోశిఫలంబు పశుహింసనంబున సంభవింపదు ప్రాణిహింస సేయక వర్తించుట

కంటె మిక్కిలి ధర్మంబు లేదు యజ్ఞవిదు లైనప్రోడలు నిష్కా
ములయి బాహ్యకర్మంబులు విడిచి యాత్మజ్ఞానదీపంబులం
దుఁ గర్మమయంబు లయినయజ్ఞంబుల నాచరింతురు. 455

టీ. కర్మనిష్ఠులు = యాగాదికర్మలఁజేయువారు, తపోనిష్ఠులు=తపస్సులను జేయువారు, వేదశాస్త్రనిష్ఠులు = వేదములయందును శాస్త్రములయందును నిరతులైనవారు, జ్ఞానయోగనిష్ఠులు = జ్ఞానసంగతియందుఁ దవిలియుండువారు, వర్తింతురు=మెలఁగుదురు, జ్ఞాననిష్ఠునికిన్=జ్ఞానమునఁ దవిలియున్నవానికి, అనంతఫలకామి=తుదగాంచనియర్థముల గోరునట్టి, గృహస్థుండు=కాఁపు, పితృజనులకు, ఉద్దేశించి=తలఁచి, కవ్యంబులను, పెట్టుట=ఇచ్చుట, ముఖ్యంబు=ఆవశ్యకము, దైవకార్యంబునకున్=దేవపూజకు, ఇరువురు=ఇద్దఱు, పితృకార్యంబునకున్ = తండ్రి తాతల తద్దినమునకు, ముప్పురకున్ ఐనన్, శ్రాద్ధవిస్తారంబు=శ్రాద్ధమందలి బ్రాహ్మణబాహుళ్యము, కర్తవ్యంబుకాదు=చేయఁదగదు, దేశ...కంబుల్=తానుండుచోటునకు ఆకాలమునకుఁ దగినరీతిని దొరకిన దుంపలు వేళ్లు పండ్లు మొదలైనది, హరినైవేద్యంబునన్=విష్ణునివేదనమున, విధిచోదితంబుగాన్=శాస్త్రప్రకారముగా, పాత్రంబు=పళ్లెము, కామదంబు=కోరినదాని నొసఁగునది, అక్షయఫలకారి=నాశములేనిఫలమిచ్చునది, ధర్మతత్త్వవేది=ధర్మమునిజము తెలిసినవాఁడు, శ్రాద్ధంబులందున్=పితృమాతృాదుల యాబ్దికములలో, మాంసప్రదానంబు సేయక=మాంసముఁబెట్టక, భక్షింపక=తానుదినక, చరింపవలయున్=మెలఁగఁదగును, కందమూలాదిదానంబునన్ = దుంపలు కాఁడలు బెట్టినందువలన, ఆర్యోచితఫలంబు=కలుగుఫలము, పశుహింసవలనన్=జంతువులను విశసించుటవలన, సంభవింపదు=కలుగదు, ప్రాణిహింస=జీవవధముఁ, ధర్మంబు=మంచిపని, యజ్ఞవిదులు=యాగవిధిని దెలిసినవారు, ప్రోడలు=నేర్పరులు, నిష్కాములు = కోరికలులేనివారు, బాహ్యకర్మంబులు = పయితోఁచుపనులు, ఆత్మ...లందున్=బ్రహ్మజ్ఞానాగ్నులయందు, కర్మంబులు=క్రియారూపములు, ఆచరింతురు=చేయుదురు.

క. పశువులఁ బొరిగొని మఖములు
విశదములుగఁ జేయుబుధుని వీక్షించి తమున్
విశసనము చేయునో యని
క్రశిమన్ బెగడొందు భూతగణము నరేంద్రా. 456

టీ. నరేంద్రా=రాజా! పశువులన్=అజాదిజీవులను, పొరిగొని=విశసనముచేసి, మఖములు=యాగములు, విశదములుగన్=ప్రకాశములుగా, చేయువిబుధునిన్=చేయుచున్నపండితుని, వీక్షించి=చూచి, భూతగణము లు=జంతుజాలములు, తమున్=తమ్ముఁగూడ, విశసనము సేయునో=చంపునేమో, అని, క్రశిమన్=కుందుటచేత, బెగడొందున్=ఉత్తలపడును.

తా. రాజా! ఎప్పుడు చూచినను పశువులను విశసించి యజ్ఞములుచేయు నయ్యాగారినిజూచి చిల్లజీవులును దమనుగూడ నాయన యేచంపి క్రతువులు సేయునేమో యని విశేషముగా భీతిల్లి కలవరముఁ జెందుచుండును.

వ. అది గావున ధర్మవేది యయినవాఁడు దైవప్రాప్తంబు లగు
వకందమూలాదికంబులచేత నిత్యనైమిత్తికక్రియలఁ జేయ
వలయు నిజధర్మబాధకం బయినధర్మంబును బరధర్మప్రేరితం
బయినధర్మంబును నాభాసధర్మంబును బాషండధర్మంబును
గపటధర్మంబును ధర్మజ్ఞుం డయినవాఁడు మానవలయు నైస
ర్గికధర్మంబు దురితశాంతిసమర్థం బగు నిర్ధనుండు ధర్మార్థం
బు యాత్ర సేయుచు నైన ధనంబు గోర వలవదు జీవనోపా
యంబునకు నిట్టట్టుఁ దిరుగక కార్పణ్యంబు లేక జీవించు
మహాసర్పంబు తెఱంగున సంతోషంబున నాత్మారాముం
డై యెద్దియుం గోరక బ్రదికెడిసుగుణునికిం గలసుఖంబు
గామలోభంబుల దశదిశలం బరిధావనంబు సేయువానికి
సిద్ధింపదు పాదరక్షలు గలవానికి శర్కరాకంటకాదులవలన

భయంబు లేక మెలంగ నలవడుభంగిఁ గామంబులవలన నివృత్తి గలవానికి నెల్లకాలంబును భద్రం బగునువస్థమున కును జిహ్వాదైన్యంబునకును బురుషుండు గృహపాలకశునకం బుకై వడి సంచరించుచు సంతుష్టి లేక చెడు సంతోషి గాని విప్రునివిద్యాతపోవిభవయశంబులు నిరర్థకంబు లగు నిం ద్రియలోలత్వంబున విజ్ఞానంబు నశించు సకలభూలోకభోగం బులు భోగించియు దిగ్విజయంబు చేసియు బుభుక్షాపిపాసల వలనఁ గామపారంబును హింసవలనఁ గ్రోధపారంబును జేరుట దుర్లభంబు సంకల్పవర్జనంబునఁ గామంబును గామవ ర్జనంబునఁ గ్రోధంబును నర్థానర్థదర్శనంబున లోభంబును నద్వైతానుసంధానంబున భయంబును నాత్మానాత్మవివే కంబున శోకమోహంబులును సాత్త్వికసేవనంబున దంభం బును మౌనంబున యోగాంతరాయంబును శరీరవాంఛ లేమి ని హింసయు హితాచరణంబున భూతజా బయినదుఃఖం బును సమాధిబలంబున దైవికవ్యథయుఁ బ్రాణాయామాది కంబున మనస్థవ్యథయు సాత్త్వికాహారంబుల నిద్రయు సత్త్వగుణంబున రజస్తమంబులును నుపశమంబున సత్త్వం బును గురుభజనకుశలుఁడై శీలంబున జయింపవలయు. 457

టీ. ధర్మవేది = ధర్మతత్త్వమెఱిఁగినవాఁడు, దైవప్రాప్తంబులు = దైవవశమున దొరకునవి, కందమూలాదికంబులచేతన్ = గడ్డలువేళ్లు మొద లగువానిచేత, నిత్యనైమిత్తికక్రియలన్ = నిత్యములయిన వైశ్వదేవాదులను నిమిత్తప్రాప్తములైన మావ్యకవ్యములను, ధర్మజ్ఞుండు=ధర్మరహస్య మెఱిఁగిన వాఁడు, వినవాఁడు, నిజధర్మబాధకంబు = తనసజాతనకుధర్మమును చె ఱుచునది; పరధర్మప్రేరితము = ఇతరధర్మముచేఁ బ్రేరేపఁబడినది, ఆభాస

ధర్మంబు, నైసర్గికధర్మంబు = సహజమైనధర్మము, దురితశాంతిసమర్థంబు = పాపముల నణఁపఁజాలినది, నిర్ధనుండు = బీద, ధర్మార్థంబు = ధర్మముకొఱకు, యాత్ర = పుణ్యక్షేత్రగమనము, చేయుచుఁ బైనను, జీవనోపాయంబునకుఁ = బ్రతుకుతెరువునకు, కార్పణ్యంబు = నీచత్వము, (దైన్యము) మహాసర్పంబు తెఱంగునఁ = పెద్దపామువలె, ఆత్మారాముండు = తనలోఁ దాఁ గ్రీడించువాఁడు, బ్రదికెడిసుగుణునికిన్ = జీవించునీతిపరునకు, కామలోభంబులన్ = కోరికలచేతను ఆశచేతను, దశదిశలన్ = పదిదిక్కులందును, పరిధావనంబు చేయువానికిన్ = పరుగెత్తువానికి, సిద్ధింపదు = కుదురదు, పాదరక్షలు = చెప్పులు, శర్కరాకంటకాదులవలనన్ = గులకరాళ్లు ముళ్లు మొదలగువానివలన, మెలంగన్ = నడచుటకు, అలవడు భంగిన్ = వీలైనట్లుగా, నివృత్తి = మరలుపాటు, భద్రము = కుశలము (దుఃఖనాశము), పురుషుండు = మానవుఁడు, గృహపాలశునకంబు కైవడిన్ = ఇంటఁగావలియుండు కుక్కవలె, ఉపస్థమునకును = గ్రామ్యధర్మముకొఱకును, జిహ్వాదైన్యంబునకును = నోటివాఁపరిగొట్టుతనమునకును, సంచరించుచున్ = తిరుగుచు, సంతుష్టి = తృప్తి, లేక, పదునా, విద్యా...బులు = చదువు తపము ఐశ్వర్యము కీర్తియును, నశ్వరంబులు = కొరమాలినవి, ఇంద్రియలోలత్వంబునన్ = ఇంద్రియప్రీతివలన, విజ్ఞానంబు = తెలివి, నశించును, సకల...బులు = పుడమిలోఁగలయెల్లసుఖములు, భోగించియున్ = అనుభవించియును, బుభుక్షాపిపాసలవలనన్ = ఆఁకలిదప్పులవలన, కామప్రారంభమునన్ = కోర్కెలతుదను, హింసవలనన్ = జీవసంహారమువలన, క్రోధప్రారంభమునన్ = కోపముతుదను చేరుట = చెందుట, దుర్లభంబు = పొందరానిది, సంకల్పవర్జనంబునన్ = మనోరథముల నుజ్జగించుటచేత, కామంబును = కోరికను, కామవర్జనంబునన్ = కోరికవిడుచుటచేత, క్రోధంబును = కోపమును, అర్థానర్థదర్శనంబునన్ = నిత్యానిత్యవస్తువివేకముచేత, లోభంబును = పేరాశను, అద్వైతానుసంధానంబునన్ = జీవేశ్వరుల యేకత్వభావనముచేత, భయమును, (సుఖదుఃఖభాజనుఁడై సంసారమున మ్రగ్గి త్రుళిదానివలన భయపడు

జీవుఁడు తానే బ్రహ్మము తనవలననే దేహాదులు కల్పితములు గావున దేనికి భయముండరాదని తెలుసుకొన్నతర్వాత యిందునను భయములేదనితా.) ఆత్మానాత్మవివేకంబునన్ = ఆత్మయొక్కయు అనాత్మయొక్క విచారముచేత, శోకమోహంబులును = దుఃఖము అజ్ఞానమును, సాత్త్వికసేవనంబునన్ = సాధుసాంగత్యముచేత, దంభంబును = డాంబికవృత్తిని, మౌనంబునన్ = మితభాషణమున, యోగాంతరాయంబును = నియమబాధయును, శరీరవాంఛ = ఒడలియందలిప్రేమ, హింస = ప్రాణహింసయును, హితాచరణంబునన్ = సర్వజంతువులయందును సమముగా వర్తించుటచేత, భూతజంబు = జంతువులనుండి కల్గినది, సమాధిబలంబునన్ = నియమధారణ ప్రభావముచేత, దైవికవ్యథయున్ = యదృచ్ఛాప్రాప్తమైన దుఃఖమును, ప్రాణాయామాదికంబునన్ = ప్రాణనిరోధము మొదలయినదానిచేత, మన్మథవ్యథయున్ = కామవికారమును, సాత్త్వికాహారంబులన్ = సత్త్వగుణవర్ధకములయినభోజనములచేత, నిద్రయును, సత్త్వగుణంబునన్, రజస్తమంబులును, ఉపశమంబునన్ = ఓర్పుచేత, సత్త్వంబును = బలోద్రేకమును, గురుభజనశీలుఁడై = పెద్దలసేవించు నైజముగలవాఁడై, శీలంబును = స్వభావమును, జయింపవలయున్ = నిగ్రహింపవలయును.

క. హరిమహిమ దనకుఁ జెప్పిన
గురువున్ నరుఁ డనుచుఁ దలఁచి కుంఠితభక్తిం
దిరుగుపురుషు శ్రమ మెల్లను
కరిశౌచము క్రియ నిరర్థకం బగు నధిపా. 458

టీ. అధిపా = రాజా! తనకున్, హరిమహిమ = దేవదేవుఁడైన విష్ణుని ప్రభావము, చెప్పినగురువున్ = విప్పియుపదేశించినదేశికుని, నరుఁడు = మానవసామాన్యుఁడు, అనుచును, తలఁచి = భ్రమపడి, తిరుగు, పురుషుని, శ్రమము = తానుత్తమగతికేఁగుటకై చేయుయత్నమంతయు, కరిశౌచముక్రియన్ = గజస్నానప్రక్షాళనమువలె, నిరర్థకము = కొఱమాలినది, అగును. (ఏనుఁగు ఎంత

నీళ్లలోఁబడి మునిఁగినను గట్టునకు రాఁగానే మురల మదముకొత్తి యీఁగలు తుమ్మెదలు మువిరి యాత్మాశనము వ్యర్థపోయి రోఁతకొట్టుచుండును.

తా. రాజా! ఎవఁడు తనకు విష్ణుమహాత్మ్య మపదేశించి మేలొనర్చిన గురువులను దనతోడిమనుజునిగాఁ దలఁచునో వాఁడు త్తమగతికేఁగుట కెన్ని పాట్లుబడినను అవియెల్ల వ్యర్థములే యగును.

ఉ. ఈవనజాతనేత్రుఁ బరమేశు మహాత్ముఁ బ్రధానపూరుషున్
దేవశరణ్యు సజ్జనవిధేయు ననంతుఁ బురాణయోగిసం
సేవితపాదపద్ముఁ దమచిత్తములన్ నరుఁ డంచు లోకు లి
చ్ఛావిధిఁ జూచు చుండుదురు సన్మతి లేక నరేంద్రచంద్రమా.

టీ. నరేంద్రచంద్రమా=రాజశ్రేష్ఠుఁడా! లోకులు=జనులు, సన్మతి=మంచిబుద్ధి, లేక, తమచిత్తములన్=తమమనస్సులలో, ఈవనజాతనేత్రుఁడు=తామరలవంటికన్నులుగల యీవిష్ణువును, పరమేశున్=పరాత్పరుని, మహాత్మున్=మహానుభావుని, ప్రధానపూరుషున్=కూటస్థుని, దేవశరణ్యున్=దేవతలకుఁ గాపుదలయైనవానిని, సజ్జనవిధేయున్=పూజ్యులకు వశ్యమైనవానిని, అనంతున్=నాశములేనివానిని, పురాణ...పద్మున్=పూర్వపుమునీంద్రులచేఁ గొలువఁబడిన యడుగుఁదామరలుగలవానిని, విష్ణుని, నరుఁడు=సామాన్యమనుజుఁడు, అంచున్=అనితలఁచుచు, ఇచ్ఛావిధిన్=తమయిచ్ఛవచ్చినట్లు, చూచుచుందురు.

తా. ధర్మరాజా! లోకములోఁ గొందఱు మూఢమానవులు జ్ఞానవిహీనులై మహామహిమఁ డైనయీకృష్ణపరమాత్మను తమతోడిమానవునిగా భావించుచుందురు.

వ. వినుము షడింద్రియంబులలోన నొకటియందుఁ దత్పరులై యిచ్ఛాపూరణవిధానంబులఁ జరితార్థుల మైతి మనువారలు ధారణాధ్యానసమాధియోగంబుల సాధింప లేరు కృషిప్రముఖంబులు సంసారసాధనంబులుగాని మోక్షసాధనంబులు గావు.

కుటుంబసంగంబునఁ జిత్తవిక్షేపం బగుఁ జిత్తవిజయప్రయత్నంబున సన్న్యసించి సంగంబు వర్జించి మితం బయినభిక్షాన్నంబు భక్షించుచు శుద్ధవివిక్తసమప్రదేశంబున నొక్కచో నాసీనుండై సుస్థిరత్వంబునఁ బ్రణవోచ్చారణంబు సేయుచు రేచకపూరకకుంభకంబులఁ బ్రాణాపానంబుల నిరోధించి కామవాతం బయినచిత్తంబునఁ బరిభ్రమణంబు మాని కామవిసర్జనంబు సేసి మరలునంతకు నిజనాసాగ్రనిరీక్షణంబు చేయుచు నిర్విఘ్నంబున యోగాభ్యాసంబు సేయువానిచిత్తంబు గాష్ఠరహితం బయినవహ్నితెఱంగున శాంతిం జెందుఁ గామాదులచేత వేధింపంబడక ప్రశాంతసమస్తవృత్తం బయినచిత్తంబు బ్రహ్మసుఖసంస్పర్శనంబున లీనంబై మఱియు నెగయ నేరదు. 460

టీ. షడింద్రియంబులలోనన్=ఆఱింద్రియములలో, ఒకదానికిం దమ, తత్పరులై=ఆసక్తితోఁగూడినవారై, ఇచ్ఛాపూరణవిధానంబులన్=కోరికదీర్చుకొను పనులచేత, చరితార్థులము=కృతకృత్యులము, ఐతిమి, అనువారలు, ధార...బులన్=ఒకవిషయమును జ్ఞాపకముంచుకొనుట, కష్టము వెలుచుకొనుట నియమముఁబూనుట యనువిధులను, సాధింపలేరు, కృషిప్రముఖంబులు=దున్నిపైకొబెట్టుకొనుటమున్నగునవి, సంసారసాధనంబులు కాని=కూడుగుడ్డల సంపాదించుకొనుటకుఁ జాలినవే కాని, మోక్షసాధనంబులు=బంధవిముక్తికిఁ జాలినవి, కావు, కుటుంబసంగంబునన్ = దారాపుత్త్రాదిభరణప్రయాసముచేత, చిత్తవిక్షేపంబు=మనసుకలఁత, చిత్త...బునన్=మనస్సును జయించువూన్కితో, సన్న్యసించి = సర్వకర్మపరిత్యాగముగావించి, సంగంబు = తగులము, వర్జించి=వదలి, మితము = హెచ్చుతగ్గులులేనిది, భిక్షాన్నము=బిచ్చపుఁగూడు, భక్షించుచున్=తినుచు, శుద్ధ...బునన్ = నిర్మలమై యేకాంతమై నిమ్నోన్నతముకానిచోట, ఒక్కచోన్=ఒక్క

యుండ, ఆసీనుండై = కూర్చున్నవాఁడై, సుస్థిరత్వంబునన్ = కదలనిపూనిక తో, ప్రణవోచ్చారణంబు=ఓంకారజపము, రేచకపూరకకుంభకంబులన్ = విడుచుట నింపుట స్తంభించుటలచే, ప్రాణాపానంబులన్ =ఊర్ధ్వాధశ్శ్వాసములను, నిరోధించి = బంధించి, కామహితంబు = మనోరథదూషితము, పరిభ్రమణంబు=త్రిప్పుడు, మాని=వదలి, కామవిసర్జనంబు=కోరికలవిడుమర, మరలనంతకున్=ప్రాణములు స్వస్థానమునకుఁ జేర్చునంతసేపు, నిజనాసాగ్రవీక్షణంబుచేయుచు=తనముక్కుకొనఁజూచుకొనుచు, ఇవ్విధంబునన్=ఈలాగున, యోగాభ్యాసంబు = చిత్తవృత్తినిరోధము చేయుటలవాటు, కాష్ఠరహితంబు=కట్టెలులేనిది, వహ్నిరీతింగూడన్ = నిప్పువలె, శాంతిన్ చెందును=శమించును, కామాదులచేతన్=కోరికకోపము మొదలగువానిచేత, వేధింపంబడక=బాధజెందక, ప్రశాంతసమవృత్తంబు = నెమ్మదితోడి సమభావము గల, బ్రహ్మసుఖసమ్మర్శనంబునన్ = బ్రహ్మానందానుభవవిచారమునందు, లీనంబు=లగ్నమయినది, ఐ, మఱియున్=క్రమ్మఱ, ఎగలనేరదు =విషయములమీఁదికి రేఁగిపోఁజాలదు.

మ. ధరణీదేవుఁడు సన్న్యసించి యతియై ధర్మార్థకామంబులం
బరివర్జించి పునర్విలంబమునఁ దత్ప్రారంభియౌ నేని లో
భరతిం గ్రక్కినకూడు మంచి దనుచున్ భక్షించి జీవించుదు
ర్నరుచందంబున హాస్యజీవనుఁ డగున్ నానాప్రకారంబులన్.

టీ. ధరణీదేవుఁడు=బ్రాహ్మణుఁడు, సన్న్యసించి = కర్మలను వదిలి, యతి=యోగి, ధర్మా...బులన్=ధర్మఅర్థకామములను, పరివర్జించి=విడిచి, విలంబమునన్=తడవుగా, కాలాంతరమున, పునః = మరల, తత్ప్రారంభియౌనేనిన్ = అవదలిన కర్మబంధములను మరలఁదగిలించుకొనెనేని, లోభరతిన్=పిసినిగొట్టుతనముచేత, క్రక్కినకూడు = వాంతిచేసికొన్నయన్నము, మంచిది, అనుచున్, భక్షించి=తిని, జీవించుదుర్నరుచందంబునన్=బ్రతుకునీచమానవునివిధమున, నానాప్రకారంబులన్ = పలుదెఱఁగుల, హాస్యజీవనుఁడు=పరిహసించఁ దగినబ్రతుకుగలవాఁడు, అగును.

తా. రాజా! బ్రాహ్మణుఁడు సర్వకర్మలను వదలి యతీశ్వరుఁడై ధర్మకామార్థములఁ బరిత్యజించి సుఖపడియు మరల మాయాబద్ధుఁడై కాలాంతరమున లోభియై మరల ఆ ముఱికిగుంటలోఁ బడి వాని నారంభించెనా వాని బ్రతుకు కుక్కకూడు మంచి దని తినినవాని బ్రతుకువలె పరిహాసము పాలగును.

క. మలమునఁ గ్రిమియును బడుక్రియ
నిలఁ బడు నొడ లాత్మ గాదు హేయం బనుచుం
దలఁతురు తజ్జ్ఞులు పొగడుదు
రలసత నొడ లాత్మ యనుచు నజ్ఞు లిలేశా. 462

టీ. ఇలేశా=భూపతీ! క్రిమి=పురుగు, మలమునన్=విష్ఠలో, పడు క్రియన్=పడువిధమున, ఒడలు=దేహము, ఇలన్=నేలమీఁద, పడును, ఆత్మ=పరమాత్మ, కాదు, దీనిని, తజ్జ్ఞులు=వస్తుస్వరూపము దెలిసినవారు, హేయంబు అనుచున్=పాఱవేయఁదగిన తుచ్ఛవస్తువని, తలంతురు, అజ్ఞులు=తెలియనివారు, అలసతన్=మాంద్యముచేత, ఒడలు=శరీరమే, ఆత్మ=నిత్యమైన పరవస్తువు, అనుచును, పొగడుదురు=మెచ్చుకొందురు.

తా. రాజా! ఈ దేహము మలములోఁబడు పురుగులాగున నెప్పుడో పడిపోవు పరిహరించఁదగిన తుచ్ఛవస్తువేకాని ఆత్మ కాదు అని దాని స్వరూపమెఱిఁగినవారు దానియెడఁ బ్రీతినుంచరు. మాయామోహితులైన మూఢులో ఇదియే నిత్యమైన దని ఎక్కువ దురభిమానముతో ఆ దేహమందు మోహపడియుందురు.

ఆ. వ్రతము మానఁ దగదు వడుగుఁగుఱ్ఱనికిని
గ్రియలు మానఁ దగదు గృహగతునికి
దపసి కూర నుండఁ దగదు సన్న్యాసికిఁ
దరుణితోడిపొత్తు దగదు తగదు. 463

టీ. వటు-గుఁగుఱ్ఱనికిని = బ్రహ్మచారిపిల్లకాయకు, వ్రతము=తనయాశ్రమమునకుఁ దగిన నియమము, మానన్ తగదు=విడువరాదు, గృహాగతునికిన్=గృహస్థధర్మము నవలంబించియున్నవానికి, క్రియలు = నిత్యనైమిత్తికాదిక్రియలు, మానఁదగదు=విడువరాదు, తపసికిన్ = తపోనిష్ఠగలవానికి (వానప్రస్థునకు), ఊరన్=గ్రామమందు, ఉండన్ తగదు = నిలువరాదు, సన్న్యాసికిన్ = యతికి, తరుణితోడిపొత్తు = స్త్రీతోడిసాంగత్యము, తగదు తగదు.

తా. రాజా! ఎన్నిసంకటములువచ్చినను బ్రహ్మచారి తనయాశ్రమమునకు విహితములైన మౌంజీదండాజినాదులను ధరించుట గురుకులవాసము చేయుట మొదలయినధర్మములు విడువరాదు. గృహస్థుఁడు తన యాశ్రమోచితమైనపంచయజ్ఞములు అతిథిపూజనము మొదలైనకర్మలను విడువక చేయుచుండవలెను. తపస్సు జేయువాఁడు గ్రామములో నివసింపఁగూడదు. యతియైనవాఁడు స్త్రీలను కనులతోనైనఁ జూడరాదు.

సీ. రథము మే నెల్ల సారథి బుద్ధి యింద్రియ
　　　గణము గుఱ్ఱములు పగ్గములు మనము
ప్రాణాదిదశవిధపవనంబు లిరుసు ధ
　　　ర్మాధర్మగతులు రథాంగకములు
బహుళతరం బైనబంధంబు చిత్తంబు
　　　శబ్దాదికములు సంచారభూము
లభిమానసంయుతుం డయినజీవుఁడు రథి
　　　ఘనతరప్రణవంబు కార్ముకంబు
తే. శుద్ధజీవుండు బాణంబు శుభదమైన
బ్రహ్మమంచితలక్ష్యంబు పరులు రాగ
భయమదద్వేషశోకలోభప్రమోహ
మానమత్సరముఖములు మానవేంద్ర. 464

టీ. మానవేంద్ర = రాజా! మేనల్లిక = ఒడలంతయు, రథము = బండి, బుద్ధి, సారథి = రథమునడుపువాఁడు, ఇంద్రియగణము = బాహ్యాంతరింద్రియముల సమూహము, గుఱ్ఱములు, మనము = చిత్తము, పగ్గములు, ప్రాణా...బులు = ప్రాణాదులు, ధనంజయనాగకూర్మాదులు, ఇరుసు, ధర్మాధర్మగతులు = న్యాయాన్యాయవర్తనములు, రథాంగకములు = బండికండ్లు, చిత్తంబు, బహుళతరంబు = పెద్దది, బంధంబు = మోకునుడి, (పన్నగము) శబ్దాదికములు = శబ్దస్పర్శరూపరసగంధములు, సంచారభూములు = రథముతిరిగెడు తావులు, అభిమానసంయుతుండు = నేను నాదియనునహంకారముతోఁ గూడినవాఁడు, అయిన, జీవుఁడు, రథి = రథముందుండు ప్రధానపురుషుఁడు, ఘనతరప్రణవంబు = గొప్పఓంకారము, కార్ముకంబు = విల్లు, శుద్ధజీవుండు = నిర్మలుఁడైన జీవాత్మ, బాణంబు = అమ్ము, శుభదము = మోక్షసుఖదాయకము, పరబ్రహ్మము, అంచిత లక్ష్యంబు = ఒప్పిదమైనగురి, రాగ...ములు = తగులము భయము పొగరు పగ దుఃఖము లోభ మోహము అభిమానము పరశ్రేయస్సహనము లేమి మొదలైనవి, పరులు = చంపవలసినశత్రువులు.

తా. ధర్మరాజా! రథముతోఁ బోల్పఁబడిన యీ దేహమునకు బుద్ధి రథమునడపు సారథి. ఇంద్రియములన్నియు గుఱ్ఱములు. మనోవికృతులు పగ్గములు. ప్రాణాదివాయువులు రథమును నిలుపుటకు నాధారమైనయిరుసు. న్యాయాన్యాయములు బండికండ్లు. చిత్తము మోకుతోఁ గట్టెడుముడి. శబ్దస్పర్శరూపాదులు రథము తిరుగుచోట్లు. అహంకారముతోఁ గూడినజీవుఁడు రథికుఁడు. ఓంకారము విల్లు. అహంకారములేని నిర్మలజీవుఁడు బాణము. పరమాత్మ గురి. రాగద్వేషాదులు శత్రువులు.

వ. ఇట్లు మనుష్యశరీరరూపం బయినరథంబు దనవశంబు చేసి కొని మహాభాగవతచరణకమలసేవానిశితం బయినవిజ్ఞానఖడ్గంబు ధరియించి శ్రీమన్నారాయణకరుణావలోకనబలంబున రాగాదిశత్రునిర్మూలనంబు గావించి ప్రణవబాణాసనం

బున శుద్ధజీవశరంబును సంధించి బ్రహ్మ మని యెడిగుఱియం దుఁ బడవేసి యహంకారరథికుండు రథికత్వంబు మాని నిజా నందంబున నుండ వలయు నట్టివిశేషంబు సంభవింపనిసమ యంబున బహిర్ముఖంబు లయినయింద్రియఘోటకంబులు బుద్ధిసారథిసహితంబు లై స్వాభిమానరథికుని ప్రను త్తత్వంబు దెలిసి ప్రవృత్తిమార్గంబు నొందించి విషయశత్రుమధ్యంబు నం గూల్చిన. 465

టీ. మనుష్యశరీరరూపంబు=మానవుదేహమనునది, రథంబు=బండి ని, తనవశంబు=తనయధీనము, చేసికొని, మహా...శితంబు=ఉత్తము లైన విష్ణుభక్తుల పాదకమలములను సేవించుటచే వాఁడ్యము దెగి పదునుగలిగిన, విజ్ఞానఖడ్గంబు = బ్రహ్మజ్ఞాన మనుకత్తిని, ధరియించి=తాల్చి, శ్రీమ...బు నన్=శ్రీహరికృపావలంబనసామర్థ్యముచేత, రాగాదిశత్రునిర్మూలనంబు= రాగము మొదలగుపగతుల నాశనమును, కావించి=చేసి, ప్రణవబాణాసనం బునన్=ఓంకారమనువింటియందు, శుద్ధజీవశరంబును=రాగాదులు లేక నిర్మ లుఁడైన జీవుఁడను వాఁడిబాణమును, సంధించి=గ్రుచ్చి, బ్రహ్మము=పర మాత్మ, అనియెడిగుఱియందు పడవేసి, జీవేశ్వరులయందు భేదబుద్ధి మాని జీవునకు బ్రహ్మతో నైక్య మనుసంధించి, అహంకార రథికుండు=అహంకార యుక్తుఁడైన జీవుఁడను రథగతపురుషుఁడు, రథికత్వము=రథికుఁడౌట, మా ని, నిజానందంబునన్=సహజమైన బ్రహ్మానందమునందు, ఉండవలయును, అట్టివిశేషంబు=అలాటిభాగ్యము, సమయంబునన్=వేళయందు, బహిర్ముఖం బులు=వెలిమొగముకలుగుచున్న, ఇంద్రియఘోటకంబులు=ఇంద్రియము లనుగుఱ్ఱ ములు, బుద్ధి...బులై=బుద్ధి యనుసారథితోఁ గూడి, స్వాభిమానరథికుని ప్ర ను త్తత్వంబు=తను అహంకారసహితుఁ డగుజీవుఁ డనురథికునియొక్క ఏమ

తీకను, తెలిసికొని, ప్రవృత్తిమార్గంబున = కర్మములతోడను, ఒందించి = పొందించి, తప్పుదారి కీడ్చుకొనిపోయి యనుట. విషయశత్రుమధ్యంబు నన్ = శబ్దస్పర్శాది ఇంద్రియార్థములనెడు శత్రువులనడుమను, కూల్చి వన్ = త్రెళ్లివేయఁగా.

ఆ. విషయశత్రులెల్ల విక్రాంతితోడ సా
రథిసమేతుఁ డయినరథికుఁ బట్టి
యుగ్రతిమిరమృత్యుయుత మగుసంసార
కూపమధ్యమందుఁ గూల్తు రధిప. 466

టీ. అధిప = రాజా! విషయశత్రులు ఎల్లన్ = పూవులు చందనము స్త్రీలు మొదలగు నింద్రియార్థము లనుపగతులందఱును, విక్రాంతితోడన్ = పరాక్రమముతో, సారథిసమేతుఁడు = బుద్ధి యనువానితోఁగూడిన, రథికున్ = సాహంకారజీవుఁడను రథస్థుని, పట్టి, ఉగ్రతిమిరమృత్యుయుతము = చావను భయంకరమైన కాఱుచీఁకటితోఁగూడిన, సంసారకూపమధ్యమందున్ = సంసారమను బావినడుమ, కూల్తురు.

తా. రాజా! యి ట్లేమఱిన జీవుని ఇంద్రియార్థము లనుపగతులందఱుఁ జుట్టుముట్టికొని సారథితోఁగూడ నీరథికునిఁ బట్టి భయంకరమై మృత్యువనుమహాంధకారముచే బంధురమైన పాడునూతిలోఁ ద్రోసివేయుదురు.

వ. వినుము వైదికకర్మంబు ప్రవృత్తంబును నివృత్తంబును నన రెండుదెఱంగు లయ్యె నందుఁ బ్రవృత్తంబునఁ బునరావర్తనంబును నివృత్తంబున మోక్షంబును సిద్ధించుఁ బ్రవృత్తకర్మంబులోన నిష్టాపూర్తంబు లన రెండుమార్గంబులు గల వందు హింసాద్రవ్యమయకామ్యరూపంబు లయిన దర్శ

పూర్ణమాస పశు వైశ్వదేవ బలిహరణ ప్రముఖంబు లైన యాగాదికంబు లిష్టంబులు దేవతాలయ వనకూపతటాక ప్రముఖంబులు పూర్తంబులు ప్రవృత్తకర్మంబున దేహంబు విడిచి దేహాంతరారంభంబున దేహి హృదయాగ్రంబున వెలుంగు వానితోడ నింద్రియంబులుం గూడ భూత సూక్ష్మయుక్తుం డై ధూమదక్షిణాయన కృష్ణపక్షరాత్రి దర్శంబులవలన సోమలోకంబుం జేరి భోగావసానంబున విలీనదేహుం డై వృష్టిద్వారంబునం గ్రమంబున నోషధిలతాన్నశుక్లరూపంబులం బ్రాపించి భూమియందు జన్మించు నిది పునర్భవరూపం బయినపితృమార్గంబు నివృత్తకర్మనిష్ఠుం డయినవాఁడు జ్ఞానదీప్తంబు లయినయింద్రియంబులందుఁ గ్రియాయజ్ఞంబుల యజించి యింద్రియంబుల దర్శనాదిసంకల్పమూలం బయిన మనంబునందు వికారయుక్తం బయినమనంబును వాక్కునందు విద్యావిలక్షణ యయిన వాక్కును వర్ణసముదాయంబునందు వర్ణసముదాయంబును నకారాదిస్వరత్రయాత్మకం బయిన యోంకారంబునందు నోంకారంబును బిందువందు బిందువును నాదంబునందు నాదంబును బ్రాణంబునందుఁ బ్రాణంబును బ్రహ్మమందు నిలువవలయును దేవమార్గం బయినయుత్తరాయణ శుక్ల పక్ష దివా ప్రాహ్ణ పూర్ణిమా రాకలవలన సూర్య ద్వారంబున బ్రహ్మలోకంబునందుఁ జేరి భోగావసానంబున స్థూలోపాధి యైనవిశ్వుం డై సూక్ష్మంబునందు లయించి సూక్ష్మోపాధి యైనతైజసుం డై సూక్ష్మంబును గారణంబు

నందు లయించి కారణోపాధి యైనప్రాజ్ఞుం డై కారణంబును సాక్షిస్వరూపంబునందు లయించి తుర్యుం డై సూక్ష్మలయంబునందు శుద్ధాత్ముం డై యివ్విధంబున ముక్తుం డగును. 467

టీ. వైదికకర్మంబు=వేదోక్తమైన కర్మము, ప్రవృత్తంబు=కర్మమార్గావలంబకమును, నివృత్తంబు=మోక్షమార్గావలంబకమును, అనన్=అనువిధముగా, రెండు, తెఱఁగులు=రకములు, అయ్యెను. అందున్=వానిలో, ప్రవృత్తంబునన్=కర్మమార్గమందు, పునరావర్తనంబును=మరలఁబుట్టుటయు, నివృత్తంబునన్=నివృత్తిమార్గమున, మోక్షంబును=సంసారవిచ్ఛిత్తియు, సిద్ధించున్=ఏర్పడును, ప్రవృత్తకర్మంబులలోనన్=ఆరబ్ధకర్మలలో, ఇష్టాపూర్తంబులు=ఇష్టము పూర్తము, అనన్, రెండుమార్గంబులు=త్రోవలు, హింసా...పంబులు=విశసన రూపము, ద్రవ్యరూపము, కామ్యరూపము, అయిన, దర్శ=అమావాస్య, పూర్ణమాస=పున్నమ, వీనియందు చేయు ఇష్టులు, పశుయాగ=పశు విశసనముతోడి యజ్ఞమును, వైశ్వదేవ=పాకయజ్ఞము, బలిహరణము, ప్రముఖంబులు=మొదలైనవి, యాగాదికంబులు=యజ్ఞము మున్నగునవి, ఇష్టంబులు=ఇష్ట నామముగలవి, దేవతాలయ=దేవాలయములను గట్టించుట, వన=తోఁపులువేయించుట, తటాక=చెఱువు త్రవ్వించుట, ప్రముఖములు=మొదలయినవి, పూర్తమను పేరుగలవి, ప్రవృత్తకర్మంబునన్=ప్రవృత్తిమార్గములో, దేహి=జీవుఁడు, దేహంబు=శరీరము, విడిచి, దేహాంతరారంభంబునన్=ఇతర దేహము దాల్చఁబోవునప్పుడు, హృదయాగ్రంబునన్=దహరాకాశమందు, వెలుంగువానితోడన్=ప్రకాశించువానితోఁగూడ, ఇంద్రియంబులునుకూడ, భూతసూక్ష్మయుక్తుండై=సూక్ష్మభూతములతోఁగూడినవాఁడై, ధూమమార్గంబు=పొగతోడిదారి, అయిన, కృష్ణ...వలనన్=కృష్ణపక్షమందలి చీఁకటి రాత్రి అమావాస్యలవలన, సోమలోకంబు=చంద్రమండలదేశమును, చేరి, భోగావసానంబునన్=పుణ్యపాపము అనుభవిం

చిన పిదప, విలీనదేహుండు=జీవునిలో నిమిడియున్న దేహము గలవాఁడు, వృష్టిద్వారంబునన్=వర్షోదకముగుండ, క్రమంబునన్=వరుసగా, ఓషధి... బులన్=మొట్టమొదట వరి మొదలగు పైరుగా నయి తర్వాత తిఁగగా నయి పిదప నన్నమును పదపడి స్త్రీపురుషుల శుక్లశోణితములరూపమును, ప్రాపించి =పొంది, భూమియందున్=మనుష్యలోకమున, జనించున్=పుట్టును, ఇది, పునర్భవరూపంబు = మరల పుట్టుటయును, పితృమార్గంబు = పితృదేవతల త్రోవ, నివృత్తకర్మనిష్ఠుండు=నివృత్తకర్మయందుండువాఁడు, అయినవాఁడు, జ్ఞానదీప్తంబులు=వివేకముచే భాసురములైనవి, అయిన, ఇంద్రియములందు, క్రియాయజ్ఞంబులన్=కర్మయజ్ఞములచేత, యజించి=యాగము చేసి, దర్శనాది సంకల్పరూపంబు=చూచుట వినుట ఆఘ్రాణించుట మొదలయిన సంకల్పరూప మయినది, అయిన, మనంబునందు, వికారయుక్తము = నానావికారములతోఁగూడిన, మనంబును = చిత్తమును, వాక్కునందును, విద్యావిలక్షణ = చదువుచే సంస్కరింపఁబడినది, వాక్కును, వర్ణసముదాయంబునందున్=అక్షరముల సమూహమునందును, అకా...కము=అకార ఉకారమకారములతోఁ జేరినది, ఓంకారంబునందు, ఓంకారమును, బిందువందున్=అనుస్వారమందు, బిందువును, నాదంబునందున్ = స్వరమందు, నాదంబును, ప్రాణంబునందున్, ప్రాణంబును, వీనినన్నిటిని, బ్రహ్మమందున్=పరమాత్మయందు, నిలుపవలయును = లయింపఁజేయవలయును, దేవమార్గంబు=దేవతలదారి, అయిన, ఉత్తరాయణ, శుక్లపక్ష, దివా=పగలు, ప్రాహ్ణ=దినపూర్వభాగము, పూర్ణిమా=పున్నమ, రాక = సంపూర్ణచంద్రునితోఁగూడిన పున్నమ వీనివలన, సూర్య...అందున్ = సూర్యలోకము బ్రహ్మలోకమందును, చేరి, భోగావసానమునన్=కర్మానుభవ మయినతర్వాత, స్థూలోపాధి = స్థూలకారణుఁడైన, విశ్వుండై = విరామూర్తిపుఁడై, సూక్ష్మంబునందున్=సూక్ష్మాంశములో, లయించి = లీనమయి, తైజసుండై =తేజోరూపముగలవాఁడై, సూక్ష్మంబును = సూక్ష్మపదార్థమును, కారణంబునందు, లయించి=పొందఁజేసి, ప్రాజ్ఞుఁడు=తెలిసినవాఁడు, సాక్షిస్వరూ

షంబునందున్ = కూటస్థనియందు, అయించి = ఇమిడిచి, శుస్యాగ్రై = ఆత్మస్వరూపియై, సూక్ష్మలయంబునందున్ = సూక్ష్మత్వముపోయినవెనుక, శుద్ధాత్ముండై = పరిశుద్ధమైన దేహముగలవాఁడై, ఇవ్విధంబునన్ = ఈలాగున, ముక్తుండు = మోక్షమందినవాఁడు, అగును.

ఆ. అమరనిర్మితంబు లై యొప్పుపితృదేవ
సరణు లెవ్వఁ డెఱుఁగు శాస్త్రదృష్టి
నట్టివాఁడు దేహి యై మోహమున నొందఁ
డతిశయించు బుద్ధి నవనినాథ. 468

టీ. అవనినాథ = భూపతీ! అమరనిర్మితంబులు = దేవతలచేతఁ గల్పించఁబడినవి, ఐ, ఒప్పు = వెలయు, పితృదేవసరణులు = పితృమార్గదేవమార్గములు (ప్రవృత్తినివృత్తులు), శాస్త్రదృష్టిన్ = తత్త్వవిచారముచేత, ఎవ్వఁడు, ఎఱుఁగున్ = తెలియునో, అట్టివాఁడు, దేహియై = శరీరధారియై, మోహమునన్ పొందఁడు = మాయలోఁ జిక్కుపడఁడు, బుద్ధిన్ = తెలివిలో, అతిశయించున్ = మీఱును.

తా. రాజా! ఇట్లు దైవకల్పితములైనయీ ప్రవృత్తినివృత్తిమార్గములనెవఁడు శాస్త్రప్రకారముగాఁ దెలిసికొనునో అలాటిపుణ్యాత్ముఁడు దేహధారియై తృప్తులఁబడక విశేషజ్ఞానవంతుఁడై కృతకృత్యుఁ డగును.

వ. వినుము దేహాదులకుఁ గారణత్వంబున నాదియందును నవధిత్వంబున నంతమందును గలుగుచు బహిరంగంబున భోగ్యంబును నంతరంగంబున భోక్తయుఁ బరంబునఁ బరంబును జ్ఞానంబున జ్ఞేయంబును వచనంబున వాచ్యంబును నప్రకాశమునఁ బ్రకాశంబును నై నవస్తువునకు వేఱొండు లేదు ప్రతి

బింబాదికంబు వస్తుత్వంబునం జేసి వికల్పితం బై తలాపంబను భంగి నైంద్రియకం బైనసర్వంబును నర్థత్వంబున వికల్పితం బయి తోఁచుంగాని పరమార్థంబు గాదు దేహాదికంబులు మిథ్యాత్మకంబులు వానికి హేతువు లయినక్షితిప్రముఖం బులును మిథ్యాత్మకంబు లగుట సిద్ధంబు పరమాత్మకు నవిద్య చేత నెంతదడవు వికల్పంబు దోఁచు నంతదడవును భ్రమం బునుం దోఁచు నవిద్యానివృత్తి యైనసర్వంబును మిథ్య యయి శాస్త్రప్రతిషేధంబులు గలలోఁపల మేలు గన్న తెఱంగగు భావాద్వైత క్రియాద్వైత ద్రవ్యాద్వైతం బులు మూఁడు గల వందుఁ బటతంతున్యాయంబునఁ గార్యకారణంబులందు వస్తు వొక్కటి యై యుండు నని యెఱింగి యేకత్వాలోచనంబు సేసి వికల్పంబు లే దని భా వించుట భావాద్వైతంబు మనోవాక్కాయకృతంబు లైన సర్వకర్మంబులను ఫలభేదంబు సేయక పరబ్రహ్మార్పణంబు సేయుట క్రియాద్వైతంబు పుత్త్రమిత్త్రకళత్త్రాది సర్వప్రా ణులకుం దనకును దేహంబునకుం బంచభూతాత్మకత్వం బున భోక్త యొక్కం డనుపరమార్థత్వంబున నర్థకామంబు లమెడ నైక్యదృష్టిం జేయుట ద్రవ్యాద్వైతంబు నేర్పున నాత్మగతస్వానుభవంబున నద్వైతత్రయంబును విలోకించి వస్తుభేదబుద్ధియుఁ గర్మభేదబుద్ధియు స్వకీయపరకీయబుద్ధియు స్వప్నంబులుగాఁ దలంచి ముని యైనవాఁడు మాన వలయు.

టీ. దేహాదులకున్ = శరీరము మొదలగువానికి, కారణత్వంబునన్ = ఉత్పత్తి కారణమగుటచేత, ఆదియందును = మొదటను, అవధిత్వం

బునన్ = కాలపరిమాణము నిర్ణయించుటచేత, అంతమందును = కొనయందును, కలుగుచున్ = పుట్టుచు, బహిరంగంబునన్ = బాహ్యప్రపంచమందు, భోజ్యంబును = అనుభవింపఁదగిన వస్తువును, అంతరంగంబునన్ = లోపల, భోక్తయున్ = అనుభవించువాఁడును, పరంబునన్ = ఇతరమైనదానియందు, అపరంబును = ఇతరముకానిదియు, జ్ఞానంబునన్ = తెలివియందు, జ్ఞేయంబును = తెలియఁదగినదియు, వచనంబునన్ = మాటయందు, వాచ్యంబును = మాటాడఁదగినదియు, అప్రకాశమునన్ = వెలుఁగులేనిచోట, ప్రకాశంబును = వెలుఁగున్ను, ఐన, వస్తువునకున్ = పరమాత్మకు, వేఱు = భిన్నము, ఒండు = మఱియొకటి, లేదు, ప్రతిబింబాదికంబు = అద్దములో నీడ మొదలైనది, వస్తుత్వమునంజేసి = రూపమునుబట్టి, వికల్పితంబై = భేదముగా భావింపఁబడినదై, తలంపఁబడుభంగిన్ = నమ్మఁబడునట్లు, ఐంద్రియకంబు = ఇంద్రియవికారమైన, సర్వంబును = అంతయును, అర్థత్వంబునన్ = వస్తువులను భావముతో, వికల్పితంబు = భేదముగా భావింపఁబడినది, ఐ, తోఁచున్ కాని = తట్టును గాని, పరమార్థంబు = సత్యమైనది, కాదు, దేహాదికంబులు = దేహము మొదలయినవి, మిథ్యాత్మకంబులు = అబద్ధములైనవి, వానికిన్ = ఆ దేహగేహాదులకు, హేతువులు = కారణములు, అయిన, క్షితిప్రముఖంబులును = భూమి జలము మొదలైనవియు, మిథ్యాత్మకంబులు = అసత్యరూపములైనవి, అగుట, సిద్ధంబు = రూఢియైనది, పరమాత్మకున్, అవిద్యచేతన్ = అజ్ఞానమువలన, ఎంతదడవు = ఎంతసేపు, వికల్పంబు = భేదము, తోఁచునో, అంతదడవును, భ్రమంబును = భ్రాంతియును, తోఁచును, అవిద్యానివృత్తి = అజ్ఞాననాశము, ఐనన్ = కాఁగానే, సర్వంబును = అంతయు, మిథ్య = రిత్త, అయి, శాస్త్ర...బులు = శాస్త్రమందలి ప్రవృత్తినివృత్తిలక్షణమార్గములు, కలలోపలన్ = స్వప్నమందు, మేలు = మంచి, కన్న తెఱంగుఅగున్ = చూచినట్లగును. భావా...బులు = భావాద్వైతము, క్రియాద్వైతము, ద్రవ్యాద్వైతము, నని, మూఁడు, కలవు, అందున్ = వానిలో, పటతంతున్యాయం

బునన్ = గుడ్డలోని దారములవలె, కార్యకారణంబులన్ = కార్యమైన ఘటాదికమందు, కారణమైన మృదాదికమందును, వస్తువు = మృదాదిపదార్థము, ఒక్కటి, ఐ, ఉండును, అని, ఎఱింగి, ఏకత్వాలోచనంబుజేసి=ఒక్కటేయనితలపోసి, వికల్పంబు=భేదము, లేదు, అని, భావించుట=నిశ్చయించుట, భావాద్వైతంబు, మనోవాక్కాయకృతంబులు=మనస్సుచేతను మాటలచేతను శరీరముచేతను చేయఁబడిన, సర్వకర్మంబులను = ఎల్లపనులను, ఫలభేదంబు = ఫలములతారతమ్యము, చేయక, పరబ్రహ్మార్పణంబుచేయుట = పరబ్రహ్మయందు సమర్పించుట, క్రియాద్వైతంబు, పుత్త్రి...లకున్ = కొడుకులు, స్నేహితులు, పెండ్లము మొదలైన యెల్లజీవులకును, తనకును, దేహంబునకున్ = తనశరీరము, పంచభూతాత్మకత్వంబునన్=పృథివ్యాదిపంచభూతస్వరూపుఁడగుటచేత, భోక్త = అనుభవించువాఁడు, ఒక్కండు, అనుపరమార్థతత్త్వంబునన్ = నిజతత్త్వముచేత, అర్థకామములయెడన్ = కోరిక ద్రవ్యము వీనియందు, ఐక్యదృష్టిన్ = ఒక్కటి యనుభావన, చేయుట, ద్రవ్యాద్వైతంబు, నేర్పునన్ = చాతుర్యముతో, ఆత్మతత్త్వానుభవంబునన్=బ్రహ్మతత్త్వము సాక్షాత్కారము చేసికొనుటచేత, అద్వైతత్రయంబును = భావద్రవ్యక్రియాద్వైతములమూఁటిని, వస్తుభేదబుద్ధియున్=పదార్థము పలువెంగులను భావనయు, కర్మభేదబుద్ధియు = పుణ్యపాపకర్మలు వేఱనుభ్రాంతియును, స్వకీయపరకీయబుద్ధియున్=తనది యితరునిది అనుభావనయు, స్వప్నంబులు=కలలు, మిథ్యలు, కాన్, తలంచి=నిశ్చయించి, ముని=ఆత్మతత్త్వానుసంధానము చేయువాఁడు, మానవలయును=ఈభేదబుద్ధిని విడువవలయును.

క. వాదములు వేయు నేటికి
 వేదోక్తవిధిం జరించువిబుధుఁడు గృహమం
 దాదరమున నాకాంక్షణ
 పాదంబులు గొలిచి ముక్తిపదమున కేఁగున్. 470

టీ. వాదములు = తర్కములు, కేయును, ఏటికి = ఏల, గృహమందుఁ = ఇంటిలో, వేదోక్తవిధిఁ = వేదములయందుఁ జెప్పినట్లుగా, చరించు విబుధుఁడు = నడుచుకొను పండితుఁడు, ఆదరమునన్ = గాఢభక్తితోడ, నారాయణపాదములు = విష్ణుపాదములు, కొలిచి = సేవించి, ముక్తిపదమునకున్ = మోక్షస్థానమునకు, ఏఁగున్ = పోవును.

తా. రాజా! వేయితర్కము లెందులకయ్యా? ఏయడవులపాలై పోవ ననినదియు లేదు. జ్ఞానియైనవాఁడు ఫలమును ఈశ్వరార్పణముగాఁ జేయుచు సమస్తవేదోక్తకర్మలను జేయుచునే గృహమందే యుండి భక్తితో శ్రీమన్నారాయణుని కైంకర్యము సలిపి ముక్తి నందవచ్చును

శా. భూపాలోత్తమ మీరు భక్తిగరిమస్ఫూర్తిన్ సరోజేక్షణ
శ్రీపాదాంబుజయుగ్మమున్ నియతులై సేవించి కాదే మహో
గ్రాపత్సంఘములోనఁ జిక్కక సమస్తాశాంతనిర్జేతలై
యేపారంగ మఖంబు సేసితిరి దేవేంద్రప్రభావంబునన్. 471

టీ. భూపాలోత్తమ = రాజులలో మేటివైన యో ధర్మరాజా! మీరు (పాండవులు), భక్తిగరిమస్ఫూర్తిన్ = భక్తిగౌరవము కలిమిచే, సరో...మున్ = శ్రీహరియడుగుఁదామరలజంటను, నియతులు = నియమము గలవారు, ఐ, సేవించి = కొలిచి, కాదే = కాదటయ్యా, మహో...లోనన్ = పెద్దభయంకరమైన పిలుఁగులలోఁ జిక్కక, సమస్తాశాంతనిర్జేతలై = ఎల్లదిక్కులను గెలిచినవారై, దేవేంద్రప్రభావంబునన్ = ఇంద్రుని మహిమతో, ఏపారంగన్ = పెంపుమీఱఁగా, మఖంబు = యజ్ఞము, చేసితిరి.

తా. రాజులకందఱకు రాజవయిన యో ధర్మరాజా! ఇంతవఱకు మీరున్నదమ్ములైదుగురు ఈమహానుభావుఁడైన శ్రీకృష్ణపరమాత్మయొక్క పాదద్వంద్వము గాఢభక్తితో సేవించుటం బట్టియే కదా యిక్కట్టున

కను లోపుగాక లోకములోఁ గలయెల్లరాజులను గెలిచి యింద్రవిభవముతో నింతటిమహాక్రతువును నిర్విఘ్నముగాఁ జేయఁగలిగినారు ! కావున విష్ణుభక్తులగువా రెన్నఁడును వ్యర్థులు గారు.

వ. వినుము పోయినమహాకల్పంబునందు గంధర్వులలోన నుప
బర్హణుం డనుపేర గంధర్వుండ నైననేను సౌందర్యమాధు
ర్యగాంభీర్యాదిగుణంబున సుందరులకుఁ బ్రియుండ నై క్రీడిం
చుచు నొక్కనాఁడు విశ్వసృట్టులైన బ్రహ్మలు దేవసత్త్రమని
యెడియాగంబులోన నారాయణకథలు గానంబు సేయుకొ
ఱకు నప్సరోజనులను గంధర్వులనుం జీరిన. 472

టీ. పోయిన=కడచిన, మహాకల్పంబునందున్, గంధర్వులలోనన్=అశ్వముఖులలో, సౌందర్య...బులన్=సోయగము నేత్రప్రియత్వము రాజసము మొదలగుగుణములచేత, సుందరులకున్=జవ్వనులకు, ప్రియుండన్=ఇష్టమైనవాఁడను, ఐ, క్రీడించుచున్=విహరించుచు, విశ్వసృట్టులు=లోకములనిర్మించువారు, దేవసత్త్రము=ఒకయాగము, అప్సరోజనులు=అప్సరస్త్రీలు, చీరినన్=పిలువనంపఁగా.

ఆ. క్రతువులోని కేను గంధర్వగణముతోఁ
గలిసి పోయి విష్ణుగాథ లచటఁ
గొన్ని పాడి సతులఁ గూడి మోహితుఁడ నై
తలఁగి చనితి నంత ధరణినాథ. 473

టీ. ధరణినాథ=యుధిష్ఠిరభూపాలా ! ఏను, క్రతువులోనికిన్=యజ్ఞములోనికి, గంధర్వగణముతోన్=గంధర్వులసమూహముతో, అచటన్=

ఆదేవసత్త్రమందు, కొన్నివిష్ణుగాథలు=హరికథలు, పాడి, సతులన్ = జవ్వనులను, మోహితుఁడన్ = కామించినవాఁడను, అంతన్ = తర్వాత, తలఁగి చనితిన్=తొలఁగిపోయినాను.

తా. రాజా! అట్లు స్త్రీలతోఁ గలసిపోయి ఆదేవతసత్త్రయాగమందు కొంతసేపు సంగీతముఁ బాడి అంతట స్త్రీలమీఁదిమోహముచే నాజవ్వనులను వెంటవేసికొని అక్కడనుండి లేచిపోయినాను.

క. వారిజగంధులపొత్తున
వారిం గైకొనక తలఁగి వచ్చినబుద్ధిన్
వా రెఱిఁగి శాప మిచ్చిరి
వారింపఁగ రానిరోషవశమున నధిపా. 474

టీ. అధిపా=రాజా! నేను, వారిజగంధులపొత్తునన్ = అచ్చరలకూటమితో, వారిన్ = ఆబ్రహ్మములను, కైకొనక = లక్ష్యపెట్టక, తలఁగి = తొలఁగి, వచ్చినన్, వారు, బుద్ధిన్ = మనస్సున, ఎఱిఁగి, వారింపన్ శక్యముకాని, రానిరోషవశమునన్ = ఆపరాని కోపముచేత, శాపమిచ్చిరి.

తా. రాజా! నే నట్లు యజ్ఞమధ్యమున స్త్రీలతోఁడ నై లేచిపోయిన సంగతి వారు గ్రహించి అత్యంతాగ్రహమున నాకు శాపమిచ్చినారు.

ఆ. పంకజాక్షు నిచటఁ బాడక కామినీ
గణముఁ గూడి చనినకల్మషమున
దగ్ధకాంతి వగుచు ధరణీతలంబున
శూద్రజాతిసతికి సుతుఁడ వగుము. 475

టీ. ఇచటన్ = ఇమ్మహాక్రతువునందు, పంకజాక్షున్ = శ్రీహరిని, పాడక, కామినీగణమున్=కాముకలైన స్త్రీలగుంపును, చనినకల్మషమునన్=

పోయినందువలనైన పాపమువలన, దగ్ధకాంతివి = తఱిగిన వన్నెగలవాఁడవు, అగుచున్, ధరణీతలంబునన్ = భూమిమీఁద, శూద్రజాతిసతికిన్ = శూద్రస్త్రీకి, సుతుఁడవు = బిడ్డవు.

తా. ఇచ్చట క్రతునవమూర్తి యగుదాఁక నారాయణగుణకీర్తనము చేయక మాతోఁ జెప్పకయే స్త్రీలను దగులుకొనిపోయిన పాపముచేత నీవు భూలోకమున నొకశూద్రస్త్రీకడుపునఁ బుట్టుము.

వ. అని యిట్లు విశ్వస్రష్టలు శపించిన నొక్క బ్రాహ్మణదాసికిఁ బుత్రుండ నై జన్మించి యందు బ్రహ్మవాదు లయినపెద్దలకు శుశ్రూష సేసినభాగ్యంబున నిమ్మహాకల్పంబునందు బ్రహ్మపుత్రుండ నై జన్మించితి. 476

టీ. శపించినన్ = తిట్టఁగా, బ్రాహ్మణదాసికిన్ = బ్రాహ్మణులయింటి పనికత్తెకు, పుత్రుండు = కొడుకు, బ్రహ్మవాదులు = వేదపాఠము చేయువారు, శుశ్రూష = సేవ, భాగ్యంబునన్ = మాహాత్మ్యముచేత, బ్రహ్మపుత్రుండన్ = బ్రహ్మమానసిక పుత్రుండను, ఐ, జన్మించితిన్ = పుట్టితిని.

ఆ. కాలమున మోక్షగతికి గృహస్థుఁ డే
ధర్మ మాచరించి తగిలి పోవు
నట్టిధర్మ మెల్ల నతివిశదంబుగాఁ
బలుకఁబడియె నీకు భవ్యచరిత. 477

టీ. భవ్యచరిత = మేలినడవడిగల యోధర్మరాజా! గృహస్థుఁడు = ఇల్లు గట్టి కాఁపురము సేయుచున్నవాఁడు, కాలమునన్ = నేరుపుతో, ఏధర్మము, ఆచరించి = చేసి, మోక్షగతికిన్ = మోక్షమార్గమునకు, తగిలి = చొచ్చి,

పోవునో, [illegible]కు, అట్టిధర్మమెల్లను, అతివిశదంబుగాన్ = మిగులఁ దేటతెల్లముగా, పలుకఁబడియెన్ = చెప్పఁబడెను.

తా. రాజా! గృహస్థుఁడు ఉపాయయుక్తుఁడై దేశకాలములకుఁ దగినట్లు ఏయే స్వధర్మ మాచరించి మోక్షగామి యగునో అట్టిధర్మస్వరూపమంతయు నతివివరముగా నీకుఁ జెప్పితినిగదా?

మ. అఖిలాధారుఁ డజాదిదుర్లభుఁడు బ్రహ్మం బైనవిష్ణుండు నీ
మఖమం దర్చితుఁడై నివాసగతుఁడై మర్త్యాకృతిన్ సేవ్యుఁడై
సఖుఁడై చారకుఁడై మనోదయితుఁడై సంబంధియై మంత్రియై
సుఖదుం డయ్యె భవన్మహామహిమ దాఁ జోద్యంబు ధాత్రీశ్వరా.

టీ. ధాత్రీశ్వరా = భూమిపతీ! అఖిలాధారుఁడు = ఎల్లప్రపంచమునకుఁ బట్టైనవాఁడు, అజాదిదుర్లభుఁడు = బ్రహ్మాదులకు నందరానివాఁడు, బ్రహ్మంబు = పరమాత్మ, ఐన, విష్ణుండు, నీమఖమందు = నీయజ్ఞమందు, అర్చితుఁడై = ముందుపూజింపఁబడినవాఁడై, మర్త్యాకృతిన్ = మానవరూపముతో, నివాసగతుఁడై = నీయింటనున్నవాఁడై, సేవ్యుఁడై = కొలువఁదగినవాఁడై, సఖుఁడై = మిత్రుఁడై, చారకుఁడై = అన్నిపనులయందును నీబంటై (వేగరియై), మనోదయితుఁడై = చిత్తప్రియుఁడై, సంబంధియై = చుట్టమయి, మంత్రియై = సర్వకార్యములందును మంత్రియై, సుఖదుండు = ఇహపరసుఖము లొసఁగువాఁడుగా, అయ్యెను. భవన్మహామహిమ = నీగొప్పప్రభావము, తాన్ = అది, చోద్యంబు = అద్భుతము.

తా. రాజా! ఎల్లజగములకు ని[illegible]నవాఁడు, బ్రహ్మాదిదేవతలకు సయితము గోచరముకానివాఁడు, పరాత్పరుఁడైన శ్రీకృష్ణపరమాత్మ నీయింటవచ్చి నిలచి నీచే నీయజ్ఞమున నగ్రపూజఁగొని లీలామానుషవిగ్రహుఁడై నీచేతఁ గొలిపించుకొనుచు నీకుస్నేహితుఁడై అన్నిపనులలో బంటువలె నుండి చిత్త

మునకు వచ్చినవాఁడై యిష్టబంధువుఁడై సర్వకార్యములలోఁ గుశలతి గలమం త్రియై యిహపరముల నిచ్చుచున్నాఁడు నీపుణ్యమేమయ్యా!

వ. అని యిట్లు నారదుండు చెప్పినవృత్తాంతం బంతయు విని ధర్మనందనుండు ప్రేమవిహ్వలుం డై వాసుదేవునిం బూజించె వాసుదేవధర్మనందనులచేతఁ బూజితుం డై నారదముని యు దేవమార్గంబునం జనియె నని శుకయోగీంద్రుండు పాండవపౌత్త్రునకుం జెప్పె నని సూతుండు శౌనకాదులకుం జెప్పిన. 479

టీ. వృత్తాంతము = కథ, ప్రేమవిహ్వలుండై = అనురాగముచే మైమఱచినవాఁడై, వాసు...చేతన్ = శ్రీకృష్ణునిచేతను ధర్మరాజుచేతఁగూడ, పూజితుండై = సత్కరింపంబడినవాఁడై, దేవమార్గంబునన్ = ఆకాశవీథిని, చనియెన్ = పోయెను. పాండవపౌత్త్రునకున్ = పాండుకుమారులమనుమఁడగు పరీక్షిన్మహారాజునకు.

క. రాజీవసదృశలోచన
రాజీవభవాది దేవరాజివినుత వి
భ్రాజితకీర్తిలతావృత
రాజీవభవాండభాండ రఘుకులతిలకా. 480

టీ. రాజీవసదృశలోచన = తామరలవంటి కన్నులు గలవాఁడా! రాజీ...నుత = బ్రహ్మమొదలగు దేవతలబారుచేఁ బొగడఁబడినవాఁడా!, విభ్రా...భాండ = మెఱయుచున్నకీర్తి యనుతీఁగచే నల్లఁబడిన బ్రహ్మాండకటాహము (గంగాళము) గలవాఁడా! రఘుకులతిలకా = రఘుమహారాజు వంశమునకు వన్నెదెచ్చిన యో శ్రీరామచంద్ర చక్రవర్తి!

మాలిని. ధరణిదుహితృరంతా ధర్మమార్గానుగంతా
నిరుపమనయకాంతా నిర్జరారాతిహంతా
గురుబుధసుఖకర్తా కుంభినీచక్రభర్తా
సురభయపరిహర్తా సూరిచేతోవిహర్తా. 481

టీ. ధరణిదుహితృరంతా = పుడమికూఁతురగు సీతతోఁ గ్రీడించువాఁడా! ధర్మమార్గానుగంతా = న్యాయమార్గము ననుసరించువాఁడా! నిరుపమనయకాంతా = సాటిలేని నీతిచే నందమయినవాఁడా! నిర్జరారాతిహంతా = దేవతలశత్రువు లగురాక్షసులను జంపినవాఁడా! గురుబుధసుఖకర్తా = గురువులకు పండితసాధువులకు మేలుచేయువాఁడా! కుంభినీచక్రభర్తా = భూమండలమునకు నాథుఁడా! సురభయపరిహర్తా = దేవతలభయమును బాఁదోలినవాఁడా! సూరిచేతోవిహర్తా = జ్ఞానుల చిత్తములలోఁ గ్రీడించునో శ్రీరామచంద్రమహారాజా! దయమీఱఁ జిత్తగించుము.

శ్రీః శ్రీః శ్రీః.

చెన్నపురి : 'వావిళ్ళ' ప్రెస్సున ముద్రితము.—1921.



0883 - 246 2565
903 246 2565

మోహన్ పబ్లికేషన్స్

అజంతా హోటల్ ఎదుట, కోటగుమ్మం, రాజమహేంద్రవరం - 533101.

WWW.MOHANPUBLICATIONS.COM

మావద్ద లభించు గ్రంథములు

1. వ్రతకథలు - పూజలు

1.	శ్రీ వినాయక వ్రతం	వెల రూ.10-00
2.	శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం	30-00
3.	శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో)	10-00
4.	సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం	30-00
5.	వరలక్ష్మీ వ్రతం	10-00
6.	కేదారేశ్వర వ్రతం	10-00
7.	త్రినాధ వ్రతం(కలర్)	10-00
8.	త్రినాధవ్రతం(సాదా)	5-00
9.	క్షీరాబ్ధి వ్రతం	12-00
10.	మంగళ గౌరీవ్రతం	10-00
11.	వైభవలక్ష్మీ వ్రతం ఫోటో యంత్రంతో	25-00
12.	శ్రీలక్ష్మీ కుబేర వ్రతం (ఫోటో యంత్రంతో)	25-00
13.	కనకమహాలక్ష్మీ వ్రతం (కామేశ్వరీపాటతో)	25-00
14.	సంతోషీమాతా వ్రతం	25-00
15.	ఏడు శనివారాల వ్రతం	25-00
16.	సత్యనారాయణవ్రతం	25-00
17.	శ్రీ సువర్చలాహనుమద్దీక్ష	30-00
18.	శివదీక్ష	10-00
19.	కాత్యాయనీ వ్రతం	20-00
20.	సౌభాగ్య గౌరీవ్రతం	20-00
21.	తిరుప్పావై (ధనుర్మాసవ్రతం)	36-00
22.	స్త్రీల వ్రతకథలు	36-00
23.	స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి (నేదునూరిగంగాధరరావుగారి)	54-00
24.	పెళ్ళి పాటలు - స్త్రీలపాటలు (కామేశ్వరిపాటతో)	36-00
25.	సర్వదేవతా పూజావిధానం	25-00
26.	ఆరువ్రతాలు	30-00
27.	రాహుకాలంలోదుర్గాదేవీపూజా	10-00

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

28.	తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు	10-00
29.	శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్	36-00
30.	శ్రీచక్ర పూజావిధానం(పెద్దది)	36-00
31.	లక్ష్మీ - గౌరీ నిత్యపూజ	10-00
32.	శ్రీ సరస్వతీ నిత్యపూజ	10-00
33.	శ్రీ దుర్గానిత్యపూజ	10-00
34.	కాలభైరవ నిత్యపూజ	10-00
35.	శివపూజ	10-00
36.	వీరభద్ర పూజ	10-00
37.	ఆంజనేయ నిత్యపూజ	10-00
38.	నాగేంద్ర స్వామి పూజ	10-00
39.	సుబ్రహ్మణ్య నిత్యపూజ	10-00
40.	రామదేవుని కథ	10-00
41.	శివదేవుని కథ	10-00
42.	లక్ష్మీనరసింహపూజ	10-00
43.	వేంకటేశ్వరపూజ	10-00
44.	బ్రహ్మంగారి నిత్యపూజ	10-00
45.	సూర్య నిత్యపూజ	10-00
46.	నవగ్రహ నిత్యపూజ	10-00
47.	రుక్మిణీ కల్యాణం	25-00
48.	ఉమామహేశ్వర వ్రతం	36-00
49.	శ్రీ కామేశ్వరీ వ్రతం	36-00
50.	16 సోమవారముల వ్రతము	25-00
51.	పార్వతీకల్యాణం	25-00
52.	సహస్రకమలవర్తి వ్రతము	25-00
53.	పంచముఖ ఆంజనేయ పూజావిధానము	36-00
54.	అష్టనాగపూజ	36-00
55.	పూజలు ఎందుకుచేయాలి ?	36-00
56.	ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి?	36-00
57.	ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి?	36-00
58.	ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి?	36-00
59.	ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ?	36-00
60.	హనుమద్ వ్రతం	36-00
61.	పంచాయతన పూజ	63-00
62.	28 వ్రతములు	120-00

63.	కలశపూజలు (9ఒకేసారి)	150-00
64.	కలశపూజలు (విడివిడిగా) (ప్రింటులో)	....
65.	హ్రీంకార మహాయజ్ఞం (ప్రింటులో)	....
66.	గోమాత	40-00

2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

1.	శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం	45-00
2.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,,	50-00
3.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,,	50-00
4.	స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్)	99-00
5.	లలితావిష్ణు (కేస్ బైండ్) 1/8 డెమ్మి	63-00
6.	స్థూలాక్షరీ లలితావిష్ణు (క్రౌన్‌సైజు)కేస్‌బైండ్	108-00
7.	సర్వదేవతా స్తోత్రమంజరి	120-00
8.	సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63)	24-00
9.	విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్)	25-00
10.	లలితా సహస్రనామ స్తోత్రమ్ (క్రౌన్)	36-00
11.	లలితా సహస్రనామములు	24-00
12.	లక్ష్మీ సహస్రనామములు	24-00
13.	దుర్గా సహస్రనామములు	24-00
14.	ఆంజనేయ సహస్రనామములు	24-00
15.	శివ సహస్రనామములు	24-00
16.	విష్ణు సహస్రనామములు	24-00
17.	గణపతి సహస్రనామములు	24-00
18.	సుబ్రహ్మణ్య సహస్రనామములు	24-00
19.	గాయత్రి సహస్రనామములు	24-00
20.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు	24-00
21.	శ్రీరామా సహస్రనామములు	24-00
22.	సరస్వతి సహస్రనామములు	24-00
23.	సూర్యసహస్రనామములు & ఆదిత్యహృదయం	24-00
24.	శ్రీవేంకటేశ్వరసహస్రనామములు	24-00
25.	మణిద్వీపవర్ణన (పెద్దది)	24-00
26.	సంధ్యావందనం	24-00
27.	మంత్రపుష్పమ్	....
28.	త్రిభాషా హనుమాన్‌చాలీసా	15-00
29.	హనుమాన్ చాలీసా	10-00

30.	మణిద్వీపవర్ణన (పాకెట్)	10-00
31.	ఆరు చాలీసాలు	10-00
32.	శివారాధన (శివస్తోత్రాలు)	10-00
33.	వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్)	10-00
34.	ఆరుదండకాలు	5-00
35.	వేంకటేశ్వర గోవిందనామములు	5-00
36.	అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్	10-00
37.	దేవీఖడ్గమాలాస్తోత్రమ్ (మహిషాసురమర్దనీస్తోత్రంతో)	10-00
38.	సుందరకాండ (పాకెట్)	10-00
39.	భగవద్గీత మూలం	27-00
40.	రామరక్షాస్తోత్రమ్	15-00
41.	స్తోత్ర రత్నావళి	36-00
42.	పురాణపండ లలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
43.	పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
44.	పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్	10-00
45.	పురాణపండ ఆదిత్య హృదయం	10-00
46.	మంత్రపుష్పం (మినీ)	10-00
47.	శివానందలహరి-సౌందర్యలహరి	36-00
48.	కుజదోషం	10-00
49.	కాలసర్ప దోషం	10-00
50.	మీ అప్పులు తీరాలా?	10-00
51.	దృష్టిదోషాలు నివారణ	10-00
52.	పంచసూక్తములు	10-00
53.	సంధ్యావందనం	10-00
54.	రుద్రనమకమ్-చమకమ్	10-00
55.	గాయత్రీమంత్రాలు	10-00
56.	హయగ్రీవ స్తోత్రమాల	10-00
57.	దక్షిణామూర్తి స్తోత్రమాల	10-00
58.	ద్వాదశ జ్యోతిర్లింగాలు - పంచారామాలతో	10-00
59.	శ్రీసూక్తం పురుష సూక్తం	10-00
60.	నవగ్రహస్తోత్రమాల	36-00
61.	మహాన్యాసమ్	36-00
62.	సుందరకాండ గానామృతం	36-00
63.	గోమాతపూజావిధానము	10-00
64.	ఆనందసిద్ధి - 1 శ్రీదేవీ స్తోత్రమాల	108-00

65.	ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు ఏ స్తోత్రమ్ పారాయణచేయాలి	108-00
66.	ఆనందసిద్ధి-3 మానసదేవీ స్తోత్రమాల	108-00
67.	శ్రీ కాలభైరవ రక్షా కవచమ్	63-00
68.	అర్చన	40-00
69.	నిత్యదేవతార్చన	40-00
70.	సర్వదేవతా స్తోత్ర నిధి	99-00
71.	శ్రీచక్ర నవవరణార్చన	63-00
72.	చండీ సప్తశతి పారాయణ క్రమం	99-00
73.	శ్రీదేవి స్తోత్ర రత్నావళి 32 దేవి స్తోత్రాలకు తాత్పర్యంతో	99-00
74.	వనదుర్గా మంత్రానుష్ఠాన క్రమమ్	63-00
75.	శ్రీ కాలభైరవ వ్రతము	63-00

3. శ్రీ సాయి దత్త గ్రంథములు

1.	శ్రీ సాయిబాబా సచ్చరిత్ర	120-00
2.	సంపూర్ణ శ్రీ గురు చరిత్ర	120-00
3.	శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం	120-00
4.	శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్)	63-00
5.	శ్రీ గురుచరిత్ర (క్రౌన్)	63-00
6.	నవనాధ చరిత్ర	99-00
7.	శ్రీసాయిచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
8.	శ్రీగురుచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
9.	సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,సహస్రంతో	30-00
10.	అనఘాదేవీ వ్రతం	30-00
11.	భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు	30-00
12.	శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో)	25-00
13.	శ్రీ సాయిభజనమాల	20-00
14.	శ్రీ సాయి భజన్స్	20-00
15.	శ్రీ సాయిభక్తి గీతాలు	20-00
16.	శిరిడిహారతులు (భావంతో)	20-00
17.	"శ్రీసాయి"కోటి	27-00
18.	"శ్రీసాయిరామ్"కోటి	20-00
19.	శ్రీ సాయినాథ స్తోత్రమంజరి	10-00
20.	శ్రీ సాయివేయినామాలు	8-00
21.	శ్రీ సాయి హారతులు (పాకెట్)	15-00
22.	శ్రీ సాయి స్తవనమంజరి	10-00
23.	హిందీ శ్రీ సాయి హారతులు	15-00

24.	శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం	63-00
25.	ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు	15-00
26.	షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం	99-00
27.	సాయిసత్యవ్రతం	30-00
28.	సాయి అనుగ్రహమ్	120-00
29.	నవగురువారాల వ్రతకల్పము	15-00
30.	శ్రీదత్తలీలామృతము	99-00
31.	హృదయంలో సాయి	15-00
32.	శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్ఛరిత్ర)	120-00
33.	గజాననమహరాజ్ చరిత్ర	99-00

4. జ్యోతిషాలు

1.	'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ)	72-00
2.	గ్రహభూమి పంచాంగము (గార్గేయ)	108.00
3.	ఆనందసిద్ధి పంచాంగం (వై.వి.శాస్త్రి)	63.00
4.	ములుగు వారి రాశిఫలితాలు (12రాశులువారికి)	50.00
5.	ములుగు వారి రాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి	12.00
6.	కాలచక్రంజ్యోతిషక్యాలండర్	25.00
7.	గ్రహబలం క్యాలండర్ (శ్రీనివాసగార్గేయ-భక్తిటివి)	25.00
8.	శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్	25.00
9.	సాదా క్యాలండర్	5.00
10.	పాకెట్ క్యాలండర్	15.00
11.	తాజకనీలకంఠీయమ్	100-00
12.	కేరళ జ్యోతిష రహస్యాలు	180-00
13.	జ్యోతిష బ్రహ్మ రహస్యాలు	180-00
14.	మానసాగరి జాతకపద్ధతి	180-00
15.	వరాహమిహిర జాతకపద్ధతి	180-00
16.	వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు	99-00
17.	సింపుల్ రెమిడీస్	180-00
18.	శంభు హోరప్రకాశిక	250-00
19.	పూర్వ పరాశరి	100-00
20.	పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం	200-00
21.	ప్రశ్న సింధు	99-00
22.	నక్షత్ర విశేష ఫలితాలు	63-00
23.	సూర్యసిద్ధాంతపంచాంగగణితంచేయడంఎలా?	180-00
24.	దృక్సిద్ధాంతపంచాంగగణితం చేయడంఎలా?	180-00

25.	ఆయుర్దాయ నిర్ణయం	63-00
26.	జాతక గణిత ప్రవేశిక	63-00
27.	జ్యోతిషమర్మబోధిని	63-00
28.	జ్యోతిష ప్రశ్నోత్తరమాల	63-00
29.	ముహూర్తం నిర్ణయించడంఎలా?	63-00
30.	జాతక మకరందం	63-00
31.	జ్యోతిష సరస్వతి	63-00
32.	మీజననకాల విశేషాలు	63-00
33.	ముహూర్త విజ్ఞాన భాస్కరం	63-00
34.	జ్యోతిష స్వయంబోధిని	63-00
35.	శుభముహూర్త శిరోమణి	63-00
36.	నక్షత్ర ఫలమంజరి	36-00
37.	పంచాంగం చూసే విధానం	36-00
38.	సర్వార్థ జ్యోతిషం	36-00
39.	ప్రాథమిక జ్యోతిషం	36-00
40.	నవరత్నములు శుభయోగములు	36-00
41.	శుభశకునాలు	30-00
42.	హస్తరేఖాఫలితాలు	36-00
43.	సంఖ్యల్లో భవిష్యత్	36-00
44.	ముహూర్త దీపిక	99-00
45.	పుట్టుమచ్చలు ఫలితాలు	30-00
46.	కలలు ఫలితాలు	30-00
47.	జాతక చక్రం వేయడం ఎలా?	36-00
48.	మానసాగరి (ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు	250-00
49.	జ్యోతిషశాస్త్ర చిట్కాలు	120-00
50.	గుప్తా శతాబ్ది పంచాంగం (1940-2050)	999-00
51.	ప్రశ్నచండేశ్వరమ్	63-00
52.	ద్వాదశభావ ఫలచంద్రిక	250-00
53.	జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు)	120-00
54.	అంగసాముద్రికం	36-00
55.	హస్త సాముద్రికం	63-00
56.	లాల్ కితాబ్	99-00
57.	శకునశాస్త్రం	63-00
58.	ఆధునికప్రశ్నశాస్త్రం	120-00
59.	పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం	180-00

60.	అష్టకవర్గు (కొండపల్లి)	63-00
61.	బృహత్‌జాతకం (ప్రాచీనప్రతికిపునర్ముద్రణ)	250-00
62.	లగ్నరత్నాకరం	63-00
63.	షట్పంచాశిక	120-00
64.	40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి	270-00
65.	40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి	180-00
66.	40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం	180-00
67.	40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు	270-00
68.	40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి	250-00
69.	మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు (సాయిగణపతిరెడ్డి)	270-00
70.	కె.పి.జ్యోతిషం (పరిచయం)	63-00
71.	ముహూర్తచింతామణి	99-00
72.	సూర్యచంద్ర గ్రహణములు	63-00
73.	ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప)	180-00
74.	అదృష్టరెమెడీస్	144-00
75.	గ్రహసంచార ఫలనిర్ణయదీపిక	63-00
76.	జ్యోతిష రెమిడీస్	300-00
77.	జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
78.	జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
79.	నాడీజ్యోతిషం	63-00
80.	నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
81.	లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
82.	గౌతమసంహిత	63-00
83.	హోరరత్నమాల	63-00
84.	జాతకఫల మణిమంజరి	200-00
85.	పుష్కర పంచాంగం (2013-14నుండి 2024-25)	560-00
86.	దశాభుక్తిఫల నిర్ణయం	250-00
87.	వింత జోష్యములు	63-00
88.	షోడశవర్గులు	200-00
89.	రవిగ్రహ సమస్త ప్రభావములు	99-00
90.	చంద్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00
91.	కుజ గ్రహ సమస్త ప్రభావములు	99-00
92.	బుధ గ్రహ సమస్త ప్రభావములు	99-00
93.	గురు గ్రహ సమస్త ప్రభావములు	99-00
94.	శుక్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00

95. శని గ్రహ సమస్త ప్రభావములు	99-00
96. రాహు & కేతు గ్రహముల సమస్త ప్రభావములు	99-00
97. ఆధునిక గ్రహములు-ఉపగ్రహములు సమస్త ప్రభావములు	99-00
98. ముహూర్తమార్తాండం	63-00
99. లఘుజాతకం	63-00
100. జాతకాలంకారము	63-00
101. మేషలగ్న ఫలితములు	99-00
102. వృషభ లగ్న ఫలితములు	99-00
103. మిధున లగ్న ఫలితములు	99-00
104. కర్కాటక లగ్న ఫలితములు	99-00
105. సింహలగ్న ఫలితములు	99-00
106. కన్యలగ్న ఫలితములు	99-00
107. తుల లగ్న ఫలితములు	99-00
108. వృశ్చిక లగ్న ఫలితములు	99-00
109. ధనుస్సు లగ్న ఫలితములు	99-00
110. మకర లగ్న ఫలితములు	99-00
111. కుంభ లగ్న ఫలితములు	99-00
112. మీన లగ్న ఫలితములు	99-00
113. నారద సంహిత	200-00
114. పంచాంగపీఠికలేఖికాగణితం	250-00
115. తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప)	99-00
116. సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా)	200-00
117. రాహు కేతువుల యోగము	99-00
118. ఛాయాగ్రహములు	99-00
119. జ్యోతిషవిజ్ఞాన దీపిక	63-00

బి.వి.రామన్ గారి గ్రంథములు

120. జ్యోతిష విద్యారంభం	50-00
121 గ్రహభావ బలములు	50-00
122. కాలచక్రదశ	50-00
123. అనుభవ ప్రశ్నాజ్యోతిషం	50-00
124. జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు	50-00
125. పురోగామి జాతకం	50-00
126. భావార్ధరత్నాకరం	75-00
127. భారతీయజ్యోతిష సర్వస్వం	75-00
128. అష్టకవర్గ పద్ధతిః	75-00

129. జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు	75-00
130. ప్రశ్నతంత్ర	75-00
131. ముహూర్తం	75-00
132. విశిష్ట జాతకములు	125-00
133. భారతీయఫలితజ్యోతిషం	125-00
134. 300 ముఖ్యమైన యోగములు	125-00
135. జాతకంపరిశీలించడంఎలా ?	300-00

రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి
శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు

136. బృహత్పరాశరహోరాశాస్త్రము-1	200-00
137. బృహత్పరాశరహోరాశాస్త్రము-2	200-00
138. బృహత్పరాశరహోరాశాస్త్రము-3	200-00
139. బృహత్పరాశరహోరాశాస్త్రము-4	200-00
140. భావార్థరత్నాకరము	100-00
141. ముహూర్త చింతామణి	100-00
142. ముహుర్త చింతామణి-పార్టు2	200-00
143. స్వప్న శాస్త్రము	36-00
144. శతయోగమంజరి	50-00
145. వ్రతనిర్ణయకల్పవల్లి	250-00
146. దైవజ్ఞవల్లభం	75-00
147. వసంతరాజశకునమ్ (బృహత్శకునశాస్త్రం)	250-00
148. వాస్తుశాస్త్రవివేకము-1	100-00
149. వాస్తుశాస్త్రవివేకము-2	200-00
150. వాస్తుశాస్త్రవివేకము-3	100-00
151. వాస్తుశాస్త్రవివేకము-4	200-00
152. అనుభవసులభవాస్తు - 1	50-00
153. అనుభవసులభవాస్తు - 2	100-00
154. పంచాంగ వివేకము	99-00
155. వశిష్ఠ సంహిత	360-00
156. పంచపక్షి శాస్త్రం (కేస్‌బైండ్)	200-00

5. వాస్తులు

1. 40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి	180-00
2. వాస్తుశాస్త్ర రహస్యములు	200-00
3. వాస్తునుబట్టి మీ ఇల్లు	63-00
4. మీరూ మీ వాస్తు	63-00

5.	గృహవాస్తు చిట్కాలు	63-00
6.	వాస్తు పూజ	63-00
7.	వాస్తు సూత్రములు	63-00
8.	వాస్తుశాస్త్ర రహస్యాలు	63-00
9.	గృహవాస్తు వర్గులు	99-00
10.	విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు	63-00
11.	విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్లఆయములు	99-00
12.	విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాలగురుమూర్తిగుప్తా)	180-00
13.	ఆధునిక గృహవాస్తు	99-00
14.	శుభవాస్తు	270-00
15.	వాస్తుయంత్ర రత్నావళి	120-00
16.	వాస్తుశాస్త్రం	120-00
17.	హౌస్ ప్లాన్స్	63-00
18.	గృహనిర్మాణ వాస్తు	63-00
19.	వాస్తు రెమెడీస్	63-00
20.	గృహవాస్తు దర్పణం	63-00
21.	జ్యోతిష-గృహవాస్తుచంద్రిక	200-00
22.	వాస్తురత్నాకరం (కొండపల్లి)	63-00
23.	వాస్తుశిరోమణి ,,	120-00
24.	వాస్తుసంగ్రహమ్ ,,	63-00
25.	పంచవాస్తు పారిజాతం ,,	120-00
26.	వాస్తుడిండిమమ్ ,,	63-00
27.	వాస్తుదుందిభి ,,	120-00
28.	విశ్వకర్మవాస్తుప్రకాశిక (కేస్‌బైండ్)	250-00
29.	కృష్ణవాస్తుశాస్త్రము	63-00
30.	జలవాస్తు,శల్యవాస్తు (దంతూరిపండరీనాథ్)	99-00
31.	మయవాస్తు (గోరసవీరభద్రాచార్య)	120-00
32.	వాస్తు జ్యోతి	63-00
33.	మన ఇల్లు-మనవాస్తు	99-00
34.	వాస్తవ వాస్తుపూజావిధానము	108-00
35.	వాస్తు దర్పణం	120-00

6. మంత్రశాస్త్రాలు

1.	మంత్రసాధన	63-00
2.	తంత్రజాలం	63-00
3.	మంత్రశక్తి	63-00

4.	దత్తాత్రేయ తంత్రవిద్య	63-00
5.	దత్తాత్రేయ మూలికాతంత్రమ్	63-00
6.	తాంత్రిక పంచాంగం	63-00
7.	యక్షిణీ తంత్రం	63-00
8.	మంత్రానుష్ఠాన చంద్రిక	63-00
9.	సర్వదేవతా మంత్రకవచములు	63-00
10.	మంత్రాక్షరాలరహస్యం (బీజాక్షరనిఘంటువు)	63-00
11.	సర్వదేవతా మంత్రరత్నావళి	63-00
12.	సదాచార దీపిక	63-00
13.	యోగినీ-వామకేశ్వరతంత్రం	63-00
14.	ప్రపంచసారతంత్రం	63-00
15.	బదనిక తంత్రమ్	63-00
16.	ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్	63-00
17.	గుప్త సాధన తంత్రం	63-00
18.	గంధర్వ తంత్రమ్	63-00
19.	సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి)	63-00
20.	యంత్ర మంత్ర తంత్ర	63-00
21.	పాశుపత తంత్రం	99-00
22.	పంచదశ మహాఖడ్గ తంత్రం	99-00
23.	రుద్రాష్టాధ్యాయః	99-00
24.	మంత్రసిద్ధి	120-00
25.	పరశురామతంత్రమ్	108-00
26.	శ్రీలలితావిలోమ పంచదశీ	108-00
27.	శ్రీ గురు తంత్రం	108-00
28.	గాయత్రీ తంత్రమ్	108-00
29.	మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు	150-00
30.	శ్రీ దుర్గ తంత్రమ్	200-00
31.	మహామృత్యుంజయఅమృతపాశుపతమ్	200-00
32.	సర్ప (నాగ)తంత్రం	250-00
33.	హవన తంత్రం	250-00
34.	షోడశనిత్యతంత్రం	250-00
35.	శాక్తేయతంత్రం	250-00
36.	రుద్రయామళతంత్రం	250-00
37.	లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్	250-00
38.	హిరణ్యశూలినీ తంత్రమ్	250-00

39.	మాయాప్రత్యంగిరా తంత్రమ్	250-00
40.	శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్	250-00
41.	స్వర్ణాకర్షణభైరవతంత్రం	250-00
42.	కాశీవిశాలాక్షి తంత్రం	250-00
43.	శాంతితంత్రమ్	250-00
44.	యంత్రసిద్ధి	360-00
45.	శ్రీ లక్ష్మీతంత్రమ్	360-00
46.	మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్)	360-00
47.	మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్)	360-00
48.	మంత్రశాస్త్రం (గ్రంథము)	360-00
49.	ప్రత్యంగిరాకృత్యాతంత్రం	360-00
50.	కామధేనువు తంత్రం	360-00
51.	శూలినీదుర్గాతంత్రం	360-00
52.	శ్రీవిద్య రహస్యం	290-00
53.	కులార్ణవ తంత్రమ్	150-00
54.	ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం (ఒరిజనల్)	390-00
55.	సిద్ధమూలిక రహస్యం (మంత్ర,యంత్రసహితం)	63-00

7. గ్రంథాలు - ఆరాధనలు

1.	భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం	54-00
2.	భగవద్గీత (వచనం)	99-00
3.	భగవద్గీత శ్లోకతాత్పర్యం-కేసుబైండింగ్	72-00
2.	గణేశ ఆరాధన 1	99-00
3.	గణేశోపాసన 2	99-00
4.	నవగ్రహవైభవం	99-00
5.	నవగ్రహ రెమెడీస్	99-00
6.	నవగ్రహ వేదం	99-00
7.	శనిగ్రహారాధన	99-00
8.	ఆదిత్యారాధన	99-00
9.	సుబ్రహ్మణ్యారాధన	99-00
10.	శ్రీ శివ ఆరాధన	99-00
11.	లక్ష్మీ ఆరాధన	99-00
12.	హనుమదారాధన	99-00
13.	లలితారాధన	99-00
14.	శ్రీ చక్రారాధన	99-00
15.	గాయత్రీ ఆరాధన	99-00

16.	వీరభద్రారాధన	99-00
17.	కుజగ్రహారాధన	99-00
18.	భైరవారాధన	99-00
19.	దైవారాధన	99-00
20.	గీతారాధన (భగవద్గీత శ్లోకతాత్పర్యసహిత)	99-00
21.	శ్రీవేంకటేశ్వరాధన	99-00
22.	హయగ్రీవారాధన	99-00
23.	లక్ష్మీనరసింహారాధన	99-00
24.	శ్రీ బాలాత్రిపురసుందరీ స్తోత్ర కదంబం	99-00
25.	దేవీ లీలామృతం	99-00
26.	పురాణపండ సుందరకాండ వచనం	99-00
27.	పురాణపండ రామాయణం	99-00
28.	పురాణపండ భారతం	99-00
29.	పురాణపండ భాగవతం	99-00
30.	(సూరి) వాల్మీకి రామాయణం	99-00
31.	కాలసర్ప యోగం	99-00
32.	నిత్య జీవితములో రుద్రాక్షలు	99-00
33.	నిత్య జీవితములో నవరత్నాలు	99-00
34.	వేదసూక్తములు	99-00
35.	వేమన పద్యసారామృతం	99-00
36.	పండగలు పర్వదినాలు	99-00
37.	సూక్తిరత్నాలు	99-00
38.	హనుమచ్చరిత్ర	99-00
39.	నవగ్రహ దర్శనమ్	99-00
40.	నిత్యజీవితంలో నవగ్రహాలు	99-00
41.	సాలగ్రామములు	99-00
42.	గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ	99-00
43.	శనిగ్రహరెమిడీస్	99-00
44.	జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని	99-00
45.	వివాహజ్యోతిషమంజరి-మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి)	99-00
46.	మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,,	99-00
47.	మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ ,,	99-00
48.	న్యూమరాలజీ రెమిడీస్	99-00
49.	మూకపంచశతీ	99-00
50.	శ్రీరామకర్ణామృతం	99-00

51.	రహస్యకుక్కుటశాస్త్రం	300-00
52.	ఉపాసన విధానం	99-00
53.	పంచమవేదం మహాభారతం	99-00
54.	దేవుళ్ళు డాట్ కామ్	99-00
55.	గణపతిభాష్యం	99-00
56.	యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి	99-00
57.	నవయోగులు	99-00
58.	ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు	99-00
59.	సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)-(180అష్టోత్తరశతనామావళులతో)	99-00
60.	సకలదేవతా అష్టోత్తరశతనామావళులు (కేస్‌బైండింగ్)	216-00
61.	సకలదేవతా సహస్రనామములు	99-00
62.	ఆధ్యాత్మిక సూక్తి నిధి	99-00
63.	బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు	99-00
64.	సర్వదేవతాస్వరూపుడు శ్రీ వేంకటేశ్వరుడు	99-00
65.	శ్రీ లక్ష్మీసన్నిధి	99-00
66.	శ్రీలక్ష్మీగణపతి హోమకల్పం	99-00
67.	మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి)	99-00
68.	మ్యాజిక్‌గైడ్	99-00
69.	చదరంగం	99-00
70.	పంచముఖ హనుమత్ వైభవం	63-00
71.	గరుడపురాణం	40-00
72.	మాఘపురాణం	36-00
73.	శివపురాణం	36-00
74.	వైశాఖపురాణం	36-00
75.	కార్తీక పురాణం	36-00
76.	కార్తీక పురాణం (చిన్నది)	25-00
77.	సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ	63-00
78.	పెద్దబాలశిక్ష	50-00
79.	గాయత్రీ మహిమ	36-00
80.	వృక్షదేవతలు	63-00
81.	యాజుష స్మార్త సంస్కార చంద్రిక	200-00
82.	సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్	150-00
83.	చతుర్వేదములు	120-00
84.	నవగ్రహారాధన	120-00
85.	తాళపత్ర సమాహార గోపురం	120-00
86.	మనుధర్మ శాస్త్రం (వచనంలో...) (కేస్‌బైండు)	250-00

87.	మానవధర్మములు		120-00
88.	వేదమంత్ర సంహిత		120-00
89.	సహస్రలింగార్చన		120-00
90.	శ్రీ శివగీత		120-00
91.	ద్వాదశఉపనిషత్తులు		120-00
92.	పురాణపండవారి సౌందర్యలహరి	(కేస్‌బైండ్)	250-00
	(శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో)	సాదా	120-00
93.	బృహత్ శివ స్తోత్ర రత్నాకరము		200-00
94.	బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము		200-00
95.	బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము		200-00
96.	కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు		63-00
97.	దక్షిణావృత శంఖములు		63-00
98.	108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని		36-00
99.	ధర్మసింధువు(కేస్‌బైండింగ్)		270-00
100.	భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని		99-00
101.	చిలుకూరి బాలాజీచరిత్ర		36-00
102.	భగవత్‌స్తుతి		63-00
103.	సూర్యోపాసన		36-00
104.	కాశీఖండం		250-00
105.	దేవీభాగవతం		360-00
106.	శ్రీ ఆంజనేయం		216-00
107.	ధర్మసందేహాలు		216-00
108.	ఆధ్యాత్మిక దైవిక వస్తువులు		250-00
109.	రామాయణం		600-00
110.	పోతన భాగవతం		900-00
111.	శివమంత్రములు		63-00

8. వైద్య గ్రంథాలు

1.	ఆహారం ఆరోగ్యం	36-00
2.	మూలికావైద్య చిట్కాలు	36-00
3.	ఆయుర్వేద వైద్య చిట్కాలు	30-00
4.	గృహవైద్య రహస్యాలు	36-00
5.	గృహవైద్యసారం	36-00
6.	హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స)	63-00
7.	ప్రకృతివైద్యం	36-00
8.	ఆహారం-వైద్యం	99-00

9.	సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం	99-00
10.	ఆయుర్వేదమ్	36-00
11.	ఆయుర్వేద మూలికావైద్యదీపిక	99-00
12.	దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు (వాడకం - ఉపయోగాలు)	99-00
13.	ఏకమూలికావైద్యం	99-00
14.	అష్టాంగ హృదయం (4భాగాలు)	1200-00
15.	రహస్యసిద్ధయోగవైద్యసారమ్	99-00
16.	ప్రాథమిక హోమియోవైద్యం	99-00
17.	ఒబెసిటి	99-00
18.	హెల్త్‌గైడ్	99-00
19.	ఆయుర్వేదం-జీవనవేదం	99-00
20.	ఫుడ్‌థెరపి	63-00
21.	న్యాచురల్‌థెరపి	99-00
22.	సంపూర్ణఆరోగ్యానికి 20ని॥	63-00
23.	కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే...	99-00
24.	యోగామంత్ర	63-00
25.	యోగా మండే టు సండే	63-00
26.	హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే	99-00
27.	హెల్త్‌ఫైల్	108-00
28.	వస్తుగుణపాఠం	250-00
29.	రసాయన వాజీకరణ తంత్రం	150-00
30.	వస్తుగుణ మకరందం	400-00
31.	నాటువైద్యం -(కేస్‌బైండ్)	360-00
32.	నాటువైద్యం (చిన్నది)	99-00
33.	ప్రాణాయామము-యోగ	63-00

9. అయ్యప్ప - భవానీ రకాలు

1.	శ్రీ అయ్యప్ప లీలామృతం	30-00
2.	శ్రీ అయ్యప్ప భజనపాటలు	63-00
3.	శ్రీ అయ్యప్ప పూజాకల్పం	20-00
4.	శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు	20-00
5.	హారతిగైకొనుమా	40-00
6.	శ్రీ అయ్యప్ప దీక్ష F	10-00
7.	శ్రీ అయ్యప్ప భజనమాల F	10-00
8.	శ్రీ అయ్యప్ప నిత్యపూజ P	10-00

9.	శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P	10-00
10.	భవానీదీక్ష (శ్రీ భవానీ లీలామృతం)	36-00
11.	దేవీలీలామృతం	99-00
12.	శ్రీ దేవీ పూజాకల్పం	20-00
13.	దేవీ భక్తిగీతాలు	20-00
14.	భవానీదీక్ష P	10-00
15.	దేవీ భక్తిమాల F	10-00
16.	శ్రీ అయ్యప్ప భజనావళి	120-00
17.	అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో)	24-00

10. భజనలు - కీర్తనలు

1.	అన్నమయ్య కీర్తనలు	20-00
2.	శ్రీరామదాసు కీర్తనలు	20-00
3.	సర్వదేవతా మంగళహారతులు	20-00
4.	వసుంధర మంగళ హారతులు	25-00
5.	సౌభాగ్య దేవతా మంగళహారతులు	36-00
6.	సర్వదేవతా భజనలు	36-00
7.	చిట్టి పొట్టి పాటలు	10-00
8.	జాతీయ గీతాలు	10-00
9.	దేశభక్తి గీతాలు	36-00
10.	పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు	36-00
11.	గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు	36-00
12.	అన్నమయ్య సంకీర్తనలు	99-00
13.	పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు	36-00
14.	భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్)	36-00
15.	సర్వదేవతాభక్తిమణిమాల	36-00
16.	బతుకమ్మ ఉయ్యాల పాటలు	36-00
17.	అన్నమయ్య సంకీర్తనానిధి(1000కీర్తనలు)	270-00

11. హిట్స్ సాంగ్స్

1.	ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత	36-00
2.	ఎస్.పి.బాలు భక్తిగీతాలు	36-00
3.	ఘంటసాల సుమధురగీతాలు	99-00
4.	పి. సుశీల సుమధురగీతాలు	99-00

5.	ఎస్.పి. బాలు సుమధురగీతాలు	99-00
6.	ఎస్.జానకి సుమధురగీతాలు	99-00
7.	వేటూరి సుందరరామమూర్తిహిట్స్	99-00
8.	సర్వదేవతా సినీభక్తిగీతాలు	99-00

12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

1.	శ్రీకాంతామణి వంటలు (వెజ్)	63-00
2.	శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్)	63-00
3.	శాకాహార వంటలు	30-00
4.	మాంసాహారవంటలు	30-00
5.	చిట్టిచిట్కాలు	30-00
6.	అందానికి చిట్కాలు	30-00
7.	పిల్లల పేర్లు (పెద్దది)	30-00
8.	పిల్లల పేర్లు (చిన్నది)	10-00
9.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శారీబోర్డర్స్	36-00
10.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్	36-00
11.	చిన్నారులకు చిరుతిళ్ళు	30-00
12.	పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు	30-00
13.	పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు	30-00
14.	వేపుళ్ళు-ఇగుర్లు	30-00
15.	బ్రేక్‌ఫాస్ట్ వంటలు	30-00
16.	పండుగలలో చేసుకొనే పిండివంటలు	30-00
17.	మైక్రోవేవెన్ వంటలు	99-00
18.	సర్వదేవతాభక్తిమాల	36-00
19.	పిల్లలపేర్లు (బాబు)	36-00
20.	పిల్లలపేర్లు (పాప)	36-00
21.	మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్)	36-00
22.	మోడ్రన్ పిల్లలపేర్లు	99-00
23.	నోరూరించే నాన్‌వెజ్‌వంటలు	99-00
24.	మోడ్రన్ టైలరింగ్ (లేడీస్ & జంట్స్)	99-00

వివిధ రకాలు

ఎందరోమహానుభావులు	270-00
యోగాసనాలు	36-00
సూర్యనమస్కారములు	36-00
పొడుపు కథలు (చిన్నవి)	10-00

హిందీ-తెలుగు-స్వబోధిని	20-00
ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని	20-00
జనరల్ నాలెడ్జ్	20-00
నూరు ఎక్కాలు	10-00
1-100 టేబుల్ బుక్	10-00
1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు)	4-50
శ్రీరామకోటి	27-00
శ్రీశివకోటి	27-00
మేజిక్	30-00
అంకెలతో గారడీ	30-00
హృదయస్పందన (కవితలు)	30-00
వాత్స్యయన కామసూత్రాలు	36-00
ఎ.పి.టూరిస్ట్ గైడు	36-00
ఇంద్రజాల రహస్యాలు	30-00
మహేంద్రజాల రహస్యాలు	30-00
శరీరభాష (బాడీ లాంగ్వేజ్)	99-00
క్రియాయోగం	36-00
ఆనందంగా జీవిద్దాం	99-00
హరిశ్చంద్ర నాటకం	50-00
వాత్సాయనకామసూత్రాలు	99-00
పంచసాయకం	99-00
రతిరహస్యాలు	99-00
అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
గాయత్రీవిజ్ఞాన్	99-00
చింతామణి (నాటకం)	50-00
బాలనాగమ్మ	50-00
కాళహస్తి స్త్రీల వ్రతకథలు	36-00
కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి)	50-00
కాళహస్తి గోవింద నామాల భగవద్గీత	36-00
కాళహస్తి గృహవాస్తు చింతామణి	99-00
కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు)	63-00
రామరాయవాస్తుశాస్త్రం(ముద్రగడరామారావు)	90-00
ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా	10-00
ఎం.ఎస్.ఆర్.సుందరకాండ	80-00
బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల)	125-00
శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం	40-00

కాశీరామేశ్వర మజిలీ కథలు		63-00
శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం)		600-00
ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము-ఫలితజాతక సూత్రములు		595-00
ముదుండి విశ్వనాథరాజుగారి గ్రంథములు		
విశ్వకర్మ ప్రకాశము		80-00
ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన	,,	250-00
నారద సంహిత	,,	150-00
వాస్తురాజవల్లభము-మూలానువాదము	,,	60-00
మయమతము - వచనము	,,	80-00
బృహత్సంహిత - వచనము	,,	160-00
వాస్తువిజ్ఞానజ్యోతి		......
పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య)		....
విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు	,,	....
వాస్తు విజ్ఞాన చంద్రిక	,,	....
మహాదశా పారిజాతం	,,	....
వాస్తు నారాయణీయం	,,	120-00
యోగావళీఖండం	,,	120-00
ముహూర్తసింధువు		150-00
సర్వార్థచంద్రిక (4భాగాలు)		1208-00
మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్)		370-00
నిర్ణయసింధు (2భాగాలు)		590-00
సాయి...	,,	45-00
శ్రీ దుర్గానందలహరి	,,	200-00
ఆరతిసాయిబాబా	,,	11-00
ప్రతిష్ఠకల్పః(సాగి నరసింహమూర్తి)		500-00
తాజుద్దీన్‌బాబా సచ్చరిత్ర		100-00

సుమారు 100 సం॥రాలునాటి ప్రాచీన ప్రతులు తిరిగి ఈ క్రింది గ్రంథములు ప్రచురించబడినవి.

శ్రీరామ మంత్రానుష్ఠానము	300-00
శ్రీరామనవరాత్రోత్సవకల్పః	300-00
సీతారామ కథా సుధ అయోధ్యకాండ	200-00
సీతారామ కథా సుధ బాలకాండ	150-00
అరణ్యకాండ	100-00
శ్రాద్ధము ఎందుకు పెట్టాలి ? షోడశ సంస్కారములు	200-00
స్మార్త కాపర్ది కారికలు	200-00
నపుంసక సంజీవనము, వైద్య శిరోమణి	200-00
విషవైద్య చింతామణి	200-00

హేమాద్రి సూరిణా ప్రాయశ్చిత్తాధ్యాయః	300-00
సర్వమూలికా గుణరత్నాకరం	300-00
ఆపస్థంబీయ ధర్మసూత్రాలు	300-00
సర్వశాంతి దర్పణం - అపర ప్రయోగ దర్పణం	200-00
గణకరంజని	200-00
సంతాన దీపిక	200-00
తిథినిర్ణయ కాణ్డః	250-00
ముహూర్త దర్పణం	200-00
జ్యోతిష శాస్త్ర రత్నము (శ్రీపతిజాతక పద్ధతి)	250-00
లఘుతాచకము	200-00
శ్రీ వైఖనస పైతృమేదిక ప్రయోగః	300-00
స్మృతి రత్నాకరము (ధర్మశాస్త్రం)	400-00
జాతకామృతతసారం	300-00
జాతక బోధిని	300-00
సంగీత విద్యాదర్పణం	300-00
సంగీత సర్వార్థసారసంగ్రహం	300-00
ముహూర్త మార్తాండం(టీకతాత్పర్యం)	450-00
జాతకరహస్యం	200-00
రాజమార్తాండం	200-00
ఆయుర్ద్దాయదీపిక	200-00
వైద్యామృతం	200-00
అనుపానమంజరీ	200-00
నవగ్రహశాంతి విధానం-ఉదకశాంతి విధిః	200-00
చికిత్సరత్నము	200-00
స్వరచింతామణి	200-00
ద్వాదశలోహ భస్మవిధానం	200-00
దైవజ్ఞయశో విభూషణం	200-00
అనుపాన రత్నకరము	200-00
కాలామృతము	250-00
దైవజ్ఞకర్ణామృతము	300-00
రసేంద్ర చింతామణి	300-00
రసరత్న సముచ్చయం	300-00
వస్తుగుణరత్నాకరము	300-00
హోరానుభవదర్పణము	360-00
విశ్వకర్మ ప్రకాశిక వాస్తుశాస్త్రము	250-00
స్త్రీజన కల్పవల్లి	450-00
సంగీత సర్వార్థ సంగ్రహం	300-00
సంగీత సుధాసంగ్రహము	250-00
అర్క ప్రకాశము	200-00
సంగీత మార్తాండము	200-00
సంగీత ప్రథమబోధిని	200-00

వైద్యకల్పతరువు	200-00
రసప్రదీపిక	250-00
గణకానందము	250-00
శ్రీ లలితాసహస్రనామావళిః-వివరణాత్మక భావంతో	200-00
నవచండీ వేదోక్త శ్రీ దేవీ పూజాకల్పం	200-00
శ్రీ గాయత్రీ అనుష్ఠాన తత్త్వప్రకాశిక	360-00
సంగీతమార్తాండము	250-00
సారావళి	360-00
భేషజకల్పము	200-00
గురుశిష్య ఆయుర్వేద వైద్యచింతామణి	360-00
జాతకమణి	200-00
సర్వశకున ప్రకాశిక	200-00
యాజుష ప్రయోగ చంద్రిక	250-00
శిక్షావల్లీ-ఆనందవల్లీ-భృగువల్లీ	300-00
వసంతరాజ శకునము	250-00
తొట్టి వైద్యం	450-00
జ్యోతిష సిద్ధాంత సంగ్రహము (పంచాంగ గణితం)	300-00
సహస్ర యోగప్రకాశిక	300-00
శ్రీవిద్యారహస్యం	290-00
మహర్షుల చరిత్ర 1,3 300+300	
వేంకట సోమయాజీయం అను ధర్మశాస్త్రకాండము	250-00
శ్రీఆంజనేయం	216-00
రాశితుల్యవత్సర ఫలితం	200-00
నాడి జ్యోతిష విశ్లేషణ	400-00
రహస్యకుక్కుటశస్త్రం	300-00
స్త్రీ ధర్మరత్న బాండాగారము	200-00
శైవోత్సవరత్నాకరం	300-00
యాజుషప్రయోగ చిన్తామణి	300-00
సుస్వర ఋగ్వేద ప్రయోగదర్శిని	300-00
ఆయుర్వేద వైద్య సంగ్రహం	300-00
వశిష్ఠ సంహిత	360-00
హోమియోపతి గృహవైద్యం	200-00
వ్రతచూడామణి	300-00
వైశ్యధర్మప్రకాశిక	300-00
ఆలయ నిత్యార్చన పద్ధతి	200-00
స్మృతిముక్తాఫలం	300-00
ఆపస్థంబయల్లాజీయమ్	300-00
జ్యోతిషశాస్త్రసంగ్రహము	200-00
కర్మవిపాకాఖ్యయం	360-00
ముహుర్త రత్నావళి	250-00
సుదివిలోచనం	300-00
ఉత్తర కాలామృతం	200-00
సర్వవిషయ సర్వస్వసంగ్రహం	200-00